1/13/18, 09:11 - Messages to this chat and calls are now secured with end-to-end encryption. Tap for more info.
1/13/18, 09:11 - Menam. Maniteja: Paramacharya sharanam
1/13/18, 12:51 - Paramacharyulu: పరమాచార్య పరిపూర్ణ కటాక్షం

చాలా ఏళ్ళక్రితం ఒకరోజు మాకు పరమాత్మ కంచి పరమాచార్య స్వామివారి పరిపూర్ణ కటాక్షం లభించింది. ఒకసారి నేను నా భార్యా కూతురుతో కలిసి కాంచీపురం వెళ్ళాము. పరమాచార్య స్వామి, పుదు పెరియవ, బాల పెరియవ ముగ్గురిని దర్శించాము. రాత్రి చంద్రమౌళీశ్వర పూజ చూశాము. మరుసటి రోజు ఉదయం మహాస్వామివారి విశ్వరూప దర్శనం, మరియు గోపూజ తిలకించాము.

అమ్మవారి దేవస్థానంలో అప్పుడే కొత్తగా విడుదల చేసిన ముగ్గురు ఆచార్యులూ కలిగి ఉన్న చిత్రపటాలను రెండింటిని తీసుకున్నాము. వాటిని పరమాచార్య స్వామివారికి ఇచ్చి వారి అనుగ్రహం పొందాలని శంకర మఠానికి వెళ్ళాము. స్వామివారిని దర్శించుకుని ఆ చిత్రపటాలను ఇచ్చి ఆశీస్సులు కోరాము. వాటిని తీసుకుని స్వామివారు, “వీటిని ఎక్కడ కొన్నారు?” అని అడిగారు. బహుశా వీటిని స్వామివారు మొదటిసారి చూస్తున్నారు కాబోలు.

ఒక పరిచారికుణ్ణి పిలిచి, వాటికి ఫ్రేము కట్టి మఠంలో రెండు చోట్ల వాటిని పెట్టమని ఆదేశించారు. మేము ఇచ్చిన చిత్రపటాలు శ్రీమఠం గోడలపై ఉంటాయని మాకు ఎల్లలు లేని ఆనందం కలిగింది. ఏమి పరమాచార్య స్వామి కరుణ! మఠంలో వేయడానికి బంగారు ఫ్రేముకట్టి ఇచ్చే భక్తులు ఎంతమంది లేరు, అటువంటప్పుడు ఆ భాగ్యాన్ని మాకు ఇవ్వడం మా పూర్వజన్మల అదృష్టం. శ్రీకృష్ణ పరమాత్మ సుధాముని (కుచేలుడు)తో అడిగి మరీ అటుకులు తీసుకున్న సంఘటన గుర్తుకువచ్చింది.

రెండు పటాలకు ఫ్రేము కట్టించి, మాకోసం అని మరొక ఫోటో కొనుక్కొని మధ్యాహ్నం ఒంటిగంటప్పుడు శ్రీమఠానికి వెళ్ళాము. మూడున్నరకు మహాస్వామి వారు వచ్చి కూర్చున్నారు. స్వామికి ఇవ్వమని మూడు చిత్రపటాలను అక్కడున్న శిష్యునికిచ్చాము. ఫ్రేము కట్టిన పటాలను మఠం గోడలకు వేలాడదీయమని స్వామివారు ఆదేశించారు. ఇంకొక చిత్రపటాన్ని స్వామివద్దనే ఉంచుకున్నారు. ఈ చర్యకు కారణం మాకు తరువాత తెలిసింది. ఇది కేవలం శంకరాచార్యులు నలుగురు శిష్యులతో కలిసి చేసే వేదాంత విచారణను మాకు చూపించాలనే స్వామివారు అలా చేశారు.

కొద్దిసేపట్లోనే మాకు ఆ పరమాద్భుతమైన దృశ్యం కనిపించింది.

పరమాచార్య స్వామివారు వచ్చి ఆదిశంకరులు లాగా కూర్చున్నారు. వారిముందు బాల పెరియవ కూర్చున్నారు. ఇద్దరు వేద పండితులు చిన్నస్వామి పక్కనే కూర్చున్నారు. వేదాంత విచారం మొదలుపెట్టారు. ఆదిశంకరులు తమ శిష్యులకు ఉపదేశించే దృశ్యమే మాకు అగుపించింది. తైత్తరీయోపనిషత్తులోంచి బ్రహ్మాత్మానంద అనుభవం గురించిన ఒక శ్లోకాన్ని చిన్న స్వామివారు చెప్పారు. వాటికి పరమాచార్య స్వామివారు వ్యాఖ్యానం చేశారు.

దక్షిణామూర్తి గురించి “గురోస్తు మౌనం వ్యాఖ్యానం” అని చెబుతాము కదా? కాని మాకు ఇక్కడ “గురోస్తు లలిత వ్యాఖ్యానం” లాగా తోచింది. అప్పుడు జరిగిన వేదాంత విచారంలో ఇప్పటికి నాకు ఒక శ్లోకం గుర్తు ఉంది. “తద్ బ్రహ్మణః పరిమర ఇత్యుపాసీత” దీనికి చిన్నస్వామి వారి వ్యాఖ్యానం: “పరిమరీయతే ఇతి పరిమరః - వాయురిత్యర్థః” పరిమరం అంటే వాయువు అని చిన్నస్వామి వారు చెప్పారు.

చిన్నస్వామి పక్కన కూర్చున్న ఇద్దరు పడితులు కూడా ఈ వేదాంత వాదనలో పాల్గొన్నారు. మేము ముగ్గురము ఈ బ్రహ్మానంద అనుభవాన్ని దాదాపు గంట పాటు అనుభవించాము. తరువాత మహాస్వామివారు చిన్నస్వామికి, ఆ ఇద్దరు పండితులకు పెరుగు నింపిన కొబ్బరి చెక్కలను ప్రసాదంగా ఇచ్చారు.

కేవలం మాకు ఈ అనుభవం ఇవ్వడానికే పరమాచార్య స్వామివారు చిత్రపటముల ఫ్రేము వంకతో మమ్మల్ని ఇంతసేపు మఠంలో ఉంచుకున్నారని తెలుసుకుని మాకు అద్వితీయమైన ఆనందం కలిగింది. తరువాత ఆ మూడవ చిత్రపటాన్ని మంత్రాక్షతలతో పాటు స్వామి వారు మాకు అనుగ్రహించారు. ఈ సంఘటన వల్ల నాకు తెలిసినది ఏమంటే
> మమ్మల్ని కరుణించడానికే స్వామివారు మావద్ద అడిగిమరీ చిత్రపటాలను తీసుకున్నారు (బంగారు ఫ్రేము కట్టి ఇవ్వగలిగిన భక్తులు వున్నప్పటికి).
> పవిత్రమైన శంకర మఠంలో మేము ఇచ్చిన చిత్రపటాలను వేలాడతీయవలసిందిగా ఆజ్ఞాపించడం మాకు కలిగిన అదృష్టం.
> ఎక్కడా దొరకని బ్రహ్మానంద అనుభూతిని వేదాంత విచారం ద్వారా ప్రత్యక్షంగా మాకు ప్రసాదించడం.

అపార కరుణాసింధుం జ్ఞానదం శాంతరూపిణం
శ్రీ చంద్రశేఖర గురుం ప్రణమామి ముదావహం ॥

--- డా. యస్. రామకృష్ణన్, చెన్నై - 92. మహాపెరియవళ్ – దరిశన అనుభవంగళ్ 6

#KanchiParamacharyaVaibhavam #కంచిపరమాచార్యవైభవం
1/13/18, 17:15 - Paramacharyulu: <Media omitted>
1/13/18, 17:22 - Paramacharyulu: □□□□□□□□
ప్రతి పోస్ట్ కి మీరు రిప్లై ఇవ్వడం వల్ల కొత్త వారిని చేర్చుకోవడానికి ఇబ్బందిగా ఉంది. వందల మంది అడుగుతున్నారు యాడ్ చెయ్యమని.

కొంచం అర్థం చేసుకోవడానికి ప్రయత్నించండి. మాకు మా జీవితాలు ఉన్నాయి.
▯▯▯▯▯▯▯▯▯
1/14/18, 08:01 - Paramacharyulu: యా వూరు నుండి వొచ్చినారు (పార్ట్ 1)

ఒకరోజు ఉదయం 2000 జూన్ లో మా పెద్దక్క విజయలక్ష్మి నాకు ఫోన్ చేసి, “బాలు, భగవంతుని అనుగ్రహం వల్ల నీ అల్లుడు రాజాకు కంచి మఠం వారు నిర్వహిస్తున్న కంచి ఇంజనీయరింగ్ కాలేజిలో సీటు దొరికింది. ఇక నాలుగు రోజులలో వాణ్ణి అక్కడ చేర్చాలి. మీ బావగారు ఊళ్ళో లేరు, వారం దాకా రారు కాబట్టి నేను రాజాకు తోడుగా వెళ్ళి వస్తాను. నువ్వు మాతో పాటు రాగలవా?”

నేను చెప్పబోయేంతలో తనే, ”నువ్వు రావడం కుదురుతుందా అని అడగడానికి నీకు ఫోన్ చెయ్యలేదు. అప్పుడే నేను నీకు కూడా హైదరాబాద్ నుండి చెన్నైకు టికెట్స్ తీసాను అని చెప్పడానికి చేశాను. మూడురోజుల తరువాత మనం బయలుదేరుతున్నాం. అటుతరువాత మూడు రోజులకి తిరిగొస్తాం”

నేను తనకి ఏదో చెప్పడానికి ప్రయత్నిస్తున్నా తను వినకపోగా, “మనం మొదట చెన్నై వెళ్తాం. అక్కడినుండి కంచికి; డబ్బులు కట్టి అడ్మిషన్ చేసి; వాణ్ణి హాస్టల్ లో వదిలి కంచి మఠానికి వెళ్ళి చెన్నై వద్దాం; మళ్ళా అక్కడినుండి హైదరాబాదుకు వచ్చేద్దాం” అని చెప్పింది.

మా అక్క నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ, ప్రార్థించాను; బ్రతిమాలాను; పేచీపెట్టాను; నసిగాను; కసిరాను; అరిచాను; తను ఫోన్ పెట్టేసింది.

చాలా ప్రయత్నించాను వెళ్ళకూడదని కాని తను నాకంటే వయసులో పెద్దది కావడం వల్ల తన నిర్ణయాన్ని నా పైన రుద్ది నా బుద్ధి, నా అలవాట్లు తెలుసు కాబట్టి నేను వెళ్ళకపోవడానికి ఏ కారణమైనా చెబుతాను అని తెలిసి ముందే అన్ని ఏర్పాట్లు చేసి తరువాత నాకు విషయం తెలిపింది. సాడిస్ట్. . .

ఇక చేసేదేమి లేక, తనతో వెళ్ళకపోతే, వెళ్ళనందుకు మా అమ్మతో చీవాట్లు తప్పవని తెలిసి అయిష్టంగానే అక్కతో మేనల్లుడితో కలిసి కంచి వెళ్ళడానికి ఒప్పుకున్నాను. ఉదయాన్నే నేను, మా అక్క, నా మేనల్లుడు చెన్నై చేరుకున్నాము. అక్కడే ఇడ్లీ, వడ, పొంగల్ తో ఉదయం ఫలహారం కావించి చెన్నైకి డెబ్బై కిలోమీటర్ల దూరంలో ఉన్న కంచికి ప్రయాణమయ్యాము.

మేము కంచి చేరుకోగానే శంకర విజయేంద్ర సరస్వతి స్వామివారిని కలిసి మా అల్లుడి అడ్మిషన్ గురించి తెలిపి కాలలేజు దగ్గరకు వెళ్ళమని చెప్పారు. మేము వారుచెప్పినట్టుగానే స్వామివారిని కలవడానికి వెళ్ళాము. నేను కంచి కామకోటి మఠంలోకి వెళ్ళడం అదే తొలిసారి. మఠంలో పదిహేను నిముషాలు కాచుకున్న తరువాత మాకు స్వామివారిని కలిసే అదృష్టం కలిగింది. నా మేనల్లుణ్ణి కొన్ని సాధారణ ప్రశ్నలు అడిగారు. తరువాత మేము స్వామివారికి నమస్కరించి ఆశీస్సులు అందుకున్నాము.

స్వామివారి గదిలోనుండి బయటకు వస్తూ పరమ ప్రశాంతంగా, ప్రసన్నంగా, మంత్రముగ్ధులను చేసే చిరునవ్వుతో ఉన్న స్వామివారి ముఖాన్ని చూశాను. నిజంగా చెప్పాలంటే ఇది తప్ప నేను మొదటిసారి స్వామివారిని కలిసినప్పుడు గుర్తుపెట్టుకోవల్సిన విషయం ఏమీ లేదు. తరువాత మేము కంచి ఇంజనీయరింగు కాలేజికి వెళ్ళి డబ్బులు కట్టి, విజయవంతంగా మా అల్లుణ్ణి కాలేజి హాస్టల్లో చేర్చి, అక్కడే అందరమూ భోజనం చేసి వెళ్ళబోతుండగా నన్ను చికాకుపరిచేందుకు మా అక్క,

“బాలు, మనం కంచికి తరచుగా రాము కదా. ఇప్పుడు వచ్చాము కాబట్టి కామాక్షి అమ్మవారి దేవస్థానికి కూడా వెళ్ళి; కొన్ని పట్టుచీరలు కొనుక్కొని కంచి మఠానికి వెళ్దాము.

ఉదయం మనకు కేవలం చిన్నస్వామి శంకర విజయేంద్ర సరస్వతి స్వామివారి దర్శనం మాత్రమే కలిగింది. పెద్దస్వామి జయేంద్ర సరస్వతి స్వామిని దర్శించుకోలేదు కదా. . . ఈ రోజు సాయింత్రానికి స్వామివారు వస్తారని నాకు ఒక పూజారి చెప్పారు.

కాబట్టి ముందు కామాక్షి అమ్మవారి గుడికెళ్ళి, అమ్మవారిని దర్శించుకుని; షాపింగ్ ముగించుకుని పెద్దస్వామి వారి దర్శనానికి మళ్ళా కంచి మఠానికి వెళ్దాము. దయచేసి నువ్వు రానని అనకు. . .”

(సశేషం)

అపార కరుణాసింధుం జ్ఞానదం శాంతరూపిణం
శ్రీ చంద్రశేఖర గురుం ప్రణమామి ముదావహం ॥

#KanchiParamacharyaVaibhavam #కంచిపరమాచార్యవైభవం
1/14/18, 16:09 - Paramacharyulu: ఇదంతా స్వామి కటాక్షం

జగతీ మవితుం కవితాకృతయో విచరన్తి మహా మహసశ్చలతః 'గురుదేవులు' జగద్రక్షణకై ఒక ఆకారం ధరించి ఏదో ఒక నెపంతో ప్రపంచం అంతటా తిరుగుతుంటారట.

అదేవిధంగా శ్రీ కామకోటి పెద్దలు శ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతి శ్రీచరణులు దేశసంచారం చేస్తూ లక్షలాది భక్తులను అనుగ్రహించారు.

1952లో ఒకనాడు స్వప్నంలో స్వామివారు నాకు దర్శనమిచ్చారు. స్వయంగా మా ఇంటికి దయచేశారు. గురుపాదుకలను అందజేసి నన్ను బ్రహ్మానందభరితుణ్ణి చేశారు. నాడు మొదలు నేటి వరకు నన్ను కంటికి రెప్పవలె కాపాడుతున్నారు.

పూర్వాచారాన్ని అనుసరించి నా కుమార్తెకు కన్యావివాహం చెయ్యాలని నేను కృతనిశ్చయంతో ఉన్నాను. కాని, అట్టి సంకల్పం కలవారు ఈ కాలంలో అరుదుగా ఉండడం చేత వెంతనే కార్యసిద్ధిగాక, ఆలస్యం జరుగుతూ వచ్చింది. అప్పుడు నేను శ్రీవారి అనుగ్రహం వల్ల ఈ కార్యం నెరవేరాలని తలచి వారిని గట్టిగా స్మరించాను.

స్వామివారు మా వియ్యలవారికి స్వప్నంలో కనిపించారు. నా కుమార్తెను వారికి చూపించి, ఈ సంబంధం చేసుకోవలసిందిగా సూచించారు.

అంతేగాక, తమ సమక్షంలో కన్యాదానం జరిగినట్టుగా కూడా స్వప్నంలోనే ఉభయులనూ అనుగ్రహించారు.

ఇది కరిగి వారం రోజులు గడవకుండానే మా వియ్యలవారూ మేమూ వివాహం శుభప్రదంగా జరుపుకున్నాము.

ఇది స్వామివారి అవ్యాజ కరుణ తప్ప వేరొక్కటి కాదు. అదే విధంగా నా రెండవ కుమార్తె వివాహ సందర్భంలో కూడా, తమ పిల్లవానికి మా పిల్లను చేసుకుంటామని వాగ్దానాలు చేసినవారు కాలవిలంబం చేయసాగారు. నేను శ్రీవారి అనుగ్రహం పైనే ఆధారపడ్డాను.

మా వియ్యంకుని వేరొక వ్యాజంపైన మా ఇంటికి వచ్చేట్లు చేసి, వారం రోజుల లోపల మా రెందవ అమ్మాయి పెళ్ళి జరిగేటట్లు స్వామివారు అనుగ్రహించారు.

ఇదంతా స్వామి కటాక్షమే.

--- శ్రీ జంధ్యాల సుబ్రహ్మణ్య శాస్త్రి, నడిచే దేవుడు పుస్తకం నుండి

#KanchiParamacharyaVaibhavam #కంచిపరమాచార్యవైభవం
1/15/18, 08:06 - Paramacharyulu: యా వూరు నుండి వొచ్చినారు (పార్ట్ 2)

కాదు/లేదు/రాను అని చెప్పినా ప్రయోజనం లేదని తెలిసి, తను చెప్పినదానికి ఒప్పుకున్నట్టుగా త gvలాడించి కారులో కామాక్షి అమ్మవారి దేవాలయానికి వెళ్ళాము. నన్ను నమ్మండి. అమ్మవారి దేవాలయంలో ఆ ముగ్గురమ్మల మూలపుటమ్మ, ప్రపంచంలోని తల్లులందరికి తల్లి, ఆబ్రహ్మకీటజనని అయిన కంచి కామాక్షి అమ్మవారి దర్శనం అద్భుతంగా జరిగింది.

అమ్మవారిని దర్శించుకున్న తరువాత నా మనస్సంతా ఎప్పుడూలేని ప్రశాంతతతో నిండిపోయింది. ఉరుకులూ పరుగులూ పెట్టే నా మనస్సు శాంతంగా తోచింది. “బహుశా దశాబ్ధాల కాలంనాటి దేవాలయంలోని దైవశక్తివల్ల” అని అనుకుని సర్దుకున్నాను.

కంచి ఇరుకు వీధుల్లో మా అక్కయ్య చీరల కొనుగోలు ముగించుకుని కంచి మఠం వైపుకి నడిచాము. ఈ అల్పప్రాణికి అప్పుడు తెలియలేదు, మరికొద్ది క్షణాల్లో కామాక్షి అమ్మవారి దేవాలయంలో జరిగిన అద్భుతంకంటే ఆశ్చర్యకరమైన అనుభూతి కంచి మఠంలో తనకు జరగబోతోందని. నాజీవితంలో ఆ మధుర క్షణాలు వస్తాయని తెలియక నిశ్శబ్దంగా కంచి మఠంలోకి వెళ్ళి ముకుళిత హస్తాలతో త్రిపురసుందరీ సమేత చంద్రమౌళీశ్వరుని ముందర నిలబడి ప్రణామాలు సల్పుతూ, తిరుమల తిరుపతి దేవస్థానాల ఆస్థాన విద్వాన్ గా సేవలందించిన నా మేనమామ నాకు చిన్నప్పుడు నేర్పించిన లింగాష్టకం చెప్పుకున్నాను.

నేనేమి పెద్ద భక్తుణ్ణి కాదు, భవిష్యత్తులో అవ్వను కూడా. కాని మహాత్ములైన తల్లితండ్రుల కడుపున పుట్టడం వల్ల, చిన్నతనంనుండి భక్తిని నా తలలోకి ఎక్కించడం వల్ల దేవుని ఉనికిని బలంగా నమ్మేవాణ్ణి. ఆ పుణ్యదంపతుల పెంపకంవల్ల ఎన్నో శ్లోకాలను స్తోత్రాలను నేర్చుకున్నాను. నా స్తోత్రంపఠనం పూర్తైన తరువాత వెనక్కు తిరిగి చూడగా మఠం ఏనుగు హాయిగా అక్కడ తిరుగుతుండడం గమనించాను. దాన్ని చూసి, కొన్ని అరటిపళ్ళు కొని దానికి ఇచ్చాను. నా భక్తికి సంతసించి ఆ కంచి మఠం ప్రతినిధి తన తొండాన్ని నా తలపై పెట్టి ఆశీర్వదించింది.

సరిగ్గా అప్పుడే నా చుట్టూ ఉన్నవారందరూ “జయ జయ శంకర.. హర హర శంకర.. జయ జయ శంకర.. హర హర శంకర..” అని పెద్దగా అనడం నాకు వినిపించింది. ఎవరో ముఖ్యమైన వ్యక్తికోసం మఠంలో అందరూ వేచిచూడటం నా కంటపడింది. కంచి మఠం ముందర ఉన్న స్థలంలో ఒక్క అంగుళం కూడా ఖాళీ లేకుండా భక్తులు నిలబడ్డారు. నాకు తెలిసి వారందరూ తమిళులే.

ఇక నా ఉత్సుకతను ఆపుకోలేక నా పక్కనే ఉన్న ఒక పెద్దాయనని “ఇక్కడ ఏం జరుగుతోంది? ఎవరికోసం మీరందరూ ఎదురు చూస్తున్నారు?” అని అడిగాను. అప్పుడు అతను కూడా వారందరితో పాటు చెప్తున్నాడు.

ఇంతటి చెత్త ప్రశ్న వేసినందుకు అతను తన జీవితంలో నన్ను మరచిపోడు, క్షమించడు. కొద్దిగా చికాకు పడుతూ నన్ను చూసి, అంతే చికాకు ధ్వనించే స్వరంతో “కొద్దిక్షణాల్లో పుదు పెరియవ వస్తున్నారు” అని చెప్పి నోరుమూసుకొమ్మన్నట్టు నాకు సంజ్ఞ చేశాడు.

నేను ఊరకుండిపోయాను కాని అదే కుతూహలంతో నా చుట్టూ ఉన్నవారినందరిని పరిశీలిస్తున్నాను. మఠంలో చాలామంది నాలాగే కొత్తగా వచ్చిన వారు, వారికి కూడా ఇదే సందేహం ఉంది. కాని వారు నాలాగా గలాటా చెయ్యకుండా ఆ సందేహాన్ని తమ మొహాల్లో చూపిస్తున్నారు.

ఐదు నిముషాల తరువాత ద్వారం వద్ద ఎవరో తమిళంలో "కొద్దిక్షణాల్లో పెరియవ వస్తున్నారు" అని చెప్పాడు. వెంటనే అందరూ మఠంలోకి వెళ్ళే మార్గానికి ఇరువైపులా వరసలు వరసలుగా నిలబడ్డారు. మా అక్కయ్య పట్టుబట్టడం వల్ల నేను కూడా వెళ్ళి ఇందాకటి పెద్దమనిషి పక్కనే మూడవ వరుసలో మఠం గోడకు ఆనుకుని నిలబడ్డాను.

"హర హర శంకర" నామజపం తారాస్థాయికి చేరుతోంది. నేను అందరినీ గమనిస్తూ నిలబడ్డాను. ఆసమయంలో కంచి మఠంలో వాతావరణం ఎంతో ఆహ్లాదంగా మారిపోయింది. చాలామంది చొక్కాలు విప్పి నిలబడి ఉన్నారు. రెండు నిముషాల తరువాత శ్రీ జయేంద్ర సరస్వతి స్వామి వారి కార్వార్(కాన్వాయ్) శ్రీమఠం ద్వారం ముందుకు వచ్చింది. అప్పుడు నేను ద్వారానికి ఎడంపక్కగా ప్రధాన దైవం చంద్రమౌళీశ్వర స్వామికి సామీప్యంగా నిలబడ్డాను. అంటే మఠంలోకి ప్రవేశించేవాళ్ళకి కొద్దిగా ముందుకు వచ్చిన తరువాత ఎడంపక్కన కనిపిస్తాను.

మఠం వాహనం దిగి స్వామివారు నిదానంగా మఠంలోపలికి వస్తున్నారు. ముందు వరసలో నిలుచున్నవారు నేలపైపడి స్వామివారి పాదాలకి మోకరిల్లుతున్నారు. మిగిలిన వారు నాలాగే ఊరికే నిలబడి మనస్సులో ప్రార్థిస్తున్నారు. సన్నని చిరునవ్వుతో భక్తులను ఆశీర్వదిస్తున్నట్టుగా కుడిచేతిని పైకెత్తి చిన్నగా ముందుకు వెళుతునారు. వెనక చాలామంది పండితులు వారిననుసరిస్తున్నారు. నేను ఏ భావనా, భక్తి లేకుండా ఆత్రుతగా వారిని గమనిస్తున్నాను.

మమూలుగా అందరినీ చూస్తూ, స్వామివారు లోపలికి వెళ్తున్నారు. నేను వారిని గమనిస్తున్నాను ఇంకొన్ని అడుగుల్లో వారు నా ముందు నుంచి వెళ్ళి మఠం పెద్ద ఆవరణంలోకి వెళ్ళిపోతారు. కాని ఆశ్చర్యకరంగా మాముందు వారు నిలబడ్డారు.

(సశేషం)

అపార కరుణాసింధుం జ్ఞానదం శాంతరూపిణం
శ్రీ చంద్రశేఖర గురుం ప్రణమామి ముదావహం ॥

#KanchiParamacharyaVaibhavam #కంచిపరమాచార్యవైభవం
1/15/18, 08:07 - Paramacharyulu: యా వూరు నుండి వొచ్చినారు (పార్ట్ 2)

కాదు/లేదు/రాను అని చెప్పినా ప్రయోజనం లేదని తెలిసి, తను చెప్పినదానికి ఒప్పుకున్నట్టుగా త gv లాడించి కారులో కామాక్షి అమ్మవారి దేవాలయానికి వెళ్ళాము. నన్ను నమ్మండి. అమ్మవారి దేవాలయంలో ఆ ముగ్గురమ్మల మూలపుటమ్మ, ప్రపంచంలోని తల్లులందరికి తల్లి, ఆబ్రహ్మకీటజనని అయిన కంచి కామాక్షి అమ్మవారి దర్శనం అద్భుతంగా జరిగింది.

అమ్మవారిని దర్శించుకున్న తరువాత నా మనస్సంతా ఎప్పుడూలేని ప్రశాంతతతో నిండిపోయింది. ఉరుకులూ పరుగులూ పెట్టే నా మనస్సు శాంతంగా తోచింది. "బహుశా దశాబ్ధాల కాలంనాటి దేవాలయంలోని దైవశక్తివల్ల" అని అనుకుని సర్దుకున్నాను.

కంచి ఇరుకు వీధుల్లో మా అక్కయ్య చీరల కొనుగోలు ముగించుకుని కంచి మఠం వైపుకి నడిచాము. ఈ అల్పప్రాణికి అప్పుడు తెలియలేదు, మరికొద్ది క్షణాల్లో కామాక్షి అమ్మవారి దేవాలయంలో జరిగిన అద్భుతంకంటే ఆశ్చర్యకరమైన అనుభూతి కంచి మఠంలో తనకు జరగబోతోందని. నాజీవితంలో ఆ మధుర క్షణాలు వస్తాయని తెలియక నిశ్శబ్దంగా కంచి మఠంలోకి వెళ్ళి ముకుళిత హస్తాలతో త్రిపురసుందరీ సమేత చంద్రమౌళీశ్వరుని ముందర నిలబడి ప్రణామాలు సల్పుతూ, తిరుమల తిరుపతి దేవస్థానాల ఆస్థాన విద్వాన్ గా సేవలందించిన నా మేనమామ నాకు చిన్నప్పుడు నేర్పించిన లింగాష్టకం చెప్పుకున్నాను.

నేనేమి పెద్ద భక్తుణ్ణి కాదు, భవిష్యత్తులో అవ్వను కూడా. కాని మహాత్ములైన తల్లితండ్రుల కడుపున పుట్టడం వల్ల, చిన్నతనంనుండి భక్తిని నా తలలోకి ఎక్కించడం వల్ల దేవుని ఉనికిని బలంగా నమ్మేవాణ్ణి. ఆ పుణ్యదంపతుల పెంపకంవల్ల ఎన్నో శ్లోకాలను స్తోత్రాలను నేర్చుకున్నాను. నా స్తోత్రంపఠనం పూర్తైన తరువాత వెనక్కు తిరిగి చూడగా మఠం ఏనుగు హాయిగా అక్కడ తిరుగుతుండడం గమనించాను. దాన్ని చూసి, కొన్ని అరటిపళ్ళు కొని దానికి ఇచ్చాను. నా భక్తికి సంతసించి ఆ కంచి మఠం ప్రతినిధి తన తొండాన్ని నా తలపై పెట్టి ఆశీర్వదించింది.

సరిగ్గా అప్పుడే నా చుట్టూ ఉన్నవారందరూ "జయ జయ శంకర.. హర హర శంకర.. జయ జయ శంకర.. హర హర శంకర.." అని పెద్దగా అనడం నాకు వినిపించింది. ఎవరో ముఖ్యమైన వ్యక్తికోసం మఠంలో అందరూ వేచిచూడటం నా కంటపడింది. కంచి మఠం ముందర ఉన్న స్థలంలో ఒక్క అంగుళం కూడా ఖాళీ లేకుండా భక్తులు నిలబడ్డారు. నాకు తెలిసి వారందరూ తమిళులే.

ఇక నా ఉత్సుకతను ఆపుకోలేక నా పక్కనే ఉన్న ఒక పెద్దాయనని "ఇక్కడ ఏం జరుగుతోంది? ఎవరికోసం మీరందరూ ఎదురు చూస్తున్నారు?" అని అడిగాను. అప్పుడు అతను కూడా వారందరితో పాటు చెప్తున్నాడు.

ఇంతటి చెత్త ప్రశ్న వేసినందుకు అతను తన జీవితంలో నన్ను మరచిపోడు, క్షమించడు. కొద్దిగా చికాకు పడుతూ నన్ను చూసి, అంతే చికాకు ధ్వనించే స్వరంతో "కొద్దిక్షణాల్లో పుదు పెరియవ వస్తున్నారు" అని చెప్పి నోరుమూసుకొమ్మన్నట్టు నాకు సంజ్ఞ చేశాడు.

నేను ఊరకుండిపోయాను కాని అదే కుతూహలంతో నా చుట్టూ ఉన్నవారినందరిని పరిశీలిస్తున్నాను. మఠంలో చాలామంది నాలాగే కొత్తగా వచ్చిన వారు, వారికి కూడా ఇదే సందేహం ఉంది. కాని వారు నాలాగా గలాటా చెయ్యకుండా ఆ సందేహాన్ని తమ మొహాల్లో చూపిస్తున్నారు.

ఐదు నిముషాల తరువాత ద్వారం వద్ద ఎవరో తమిళంలో “కొద్దిక్షణాల్లో పెరియవ వస్తున్నారు” అని చెప్పాడు. వెంటనే అందరూ మఠంలోకి వెళ్ళే మార్గానికి ఇరువైపులా వరసలు వరసలుగా నిలబడ్డారు. మా అక్కయ్య పట్టుబట్టడం వల్ల నేను కూడా వెళ్ళి ఇందాకటి పెద్దమనిషి పక్కనే మూడవ వరుసలో మఠం గోడకు ఆనుకుని నిలబడ్డాను.

“హర హర శంకర” నామజపం తారాస్థాయికి చేరుతోంది. నేను అందరినీ గమనిస్తూ నిలబడ్డాను. ఆసమయంలో కంచి మఠంలో వాతావరణం ఎంతో ఆహ్లాదంగా మారిపోయింది. చాలామంది చొక్కాలు విప్పి నిలబడి ఉన్నారు. రెండు నిముషాల తరువాత శ్రీ జయేంద్ర సరస్వతి స్వామి వారి కార్వార్(కాన్వాయ్) శ్రీమఠం ద్వారం ముందుకు వచ్చింది. అప్పుడు నేను ద్వారానికి ఎడంపక్కగా ప్రధాన దైవం చంద్రమౌళీశ్వర స్వామికి సామీప్యంగా నిలబడ్డాను. అంటే మఠంలోకి ప్రవేశించేవాళ్ళకి కొద్దిగా ముందుకు వచ్చిన తరువాత ఎడంపక్కన కనిపిస్తాను.

మఠం వాహనం దిగి స్వామివారు నిదానంగా మఠంలోపలికి వస్తున్నారు. ముందు వరసలో నిలుచున్నవారు నేలపైపడి స్వామివారి పాదాలకి మోకరిల్లుతున్నారు. మిగిలిన వారు నాలాగే ఊరికే నిలబడి మనస్సులో ప్రార్థిస్తున్నారు. సన్నని చిరునవ్వుతో భక్తులను ఆశీర్వదిస్తున్నట్టుగా కుడిచేతిని పైకెత్తి చిన్నగా ముందుకు వెళుతునారు. వెనక చాలామంది పండితులు వారిననుసరిస్తున్నారు. నేను ఏ భావనా, భక్తి లేకుండా ఆత్రుతగా వారిని గమనిస్తున్నాను.

మమూలుగా అందరినీ చూస్తూ, స్వామివారు లోపలికి వెళ్తున్నారు. నేను వారిని గమనిస్తున్నాను ఇంకొన్ని అడుగుల్లో వారు నా ముందు నుంచి వెళ్ళి మఠం పెద్ద ఆవరణంలోకి వెళ్ళిపోతారు. కాని ఆశ్చర్యకరంగా మాముందు వారు నిలబడ్డారు.

(సశేషం)

అపార కరుణాసింధుం జ్ఞానదం శాంతరూపిణం
శ్రీ చంద్రశేఖర గురుం ప్రణమామి ముదావహం ॥

#KanchiParamacharyaVaibhavam #కంచిపరమాచార్యవైభవం
1/15/18, 16:21 - Paramacharyulu: స్వామి గురించి

ఆదిశంకరభగవత్పాదులు నెలకొల్పిన మూలామ్నాయ సర్వజ్ఞపీఠం కంచి కామకోటి పీఠపరంపరలో 68వ ఆచార్య పురుషులుగా జగత్ప్రసిద్ధి గాంచిన శ్రీ శ్రీ శ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతి శ్రీచరణులు విద్యార్థి దశలోనే సన్యసించి, అచిరకాలంలో వేద శాస్త్ర పురాణాదులను పుక్కిటపట్టారు. దేశవిదేశాలకు చెందిన పదిహేడు భాషలనభ్యసించారు. ప్రాచీన విద్యలు, నవీన కళలు పెక్కింటిలో సర్వంకష ప్రతిభను సాధించారు.

దేశమంతటా వేద పాఠశాలలు నెలకొల్పి వేదాధ్యయనాన్ని ప్రోత్సహించారు. ఆలయ మంటపాల నెన్నిటినో నిర్మించారు. ధర్మ సంవర్ధనమె లక్ష్యంగా ఇరవై సంవత్సరాలు పాదచారియై యావద్భారతదేశం పర్యటించారు. హిందూమత సంరక్షణకు, వివిధ శాఖలకు చెందిన హిందూ మతావలంబుల సమైక్యతకు అద్వితీయ కృషి చేశారు. ఎల్లెడల ధర్మ సంస్థలనూ, సేవాసంఘాలను వెలయింపజేశారు.

వీటన్నిటితో పాటు, మఠం పరిపాలన చేపట్టింది మొదలు నేటి వరకు జాతి, మత, కుల వివక్షత లేకుండా అనవతరం ఎందరి కష్టసుఖాలను విచారిస్తున్నారో, ఎందరికి జ్ఞానభిక్ష పెడుతున్నారో వారి సంఖ్య అంచనా కట్టలేము.

స్వామి జీవిత చరిత్ర తెలిసిన వారికి, రెండువేల సంవత్సరాల కిందట దక్షిణ భారతంలో జన్మించి, అవైదిక మతాలను ఖండించి, అనేక దివ్యశక్తులను ప్రదర్శించిన ఆదిశంకరులే తిరిగి నేడు శ్రీ చంద్రశేఖర సరస్వతులుగా అవతరించారని భారతరత్న పండిత్ మదనమోహనమాలవ్యా వంటి ప్రముఖులనేకులు చేసిన ప్రశంసలు అతిశయోక్తులు కావని రూఢికాగలదు.

జగదాచార్యుడు శ్రీకృష్ణభగవానుడు భగవద్గీతలో చెప్పినట్టు “ఆర్తో, జిజ్ఞాసు, అర్థార్థీ, జ్ఞానీచ” అంటూ ఈ నాలుగు తరగతులకు చెందిన వారినందరిని వారి వారి స్థాయిని బట్టి వారిని ఉద్ధరించారు. భక్తుల ననుగ్రహించడంలో స్వామి అవలంబించే మార్గాలు పలువిధాలు. అవి ఆయా వ్యక్తుల తరతమ భేదంపైనా, వారి సంస్కారబలం పైనా ఆధారపడి ఉంటాయి. కొందరికి అనుష్ఠానం, కొందరికి మంత్రోపదేశం, కొందరికి సాక్షాద్దర్శనం, మరికొందరికి దర్శనంతో సైతం పనిలేకుండా స్వప్నంలో అనుగ్రహం.

ఆధునిక నాగరికతా, పాశ్చాత్యవిద్యా ప్రభావంచేత నేటి యువతరం హృదయంలో అవిశ్వాస మొక్కటే రాజ్యమేలుతున్నది. ప్రాచీనమూ, భారతీయమూ వారికి పరిత్యాజ్యం. విజాతీయమూ, వైజ్ఞానికమూ పరమ ప్రమాణం. విజ్ఞానశాస్త్ర పరిశోధనలు ఆధినికమానవ సుఖజీవనానికి తోడ్పడిన మాట కాదనలేము. అయినా, అదే జీవిత పరమావధి కాదుకదా?

--- నీలంరాజు వెంకటశేషయ్య గారి "నడిచే దేవుడు" పుస్తకం కృతాంజలి నుండి

#KanchiParamacharyaVaibhavam - #కంచిపరమాచార్యవైభవం
1/15/18, 19:14 - Paramacharyulu: సభ్యులందరికి విన్నపం
1/15/18, 19:14 - Paramacharyulu: <Media omitted>
1/16/18, 08:07 - Paramacharyulu: యా వూరు నుండి వొచ్చినారు (పార్ట్ 3)

అక్కడ మూడు వరసల్లో అందరూ నిలబడి ఉన్నారు. నేను మూడవ వరసలో చివరన మఠం గోడ నా వీపుని తాకేలాగా నిలబడ్డాను. సరిగ్గా నా ముందర ఇద్దరు వ్యక్తులు నిలబడి ఉన్నారు. అలా నడిచి వెళ్ళిపోయేవారికి నేను కనిపించడం అస్సలు జరగని పని.

కాని అక్కడున్నవారిని ఆశ్చర్యపరుస్తూ స్వామివారు మా ముందు ఆగి, మమ్మల్ని చూస్తూ, ఒకలాంటి తెలుగు ఉచ్చారణలో "యా వూరి నుండి వొచ్చినారు?" అని అడిగారు. నాముందరున్న ఎవరో తెలిసిన వారిని అడుగుతున్నారనుకొని నేను ఏమీ చెప్పకుండా కనురెప్పలు కూడా కొట్టకుండా చూస్తూ నిలబడ్డాను. నాలోని గందరగోళాన్ని గమనించి స్వామివారు మళ్ళా అదే ప్రశ్న అడిగారు. అప్పుడు నా పక్కన ఉన్న పెద్దాయన నా కుడిచెవిలో చిన్నగా "నిన్నే అడుగుతున్నారు" అని చెప్పారు.

పెద్ద బాంబు నా మీదపడ్డట్టు ఉలిక్కిపడి, ఒళ్ళంతా ఒక్కసారి జలదరించగా, చిన్న స్వరంతో "స్వామి... నేను హైదరాబద్ నుండి వచ్చాను" అని చెప్పాను. నాలోని భయాన్ని గమనించి స్వామివారు నన్ను దగ్గరకు రమ్మన్నట్టుగా తమ కుడిచేతితో ఆజ్ఞాపించారు. నా ముందున్న ఇద్దరు వ్యక్తులు దారివ్వడంతో ఒక్కుదుటున ఎగిరి స్వామివారి ముందు నిలబడ్డాను. మరలా స్వామివారు తెలుగులో, "హైదరాబాద్ నుండి వొచ్చినారా. . . యామి సేస్తూ వుంటారు అక్కడ?" అని అడిగారు.

"స్వామి, నేను టివి సీరియల్స్, ఆడ్ ఫిలమ్స్ చేస్తూ ఉంటాను" అని చిన్న స్వరంతో బదులిచ్చాను. స్వామివారు నవ్వుతూ, "అట్లానా. . . బాగా సేసుకోండి" అని నాతో "మీకు పరమాచార్య తెలుసునా?" అని అడిగారు. "క్షమించాలి స్వామి నాకు తెలియదు" అని చెప్పాను. అదే నవ్వుతో స్వామివారు నాతో, "సమయం వచ్చినప్పుడు అన్నీ తెలుస్తాయి లెండి" అని వెనకనున్న ఒక పండితునితో ఏదో మాట్లాడి నావైపు తిరిగి, "ఈయన మీకో పుస్తకమిస్తాడు అందులో ఉన్న విధాన దేవునికి పూజ చెయ్యండి అంతా బాగుంటుంది" అని చెయ్యెత్తి నన్ను ఆశీర్వదించి పక్కకు తిరిగి మఠం లోపలికి వెళ్ళిపోయారు.

మొదటగా నాపక్కన నిలబడ్డ పెద్దాయన వచ్చి నాతో, "అబ్బాయి. . నువ్వు ఎవ్వరో నాకు తెలియదు. కాని నీవు ధన్యుడివి. ఇక్కడ ఇంతమంది భక్తులు ఉండగా స్వామివారు ప్రత్యేకించి నీతో మాట్లాడారు. చూడు ఎంత అదృష్టవంతుడివి నువ్వు" అని అన్నారు. నేను అదోలా ముఖం పెట్టి ఒక నిర్జీవమైన నవ్వు నవ్వాను. అప్పుడు చాలామంది నావద్దకు వచ్చి దాదాపు అవే మాటలు చెప్పారు. నేను ఆ సమయంలో ఏమి ఆలోచించే పరిస్థితిలో లేక అందరికీ ధన్యవాదాలు తెలిపాను. అప్పుడు నేను మా అక్కను చూడగా దూరంగా నిలబడి నన్నే చూస్తోంది. దదాపు కళ్ళనీరు పెట్టుకోవడానికి సిద్ధంగా ఉంది.

వెంటనే నావద్దకు వచ్చి "చూశావా బాలు. . . ఇక్కడికి రావడానికి నువ్వు ఇష్టపడలేదు. చూడు ఏమి జరిగిందో. ఇది నీ జీవితంలో జరగాలి, అందుకే ఆయన నిన్ను ఇక్కడికి రప్పించుకున్నారు. నాకు చాలా సంతోషంగా ఉంది" అని చెప్పింది. కళ్ళెదురుగా తన తమ్ముడికి ఇలా జరిగితే ఏ అక్కమాత్రం సంతోషపడకుండా ఉంటుంది. కొద్దిసేపటి తరువాత ఇందాక స్వామివారు ఆదేశించినట్టుగా ఆ పండితుడు ఒక పుస్తకం తీసుకుని వచ్చి నాకు ఇచ్చారు.

అది పూజా సమయంలో చదువుకోవడానికి దేవీ దేవతల శ్లోకాలు, స్తోత్రాలు ఉన్న జయేంద్ర సరస్వతి స్వామివారి ముఖచిత్రం కలిగిన తెలుగు పుస్తకం. దాన్ని తీసుకుని ఆ పండితుణ్ణి అడిగాను. "పరమాచార్య ఎవరు?" అని. ఆయన చిన్నగా నవ్వుతూ, గోడపైన ఉన్న ఒక చిత్రపటాన్ని చూపిస్తూ, "ఈయనే పరమాచార్య" అని చెప్పారు.

"వారు చంద్రశేఖరేంద్ర సరస్వతి కదా!!" అని అన్నాను. పెదవులపై అదే చిరునవ్వుతో, "అవును నిజం. కాని వారు 'కంచి పరమాచార్య' అని ప్రసిద్ధులు. తమిళులు వారిని 'మహా పెరియవ' అని అంటారు. స్వామివారు చెప్పినట్టు సమయం వచ్చినప్పుడు మీకు వారిగురించి ఇంకా తెలుస్తుంది" అని చెప్పారు.

చివరిగా జయేంద్ర సరస్వతి స్వామివారు నాతో మాట్లాడి ఆశీర్వదించినప్పటి నుండి నా మనస్సుని తొలుస్తున్న ఒక ప్రశ్నని అడిగాను. "నన్ను మొదటగా ఎవరైనా చూసినప్పుడు నన్ను ఉత్తరభారతీయుడు అనుకుని హిందీలో కానీ, ఆంగ్లంలో కానీ మాట్లాడతారు. కానీ స్వామివారు తెలుగులో నాతో మాట్లాడటం నన్ను ఆశ్చర్యానికి గురిచేసింది. నా మాతృభాష తెలుగు అని స్వామివారికి ఎలా తెలుసు?"

చిరునవ్వుతో ఆ పండితుడు "వారికి సర్వమూ తెలుసు. అందుకే సాక్షాత్ శంకరావతారమైన పరమాచార్య స్వామివారు వీరిని తమ ఉత్తరాధికారిగా, విశ్వవిఖ్యాత ఆధ్యాత్మిక స్థానం అయిన 'కంచి కామకోటి పీఠం' తరువాతి పీఠాధిపతిగా ఎన్నుకున్నారు. అందుకే ఇక్కడున్న తమిళనాట పేరెన్నికగన్న ప్రముఖ వ్యక్తులందరూ వారి భక్తులయ్యారు. అందుకే నేను కూడా వారికి పురోహితుడిగా వ్యవహరిస్తున్నాను" అని చెప్పారు.

అపార కరుణాసింధుం జ్ఞానదం శాంతరూపిణం
శ్రీ చంద్రశేఖర గురుం ప్రణమామి ముదావహం ॥

--- నరేనాదిత్య కొమరగిరి, హైదరాబాద్. www.tirumalesa.com నుండి

#KanchiParamacharyaVaibhavam #కంచిపరమాచార్యవైభవం
1/16/18, 16:24 - Paramacharyulu: శ్రీ రంగం రంగనాథ ఆలయ గోపురం

శ్రీ రాచూరి రంగదాసుగారి పూర్వీకులు మూడు దశాబ్ధాలకు పైగా హైదరాబాదులో స్థిరపడినవారు. రాచూరి వారు వైష్ణవ సంప్రదాయానికి చెందిన సూర్యవంశ క్షత్రియులు.

1968 లో భద్రాచలంలో శ్రీ సీతారామాలయ కుంభాభిషేక మహోత్సవ సందర్భంలో శ్రీ రంగదాసు ప్రప్రథమంగా శ్రీ కంచి కామకోటి

శంకరాచార్యులు శ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతి స్వామి వారిని దర్శించడం తటస్థించింది.

“అంతకుముందు నాలో లేశమాత్రంగా ఉన్న దైవభక్తి కంచి స్వామివారిని సందర్శించిన తదుపరి ఇనుమడించింది” అంటారు రంగదాసు గారు.

“అటు పిమ్మట శ్రీ జయేంద్ర సరస్వతి స్వామి వారితో నాకు సన్నిహిత్యం పెరిగింది. ఇరువురు స్వాముల అనుగ్రహం ఫలితంగా పెద్ద పెద్ద కాంట్రాక్టు పనులు నన్ను వరించి వచ్చినవి. నా ఆదాయం వృద్ధి అయింది.”

శ్రీ రంగదాసు గారు తన స్వానుభవాన్ని ఇంకా ఇలా వివరించారు. పెద్దలు శ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతి స్వామి కర్ణాటక రాష్ట్రంలోని గోకక్ అనే గ్రామంలో మకాం చేస్తూ ఉన్నప్పుడు “వెంటనే ఒకసారి వచ్చి స్వామివారిని దర్శనం చేసి వెళ్ళవలసిందంటూ” హైదరాబాదులో నాకు వర్తమానం అందింది. స్వామి ఆజ్ఞమేరకు నేను గోకాక్ వెళ్ళాను.

స్వామివారు నాతో ఇలా అన్నారు. “అహోబిలం మఠాధిపతి శ్రీ శఠగోప వేదాంత మహాదేశికులవారి వద్ద నుండి నాకొక జాబు వచ్చింది. శ్రీరంగ క్షేత్రం రంగనాథస్వామి వారికి స్వప్నంలో దర్శనమిచ్చి, అసంపూర్ణంగా నిలిచిపోయిన దేవాలయ గోపుర నిర్మాణం ప్రారంభించవలసిందని శ్రీ జియ్యర్ స్వామిని ఆజ్ఞాపించాడట. అందుకు ఆర్థిక సాయం కోరుతూ వారు నాకు జాబు వ్రాసారు.”

“నా అభిప్రాయంలో ఆ గోపుర నిర్మాణం అంతా రాతితోనే జరగాలి అని ఉన్నది. నీవు కాంట్రాక్టరువు కాబట్టి, శ్రీరంగం వెళ్ళి, అసంపూర్తిగా ఉన్న కట్టడాన్ని పరిశీలించి, రాతితో కట్టడం ఎంతవరకు సాధ్యమో, అందుకు పునాదులు తగినంత దృఢంగా ఉన్నవో లేవో చూచి నీ అభిప్రాయం నాకు చెప్పాలి.”

“ఈ గోపుర నిర్మాణానికి ఎంత ఖర్చు కాగలదో ఆ మేరకు ప్రజలనుండి విరాళాలు కోరుతూ నేనూ శ్రీ శఠగోపయతీంద్రులవారూ ఇరువురం కలిసి ఒక విజ్ఞాపన చేస్తాము”

“ఇకపోతే గోపుర నిర్మాణాన్ని పర్యవేక్షించడానికి ఒక రిటైరైన ఐ.ఏ.యస్. అధికారిని అడ్మినిస్ట్రేటివ్ అధికారిగానూ, రిటైరైన అకౌంటెంట్ జనరల్ ను జమాఖర్చులు చూడడానికి, అలాగే ఉద్యోగం నుంచి విరమించుకున్న ఒక చీఫ్ ఇంజనీరును గోపుర నిర్మాణ పర్యవేక్షణకు నియమిస్తాము.

ఈ పనులన్నింటికీ వృద్ధులైన అహో యతీంద్రులవారు శ్రమపడవలసిన పనిలేదు. ఈ విశయాలన్నీ అహోబిలం పీఠాధిపతులతో చర్చించి వారి అభిప్రాయమేమో తిరిగి వచ్చి నాకు చెప్పవలసింది” అని స్వామి ఆజ్ఞాపించారు.

శిల్పశాస్త్ర ప్రవీణుడు శ్రీ గణపతి స్థపతినీ, శ్రీ సౌందరరాజన్, హైదరాబాద్ అకౌంటెంట్ జనరల్ ఆఫీసులో ఉద్యోగి శ్రీ కె. కృష్ణమూర్తి గారినీ, పునాదులు పరీక్ష చేయడానికి సూపరింటెండింగ్ ఇంజనీరు శ్రీ డి.రామమూర్తి గారినీ, మఠం కార్యకర్తలలో ఒకరైన శ్రీ కన్నన్ గారినీ వీరందరినీ వెంటబెట్టుకుని నేను శ్రీరంగం బయలుదేరాను. శ్రీరంగంలో నేను ఆచార్యులవారిని దర్శించడం అదే తొలిసారి. కంచిస్వామి వారు చెప్పినదంతా శ్రీ జియ్యరు స్వామి వారికి వివరంగా వినిపించాను. అంతావిని వారు అందుకు అంగీకరించక ఇలా చెప్పారు.

”శ్రీరంగనాథుడు నాకు స్వప్నంలో కనుపించి ఈ పని నీవు పూర్తి చెయ్యవలసిందని ఆజ్ఞాపించాడు. సాధ్యమైతే, నాకు ఈ నిర్మాణానికి డబ్బు సాయం చెయ్యవలసిందని శ్రీ శంకరాచార్యులవారితో చెప్పండి. అంతకు మించి నేను చెప్పవలసిందేమీ లేదు” అన్నారు.

హైదరాబాద్ లో శ్రీ అహోబిలమఠానికి కార్యదర్శిగా ఉన్న శ్రీ సౌందరరాజన్ గారితో కలిసి తిరిగి మేమంతా గోకక్ లో శ్రీవారి వద్దకు వచ్చి, శ్రీరంగంలో జరిగిన విషయమంతా స్వామివారికి నివేదించాము.

స్వామి వారు మేము చెప్పినదంతా సావకాశంగా విని ”అలాగే, జీయర్ గారికి ఎలా ఉచితమని తోస్తే అలా చెయ్యమను” అని సెలవిచ్చారు. తరువాత శ్రీజయేంద్ర సరస్వతిని పిలిచి, “మఠంలో నిలవ ఎంత ఉన్నది?” అని శ్రీవారు అడిగారు. దాదాపు పదిలక్షలు ఉన్నదని శ్రీ జయేంద్రుల వారన్నారు.

“అయితే, ఒక లక్షరూపాయలు వెంటనే అహోబిలం మఠాధిపతులకు పంపే ఏర్పాటు చెయ్యి” అన్నారు పెద్దలు.

కొన్ని నెలలు గడిచాయి. శ్రీవారు మహారాష్ట్రలోని సతారాలో ఉండి, తిరిగి నాకు కబురు పెట్టారు. నేను సతారా వెళ్ళి స్వామిని కలుసుకున్నాను. “నీవు మళ్ళా శ్రీరంగం వెళ్ళి వస్తావా?” అని అడిగారు

శ్రీ జియ్యర్ గారు గోపుర నిర్మాణం ప్రారంభం చేసారని, గోపురంలో కనీసం ఒక అంతస్థు కట్టడానికి తమ సహాయం అడుగుతున్నారని, ఒక అంతస్థుతో గోపురం పూర్తి కాదు కదా, మిగిలిన అంతస్థులను వారు ఎలా ఏర్పాటు చేస్తారో, వారి ప్రణాలిక ఏమిటో అన్ని విషయాలు తెలుసుకుని రావలసిందిగా నన్ను స్వామివారు ఆదేశించారు.

శ్రీరంగం వెళ్ళి నేను జియ్యర్ స్వామిని కలిసికొన్నప్పుడు వారు చాలా అవేదన వ్యక్తం చేసారు. “అందరూ వస్తున్నారు. పోతున్నారు. ఎవరూ డబ్బు ఇవ్వడం లేదు” అన్నారు. జియ్యర్ గారి మాట విని నేనెంతో కష్టపడ్డాను. వెంటనే నేను స్వయంగా 25,000 రూపాయలకు చెక్కురాసి వారికి సమర్పించాను.

“ఈ సొమ్ము ఎవరు ఇచ్చినట్టు రాయమంటారు?” అడిగారు శ్రీ జియ్యర్ స్వామి. “నేను కంచి మఠం నుండి వస్తున్నాను కాబట్టి కంచిమఠం ఇచ్చినట్టు రాసుకోండి” అన్నాను. సతారాకు తిరిగివచ్చి, స్వామివారితో పరిస్థితి అంతా చెప్పాను. స్వామివారిలా అన్నారు “గోపుర నిర్మాణం పూర్తికాకుండా శ్రీ జియ్యర్ స్వామి దివంగతులయ్యే ప్రమాదం లేదు. ఆ పని పూర్తి అయ్యేవరకు వారు సజీవులై ఉంటారు”

నేను మరల శ్రీ జియ్యర్ గారి వద్దకు వెళ్ళినప్పుడు శ్రీవారన్న మాటలను శ్రీ జియ్యర్ స్వామికి వినిపించగా, వారు ఇలా అన్నారు

”శ్రీ చంద్రశేఖర సరస్వతి, శ్రీ జయేంద్ర సరస్వతులు ఇరువురూ నాకు సుపరిచితులే. నా పూర్వాశ్రమంలో నేను వారుభయులనూ ఎరుగుదును. గోపుర నిర్మాణం పూర్తయ్యే వరకూ నేను జీవించియుంటానని పెద్దస్వామి వారు అన్నారంటే అది వారి ఆశీర్వాదం”.

నిరాడంబర దాత అయిన శ్రీరంగదాసు గారు కంచి మఠం తరుపున మొత్తం లక్ష రూపాయలు శ్రీ రంగం గోపుర నిర్మాణానికి ఇచ్చారు. కాని వారు ఎక్కడా అది చెప్పుకోలేదు. అది వారి నమ్రతనూ, నిరాడంబరతనూ సూచిస్తుంది. ఇలాగే కంచిస్వామి వారి భక్తులలో ఒకరు, సేలంలో ఆడిటరు, తన పేరు ప్రకటించుకోకుండా దాదాపు మూడున్నర లక్షలు రూపాయలు సేకరించి కంచిమఠం ద్వారా శ్రీరంగనాథుని గోపుర నిర్మాణానికి సమర్పించారు.

ఇందులో ముఖ్యంగా చెప్పదగిన విశేషమేమంటే దక్షిణ భారతదేశంలో ఒక ప్రధాన వైష్ణవాలయ గోపుర నిర్మాణానికై అద్వైత విశిష్టాద్వైత సంప్రదాయాలకు చెందిన ఇరువురు పీఠాధిపతులు ఏకమై 232 అడుగుల ఎత్తున ఉన్నతోన్నతమైన ఒక మహానిర్మాణాన్ని పూర్తిచేయడం చరిత్రలో అపూర్వం.

మరొక విశేషం : శ్రీరంగం రంగనాథుని గాలి గోపుర నిర్మాణాన్ని గురించి అహోబిలం మఠాధిపతి శ్రీ శఠకోపయతి గారినడిగితే “అంతటికీ కంచి పీఠాధిపతి శ్రీ చంద్రశేఖరేంద్రులవారే కారకులు” అంటారు. కంచిస్వామి వారు, “నాదేమున్నది? అంతా అహోబిలం వారికృషే” నంటారు. ఉదార చరితుల ఔదార్యానికి, స్వార్థరాహిత్యానికీ ఇంతకంటే నిదర్శనమేముంటుంది?

#KanchiParamacharyaVaibhavam #Paramacharya
1/17/18, 08:28 - Paramacharyulu: సబ్బు - స్నానం

ఒకరోజు కంచి కామకోటి పీఠాధిపతులు శ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతి స్వామివారు స్నానం చేస్తున్నారు. దగ్గర్లోనే ఉన్న చిన్నపిల్లవాడు స్వామివారిని చూస్తున్నాడు.

మహాస్వామివారు ఎప్పటిలాగే సబ్బు వాడకుండా మట్టితో వొళ్ళు తోముకుంటూ స్నానం చేస్తున్నారు. ఆ పిల్లవాడు అది చూడగానే స్వామివారిని “స్నానానికి మీరు సబ్బు వాడరా?” అని అడిగాడు. “నాకు సబ్బు వాసన్ పడదు అందుకే. సబ్బుకి బదులుగా నేను ఇసుక వాడతాను” అని బదులిచ్చారు.

“ఓహ్ అలాగా! సరే కాని ఒళ్ళు రుద్దుకోవడానికి ఇలా ఇసుక వాడితే, అది కొంచం కళ్ళల్లో పడి అది చాలా బాధ కలిగిస్తుంది కదా? అందుకే అడిగాను” అని అడిగాడు ఆ పిల్లాడు. ఆ పసివాడి హృదయంలోని ఆర్ధ్రతని చూసి స్వామివారు ఇలా చెప్పారు: “స్నానం చేసేటప్పుడు మన శరీరాన్ని మట్టితో రుద్దుకుంటే మన పాపాలన్నీ పోతాయని మన శాస్త్రాల్లో చెప్పబడి ఉంది. అందుకనే నేను ఇలా చేస్తాను”

ఈ సమాధానంతో ఆ పిల్లాడు సంతృప్తిపడలేదు. స్వామివారితో విబేధిస్తూ “ఊరికే నాకు ఏమేమో చెప్పకండి. మీరేకదా దేవుడు. మీకు పాపం అలా ఉంటుంది? దేవునికి ఎక్కడైనా పాపం అంటుతుందా? మరి ఇక మీరు ఇలా చెయ్యడం ఎందుకు?” అని ప్రశ్నించాడు.

మహాస్వామివారు స్నానం చెయ్యడం ఆపి ఒక్కక్షణం ఆ పిల్లవాని వంక చూశారు. ఎవరో చెప్పిన మాటని ఎంతగా నమ్మాడు అని తీక్షణంగా అతనివైపు చూసి ఇలా అన్నారు: “నేను దైవమో కాదో లేదా నాకు పాపాలు అంటుతాయో అంటవో నాకు తెలియదు. కాని నన్ను గురువుగా భావించే నా భక్తుల పాపాలన్నీ తప్పకుండా నన్ను అంటుతాయి. వాటినన్నిటిని పోగొట్టుకోవడానికే నేను మట్టితో దేహాన్ని రుద్దుకుని స్నానం చేస్తున్నాను”

ఇక మాట్లాడడానికి తన పరిణితి, వయస్సు లేకపోవడంతో ఆ సంభాషణని ఇక ఆపదలచి చిన్నపిల్లాడు కాబట్టి నవ్వి ఊరుకున్నాడు.

[ఒకరోజు రాత్రి మతా శారదా దేవి నిద్రపోకుండా జపం చేసూనే ఉన్నారు. ఒక శిష్యుడు ఈ విషయం తెలిసి అమ్మని అడిగాడు “అమ్మా! నిన్న రాత్రి మీరు నిద్రపోలేనట్టుగా ఉంది” అని. “అవును. రాత్రి రెండు గంటలదాకా మా శిష్యుల ఉద్ధరణ కోసం జపం చేస్తున్నాను. ఇక్కడివారు చాలామంది జపము ధ్యానము చెయ్యరు. కాబట్టి వారికి కేవలం మంచి మాత్రమే జరగాలని వారి తరుపున నేను చేశాను”. ఆత్మజ్ఞాని అయినా అమ్మ అమ్మే.]

అపార కరుణాసింధుం జ్ఞానదం శాంతరూపిణం
శ్రీ చంద్రశేఖర గురుం ప్రణమామి ముదావహం ॥

--- అశ్వతి, శక్తి వికటన్ ప్రచురణ

#KanchiParamacharyaVaibhavam #కంచిపరమాచార్యవైభవం

1/17/18, 08:29 - Paramacharyulu: <Media omitted>
1/17/18, 16:15 - Paramacharyulu: ఆదివారం - కాశ్మీరు శాలువాలు

వేదశాస్త్రాభివృద్ధికై జీవితం అంకితం చేసిన వారిలో దక్షిణ భారదేశంలో శ్రీకొత సూర్యనారాయణ పంతులుగారు అగ్రగణ్యులు, వేద విజ్ఞాన అభివృద్ధి, ప్రచారం కోసం 100 సంవత్సరములకు పూర్వమే శ్రీదేవి శారన్నవరాత్ర వేదశాస్త్రసభను స్థాపించి, అవిచ్ఛిన్నముగా వేదాధ్యాపకులను, విద్యార్థులను సన్మానిస్తూ ప్రోత్సహిస్తున్నది కొత్తా వారి వంశం. వారి వంశములో మూడోతరములో కూడా క్రమంతప్పకుండా నడిపిస్తున్న శ్రీ లలితమానోహరుగారి యొక్క అనుభవములు మహాస్వామి వారితో,

సికింద్రాబాదు మా ప్రాంగణములో ఒక ఆదివారంనాడు మధ్యాహ్నం నాకు కబురుపంపినారు. వెళ్లి వందనము చేయగానే "ఢిల్లీలో నక్షత్రేష్టి జరుగుతున్నది రేపు సమాప్తి. నాకు వెంటనే ఆరు కాశ్మీరు పండిత శాలువాలు కావాలి. రాత్రి విమానంలో ఢిల్లీకి పంపవలెను" అని అన్నారు. దానికి నేను "ఈరోజు ఆదివారము, దుకాణములు తెరువబడి ఉండవు అవి దొరుకుట సాధ్యమా!" అని అంటే "అందుకే నీకు చెబుతున్నాను, ప్రయత్నం చెయ్యి" అని మందహాసము చేసినారు. 1968 సంవత్సరములో  హైద్రాబాదులో మన సంస్కృతి, సంప్రదాయాలు అంతగా విస్తరించలేదు.

కొంచం బాధపడుతూ ఒక కొట్టు యజమాని ఇంటికి ఫోను చేసాను. అతను కొట్టు తెరవడానికి అంగీకరించి నన్ను రమ్మని రమ్మనినాడు. వెళ్లి ఆకొట్లో శాలువాలు పెట్టు బీరువాను తెరిచి, కట్టను విప్పి చూడగా శ్రీవారు కోరిన శాలువాలు సరిగ్గా 6 మాత్రమే అందులో ఉన్నాయి. చాలా ఆశ్చర్యము వేసినది, సంబరపడుతూ తెచ్చి శ్రీవారికి చూపించాను " నేను అనుకున్నవి దొరికినవి కదా" అని అన్నారు. ఆ రాత్రి వాటిని విమానంలో ఢిల్లీకి పంపుట, అవి మరునాడు సకాలములో యాగశాలకు చేరుట జరిగినది. ఎంతైనా శ్రీవారు సంకల్ప సిద్ధులు కదా.

--- నీలంరాజు వెంకటశేషయ్య గారి "నడిచే దేవుడు" పుస్తక సౌజన్యంతో

#KanchiParamacharyaVaibhavam #కంచిపరమాచార్యవైభవం
1/17/18, 16:36 - Paramacharyulu: <Media omitted>
1/18/18, 07:01 - Paramacharyulu: జనరేషన్ గ్యాప్

పరమాచార్య స్వామివారు కర్ణాటక రాష్ట్రంలోని బెళ్గాం దగ్గర మకాం చేస్తున్నప్పుడు నేను మా కుటుంబంతో సహా కలిసి స్వామివారి దర్శనానికి వెళ్ళాను.

మా తండ్రిగారు పరమాచార్య స్వామికి సాష్టాంగం చెయ్యగా, స్వామివారి ఆంతరంగిక శిష్యులు మా తండ్రిగారిని చూపిస్తూ, “ఈయన హుబ్లి రామస్వామి నాన్నగారు” అని చెప్పాడు. నేను అప్పుడు హుబ్లి రైల్వే డివిజన్ లో అధికారిగా పనిచేసేవాణ్ణి. అందుకనే నన్ను శ్రీమఠం పరిచారకులు హుబ్లి రామస్వామి అనే బిరుదిచ్చారు. ”మీ పేరు నారాయణన్ కదూ?” అని స్వామివారు అడుగగా మా నాన్న అవును అని సమాధానమిచ్చారు. తరువాత నేను స్వామివారికి సాష్టాంఅగం చేసి నిలబడ్డాను. అదే శిష్యుడు నన్ను “స్వామినాథన్ తండ్రి” అని పరిచయం చేశాడు.

తరువాత సాధారణ విచారణలు, ప్రశ్నలు, సమాధానాలు, స్వగ్రామం గూర్చిన సమాచారం ఇలా ఒక పది నిముషాలు గడిచిపోయింది. స్వామివారు నావైపు చూసి నవ్వుతూ, “నువ్వు పెద్ద లేబర్ ఆఫీసర్ వి కదూ? ఆంగ్లంలో ‘జనరేషన్ గ్యాప్’ అని అంటారు కదా. అది ఏంటి” అని అడిగారు స్వామివారు.

నేను ఏదో నాకు తోచినది చెప్పాను గాని, అది సరైన సమాధానం కాదని నాకు కూడా తెలుసు. చివరికి నేను మాట్లాడడం పూర్తైన తరువాత స్వామివారు ఇలా అన్నారు:

”వెనుకటి కాలంలో ఎవరైనైనా ఎవరికైనా పరిచయం చేస్తే ‘వీరు ఫలానా వారి కుమారులు’ అని చెప్పేవారు. అదే ఉపనయనం అయినవారు అయితే ‘అభివాదము’తో మొదలుపెట్టేవారు. ‘గోత్రము’, ‘సూత్రము’ ‘నామము’ అని చెప్పి వారిని వారు పరిచయం చేసుకునేవారు. చూడు అంతా ఎలా మారిపోయిందో!! ఇప్పుడంతా తలక్రిందులైపోయి ‘వీరు ఫలానా వారి తండ్రి’ అని చెప్పుకుంటున్నారు.

ఇదే ‘జనరేషన్ గ్యాప్’ అంటే“

స్వామివారు చెప్పిన ఈ వివరణ అక్కడ ఉన్న ఆంగ్ల పండితులని కూడా ఆశ్చర్యానికి గురిచేసింది.

అపార కరుణాసింధుం జ్ఞానదం శాంతరూపిణం
శ్రీ చంద్రశేఖర గురుం ప్రణమామి ముదావహం ॥

--- యన్. రామస్వామి, సికింద్రాబాద్. మహాపెరియవళ్ – దరిశన అనుభవంగళ్ 3

#KanchiParamacharyaVaibhavam #కంచిపరమాచార్యవైభవం
1/18/18, 16:00 - Paramacharyulu: స్థపతికి అనుగ్రహం

1960 లో భద్రాచలం శ్రీ సీతారామస్వామి దేవాలయ సముద్ధరణకు బృహత్ ప్రయత్నం జరిగింది రాష్ట్ర ప్రజలు, పిన్న పెద్ద లక్షలాది కానుకలు సమర్పించారు.

ఆలయ మంటపాలకు సంబంధించిన శిల్పాలను రూపొందించడానికి అరవదేశం నుంచి కొందరు శిల్పులను రప్పించారు. అలా వచ్చిన శిల్పులందరికి నాయకుడు ఇరవయ్యేండ్లు నిండీ నిండని గణపతి అనే యువకుడు.

కొత్తగా నిర్మించిన స్వామివారి కళ్యాణ మండపమంతా ఆ యువశిల్పి చేతుల మీదుగా రూపుదాల్చిన కళా విశేషమే.

అలయ పునఃప్రతిష్ఠకు అరుదెంచిన కంచి కామకోటి పీఠాధిపతి శ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతి స్వామి కళ్యాణమండపంలోని శిల్ప సంపదను చూచి ముగ్ధులైనారు. పూర్వం దక్షిణ దేశంలో చేర, చోళ, పాండ్య రాజుల యాజమాన్యంలో నిర్వహించిన శిల్పకళావైభవం కంటే ఇది మిన్న అని శ్లాఘించారు. ఆ యువశిల్పి గణపతిని ఆశీర్వదించారు.

అది మొదలుకుని గణపతి స్థపతి శిల్పకళా ప్రవీణుడుగా పేరొంది ఆంధ్రదేశంలోనే కాక, అఖిలభారతంలో పలు రాష్ట్రాల్లో అనేక ఆలయాలను, మండపాలను నిర్మించడానికి కారణ భూతుడైనాడు. రాష్ట్రపతి అవార్డును గడించాడు.

ఉత్తరప్రదేశ్ ప్రయాగలో నిర్మించిన ఆది శంకర మంటపం, సతారాలో నటరాజస్వామి ఆలయం, షికాగోలో శ్రీ రామచంద్రస్వామి దేవాలయం మొదలైన అద్భుత నిర్మాణాలన్నీ గణపతి స్థపతి పర్యవేక్షణలో వెలసినవే.

దేశ విదేశాల్లో ఎక్కడ ఏ ఆలయం నిర్మించవలసి వచ్చినా, కంచిస్వామి అనుమతి లేనిది, స్వామిద్వారా శిల్ప రహస్యాలను గ్రహించనిది ఆలయ నిర్మాణానికి పూనుకోడు శ్రీ గణపతి.

ఆంధ్రరాష్ట్ర ప్రభుత్వం దేవాదాయ శాఖలో ప్రధాన స్థపతిగా ఉన్నత పదవి నిర్వహించి, పదవీ విరమణ తరువాత పద్మశ్రీ బిరుదాంకితుడైనాడు.

స్వామి వారి ఆశీర్వాదంతో ఎంత దుర్ఘటమైన కార్యమైనా అనాయాసంగా, నిర్విఘ్నంగా నెరవేర గలదంటాడు ప్రముఖ శిల్పకళానిధి శ్రీ గణపతి స్థపతి.

గణపతి స్థపతి అనే పేరు మీద ఇద్దరు వ్యక్తులు ఉన్నారు. ఇద్దరూ శిల్పా చార్యులే.

కాలంచేసిన వి. గణపతి స్థపతి గారికి కంచి మఠానికి, భద్రాచల దేవాలయ పునర్మిణానికి ఏ సంబంధమూ లేదు. వీరు పద్మభూషణ్ బిరుదాంకితులు.
https://en.wikipedia.org/wiki/V._Ganapati_Sthapati

ఇక యస్. యమ్. గణపతి స్థపతి గారు పరమాచార్య స్వామి అనుగ్రహం పొందిన వారు. భద్రాచల దేవస్థాన పునర్మిణాంలో కళ్యాణమండపం నిర్మించినవారు. వీరు పద్మశ్రీ బిరుదాంకితులు.

https://en.wikipedia.org/wiki/S._M._Ganapathy

వీరిగురించిన మరికొంత సమాచారం కోసం ఈ వీడియోను చూడండి.

https://www.youtube.com/watch?v=-FWvi_YSapw&feature=youtu.be

--- నీలంరాజు వెంకటశేషయ్య గారి "నడిచే దేవుడు" పుస్తక సౌజన్యంతో

#KanchiParamacharyaVaibhavam #కంచిపరమాచార్యవైభవం
1/19/18, 07:02 - Paramacharyulu: వినతి

కంచి మహాస్వామి వారు తమ ఎనభై ఏడేండ్ల ఆధ్యాత్మిక సార్వభౌమత్వంలో ప్రజలను శాస్త్రచోదితమైన మార్గమునందు నడిచేటట్లుగా చేయడానికి అవిశ్రాంతంగా, నిర్విరామంగా కృషి చేశారు. ఆశ్రమరీత్యా దండోపాయముపయోగించరాదు కాబట్టి మిగిలిన సామ, దాన, భేదములనుపయోగించి ఎలాగో ఒకలా నయానో భయానో మనను ధర్మమార్గంలో ఉంచడానికి బోధలు చేయడమేకాక, దానికి సాధకమైన ప్రయత్నాలు కూడా చేశారు. స్వామివారు సాంప్రదాయ సిద్ధమైన జీవన విధానం - భగవత్పాదుల వారిచే సోపాన పంచకములో చెప్పబడిన సాధనా మార్గం — మానవాళికి శ్రేయస్కరమన్న విషయము అనేక యుక్తులతో సిద్ధాంతీకరించి చూపారు.

మనబోటివారికీ, స్వామివారికీ గల అనంతకోటి వ్యత్యాసములలో ఒక్కటి మాత్రం మనవి చేస్తాను. మనము కూడా ధర్మము, ఉత్తమ గుణముల గురించి కొద్దో గొప్పో తెలిసినవారమే! ఎదుటివారికి చెప్పేటప్పుడు సాధారణంగా అందరూ ధార్మికంగానే మాట్లాడతారు. కానీ ఆచరణలో పెట్టుకోవడాన్ని అలసత్వము చూపుతాము. స్వామివారు తాము చెప్పే ప్రతి అక్షరము తమ ఆశ్రమమునకు ఉచితమైనరీతిలో త్రికరణశుద్ధిగా ఆచరించి చూపారు. అందువల్లనే ఎంతటి ధర్మ వ్యతిరేకులకయినా వారిని తప్పు పట్టడం కుదరలేదు. నైతికతలో పరాకాష్ఠ వారు.

ఒకరోజు సాయంకాలము స్వామివారు వారికి ఏర్పడిన సంధ్యావందనం చేస్తున్నారు. నేను ఎదురుగా నుంచొని నమస్కారం చేసూ వారిని చూస్తూ ఉన్నాను. సాక్షాత్తు పరబ్రహ్మము ఎదురుగా ఉన్నప్పుడు వారికి నమస్కరించక వేరే సంధ్యలెందుకు అని అప్పట్లో నా ఉద్దేశము. ఈ వాదన పైకి ఎంతో బాగుంటుంది. లీలాశుకులు కృష్ణుని పాదారవిందముల యందు చిక్కిన మనస్సుతో స్నానం సంధ్య అవసరం లేదన్నాడు. కానీ ఆయన స్థితి ఏమిటి? తన మనస్సు కృష్ణుని పాదములను మరచి స్త్రీ సౌందర్యమందు నిమగ్నమయిందనే దుగ్ధతో కనులు పొడుచుకున్నాడతడు. కృష్ణుని తన హృదయారామునిగా అనుభవించినవాడాయన. అనుభవానికి, పెద్దమాటలు చెప్పకోవడానికి ఎంతో అంతరమున్నది. సరి! స్వామివారు సంధ్యావందనం చేసుకొనిరమ్మని సైగ చేశారు. నేను మొండికెత్తాను. వారు సంధ్య వార్చి తరువాత నాతో మాటలలో సంధ్య వార్చి రమ్మని చెప్పారు.

మీరెదురుకుండా ఉంటే ఇంక సంధ్య ఎందుకు అనే సాహసం చేయలేకపోయాను. తప్పించుకోవాలని చెంబు లేదన్నాను. విభూది లేదన్నాను. స్వామివారు తల తిప్పకొని ఊరుకోలేదు. ఓపికగా చెంబు విభూది తెప్పించి ఇచ్చి నన్ను సంధ్య వార్చమన్నారు. తను అనుయాయులను ధర్మాభిముఖులను చేయడంలో స్వామి వారి దీక్ష అంతటిది.

సంస్కారములపై మహాస్వామి వారు చేసిన తమిళ ప్రసంగముల నుండి ఉపనయనము, సంధ్యావందనము వరకు అనువదింపబడి శ్రీ కాంచి కామకోటిపీఠ ఆస్థాన సిద్ధాంతి శ్రీకుప్పా ఆంజనేయ శాస్త్రి గారి ప్రేరణచే ఈ చిన్న పుస్తకముగా, మా సోదరుడు చల్లా సురేష్ చే శేషాచలమ్స్ శ్రీగురుజాడ ట్రస్ట్, కామకోటి కుటీరం, గురుజాడ తరపున పునఃప్రకటించబడినది. నూతన వటువులను మహాస్వామివారు స్వకర్మానుష్ఠాను రతులుగా చేసి, మేధస్సు, తేజస్సు, యశస్సు, బ్రహ్మవర్చస్సు అన్నసమృద్ధి ప్రసాదించి సర్వసమృద్ధులుగా అనుగ్రహింతురుగాక యని వారి పాదపద్మములను ధ్యానించుచున్నాను.

--- చల్లా విశ్వనాథ శాస్త్రి

#KanchiParamacharyaVaibhavam #కంచిపరమాచార్యవైభవం
1/19/18, 07:03 - Paramacharyulu: <Media omitted>
1/19/18, 12:47 - Paramacharyulu: కామాక్షి – కన్యక

(శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవం సందర్భంగా)

మనం శుభ్రత కోసం రోజూ బట్టలకు, శరీరానికి పట్టిన మురికిని ఎలా వదిలించుకుంటామో అలాగే జీవన గమనంలో చెడ్డ ఆలోచనలు, చెడ్డ ఆశలు, అనవసర కోపం వల్ల మనస్సుకు పట్టిన మలినాన్ని కూడా వదిలించుకోవాలి. ప్రతిరోజు మన్ బుద్ధిని శుద్ధి చెయ్యడం చాలా అవసరం. దానివల్ల చెడు భావనలు తొలగి మనకు దుఃఖము, బాధ కష్టాలు దరిచేరవు. మనస్సును శుద్ధి చెయ్యడానికి వాడే నీరు కేవలం ధ్యానం. కాబట్టి ప్రతిరోజు మనము కొద్దిసేపు భగవంతుని ధ్యానములో గడపవలెను. అమ్మసన్నిధిలో ఎంతటి వాడికైనా చెడ్డ ఆలోచనలు పోయి మనసు ప్రశాంతత పొందుతుంది. అలాగే ఆ పరాశక్తి సమక్షంలో మన మనస్సులోని కల్మశాన్ని కొడుక్కోవాలి.

ఆ పరాశక్తి శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవి రూపంలో ఇక్కడ నెలకొని ఉంది. ఆబ్రహ్మకీట జనని అయిన పరాశక్తిని కన్యకగా కొలవటం మన పూర్వీకులు మేధస్సుకు అద్దం పడుతుంది. ప్రతిరోజూ దేవాలయానికి వెళ్ళి అమ్మవారి ముంది ధ్యానం చేసి మన మన్సులను శుభ్రపరచుకోవడం అందరి కర్తవ్యం. అలా చేయడం వల్ల మన బాధలన్నీ సూర్యుని ముందు మంచులాగా కరిగిపోతాయి. మనకు సంతోషం కలిగి మనము మన కుటుంబం వృద్ధిలోకి వస్తుంది.

శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరిగా అవతరించిన ఆ పరాశక్తి ఆర్యవైశ్యులకు కులదైవం, అరాధ్యదైవం. ఆ అమ్మయే కాంచీపురంలో కామాక్షిగా వెలసిన తల్లి. శ్రీ శంకర భగవత్పాదులు లోపల శ్రీచక్రం ప్రతిష్టించి, కామకోటి పీఠాన్ని స్థాపించారు. అలా వారు అనేక చోట్ల పీఠాలను స్థాపించడంలో ముఖ్య ఉద్ధేశ్యం రాబోవు తరాలకి మన శాస్త్రాలను తెల్పడం, దాని వల్ల వారు ధర్మమార్గం వదలక పయనించేట్టు చెయ్యడం.

కాలాంతరంలో మన సంఘంలో ఎన్నో మార్పులు వచ్చాయి. శాస్త్రాలు నిషేధించిన అహారం తినడం మరియు నైతిక విలువలు క్షీణించిపోతున్నాయి. మన సమాజాన్ని కులాలుగా వర్గాలుగా విభజించడం మనలో తారతమ్యాలను తీసుకురావడానికి కాదు. అది అనుకూలమైన సమూహాలుగా రూపొందించి, వారి క్షేమాన్ని పంచాయితి పెద్దలు పరిరక్షించేవారు. అటువంటు సమూహాలను వారి వారి వృత్తుల ఆధారంగా జరిగేవి. ఆ కులాలోని పెద్దలు వారు సరిగా పనిచేయునట్టూ, ధర్మమార్గం వదలక బ్రతికేలాగును చూసుకునేవారు. ఏదైనా సమస్య వచ్చిన ఆ పంచాయితీలలో పరిష్కరించుకుని తప్పు చెసిన వారికి సరిఅయిన దందనలు విశించేవారు. అలా సంఘంలో ప్రతి సమూహము చక్కగా పనిచేసుకుంటూ వారి వారి ధర్మాలను ఆచరిస్తూ దేశ సంక్షేమానికి తోడ్పడేవారు.

కామకోటి పీఠం పీఠాధిపతిగా మన శాస్త్రాలలో మనకు విధించిన ధర్మాలు మనం ఆచరించాలని మీకు గుర్తు చెయ్యడం నా కర్తవ్యంగా భావిస్తున్నాను. వర్ణాశ్రమ ధర్మాల ప్రకారం వైశ్యులకి ఉపనయన సంస్కారము, వేదాధ్యన అధికారము నిర్దేశించబడ్డాయి. 12 నుండి 24 ఏళ్ళలోపు ఉపనయనం చేసుకుని సంధ్యావందనం తప్పనిసరిగా చేయాలి. వేదమును నేర్చుకుని నిరంతరము దాన్ని ఆమ్నాయం చెయ్యాలి. వేదమును, పురాణాతిహాసాలను చదువుకుని ఋషిఋణం తీర్చుకోవాలి. వైశ్యులకు వర్తకము, వాణిజ్యముతో పాటు ధర్మాచరణము కూడా ముఖ్యమైనదే. మూడు తరములు సంధ్యావందనము వదిలేసిన వారిని వైశ్యులు అనికాక వైశ్య బంధువులు అని పిలవబడుదురు. అలాగే బ్రాహ్మణ క్షత్రియులకు కూడా. అంతేకాక ముందుతరాలకు మన శాస్త్రాలను అందించటం మన కర్తవ్యం.

ఈ పీఠం యొక్క శక్తి భక్తుల అవ్యాజమైన ఆప్యాత అభిమానాలే. వాటినే పునాదిగా నేను పని చేయగలుగుతున్నాను. విదేశీయులను మనదేశం ఆకర్శించునది ఈదేశ సంపద కాదు, ఈ దేశ ప్రభోదించిన ఆధ్యాత్మిక సందేశాలకు వారు ఆకర్శితులవుతున్నారు. మీరు దీన్ని మనసులో పదిలముగా గుర్తుపెట్టుకుని భక్తితో శాస్త్రము చెప్పినట్టుగా బ్రతుకుతూ ఆ పరాశక్తి అనుగ్రహానికి పాత్రులగుదురని, ఆ జగజ్జనని

మీకు ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు ప్రసాదించుగాక!

--- ‘ఆచార్యాస్ కాల్’ చెన్నై కొత్వాల్ బజార్ శ్రీ కన్యకాపరమేశ్వరి దేవాలయంలో స్వామివారి ఉపన్యాసం.

#KanchiParamacharyaVaibhavam #Paramacharya
1/19/18, 16:01 - Paramacharyulu: <Media omitted>
1/20/18, 07:02 - Paramacharyulu: ఉపనయనము

బాలునకు మంత్రములు పలకడానికి, విషయములను అర్థం చేసుకోవడానికి తగిన వయస్సు వచ్చిన వెంటనే ఉపనయనం చేయాలి. ఉపనయనంలో బాలునికి “భిక్షాచర్యం చర" అని చెప్పబడుతుంది. అతడు “బాడం?” అంటూ అలానే చేస్తానని సమ్మతిని తెలియజేస్తాడు. అంటే ఉపనయనానికి ముందు ఆ బాలునికి భిక్షాచర్యం చర అంటే అర్థం చేసుకొనేటంతటి సంస్కృతజ్ఞానమైనా ఉండాలని కదా అర్థం. అయిదో సంవత్సరం విద్యాభ్యాసం చేసి సంస్కృతం ఆరంభిస్తే ఎనిమిదో ఏటికి ఒక మాదిరి సంస్కృత జ్ఞానం కలుగుతుంది. అందువల్లనే ఉపనయనానికి సరి అయిన వయస్సు ఎనిమిది సంవత్సరములుగా నిర్ణయించబడింది. తగినంత సంస్కృత జ్ఞానంతో గాయత్రీ మంత్రం జపించే ఎనిమిదేళ్ళ వటువుల ఉనికి వలన ప్రపంచమునకు ఎంతో లాభం చేకూరుతుంది. దానికి వ్యతిరేకంగా ఈ రోజుల్లో పసి హృదయాలల్లో నిరీశ్వరత్వపు భావనలను చొప్పించేంతటి మార్పు వచ్చేసింది.

ఉపనయనమెందుకు?

ఉప = సమీపమునకు, నయన = చేర్చుట సమీపమునకు చేర్చుట. ఎవరి సమీపమునకు? గురు సమీపమునకు. ఉపనయనమనే పదానికి అర్థమిదే! ఇక్కడ గురువు లెటువంటివారంటే వేదములను సాంగోపాంగంగా అధ్యయనం చేసినవారు. సన్యాసాశ్రమంలో గురువులు అయితే వేదములతో సహా సర్వాన్నీ త్యాగం చేసినవారు మొదటి ఆశ్రమమైన బ్రహ్మచర్యంలో పొందదగినది విద్య చివరిదైన సన్యాసాశ్రమంలో పొందదగినది జ్ఞానము.

ఉపనయనము బ్రహ్మచర్యాశ్రమ ప్రవేశమునకు ఉద్దేశించినదైతే, సమావర్తనము బ్రహ్మచర్య పరిసమాప్తిని ఉద్దేశించినది. సమావర్తనము అంటే తిరిగివచ్చుట అని అర్థం. గురుకులంలో విద్యాభ్యాసం పూర్తిచేసి ఇంటికి తిరిగి రావడమన్నమాట. ఉపనయనము బ్రహ్మచర్యమునకు పూర్వాంగము. బ్రహ్మ అనే పదానికి ఆరు విభిన్నములైన అర్థములున్నాయి. బ్రాహ్మణులు, తపస్సు, పరమాత్మ శివనిష్ఠ్యాది అర్చామూర్తులతో పాటు బ్రహ్మ అని దీర్ఘంగా పలికితే సృష్టికర్త బ్రహ్మ అనే అర్థాలున్నాయి. బ్రహ్మచర్యం అనే పదంలో బ్రహ్మ అనే పదానికి వేదము అని అర్థము. బ్రహ్మచర్యాశ్రమమంతా వేదములను అధ్యయనం చేయడానికి ఉద్దేశించబడింది. వేదములపై అధికారం సంపాదించడానికి కనీసం 12 ఏళ్ళు పడుతుంది.

పరిషేచనము భోజనానికి పూర్వాంగము. అన్నమును అభిమంత్రిసూ గాయత్రీ మంత్రముతో జలం ప్రోక్షించి ఈశ్వరప్రసాదంగా ఆ అన్నాన్ని భుజిస్తాం. పరిషేచన యొక్క అభిప్రాయం ఇది. పరిషేచన చేసిన తరువాత ఈశ్వరప్రసాదమైన అన్నాన్ని తిరస్కరించడం తెలివి తక్కువతనం కదా! అదేవిధంగా ఉపనయనం చేసుకొని వేదాధ్యయనం చేయకపోవడం అవివేకము. ఈ రోజులలో ఉపనయనం చేసుకొని అధిక సంఖ్యాకులు ఆ అవివేకానికి పాల్పడుతున్నారు.

ఒక మంత్రంపై పట్టు సంపాదించడానికి కొన్ని నియమాలున్నాయి. వేదములు ఆధ్యాత్మికోన్నతిని ప్రసాదించే అనేక మంత్రములలో నిండి ఉన్నాయి. అట్టి వేదాధ్యయనమునకు కావలసిన సంపూర్ణమే క్రమశిక్షణగా బ్రహ్మచర్యమును అభివర్ణించవచ్చు.

వేదములో ప్రతిభాగాన్ని అధ్యయనం చేయడానికి కొన్ని ప్రత్యేక నియమాలున్నాయి. ప్రతి వేదము నాలుగు కాండలతో కూడి ఉంటుంది. ఒక్కొక్క కాండ ఒక్కొక్క మహర్షి పేరుతో ముడివేయబడి ఉంటుంది. వారినే కాండర్షులంటారు. బ్రహ్మయజ్ఞములో వారికి ప్రత్యేకమైన తర్పణములున్నాయి. ఆయా కాండలను అధ్యయనం చేసే సమయంలో ఆయా వ్రతములను అనుష్ఠించవలసి ఉన్నవి. ఆ వ్రతముల పేర్లు ప్రాజాపత్యము, సౌమ్యము, అగ్నేయము, వైశ్వదేవములు. ఈ నాల్గు వ్రతములు పూర్తి అయిన తరువాత విద్యాభ్యాసము పూర్తి చేసుకొని గుర్వాజ్ఞత సమావర్తనం చేసుకోవచ్చు. పైన ఉదహరించిన నాలు వ్రతములు యజుర్వేదమునకు సంబంధించినవి. ఋగ్వేదులు మహానామ్ని, మహా, ఉపనిషత్, గోదానవ్రతములను నాలు వ్రతములననుష్ఠించవలసి ఉన్నది.
సమావర్తనమును స్నానమని కూడా అంటారు. ఈ సంస్కారమును చేసుకొన్నవాడు స్నాతకుడు. ప్రతి విద్యార్థి తమ వేదశాఖను అధ్యయనం చేస్తూ మిగతా శాస్త్రములను చదవాలి. ఉపాకర్మతో (శ్రావణపూర్ణిమ) వేదాధ్యయనం పఠనమారంభించి ఉత్సర్జనంతో (పుష్యమాసం) వేదాంగ భాష్యమారంభించాలి. అంటే వేదములు దక్షిణాయనములోనూ, వేదాంగములు ఉత్తరాయణములో అభ్యసించాలన్నమాట.

వేదమంత్రములలో పట్టు సంపాదించడానికి విద్యార్థి బ్రహ్మచర్య నియమములను నిర్దుష్టంగా పాటించాలి. ఈ రోజుల్లో బ్రహ్మచర్యమూ లేదు, వేదాధ్యయనమూ లేదు. పెళ్ళికి ముందు ఒక్క గంటలో స్నాతకవ్రతాన్ని పూర్తి చేసుకొంటారు. ఉపనయనం ముందు ఒకే గంటలో అనేక సంస్కారములు చేస్తున్నారు. సంస్కారములు అర్థం తెలుసుకొని అనుష్ఠించాలి. ఇంకా వేద సంప్రదాయం అక్కడక్కడ నిలిచి ఉంది. కాబట్టే నేనీ మాత్రమైనా చెప్పగలుగుతున్నాను. ఉపనయనము వేదాధ్యయనమునకు విద్యార్థిని ఆయత్తపరుస్తుంది. తద్వారా దైవీశక్తిని ప్రపంచమంతా పరప చేస్తుంది. ఈ ప్రాముఖ్యత గ్రహించి తల్లిదండ్రులు సరి అయిన కాలంలో ఈ సంస్కారాన్ని తమ పుత్రులకు జరిగేట్లు చూడాలి.

(సశేషం)

#KanchiParamacharyaVaibhavam #కంచిపరమాచార్యవైభవం

1/20/18, 15:59 - Paramacharyulu: దేవుడు చేసిన పెళ్ళి

“ఇవాళ మా అమ్మాయి పుట్టినరోజు, తమ ఆశీస్సులు తమ ఆశీస్సులు అర్థిస్తున్నాము”

1967 మే మాసంలో శ్రీవెంకటేశ్వర ఆలయం వద్ద చాతుర్మాస్యం జరుపుతున్న కామకోటి పీఠాధిపతి శ్రీ చంద్రశేఖరేంద్ర సర్స్వతి స్వామివారిని ప్రార్థించాము నేనూ, నా భార్యా, కుమార్తె లక్ష్మిని వెంతబెట్టుకు వెళ్ళి.

మా అమ్మాయి లక్ష్మి విజయవాడ మేరిస్టెల్లా కాలేజీలో ఆ సంవత్సరం బీఏ పూర్తిచేస్తున్నది. కాలేజికి సెలవులు కావడం వల్ల రోజూ స్నేహితురాళ్ళతో కలిసి వేంకటేశ్వర స్వామి గుడికి వెళ్ళి స్వామివారి చేసే చంద్రమౌళీశ్వరుని పూజలు చూస్తుండేది. సాయింత్రం స్వామివారి ప్రవచనాలు వింటూ ఉండేది.

ఉయ్యూరు నివాసులు ఒకరు మా అమ్మాయిని చూసి, నా వద్దకు వచ్చి మాట్లాడారు. విదేశాల్లో ఇంజనీరింగ్ చదువుతున్న వారి అబ్బాయి సెలవుపై స్వదేశానికి తిరిగి వచ్చాడు. వివాహం చేసుకుని తిరిగి ఇంగ్లండుకు వెళదామనుకుంటున్నాడు.

నేను వారితో ఇలా అన్నాను. “మీతో వియ్యమందడానికి మాకు ఇష్టమేగాని, వివాహం విషయంలో నాకు కొన్ని నియమాలున్నవి. వీటిని మీరు అంగికరించవలసి ఉంటుంది. వధూవరుల జాతకాలు సరిపోవాలి. నేనివ్వదలచిన కట్నం మీరు పుచ్చుకోవాలి. అన్నిటినీ మించి, మా గురుదేవులు శ్రీ కామకోటి స్వామివారి అనుమతి లభించాలి”

కాస్త రాయబాఅరం జరిగిన తరువాత ఉభయులకూ అన్నిటిపై సమాధానం కుదిరింది.

స్వామివారప్పుడు ఏలూరులో మకాంలో ఉన్నారు. వెంటనే వెళ్ళి స్వామిని సందర్శించి, జరిగినదంతా సంగ్రహంగా విన్నవించాను. మౌనదీక్షలో ఉంటూనే మంత్రాక్షతలు ప్రసాదించి, వరదాభయహస్తంతో అనుమతించారు.

ముఖ్యబంధువులందరూ ముందుగానె వచ్చారు. మిత్రులన్నిటా సహకరించారు. పెద్దలు పెట్టిన ముహూర్తానికి పెళ్ళి ముచ్చటగా జరిగింది. వేదవిధులూ, పండితులూ వధూవరులను ఆశీర్వదించారు.

తలవని తలంపుగా జరిగిన ఈ కథంతా నెమరు వేసుకుంటే ఇది గురు కటాక్షమే తప్ప, మానవ ప్రయత్నం ఏమాత్రం కాదని నాకు రూఢి అయ్యింది.

ఇది ఒక లీలగా కనిపిస్తే అంతకంటే అద్భుతావహం ఆ తరువాత జరిగిన ఘట్టం.

వివాహం పూర్తి కాగానే నూతన దంపతులకు స్వామి దర్శనం చేయించి, శ్రీవారి ఆశీస్సులు అందజెయ్యాలి అనుకున్నాను. స్వామి అప్పుడు పశ్చిమ గోదావరి జిల్లా క్షణముక్తేశ్వరంలో ఉన్నారని తెలిసింది.

తక్షణం కారులో వధూవరులను వెంటబెట్టుకుని అక్కడికి బయలుదేరాను. ముక్తేశ్వరం చేరేసరికి అప్పుడే గోదావరి దాటడానికి స్వామి సిద్ధంగా ఉన్నట్లు తెలిసింది. డ్రైవరు కారు వేగం హెచ్చించాడు. స్వామి పల్లకిలో కూర్చున్నారు. బోయిలు పల్లకిని భుజాలకెత్తుకుని బయలుదేరబోతున్నారు. గబగబా నేను పల్లకి వద్దకు నడిచాను.

నమస్కారం చేసి, “అల్లుణ్ణీ, అమ్మాయినీ వెంటబెట్టుకు వచ్చాను” అన్నాను. మందహాసం చేశారు స్వామి. పల్లకి ఆపారు బోయిలు.

అల్లుడూ, కూతురూ స్వామికి ప్రణమిల్లారు. ఇన్ని అక్షతలు తీసి వరుడి ఉత్తరీయంలో పోశారు. పల్లకి బయలుదేరింది గోదావరి నదికేసి.

మంచిరోజు చూసి వధూవరులిరువురూ ఇంగ్లండుకు పయనమైనారు. ఇంగ్లండుకు చేరినట్టు కేబుల్ కూడా వచ్చింది.

ఆ తరువాత అల్లుడిగారిలో జరిగిన పరిణామమే ఆశ్చర్యజనకం. బాల్యంలో ఉపనయనమప్పుడు పురోహితులవద్ద నేర్చుకుని, ఎన్ని రోజులు సంధ్యవార్చారో ఏమోగాని, ఇంగ్లీషు చదువులు చదివిన ఆధునిక బ్రహ్మచారులు అనేకుల ధోరణిలో, ఈయనగారు కూడా అటుతరువాత సంధ్యకు స్వస్తి చెప్పడం సంభవించింది.

అలాంటి యువకుడు వివాహానంతరం, స్వామిని సందర్శించిన తరువాత విదేశంలో రెండువేళలా సంధ్యవార్చడం ప్రారంభించాడు!

కొంతకాలానికి చదువు ముగిసింది. బొంబైలో ఒక ప్రఖ్యాత ఇంజనీరింగ్ కంపెనీవారు, ఇంగ్లండులో చదివిన ఇంజనీరింగ్ పట్టభద్రులకు తమ కంపెనీలో ఉద్యోగాలిచ్చి ఇండియాకు పిలిపించుకున్నారు. ఈ విధంగా సెలక్టు అయినవారిలో మా అల్లుడు ఒకరు.

స్వదేశానికి తిరిగివచ్చినది మొదలుకుని, ఆయన త్రికాల సంధ్యావందనం, నిత్యాగ్నిహోత్రం చేస్తూ, ఉద్యోగంతో పాటే రోజుకు సుమారు ఆరుగంటలు అనుష్ఠానంలో ఉంటారు.

పలు సంవత్సరాలు విదేశాల్లో నివసించి, వేషభాషల్లో పాశ్చాత్యులను అనుకరిస్తూ వచ్చిన ఈ నవనాగరికునిలో ఈ పరిణామం రావడానికి కారణభూతులెవ్వరో ప్రత్యేకించి నేను చెప్పక్కరలేదు.

స్వామి ప్రకృతి శక్తులను వశపరచుకుంటారు. సృష్టికి ప్రతిసృష్టి చేస్తారు. విశేషించి, మానవ ప్రకృతినే మార్చివేస్తారు. దానవుడు మానవుడవుతాడు. నరుడు నారాయణుడౌతాడు!

--- నీలంరాజు వెంకటశేషయ్య గారి "నడిచే దేవుడు" పుస్తక సౌజన్యంతో

#KanchiParamacharyaVaibhavam #కంచిపరమాచార్యవైభవం
1/21/18, 07:03 - Paramacharyulu: ఉపనయన కాలము

బ్రాహ్మణబాలునకు గర్భాష్టమాల్లో ఉపనయనం జరిపించాలి. అంటే జననాది ఏడు సంవత్సరముల ఏడు నెలల వయస్సు తరువాత అన్నమాట. క్షత్రియునకు పన్నెండేళ్ళకు, వైశ్యబాలునకు పదహారేళ్ళ వయస్సులో ఉపనయనం చేయవచ్చు. బ్రాహ్మణునికి ఉపనయనపు గరిష్ట వయోపరిమి పదహారేళ్ళ అంటే ఎనిమిదేళ్ళు అవకాశమిచ్చారన్నమాట. ఆశ్చర్యంగా అంత దీర్ఘవ్యవధి కూడా సరిపోవడం లేదు. పదహారేళ్ళ లోపుగా ఉపనయనం చేయకపోతే పాపమని చెప్పబడింది. ఉపనయనము ఉత్తరాయణకాలంలోనే జరగాలి. అందులో మాఘమాసం శ్రేష్టంగా ఎంచబడింది. ఎట్టి పరిస్థితులలోను దక్షిణాయనకాలంలో జరగరాదు. ఒకవేళ అలా చేయవలసి వస్తే ఉత్తరాయణ కాలంలో మళ్ళీ ఉపనయనం చేసుకోవాలని నా ఉద్దేశం.

ఈ రోజుల్లో వివాహోపనయనాలు ఎంతో జాప్యం చేయబడి, మార్గశిర మాసం మినహాయించి మిగతా మాసాలలోనూ అనుష్టించబడుతున్నాయి. దుష్ఫలితాలు మనకు కనబడుతూనే ఉన్నాయి. అయినా అసలు వివాహమనే ఒక కార్యక్రమం లాంఛనప్రాయంగానైనా జరుగుతోంది కదా అని సంతోషించాల్సిన విషయం వచ్చేసింది. వివాహానికైనా కొంత సరిపెట్టుకోవచ్చు కానీ, ఉపనయనం మాత్రం ఉత్తరాయణంలో జరగవలసిందే!

చిఱుతప్రాయంలోనే ఎందుకు చేయాలి?
కామం మనస్సులోనికి జొరబడటానికి ముందే బాలుడు గాయత్రీ మంత్రము చేత ప్రభావితుడు కావాలి. ఉపనయన లక్ష్యం గాయత్రీ మంత్రం అనుష్టించి మంత్రశక్తిని అభివృద్ధి పరుచుకోవడం, వేదవేదాంగములను చక్కగా అధ్యయనం చేయడం వంటివి కదా! కామం చేత జయించబడితే మనస్సు లక్ష్యం నుండి ప్రక్కకు మరలించబడుతుంది. అప్పటికే సంపాదించిన కొద్దో గొప్పో మంత్రశక్తి కూడా నశించిపోతుంది. చదువు వెనకంజ వేస్తుంది.

చిఱుతప్రాయంలోనే గాయత్రీ మంత్రోపదేశం పొందిన బాలుడు కామోద్భవం జరిగే వయస్సు వచ్చేనాటికి గాయత్రీ మంత్ర పురశ్చరణ చేత నిరుష్టతను పొందగలుగుతాడు. విద్యలో కొంత స్థాయిని చేరతాడు. గాయత్రి నిండిన మనస్సులో కామానికి చోటుండదు. పదహారేళ్ళ వయస్సులో ఉపనయనమయినవారికి ఇది సాధ్యపడదు.

లక్ష్యసాధనలో ఒక మెట్టెక్కితే పదిమెట్లు దిగజారతాడు. అందువల్లనే ఉపనయనం జరగవలసిన వయస్సు ఎనిమిదిగా నిర్ణయించబడింది. ఈ రోజుల్లో మనం సంస్కారాలను ముఖ్యంగా పరిగణించడం లేదు. అలాగని పూర్తిగా వదిలిపెట్టేసినా ఆశ్చర్యమూ లేదు. ఏదోవిధంగా పూర్తి చేశామనిపించుకొని సంతృప్తిని కొని తెచ్చుకొంటారు. దీనికన్నా నాస్తికుడు నయమనిపిస్తుంది. వానికి కనీసం కొన్ని దృఢమైన అభిప్రాయాలు, నిర్ణయాలు ఉంటాయి. తదనుగుణంగా ప్రవర్తిస్తూ ఉంటాడు.
గాయత్రీ మంత్రజపము బాలునికి మానసిక ధృఢత్వాన్ని తేజస్సునీ, దైహికమైన ఆరోగ్యాన్ని ప్రసాదిస్తుంది. మేధకు పదను పెట్టి ఏకాగ్రతను వృద్ధిపరుస్తుంది. కామవాంఛ అతని దరి చేరదు. వినయాన్ని భగవద్భక్తినీ, ఆత్మ విషయములో ఆసక్తిని ఇనుమడింప చేస్తుంది. ఇంతటి మహోపకారమైన నిధిని తల్లితండ్రులు అకారణంగా తమ పిల్లలకు నిరాకరించడం న్యాయమా!

ఈరోజుల్లో గాయత్రీ జపాన్ని ఉపనయనం రోజున పొరపాటున పదిసార్లు చేస్తారేమో, తరువాత చేయడం మానివేస్తున్నారు. తల్లితండ్రులీ విషయంలో తమ బాధ్యతను పూర్తిగా విస్మరిస్తున్నారు. ప్రాతస్సాయం సంధ్యలలో నిద్రో, క్రికెట్టు పోటీలో, సినిమాలో అంటూ పిల్లలు సమయాన్ని దుర్వినియోగం చేయకుండా సమయానికి సంధ్యావందనానికి కూర్చోపెట్టే బాధ్యత తల్లితండ్రులకున్నది. ఈరోజుల్లో వారే ఆ సమయాలలో ప్రొద్దునైతే మేల్కొని ఉండరు. సాయంకాలం క్లబ్బులకు రేసులకు పోతారు. వారి ఆత్మోన్నత్యం కన్న క్షణికానందాలు ఎక్కువైపోతున్నాయి. కొడుకులను సన్మార్గవర్తులుగా చేయగల నైతికబలం వీరికేదీ? వారి జీవనశైలి ప్రయోజన శూన్యమని అనిపించి బహుశః పిల్లలైనా సన్మార్గంలో నడపాలని వారికే తోస్తే, ఒకవేళ పిల్లలను సంధ్యావందనం చేయమని చెబుతారేమో! కానీ అప్పుడు పిల్లలు వారి మాట వింటారా? నువ్వు చక్కగా రేసులకు వెళుతుంటే నేనెందుకు సంధ్యావందనం చేయాలని అడిగే అవకాశం లేకపోలేదు.

ఇటువంటి దురదృష్టకరమైన పరిస్థితులలో ఈ విషయాల గురించి ఉపన్యాసం చేస్తూ మీ సమయం ఎందుకు వృధా చేస్తున్నానని మీకనిపించవచ్చు. ఏమి చేయాలి? మఠాధిపతిగా నాకు కొన్ని బాధ్యతలున్నాయి. మీ పుత్రులు ఆత్మోన్నతి విషయంలో మీ బాధ్యతను మీకు గురు చేయవలసిన బాధ్యత, దానికోసమై వారికి సకాలంలో ఉపనయనం జరుపమని మిమ్మల్ని పోరే బాధ్యత, ఉపనయనం అయిన పిల్లలు నిత్యమూ సంధ్యావందనం చేసేట్ల చూచే బాధ్యత, ఇటువంటి బాధ్యతలు మీ బాధ్యతలెంతవరకూ మీరు నిర్వర్తిస్తున్నారో అలా ఉంచి నా బాధ్యతా నిర్వహణలో లోటు లేకుండా జాగ్రత్తపడవలసిన భాధ్యత నాకున్నది కదా! దాని పని. వ్బాధ్యత నాకున్నది కదా! దాని ఫలితం ఎంతో కొంత మీమీద ఉండదా?

(సశేషం)

#KanchiParamacharyaVaibhavam #కంచిపరమాచార్యవైభవం
1/21/18, 12:57 - Paramacharyulu: వ్యాధి - వారి దృష్టి

1964లో నా రెండవ కుమారుడు మురళీధరకు ఊపిరి తిత్తులకు సంబంధించిన వ్యాధి కనిపించింది. విజయవాడలో, గుంటూరులో

పేరుగల వైద్యులను సంప్రదించాము. వారు ఎక్స్రే ఫోటోలు తీసి, పరీక్ష చేసారు. శస్త్రచికిత్స అవసరం అన్నారు. రాయవెల్లూరు మిషన్ ఆసుపత్రిలో పనిచేస్తున్న డాక్టర్ గోపీనాథ్ ఈ వ్యాధికి సంబంధించిన శస్త్రచికిత్సలో చాలా నిపుణుడనీ, ఆయనచేత ఆపరేషన్ చేయించ వలసిందని కూడా సలహా ఇచ్చారు.

మురళిని మద్రాసుకు వెంటబెట్టుకు వెళ్ళి ఆకాడ డాక్టరుతో సంప్రదించాను. వారుకోడా ఆపరేషన్ అవసరమేనన్నారు. అదైనా, అరునెలలు దాటకుండా, ఆ గడువులోపల చేయవలసిందని సలహా చెప్పారు. నాకు ఆప్తమిత్రులైన ఒకరిద్దరు వైద్యులు 'ఈ అపరేషన్ అంత ప్రమాదరహితం కాదనీ, ఇతరవిధాల నివారణోపాయం ఏదైనా సాధ్యమయ్యేట్టయితే దాని అనుసరించడం మంచిద'ని సూచించారు.

సందిగ్ధంలో పడ్డాను.

ఇన్నిచోట్ల, ఇంతమంది డాక్టరులు ఆపరేషన్ అవసరమని ఏకగ్రీవంగా అభిప్రాయం వెలిబుచ్చిన తరువాత, వారి సలహా త్రోసివెయ్యడం సాధ్యమా? శ్రేయస్కరమా? అయితే గత్యంతరం?

భగవంతుడి మీద భారంవేసి, రాయవెల్లూరు వెళ్ళాము. డాక్టరు గోపీనాథ్ ను సంప్రదించాము. ఆయన జాగ్రత్తగా పరీక్ష చేసి, ఆపరేషన్ అవసరమేనని, మార్గాంతర 6 లేదని తేల్చిచెప్పారు.

కొద్దిరోజులలో డాక్టరు గోపీనాథ్ రాయవెల్లూరు ఆస్పత్రి వదిలిపెట్టి, ఢిల్లీ వెళుతున్నాడు. వెంటనే కాకపోతే, ఆరునెలలు మించకుండా ఢిల్లీకి రావలసిందని కూడా సలహా ఇచ్చాడు.

తుదకు, ఆపరేషన్ వయిదా వెయ్యకుండా రాయవెల్లూరులోనే, గోపీనాథ్ చేతనే ఆపరేషన్ చేయించుకోవడానికి నిశ్చయం చేసుకున్నాము. అవసరమైన ఏర్పాట్లన్నీ చేశాము.

అయితే ఆపరేషన్ చేయించుకునే ముందు కంచికి వెళ్ళి, శ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతి స్వామిని దర్శించి, వారి ఆశీస్సును పొంది రావాలనుకున్నాను. వెంటనే కారులో నేనూ, నా కుమారుడు రాయవెల్లూరు నుంచి కంచికి బయలుదేరాము. కంచి చేరేసరికి సాయింకాలమైంది.

స్వామి మఠంలో లేరు. సర్వతీర్థం సమీపాన ప్రత్యేకంగా ఒక పాకలో ఉంటున్నారు. మేము సర్వతీర్థం వెళ్ళేసరికి మసకమసగ్గా ఉంది. అనుష్ఠానాదులు ముగించుకుని స్వామి అప్పుడే పాకలో ప్రవేశించబోతున్నారు. స్వామి వెంట ఇద్దరు శిష్యులున్నారు. శిష్యుల ద్వారా మా రాక స్వామికి ఎరిగించాను.

ద్వారం తెరిచి లోపలికి వెళ్ళబోతున్నవారల్లా ఆగి, మావైపు తిరిగి, “ఏమిటి విశేషం” అన్నారు.

నా రెండవ కుమారుడు మురళీధరకు జబ్బు చేసిందని, శస్త్ర చికిత్సకై రాయవెల్లూరు ఆసుపత్రికి వచ్చామని, ఆపరేషన్ కు ముందు తమ ఆశీర్వాదం కోసం కంచి వచ్చామనీ విన్నవించాను.

"ఏమిటి జబ్బు" అని అడిగారు.

"ఊపిరి తిత్తులకు సంబధించిన వ్యాధి. 'బ్రాంక్రియాక్టాసిస్' అంటారు. ఊపిరితిత్తులలో ఎడమ వైపు మచ్చ కనిపించింది ఎక్స్రే తీస్తే" అని అన్నాను.

నకనకలాడే లాంతరు వెలుగులో, ఆ దూరాన్నించే మురళి వక్షస్థలం వైపు చూశారు స్వామి.

“జబ్బు ప్రమాదకరమైనదే అయినా, భయపడవలసిన అవసరం లేదు. ఆపరేషన్ వద్దు. మఠానికి వెళ్ళి ప్రసాదం పుచ్చుకుని, ఇంటికి వెళ్ళండి" అన్నారు. బ్రహ్మదేవుడు ఆయుర్దాయం పొడిగించాడు! ఇద్దరం స్వామికి సాగిలపడి, సెలవు పుచ్చుకుని, మఠంలో ప్రసాదం స్వీకరించి, రాయవెల్లూరు వెళ్ళి గోపీనాథ్ తో, ఆపరేషన్ వాయిదా వేస్తున్నామని చెప్పి, మద్రాసు మీదుగా విజయవాడ చేరాము.

ఇది జరిగి నేటికి(1990) 26 ఏండ్లు గడిచాయి. ప్రధాన ఆంగ్లపత్రికలో ఈ చిరంజీవి పాత్రికేయుడిగా పేరుగడించాడు. అతని వయస్సు ఇప్పుడు 54 సంవత్సరాలు. నైష్ఠిక బ్రహ్మచారి. ఇంతవరకూ మళ్ళా, ఊపిరితిత్తులకు సంబంధించిన వ్యాధి ఏమిటో ఎరగడు.

--- నీలంరాజు వెంకటశేషయ్య గారి "నడిచే దేవుడు" పుస్తక సౌజన్యంతో

#KanchiParamacharyaVaibhavam #Paramacharya
1/21/18, 15:51 - Paramacharyulu: <Media omitted>
1/22/18, 07:02 - Paramacharyulu: ఆలస్యం చేసే ఆచారములు

ఒక ప్రక్క శాస్త్రములలో చెప్పబడిన విధినిషేధములను తమ సౌకర్యానుసారం సరుకు చేయకపోయినా కొన్ని ప్రాంతములలో ప్రచారంలో ఉన్న ఆచారములను మాత్రం శాస్త్ర వాక్యముల కంటే మిన్నగా పరిగణిస్తూ ఉండడం వేడుకగా ఉంటుంది. ఉదాహరణకు అక్కయ్య వివాహం కాకపోతే తమ్మునికి ఉపనయనం చేయరాదన్నది. రెండోది ఒకే ఇంటిలో ముగురు బ్రహ్మచారులుండకూడదన్నది. ఉపనయనాన్ని ఆలస్యం చేయడానికి ఈ ఆచారములు ఉపయోగపడుతున్నాయి. ఆ అలవాట్లు, ఆచారాలు, ఆయా ప్రాంతములలో సౌకర్యాలననుసరించి వచ్చి

ఉండవచ్చు. అవి ధర్మశాస్త్ర వ్యతిరేకం కానంతవరకూ పాటించడానికీ అభ్యంతరం ఉండనక్కరలేదు.

అపస్తంబులు తమ ధర్మశాస్త్రం ముగిస్తూ నేను ఇంతవరకూ నిబంధించిన నియమములు సంపూర్ణము కాదు. ఇంకా అనేకం మిగిలి ఉండవచ్చు. అవి ఆయా ప్రాంతాలలోని ఆచారాల ప్రకారం స్త్రీలను, నాల్గవ వర్ణముల వారి నుండి కూడా తెలుసుకొని అనుష్టించవచ్చు అని చెబుతారు. అయితే అపస్తంబులవారికి ధర్మశాస్త్ర వ్యతిరేకమైన ప్రవర్తన అభిమతం కాదని గుర్తించాలి.

ఉపనయన సంస్కారాలు ఏదో కారణము చెప్పి ఆలస్యము చేయరాదు. కూతురికి వివాహం చేయడానికి అనేక అడ్డంకులుండవచ్చు (సరియైన సంబంధం కుదరకపోవడం, డబ్బు సమకూరకపోవడం వంటివి). ఈ కారణంగా ఉపనయనాన్ని ఆలస్యం చేయరాదు.

కామ్యోపనయనము

కొన్ని సందర్భాలలో పిల్లవాని అయిదేళ్ళ వయస్సులోనే ఉపనయనం జరుగుతుంది. దీనిని కామ్యోపనయనమంటారు. అంటే ఒక కోరికను ఉద్దేశించి చేసేది అని అర్థం. కొంతమంది పిల్లలు అయిదేళ్ళకే మాటలన్నీస్పష్టంగా పలకడమే కాకుండా ప్రతిభా సమన్వితులై ఉంటారు. ఆదిశంకర భగవత్పాదుల వారటువంటి వారు. వారికి అయిదేళ్ళకే ఉపనయనం జరిగింది. అయితే సామాన్య బాలుర విషయంలో గర్భాష్టమాలలో ఉపనయనం చేయడమే శాస్త్ర సమ్మతం.

దుబారా ఖర్చులు

ఉపనయనము ముఖ్యోద్దేశము గ్రహించి సకాలంలో ఉపనయనం చేసి గాయత్రిని ఉపదేశించి వీలయినంతైనా వేదాధ్యయనం జరిగే ఏర్పాటు చూడటానికి బదులు, ఉపనయనాన్ని పెద్ద వేడుకగా మార్చి పెద్ద ఎత్తున జరపాలనుకొని, డబ్బులు సమకూరక అసలుకే మోసం తెస్తున్నారు. శ్రీమఠంలోనూ, ఇంకా అనేక సంస్థలలోనూ సామూహిక ఉపనయనాలు జరిపిస్తున్నారు. గాయత్రీ మంత్రానికి స్మార్త, వైష్ణవ, మధ్వాది భేదములు లేవు కదా! ఇలాంటి సామూహిక ఉపనయనాల్లో చేరి తమ పుత్రుల ఉపనయనాలు చేసుకోవచ్చు. ధనికులు ఇది తమ హోదాకు భంగమనుకోవచ్చు. కానీ డబ్బు ఎంత ఖర్చు చేస్తున్నామన్నది కాదు ముఖ్యం. సంస్కారాలలో దేనికీ కూడా అత్యధికమైన ధనం అవసరం లేదు. ఉన్నంతలో పొదుపుగా ముఖ్యమైనదేమిటో గ్రహించి ఆ కర్మల అనుష్టానం చేయడం సర్వులకూ శ్రేయోదాయకం. అలా మిగిలించిన ద్రవ్యాన్ని ఇష్టాపూర్తములకు, ధార్మిక కార్యక్రమములకు ఉపయోగించవచ్చు.

(సశేషం)

#KanchiParamacharyaVaibhavam #కంచిపరమాచార్యవైభవం
1/22/18, 18:23 - Paramacharyulu: 'భక్తుడెందు చనిన పరతెంతు వెనువెంట'

కొందరు భక్తుల అనుభవంలో ఉన్న మరొక విశేషం స్వామిని దర్శించడానికి ఎక్కడి నుండి బయలుదేరినా, ఏ వేళ బయలుదేరినా, ఆ ప్రయాణం నిర్విఘ్నంగా కొనసాగుతుంది. స్వామి దర్శనానికి వెళ్ళే భక్తులు మంచిరోజూ, మంచి ముహూర్తం కూడా వెతుక్కోరు. అయినా, ప్రయాఅనంలో ఏ ఆటంకాలు ఎదురుకావు.

అనుకున్న రైలు అందుతుంది. రైలులో చోటు దొరుకుతుంది. ఒక్కొక్కప్పుడు, సంచారంలో స్వామి ఏ మారుమూల గ్రామంలోనో మకాం చేస్తారు. ఆ గ్రామానికి రైలు ఉండదు. బస్సులో పోవలసివస్తుంది. కొంత దూరం నడవవలసిన అవసరం కూడా ఉంటుంది. అయినప్పటికి విఘ్నం లేకుండా ప్రయాణం సాగుతుంది. రైలు ఆలస్యంగా రావటం వల్ల బస్సు దొరకదేమో అనుకుంటే, ఆ రోజున ఏ కారణం చేతనో బస్సు కూడా ఆలస్యంగా బయలుదేరుతుంది. ఇదంతా వింత కాదు. వినోదమూ కాదు. సహజంగా జరుగుతుంది.

కాఫీ, టీలు సేవించటంచేతా, వేళకు ఆహార నిద్రలు లేకపోవటం వల్ల, ఇంకా ఏవేవో ఇతర అలవాట్లకు బానిసలు కావడం మూలాంగా, ఈ కాలంలో అనేకమందిని అనేక రకాలైన రుగ్మతలు వెంటాడుతూ ఉంటాయి. ఇల్లు విడిచి వెడితే వాటివల్ల మరీ ఇబ్బంది పడుతుంటారు. కాని, స్వామి దర్శనానికి బయలుదేరగానే ఆ బాధలన్నీ సమసి పోవడమో లేదా బహుపరిమితంగా కనిపించడమో జరుగుతుంది. తిరిగి ఇంటికి చేరుకునే వరకు అవి వారి జోలికి రావు.

ఇదంతా ప్రత్యక్ష అనుభవమే కాని, ఊహాజనితం కాదు, మనస్తత్వపు మార్పు కాదు.

థాయిలాండ్ దేశపు రాజ గురువు పూజ్య వామదేవముని, వారి అనుయాయులతో భారతదేశం విచ్చేసారు. స్వామి విజయవాడలో ఉండగా 1968 అక్టోబరు 14వ తేదీన అక్కడికి వచ్చి స్వామిని దర్శించారు.

స్వామిని దర్శించినప్పుడు తమ పూర్వీకులు, తమ తాత ముత్తాతలు స్వామిలో తమకు ప్రత్యక్షమైనట్టు తోచిందని అన్నారు శ్రీ దేవముని.

స్వామిని సందర్శించి, స్వామితో సంభాషించి, స్వామి చేతిలో ప్రసాదం స్వీకరించి, స్వామి వద్ద సెలవు పుచ్చుకొని, ఒక నెల రోజులపాటు భార్తదేశమంతా తిరిగి దివ్యక్షేత్రాలను దర్శనీయమైన ప్రసిద్ధ స్థలాలను వీక్షించారు.

తమ పర్యటాన అంతా ముగిసిన తరువాత రాజగురువు ఇలా అన్నారు.

"నెలరోజులు మేము చేసిన దేశ పర్యటనలో స్వామి మా వెంట ఉండి మాకు ఏ విధమైన అసౌకర్యమూ లేకుండా, ప్రతి చిన్న విషయంలోనూ మాకు సాయపడినట్టు స్పష్టంగా తోచింది

విజయపురి, నాగార్జున సాగర్, తిరుపతి, కంచి, మద్రాసు, మథుర, ఢిల్లీ, ఆగ్రా, హరిద్వార్, హృషీకేష్, అయోధ్యా, సారణార్థ్, గయ, నలంద, కలకత్తా ఈ స్థలాలన్నిటా, ప్రత్యక్షంగానో, పరోక్షంగానో స్వామితో మాకు సంబంధం ఏర్పడింది...
స్వామి నామం, స్వామి రూపం, స్వామి దండం, స్వామి పాదుకద్వయం. . . ఇవన్నీ నా హృదయసీమల్లో స్థిరంగా చోటుచేసుకున్నవి!”

--- నీలంరాజు వెంకటశేషయ్య గారి "నడిచే దేవుడు" పుస్తక సౌజన్యంతో

#KanchiParamacharyaVaibhavam #Paramacharya
1/23/18, 07:25 - Paramacharyulu: బ్రహ్మచర్యాశ్రమము

ఉపనయనము బ్రహ్మచర్యమునకు పూర్వాంగమనీ, బ్రహ్మచర్యము వేదాధ్యయనమునకు ఉద్దేశించబడినదనీ చెప్పకొన్నాము. ఉపనయనముతో బాలుడు గురుకులం చేరతాడు. ఆ కాలంలో ఈ రోజుల్లోలా గురువులు జీతాలకు పనిచేసేవారు కారు. గురుకులం చేరిన శిష్యులు గురువుకు, గురుపత్నికి శుశ్రూష చేసూ గురుకులాల్లో ఉండిపోయేవారు. భిక్షాచర్యం చేసి, భిక్షాన్నాన్ని గురువుకై సమర్పించేవాడు. ఆయన అనుమతితో సగభాగం లవణక్షారవర్జితంగా భుజించేవారు. అన్నముంటే చాలు. పాలు పోసుకొని భుజించవచ్చు. భిక్షాచర్యం, లవణక్షారవర్జితమైన భోజనం, భోజనానికై గురువుపై ఆధారపడడం అనే మూడు లక్షణాలు గురుకులవాసంలో ఉండేవి. తామే బిచ్చమెత్తుకొచ్చినా, ఆహారం కోసం, వసతి కోసం గురువులపై ఆధారపడవలసిందే! అందువలన భయభక్తులుండేవి. ఆ భక్తిమూలంగా విద్య శీఘ్రంగా అలవడేది. అహంకారికి విద్య అలవడదు. విద్య వినయాన్ని ప్రసాదిస్తుంది. చక్రవర్తి కుమారుడైనా భిక్షాన్నం తింటూ గురుకులవాసం చేయవలసిందే! అయితే బ్రహ్మచారికి ఆహార పరిమాణంలో ఒక నియతి లేదు. ఉపవాసము కూడదు. బ్రహ్మచర్యంలో రోజూ సంధ్యావందనంతో పాటు అగ్ని కార్యం విధిగా చెప్పబడి ఉంది. బ్రాహ్మణుడైతే పలాశదండమూ, క్షత్రియుడైతే అశ్వత్థదండం, వైశ్యుడైతే ఔదుంబర దండమూ దగ్గర ఉంచుకోవాలి. దండం తాను మననం చేసే శ్రుతి మంత్రముల ధారణ కోసం, వేద మంత్రముల శక్తిని ధారణ శక్తి ఆ దండానికున్నది. బ్రహ్మచారికి కృష్ణాజినము ఉత్తరీయం. ఉత్తరీయానికి వేరే వస్త్రం వాడరాదు. వేదాధ్యయనం యజుర్వేదము అయితే శ్రావణ పూర్ణిమ నాడు ప్రారంభించాలి. మాఘమాసంలో ఉత్సర్జనవ్రతం చేసుకొని వేదాంగాలు అభ్యసించాలి. ఇప్పుడు ఉత్సర్జనవ్రతం చేయడం లేదు. దానిని చేయనందుకే “కామోకారిషీత్" మంత్రాన్ని జపిస్తున్నాము. "నా కామము క్రోధము మాత్రమే పాపం చేస్తున్నాయి. నేను పాపం చేయడం లేదు. ఈ పాపం నన్నంటదని" ఆ మంత్రార్థం.

ఉపనయనం మొదలు స్నాతకం వరకూ ఉండే బ్రహ్మచర్యవ్రత మధ్యలో నాలుగు వేదవ్రతములనుష్టించవలసి ఉన్నది. ఈ రకంగా కాల నియమం, వ్రత నియమం, ఆహారనియమాలతో వేదాధ్యయనం చేయడమే బ్రహ్మచర్యవ్రతం. వేదాభ్యాసంలో స్వరలోపము, వర్ణలోపము మొదలైన లోపాలు ఏర్పడవచ్చు. దానికి ప్రాయశ్చిత్తంగా శ్రావణపూర్ణిమనాడు నువ్వులు మాత్రం భుజించి, ఆనాడంతా ఉపవాసం చేసి మరుసటినాడు 1008 సమిధలతో గాయత్రీ మంత్రముతో హోమము చేయాలి. ఈ హోమము ఇప్పుడు ఉపనయనమయిన మొదటి శ్రావణపూర్ణిమ నాడు మాత్రమే చేస్తున్నారు. కొందరు మరుసటినాడు గాయత్రీ జపం మాత్రం చేస్తున్నారు. ఒట్టి జపం చేస్తే నిద్ర రావచ్చు. పలాశసమిధలతో హోమం చేయాలి. "మిధ్యాతీతప్రాయశ్చిత్తం" అని సంకల్పం చేయాలి. పలాశలు దొరకకపోతే అశ్వత్థ సమిధలో, దర్భలో ఉపయోగించవచ్చు. ఈవిధంగా చతుర్దశ విద్యలలో అధికారం సంపాదించి వ్రతములన్నీ పూర్తి చేసుకొన్న బ్రహ్మచారి గురువుగారి అనుమతితో సమావర్తనం చేసుకోవాలి.

'ఆచార్యాయ ప్రియంధనమాహృత్య ప్రజాతంతుంమా వ్యవత్సేత్సీః" అని తైతీరియోపనిషత్తు చెబుతున్నది. ఆచార్యునికి ప్రియమైన ధనం ఇచ్చి పిదప పెళ్ళి చేసుకో – ప్రజాతంతువు వేదరక్షణకై ఏర్పడింది. దానిని తెంపవద్దు - అని దీని భావం. వేదవిద్యనభ్యసించిన తరువాత గురువుగారు కోరిన ధనమీయాలి. తనవద్ద లేకపోతే యాచన చేసి ఈయవచ్చు. గురువులు కూడా శిష్యుని సమర్థతననుసరించే కదా కోరుతారు. గురుదక్షిణకై డబ్బులడిగిన వారికి ఆ రోజుల్లో ఎవరైనా ధనమిచ్చేవారు. భారతంలో గురుదక్షిణకై రత్నకుండలాలు తెచ్చి ఇచ్చిన ఉపాఖ్యానం ఉన్నది. కృష్ణపరమాత్మ గురుదక్షిణగా చనిపోయిన గురుపుత్రునే తెచ్చి ఇచ్చాడు.

(సశేషం)

#KanchiParamacharyaVaibhavam #కంచిపరమాచార్యవైభవం
1/23/18, 13:32 - Paramacharyulu: అలా వచ్చింది నా పేరు

డాక్టర్ చంద్రశేఖర్ ఠాకూర్ బొంబైలో సుప్రసిద్ధ ఆయుర్వేద భిషగ్వరుడు. మహారాష్ట్ర, గుజరాత్ ప్రాంతాలలో వివిధ రంగాలకు చెందిన ప్రముఖులనేకులకు చికిత్సలు చేసి, ఘన వైద్యుడుగా పేరు పొందినవాడు.

ఆయుర్వేదంలో పరిశోధనలు సలిపి, వాటిని పత్రికలలో ప్రచురించి విఖ్యాతిగాంచిన విద్యావేత్త. పలుమార్లు విదేశాలలో సంచరించి ఆయుర్వేద ప్రాశస్త్యాన్ని చాటిన ఘనుడు.

1987 లో కార్యాంతరంపై నేను బొంబై వెళ్ళినప్పుడు డాక్టర్ చంద్రశేఖర్ ఠాకూర్ చూడడం తటస్థించింది. ఆయుర్వేదాన్ని గురించి, వనమూలికలను గురించి, ‘ఇండియన్ ఎక్స్ ప్రెస్’ పత్రికలో డాక్టర్ చంద్రశేఖర్ వ్రాసిన వ్యాసాలను గురించీ ఇరువురం కొంతసేపు మాట్లాడుకున్నాము.

ప్రసంగవశాత్తు, కొన్ని సంవత్సరాలుగా ప్రోస్టేట్ గ్లాండ్ వ్యాధి నన్ను అంటిపెట్టుకుని ఉన్నదని, శస్త్రచికిత్స ద్వారా దానిని నివారించుకొనవలసిందని సర్జనులనేకులు సలహా ఇచ్చారనీ, అయినప్పటికీ, గురువు ఆదేశాన్ననుసరించి సర్జనుల సలహాను నేను పాటించలేదనీ, అందువల్ల ఇప్పటివరకూ నాకేవిధమైన అసౌకర్యంగాని, బాధగాని కలగలేదనీ ఆయనతో చెప్పాను.

"ఓహో, అలానా? ఆ గురువు ఎవరు? వారి పేరు?" అని అడిగారు

"కంచి కామకోటి పీఠాధిపతి శ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతి స్వామి" అని చెప్పాను.

జగద్గురు శంకరాచార్యులు వారే కదా?

ఔను, రెండువేల సంవత్సరాలకు పూర్వం ఆదిశంకర భగవత్పాదులు స్థాపించిన కామకోటి పీఠంలో 68వ ఆచార్య పురుషులుగా ఆ పీఠాన్ని అధిరోహించిన మహనీయులు.

సరి, సరి, నా పేరూ చంద్రశేఖరే! నా తండ్రిగారు నాకీ పేరు ఎలా పెట్టారో చెప్పమంటారా?

చెప్పండి వింటాను అన్నాన్నేను.

అప్పటికి నేనింకా పుట్టలేదు. మా తండ్రిగారు శంకరాచార్య స్వామి వారిని సందర్శించారు. మీకొక పుత్రుడు కలుగుతాడు, అతడు పెరిగి పెద్దవాడై ఆయుర్వేద వైద్యుడిగా పేరు ప్రఖ్యాతులు గడిస్తాడు, అంటూ స్వామివారు నా తండ్రిని ఆశీర్వదించారట!

ఈ విషయమంతా నా తండ్రిగారు తన డైరీలో రాసుకున్నారు. ఇప్పటికీ అది నావద్ద ఉంది. అందుకే నాకీపేరు పెట్టుకున్నారు – అంటూ ఆనందంతో తాండవం చేశాడు ఆ 'చంద్రశేఖరు'డు!

--- నీలంరాజు వెంకటశేషయ్య గారి "నడిచే దేవుడు" పుస్తక సౌజన్యంతో

#KanchiParamacharyaVaibhavam #Paramacharya
1/23/18, 16:05 - Paramacharyulu: <Media omitted>
1/24/18, 07:03 - Paramacharyulu: సంధ్యావందనము

"గాయంతం త్రాయతే యస్మత్ గాయత్రీ త్యభిధీయతే" గానం చేసేవారిని కాపాడేది గాయత్రి. ఇక్కడ గాయంతం అనే మాట పాట పాడమనే అర్థంలో వాడలేదు. భక్తిశ్రద్ధలతో సుస్వరంగా ఉచ్చరించడం అనే అర్థంలో వాడబడింది. గాయత్రిని ఈవిధంగా జపించినవారు రక్షించబడతారు. ఈ మంత్రాన్ని గురించి వేదములు "గాయత్రీం ఛందసాం మాతా!" అంటూ సుతించాయి. ఛందస్సు అంటే వేదములు అని అర్థం. గాయత్రి వేదమంత్రములన్నిటికీ తల్లి వంటిదని వేదమే చెబుతోంది. ఈ మంత్రము ఎనిమిదేసి అక్షరాలతో కూడిన మూడు పాదములు అంటే మొత్తం ఇరవైనాలు అక్షరములతో కూడినది. అందుకే దీనిని "త్రిపదాగాయత్రీ" అంటారు. ఒక్కొక్క పాదము ఒక్కొక్క వేదము యొక్కసారము. అథర్వణ వేదమునకు వేరే గాయత్రి ఉన్నది. ఆ గాయత్రిని పొందడానికి ప్రత్యేకంగా వేరే ఉపనయనము చేసుకోవలసి ఉన్నది. ఈ త్రిపదా గాయత్రి ఋుగ్యజస్సామ వేదముల సారము. మనుస్మృతి 'త్రిభ్య ఏవతు వేదేభ్యః పాదమ్ పదమదూదుహమ్" అని చెబుతుంది. గాయత్రి ఒక్కొక్క పాదం ఒక్కొక్క వేదం నుండి గ్రహించబడినదన్నమాట. వైదికమైనవన్నీ పరిత్యజించాము. ఇక గాయత్రీ మంత్రాన్ని కూడా వదిలేస్తే మనగతేం కాను?
గాయత్రిని మూడు తరాలబాటు జపించడం మానివేసిన బ్రాహ్మణ కుటుంబం కులాన్ని కోల్పోతుంది. అట్టి కుటుంబం నివసించే ప్రదేశాన్ని అగ్రహారమని పిలవరాదు. గాయత్రిని వదిలి మూడు తరాలయినట్లు లేదు. ఇంకా అందరూ బ్రాహ్మణులుగా పిలవబడుతున్నారు. మూడు తరములు యజ్ఞం చేయకపోతే దౌర్బాహ్మణ్యం వస్తుందని శాస్త్రం. పతితుడైనా బ్రహ్మణుడన్నపేరు పోలేదు. మళ్ళీ ప్రాయశ్చిత్తాదులు చేసుకొని, యజ్ఞాలు చేసి సద్బ్రాహ్మణుడవచ్చు. గాయత్రి విషయమలా కాదు. మూడు తరములు గాయత్రిని జపించనివారికి తిరిగి బ్రహ్మణులయ్యే అవకాశమే లేదు. వారు బ్రహ్మ బంధువులు మాత్రమే. ఇదే నియమం క్షత్రవైశ్యులకు కూడా వర్తిస్తుంది. ఎంత అనాచారమొచ్చిపడినా ఇంకా గాయత్రి అనే అగ్నికణం నివురుగప్పి మిణుకు మంటూనే ఉన్నది. ఆ నిప్పురవ్వను అలానే వదిలేస్తే ప్రయోజనము ఉండదు. దానిని పరిరక్షించి వృద్ధిచేస్తే, మహాగ్నిజ్వాలగా పరిణతి చెంది మనలను సంరక్షించుతుంది. అట్టి శక్తి దానికున్నది. ఆ పెన్నిధిని కాపాడుకొనే బాధ్యత మనకున్నది. ఆదివారాలైనా యజ్ఞోపవీతధారులందరూ సహస్ర గాయత్రీ జపం చేయాలి. ఆ గాయత్రీ జ్వాల ప్రకాశవంతంగా ఉండటానికి శౌచనియమాలను పాటించాలి. అశౌచమైన జనం, అశౌచమైన ప్రదేశాలకు పోవడం వంటివి పరిహరించాలి. కర్మలోప ప్రాయశ్చిత్తం చేసుకొని కర్మిష్టులమయి కర్మ శుద్ధంగా ఉండేట్లు జాగ్రత్త పడాలి. శరీరాన్ని మనస్సును పరిశుద్ధంగా ఉంచుకొన్నప్పుడే మంత్రశక్తి పెంపొందడానికి అనువుగా ఉంటుంది. ఎంతటి కష్టకాలంలోనైనా సరే గాయత్రిని కనీసం పదిసార్లైనా జపించాలి.

మూడు సంధ్యాకాలాల్లోనూ సంధ్యావందనం చేయవలసి ఉన్నది. ఉదయ సంధ్యలో జీవులన్నీ నిద్రలేస్తాయి. మనస్సు ప్రశాంతంగా ఉండి ఏకాగ్రతకు అనువుగా ఉంటుంది. సాయంకాలం జీవులు అంతా పడిన శ్రమ తరువాత ఇల్లు చేరి ప్రశాంతతను పొందుతాయి. సూర్యుడు నడినెత్తిన చేరిన సమయంలో ప్రకృతి నిశ్శబ్దంగా ఉంటుంది. ఈ సమయాలలో శాంతంగా వరుసగా గాయత్రి, సావిత్రి, సరస్వతీ దేవతలను ధ్యానించాలి. ఉదయం విష్ణుప్రధానమైనది. మధ్యాహ్నం బ్రహ్మస్వరూపిణిగానూ, సాయంత్రం శివస్వరూపిణిగాను గాయత్రిని ధ్యానించాలి. ఈ మూడు కలిసి సమిష్టి గాయత్రి. గాయత్రి అన్ని వైదిక మంత్రముల శక్తులను కలిగి ఉన్నది. ఇది మిగతా మంత్రములకు శక్తినిస్తుంది. గాయత్రీ అనుష్ఠానం చేయకుండా మరి ఏ ఇతర మంత్రముల జపం చేసినా అవి పూర్ణ ఫలితాన్నీయజాలవు. ఆశలనూ, కోరికలనూ అణచివేసి జన్మ సాఫల్యతను ప్రసాదించే హిప్నాటిక్ శక్తి గాయత్రీ మంత్రమునకున్నది. ప్రస్తుతం నివురుగప్పి ఉన్న గాయత్రి అనే నిప్పకణికను పెంచి ప్రవృద్ధం చేయాలి. గాయత్రి జపమును ఒక వ్రతంగా చేపట్టాలి. మన శరీరమును శౌచంగా ఉంచుకొని అశాస్త్రీయమైన నడవడిని మార్చుకొంటేకానీ ఈ అగ్ని ప్రజ్వలన జరగదు. నంధ్యావందనములో గాయత్రీ జపము అర్ఘ్యప్రదానము ముఖ్యమైనవి. మిగతావన్నీ అంగాలు. లేవలేని స్థితిలో కూడా కనీసం అర్ఘ్యత్రయ ప్రదానం, గాయత్రి జపం (కనీసం పదిసార్లయినా) వదలకూడదు. ఈ రెండే ముఖ్యమైనవి కాబట్టి, మిగతావి వదిలేస్తే కాలక్రమంలో ఈ రెండూ కూడా వదిలేస్తాము. "రోగగ్రస్తులకుద్దేశించిన సంధ్యావందనం చేస్తే మనమూ రోగగ్రస్తులయినట్లే కదా అర్థం" అంటారు ప్రముఖ విద్వాంసులొకరు. సంధ్యావందనం విధివత్తుగా సకాలంలో చేయాలి.

మహాభారతయుద్ధంలో సంధ్యాకాలంలో యుద్ధంలో ఉండవలసి వచ్చిన వీరులు, సకాలంలో మన్నుతో అర్ఘ్యమిచ్చారని చెప్పబడి ఉంది. ఒకరికి విపరీతమైన జ్వరం కాస్తే, అతనికి పరిచర్య చేసేవారు అతని తరపున సంధ్యావందనం చేసి ఆ జలం అతనికి తీర్థంగా ఈయాలి. రోగి తాను సంధ్యవార్చలేని సందర్భంలో ఎవరికైనా తన తరపున సంధ్యావందనం చేసి తీర్థమివ్వమని అర్థించాలి.

ఈరోజుల్లో అందరికీ జ్వరం కాస్తున్నట్లున్నది. అలా చూచుకొన్నా జ్వరానికి మందులు వేసుకోవాలి కదా! ఆ మందు గాయత్రీ జపం. గాయత్రీ జపాన్ని వదలరాదు. భౌతికమైన శరీరానికి వేసుకొనే మందు కంటే అంతరంగానికి మందు ఎక్కువ అవసరం. శరీరానికి మందేయాలంటే డబ్బు ఖర్చవుతుంది. అంతరంగికమైన మందుకు ఒక చెంబుడు నీళ్ళు మాత్రమే కదా అవసరం! ఈ పెట్టుబడి నీ జీవితమంతా నిన్న భద్రంగా చూచి నీకు ఆధ్యాత్మికోన్నతిని ప్రసాదిస్తుంది. ఎంత చౌక బేరమో చూడండి! శరీరంలో ప్రాణం ఉన్నంతవరకూ, సంధ్యావందనాన్ని గాయత్రీ జపాన్ని వదిలిపెట్టరాదు.
గాయత్రిని తల్లిగా ప్రార్థించాలి. పరమేశ్వరుడు పరమమైన దయను అనుగ్రహాన్ని ప్రసాదించడానికి అనేక రూపాలలో దర్శనమిస్తూ ఉంటాడు. అయితే తల్లికన్న ప్రేమించేవారు వేరొకరుండరు కదా! అమ్మతో మాట్లాడడానికి మనకు భయం సంకోచం అనేవి ఉండవు. భగవంతుని అన్ని రూపాలలోనూ తల్లిగా అవతరించిన రూపం మనలో ఎంతో మందికి ఇష్టంగా ఉంటుంది. వేదములు గాయత్రిని తల్లిగా అభివర్ణించాయి.

పురుషుడు మాత్రమే మంత్రానుష్ఠానం చేస్తాడు. స్త్రీలు పురుషుని జపం వలన లాభం పొందుతున్నారు. అలాగే మూడు వర్ణాలవారు గాయత్రీజపము మూలముగా అన్ని జాతులవారు లాభము పొందుతారు. మన కోసం మనం ఏదైనా పని ఆరంభించితే కోరుకొన్న ఫలితం సిద్ధించిన చాలులే అని సంతృప్తిపడవచ్చు. కానీ ఆ కార్యం వలన వచ్చే ఫలంలో భాగమున్నపుడు ఆ పనిని జాగ్రత్తగా యథావిధిగా చేసి తీరవలసిందే కదా! గాయత్రీ మంత్రం జపించే మూడు వర్ణముల పురుషులు శ్రేయస్సుకై ముఖ్యంగా స్త్రీలు, ఇతర జాతులవారి తరుపున పనిచేస్తున్న ధర్మకర్తలవంటివారు. వారి విధి వారు సక్రమంగా పాటించకపోతే దిద్దుకోలేని తప్పు చేస్తున్నవారవుతున్నారు.
మంత్రానుష్ఠానం చేసేముందు ఆ మంత్రపు ఛందస్సు, ఋషి, దేవత ఏ ప్రయోజనం కోసం ఆ మంత్రానుష్ఠానం చేనున్నామనే విషయములు చెప్పకొంటాము. గాయత్రీ మంత్రపు ప్రయోజనం చిత్తశుద్ధితో మిగతా మంత్రాలను అనుష్టించినా ఈ ఫలితం సిద్ధించవచ్చు అయితే గాయత్రీ మంత్రమునకు నేరుగా సిద్ధించే ఫలమిది.

ఆఫీసులకు వెళ్ళేవారికి క్రూడా ప్రాతః సాయంకాలములు సంధ్యావందనము చేయడం ఇబ్బంది కాదు. మధ్యాహ్నిక సంధ్యావందనం ఆఫీసులో ఉండటం వలన ముఖ్యకాలంలో చేయలేకపోతే సూర్యోదయమునకు 2గం|| 24 ని|ల తరువాత చేయవచ్చు. దానిని సంగమ కాలమంటారు.

ఈ మంత్రజ్వాల ఎప్పటికీ చల్లారిపోరాదనీ, మరింత కాంతివంతంగా ప్రకాశిసూ ఉండాలనీ మనమందరము ఆ పరమేశ్వరుడ్డి ప్రార్థించాలి.

(సశేషం)

#KanchiParamacharyaVaibhavam #కంచిపరమాచార్యవైభవం
1/24/18, 16:09 - Paramacharyulu: వింత శిక్ష

కంచిమఠాన్ని అంటిపెట్టుకుని ఎందరో పరిచారకులున్నారు. వేదాధ్యయనపరులు, జమాఖర్చు లెక్కలు రాసేవారు, ఉత్తర ప్రత్యుత్తరాలు చూసేవారు, వంటవాళ్ళు, పశువులను కాచేవాళ్ళు, కావలి వాళ్ళు, మేళగాళ్ళు మొదలైన వారంతా.

వీరందరూ తప్పకుండా, గుణవంతులూ, శీలవంతులూ అని చెప్పడానికి వీలులేదు. ఉత్తమ, మధ్యమ తరగతులున్నవి. ముఖంమీద విభూతి రేఖలున్నంత మాత్రాన, అందరిలో అపరిగ్రహ లక్షణాలన్నీ గూడకట్టుకు ఉన్నవనుకోవడానికి వీలులేదు.

రోజా ఇంత అనుష్టానంతో, అతిథి సత్కారంతో, వుద్వద్గోష్టులతో, వివిధ విషయ చర్చలతో మునిగితేలుతూ ఉన్నా, మఠం వ్యవహారాలకు సంబంధించిన మంచి చెడ్డలు స్వామికి తెలియకుండా ఉండవు. అయితే, వాటిని పరిష్కరించడంలో ఆయన అవలంబించే పద్ధతులు వేరు. అవి మనకు అసాధారణంగా, ఆశ్చర్యజనకంగా తోచవచ్చు.

ఉదాహరణకు, భిక్షలు చేసేవారు ఎంత ఖరీదైనా పెట్టి భిక్షకు కావలసిన సామాగ్రి అంతా సమృద్ధిగా, శ్రేష్టమైనదిగా ఎంచి తెస్తారు. ఏ వస్తువూ చాలలేదే అని అతిథులు అనుకోరాదు. అది ఆతిథ్యం ఇచ్చేవారి ఆశయం.

అయితే ఒక్కొక్కప్పుడు భిక్షకు తెచ్చిన వస్తువులన్నీ వంతలోకి రావు. ఈ సంగతి స్వామి ఎలాగో కనిపెడతారు. భోజనాలు అయిన తరువాత వంటచేసిన వాళ్ళు, వినేటట్టు, “ఇవాళ పాయసంలో జీడిపప్పు అంతగా కనిపించలేదే! ధర ఎక్కువగా ఉన్నదని బహుశా జీడిపప్పు తగ్గించి తెచ్చి ఉండాలి. లడ్డూలలో పచ్చ కర్పూరం వాసన రావడం లేదు. దానిని వెయ్యడం మనవాళ్ళు మరచిపోయి ఉండవచ్చు” అంటూ మృదువుగా, వ్యంగంగా మందలిస్తారు.

ఆ మర్నాటి నుండి శాకపాకాలన్నింటిలో అన్ని వస్తువులూ సమృద్ధిగా ఉంటాయి.

ఒకరోజున మఠం పరిచారకుడు ఒకరు తన తల కింద చిన్నమూట పెట్టుకుని నిద్రపోతున్నాడు. ఆ మూటలో ఏమున్నదోనని మేస్త్రీ మూట విప్పి చూశాడు. మూడు పడుల మినప్పప్పు కనిపించింది. ఆ సంగతి స్వామికి వినిపించాడు మేస్త్రీ.

మేస్త్రీ చెప్పినదంతా స్వామి విన్నారు . చివరకు ఇలా అన్నారు “ఆ పరిచారకుడికి మినప్పిండితో చేసే వడాలంటే చాలా ఇష్టం కావచ్చు. మఠంలో వడలు చేసినప్పుడు అతనికి కావలసినన్ని వడ్డించి ఉండరు. ఒక పనిచెయ్యండి. ఆ మూడు పడుల మినప్పప్పు బాగా మెత్తగా

రుబ్బి, అందులో అల్లం, పచ్చిమిరపకాయ, జీలకర్ర మొదలైన వస్తువులన్నీ దండిగా వేసి, చాలినంత నూనె పోసి, ఆ పరిచారకుడు ఎన్ని తింటే అన్ని వడ్డించండి. అతడు తృప్తిగా భోంచెయ్యాలి".

అది మొదలు ఆ సేవకుడు ఇంకెన్నడూ అలాంటి పనులకు దిగకుండా తన ప్రవర్తనను దిద్దుకున్నాడు.

విజయవాడలో ఒకనాడు కృష్ణానదిలో స్నానం చెయ్యబోతూ, మఠం పరిపాలనను గురించి పక్కనున్న వారితో స్వామి ఇలా అన్నారట "మఠం అన్నంత మాత్రాన మఠంలో ఉన్న వారందరూ సత్యహరిశ్చంద్రులు అనుకోనక్కరలేదు. ఒడ్డునుంచి చూస్తే కృష్ణ నీరు నిర్మలంగా కనిపిస్తుంది. నీటిలో దిగి కొంత దూరం వెళితే అడుగునంతా బురదగా ఉంటుంది"

స్వామి వాస్తవిక పరిజ్ఞానం, లోకానుభవం అంతాయింతా కావు. అయితే స్వామి వ్యవహరించే తీరు మాత్రం వేరు.

--- నీలంరాజు వెంకటశేషయ్య గారి "నడిచే దేవుడు" పుస్తక సౌజన్యంతో

#KanchiParamacharyaVaibhavam #Paramacharya
1/25/18, 07:34 - Paramacharyulu: ప్రాణాయామం

అస్త్రశస్త్రాలనే రెండు రకాలైన ఆయుధాలను చెప్పింది. ఖడ్గము, బాణముల వంటి ఆయుధాలు శస్త్రములని పిలవబడతాయి. మంత్రపూర్వకంగా ఉపయోగించేవి అస్త్రం. దర్భపుల్లను తీసుకొని తగిన మంత్రంతో అభిమంత్రించి వదిలితే అది శస్త్రముల కంటే శక్తివంతమైన ఆయుధమవుతుంది. ఎవరినుద్దేశించి లేదా దేనినుద్దేశించి ఆ అస్త్ర ప్రయోగం చేశారో అక్కడ సర్వనాశనం జరుగుతుంది. ద్విజులు అనుదినమూ ప్రయోగించవలసిన అస్త్రమొకటి ఉంది. అది అసురనాశనార్థము మంత్రించబడిన అస్త్రము. ఆ అస్త్రము వలన మన బుద్ధిని ఆశ్రయించుకొని ఉన్న అసురశక్తులన్నీ మాయమైపోతాయి. ఆ అస్త్రప్రయోగమే అర్ఘ్యప్రదానము. అర్ఘ్యప్రదానము చేసేటప్పుడు నా పాపములు చెడువర్తనము నశించుగాక అవి నా హృదయసీమలో ప్రకాశించే జ్ఞానభాస్కరుని ప్రకాశానికి ప్రతిబంధకాలై ఉన్నాయి. అవి తొలగిపోవాలి. జ్ఞానసూర్యుడు నాలోని తమస్సును పోగొట్టి సహస్రకిరణాలతో ఒక్కుమ్మడిగా జాజ్వల్యమానంగా ప్రకాశించాలి" అన్నభావంతో మనస్సును ఏకాగ్రంగా ఉంచుకొని చేయాలి.

ఎవరైనా ఒక పని ఉత్సుకతతో మనస్ఫూర్తిగా చేస్తే ఊపిరి బిగపెట్టుకొని ఆ పని చేశాడని చెప్తాము. సంధ్యావందనం నిజంగా ఊపిరి బిగపట్టుకొని (ప్రాణాయామంతో) చేయవలసిన కార్యం. అలా చేస్తే అంతశ్శత్రువులైన కామక్రోధాదులు నశించిపోతాయి. ఈరోజుల్లో ప్రాణానాయామ్య అనగానే మనం ముక్కు పట్టుకుంటాము. ఊరికే ముక్కు పట్టుకోవడం కాదు కావలసింది. శాస్త్రములు నాసికాయామ్య అని చెప్పలేదు. ఉచ్ఛ్వాస నిశ్వాసములను నియంత్రించాలి. ప్రాణాన్ని-జీవశక్తిని నియంత్రించాలి. ఇదంతా ఏకాగ్రతతో సాధించవలసి యున్నది. ఎంత చిత్తైకాగ్రత ఉంటే నీటిని అస్త్రంగా మార్చేశక్తి ఆవిర్భవిస్తుంది. ప్రాణాయామం యొక్క ప్రయోజనమిదే. ఉచ్ఛ్వాస నిశ్వాసముల నియంత్రణ ద్వారా చిత్తైకాగ్రత ఎలా సిద్ధిస్తుంది? పరమాశ్చర్యమో, పెద్ద దుఃఖమో వచ్చినపుడు నిర్ఘాంతపోతాం. ఒక్క క్షణం ఊపిరి నిలిచిపోతుంది. తరువాత వేగంగా ఊపిరి తీసుకోవడం మొదలుపెడతాం. కావాలని మనము ఊపిరి ఆపలేదు. అది సంకల్పితంగా జరిగింది. దీనిని బట్టి ఊపిరి ఆగడానికి చిత్తైకాగ్రతకు సంబంధమున్నదని అర్థం అవుతోంది కదా! దుర్భేద్యమైన మన అంతశశ్రువులను జయించడానికి ఉపయోగించే మహాస్త్రాన్ని ప్రయోగించడానికి ప్రాణాయామంతో ఈ చిత్తైకాగ్రత్యతను సంపాదించాలి.

ప్రాణాయామపు అభ్యాసం ద్వారా మానసిక ఏకాగ్రత పొందవచ్చు. ఇది యోగమునకు ముఖ్యము. అధిక ప్రమాణంలో అభ్యాసం చేయడము కష్టము. అది గురు పర్యవేక్షణలో జరగాలి. సంధ్యావందనంలో పదిసార్లే ప్రాణాయామం చేస్తారు. కొన్ని కర్మల ముందుగా మూడుసార్లు ప్రాణాయామం చేస్తారు. పరిమితంగానైనా నిరంతరం శ్రద్ధతో చేసే ఈ ప్రాణాయామం క్షేమం ప్రసాదిస్తుంది. ఉపనయనమాదిగా ప్రతివారూ నిరంతరం విధివిధానంగా సంధ్యావందనంలో ప్రాణాయామం చేసి ఉన్నట్లయితే దేశం ఈపాటికి వేలాదిగా యోగివరులు ఉండేవారు. సంధ్యావందనాంగంగా ప్రాణాయామం చేసేటపుడు ముప్పై సెకన్ల కన్న గాలిని కుంభించరాదు. ఉచ్ఛ్వాస నిశ్వాసాలు నిలచిపోతే మనస్సు నిలిచిపోతుంది. ఆలాంటి ఏకాగ్రస్థితిలో అర్ఘ్యం వదిలితే అంతశశ్రువులు నిస్సందేహంగా తరిమివేయబడతాయి.

మనలోని చెడు శక్తుల నాశనానికి అర్ఘ్యం వదిలిన తరువాత ప్రశాంతచిత్తంలో గాయత్రీ జపం చేయాలి. వీలయినంతవరకూ - శక్త్యానుసారం - ఉచ్ఛ్వాస నిశ్వాసాలను నియంత్రణం చేయడం, గాలిని కుంభించి ఉంచడం చేస్తే చాలు. సంకల్పం, మార్జనం, అర్ఘ్యప్రదానం, జపం, స్తోత్రం, అభివాదం ఇవన్నీ పరమేశ్వరానుగ్రహం కోసం చేసేవే! వీటన్నిటికి ముఖ్యంగా ప్రాణాయామం చేయాలి.

శాస్త్రములు రోగిష్టులను కూడా మూడుసార్లు ప్రాణాయామం చేయమని చెబుతున్నాయి. దీనివల్ల ప్రాణాయామం కష్టమైనది కాదనీ సులభసాధ్యమనీ అర్థమవుతుంది. దీర్ఘాయుస్సు దీని అవాంతరల ప్రయోజనంగా చెప్పబడింది. అభివాదంలో ఏ బ్రహ్మర్షుల పరంపరలో మనం ఉద్భవించామో ఆ ఋషి పేరు చెప్పకొంటున్నాం. ఆ బ్రహ్మర్షి నుండి ప్రవర్థమానమైన శాఖల మూలపురుషులైన ఋషుల పేర్లు కూడా సంస్మరించబడుతున్నాయి. అందుకే మనకు ఏకార్షేయం, పంచార్షేయం, సప్తార్షేయములైన గోత్రములున్నవి. ఆ మహర్షుల వంశపరంపరకు చెందినవారమైనందువల్లనైనా మనం వైదిక కర్మానుష్ఠానం చేయాలి. మన పూర్వీకులైన ఋషులు దీర్ఘకాలం సంధ్యావందనమును అనుష్టించడం ద్వారా జ్ఞానులై బ్రహ్మతేజస్సులో ఆధ్యాత్మికౌన్నత్యంతో జీవించారట. ఈ విషయం మనుస్మృతిలో ఈ క్రింది శ్లోకం వివరిస్తుంది.

ఋషయో దీర్ఘ సంధ్యత్వాద్దీర్ఘమాయు రవాప్నుయుః
ప్రజ్ఞాం యశశ్చ కీర్తించ బ్రహ్మవర్చసమేవచ

మన నిర్లక్ష్యము చేత తరతరములుగా వస్తున్న సంప్రదాయ తంతువును తెంపి వేయరాదు. సంధ్యావందనం కర్మ, భక్తి, యోగ, జ్ఞాన

మార్గముల సముచ్చయము. సంధ్యావందనమును అర్థం ఎరిగి భక్తి విశ్వాసములతో పరమేశ్వరాధనగా అనుష్టించాలి.

#KanchiParamacharyaVaibhavam #కంచిపరమాచార్యవైభవం
1/25/18, 15:19 - Paramacharyulu: పరమార్థ మార్గంలో పరమ నాస్తికుడు

అనుదినం స్వామిని దర్శించడానికి వచ్చే అశేష ప్రజలలో ఆర్తులూ, అర్థార్థులూ ఎందరో ఉంటారు. ఒకరికి రోగం నయం కావాలి. ఒకరికి దరిద్రం పోవాలి. ఒక యువతికి వివాహం కావాలి. ఒక యువడికి ఉద్యోగం కావాలి. ఒక తండ్రికి బిడ్డలు కలగాలి. మరొకరికి వ్యాపారం కలిసి రావాలి.

ఎన్నో కోరికలు! స్వామి అనుగ్రహంతో భక్తుల కర్మవిపాకం కావడంతో, వారి వారి కోరికలు నెరవేరుతూ ఉంటాయి.

అయితే వీటన్నిటికీ మించినది, ఉత్తమోత్తమైనది మనిషి ప్రకృతినే మార్చివేసి పరమ నాస్తికుని భగవద్భక్తునిగా  చేయజాలినదీ స్వామి దివ్యశక్తి!...

అందుకు ఒక నిదర్శనం.

అప్పుడు నేను భద్రాచలానికి రెండు మైళ్ళ దూరాన “బిల్వవనం”లో నివసిస్తున్నాను. ప్రకాశం జిల్లా పరుచూరు కాపుస్థుడు శ్రీ గండు సిద్ధయ్య అనే వ్యక్తి దగ్గరనుండి నాకొక ఉత్తరం వచ్చింది.

కొందరు పెద్దలను సన్మానించడానికి తమ ఊరిలో ఒక సభ ఏర్పాటుచేస్తున్నానని, ఆ సభకు వచ్చి తమ సన్మానాన్ని అందుకోవలసినదిగా మరీ కోరుతున్నాననీ ఉన్నది ఆ ఉత్తరంలో.

సిద్ధయ్య గారెవరో అంతకుపూర్వం నాకు తెలియదు. ఎందుకు నాకీ సన్మానం తలపెట్టారొ నేనెరుగను. అదీగాక ఆయనగారు సన్మానసభకు నన్ను అహ్వానించిన నాడే భద్రాచలంలో శ్రీ రామచంద్రస్వామి దేవాలయ ధర్మకర్తల సమావేశంలో నేను పాల్గొనవలసి ఉన్నది.

ఈ కారణాలన్నింటిని పురస్కరించుకుని పరుచూరు లో జరిగే సన్మాన సభకు రాజాలనందుకు నన్ను క్షమించండి” అంటూ సిద్ధయ్య గారికి జాబు రాశాను.

అయినా ఆ “గండు” వారు నన్ను వదలలేదు. సభకు చాలా పెద్దయెత్తున సన్నాహం చేశామనీ, చుట్టుపక్కల గ్రామాలక్కూడా తెలియజేశామని, ఎలాగైనా వీలు చూసుకుని ఆ ఒక్కపూట పరుచూరు లో ఉందవలసిందనీ, ఏ కారణం చేతనైనా అది సాధ్యం కాకపోతే ఫోటో అయినా పంపవలసిందంటూ గట్టిగా పట్టుకున్నారు “గండు” వారు.

ఆ ఉత్తరం చదువుకుని కాస్త మెత్తబడ్డాను. సిద్ధయ్య గారి ఆహ్వానం కేవలం లాంఛనప్రాయం కాదు, నిజమైన అభిమానంతోనే ఆయన నన్ను ఆహ్వానిస్తున్నారని భావించి, ధర్మకర్తల సభకు హాజరు కాలేనంటూ ఆలయ కార్యనిర్వాహణాధికారికి లేఖ వ్రాసి పరుచూరు సభకు బయలుదేరాను.

సభ నిండుగా జరిగింది. పరిసర గ్రామాల నుంచి కూడా ప్రజలు విచ్చేశారు. పండితులను సభలో సన్మానించారు.

అయితే – “ఆంధ్రప్రభ” సంపాదక పదవి నుంచి విరమించుకుని, భద్రాచలంలో సీతారాములను సేవించుకుంటూ రాజకీయాలకూ, పత్రికారంగానికీ, ప్రజాజీవితానికీ దూరంగా ఉన్న నన్ను ఈ సిద్ధయ్యగారు ఇంత పట్టుబట్టి పరుచూరుకు ఎందుకు రప్పించాలి? అసలు నాకీ సన్మానం ఎందుకు తలపెట్టాలి? ఈ ప్రశ్నలకు సమాధానంగా ఒక కథ ఉన్నది. ఆ కథ శ్రీగండు సిద్ధయ్య గారికీ, ఆయన రాజకీయాలకూ, ఆయన జీవితంలో జరిగిన కొన్ని వింత వింత పరిణామాలకు సంబంధించినది.

ఆ కథ: శ్రీగండు సిద్ధయ్యగారు పరుచూరులో పేరుమోసిన కమ్యూనిస్టు. ఒక్క పరుచూరులోనే కాక చుట్టుప్రక్కల ఆ ప్రాంతం అంతట్లో కమ్యూనిస్టు పార్టీ ప్రధాన కార్యకర్తగా ఈయన పేరు మారుమ్రోగుతూ ఉండేది. భయమో, భక్తో ఆ రోజుల్లో సిద్ధయ్యగారి మాట పార్టీలో, ప్రజల్లో బాగా చలామణి అవుతుండేది.

ఒకనాడు సిద్ధయ్య గారు హోటల్లో కూచుని కాఫీ సేవిస్తూ “ప్రభ” ఆదివారం పత్రిక చూస్తున్నారు. అందులో కంచి కామకోటి పీఠాధిపతి శ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతీ స్వామి ఫోటో ఆయన కంటపడింది. ఏ వేళావిశేషమో, ఆ బొమ్మ ఆయన్ను ఆకర్షించింది. అది మొదలు వారం వారం “ప్రభ”లో కంచిస్వామి బోధనలు చదవడం మెదలుపెట్టారు.

నిత్యం కమ్యూనిస్టు కార్యక్రమంలో మునిగి తేలుతూ ఉండే సిద్ధయ్య గారి మనస్సును ఏదో తెలియని శక్తి స్వామి మీదకు మళ్ళించింది. ఆదివారం “ఆంధ్రప్రభ” రావడం ఆలస్యమైతే సిద్ధయ్య గారికి స్థిరబుద్ధి ఉండేది కాదు.

రాను రాను ఆయనలో అదివరలోకెన్నడూ లేని, ఎవరూ ఊహించని మార్పు వచ్చింది. అంతటితో ఆయన రాజకీయాలకు స్వస్తి చెప్పారు. పార్టీకి విడాకులిచ్చారు. ఆ ప్రాంతమంతటా ప్రసిద్ధి కెక్కిన కమ్యూనిస్టునాయకుడల్లా కామకోటి పీఠానికి ప్రియశిష్యుడైనాడు.

అయితే మరి నాకు సన్మానం ఎందుకూ?

నా సంపాదకత్వం క్రింద వెలువడిన “ఆంధ్రప్రభ” లో కంచి స్వామి ఫోటోలు చూసి, స్వామి ఉపన్యాసాలు చదివి వాటిచే ప్రభావితుండైనందున, మార్క్సిస్టు రాజకీయాల నుంచి మతం వేపు మారడానికి పరోక్షంగా నేను కారకుణ్ణి కావడం చేత నన్ను సన్మానించాలని ఆయన సంకల్పమట.

అందరి కథలూ ఇలా గ్రంథస్తం కాకపోయినా గండు సిద్ధయ్య గారి వంటి స్వామి భక్తులు దేశంలో ఇంకా ఎందరో!

--- నీలంరాజు వెంకటశేషయ్య గారి "నడిచే దేవుడు" పుస్తక సౌజన్యంతో

#KanchiParamacharyaVaibhavam #Paramacharya
1/25/18, 16:01 - Paramacharyulu: □□□□□□□□□□□
Dear members

Please don't reply or post anything
□□□□□□□□□□□
1/26/18, 07:10 - Paramacharyulu: శివాజి గణేశన్ ఔదార్యం

మీరు ‘తిరువరుత్ చల్వర్’ సినిమాలో అప్పర్ (63 నాయనార్లలోని నాల్వర్లు సుందర్, అప్పర్, జ్ఞానసంబంధర్, మాణిక్యవాచకర్ లలో ఒకరు) గా చేశారు. ఆ దృశ్యాలు ఇప్పటికీ మామనస్సులో ముద్రవేశాయి. ఈ పాత్ర చెయ్యడానికి మీకు కంచి పరమాచార్య స్వామివారు ప్రేరేపణ అని చెప్పారు కదా! అది కొంచం వివరిస్తారా? అని ఒక పాత్రికేయుడు శివాజి గణేశన్ ని అడిగాడు.

నటనలో రాణించాలంటే నటులకు సూక్ష్మపరిశీలన చాలా అవసరం అని నా అభిప్రాయం. నేను నా చుట్టూ ఉన్న పరిసరాలని, వ్యక్తులని బాగా గమనిస్తుంటాను. నేను అప్పర్ గా నటించాను కాబట్టి, ఒక పాతకాలంనాటి శివభక్తుని గుణాలను చూపించాలి, అతని వేషధారణ, ఆహార్యము మొదలైనవి.

పరమాచార్య స్వామివారు నన్ను దర్శనానికి రమ్మన్నారని నాకు ఒకరోజు శంకరమఠం నుండి కబురు వచ్చింది. అప్పుడు స్వామివారు మైలాపూర్ లోని మఠంలో ఉన్నారు. నాకు సరిగ్గా గుర్తుంటే ఆ మఠం కర్పగాంబళ్ కళ్యాణమంటపం పక్కనే ఉంటుంది.

నేను, నా భార్య, అమ్మానాన్న నలుగురం కలిసి స్వామివారి దర్శనానికి వెళ్ళాము. మేము మఠానికి వెళ్ళగానే మమ్మల్ని ఒక గదిలో కూర్చోమని చెప్పారు. దాదాపు ఒక గంటసేపు ఉన్నాము అనుకుంటా. అప్పుడు స్వామివారి ఎదో ఉపన్యాసం చెబుతున్నారు. హఠాత్తుగా కరెంటు పోవడంతో అంతా గాఅఢాంధకారంగా మారిపోయింది.

స్వామివారు చేతిలో ఒక చిన్న దీపంతో మమ్మల్ని వెతుక్కుంటూ వచ్చారు. నిదానంగా కూర్చుని కళ్ళపైన చేతులనుంచుకొని మా వైపు చూస్తున్నారు.

”నువ్వు శివాజి గణేశన్ కదూ?” అని అడిగారు.

”అవును స్వామి నేనే” అని బదులిచ్చి నేలపై పడి స్వామివారికి సాష్టాంగం చేసి వారి ఆశీస్సులు తీసుకున్నాను. అమ్మానాన్న, నా భార్య కూడా స్వామికి నమస్కరించారు.

“మిమ్మల్నందరిని చూడటం చాలా సంతోషంగా ఉంది” అన్నారు స్వామి. తారువాత స్వామివారు:

“నేను తిరుపతి, తిరువణ్ణైక్కావల్, తంజావూరులోని పున్నైనల్లూర్ మారియమ్మన్ దేవాలయం వంటి చోట్లకి వెళ్ళినప్పుడు ఆలయ ధర్మకర్తలు నాకు ఏనుగుల చేత పుష్పమాలలు వేయించారు. దేవస్థానానికి ఈ ఏనుగులని ఎవరు ఇచ్చారు అని అడిగగా వారు ‘శివాజి గణేశన్’ అని చెప్పారు.

దేశంలో చాలామంది ధనవంతులున్నారు. ప్రచారం కోసం వారు దేవాలయాలకు ధనం ఇస్తారు. కాని దేవాలయాలకు ఏనుగులను ఇవ్వాలంటే దానికి ఉదారమైన గుణం ఉండాలి. అది నీలో ఉంది.

నిన్ను కన్న నీ తల్లితండ్రులు అదృష్టవంతులు. మీ తల్లితండ్రుల కోసం నేను భగవంతుణ్ణి ప్రార్థిస్తాను.” అని చెప్పి స్వామివారు లేచి లోపలికి వెళ్ళారు.

ఆ సమయంలో నేను ఎంత ఆనందానికి లోనయ్యుంటానో ఆలోచించండి. ఎంతటి ఆశ్చర్యకరమైన అనుగ్రహం అది! అలోచించండి ఒకసారి.

చెప్పలంటే నాకు జీవితంలో భయం అనేది లేదు. భయం అన్నది నేనెరుగను. ప్రత్యేకించి నాకు స్వామివారి అనుగ్రహం ఉన్నప్పుడు నేనెందుకు భయపడాలి. అంతా వారు చూసుకుంటారు.

బహుశా ఈ సంఘటన నాపైన ప్రభావం చూపింది అనుకుంటా. స్వామివారు అలవాట్లని చాలా క్షుణ్ణంగా గమనించాను. కాబట్టి ఆ సూక్ష్మ పరిశీలన వల్లే ఆ సినిమాలో అప్పర్ లా నటించగలిగాను.

--- 'నడిగర్ తిలగమ్' శివాజి గణేశన్ ఆత్మకథ నుండి

#KanchiParamacharyaVaibhavam #కంచిపరమాచార్యవైభవం
1/26/18, 19:52 - Paramacharyulu: మహామాఖం – అనారోగ్యం

దక్షిణాదిన కుంభకోణంలో పన్నెండు సంవత్సరాలకు ఒకసారి 'మహామాఖం' మహోత్సవం జరుగుతుంది. 1956 లో ఆ ఉత్సవం ఫిబ్రవరి 25 వ తేదీన తటస్థించింది. ఆనాడు కుంభకోణంలోని మహామాఖ తటాకంలో స్నానాలు చెయ్యడం పాపనోదకమని, మహా పుణ్యప్రదమనీ హిందువులంతా విశ్వసిస్తారు.

కంచి నుండి కాలినడకన కుంభకోణం వెళ్ళి, ఆనాడా పవిత్రోదకంలో మునిగి, కంచికి తిరిగి రావాలని స్వామి వారు అభిలషించారు. కాని, అప్పటికే కొన్ని నెలల కిందటి నుంచి స్వామివారి ఆరోగ్యం అంత బాగుండటం లేదు. ఆ స్థితిలో కంచి నుండి కుంభకోణానికి షుమారు 165 మైళ్ళు కాలినడకన ప్రయాణం చెయ్యడం ఆయన ఆరోగ్యానికి మంచిది కాదని శిష్యులు ఆందోళన చెందారు.

ఏమి చేద్దామా అని యోచించి, తుదకొక పథకం నిర్ణయించారు. మద్రాసు నుండి ఒక ఘన వైద్యుణ్ణి కంచికి పిలిపించాలని, ఆయన చేత స్వామి వారి దేహస్థితి పరీక్ష చేయించాలనీ నిశ్చయించారు.

1956 జనవరిలో ఒక ఆదివారం నాడు ఆ భిషగ్వరుడు ఆధునిక పరికరాలన్నింటితో కంచికి బయలుదేరి వచ్చాడు. మద్రాసు నుండి మరికొందరు స్వామి శిష్యులు కూడా ఆయనవెంట వచ్చారు. అత్యంత అధునాతన పరికరాలతో దాదాపు అరగంటసేపు స్వామి వారి దేహస్థితిని అమూలాగ్రంగా డాక్టరు పరీక్ష చేశాడు.

పరీక్ష ఫలితంగా తాను కనుగొన్న విషయాల గురించి, ఆరోగ్యం బాగయ్యేందుకు గాను ఇకమీదట స్వామి అనుసరించవలసిన స్వామి కార్యక్రమం గురించి వివరించడానికి డాక్టరు సంసిద్ధుడైనాడు.

ఇంతలో డాక్టరు చెప్పబోయే మాటలకు స్వామి అడ్డువచ్చి నిదానంగా మంద స్వరంతో చిన్నపిల్లవాడిలా ఇలా అన్నారు;

"నా దేహస్థితి గురించి ఇప్పుడు మీరు ఏమి చెప్పబోతున్నారో, దానిని మీకు నేను వినిపిస్తాను, వింటారా?"

స్వామి మాటలు విని చుట్టూ మూగిన వారంతా ఆశ్చర్యంతో స్వామి ఏమి చెప్పబోతున్నారో అని చెవులు నిక్కబొడుచుకొని వినడానికి సిద్ధమయ్యారు.

పరమాచార్య స్వామి వారు చెప్పడం మొదలుపెట్టారు; "స్వామికి పయోరియా అనే పండ్ల జబ్బు ఉన్నది. అందుకుగాను కొన్ని దంతాలను పీకించవలసి ఉంటుంది." ఇది మీరివ్వదలచిన మొదటి సలహా. ఒకవేళ అది నిజమే కావచ్చు, కాని, అలా ఆ దంతాలను లాగివేస్తే ఇక నేను మంత్రాలను సక్రమంగా ఉచ్చరించలేను.

పోతే, ఇక నా ఊపిరితిత్తులు రెంటిలో ఒకటి సరిగా పని చెయ్యడం లేదని మీరు చెప్పదలచుకున్నారు. ఇప్పుడు కాదు, 1930 నుండే అది ఆ స్థితిలో ఉన్నది.

దానికో కథ ఉంది. ఒక రోజున నేను చాలా వేగంగా నడిచాను. ఆనాడు నేనొక నదీ తీరాన నడుస్తూ ఉండగా వానా, సుడిగాలి వచ్చాయి. వాటిని తప్పించుకోవాలనే ఉద్దేశంతో వడిగా నడవటమే గాక, కాస్త దూరం పరుగెత్తాను కూడా. ఇది 1930 సంవత్సరం మాట.

తరువాత నా పొత్తికడుపు పేగు విషయానికి వస్తే, తరచుగా నేను చేసే ఉపవాసాల వల్లా వేళాపాళా లేకుండా అకాల భోజనాదుల వల్లా నా పొత్తికడుపులో ఒక పేగు సరిగా పనిచెయ్యడంలేదు అని మీరు కనిపెట్టారు.

ఇంతేగాక నా ఎదురు రొమ్ములో రక్తం గడ్డకట్టుకు పోయింది.

మీరు చెప్పదలచినదంతా మీకు నేను సరిగ్గా వినిపించానా? ఏమైనా పొరబడినానా?" అని అడిగారు స్వామి.

మద్రాసు నుంచి ప్రత్యేకంగా రప్పించబడిన ఆ వైద్య ప్రవీణుడూ, ఆయనను వెంటబెట్టుకుని వచ్చిన పెద్దలూ, అక్కడే ఉండి స్వామి మాటలు వింటున్న తదితరులూ, అంతా దిగ్భ్రమ చెందారు. ఒక్కరికీ నోటమాట రాలేదు. ఏమి చెప్పాలో ఎవ్వరికీ తెలియలేదు.

డాక్టరు మహాశయుడు మాత్రం మఠం ఉద్యోగులనుద్దేశించి "స్వామికి మంచి ఆహారం, వేళకు భోజనం, పూర్తి విశ్రాంతి ఈ మూడూ చాలా అవసరం" అంటూ సలహా ఇచ్చి, స్వామికి నమస్కరించి, తన సామానంతా సర్దుకుని, తిరిగి మద్రాసుకు బయలుదేరాడు.

ఏమైతేనేం, ఆ సంవత్సరం మాత్రం స్వామి కుంభకోణం ప్రయాణం చెయ్యడానికి వీలు లేదని శిష్యులంతా పట్టుబట్టారు. వారి మాటలను కాదనలేక, ఆ ఏడు స్వామి కుంభకోణం ప్రయాణం రద్దుచేసుకుని కంచిలోనే ఉండిపోయారు. మహామాఖంనాడు కుంభకోణం నుంచి కారులో పవిత్రోదకాలు తెప్పించి స్వామిని ఆ నీటితో స్నానం చేయించారు.

కొన్ని వారాలు గడిచిన పిమ్మట, ఏ వైద్య సహాయమూ లేకుండా, స్వామికి ఎప్పటివలె మామూలు ఆరోగ్యం చేకూరింది.

బ్రహ్మమును తెలుసుకుని బ్రహ్మమునందు రమించే జ్ఞానులకు కొత్తగా పుణ్యము పాపము అంటదు. కేవలం మిగిలిపోయిన ప్రారబ్ధకర్మను అనుభవించడానికే వారు శరీరులై ఉంటారు. అయినా వారు కేవలం సాక్షిభూతులై ఉంటారు తప్ప శరీరానికి వచ్చిన బాధ వారి ఆత్మానందానికి అడ్డుకాదు.

--- నీలంరాజు వెంకటశేషయ్య గారి "నడిచే దేవుడు" పుస్తక సౌజన్యంతో

#KanchiParamacharyaVaibhavam #Paramacharya
1/27/18, 07:08 - Paramacharyulu: ఆంజనేయ స్వామివారి తోక

చెన్నైలోని నంగనల్లూర్ శ్రీ ఆరుళ్ మిగు ఆది వ్యాధి హర భక్త ఆంజనేయ దేవాలయం, ముప్పైరెండు అడుగుల ఏకశిల ఆంజనేయ స్వామి విగ్రహం చాలా ప్రసిద్ధి. నంగనల్లూర్ వాసులైన శ్రీ రమణి అన్న ఈ దేవాయలం కట్టాలని సంకల్పించారు. కంచి మఠానికి వెళ్లి పరమాచార్య స్వామివారి అనుమతి, ఆశీస్సులు పొందారు. చాలా వ్యప్రయాసలకోర్చి ఒక పెద్ద ఏకశిలను వెదికి పట్టుకుని, శిల్పి తన పనిని మొదలుపెట్టాడు. పని మొత్తం పూర్తయిన తరువాత ఒకరోజు ఉదయంవేళ ఆ బృహత్ ఆంజనేయ విగ్రహాన్ని నంగనల్లూర్ కి తెచ్చి దేవాలయం వద్ద ఉంచారు. ప్రతిష్ట పూర్వక అధివాసాలను (ధాన్యాధివాసం, జలాధివాసం. . .) సిద్ధం చేశారు.

ఈలోగా రమణి అన్న కంచికి వెళ్లి ఆంజనేయ స్వామివారు నంగనల్లూరుకు విచ్చేశారు అనే విషయాన్ని తెలిపి, తరువాత జరుగవలసిన కార్యక్రమములను గురించి పరమాచార్య స్వామి వారిని అడగదలిచాడు. వినాయకుని వలె హనుమంతులవారు అంటే కూడా మహాస్వామివారికి ఎక్కువ మక్కువ. స్వామివారు ఆంజనేయ స్వామి విగ్రహం ప్రతి అణువు గురించి అడిగి తెలుసుకున్నారు. స్వామివారికి సంతృప్తి కలిగే విధంగా రమణి అన్న కూడా అన్నింటికీ సంపూర్ణ సమాచారం ఇచ్చారు. చివరగా ఆంజనేయ స్వామివారి తోక గురించి అడిగారు. “స్వామి వారి వాలము గుండ్రని ఆకృతితో తలపై నుండి పక్కలకు ఉంటుంది పెరియవ” అని స్వామివారి ప్రశంసల కోసం చూశాడు. స్వామివారి కాసేపు మౌనంగా ఉండిపోయారు. రమణి అన్న కాస్త దిగులు పడ్డాడు. చివరకు స్వామివారు “ఆంజనేయ స్వామివారి మూర్తి ఎదురుగా శ్రీరాముల వారిని కూడా ప్రతిష్ట చేయ్యదలచుకున్నామని చెప్పావు. కాని రాములవారి ముందు హనుమంతుడు ఎప్పుడూ అలా తోక ఎత్తుకుని నిలబడి ఉండడు” అని చెప్పారు. రమణి అన్న ఆందోళన ఎక్కువ కాసాగింది. “పెరియవ! ఇప్పుడు నేను ఏమి చెయ్యాలి? విగ్రహం మొత్తం తయారయ్యింది. అధివాసాలు కూడా మొదలుపెట్టాము. ప్రతిష్ఠాపన తేది, ముహూర్తం కూడా నిర్ణయం అయ్యింది. ఇప్పుడు ఆ తోకను మారిస్తే అధివాసాలు, కుంబాభిషేకం మరలా చెయ్యాలి. మరి నిర్ణయించిన ముహూర్తానికి ప్రతిష్ట చెయ్యడం కుదరదు కదా! మిరే నాకు ఒక దారి చూపించాలి” అని వేడుకున్నాడు.

మహాస్వామివారు ప్రశాంతంగా ఉన్నారు. రమణి అన్నతో, “నిర్ణయించిన ప్రణాళిక ప్రకారం మీరు ముందుకు వెళ్ళండి. అంతా సర్దుకుంటుంది. ఆంజనేయ స్వామివారే మనల్ని కాపాడుతారు” అని ప్రసాదం ఇచ్చి పంపారు. రమణి అన్న నంగనల్లూరుకు తిరిగొచ్చారు. ఆలోచనలన్నీ తోక చుట్టూనే తిరుగుతున్నాయి. అధివాసాలు ముగిసిన తరువాత, హోమములు, క్రతువులు పూర్తిచేసి, ముహూర్త సమయానికి పీఠంపై స్వామి విగ్రహాన్ని నిలబెట్టడానికి ఒక పెద్ద క్రేన్ తీసుకుని వచ్చారు. అక్కడున్నవారందరూ ఆశ్చర్యపోయే విధంగా ఆంజనేయ స్వామి వారి తోక సరైనచోట తెగి ఉండడం గమనించారు. ఎటువంటి మచ్చాలేకుండా ఎవరో శిల్పి చేసినట్టుగా అగుపిస్తోంది.

రమణి అన్న మరియు ఇతర సంఘ సభ్యుల ఆనందం వర్ణించడానికి కుదురుతుందా? కళ్ళ నిరు వర్షిస్తుండగా అందరూ చేతులు పైకెత్తి కంచి వైపు తిరిగి నమస్కారం చేశారు.

అపార కరుణాసింధుం జ్ఞానదం శాంతరూపిణం
శ్రీ చంద్రశేఖర గురుం ప్రణమామి ముదావహం ॥

--- శ్రీ రమణి అన్న

#KanchiParamacharyaVaibhavam #కంచిపరమాచార్యవైభవం
1/28/18, 07:02 - Paramacharyulu: ఇంక దండంతో పని లేదు

దీపావళి ఇంకా రెండు రోజులుందనగా - శ్రీవారు అప్పటికి ఇంకా అజగరస్థితి మొదలు పెట్టలేదు (దీని గురించి ఈ వ్యాసంలో తరువాత చెప్పబడుతుంది) - శ్రీవారు భిక్ష స్వీకరించలేదు. వారు తమ తుది ప్రస్థానం గురించి చాలా సంకేతాలిచ్చేవారు, మాకే ఏమీ అర్థం కాలేదు.

ధర్మ పాటీ అక్కడకు వచ్చింది.

"ఏమిటి ఈ రోజు విశేషం? ఏం చేస్తున్నావు ?"
"భాగవతం చదువుతున్నాను"
"భాగవతంలో భగవానుడేంచేస్తున్నాడు ?"
"బాలలీల! ఆడుకుంటున్నాడు"
"నీకు తెలుసా ? నేను కూడా ఒక లీల చూపబోతున్నాను", అన్నారు శ్రీవారు. మేము పట్టించుకోలేదు. అది మెదలు, మొదటి ప్రశ్న.

శ్రీవారు భిక్ష స్వీకరించలేదు.  బాగా జ్వరంగా ఉంది. శ్వాస తీసుకునేటప్పుడు పిల్లికూతలు (గురక) వినిపిస్తున్నాయి. బాగా చిక్కిపోయారు. పడుకునే ఉన్నారు. అలాంటి సమయాలలో కన్నన్ మామ మంచి సహాయకుడు. ఏనుగంత బలం ఉందతనికి.  అతని తెలివి మాకు లేదు.

"ఏమిటిది ? శ్రీవారు భిక్ష తీసుకోకపోతే మనం ఒప్పుకోవాలా ? శ్రీవారిని కూర్చోబెట్టండి. తడిగుడ్డతో తుడవండి. విభూతి తీసుకువచ్చి శ్రీవారికి అద్దండి. "

ఆ చెప్పిందంతా చేశాము.  శ్రీవారిని తడిగుడ్డతో తుడిచి, విభూతి నుదిటికి అద్దాము.

"ఒక గిన్నెలో అన్నం కలిపి తీసుకురమ్మని శ్రీకంఠన్ తో చెప్పండి. వెంగుడి డాక్టర్ని పిలవండి. శ్రీవారు చాలా బలహీనంగా ఉన్నారు. నాడి చూపాలి."

అలాంటి సమయాల్లో శ్రీవారి వద్దకు వెళ్ళటానికి శ్రీకంఠన్ భయపడతాడు. నాకే శ్రీవారివద్ద చనువు. నేను అన్నం తీసుకొచ్చాను. వైద్యుడు వచ్చారు. శ్రీవారు వైద్యుని ఎదురుగా భిక్ష స్వీకరించారు. అదే మొదలు. శ్రీవారు మరొకరు - ఆ వైద్యుడు - చూస్తూండగా భిక్షచేయటం.

కాసేపటి తరువాత, తిరుకడవూర్ రామమూర్తి, అరకోణం బాలు, నేను శ్రీవారి సన్నిధిలో ఉన్నాము.

"నీ సంగతేంటి ? ఏంచేస్తావు ?"
"నాకేం తెలుసు ? శ్రీవారు ఉన్నప్పుడు నాకు భయం దేనికి ?", అని నవ్వాను. వారి ప్రశ్న ప్రాముఖ్యాన్ని  మాత్రం అర్థం చేసుకోలేదు.
"నీ సంగతేంటి ?" రామమూర్తివేపు చూస్తూ అన్నారు శ్రీవారు.
"విత్తు వేసినవాడే చెట్టుకి నీరు పోస్తాడు", అంటూ వేదాంతం వల్లించాడు రామమూర్తి.
"చెట్ల గురించి ఏమి మాట్లాడుతున్నాడు ?" అని నన్నడిగారు శ్రీవారు. నేను రామమూర్తి అన్న మాటలు మళ్ళీ చెప్పాను.

శ్రీవారి దండం అక్కడ ఉంది. శ్రీవారికీ దండానికీ మధ్య వెళ్ళరాదు. మేము ఆ మధ్యలోకి వెళ్ళకుండా శ్రీవారి వద్దకు వెళ్ళలేక పోయాము.

" దండం ఇక్కడ ఉంది" అన్నాడు అరకోణం బాలు.
" ఇంక దండంతో పని లేదు" అన్నారు శ్రీవారు.

ఆరోజు తరువాత శ్రీవారు దండాన్ని ముట్టుకోలేదు.  అది, తమ ఉపసంహారం గురించి  మాకు నర్మగర్భంగా చెప్పడం.

"నేనొక కొండచిలువ లాగా కొంతకాలం పడుకోవాలనుకుంటున్నాను. నోరు తెరచి వెల్లకిలా కదలకుండా పడుకుని ఉంటూ నోట్లో ఏం పడితే అదే ఆహారంగా తీసుకోవాలి" అని శ్రీవారు కుంభకోణం రాజమణిశాస్త్రితో చాలాకాలం క్రితం చెప్పారు.
చెప్పినట్లే శ్రీవారు అలా మూడేళ్ళు చేశారు.

మూడో యేట, మళ్ళీ దీపావళి సమయం.

మాకు దీపావళినాట యమునికి దీపం వెలిగించి, 'యమాయ, ధర్మాయ' అంటూ నామాలు చదవటం ఆనవాయితీ.  పెద్ద ఇనప దీపపు సమ్మెలో ధాన్యం పోసి, అందులో మరో మట్టి దీపపు ప్రమిద పెట్టి దానిలో బోలెడు నెయ్యి పోసి , పెద్ద వత్తిని యముడిని ఆవాహనచేస్తూ వెలిగిస్తాము. తెలుగువాళ్ళు ఆనాడు యమతర్పణాలు ఇస్తారు. మేము చెయ్యము.  ఆంత నెయ్యి వలన దీపం ఐదారు రోజులు వెలుగుతుంది.

ఆ సంవత్సరం దీపం బోలెడు చప్పుడు చేసి, ఒక గంటలోపల మట్టి ప్రమిద ముక్కలైపోయింది.  అదో దుశ్శకునమని మాకు తెలుసు.

మార్గశిరమాసంలో శ్రీవారు వెళ్ళిపోయారు.

అపార కరుణాసింధుం జ్ఞానదం శాంతరూపిణం
శ్రీ చంద్రశేఖర గురుం ప్రణమామి ముదావహం ॥

--- శ్రీమఠం బాలు మామ, jagadguru-vaibhavam.blogspot.in నుండి

#KanchiParamacharyaVaibhavam #కంచిపరమాచార్యవైభవం
1/28/18, 11:39 - Paramacharyulu: <Media omitted>
1/28/18, 18:15 - Paramacharyulu: భర్త – భగవంతుడు

పరమాచార్య స్వామి వారి పర్యటనలో భాగంగా ఒక గ్రామంలో పూజ పూర్తి చేసి భక్తులకు తీర్థమిస్తున్నారు. ఒక ఇల్లాలు తన కుమార్తెను,

అయిదేండ్ల పిల్లను వెంటబెట్టుకుని తీర్థం పుచ్చుకోవడానికి వచ్చింది.

స్త్రీలందరూ ఒక ప్రక్కగా, పురుషులొక ప్రక్కగా నిలబడి, తీర్థం పుక్చుకోవడానికి సిద్ధంగా ఉన్నారు. ఈ సందడిలో ఆ పిల్ల మెళ్ళో ఉన్న బంగారు గొలుసు కాస్తా, ఏ పుణ్యాత్మురాలో తస్కరించి దాచేసింది.

గొలుసు పోగొట్టుకున్న పిల్ల ఏడవసాగింది. అమ్మలక్కలంతా 'అయ్యో గొలుసు పోయిందా!' అంటూ పిల్లనూ, తల్లినీ ఊదారుస్తున్నారు.

తక్కిన స్త్రీలందరితో పాటు ఆ పిల్ల తల్లి కూడా తీర్థం పుచ్చుకునేందుకు వరుసలో నిలబడింది. స్వామిని సమీపించింది. తక్కిన వారందరికీ తీర్థమిచ్చి, ఆమెను మాత్రం వరుసలో నుండి తప్పుకుని, ప్రక్కగా నిలబడమన్నారు స్వామి.

స్వామి అలా ఎందుకు అన్నారో ఎవరూ ఊహించలేకపోయారు. ఇంతలో ఒక ముసలావిడ తీర్థం తీసుకోవడానికి స్వామి దగ్గరకు వచ్చి చెయ్యి చాపింది.
ఆమెను ఉద్దేశించి స్వామి, 'ఇచ్చేసెయ్యి' అన్నారు.

"నా దగ్గరేముంది ఇవ్వడానికి?" అన్నదా ముసలమ్మ.

"ఒక్కటి చాలదా, ఇంకా ఎన్ని పాపాలు మూటకట్టుకుంటావు?" అన్నారు స్వామి.

ఆ మాటలు విని కొందరు ఆడవారు చీరె విదిలించమన్నారు. పరిశీలించగా చీరె మడతల్లో దాచిన బంగారం గొలుసు బయటపడ్డది. దాన్ని తీసి స్వామి వద్ద పెట్టారు.

గొలుసు పోగొట్టుకున్న ఇల్లాలిని స్వామి దగ్గరకు పిలిచారు. తీర్థం ఇచ్చారు. ఇలా అన్నారు -

"అదిగో నీ గొలుసు తీసుకో. ఇక నుంచి మాత్రం చెయ్యవద్దన్న పని చెయ్యకు" అన్నారు స్వామి.

"ఇకమీదట ఎప్పుడూ అట్లా చెయ్యను స్వామీ" అంటూ చెంపలు వేసుకుని ఆ గృహిణి, పమిట కొంగుతో కన్నులు తుడుచుకుంది.

ఏమిటా ఇల్లాలు చేసిన తప్పు

ఆమె భర్త ఆ ఊళ్ళో ఒక గుమాస్తా ఉద్యోగం చేస్తున్నాడు. ఉద్యోగానికి టైము తప్పకుండా వెళ్ళాలి. తనకు అన్నం వడ్డించి తరువాత పూజకు వెళ్ళమని భార్యతో చెప్పాడు.

కాని, పూజకు ముందుగా పోవాలని తొందరపడి, ఆదరాబాదరాగా అన్నం వండి, అక్కడ పడేసి, పిల్లను తీసుకుని గబా గబా బయలుడేరి వచ్చింది ఇల్లాలు.

"తీర్థం మీద నీకెంత శ్రద్ధ ఉన్నా నీ ధర్మాన్ని నీవు వదలి పెట్టకు, నీ భక్తి కంటే అది అధికమైంది" అని ఆమెకు బోధపడింది.

ఎంతటి స్వల్ప విషయంలో నైనా తమ కర్తవ్య నిర్వహణలో స్త్రీలూ, పురుషులూ అప్రమత్తులుగా ఉండడం అవసరమని బోధిస్తారు స్వామి.

--- నీలంరాజు వెంకటశేషయ్య గారి "నడిచే దేవుడు" పుస్తక సౌజన్యంతో

#KanchiParamacharyaVaibhavam #Paramacharya
1/29/18, 07:06 - Paramacharyulu: మంగళసూత్రం - సుమంగళి

పాలక్కాడ్ జిల్లాలోని మంజపర బ్రాహ్మణ సమూహానికి చెందిన ఆర్.జి. వెంకటాచలం కంచి మఠానికి పెద్ద భక్తుడు. చాలా పెద్ద పెద్ద పదవులనలంకరించి ఇప్పుడు చెన్నైలో జీవిస్తున్నారు. కాని తమ జన్మస్థలం అంటే వల్లమాలిన అభిమానం. దాదాపు యాభైలక్షల రూపాయలు విరాళాలు సేకరించి మంజపరలోని గురువాయురప్పన్ దేవస్థానాన్ని పునరుద్ధరించారు. వారికి పరమాచార్య స్వామివారితో అనుభవాలు కోకొల్లలు. భక్తిపారవశ్యంతో వారు ఎప్పుడూ ఈ సంఘటనను గుర్తు చేసుకుంటారు.

ప్రతి సంవత్సరమూ వారు పరమాచార్య స్వామివారి అనుగ్రహం కోసం వచ్చేవారు భిక్షావందనంతో. 1988 లో రహదారుల ప్రయాణానికి కొంచం ఆటంకం ఏర్పడడంతో ఆయన రావాల్సిన రోజుకు రారు అని అందరూ తలచారు. కాని ఏలాగో వారు కాంచీపురం చేరుకున్నారు. స్వామివారి దర్శన సమయంలో అతణ్ణి, "నీ సంపాదన ఎంత?" అని అడిగారు. వారు సమాధానం చెప్పగానే వారికి స్వామివారి ఆదేశం అందింది.

"నువ్వు ఇక ఎప్పుడు భిక్షావందనం చెయ్యడానికి వచ్చినా, కొన్ని మంగళసూత్రాలను చెయ్యించి నీతోపాటు తీసుకుని రా" అని చెప్పారు.

ఆయన కొద్దిగా అలోచనలో పడ్డారు. ఏ సాంప్రదాయాన్ని అనుసరించి మంగళసూత్రాలను చెయ్యించాలి. స్మార్త, తెలుగు, అయ్యర్ ఇలా చాలా చాలా ఉన్నాయి కదా. ఏ రకంగా తయారు చేయించాలి? ఒక్కొక్కరికి ఒక్కో రకంగా ఉంటుంది అని.

వెంటనే స్వామివారు "ఏమిటి ఆలోచిస్తున్నావు? ఏ సంప్రదాయమైనా పరవాలేదు. తీసుకుని రా" అని చెప్పారు. వెంకటాచలం ఆశ్చర్యపోయారు. ఎందుకంటే అతను ఈ విషయమై తన మనసులో ఆలోచిస్తున్నాడు. స్వామివారిని అడగనేలేదు. మరి స్వామివారికి ఎలా తెలిసిసింది? అడగకముందే స్వామివారు సమాధానం ఇవ్వడం అతణ్ణి ఆశ్చర్యచకితుణ్ణి చేసింది.

ఈ సంఘటన జరిగి మూడు సంవత్సరాలు గడిచిపోయింది. ప్రతి సంవత్సరం లాగే ఆ సంవత్సరం కూడా భిక్షావందనానికి శ్రీమఠానికి వచ్చారు. ఆరోజు భక్తుల రద్దీ ఎక్కువగా ఉంది. కొద్ది దూరంలో నిలబడి వెంకటాచలం తనవంతు కోసం ఎదురుచూస్తున్నాడు. ఒక పెద్ద ముత్తైదువ బహుశా పేదరాలు, స్వామివారితో ప్రాధేయపూర్వకంగా మాట్లాడుతోంది. స్వామివారి ముఖమండలంలో అనంతమైన శాంతి గోచరిస్తోంది.

వెంకటాచలం తనవంతు రాగానే మహాస్వామి వారిముందు నిలబడి, "స్వామివారి ఆదేశం ప్రకారం మంగళసూత్రాలను తెచ్చాను" అని చెప్పాడు. స్వామివారు చేతివేళ్ల శబ్దంతో ఆ సుమంగళిని దగ్గరకు రమ్మన్నారు. వెంకటాచలం వైపుకి తిరిగి "ఆమె కుమార్తెకి పెళ్ళి అట. మంగళసూత్రం కావాలి అట. తీసుకో ఇక్కడే నీ చేతులతోనే ఆమెకి ఇవ్వు" అని ఆదేశించారు. వెంకటాచలం చాలా సంతోషించారు.

"సార్, నేను చాలా పోగొట్టుకున్నాను. జీవనం సాగించడానికి కూడా కష్టపడ్డాను. అయినాకూడా, ఎప్పుడూ తిరుమాంగల్యాలు చెయ్యించడం మానలేదు. అది పరమాచార్య స్వామి వారి ఆజ్ఞ కదా? మరి ఎలా వదిలిపెట్టగలను? స్వామివారి ఏమి తెలియదా? అంతా తెలుసు. నా భార్య ఏ బాధాలేకుండా సుమంగళిగానే కన్ను మూసింది. మరి ఇంతకంటె ఇక ఏమి అడగాలి ఆ సర్వేశ్వరుణ్ణి?" అని కంఠం గాద్గదికమవుతుండగా వారి అనుభవాన్ని చెప్పుకొచ్చారు వెంకటాచలం.

#KanchiParamacharyaVaibhavam #కంచిపరమాచార్యవైభవం
1/29/18, 16:18 - Paramacharyulu: <Media omitted>
1/30/18, 07:03 - Paramacharyulu: శరణాగతవత్సలులు

కాశీయాత్ర పూర్తిచేసి మఠానికి తిరిగి వచ్చిన శ్రీవారిని కుప్పు సహాయంకోసమై అర్థించాడు.

"నా వద్ద ఏముంది ? ధనమూ లేదు, మరేమీ లేదు. నేనేంచెయ్యగలను ?"

కుప్పు ప్రార్థన ఆపలేదు. శ్రీవారు తప్ప మరి దిక్కులేరన్నాడు. కుప్పు మంచి ప్రతిభాశాలి. చాలా భాషలునేర్చినవాడు. డిగ్రీ పట్టా ఉందతనికి. ఒక్క రాత్రిలో శుద్ధ సంస్కృతంలో మహామాఘం ప్రాధాన్యతగురించి పద్యకావ్యం వ్రాశాడు. తమిళ, ఆంగ్లభాషలూ బాగా వచ్చు. చివరికి శ్రీవారి సిఫారసుమీద ఒక బ్యాంకులో ఉద్యోగం దొరికిందతనికి. ఒక సంవత్సరం గడిచిందేమో.

శ్రీవారు తంజావూరులో విడిదిచేస్తుండగా ఒకనాడు ఒక వ్యక్తి, పూజకోసం వేయించిన మంటపానికి దాదాపు బయట, కూర్చుని కనిపించాడు. చొక్కా వేసుకుని ఉన్నాడు, ధూమపానం చేస్తూండగా కూడా ఎవరో చూశారు. శ్రీవారు ఆవ్యక్తిని తీసుకురమ్మన్నారు. ఆ మనిషి వచ్చేవాడిలాగా అనిపించలేదు, కానీ శ్రీవారి మాట జవదాటకూడదుగా. శ్రీవారి సహాయకులలో ఒకరు అతనిదగ్గరకువెళ్ళి శ్రీవారిని కలువవలసినదిగా కోరారు. అతడు వెంటనే వచ్చాడు.

"సరి అయిన దుస్తులు ధరించకపోవటం చేత రాలేదు", అన్నడతను సంజాయిషీ చెప్పుకుంటూ. శ్రీవారు అతనితో కాసేపు మాటలాడి, కుప్పు గురించి అడిగారు. అతడు జవాబివ్వటానికి సందేహించాడు. కొంతసేపు అడిగిన తరువాత కూడా సరైన సమాధానం ఇవ్వలేదు. "అదేంటంటే.... కుప్పు సెలవులో ఉన్నాడు". చివరికి, తడవ తడవలుగా, మాకు ఈ వ్యక్తిద్వారా తెలిసిందేమిటంటే - కుప్పుకి బ్యాంకులో కాషియర్‌గా పని ఇచ్చారనీ, డబ్బు దొంగతనం చేయడం వల్ల తాత్కాలికంగా తొలగించారనీను.

ఆ రోజు పూజ ముగిసిన తరువాత శ్రీవారు కుప్పువాళ్ళ గ్రామానికి వెడుతున్నానని ప్రకటించారు.
"అదోచిన్న కుగ్రామం, మనందరినీ వాళ్ళు భరించలేకపోవచ్చు. పైగా ఇప్పటికిప్పుడు పీఠాన్ని తరలించలేము" అంటూ అసమ్మతి తెలిపారు మఠ కార్యనిర్వహణాధికారి.
"పూజను తీసుకుని బయలుదేరుతున్నాను" అని ఆ గ్రామానికి బయలుదేరారు శ్రీవారు.

అవసరానికి అందరూ ఏకమవడం తంజావూరువాసుల ప్రత్యేకత. రాత్రికిరాత్రి వాళ్ళు సరంజామా కూర్చుకుని, మంటపాన్ని ఏర్పాటుచేశారు. పూజకూ ఇతర అవసరాలకూ సామగ్రి సిద్ధంచేశారు. ఆ కుగ్రామాన్ని తిరునాళ్ళలాగా మార్చేశారు.

శ్రీవారి సంగతంటారా, వారు తిన్నగా కుప్పువాళ్ళ ఎదురింటికి వెళ్ళి అక్కడ కూర్చున్నారు. కుప్పు వాళ్ళింట్లోనే అటకెక్కి దుప్పటి ముసుగుతన్ని పడుకున్నాడు. రెండురోజుల తరువాత మూడోరోజు మధ్యాహ్నం, కుప్పు ఏంజరుగుతోందో చూడటానికి జాగ్రత్తగా బయటకు వచ్చాడు. శ్రీవారు కుప్పును పసిగట్టి, తీసుకురమ్మన్నారు. కొంతమంది వీధి దాటి అవతలప్రక్కకు వెళ్ళి ఒకటో రెండో దెబ్బలువేసి కుప్పుని శ్రీవారివద్దకు తీసుకొచ్చారు. కుప్పు వెంటనే సాష్టాంగం చేస్తూ శ్రీవారి పాదాలమీద పడ్డాడు. పాదాలు పట్టేసుకున్నాడు.

శ్రీవారివలె శరణాగతిచేసినవారిని క్షమించి రక్షించేవారెవరూ లేరు. తమ పాదాలవద్ద ఆశ్రయంకోరినవారిని రక్షించు ప్రతిజ్ఞలో శ్రీవారు సాక్షాత్తూ శ్రీరాముడే. శరణాగతవత్సలులు.

కుప్పు సుమారు అయిదువేలరూపాయలు కాజేశారనుకుంటా. ఆ రోజుల్లో మఠంలో భిక్షావందనమునకు పదమూడురూపాయలు ఇవ్వవలసి ఉండేది. అయిదువేలరూపాయలు ఎంతపెద్దసామ్మో మీరు ఊహించుకోవచ్చు. ఇది నలభైల్లో సంగతి. శ్రీవారు కుప్పుని తిట్టలేదు, ఒక్కమాట అడగలేదు. మఠ కార్యనిర్వహణాధికారిని పిలిపించి బ్యాంకుకు ఆ డబ్బును కట్టివెయ్యమన్నారు.

శ్రీవారు తరువాత తిరుచిరాపల్లిలో నేషనల్‌కాలేజీ స్థలంలో విడిది చేశారు. ఆరోజుల్లో ప్రతీ ఏటా చివరి 'రెండో శనివారం' నాడు ఉపాధ్యాయుల పరిషత్తు సమావేశం జరిగేది. అవి తెల్లదొరతనం రోజులు. శ్రీవారు కళాశాల అధ్యక్షుడితో మాట్లాడారు. " ఈ కుర్రాడికి డిగ్రీ పట్టా ఉంది, చాలా భాషలు వచ్చు. మీరు మీ పాఠశాలలో ఉద్యోగం ఇవ్వగలరా ?".

"శ్రీవారి ఆదేశం. శ్రీవారు కోరుకుంటే పది ఉద్యోగాలు ఇవ్వగలను".

అలా కుప్పు జీవితంలో మళ్ళీ స్థిరపడ్డాడు. అప్పుడప్పుడూ దర్శనంకోసం వచ్చేవాడు. ఒక్కసారికూడా శ్రీవారు కుప్పుతో ఆ సంఘటన గురించి మాట్లాడలేదు. శ్రీవారు తమ భాషలోకానీ, ఇతరులతో తమ ప్రవర్తనలో కానీ ఎంతో ఉన్నతులు.

జీవితపు చివరిరోజుల్లో కుప్పుకు తన మలమూత్రవిసర్జనపై అదుపు ఉండేదికాదు. అలాంటి పరిస్థితిలో చనిపోయినవారికి మరుజన్మలేదంటారు. కుప్పు శ్రీవారినుండి ఒక్క చీవాటూ ఎరుగడు.

అపార కరుణాసింధుం జ్ఞానదం శాంతరూపిణం
శ్రీ చంద్రశేఖర గురుం ప్రణమామి ముదావహం ॥

--- శ్రీమఠం బాలు మామ, jagadguru-vaibhavam.blogspot.in నుండి

#KanchiParamacharyaVaibhavam #కంచిపరమాచార్యవైభవం
1/30/18, 15:55 - Paramacharyulu: అంధురాలు వర్ణించిన స్వామి రూపం

1963 ఆశ్వయుజ మాసం. తిరుచిరాపల్లిలో జాతీయ కళాశాల వద్ద నవరాత్రి ఉత్సవాలు జరుపుతున్నారు కంచికామకోటి పీఠాధిపతులు శ్రీ శ్రీ శ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతి, శ్రీ జయేంద్ర సరస్వతి స్వామి వార్లు.

ఉత్సవం తిలకించేడానికి వచ్చే వేలాది భక్తుల నిమిత్తం విశాలమైన పందిళ్ళు వేసారు. ఆ తొమ్మిదిరోజులూ పెద్దస్వాములు దీక్షలో ఉండి, నవరాత్రులకు సంబంధించిన కార్యకలాపాలను స్వయంగా కొనసాగిస్తున్నారు. ప్రముఖులైన వారికి ప్రత్యేక దర్శనాలు, ఇంటర్వ్యూలు వగైరా రద్దు చేసారు ఆ తొమ్మిది రోజులూ.

స్వామి దర్శనానికి వచ్చిన భక్తులలో సుమారు తొంబై సంవత్సరముల వయస్సుగల ఒక వృద్ధురాలున్నది. వార్ధక్యానికి తోడు ఆమెకు కళ్ళు కూడా కనిపించవు. మూడు రోజులుగా ఆ ముసలవ్వ ఉపవాసాలు కూడా చేస్తున్నదట. ఇరవై మైళ్ళ దూరం నుంచి ప్రత్యేకంగా స్వామి దర్శనం కోసం వచ్చింది.

'శివ శివా, హర హరా' అనడం తప్పితే మరేమీ మాటాడదు. ఆహారం అడగదు. ముందు స్వామి దర్శనం కావాలి అంటుంది. నవరాత్రి దీక్షలో ఉండగా స్వామి దర్శనం ఆమెకు సాధ్యమేనా? అని అందరూ సందేహించారు.

కాని అక్కడ చేరిన భక్తులలో ఒకరికి ఒక యోచన తోచింది. గదిలో నుండి స్వామి ఒక ద్వారంగుండా రోజుకు ఒకటి రెండు మార్లు వెలుపలికి వస్తుంటారు. ఈ ముదుసలిని ఆ వాకిలి పక్కగా కూర్చోబెట్టాడు ఆ భక్తుడు. అహ, అక్కడే కూచుని 'శివ శివా, హర హరా' అంటూ తన హఠం సాగించింది ఆ భక్తురాలు. ఆమెను చూడటానికి స్వామి బయటకు రావచ్చునన్న ఆశతో అక్కడ కొన్ని వందల మంది మూగారు.

ఇంతలో తలవని తలంపుగా, స్వామి వారి శిష్యులలో ఒకరు తలుపు తీసుకుని వెలుపలకు వచ్చి, వాకిలి పక్కన కూచుని జపం చేస్తున్న ఆ భక్తురాలిని చూసాడు. చుట్టూ చేరిన వాళ్ళందరూ ఆమె కథ వినిపించారు ఆ శిష్యుడికి. శిష్యుడు లోపలికి వెళ్ళి ఆ భక్తురాలి సంగతి స్వామి వారికి తెలియజేసాడు.

మద్యాహ్నం పూజకుగాను పూజామందిరంలోకి వెళ్ళబోతున్న స్వామి, శిష్యుడు చెప్పిన వార్త వినగానే వెనక్కు తిరిగి, వాకిలి తలుపు తీసి వెలుపలికి వచ్చారు. ఎర్రని ఎండలో 'శివ శివా, హర హరా' అంటూ కూచున్న ఆ వృద్ధురాలిని చూసారు.

"ఏం అవ్వా! నేను నిన్ను చూడటానికి వచ్చాను. ఎంతసేపటినుండి ఇక్కడ కూచున్నావు?" అని అడిగారు.

ఆమెకు కాస్త చవుడు కూడా ఉన్నందున చుట్టూ ఉన్న భక్తులు ఆమెకు వినిపించారు స్వామి మాటలు. ఆ మాటలు విని ఆ అవ్వ బిగ్గరగా అరుస్తూ, "వచ్చావా నా దేవుడా! వచ్చావా నా తండ్రీ, నన్ను దీవించడానికి! కాసేపు నా ఎదుట నిలబడు, నేను నీ కాళ్ళకు మొక్కాలి" అన్నది.

"అవ్వా నీకు చూపులేదు కదా, ఏలా చూస్తావు నన్ను?"

"పోనీ, దగ్గరకొస్తే నీ మాటన్నా వింటాను"

"అట్లా కాదు నేను చెప్పినట్టు చెయ్యి" అన్నారు స్వామి ఆమెతో.

ఆ ఎండలో ఆమెను కాస్త దూరం నిలుచోబెట్టారు. స్వామి ఆమె చుట్టూ ప్రదక్షిణం చేసారు. ఆ ప్రదక్షిణంలో ఎనిమిది దిక్కులలో, ఒక్కొక్క దిక్కులో ఒక్కొక్క క్షణం ఆగుతూ,

“నేను నీకు కనబడుతున్నానా, నన్ను నీవు చూస్తున్నావా?” అని అడిగారు స్వామి అవ్వను.

”ఆ ఆ! నీ కాషాయ వస్త్రం కనిపిస్తున్నది. చేతిలో నీ దండం కనిపిస్తున్నది...” అంటూ వరుసగా వర్ణించింది స్వామి రూపమంతా! స్వామి ప్రదక్షిణ పూర్తి చేసేసరికి, “ఇరవై ఏళ్ళ కిందట నిన్ను నేను చూసినప్పుడు నాకళ్ళకు ఎట్లా కనిపించావో, ఇప్పుడు మళ్ళా అట్లాగే అచ్చం అట్లాగే కనిపిస్తున్నావు నా తండ్రీ” అన్నది.

స్వామికి సాగిలపడి నమస్కారం చేసింది. చుట్టూ ఉన్న భక్తులంతా ఆశ్చర్య సంభ్రమాలతో ఆ అంధురాలి గురు భక్తిని ఒకటే పొగిడారు. స్వామి వారి మహిమను కొనియాడారు.

--- నీలంరాజు వెంకటశేషయ్య గారి "నడిచే దేవుడు" పుస్తక సౌజన్యంతో

#KanchiParamacharyaVaibhavam #Paramacharya
1/31/18, 07:12 - Paramacharyulu: అయ్యంగార్ స్వామి అలక

ప్రతి శుక్రవారం కంచి మఠంలో విద్వత్ సదస్సు జరుగుతుంది. పండితులందరూ వివిధ విషయలపైన చర్చించుకుంటారు. చివరికి పరమాచార్య స్వామివారు చివరిగా వివరణ ఇస్తారు. అలాగే పండితులందరికి స్వామివారు సన్మానం అంటే దక్షిణ ఇస్తారు.

అలాంటి ఒకరోజున చిన్నకాంచీపురం నుండి ఒక అయ్యంగారు పండితులు వచ్చారు. పరమాచార్య స్వామికి నమస్కారములు చేసి స్వామివారు ఇచ్చిన డబ్బులను తీసుకున్నారు. కాని దానితో అతను తృప్తి చెందలేదని అతని హావభావాలు చెబుతున్నాయి. మహాస్వామి వారు దాన్ని గమనించి, “ఏమి అయ్యంగార్ స్వామివారు సంతోషమే కదా?” అని అడిగారు. ఆయన అవును అని ముభావంగా చెప్పి వెళ్ళిపోయారు.

మిగిలిన పండితుల తరువాత సామాన్య భక్తులు స్వామి దర్శనానికి వచ్చారు. మొదట ఉన్నది కుటుంబంతో సహా ఉన్న ఒక న్యాయవాది. ఆయన ఒక పళ్ళెంలో పళ్ళు, పూలు, జీడిపప్పు మొదలైనవి తీసుకుని వచ్చి స్వామివారి ముందు పెట్టి “పెరియవ ఒక విన్నపం” అని అన్నాడు.

మహాస్వామివారు అతణ్ణి ఊరకే ఉండమని చెప్పి, ఒక శిష్యుణ్ణి పిలిచి “వెళ్ళి ఆ అయ్యంగార్ స్వామిని పిలుచుకుని రా. చిన్న కాంచీపురం వెళ్ళడానికి బస్సులో కూర్చుని ఉంటాడు” అని చెప్పారు. ఆ శిష్యుడు గంగై కొండన్ బస్టాండుకు వెళ్ళి చూడగా ఒక బస్సులో కూర్చుని కనిపించారు. మహాస్వామివారు తనను రమ్మన్నారని ఆ అయ్యంగార్ స్వామితో చెప్పాడు ఆ శిష్యుడు.

”నేను ముప్పై పైసలు పెట్టి టికెట్టు కొన్నాను. నేను ఇప్పుడు అక్కడికి వస్తే నాకు ముప్పై పైసలు నష్టం” అని చెప్పాడు ఆ స్వామి. దీన్నంతా గమనిస్తున్న బస్ కండక్టరు వెంటనే, “ఏంటి స్వామి, పరమాచార్య దర్శనం కోసం దేశవిదేశాల నుండి వస్తారు. మీరు చూస్తే స్వామివారే రమ్మంటుంటే వెళ్ళనంటున్నారు. ఆ టికెట్టు ఇలా ఇవ్వండి మీ ముప్పై పైసలు మీకు తిరిగిస్తాను. ఏదో ముఖ్యమైన విషయమేమో, వెళ్ళి స్వామివారి కలవండి” అని చెప్పాడు.

ఆ అయ్యంగార్ స్వామి టికెట్టు వెనక్కిచ్చి, ముప్పై పైసలు తీసుకుని బస్సు దిగి ఆ శిష్యుడితో పాటు వెళ్ళాడు స్వామివారిని చూడటానికి. మహాస్వామివారు నవ్వుతూ, “ఏమి అయ్యంగార్ స్వామివారు! మీ ముప్పై పైసలు త్రిగివ్వకపోతే బస్సు దిగి ఇక్కడికి రారా ఏమి?” ఇది విని అతను నోరెళ్ళబెట్టాడు. స్వామివారికి ఎలా తెలుసు ఆ విషయం?

పక్కనున్న న్యాయవాది మళ్ళీ మొదలెట్టాడు, “పెరియవ ఒక విన్నపం . . ”

మహాస్వామివారు ఉండు అని చెప్పి అయ్యంగార్ స్వామిని న్యాయవాది పక్కన కూర్చోమన్నారు. ఆ స్వామి చిరునామా తీసుకోవలసిందిగా ఆ న్యాయవాదికి చెప్పారు. తరువాత అయ్యంగార్ స్వామితో, “తరువాతి బస్సు సిద్ధంగా ఉంది వెళ్ళమని చెప్పారు”

అతనికి ఏమి అర్థం కాక వెళ్ళిపోయాడు.

న్యాయవాది మరలా, “పెరియవా. . .” అని మొదలు పెడుతుండగా స్వామివారే “ఏమప్పా! ప్రతి నెలా వేదం చదివిన ఒక పేద బ్రాహ్మణుడికి కొంత ధనం ఇవ్వాలి అని కదా అనుకుటున్నావు. అంతేనా?” అని అడిగారు. అతను కొద్దిసేపు చేష్టలుడిగి తరువాత తేరుకుని, “అవును పెరియవ” అని బదులిచ్చాడు.

“నీకు తెలుసా, నేను ఆ అయ్యంగార్ స్వామి చిరునామా తీసుకోమన్నది అందుకే. ప్రతి నెలా మరువకుండా రూ.250/- పంపు. నువ్వు కొద్ది నెలల తరువాత నిలిపివేస్తే అతను మరలా ఇక్కడకు వస్తాడు. అతను చాలా మంచివాడు, పండితుడు. కాని పేదవాడు అంతే” అని చెప్పారు.

న్యాయవాది అందుకు ఒప్పుకుని, కుటుంబ సమేతంగా స్వామివారికి సాష్టాంగం చేసి వెళ్ళిపోయారు. ఆ అయ్యంగార్ కి స్వామి ప్రతినెలా డబ్బు అందుతోందా లేదా అని తమ శిష్యుల ద్వారా కొన్ని నెలల పాటు విచారణ చేశారు స్వామివారు.

#KanchiParamacharyaVaibhavam #కంచిపరమాచార్యవైభవం
1/31/18, 11:11 - Paramacharyulu: □□□□□□□□□□
సభ్యులకు విన్నపం

దయచేసి ఎవరూ పోస్ట్స్ కి రిప్లై ఇవ్వకండి. ఎలాంటి ఫార్వార్డ్ మెసేజస్ పంపకండి.

Don't post or reply anything.

అతిక్రమించినవారిని బ్లాక్ చేస్తాము
□□□□□□□□□□
1/31/18, 14:32 - Paramacharyulu: జన్మదినం - వరుణజపం

1965 లో మద్రాసు సమీపాన తిరువత్తియూర్ లో నా షష్టిపూర్తి స్వామి సమక్షమంలో శాస్త్రీయంగా జరగడం నా అదృష్టం. అది మొదలు ఏటేటా నా జన్మ నక్షత్రం నాటికి దేశంలో స్వామి ఏ మూల ఉన్నా అక్కడికి వెళ్ళి స్వామిని సందర్శించి రావడం ఈశ్వరానుగ్రహంవల్ల ఈనాటివరకూ నిరంతరాయంగా జరుగుతున్నది.

1971 డిసెంబరులో నా జన్మదినానికి స్వామి దర్శనం చెయ్యాలి. స్వామి కర్యక్రమం తెలుపవలసిందని కంచి మఠం వారిని కోరాను. ప్రస్తుతం చిత్తూరు జిల్లాలో మారుమూల గ్రామాల్లో ఎక్కడో పర్యటన చేస్తున్నారు, మీరు వెళ్ళేరోజుకు ఎక్కడ మకాం చేస్తారో చెప్పడం సాధ్యంకా' దని మఠం వారు సమాధానం రాసారు.

నిజమే కదాచితుగా తప్ప, సంచారంలో ఉన్నప్పుడు స్వామికి ఒక నిర్ణీత కార్యకరమం అంటూ ఉండదు – మంత్రులకూ ఉద్యోగస్తులకూ ఉన్నట్టు, ఏ రోజు ఎక్కడ ఉంటారో, ఎక్కడ నుంచి ఎక్కడికి బయలుదేరుతారో, అంతేవాసులైన శిష్యులకూ, అత్యంత సన్నిహితులకూ కూడా సరిగ్గా తెలియదు. స్వామి ఎప్పుడు బయలుదేరితే అప్పుడే మూటముల్లె సర్దుకుని శిష్యులు వెంట నడుస్తారు.

మాటవరసకు 'మూట ముల్లె' అన్నానేగాని, మూట తప్పితే, ముల్లె అంటూ ఏమీ ఉందదు స్వామి ప్రయాణంలో. 'కరతల భిక్షా, తరుతల నిద్రే' కదా!

ఏమైనా సరే, డిసెంబరు 15 కు చిత్తూరు జిల్లాలో స్వామి ఎక్కడ ఉంటే అక్కడ వారి దర్శనం చేద్దామని కృతనిశ్చయులమై దంపతుల ఇద్దరం భద్రాచలం నుంచి బయలుదేరి తిరుపతి చేరుకున్నాము. తిరుపతి చేరితే, స్వామి ఎక్కడ ఉండేది అక్కడ బస్సుల వాళ్ళు గానీ, ఇతరులెవరైనా గానీ మాకు చెప్పగలరనే నమ్మకంతో.

తిరుపతి సత్రాల్లో వారినీ వీరినీ వాకబు చేసాము. కొద్ది రోజుల కిందట ఫలానా గ్రామంలో ఉన్నాట్టు విన్నామనీ, అక్కడికి వెళితే ప్రస్తుతం ఎక్కడ ఉండేది తెలియవచ్చనీ, బస్సు కండక్టర్లు ఒకరిద్దరు చెప్పారు. ఆ మాత్రం అధారం దొరికినందుకు సంతోషించి, బస్సు ఎక్కి, వారు చెప్పిన ఊరికి టిక్కెట్లు తీసుకున్నాం. మేము బయలుదేరేముందు తిరుపతిలో కుంభవృష్టి. ఆ ముందురోజు చినికు లేదు. ఆకాశం చిల్లు పడ్డట్టు కురిసింది. సగం తడుస్తూ బస్సు ఎక్కాము. ఆ మర్నాడే నా జన్మదినం కాబట్టి ఎట్లాగైనా సరే, ఆనాటికి స్వామి సమక్షంలో ఉండాలి అని మా సంకల్పం.

బస్సు ఎక్కి కూచుని, ప్రయాణీకులను ఒక్కొక్కరినీ అడగడం మొదలుపెట్టాము. ఆరా తీయగా తీయగా, చివరకొక కొండగుర్తు దొరికింది. అక్కడికి సమీపంలో రామగిరి అనే కొండ ఉంది. ఆ కొడ దిగువన వాలీశ్వరాలయం ఉంది. కొండపైన మరొక ఆలయం స్కందగుడి కాబోలు ఉన్నది.

ఆ ఆలయాలు శిథిలావస్థలో ఉంటే, వాటిని పునర్నిర్మాణం చెయ్యడానికి సమీప గ్రామస్తులు కొందరు నడుం కట్టారు. కంచిస్వామిని రప్పిస్తే ఆలయ పునరుద్ధరణ సులభంగా నెరవేరుతుందని వారి విశ్వాసం. ఆ విధంగా స్వామి అక్కడ మకాం చేస్తున్నారని కొందరు ప్రయాణీకులు చెప్పారు. బస్సు దిగి స్వామి ఉన్న రామగిరి చేరుకున్నాము. మా అదృష్టం వల్ల స్వామి చుట్టూ జనం లేరు. ఆలయానికి దగ్గరగా చిన్న కొలను గట్టు పైన కూచున్నారు. స్వామి ఏకాంతంగా గబగబా వెళ్ళి స్వామికి సాష్టాంగపడ్డాము.

మర్నాడు నా జన్మ నక్షత్రమనీ, భద్రాద్రి నుంచి బయలుదేరి తిరుపతి వచ్చామనీ, తిరుపతి నుంచి దారిలో స్వామి ఎక్కడున్నారు అంటూ ఒక్కొక్కరినీ అడుగుతూ చివరకు రామగిరి చేరామని విన్నవించాము.
"మీరు వచ్చేప్పుడు తిరుపతిలో వర్షం కురిసిందా?" అని స్వామి అడిగారు. నేను ఎక్కడి వర్షం స్వామి, కుండపోతగా కురిసింది. మేమిక్కడికి చేరుకోగలమా అని సందేహించాము.

అప్పుడు స్వామి వారు, "అలాగా! తిరుమలపై ఈ మధ్య వర్షాలు లేక యాత్రికులు నానా అవస్థలు పడ్డారు. ఆలయం కార్య నిర్వహణాధికారి  నా సలహా అడిగారు. వరుణజపాలు చేయించవలసిందని చెప్పాను. వాటిని చక్కగా నిర్వహించగల పురోహితులను కూడా ఏర్పాటు చేసాము. మండలం రోజులు దీక్షతో, ఆహారనియమంతో జపాలు చెయ్యాలి. నిన్నటితో నలభై రోజులు పూర్తి అయినాయి-అందుకని అడిగాను" అని అన్నారు.

మేము ఆశ్చర్యపోయాము. ఈ కాలంలో కూడా వరుణజపం చేస్తే, వానలు కురవడం సంభవమేనా!

[1979 లో శ్రీ పి వి అర్ కె ప్రసాద్ గారు కార్యనిర్వహణాధికారిగా ఉన్న సమయంలో ఇటువంటి పరిస్థితి వచ్చినప్పుడు పరమాచార్య స్వామి వారి అశీస్సులతో శ్రీ ఉప్పులూరి గణపతి శాస్త్రి గారి అనుజ్ఞతో వరుణ జపం చేయిస్తే రాత్రికి రాత్రికి కుంభవృష్టి కురిసి గోగర్భం డ్యాం నిండిపోయింది. ఒక్క తిరుమల కొండపై తప్ప చుట్టుపక్కల ఒక్క చినుకు కూడా పడలేదు అని వారి “నా హం కర్తా హరిః కర్తా” లో రాసుకున్నారు]

--- నీలంరాజు వెంకటశేషయ్య గారి "నడిచే దేవుడు" పుస్తక సౌజన్యంతో

#KanchiParamacharyaVaibhavam #Paramacharya
1/31/18, 16:58 - Paramacharyulu: <Media omitted>
2/1/18, 07:10 - Paramacharyulu: ఎవరు దొంగ? (పార్ట్ 1)

చాలా సంవత్సరాల క్రితం కంచి పరమాచార్యస్వామి వారు తిరువిడైమరదూర్ మహాదాన వీధిలోని ఆర్ యమ్ యమ్ సత్రంలో మకాం చేస్తున్నారు. స్వామివారి దర్శనానికి చుట్టుపక్కల ఊళ్ళనుండి చాలామంది జనం వచ్చేవారు. నేను అప్పుడు పాఠశాలలో చదువుకునేవాడిని.

మా నాన్నగారు అక్కడ ఉన్న కంచిమఠంలో అధికారి కావడంవల్ల, రోజూ స్వామివారి దర్శనానికి తిరువిడైమరదూర్ వెళ్ళి తిరిగొచ్చేవారు. నాకు పాఠశాల సెలవులున్నప్పుడు నన్ను కూడా తీసుకుని వెళ్ళేవారు. అప్పుడు స్వామివారిని దర్శించుకుని భయభక్తులతో వారి వద్ద నుండి ప్రసాదం తీసుకోవడం ఒక సుఖానుభవం.

ఒక ఆదివారంనాడు దాదాపు ఎనిమిది గంటలప్పుడు నేనూ మా నాన్నగారు స్వామికి సాష్టాంగం చేసి నిలబడ్డాము. ఆరోజు అంత రద్దీగా లేదు. స్వామివారు మా నాన్నగారిని దగ్గరకు పిలిచి, “సంతానం, మీఊరివాళ్ళు ఇక్కడికి రావడం లేదా? అందరినీ రమ్మని చెప్పు. ఎవరూ ఊరికే తిరిగివెళ్ళరాదు. చంద్రమౌళీశ్వర ప్రసాదంగా అందరూ ఇక్కడ వైశ్వదేవం(భోజనం) చేసిన తరువాతనే వెళ్ళాలి, ఏంటి అర్థమైందా?” అని నవ్వుతూ అపారమైన కరుణతో ఆజ్ఞాపించారు. మా నాన్న వినయంతో “మహాస్వామి వారి ఆజ్ఞ” అని స్వామికి సాష్టాంగం చేశారు.

నేనూ సాష్టాంగం చేశాను. మహాస్వామివారు అక్కడితో వదలలేదు. మా నాన్నగారి వైపు చూసి, “ఈరోజు చంద్రమౌళీశ్వర పూజను తిలకించారు కదా! మీరు కూడా ఇక్కడే వైశ్వదేవం చేసి వెళ్ళండి” అని చెప్పారు. నేను, నాన్నగారు మధ్యాహ్నం భోజనం ముగించుకొని సత్రంలోని వరండాలో కాస్త విశ్రాంతి తీసుకుంటున్నాము. అప్పుడు మద్యాహ్నం మూడుగంటల సమయం. హఠాత్తుగా మఠంలో కొంత గందరగోళంగా అనిపించింది.

మఠం వారు అటూ ఇటూ చూస్తూ పరిగెడుతూ, ఏదో వెతుకుతున్నట్టుగా పరిగెడుతున్నారు. మాకు ఏమి అర్థం కాక ఒకర్ని అడిగాము. శ్రీమఠం వ్యక్తిఒకరు, “అదేం లేదండీ. పరమాచార్య స్వామివారు చంద్రమౌళీశ్వర పూజ చేస్తారు కదా. కుంబకోణంలోని ప్రముఖవ్యక్తి ఒకరు అర్ఘ్యపాద్యాదులు సమర్పించడానికి ఒక బంగారు ఉద్ధరిణె ఇచ్చారు ఒక మూడు సవర్ల బంగారంది. నిన్నటివరకూ స్వామివారి పూజలో ఉంది. ఈరోజు అది కనబడడంలేదు. దాని కోసం మేము వెతకని మూల లేదు. ఇంకా మహాస్వామివారికి చెప్పలేదు, వారికీ విషయం తెలియదు” అని చెప్పి మళ్ళా వెతకడానికి వెళ్ళాడు.

”ఈ విషయం స్వామివారి చెవికి చేరే మునుపే ఎలాగోలా వెతికి దాని స్వస్థానానికి చేర్చాలి” అని శ్రీమఠం శ్రీకార్యం ఆందోళనగా చెబుతున్నాడు. సిబ్బందిని అందరినీ పిలిచి ఒక్కొక్కరినీ విచారించాడు. అందరూ ఒక్కటే చెప్పారు వాళ్ళకు దానిగురించి ఏమీ తెలియదని. “అందరినీ విచారించాను. ఇక ఒక్కడే మిగిలాడు. ఉగ్రాణ కైంకర్యం చేసే రామనాథన్ ను పిలవండి” అని చెప్పాడు.

ఒకవ్యక్తి వంటశాలకు వెళ్ళి వచ్చి శ్రీకార్యంతో, “వంట సహాయకుడు రామనాథం లేడు. వాళ్ళ అమ్మగారికి ఆరోగ్యం బాగోలేకపోతే చూడడానికి తెప్పేరుమానల్లూర్ వెళ్ళాడు అని చెప్పారు. బహుశా సాయంత్రానికి తిరిగొస్తాడు” అని చెప్పాడు.

సాయంత్రం ఐదు గంటలయ్యింది. స్వామివారు వారి గదినుండి బయటకు వచ్చారు. ఒక నిమిషం పాటు నిలబడి నాలుగువైపులా ఒకసారి చూశారు. వారి గది ద్వారం గోడ వద్ద ఏర్పాటుచేసిన ఆసనంపై కూర్చున్నారు. కొద్దిసేపటి తరువాత పూజా కైంకర్యం చేసే ఒక యువకుడు అటుపక్కగా వచ్చాడు. అతణ్ణి దగ్గరకు పిలిచి ఏమి తెలియనట్టు చిరునవ్వుతో అడిగారు, “ఏమప్పా, మధ్యాహ్నం నుండీ చూస్తున్నా సత్రం మొత్తం అల్లకల్లోలంగా ఉంది. ఏమిటి సమాచారం? పెద్దమనిషి ఎవరైనా వస్తున్నరా ఏమి?”

స్వామికి సాష్టాంగం చేసి ఆ యువకుడు, “అలాంటిది ఏమి లేదు పెరియవ” అని గుటకలు వేస్తున్నాడు. స్వామివారు అతణ్ణి వదల్లేదు. అలా నవ్వుతూనే, “నువ్వు ఏమి లేదు అని చెప్తే ఎలాగప్పా. మొత్తం సత్రం అంతా రణరంగంలా ఉంది. ఏమిటి ఆ సమాచారం?” అని అడిగారు.

ఆ యువకుడు నీళ్ళు నములుతూ, చింతాభావనతో “మీరు చంద్రమౌళీశ్వర పూజ చేసేటప్పుడు అర్ఘ్యం పాద్యం ఇవ్వడానికి ఒక బంగారు ఉద్ధరిణె వాడతారు కదా? అది ఎక్కడా కనబడడంలేదు పెరియవ. అందుకే అందరూ సత్రం మొత్తం మూలమూలల్లోనూ వెతుకుతున్నారు” అని చెప్పాడు.

వెంటనే స్వామివారు ఎరవేశారు. “ఏమప్పా మనవారు ఎవరిపైన అయినా అనుమానం ఉందా? దానిపై ఏమైనా మాటలు విన్నావా?” అని అడిగారు. “నాకు అది ఏమీ తెలియదు పెరియవ. శ్రీకార్యం మామ కొన్ని మాటలు చెబుతున్నారు. వారిని అడిగితే అన్ని విషయాలూ తెలుస్తాయి” అని చెప్పాడా యువకుడు.

“సరే! వెళ్ళి శ్రీకార్యం మామని ఇక్కడికి రమ్మని చెప్పి నువ్వు వెళ్ళు”

ఒక మూలన చేతులు కట్టుకుని నిలబడి మేము అంతా చూస్తున్నాము. శ్రీకార్యం, స్వామివద్దకు వచ్చి సాష్టాంగం చేసి చేతులు కట్టుకుని నిలబడ్డాడు. స్వామివారు నవ్వుతూ, “ఏమప్పా పూజలో వాడే బంగారు ఉద్ధరిణె కనబడుట లేదటగా?” అని అడిగారు.

”అవును పెరియవ”

“ఎప్పటి నుండి కనబడడంలేదు? ఏమైనా తెలుసునా?”

కొద్దిగా సంకోచిస్తూ మాటలు తడబడగా, “రెండురోజులుగా దాన్ని చంద్రమౌళీశ్వర పూజలో వినియోగించలేదు పెరియవ” అని చెప్పారు.

”సరే! ఎవరో ఏమిటో కనుక్కోగలిగావా?”

(సశేషం)

#KanchiParamacharyaVaibhavam #కంచిపరమాచార్యవైభవం
2/1/18, 10:22 - Paramacharyulu: <Media omitted>
2/1/18, 16:18 - Paramacharyulu: <Media omitted>
2/2/18, 07:18 - Paramacharyulu: ఎవరు దొంగ? (పార్ట్ 2)

“అది ఖచ్చితంగా చెప్పలేను పెరియవ. ఒక వ్యక్తిపై కొంచెం అనుమానంగా ఉంది”

“ఎవరా వ్యక్తి?”

“మహాస్వామివారికి తెలియనిది ఏమి లేదు. కాని నా మనసుకి తోచినది చెబుతాను” అని దీర్ఘం తీస్తూ అన్నాడు. ”చెప్పు నేను కూడా దాని గురించి తెలుసుకుంటాను”

“నా అనుమానం ఏంటంటే వంట సహాయకుడు రామనాథన్” అంటూ మేనేజరు చెప్తుండగానే స్వామివారు మధ్యలో “ఎలా చెప్పగలవు?” అని అడిగారు.

”మా అమ్మకు ఆరోగ్యం సరిగ్గాలేదు. వైద్యం కోసం తనని కుమ్మనం ప్రభుత్వాసుపత్రిలో చేర్చాలి కనుక మూడువందలు అడ్వాన్స్ ఇవ్వవలసిందిగా; అలాగే తన జీతం కూడా కొద్దిగా పెంచమని గత పది రోజులుగా రామనాథన్ నన్ను ఒత్తిడి చేస్తున్నాడు. కనుక. . .”

అతని మాటలకు అడ్డుపడుతూ, “కనుక డబ్బు అవసరం వల్ల అతడే ఈ పని చేసి ఉంటాడు అనే నిర్ధారణకు వచ్చావు నువ్వు” అని గట్టిగా నవ్వారు.

”సరే! సరే! ఆ రామనాథన్ ఎక్కడున్నాడు ఇప్పుడు? నేను పిలిచాను అని చెప్పి ఇక్కడికి తీసుకునిరా”

“అతను తల్లికి చాలా విషమంగా ఉంది అని చూడటానికి తేప్పేరుమానల్లూర్ వెళ్ళాడు పెరియవ”

“సరే వెళ్ళనీ. జీతం పెంపు, అడ్వాన్స్ అడిగాడు అని చెబుతున్నావు కదా. మరి ఇచ్చావా?”

“లేదు పెరియవ”

“మరి ఏమి చేశావు?”

“నువ్వు అడుగుతున్న ఆ రెండు విషయాలను పరిశీలించడానికి ఇప్పుడు మఠంలో పరిస్థితి అంత బాగోలేదు” అని చెప్పాను పెరియవ.

ఇది వినగానే మహాస్వామివారు కళ్ళుమూసుకుని అలోచనల్లోకి జారుకున్నారు. కొద్దిసేపటి తరువాత శ్రీకార్యంతో, “సరే! నువ్వు ఒక పనిచెయ్యి. తేప్పేరుమానల్లూర్ నుండి రామనాథన్ తిరిగి రాగానే అతణ్ణి తీసుకుని నావద్దకు రా; ఏంటి అర్థమైందా?” అని వారి గదిలోకి వెళ్ళిపోయారు. మేమందరమూ అక్కడ చేతులు కట్టుకుని నిలబడ్డాము. సమయం గడిచిపోయింది.

రాత్రి ఎనిమిది గంటలైంది. రామనాథన్ తేప్పేరుమానల్లూర్ నుండి వచ్చాడు. అతణ్ణి తీసుకుని మేనేజరు హాలులోకొచ్చాడు. ఎవరో చెప్పినట్టు స్వామివారు కూడా తలుపు తీసుకుని బయట వచ్చి కూర్చున్నారు. రామనాథన్ స్వామికి సాష్టాంగం చేసి నిలబడ్డాడు.

పరమాచార్య స్వామివారు వాత్సల్యంతో “రామనాథా, మీ అమ్మకు బాగోలేదని విన్నాను. ఇప్పుడు ఎలా ఉన్నారు?” అని అడిగారు.

ఎర్రబడ్డ కళ్ళతో రామనాథన్, “ఆమె కడుపులో ఒక వ్రణం ఉంది అని చెబుతున్నారు పెరియవ. కుమ్మనం పెద్దాసుపత్రిలో చేర్పిస్తే ఆపరేషన్ చేసి తీసివేస్తాము అని చెప్పారు”

అతను ముగించకముందే స్వామివారు “దానికోసం శ్రీకార్యంని అడ్వాన్స్ అడిగావా?” అని అడిగారు.

”అవును పెరియవ”

“జీతం పెంపు కూడా అడిగావు అటగా” అనగా రామనాథన్ ఏమి సమాధానం చెప్పలేదు.

“ఎందుకు సమాధానం ఇవ్వడంలేదు? ఇప్పుడు నీకు ఎంత జీతం ఇస్తున్నారు?”

”అరవై రూపాయలు పెరియవ”

“ఎంత ఎక్కువ కావాలనుకుంటున్నావు?”

“ప్రతి నెలా పది రూపాయలు పెరియవ”

“అంటే ప్రతి నెలా డెబ్బై రూపాయల జీతం కావాలంటావు. అంతేనా?”

దీనికి కూడా ఏమి సమాధానం లేదు. స్వామివారు శ్రీకార్యం వైపు చూసి, “ఇతను పదిరూపాయలు అడుగుతున్నాడు. నువ్వు ఏమి చేస్తావంటే అతని జీతం పదిహేను రూపాయలు పెంచి నెలజీతం డెబ్బైఐదు రూపాయలు చెయ్యి. అలాగే అతను అడిగిన అడ్వాన్స్ కూడా ఇవ్వు. ఏమి అర్థమైందా?” అని ఆజ్ఞాపించారు.

”మీరు చెప్పినట్టే చేస్తాను పెరియవ”

“ఏమి రామనాథా సంతోషమేనా?” అని అడిగారు.

రామనాథన్ నోటికి చెయ్యి అడ్డంగా పెట్టుకుని అవునన్నట్టుగా తల ఊపాడు.

హఠాత్తుగా స్వామివారు అక్కడ ఉన్నవారిని ఉద్దేశించి “ఏమప్పా! బంగారు ఉద్ధరిణె కోసం మఠం మూల మూలల్లోను వెతికాము అని చెప్పారు కదా! నేను ఇప్పుడు చెప్పబోయే చోట వెతికారో లేదో నాకు ఇప్పుడు చెప్పండి” అని మాటలు ఆపేశారు.

అక్కడున్నవారందరూ సందేహంతో ఒకరి మొహాలు ఒకరు చూసుకుని ప్రశ్నార్థకంగా స్వామివైపు చూస్తున్నారు.

స్వామివారు నవ్వుతూ, “మీరు ఒక ముఖ్యమైన స్థలంలో వెతకడం మరచిపోయారు. నేను ఇప్పుడు చెబుతాను వినండి. చంద్రమౌళీశ్వర పూజ నిర్మాల్య పుష్పాలను ఎవరూ తొక్కకూడదు అని వెనుకవైపు ఒక చోట వేస్తున్నారు కదా. మరి దాంట్లో ఉందేమో ఈ బంగారు ఉద్ధరిణె అని వెతికారా? కాని ఈ రాత్రప్పుడు వెళ్ళి వెతకకండి. ఏమైనా పురుగో పుట్రో ఉంటుంది. ఉదయం వెళ్ళి చూడండి. చంద్రమౌళీశ్వరుని కృప వల్ల అక్కడ ఉంటుంది”

స్వామివారు ఈ విషయాన్ని ఎవరికో సూచిస్తున్నట్టుగా చెప్పి లేచి నిలబడ్డారు. మేమందరమూ స్వామికి సాష్టాంగం చేశాము.

మరుసటి రోజు నేను మా నాన్నగారితో కలిసి సత్రంలోకి వెళ్ళాము. ఆ ఉద్ధరిణె గురించి మా నాన్న మఠం శ్రీకార్యాన్ని అడిగగా ఆయన సంతోషంతో, “స్వామివారు చెప్పినట్టుగా ఉదయాన్నే వెళ్ళి నిర్మాల్య పుష్పాలను వెతకగా తళతళలాడుతూ బంగారు ఉద్ధరిణె కనపడింది. కాని ఇది ఇక్కడికి ఎలా వచ్చింది అనే సత్యం ఆ చంద్రమౌళీశ్వరునికి, పెరియవకే తెలియాలి” అని అన్నారు.

ఇది విన్నవెంటనే చేష్టలుడిగి అలా నిలుచుండిపోయాను.

--- రమణి అన్న, ‘శక్తి వికటన్’ ప్రచురణల నుండి

#KanchiParamacharyaVaibhavam #కంచిపరమాచార్యవైభవం
2/2/18, 14:08 - Paramacharyulu: ప్రాయశ్చిత్తం – పాదపూజ

‘అచారశ్చైవ సాధూనాం ఆత్మన స్తుష్టి రేవచ’ – మనువు.

ఆచారాలు ఆత్మానందానికి అవసరమైన చిత్త సంస్కారాన్ని కలగచేస్తాయని సంస్కార ధర్మాలకు మనువు నిర్వచనం.

ఒకమారు పూర్వాచారాన్ని, లేక సాంప్రదాయాన్ని ఉల్లంఘిస్తే, ఒకరి తరువాత ఒకరు ప్రజలందరూ వాటిని ఉల్లంఘిస్తారు. అందువల్ల అనాచారం ప్రబలుతుంది. మతం సారహీనం అవుతుంది.

'ఒక్కొక్క పొరనే ఒలిచివేస్తే, ఉల్లిగడ్డలో చివరకు మిగిలేది శూన్యం. అదేవిధంగా, మనకు అనుకూలించడంలేదని ఒక్కొక్క సంప్రదాయాన్ని తోసివేస్తే, అసలు సంస్కృతికే నష్టం వాటిల్లుతుంది' అంటాడు ప్రపంచఖ్యాతి గాంచిన ఆంగ్లచరిత్రకారుడు ఆర్నాల్డ్ టాయన్ బీ.

విదేశాల్లో చదువు ముగించుకుని, భార్యతో, ఏణ్ణర్థం బిడ్డతో స్వదేశానికి తిరిగివస్తున్న ఒక విద్యావంతుడు, దేశంలో అడుగు పెడుతూనే ఓం ప్రథమంగా కంచికి వెళ్ళి శ్రీకామకోటి శంకరాచార్య స్వామిని సందర్శించాలనుకున్నాడు.

బొంబైలో విమానం దిగి, భార్యా భర్తలు బిడ్డను చంకనెత్తుకుని, మద్రాసు మీదుగా ముందు కంచికి వెళ్ళారు. మఠం మేనేజరును కలుసుకున్నారు.

"మేము ఇంగ్లాండు నుండి వస్తున్నాము. స్వామి దర్శనం చేసి, పాద పూజ చెయ్యాలని అనుకుంటున్నాము" అన్నారు.

"మీరు విదేశం నుండి నేరుగా ఇక్కడికి వస్తున్నారు. విదేశం వెళ్ళి వచ్చిన వారు ప్రాయశ్చిత్తం చేసుకుంటే గాని, పాదపూజ చెయ్యడానికి వీలు లేదు. మీరు స్వామిని సందర్శించేందుకు మాత్రం అభ్యంతరం లేదు" అన్నాడు మేనేజరు.

ఆశాభంగం కలిగింది ఆ యువదంపతులకు. "వేల మైళ్ళు ప్రయాణం చేసి, ఎంతో ఆశతో వచ్చాం కదా, మా కోరిక తీరడానికి మార్గం ఏదైనా చెప్పలేరా?" అని అడిగారు.

"మఠంలో చిరకాలంగా మేము అనుసరిస్తున్న సంప్రదాయం ఇది. దీనిని ఉల్లంఘించడానికి మాకు వీలు లేదు. అయినా, మీరు పరమాచార్య స్వామి వారిని కలిసి మీ విషయం వారికి విన్నవించుకోండి స్వామి వారు ఇప్పుడు విష్ణుకంచిలోని చిన్న మఠంలో ఉన్నారు" అంటూ కొంచం సానుభూతి కనబరిచాడు మేనేజరు.

వెంటనే విష్ణుకంచిలో ఉన్న చిన్న మఠానికి బయలుదేరారు ఆ దంపతులు. స్వామి దర్శనం చేసారు. తమ పరిస్థితి స్వామికి విన్నవించారు.

'ఎంత భక్తిశ్రద్ధలు లేకపోతే ఈ యువదంపతులు విదేశాల నుండి వస్తూ, స్వగ్రామానికైనా వెళ్ళకుండా, స్వజనాన్ని చూడకుండా, మొదట కంచికే ఎందుకు వస్తారు? తమ కోరిక నిరాకరిస్తే వారు ఎంత నిరుత్సాహ పడతారు? అయితే పూర్వాచారానికి భంగం కలగరాదు. ఇందుకు ఉపాయాంతరమేదైనా వెతికి వారిని తృప్తి పరచాలి' అని యోచించి ఉంటారు స్వామి వారు.

మఠంలో మామూలుగా పూజ జరిగేది 'ఆది శంకరుల' పాదుకలకు. వాటికి ప్రత్యామ్నాయంగా తమ సొంత పాదుకలను తెప్పించారు. బిడ్డచేత ఆ పాదుకలకు పూజ చేయించండి' అన్నారు.

అంత చిన్న బిడ్డ ఎట్లా అంటే, తల్లి తన ఒళ్లో బిడ్డను కూచోపెట్టుకుని, బిడ్డ చెయ్యి పట్టుకుని పూజ చేయించమన్నారు.

స్వామి చెప్పిన విధంగానే, శిష్యులు ఆ బిడ్డ చేత పూజ చేయించారు. భార్యాభర్తలిరువురూ ఎంతో సంతోషించారు. తమ కూతురు అదృష్టం కొనియాడుకున్నారు.

విదేశయాత్ర చేసి వచ్చిన వారు ప్రాయశ్చిత్తం చేసుకోకుండా పాదపూజ చెయ్యరాదనే నియమానికి భంగం కలిగిందా లేదా అనే వాదానికి స్వామి సమాధానం.

"విదేశయాత్ర చేసి తిరిగి వచ్చిన వారు భార్యాభర్తలు, నిజమే. కాని, ఆ బిడ్డ విదేశాలకు వెళ్ళిందా? లేదు. విదేశంలో జన్మించింది. స్వదేశానికి వచ్చింది. విదేశయాత్ర చేసిన దోషం బిడ్డకు ఎట్లా వర్తిస్తుంది?"

భక్తుల కోరికలను తృప్తి పరచడానికి ఒక్కొక్కప్పుడు స్వామి పూర్వాచారాన్ని సడలించినట్టు కనిపిస్తుంది. అయునా, అది ఆచారానికి విరుద్ధం కాదు, సంప్రదాయానికి భిన్నమూ కాదు. ఆచారానికి భంగం వాటిల్లకుండా, భక్తులను తృప్తిపరచడంలో స్వామి సూచించే పరిష్కారమార్గం అపూర్వంగా, అద్భుతావహంగా ఉంటుంది.

ఎంత ఉపజ్ఞాపూర్వకమైన సమర్థన!

--- నీలంరాజు వెంకటశేషయ్య గారి "నడిచే దేవుడు" పుస్తక సౌజన్యంతో

#KanchiParamacharyaVaibhavam #Paramacharya
2/3/18, 07:04 - Paramacharyulu: పెళ్లి చీర - పిల్ల తేళ్ళు

ఒకరోజు పరమాచార్య స్వామివారి దర్శనానికి ఒక భక్తురాలు తన కూతురుతో కలిసి శ్రీమఠానికి వచ్చింది. వారి వద్దనున్న పళ్ళెంలో పసుపు, కుంకుమ, టెంకాయలు, తమలపాకులు, పూలతో పాటు మంగళసూత్రాలు కూడా ఉన్నాయి. బహుశా ఆ అమ్మాయికి వివాహం నిశ్చయమైంది అనుకుంటా. ఆ పళ్ళంలో ముహూర్తం చీర కూడా ఉంది.

పరమాచార్య స్వామివారు ఎప్పుడూ పట్టువస్త్రముల వాడకాన్ని ఇష్టపడేవారు కాదు. భక్తులను కూడా పట్టును విడువలసిందిగా చెప్పేవారు. పట్టు వస్త్రం తయారీలో ఏంతో జీవహింస ఉంటుంది మరియు అది కేవలం ఐశ్వర్య ప్రదర్శన మాత్రమే కనుక. కాని ఆ విషయం ఈ భక్తురాలికి తెలియక ఎర్రటి పట్టుచీరను స్వామివారి ఆశీస్సుల కోసం తెచ్చింది.

మహాస్వామివారి ఆశిస్సులకోసం ఆ పళ్ళాన్ని అందించింది. కాని బాలుమామ దాన్ని ఒప్పుకోలేదు. ఆశీస్సులకోసం ఎర్రని పట్టుచీర పెట్టడంతో కోపంతో, ఆ చీరను తీసివేసి మిగిలిన వస్తువులను మాత్రం అక్కడ ఉంచాడు. పరమాచార్య స్వామివారు లోపలున్న గదిలో ఉన్నారు. బయట ఆ భక్తురాలు బాలు మామతో గొడవకు దిగింది. స్వామివారి ఆశీస్సుల కోసమని ఉంచిన ముహూర్తం చీరను తీసివేయడంతో ఆమె కొంత వేదన పొందింది.

ఈ గొడవను విని భక్తులకు దర్శనం ఇవ్వడానికి శ్రీవారు బయటకు వచ్చారు. అక్కడ కూర్చుంటూ, “అవును, ఆ చీరను వేరేగా ఉంచండి” అని అన్నారు. కాని, పరమాచార్య స్వామివారు భక్తుల్ని కష్టపెట్టరు అన్న విషయం తెలిసిందే. అందుకే మహాస్వామివారి మాటలను విని బాలు మామ ఆశ్చర్యపోయారు. ఒక కర్రను తీసుకుని రమ్మని ఆజ్ఞాపించారు. ఆ కర్ర సహాయంతో స్వామివారు ఆ చీర మడతలను విప్పగా, అందులోనుండి ఒక పెద్ద తేలు, రెండు చిన్న తేళ్ళు బయటకు వచ్చాయి.

వాటిని చూడగానే ఆ భక్తురాలు భయపడింది. ఇప్పుడే అంగడి నుండి తెచ్చిన కొత్త చీరలో ఆ తేళ్ళు ఎలా వచ్చాయో అని లోచనలో పడింది. కేవలం పరమాచార్య స్వామివారి అపార కృప వల్ల ఆ తేళ్ళ బారినుండి బయటపడ్డాము అని ఊపిరి పీల్చుకుంది.

“అందుకే దాన్ని వేరుగా ఉంచమన్నాను” అని అన్నారు మహాస్వామి. వాటిని చంపవద్దని ఆదేశించారు. “వధువు చీర ఈ రంగులో ఉండరాదు. అది ముదురు ఎరుపు రంగులో ఉండాలి. అదే దుకాణంలో ఇచ్చి పసుపుది కాని, వేరే ఏదేని మంగళకరమైన రంగు చీరను తెచ్చుకొండి. ఈ విషయం గురించి దుకాణదారునికి చెప్పవలసిన అవసరం లేదు“ అని వారిని ఆశీర్వదించి పంపారు.

స్వామివారు దివ్యదృష్టితో ఆ తేళ్ళను గుర్తించి ఈ పని చేశారు అని అనుకుంటే అది మన మూర్ఖత్వమే. స్వామివారు ఎప్పుడూ చెప్పే మాటల్ని పాటించిన బాలు మామ వాక్కును నిజం చెయ్యడానికి అక్కడికక్కడే ఈ లీలను చేశారు.

స్వామిపై మనకి ఉన్ననిజమైన భక్తితో మనకు ఆయురారోగ్య ఐశ్వర్యాభివృద్ధి ఖచ్చితంగా కలుగుతుందని మనకు కనువిప్పు కలిగించే సంఘటన ఇది.

అపార కరుణాసింధుం జ్ఞానదం శాంతరూపిణం
శ్రీ చంద్రశేఖర గురుం ప్రణమామి ముదావహం ॥

--- శ్రీ మఠం బాలు మామ, ‘శ్రీ పెరియవ మహిమై’ పత్రిక నుండి

#KanchiParamacharyaVaibhavam #కంచిపరమాచార్యవైభవం
2/3/18, 09:19 - Paramacharyulu: ఒకసారి శ్రీ చంద్రశేఖర భారతీ స్వామి వారి దర్శనం చేసుకొడానికి 22 మంది ఫుట్బాల్ ఆటగాళ్ళు శృంగేరి వచ్చారు. వారిని అనుగ్రహించిన తరువాత, స్వామి వారు ఇలా వచించారు.,

"ఈ ఆటలో 22 మంది ఒక బంతితో ఆడతారు. పక్కకి కొడితే పక్కకి పోతుంది. అక్కడ కూడా ఇంకొకరు బంతిని తంతారు. ఆ బంతి బ్రతుకంతా తన్నులు తింటూనే ఉంటుంది. మనిషి కూడ అంతే. మనిషి జీవితం కూడా ఈ ఆట లాంటిదే. జీవుడే బంతి. జీవితంలోని సంఘటనలే ఆటలో బంతికి తగిలే కాలి దెబ్బలు. ఆటగాళ్ళ ఓపిక అయిపొయిన తరువాతో, వెలుతురు తగ్గినప్పుడో మాత్రమే బంతిని మూలకి తోస్తారు. అలానే అహంకారంతో తల పైకెత్తి ప్రపంచంలో తిరిగే మనిషికి సుఖము శాంతి ఉండవు. అక్కరలేని అవసరంలేని పనులు మానుకుని, మానవత్వము పెంచుకుని, ఏకాంతంలో ఆత్మ విచారం చేసిన నాడే, మనిషి సుఖశాంతులను పొందుటాడు."

#SringeriJagadguruVaibhavam #శృంగేరిజగద్గురువైభవం
2/3/18, 20:21 - Paramacharyulu: <Media omitted>
2/3/18, 20:32 - Paramacharyulu: <Media omitted>
2/3/18, 22:10 - Paramacharyulu: <Media omitted>
2/4/18, 07:03 - Paramacharyulu: శాస్త్రం విధించిన సన్యాసాశ్రమం

మన దేశంలో నానావిధాలవారు సన్యాసులెందరో వున్నారు. వీరెవ్వరూ ఫలప్రదం, లాభకరం అయినపని ఏదీ చేయరు. గృహస్థులు పెట్టే భిక్షవల్లజీవిస్తూ వుంటారు. ఈ భిక్షసన్యాసులందరు పరోపజీవనులనీ, వీరివల్ల దేశానికేమీ లాభించదనీ మనపరిపాలకులలోనే కొందరు అభిప్రాయపడుతూ వుంటారు. ఈ సన్యాసి జనసమూహాన్ని కూడగట్టి ప్రజోపయోగకరమైనపని చేయిస్తే మంచిదను తలంపుతో “అఖిల భారత సాధు సంఘము”నే సమాజాన్ని ఇటీవల నెలకొల్పారు. వీరిలో కొందరిని సంచార ప్రచారకులుగా నియమించి వారికి కొంత ప్రతిఫలం ముట్టచెప్పుతూ ప్రజాహితం సాధించాలని ఆలోచించారు.

అవును, దేశంలో ఈ సన్యాసిమూక ఎక్కువగా నున్నమాటనిజమే. వీరు పరోపజీవనం చేస్తున్నమాట నిజమే. అలావుండటం మంచిది కానిమాట సత్యమే. కాని సన్యాసులు పరోపజీవనం చేయకూడదనే అభిప్రాయాన్నీ, సన్యాసులు భిక్షాటనవల్లనే జీవించాలనే శాస్త్రవిధిని-ఈరెంటినీ సమన్వయించడం ఎలాగూ అనేదే ప్రశ్న.

నాలుగాశ్రమాలవారిలో సన్యాసులకు, బ్రహ్మచారులకూ మాత్రమే భిక్షాజీవనం అర్హమనీ, విహితమనీ శాస్త్రం చెప్పుతున్నది. బ్రహ్మచారులు గురుకులవాసం చేసేటప్పుడు చాలా కొలది గృహములందు 'భవతిభిక్షాందేహి' అని ఇళ్లాండ్రనడిగి, తమకోసం గురువుకోసం అన్నమును తెచ్చుకోవాలి. దీనివల్ల రెండు ప్రయోజనాలు కలుగుతున్నవి. విద్యార్థి తన చదువుకోసం వినియోగించుకోడానికి ఎంతో కాలమూ, శక్తి

దీనివల్ల కలిసివస్తవనేది ఒకటి; రెండోది విద్యార్జనకవసరమైన వినయమూ, చిత్తశుద్ధీ దీనివల్ల అలవడుతవనేది. గురుకుల వాసమందు ఈ భిక్షాటనం రాచబిడ్డలకూ విధింపబడింది. బ్రహ్మచారులిలా తెచ్చిన భిక్షాన్నమును గురువుకర్పిస్తే దానిని గురువు అందరికీ పంచిపెడతాడు. విద్యార్థులు గురువులకు జీతాలివ్వడమనేది ఆనాడులేదు. విద్య పూర్తి చెందిన పిమ్మట శిష్యుడు గురువునకు శక్తి కొలది దక్షిణ సమర్పిస్తాడు. దేశంలో ఉన్న రాజులవల్ల, సంపన్నులవల్ల శిష్యులు ఈ దక్షిణను సంపాదించి భక్తిపూర్వకంగా గురువులకు అర్పించేవారు.

సన్యాసి గూడా ఇలా భిక్షాన్నంవల్ల జీవించవలసిందే. చిత్తవృత్తులను విషయజాలమునుండి మరలించి పరమాత్మ ధ్యానమందు నిరంతరంగా లగ్నం చేసివుంచడమే అతనికి విహిత కృత్యం, సన్యాసులు జీవనార్థం ఏదో వృత్తి నవలంబించి అందరివలె లాభకరమైన పనులుచేస్తూ ఉంటే, వారికి విహితమైన బ్రహ్మనిష్ఠకు భంగం కలిగితీరుతుంది. సన్యాసి సప్తభిక్ష చేసి జీవించాలని శాస్త్రం విధించింది. సప్తభిక్ష అంటే ఏడు ఇండ్లయందు మాత్రమే భిక్షనర్థించాలి. ఆ అర్థించడం గూడా ఇంటి ముందు నిలిచి అడగాలి. ఆ నిలవడం గూడా గోదోహనకాలమాత్రం నిలవాలి అంటే, ఆవును పాలుపిదుకుట కెంతకాలము పట్టునో అంతసేపే నిలవాలి. ఈ విధంగా లభించిన భిక్షాన్నముచే అతడు జీవించాలి భిక్ష దొరకనినాడు ఉపవసించాలి. సన్యాసి అల్పాహారముతో బ్రతకాలని, కష్టించి విద్యార్జనం చేయవలసిన బ్రహ్మచారి కడుపునిండా తినవలెనని కూడా దీనివల్ల ఏర్పడుతున్నదని మనం గ్రహించాలి.

''యతిశ్చ బ్రహ్మచారీ చ పక్వాన్నస్వామినా వుభౌ||''

అనే శాస్త్రం యతులకు, బ్రహ్మచారులకు పక్వాన్న జీవనం విధిస్తున్నది. కనుక వారికి అన్నం పెట్టే బాధ్యతను గృహస్థులకు కూడా విధిస్తున్నదన్నమాట. ఇలాభిక్షాన్నముచే జీవించే ఈ ఉభయుల వల్లా సంఘానికి కలిగే హాని ఏమీ లేకపోగా, ఎంతో మేలు కలుగుతున్న విషయం మనం గమనించాలి భిక్షాటనంచేస్తూ చదువుకొన్న విద్యార్థి వినీతుడగుటేకాక, అట్లు సంపాదించిన విద్యావినయములచే సద్గృహస్థుడై సంఘానికి మిక్కిలి ఉపయోగిస్తాడు. ఇక సన్యాసుల మాట అడుగుతారా? సంసారభారం మోయలేక భిక్ష వల్ల అనాయాస జీవనం జరుగుతుందికదా అని కావులుగట్టిన వారందరు సన్యాసులు కారు. అట్టివారు భిక్షార్హులు కారు. ఐహికాముష్మిక ఫ భోగవిరాగియై ఆలుబిడ్డలను, ఇల్లూవాకిలిని, సౌఖ్యములను విడనాడి, యధావిధిగా ఆశ్రమస్వీకారం చేసినవారే నిక్కపు సన్యాసులు. అట్టిసన్యాసం అందరికీ సుకరంగాదు. అట్టియతులే భిక్షార్హులు. బ్రహ్మనిష్ఠతో కాలంగడిపే అట్టి మహనీయులు ఉత్తమగతులకు మార్గం చూపెట్టుతూ వుంటారు. కనుక వారి వల్ల లోకాలకి మేలే కలుగుతుంది. అట్టి యతులు అరుదుగా ఉంటారు. వారిని భరించడం సంఘాని కొక కష్టంలోదికాదు.

లోకంలో మనకు కన్పించే సన్యాసులందరు అట్టి మహనీయులు కారు. బౌద్ధమతాన్ని అవలంబించినకొన్ని దేశాలలో ప్రజలందరు నియమనిగ్రహముల కోసం కొన్నాళ్ళు భిక్షుక వృత్తి స్వీకరించాలనే నియమం ఉన్నది. వ్రతపరిసమాప్తియైన పిమ్మట కొందరు గృహస్థాశ్రమం స్వీకరిస్తారు. తక్కినవారు భిక్షులుగానే ఉండిపోతారు. అట్టి యథార్థభిక్షులనుచూచి, పనిపాటులొల్లని సోమరులు గూడా కొందరాదేశాలలో కావులుగట్టి భిక్షాటనం వల్ల ఆశ్రమజీవనం చేస్తూ ఉండడం కద్దు.

అట్లే మన దక్షణ దేశంలో కొందరు పరదేశులమనీ, ఉత్తరదేశంలో సాధులమనీ బయలుదేరి భిక్షాటనముచే సుఖంగాజీవిస్తూ ఉంటారు. సన్యాసులకువిహితమైన వ్రతపాలనంకానీ, నియమనిష్ఠలుకాని, సంప్రదాయంకాని, ఆశ్రమస్వీకారంగాని వీరికక్కరలేదు. పొట్టకోసం దేవులాటేతప్ప వీరికి బ్రహ్మనిష్ఠతో పనిలేదు. పరోపజీవనం చేసే ఈ సోమరులను పరిహరించవలసిందే. మేము కాదనము. కానీ ఈ కలుపు మొక్కలను ఊడబెరికేయత్నంలో పైరు మొక్కలనుగూడా పీకివేయవలదనే మేము చెప్పేది. లోకసంగ్రహార్థం ఆశ్రమస్వీకారం చేసిన యథార్థ యతులను సోమరులని తెగనాడదగదు. దండ కమండులు ధారణంవల్ల, వైరాగ్యవర్తనంవల్ల గుర్తింపదగిన యదార్థసన్యాసులు ఒకానొక అచ్చమైన సంప్రదాయంలో వారై ఉంటారని కూడా మనం గ్రహించాలి.

సన్యాసులకొక సంఘమంటూ అక్కరలేదు. ఏకాంతవాసం చేయుటేతప్ప సంఘాలుగాకూడటం సన్యాసుల లక్షణంకాదు. సంఘములుగగూడిన సన్యాసులు ఆశ్రమధర్మభ్రష్టులై తామూ లోకసామాన్యంలో చేరిపోతారు.

కాబట్టి సన్యాసులకు, బ్రహ్మచారులకేతప్ప ఇతరులకు భిక్షాజీవనం పనికిరాదు. పనిపాటులొల్లక భిక్షాటనంచేసే సోమరితనాన్ని మాన్పుటకు రెండు ఉపాయములు కన్పిస్తున్నవి (1) బహుజనులకు విరివిగా పనికల్పించటం (2) సంపన్నుల భోగానుభవాలకు నిరుపేద కష్టజీవనానికి వుండే వ్యత్యాసాన్ని తగ్గించడం వీనిలో మొదటిపని ప్రభుత్వానిది, రెండవది ప్రజలది జీవనపుటంతస్తు (స్టాండర్డు ఆఫ్ లివింగ్) పెరుగవలెనంటూ నేడుపఠించే మంత్రాలకు ఫలితమేమిటంటే, భోగసక్తి పెరగడమే భోగాలను విడనాడి, గ్రాసవాసోదైన్యం లేకుండా, మితంగా, సామ్యంగా బ్రతకడమే నిజమైన సోషలిజమనిపించుకుంటుంది. శీతావాతాతపముల నుండి రక్షించే సముచిత వస్త్రధారణం, జిహ్వాచాపల్యం కోసం కాక శరీరధారణం కోసం భుక్తి. ఇదే సోషలిజపు లక్షణము దేహధారణ మాత్రమైన భుక్తియే అపరిగ్రహమనిపించుకొంటుంది. దేశసంపదను విజ్ఞానాభివృద్ధికి, దేశరక్షణకు వినియోగించాలేకాని భోగానుభవాలకై వెచ్చించకూడదు. జీవనవ్యయాన్ని సరళజీవనానికిసరిపడేటట్లుతగ్గించాలిగాని పెంచకూడదు. అలాచేస్తే ప్రజలందరకు సరిపడ్డ కూడు గుడ్డలు, నివాసమూ లభిస్తవి.

నేడు అదనపు సంపదగల దేశాలు, పురుషులు ఆ సంపదను రాజకీయంగా తమతో ఏకీభవించే దేశాలకు, యుద్ధంలో తమకు తోడ్పడే దేశాలకు పంచిపెట్టడం జరుగుతూ ఉంది. ఇది కూడనిపని. అదనపుసంపదను పేదదేశాలకు, ప్రజలకు ఇవ్వడం న్యాయం. ఏ దేశానికాదేశం తమకున్న సంపదతో తృప్తి పడటం నేర్చుకుంటే, జీవనపుటంతస్థుననుభవించే దేశాలు ఆ యంతస్తును కాపాడుకోవడాని కెప్పటికప్పుడు విదేశ విపణులను ఆక్రమించుకొంటూ వుండటం, ఆ కృత్రిమపు వాపు ఎప్పుడు బుస్సున తీసిపోతుందో అని భయపడతూ వుండడం తప్పదు. మింటిఎత్తు పెరిగినవానికి పడిపోతానేమో అనే భీతి వెంటాడుతూనే వుంటుంది. ఇతర దేశాలను అనుకరిస్తే, ఎప్పటికైనా మనకూ ఈ దురవస్థ పట్టుతుంది.

ఇంతకూ సన్యాసానికి, సంఘటనకు చుక్కెదురనేది ప్రస్తుతం. సన్యాసులను పోషించే భారాన్ని సంఘం వహించక తప్పదు. పొట్టకోసం భిక్షాటనం చేసేవారికి పనిపాటులు చూపించాలి. యధావిధిగా ఆశ్రమ స్వీకారం చేసిన సన్యాసులను, పరోపజీవనం చేసే సోమరులను

నిందింపరాదు. సన్యాసులను సంఘటితపరచి, ప్రభుత్వం చేయవలసిన పనులను వారిచే చేయింప బూనడం కూడా యుక్తంగాదు.

అపార కరుణాసింధుం జ్ఞానదం శాంతరూపిణం
శ్రీ చంద్రశేఖర గురుం ప్రణమామి ముదావహం ॥

--- "జగద్గురు బోధలు" నుండి

#KanchiParamacharyaVaibhavam #కంచిపరమాచార్యవైభవం
2/4/18, 10:02 - Paramacharyulu: శ్రీ శ్రీ శ్రీ చంద్రశేఖర భారతీ  మహాస్వామి వారు అంతర్ముఖ సమాధి యందు ఉన్నారు. అయన ఉన్నట్టుండి ఒక శ్లోకం చెప్పి ఒక అతని పేరు చెప్పారు.

జగదంబా పదస్మర్తుః నహి దుఖం కదాచన
యది జయేత నూనం తత్ సుఖోదర్కాయ కేవలం.

అమ్మవారి పద చింతన చేసేవారలకు దుఖం కలుగదు. ఒకవేళ ఇబ్బందులు ఏమైనా వచ్చినా కూడా, అవి మంచి కొరకే.

అప్పుడు స్వామి వారి పక్కనే ఉన్న శ్రీ భాష్యం స్వామికి ఎమి చేయాలో పాలుపోలేదు. మహాస్వామి వారు "పో, పో, వ్రాయి"  అని చెప్పగానే, ఆ శ్లోకాన్ని వ్రాసి స్వామి వారు చేత పలుకబడిన వ్యక్తికి టెలీగ్రాం పంపారు.

కొద్ది రోజులకు ఆ వ్యక్తి ఆచార్యుల దర్శనం కొరకు శృంగేరీ వచ్చారు. విషయ ప్రస్తావనలో, అతని ఉద్యోగం పాయిందని, పూట గడవడం కష్టమైపోయిందని చెప్పాడు. అతనికి స్వామివారు ఇతః పూర్వం అమ్మవారి మూర్తి ఒకటి అనుగ్రహించారు. ఉద్యోగం ఉన్నప్పుడు చక్కగా అర్చన చేసేవాడు కాని, ఉద్యోగం పోయిన తరువాత శ్రద్ధ సన్నగిల్లి, అర్చన సరిగ్గా చేసేవాడు కాదుట. ఆ సమయంలోనే టెలీగ్రాం ద్వారా గురు సందేశం అందింది. రెట్టించిన ఉత్సాహంతో తిరిగి అర్చన ప్రారంభించాడు. అతనికి మళ్ళీ ఉద్యోగం దొరికి, జీవితంలో ఆర్థిక పరంగా ఏ ఇబ్బందులు లేకుండా జీవించాడు.

సద్గురువును మన శ్రేయోభిలాషిగా, ఈ ప్రపంచంలో నిజమైన బంధువు/మిత్రునిగా హృదయంలో పదిలంగా నిలుపుకోవడానికి ఇది ఒక ఉదాహరణ.

---శ్రీభాష్య స్వామి, "గురుకృపా విలాసం" నుండి
2/4/18, 19:22 - Paramacharyulu: <Media omitted>
2/5/18, 08:23 - Paramacharyulu: ఏడురోజులు మిగిలింది

శ్రీవారు అప్పుడప్పుడూ అస్వస్థతకు లోనవుతూండేవారు. కానీ ఒక్కరోజుకూడా ఆ కారణంగా చంద్రమౌళీశ్వరపూజ మానలేదు. ఎన్నడూ పూజను త్వరగాముగించలేదు, ఏభాగమూ అలక్ష్యం చేయనూలేదు.

1945 లో శ్రీవారికి గుండెపోటు వచ్చింది. నార్త్ఆర్కాటుకు చెందిన డాక్టరు, మైలాపూర్ టీ ఎన్ కృష్ణస్వామి శ్రీవారిని పరిశీలించి ఇలా అన్నారు -  "శ్రీవారి నాడి బలహీనంగా ఉంది, గుండె పరిస్థితి బాగోలేదు. నేను చెయ్యగలిగినదంతా చేస్తాను, కానీ హామీ ఇవ్వలేను ."

శ్రీవారు ఆయుర్వేదానికి ప్రాముఖ్యం ఇచ్చేవారు. వారు, మేలగరం ఘనపాఠిగారికి కబురుపెట్టారు. ఘనపాఠిగారు బహుశాస్త్రకోవిదులు. వేదములు, ఆయుర్వేదం, జ్యోతిషం మొదలైన వాటిలో అపారమైన పాండిత్యం ఉంది. వారు శ్రీవారి మణికట్టు పట్టుకుని నాడి పరిశీలించారు.

ఇలాంటి వ్యక్తులకు వంశపారంపర్యంగా నాడీ పరిశీలనం వస్తుంది. చేతి లావు, బిగువు చూసి మనిషి పరిస్థితి చెప్పేస్తారు. ఇలా చెప్పటాన్ని 'దాదు' అంటారు.  స్త్రీ గర్భం ధరించిన నెలలోపలే, వైద్యులు గర్భం నిర్ధారించకముందే,  ఎడమచెయ్యి పట్టుకుని, ఖచ్చితంగా 'మీకు అబ్బాయ'నో, 'మనుమరాల'నో చెప్పేస్తారు. అలాగే జరిగితీరుతుంది. నాడి లెక్కబెట్టి ఈ మనిషి ఇన్ని రోజులు, వారాలు, సంవత్సరాలు బతుకుతాడని చెప్పేస్తారు.  ఆరోగ్య పరిస్థితి అవగాహనకోసం మగవారికి కుడిచెయ్యి, ఆడువారికి ఎడమచెయ్యి పట్టుకుంటారు.

ఘనపాఠిగారు శ్రీవారి నాడి పరిశీలించి - "ఏడురోజులు మిగిలింది" అన్నారు. తరువాత శ్రీవారి జాతకం తెప్పించుకుని, దానిని పరిశీలించారు, లెక్కకట్టారు - "జాతకం ఈ రోజుకు ఎనిమిదిరోజులంటోంది" అన్నారు.

ఇంకా ఇలా అన్నారు - " నేను శ్రీవారికి వైద్యం చెయ్యటానికి సిద్ధం. నేను చెప్పినవి తుచ తప్పకుండా చెయ్యాలి. వారి సమక్షంలో నాలుగు వేదాల పారాయణ జరగాలి. రాత్రులు రాక్షసులకూ, పగళ్ళు దేవతలకూ చెందుతాయి. అందుకని వేదపారాయణ రాత్రింబగళ్ళు జరగాలి. ఒక ఆవుకి కేవలం నేరేడు ఆకులు మాత్రమే ఆహారంగా పెట్టాలి. నేరేడు ఆకులు, నీళ్ళు - అంతే. వేరే పశుగ్రాసం ఇవ్వరాదు. శ్రీవారు ఆ ఆవు పాలని మాత్రమే ఆహారంగా తీసుకోవాలి".

శ్రీవారు కంగారుపడ్డారు. "నా ఆరోగ్యం బాగవడానికి ఒక ఆవుని బాధించి కేవలం నేరేడుఆకులే ఆహారంగా పెట్టాలా ? ఆవుకి అది సరిపోతుందా ? ఆవుకి జరకూడనిదేమైనా జరిగితే ? ఆ పాతకం మనపైకి ఎందుకు తెచ్చుకోవటం ?"

"నాకు ఆవు ప్రాణాలని మంత్రాల ద్వారా రక్షించగల శక్తి ఉంది" అన్నారు ఘనపాఠిగారు. "శ్రీవారు ఆ విషయమై ఆలోచించనక్కరలేదు. ఆ ఆవుని సజీవంగా ఉంచటం నా బాధ్యత".

వైద్యం కొన్ని రోజులు నడిచింది. ఎన్ని రోజులో నాకు సరిగ్గా గుర్తులేదు. శ్రీవారు ఎప్పటిలానే చంద్రమౌళీశ్వరపూజ చేసేవారు, ఆ పాలు తప్ప వేరేవేమీ తీసుకోలేదు. వేదపారాయణం జరిగేది. ఘనపాఠిగారు ఫలానా రోజున ఫలానా సమయం గడవాలని చెప్పారు. ఆ సమయం తరువాత ఆహారనియమం సడలింది. ఆరోజు చాలా అసాధారణమైనది. సరిగ్గా ఘనపాఠిగారు చెప్పినరోజున ఆ సమయానికి , వారు ముందే చెప్పినట్లు ఒక పెద్ద పిశాచం భూమ్యాకాశాల మధ్యలో కనిపించింది. కనీసం పదిమంది - పాఠశాల వెంకట్రామన్, సిమిచి వంచిఅయ్యర్, కుల్ల శీను, ఇంకా కొంతమంది - దాన్ని చూశారు. సేతురామన్ అప్పటికి చిన్నవాడు, వాడూ చూశాడు. ఇది సత్యం, నేనిప్పుడు చెబుతున్నట్టే జరిగింది. ఘనపాఠివంటి వారు గొప్ప తపస్సంపన్నులు. ఎంతోమంది తపోనిష్ఠులు శ్రీవారివద్దకు వచ్చేవారు. శ్రీవారు ఎప్పుడూ పండితులమధ్యలో ఉండేవారు. ఇప్పుడు అంతా ఖాళీగా ఉంటున్నాం. ఘనపాఠిగారి అబ్బాయి జెమినీ ఇప్పుడు ఉన్నారు.

"ఇంక భయపడాల్సిందేమీ లేదు. పిశాచం పారిపోయింది. శ్రీవారు నూరేళ్ళు జీవిస్తారు" అన్నారు ఘనపాఠిగారు.

భగవంతుడి కరుణవల్ల ఆ ఆవు ఏ ఇబ్బందీ లేకుండా ఉంది. నేరేడు ఆకులే తిని, నీరు మాత్రమే త్రాగినా ఆరోగ్యంగానే ఉంది. శ్రీవారిని అమితంగా ప్రేమించే కొంతమంది భక్తులు ఇదంతా చూసి కదిలిపోయారు. వారు అన్నారూ -

" మానవజన్మ ఏపాటిది ? ఇలాంటి ఆవులా పుట్టినా ఈ జన్మలోనే మోక్షం లభించేది. ఈ ఆవు గతజన్మలలో ఎంత పుణ్యం మూటగట్టుకుందో ఎవరు చెప్పగలరు ?"

అపార కరుణాసింధుం జ్ఞానదం శాంతరూపిణం
శ్రీ చంద్రశేఖర గురుం ప్రణమామి ముదావహం ॥

--- శ్రీమఠం బాలు మామ, jagadguru-vaibhavam.blogspot.in నుండి

#KanchiParamacharyaVaibhavam #కంచిపరమాచార్యవైభవం
2/5/18, 12:08 - Paramacharyulu: ఒక వస్తువును కాని, వ్యక్తిని కాని ప్రేమించడం లేదా ద్వేషించడం అనేది ప్రతి వ్యక్తి యొక్క వివేచనపైన ఆధారపడి ఉంటుంది. ఇష్టము, తృప్తి అనే రెండు విషయాలపై మన కర్మలు తిరుగుతూ ఉంటాయి. సుఖములు వెతుక్కుంటూ వెళ్తూ, నిజమైన సుఖం తనలోనే ఉన్నదని విషయాన్ని మనిషి విస్మరిస్తున్నాడు

--- శ్రీశ్రీశ్రీ భారతితీర్థ మహాస్వామి

#SringeriJagadguruVaibhavam #శృంగేరిజగద్గురువైభవం
2/5/18, 17:06 - Paramacharyulu: శ్రీ శ్రీ శ్రీ చంద్రశేఖరేంద్ర మహాస్వామి వారు దక్షిణ దేశంలోని చిదంబరం యాత్ర ముగించుకొని, సమీపం లో ఉన్న ఆనందతాండవపురం చేరారు.

ఆ ఊరిలో పండితులు, ప్రజలు స్వామికి అఖండ స్వాగతం పలికారు.

ఆ జనసమూహంలో అనేకమంది బాలురున్నారు. ఆ బాలురందరినీ పిలిచి , 'శ్రీ రామాయనమః' అని నూరు పర్యాయాలు రాసి, ఆ వ్రాసిన పత్రాలను తనకు చూపించవలసినదిగా మహాస్వామి వారికి చెప్పారు. అదేవిధంగా వారంతా 'శ్రీ రామాయనమః' అని నూరు సార్లు వ్రాసి, ఆ పత్రాలన్నింటిని స్వామికి సమర్పించారు.

వారందరికి ఒక్కొక్కరికి ఒక్కొక కామాక్షి అమ్మవారి బంగారు ముద్రను స్వామి వారు బహూకరించారు.

వారిలో ఒక బాలునికి అమ్మవారి ముద్ర ఇవ్వబోతూ, స్వామి అరవంలో "సొల్లు సొల్లు." నీవు వ్రాసింది నీ నోటితో 'చెప్పు, చెప్పు' అని ఆదేశించారు. అక్కడ స్వామి చుట్టూ మూగిన పండితులందరూ "అయం మూకః, అయం మూకః" (అతడు మూగవాడు మూగవాడు) అని సంస్కృతంలో స్వామికి విన్నవించారు.

అయినా, స్వామి వారి మాటలను విననట్టుగా మరల ఆ పిల్లవానివైపు తిరిగి "నీ సొల్లు, సొల్లు" (నీవు చెప్పు చెప్పు) అన్నారు. అంతట ఆ బాలుడు "శ్రీ రామాయనమః" అని అందరూ వినేట్టు బిగ్గరగా అన్నాడు.

"మూకం కరోతి వాచాలం!"

ఆ సంఘటనను శ్రీ కల్లూరి వేంకట సుబ్రహ్మణ్య దీక్షితులు గారు స్వయంగా చూచినది.

#KanchiParamacharyaVaibhavam #Paramacharya
2/5/18, 20:58 - Paramacharyulu: [illegible]
సభ్యులకు విన్నపం

దయచేసి ఎవరూ పోస్ట్స్ కి రిప్లై ఇవ్వకండి. ఎలాంటి ఫార్వార్డ్ మెసేజస్ పంపకండి.

Don't post or reply anything.

అతిక్రమించినవారిని బ్లాక్ చేస్తాము
□□□□□□□□□□□
2/5/18, 21:26 - Paramacharyulu: <Media omitted>
2/6/18, 07:13 - Paramacharyulu: శ్రేష్టిదార్ అని పిలవొచ్చునా?

నేను కాంచీపురంలోనే ఉండడంవల్ల ప్రతిరోజూ మహాస్వామివారి దర్శనభాగ్యం దొరికేది. ఒకసారి శ్రీమఠంలో ఏదో ఆరాధన స౦దర్భ౦గా కావల్సినంత మంది వైదికులు దొరకకలేదు. పరమాచార్య స్వామివారు నాపేరు సిఫారసు చేసి వేరే వాళ్లతో పాటుగా ఆ కార్యక్రమంలో వైదికునిగా పాలుపంచుకునే భాగ్యాన్ని నాకు ప్రసాదించారు. భోజనాలు అయిన తరువాత నన్ను పిలిచి సహస్ర గాయత్రి చెయ్యమన్నారు. ఆ ఆరాధనలో వైదికునిగా పాల్గొన్నదానికి పరిహారంగా.

నాకు చెంగల్పేట్ న్యాయాలయానికి బదిలీ అవ్వడంతో నాకు పరమాచార్య స్వామివారి దర్శన భాగ్యం తగ్గిపోయింది. కాబట్టి ప్రతి నెల అనుషం (స్వామివారి జన్మ నక్షత్రమైన అనూరాధ నక్షత్రం) రోజు కాంచీపురానికి వెళ్ళి కామాక్షి అమ్మవారి ఆలయంలో త్రిశతి అర్చన చెయ్యించి, ప్రసాదాన్ని పరమాచార్య స్వామివారికి సమర్పించి వారిని దర్శించుకొనేవాణ్ణి. ఒకసారి అలా వెళ్ళగా శ్రీమఠం ఆరోజు భక్తులతో చాలా రద్దీగా ఉంది. దర్శించుకుని బయటకు వచ్చే భక్తులవద్ద ఉన్నాను నేను. మహాస్వామివారు దగ్గర ఉన్న సేవకునితో “శ్రేష్టిదార్ ని పిలువు” అని ఆదేశించారు.

కొంతమంది మా గుంపువైపు “శ్రేష్టిదార్ శ్రేష్టిదార్” అని అరిచారు. ఎవరో నన్ను తీసుకునివెళ్ళి మహాస్వామివారి ముందు నిలబెట్టారు. వారు స్వామితో, “శ్రేష్టిదార్ ఎవరూ లేరు. కోర్టు నుండి ఈ పెద్ద గుమాస్తా ఉన్నారు” అని చెప్పారు. నేను స్వామితో, “పెరియవ నేను శ్రేష్టిదార్ ను కాను, హెడ్ క్లర్క్ ని అని చెప్పాను”.

కాని స్వామివారు పట్టుబట్టి “ఎందుకు నువ్వు శ్రేష్టిదార్ కాకూడదు?” అని అడిగారు.

నేనూ ఖచ్చితంగానే సమాధానం చెప్పాను. “నాకు దానికి కావాల్సిన విద్యార్హతలు లేవు. నేను కేవలం SSLC ముగించాను. నా కిందన ఉన్నవాళ్ళు న్యాయశాస్త్రంలో BA.,BL, MA.,BL మొదలైనవి పూర్తిచేసినవారు. కాబట్టి విదార్హతలను బట్టి నాకు రాదు. అదీగాక, బెంచిలో ఉన్న జిల్లా న్యాయాధికారి పరమ కఠినుడు కనుక నా పేరును సిఫారసు చెయ్యడు. కాబట్టి నేను శ్రేష్టిదార్ ను కాలేను” అని చెప్పాను. స్వామివారు నాకు వెళ్ళడానికి అనుమతినిచ్చారు.

కొన్నిరోజుల తరువాత చెన్నై న్యాయాలయం నుండి కొంతమంది తనిఖీకి వచ్చారు. వారు నా శక్తి సామర్థ్యాలను పరిశీలించి హైకోర్టు జడ్జికి ఒక రహస్య నివేదిక సమర్పించారు. కొన్నిరోజుల తరువాత నన్ను శ్రేష్టిదార్ గా చేస్తూ ఉత్తర్వులు వచ్చాయి. అందరికి ఆశ్చర్యం కలిగింది ఇది ఎలా సాధ్యం అని. కేవలం విద్యార్హతలను బట్టే ఉన్నత పదవులిస్తారు అనుకునే వారికి ఇది ఒక గుణపాఠం.

ఈలోగా, నేను తరువాతి అనుషానికి కాంచీపురం వెళ్ళాను. పరమాచార్య స్వామివారి ముందు కామాక్షి అమ్మవారి ప్రసాదం పెట్టగానే స్వామివారు చెయ్యెత్తి తమ తలపై ఉంచుకుని శ్రేష్టిదార్ (‘హెడ్’, ‘చీఫ్’) అని అర్థం స్ఫురించేట్టుగా నాకు చూపిస్తూ “ఇప్పుడు నిన్ను శ్రేష్టిదార్ అని పిలవొచ్చునా?” అని అడిగారు.

స్వామివారు అలా అనగానే నా ఒళ్ళు గగుర్పాటుకు గురి అయ్యింది. నేను ఏమీ మాట్లాడలేకున్నాను. నేను చెయ్యగలిగింది ‘దైవం మానుష రూపేణా’ అన్నట్టుగా నా ఎదురుగా ఉన్న సర్వేశ్వరునికి సాష్టాంగం చేసి నా కన్నీళ్లతో వారి పాదపద్మములను కడగడమే. వారే నాకు ఉద్యోగోన్నతి కల్పించినవారు. జరగబోయేది ఏమిటో ఆ దైవానికే తెలుసు అని ఆరోజే నాకు అర్థం అయ్యింది.

--- పి.కె రామనాథన్, చెన్నై. మహాపెరియవళ్ – దరిశన అనుభవంగళ్ 6

#KanchiParamacharyaVaibhavam #కంచిపరమాచార్యవైభవం
2/6/18, 10:24 - Paramacharyulu: కర్మల యొక్క ఫలితములను గురించి ఆలోచించే వారి మనస్సు నిలకడగా ఉండదు. కాబట్టి ఫలితమును గూర్చి ఆలోచించకుండా కర్మలను ఆచరించువాడు యోగి అవుతాడు. అతని దృష్టి ఎల్లప్పుడూ కర్మపైననే ఉంటుంది

--- శ్రీశ్రీశ్రీ భారతితీర్థ మహాస్వామి

#SringeriJagadguruVaibhavam #శృంగేరిజగద్గురువైభవం
2/7/18, 07:12 - Paramacharyulu: గీతలలో యోగత్రయం

గీతలో కృష్ణపరమాత్మ అర్జుననకు చేసిన ఉపదేశాలు పరస్పరవిరుద్ధంగాకనిపిస్తవి. స్వధర్మాన్ని అనుష్ఠించవలసిందనీ, కర్మలనాచరించవలసిందనీ, అనేక పర్యాయములుపదేశించారు. 'తస్మాత్ యుధ్యస్వ భారత' కాబట్టి అర్జునా! నువ్వు యుద్ధం చేయవలసిందని, 'కురు కర్మైవ తస్మాత్ త్వం' కాబట్టి కర్మాచరణం చేయుమనీ, 'కార్యం కర్మ కరోతి యః' ఎవడు చేయదగిన కర్మ చేస్తాడో అనీ, 'నిత్యం కురు కర్మ త్వం' నిత్యమూ కర్మనాచరింపుమనీ, 'యజ్ఞార్థాత్ కర్మణోన్యత్ర' యజ్ఞంకొరకు కర్మ చేయుమనీ,

(ఇచట యజ్ఞమనగా ఈశ్వరుడని గ్రహించాలి)-ఇలా అనేక ప్రదేశములం దుపదేశించారు. తుది అధ్యాయములో 'స్వే స్వే కర్మణ్యభిరతః సంసిద్ధిం లభతే నరః' ఎవరి స్వకర్మ వారు చేసితీరవలెనన్నారు. ఈవాక్యములవల్ల భగవంతుడు కర్మయోగాన్నే అర్జునున కుపదేశించినట్లు స్పష్టమవుతున్నది. గీతారహస్యమనే కర్మయోగమందు శ్రీ లోకమాన్య తిలక్ కర్మయోగమే గీతోపదేశసర్వస్వ మని అభిప్రాయం వెలిబుచ్చారు.

గీతలలో ఇంకొకచోట ''నైవ కుర్వన్ న కారయన్'' చేయుట, చేయించుట తగదనే ఉపదేశం కనుపిస్తున్నది. 'రహసి స్థితః ఏకాకీ' ఏ కాంతమందు ఒంటరిగా ఉండవలసిందని మరో ఉపదేశంకూడా ఉంది గీతలలోనే. వీటివల్ల కర్మాచరణం నిరాకృతమైనట్లు కనిపిస్తుంది. కర్మయే ప్రధానంగా చెప్పినప్పుడు భక్తి జ్ఞానములు అంగములుగా చెబుతారు. కృష్ణపరమాత్మ. అట్లే భక్తినిగానీ, జ్ఞానముగానీ ప్రధానంగా చెప్పేటప్పుడు తక్కిన రెంటినీ అంగములుగా చెపుతారు. ఈ వివిధోపదేశములకు ఏక వాక్యతను ఆచార్య శంకరులు తమ భాష్యంలో కల్పించారు.

''యతః ప్రవృత్తిర్భూతానాం యేన సర్వమిదం తతం,
స్వకర్మణా త మభ్యర్చ్య సిద్ధిం విందతి మానవః''

అనే శ్లోకంలో ఉత్తరార్ధాన్ని వ్యాఖ్యానిస్తూ, ఇచట సిద్ధి అనగా అవ్యవహితమోక్షం కాదనీ, చిత్తశుద్ధీ, యోగసిద్ధి మాత్రమేనని. ఇవి జ్ఞానసాధన మవుతువనీ (జ్ఞాననిష్ఠాయోగ్యతా లక్షణాం సిద్ధిమ్) అర్థం చెప్పారు ఆచార్యులవారు. కర్మలవల్ల చిత్తశుద్ధీ, యోగంవల్ల ఏకాగ్రతా కలిగి బ్రహ్మజ్ఞానానికి సాధనాలవుతాయన్నారు. కామకలుషితమయి ఏకాగ్రతలేని మనస్సునందు జ్ఞానజ్యోతి ప్రవేశింపజాలదన్నారు.

భక్తికూడా కర్మవలెనే జ్ఞానసాధన మాత్రమే అవుతుంది. ''భక్త్యా మా మభిజానతి యావాన్ యశ్చాస్మి తత్త్వతః'' భక్తివల్ల నానాత్వం పరిపూర్ణంగా తెలియబడదన్నారు. భగవంతుడు భక్తికి నామరూపగుణకల్పనం అవసరమవుతుంది. కనుక ఆ కల్పనచే పరమాత్మతత్వం పరిమితి కాక తప్పదు. అట్టిభక్తికి పరమేశ్వరానుగ్రహమే ఫలం. ఆ యనుగ్రహంవల్ల పరబ్రహ్మతత్త్వంఅవగతమవుతుంది. (తతో మాం తత్వతో జ్ఞాత్వా) ఆ జ్ఞానంవల్ల భక్తుడు పరమాత్మయందు లయమును పొందుతాడు. ''విశతే తదనంతరం'' అంటున్నది గీత. నీటిలోవేసిన మంచుగడ్డ కరిగి నీటితో కలిసిపోయినట్లు, సముద్రాన్ని పొందిన నదులు సముద్రమే అయిపోయినట్లు, పరమాత్మయందు లయంపొందినభక్తుడు అభేదమునుపొందుతాడని తాత్పర్యం. తదనంతర మనే మాటవల్ల వ్యవధానంగా అని గ్రహించగూడదు, వెంటనే అంతరంలేకుండా అద్వయభావం పొందుతాడని గ్రహించవలసివుంటుంది.

కాబట్టి ఈ కర్మ-భక్తి-జ్ఞాన యోగములు అధికారి తారతమ్యాన్నిబట్టి ఉపదేశింపబడినవి, కర్మాభిరతివల్ల భక్తి, భక్తి వల్ల జ్ఞానమూ కలుగుతవి. అర్జునుడు విషాదయోగంలో పడియున్నాడు గనుక మందుగ శ్రీకృష్ణు డాతనికి కర్మయోగాన్ని ఉపదేశించారు. విషణ్ణచిత్తునకు చెప్పవలసిన దప్పటికి అంతే. కనుక, భగవంతుడు ముందు కర్మను ఉపదేశించవలసి వచ్చింది.

అపార కరుణాసింధుం జ్ఞానదం శాంతరూపిణం
శ్రీ చంద్రశేఖర గురుం ప్రణమామి ముదావహం ॥

--- “జగద్గురు బోధలు” నుండి

#KanchiParamacharyaVaibhavam #కంచిపరమాచార్యవైభవం
2/7/18, 07:12 - This chat may be with a business account. Tap for more info.
2/7/18, 12:44 - Paramacharyulu: <Media omitted>
2/7/18, 15:59 - Paramacharyulu: శ్రీ గురుభ్యోనమః

ఒకనాడు రామేశ్వరంలో అగ్ని తీర్థానికి ఎదురుగా సముద్రతీరంలో ఆదిశంకర మంటపం నిర్మించాలని స్వాములవారు సంకల్పించారు.

మంటపం అగ్ర భాగంలో ఆదిశంకర భగవత్పాదుల విగ్రహము ఆయన నలుగురు శిష్యుల విగ్రహాలు నెలకొల్పటానికి నిశ్చయించినారు. చలువరాతితో తయారు చేసిన ఆ ఐదు విగ్రహాలు ఒకొక్కటి మనిషి ప్రమాణం కంటే పెద్దవి.

మంటపంతో పాటు విగ్రహాలు తయారుచేసే మొత్తం పని శ్రీ సుబ్బయ స్థపతి గారికి అప్పగించారు స్వామివారు. పుణ్యకార్యం కావటంచేత మొత్తం భాధ్యత స్వామీ ఆయనపై పెట్టటం వల్ల భక్తితో పనిలో దిగారు. అడపాదపా కంచికి వెళ్ళేవారు. మఠంలో స్వామీవారిని సందర్శించి మంటపం పని గురించి వివరించేవారు.

ఆ సందర్భంలో ఒకసారి స్వామివారికి ఆయనకు ఇలా సంభాషణ జరిగింది.

స్వామి: ఏం స్థపతి, ఎట్లా నడుస్తున్నది మంటపం పని? అనుకున్నట్లు జరుగుతున్నదా?? అక్కడ మీకు ఇబ్బందులేవీ లేకుండా సౌకర్యాలన్నీ అమరుతున్నయా?? మనం పెట్టుకున్న ముహూర్తానికి మొత్తం పని పూర్తి అవుతుందా??

స్థపతి: స్వామీ అన్నీ సాఫీగానే జరుగుతున్నది మాకు ఏ కొరత లేదు ఏ నెలకానేల పని వాళ్ళందరికీ జీతాలు సక్రమంగా ముట్టుతూనే ఉన్నవి. తమ దయా, కామాక్షి అమ్మవారి కటాక్షముంటే, మనం పెట్టుకున్న ముహూర్తం నాటికి అంతా సిద్ధమవడానికి ఏ ఆటంకం ఉండదు కానీ...

స్వామి: ఏమిటి **కానీ** అంటున్నావు ?

స్థపతి:( మౌనం వహించారు )

స్వామి : ఎందుకటా మాట్లాడకుండా ఉంటావు ? సందేహం లేకుండా ఉన్నది ఉన్నట్లు చెప్పు.

స్థపతి: అంతా సవ్యంగానే జరుగుతూ ఉన్నది స్వామీ !! ఒక్కటే చిన్న ఆటంకం...

స్వామి: నీళ్ళు నమలకుండా చెప్పు స్థపతీ!! నాతో చెప్పడానికి నీకేం భయం ?? ఏమి జరిగిందో వివరంగా చెప్పు.

స్థపతి : శంకరుల వారి విగ్రహం నేనే స్వయంగా చేక్కుతున్నాను స్వామీ.ఇన్నాళ్ళబట్టీ పని చకచకా సాగుతూనే వచ్చింది. అయితే, విగ్రహానికి ముఖం మీద, కంటికి సమీపంలో అంగుళం వెడల్పున ఒక నల్ల మచ్చ కనిపించింది అది రాతిలోనే ఉన్నది. ఇంతకాలంగా అది పైకి రాలేదు. ఇప్పుడే బయటపడింది. అదెంత లోతుగా ఉన్నదో చెప్పలేను. కొంత చెక్కి చూసాను తగ్గటంలేదు. ఏమి చెయ్యడానికి తోచడంలేదు.  ఆ అభ్యంతరం ఒక్కటీ తీరిపోతే విగ్రహాలన్నీ ముహూర్తం నాటికి తయారైనట్టే.

స్వామి: ఇది నిజమైన ఆటంకమే !! అందులో మూల విగ్రహానికి, ఇంకోచోట, ఇంకోచోటగాక నొసటమీదనే ఆ మచ్చ ఉండరాదు. నిజమే కానీ ప్రయత్నం చెయ్యి. అమ్మ అనుగ్రహిస్తే, అంతా అనుకూలంగా జరగవచ్చు.

స్థపతి స్వామివారికి నమస్కారం చేసి, సెలవు తీసుకుని రామేశ్వరం వెళ్ళారు.

నెలరోజుల తరువాత మళ్ళీ ఒకసారి కంచికి వచ్చి మఠంలో స్వామి వారి దర్శనం చేశారు. మంటపం పని ఏదేది ఎంతవరకు వచ్చిందో సవిస్తారంగా స్వామికి నివేదించారు.

అంతావిని, స్వామి అడిగారు: "సరేగాని, క్రిందటిసారి నీవు వచ్చినప్పుడు శంకరుల విగ్రహానికి నొసటిపైన రాతిలో కనిపించింది అన్నావే, అదేమైంది ?? దాని సంగతి చెప్పలేదేం ??"

స్థపతి : (నవ్వు మోముతో ) స్వామీ, దాని పరిమాణంలో కొంత తగ్గింది. ఇంకా ఒక కాసు వెడల్పు ఉన్నది.

స్వామి: సరే. నీవు చేయవలసిన ప్రయత్నమంతా చేస్తూ ఉండు. దాని సంగతి విచారించకు. ఇక వెళ్ళు.

ఇదే విధంగా స్థపతి వారు మూడు నాలుగుసార్లు కంచికివెళ్లి, స్వామిని సందర్శించడం, మండప నిర్మాణం ఎంతవరకు వచ్చిందీ స్వామికి నివేదించడం జరిగింది. వెళ్ళినప్పుడల్లా స్వామి ఆ మచ్చను గురించి స్థపతిని అడుగుతూ ఉండేవారు, మచ్చ ఏ మాత్రం తగ్గిపోయిందో స్థపతి స్వామికి విన్నవించేవారు.

చివరకు మంటపానికి ప్రారంభోత్సవం జరగవలసి ఉన్నది. కడపటి దఫా స్థపతి స్వామిని సందర్శించటానికి వచ్చారు.

స్వామి మళ్ళీ స్థపతిని అడిగారు. "ఏమైంది విగ్రహం ముఖంమీద ఆ మచ్చ ?? "

స్థపతికి కళ్ళనిండా నీళ్ళు నిండాయి. స్వామికి సాష్టాంగ నమస్కారం చేసి "స్వామీ, స్వామీ !! వెంట్రుకవాసి కుడా లేకుండా మచ్చ పూర్తిగా మాయమయింది. ***ఏల్లాం స్వామి అనుగ్రహందా !!** అంటూ ఆనంద భాష్పాలు తుడుచుకున్నాడు !!.

#KanchiParamacharyaVaibhavam #Paramacharya
2/7/18, 16:04 - Paramacharyulu: Jagadguru Sri Sri Sri Jayendra Saraswati Swamiji is visiting Hyderabad from Kanchipuram and will stay at Skandagiri Temple.

You can have darshan at
6Feb 5:30pm onwards
7Feb 5:30pm onwards
8Feb Morning

HH is returning to Kanchipuram on 8th after noon.
▯▯▯▯▯▯▯
2/8/18, 06:51 - Paramacharyulu: మహాస్వామి - దలైలామ

1990 లో ఇద్దరి మధ్యన జరిగిన సంభాషణ సారాంశం.

మహాస్వామి: మీ ప్రయత్నాలు కూడా లేకపోయు౦ టే ఈపాటికి బౌద్ధం మన నుండి దూరం అయిపోయి ఉండేది.

దలైలామ: నేను ఏమి చేసానో నాకేమీ తెలియదు.

మహాస్వామి: మన సంస్కృతి యొక్క గొప్పతనానికి మీవంటి వారి ఉనికి ఓ ఉదాహరణ. ప్రజలు ఒక విశ్వాసాన్ని నమ్మాలంటే ఆ

విశ్వాసంలో ఉండి ఆచరించేవారిని చూసే దానికి ఆకర్షితులవుతారు. ఎందుకంటే ఎవరు చెప్పినదాన్నే అనుసరిస్తారో వారిని మాత్రమే ప్రజలు అనుకరిస్తారు. వారు ఆచరించక ఊరికే చెప్పేవాణ్ణి ఎవ్వరూ నమ్మరు.

తరువాత బౌద్ధ గురువు దలైలామ, పరమాచార్య స్వామివారిని "ఈ శతాబ్దపు ఏకైక సన్యాసిగా" అభివర్ణించారు.

నాకు సరిగ్గా గుర్తు ఉంటే ఇది జరిగినది 1992లో. ఈ సంభాషణ సారాంశము, ఈ చిత్రపటము హిందు పత్రికలో చూశాను. నేను పరమాచార్య స్వామివారి చిత్రపటం చూడగానే స్వామివారిని చూడాలనిపించి కంచి ప్రయాణమయ్యాను. ఎంతటి మధురానుభూతి కలిగింది నాకు. జీవితంలో మరచిపోలేను. కామాక్షి అమ్మవారి దర్శనం చేసుకుని, చంద్రమౌళీశ్వర పూజను తిలకించాను. తీర్థప్రసాదాలు తీసుకున్న తరువాత మహాస్వామివారి దర్శనభాగ్యం లభించింది.

స్వామివారు కొద్దిగా అనారోగ్యంగా ఉన్నారు. వాలు కుర్చీలో విశ్రాంతి తీసుకుంటున్నారు. వందలాది మంది భక్తులు ముకుళిత హస్తాలతో, తడిసిన కళ్ళతో స్వామివారిని దర్శించుకుంటున్నారు. ఇక తెరవేస్తారనగా స్వామివారు తల తిప్పి ఒక శిష్యుణ్ణి పిలిచి ఏదో ఆదేశించారు. ఆ శిష్యుడు రెండు ఆపిల్ పళ్ళను తీసుకుని స్వామివారి పాదాలు తాకించి మావైపు తీసుకుని వచ్చాడు. ఆ భాగ్యం కోసం మేమందరమూ చేతులు చాచాము. ఎంతటి భాగ్యం, ఆ ప్రసాదాన్ని నా చేతుల్లో పెట్టాడు ఆ శిష్యుడు. నా కన్నీళ్ళను ఆపుకోలేకపోయాను. ఇది నా జన్మసాఫల్యం.

కొద్దిగా ఉబ్బిన వారి కడుపు, వారు కళ్ళజోడును సరిచేసుకున్న తీరు నాకు ఇప్పటికీ జ్ఞాపకం.

--- 'సేజ్ ఆఫ్ కంచి' నుండి

#KanchiParamacharyaVaibhavam #కంచిపరమాచార్యవైభవం
2/8/18, 11:47 - Paramacharyulu: <Media omitted>
2/8/18, 17:33 - Paramacharyulu: <Media omitted>
2/9/18, 06:50 - Paramacharyulu: వర్షం పడిందా?

మా నాన్నగారు లేట్ శ్రీ యమ్. రాజాహ్ అయ్యర్, Ex. MLC, రామనాథపురం (రామ్నాడ్) జీవితం వల్ల నేను తెలుసుకున్నది పేదలకు సహాయం చెయ్యడం, ఉపాధ్యాయ వృత్తిలో అణగద్రొక్కబడినవారిని మన చేతనైన సహాయం చేసి ఆదుకోవడం. ఫెబ్రవరి 1974లో మా నాన్నగారు స్వర్గస్థులయ్యారు. రామ్నాడ్ లాంటి చిన్న ఊరిలో కూడా వారికి నివాళులర్పించడానికి జాతిబేధం లేకుండా కొన్ని వేలమంది పేదవారు హాజరయ్యారు. నేను వారి లక్ష్యాలను పాటించాలని తీర్మానించుకున్నాను. అప్పటికి నాకు పెళ్ళి కావల్సిన ఇద్దరి తోబుట్టువులు ఉన్నారు. కొన్ని కారణాలవల్ల మా చెల్లెలు రాజేశ్వరికి సరైన సంబంధం కుదరటం లేదు. నడిచే దైవం పరమాచార్య స్వామిని దర్శించాల్సిందిగా, వారి దర్శన భాగ్యం వల్ల మంచి జరుగుతుందని కొందరు చెప్పారు.

వారి మాటలను విశ్వసించి 1975 జూలై 4 శుక్రవారం నాడు స్వామివారి దర్శనానికై కంచి వెళ్ళాము. సాయింత్రం ఐదుగంటలప్పుడు కలవై చేరుకున్నాము. నాకు ఎలాంటి దుస్తులు వేసుకోవాలో తెలియక, ఫ్యాంటు, జులపాలు, చుబుకందాకా పెంచిన గడ్డంతో కలవై కొలను వద్దకు వెళ్ళాము. గురువుని చూడటానికి మహాస్వామివారు వస్తారని కొలను అవతలకు వెళ్ళమని ఒకరు చెప్పగా వెళ్తే అక్కడ నుదుటున పెద్ద తిలకంతో ఒక వృద్ధ సుమంగళి ఒకరు ఉన్నారు.

పరమాచార్య స్వామివారు ముగ్గురు అనుచరులతో అటుగా రావడం నేను చూశాను. గురువుల బృందావనాల ముందు కొద్దిసేపు ప్రార్థన చేశారు. నావైపు చూశారు. అప్పుడు నాకు కలిగిన అనుభూతిని ఎప్పటికీ మాటల్లో వర్ణించలేను. మరొక సారి ప్రదక్షిణం చేస్తూ మరలా నన్ను చూశారు. నా ఆహార్యాన్ని చూసి ఒక శిష్యుడు నేనవరని సైగచేసి అడిగాడు.

మహాస్వామి వారికి వినబడాలని, "నేను రామ్నాడ్ రాజాహ్ అయ్యర్ కుమారుణ్ణి" అని నేను గట్టిగా అరిచాను. కొన్ని నిముషాలపాటు స్వామివారు పట్టించుకోలేదు. నా పక్కనున్న ముసలావిడ కొద్దిగా చీత్కారంతో మృదువుగా "బాబు శ్రేష్టమైన శుక్రవారం రోజు స్వామివారిని ఇలా దర్శించుకునే భాగ్యం కలిగింది. ఫ్యాంటుతో, విచిత్ర వేషధారణతో వచ్చింది కాదని ఎందుకు అంత గట్టిగా అరుస్తావు? ఇలా చెయ్యడం నీకు సరియా?" అని అడిగింది.

నేను అలా అరవాల్సింది కాదని నా భార్య కూడా అన్నది. మేము అక్కడి నుండి ముందువైపుకు వెళ్దామని కదులుతుండగా స్వామివారు మరలా ఇటువైపు రావడం చూసి, ఆవిడ మాటలను గుర్తుకు తెచ్చుకుని చొక్కా విప్పి గోడవైపుకు పరిగెత్తాము.అప్పుడే అద్భుతం జరిగింది. అక్కడున్నవారికే అది తెలుసు.

మహాస్వామివారు సైగలతో నేను ఎవరని అడిగారు. నేను చిన్నగా రామ్నాడ్ రాజాహ్ అయ్యర్ కుమారుణ్ణి అని చెప్పాను. అప్పుడు స్వామివారు మా నాన్నగారి గురించి సైగల్తో చెబుతుండగా పక్కన ఉన్న శిష్యులు నాకు అర్థం అయ్యేలా చెబుతున్నారు. డా. సర్వేపల్లి రాధాకృష్ణన్ నుండి పురస్కారాన్ని పొందడం, శాసనమండలికి వారు చేసిన సేవ ఇలా దాదాపు 45 నిముషాల పాటు చెప్పారు. చాలా మంది దీన్ని చూస్తూ నిలబడ్డారు. నేను నా ప్రమేయం లేకుండానే చిన్నపిల్లడిలా ఏడుస్తున్నాను.

నేను రావడానికి కారణమేమని అడిగారు స్వామివారు. నాబాధను చెప్పుకున్నాను. నా చెల్లివైపు చూపిస్తూ "ఆ అమ్మాయి ఈ అమ్మాయేనా?" అని అడిగారు. నేను అవునని చెప్పాను. రుద్రాక్ష చుట్టూ వేలు తిప్పుతూ, పెళ్ళికి అన్ని ఆభరణాలు ఉన్నాయా అని అడిగారు. అన్నీ ఉన్నాయి, వరుణ్ణి వెతకడం తప్ప నేను చెయ్యవలసింది లేదని చెప్పాను.

స్వామివారు మా చెల్లిని దీవించారు. వారి కరుణ అపారమైనది. అప్పుడు సమయం ఆరు ముప్పావు కావడంతో బాగా చీకటిగా ఉందని నేను వెళ్ళబోయాను. వారి సాన్నిధ్యం నుండి వెళ్ళేటప్పుడు స్వామివారి అనుమతి తీసుకోవాలని నాకు తెలియదు.

స్వామివారిని అడగమని చెప్పగా నేను అడిగాను. అప్పుడు స్వామివారు “మద్రాసు నుండి ఎలా వచ్చావు?” అని అడిగారు. కారులో వచ్చానని చెప్పాను. వర్షం పడిందా అని ఒక శిష్యుణ్ణి అడగగా అతను లేదని చెప్పాడు. ఒక్కక్షణం ఆలోచించి వెళ్ళేటప్పుడు జాగ్రత్త అని ఆశీర్వదించి పంపారు.

ఆరోజు రాత్రి చాలా పెద్ద వాన పడడంవల్ల కాంచీపురం చేరుకోవడానికే రాత్రి పదకొండు గంటలు అయ్యింది. మరుసటి రోజు ఉదయం చెన్నై చేరుకోగలిగాము. ముప్పై సంవత్సరాలలో కాంచీపురంలో అత్యంత ఎక్కువ వర్షపాతం నమోదు అయ్యిందని పేపర్లలో చెదివాను.

మూడు రోజుల తరువాత సంవత్సరం క్రితం మా నాన్నగారు సంప్రదించిన వరుడు యస్.కె. వైద్యనాథన్ నుండి ఫోను వచ్చింది. అతని ఇప్పుడు పెళ్ళి చేసుకోవాలనుకుటున్నాడని కనుక ఆగష్టు 8న ఇంటికి వస్తానని కబురు చేశాడు. ఆరోజు రెండు నిబంధనలతో పెళ్ళికి ఒప్పుకున్నాడు. వారి తల్లితండ్రుల సమ్మతి కోసం ఉడుమలపేట్ లోని వారి తల్లితండ్రుల ఇంటికి మా చెల్లిని తీసుకుని వెళ్ళాలని, రెండవది వారి తల్లితండ్రులు ఒప్పుకుంటే నిరాడంబరంగా స్త్రీధనం(వరకట్నం) లేకుండా పెళ్ళి చెయ్యాలని. వారికి వివాహం జరిగి నా చెల్లెలు ఆమె భర్త ఇద్దరు పిల్లలతో బాంబేలో సంతోషంగా ఉన్నారు.

అపార కరుణాసింధుం జ్ఞానదం శాంతరూపిణం
శ్రీ చంద్రశేఖర గురుం ప్రణమామి ముదావహం ॥

--- యస్. రాజాహ్ అయ్యర్, చెన్నై. ‘సేజ్ ఆఫ్ కంచి’ నుండి

#KanchiParamacharyaVaibhavam #కంచిపరమాచార్యవైభవం
2/9/18, 11:24 - Paramacharyulu: శ్రీకంఠయ్య కలకత్తా రైల్వేస్ లో పెద్ద స్థాయిలో ఉన్న ఉద్యోగి. సెలవు మీద బెంగళూరులో ఉన్న స్నేహితుడు నాగేశ్వర అయ్యర్ను కలవడానికి వెళ్ళారు. ఈ అయ్యరు బెంగళూరులో పేరు మోసిన వకీలు. అయ్యరు వారంతంలో కుటుంబ సమేతంగా శృంగేరి జగద్గురువుల దర్శనానికి వెళ్తున్నామని, శ్రీకంఠయ్యని కూడా తమతో రమ్మని ఆహ్వానించారు. శ్రీకంఠయ్య తనకు ఇబ్బంది ఏమీ లేదని, తనది పూర్తిగా పాశ్చ్యాత పద్దతి అని, సనాతన ధర్మ ఆచార వ్యవహారలపట్ల తనకు లెక్క లేదని, జగద్గురువులు తనును ఇబ్బంది పెట్టే ప్రశ్న అడిగితే తను దురుసుగా సమాధానం చెప్పవలసి వస్తుందని చెప్పారు. అయ్యరు అలాంటి పరిస్థితి రాదని చెప్పగా, అందరు కలిసి శృంగేరి చేరుకున్నారు.

విద్యాశంకర, శారదాంబల దర్శనం ఐన తరువాత, మహాస్వామి దర్శనం చేసుకున్నారు. స్వామి వారి ముందు నుంచున్న శ్రీకంఠయ్య కు స్వామి వారి పట్ల అపరిమితమైన గౌరవం కలిగింది. స్వామి వారు సాక్షాత్తు యజ్ఞేశ్వరునిలా కనిపిస్తున్నారు. అయ్యరు స్వామి వారిని పరిచయం చేసాక, మహాస్వామి వారు శ్రీకంఠయ్యతో మట్లాడుతూ అతని ఉద్యోగాది వివరాలను తెలుసుకుని, ఇలా అడిగారు.

స్వామి: నువ్వు రోజూ సంధ్యావందనం చేస్తున్నావా?
శ్రీకంఠయ్య : వాడిన మొహంతో అతి కష్టం మీద,"లేదు"
స్వామి : ఎందుకు? సంధ్యావందనం నేనెందుకు చెయ్యాలని చెయ్యట్లేదా? చెయ్యకపోతే ఏమౌతుంది అని చెయ్యట్లేదా? చేసి ఉపయోగం ఉండదని చెయ్యట్లేదా? సమయం లేక చెయ్యడం లేదా?

శ్రీకంఠయ్యకు ఏమి చెప్పాలో తెలియలేదు. కొద్దిసేపు ఆలోచించిన తరువాత, తాను ఎప్పుడో చదివినది గుర్తొచ్చింది. అది యాజ్ఞవల్క్య మహర్షి జనక మహారాజుతో బ్రహ్మ జ్ఞానం గురించి చేసిన చర్చ. సాయంత్రమైన సంధ్యావందనం చెయ్యకుండా యాజ్ఞవల్క్య మహర్షి బ్రహ్మ జ్ఞానం గురించి చర్చిస్తూనే ఉన్నారు. జనక మహారాజు, దీని గురించి మహర్షిని అడుగగా, మహర్షి ఇలా చెప్పారు, "ఎప్పుడూ పరబ్రహ్మతో రమిస్తూ ఉండే జ్ఞాని ఏ కర్మ చేయనక్కర్లేదు". లోక సంక్షేమం కోసం కర్మలు చేయవచ్చు కాని, కర్మ లోపం తప్పు కాదు". శ్రీకంఠయ్య ఈ ఉదంతమంతా శ్లోకంగా చెప్పారు.

మహాస్వామి శ్రీకంఠయ్య సమయస్ఫూర్తి మరియు తెలివికి ప్రీతి చెందినవారై ఇలా అడిగారు.

స్వామి: అయితే నువ్వు యాజ్ఞవల్క్య మహర్షిలా అత్మానుభవం కలవాడివా?
శ్రీకంఠయ్యకు ఏమి చెప్పాలో తెలియక తలదించుకున్నాడు.

స్వామి: నీ సమాధానం జ్ఞానికి మాత్రమే వర్తిస్తుంది. ఆ స్థితి వచ్చేంతవరకు మానవుడు సాధన చేస్తూనే ఉండాలి. ఆ స్థితికి సోపానాలే సంధ్యవందనము మరియు జపము. వీటి విస్మరణ పాపము. సంధ్యావందనము మరియు జపము విడువకుండా చెయ్యి.

శ్రీకంఠయ్య స్వామి వారి ఆదేశం పాటిస్తున్నారు. స్వామి వారి దర్శనం కూడా తరచు చేసుకుంటున్నారు. అనంతమైన జ్ఞానం అనే సముద్రంలో తనకు తెలిసింది చాలా చాలా తక్కువ అని తెలుసుకున్నారు. మహాస్వామి వారి చర్యలు అర్థం చేసుకునే ప్రయత్నం చేయసాగారు. ఎప్పుడూ సమాధి స్థితిలో ఉండే మహాస్వామి మనస్సులో ప్రవేశించాలనుకున్నారు.

ఒకనాడు నిద్రపోతూ ఉండగా, కలలో, తను సూక్ష్మ శరీరం ధరించి మహాస్వామి వారిలో ప్రవేశించారు. అతనికి అక్కడ నిర్మలమైన, అనంతమైన తెల్లని ఆకాశం కనిపించింది. లేచేసరికి తెల్లవారింది. సంధ్యావందం చేసుకుని స్వామి వారి దర్శనానికి వెళ్ళారు శ్రీకంఠయ్య. తీర్థ ప్రసదాలు ఇస్తూ చిరునవ్వుతో స్వామి వారు, "ఎప్పట్నుండి పరకాయ ప్రవేశం చేస్తున్నావు?" అని అడిగారు. ఆశ్చర్యచకితుడైన

శ్రీకంఠయ్య పరమాత్మతో తాదాత్మ్యం చెందిన మహనీయులకు తెలియనది ఏదీ ఉండదని వారు సర్వ వ్యాపకులని తెలుసుకున్నారు.

సదాత్మధ్యాననిరతం విషయేభ్యః పరాఙ్ముఖమ్
నౌమి శాస్త్రేషు నిష్ణాతం చన్ద్రశేఖరభారతీమ్

#SringeriJagadguruVaibhavam #శృంగేరిజగద్గురువైభవం
2/9/18, 16:04 - Paramacharyulu: శృతి స్మృతి పురాణానాం ఆలయం కరుణాలయం!
నమామి భగవత్పాదం శంకరం లోక శంకరమ్!!

మన ఆచార్యులవారు (ఆది శంకర భగవత్పాదులు) సామాన్యులకు మల్లేనే దేవాలయ సందర్శనములు, పూజాదికములు విధివిధానంగా చేసేవారు. వారి దైవీశక్తి వలన దేవతామూర్తుల సాన్నిధ్యం మరింత శక్తివంతమయ్యేది. దాని కొఱకై వారు కొన్ని దేవాలయాల్లో స్వయంగా యంత్రస్థాపనము కూడా చేశారు. పాదచారులై భారతావని నంతటినీ పావనం చేశారు. అటువంటి తీర్థయాత్రలలోనే ఒకసారి వారు పార్వతీ పరమేశ్వరుల సందర్శనార్థము కైలాసానికి వెళ్ళారు. ఆచార్యులవారే పార్వతీ పరమేశ్వరుల సమిష్టి అవతారమన్న విషయం మనం మఱవరాదు.

రామచంద్రుడు తాను స్వయంగా విష్ణుమూర్తి అవతారమయి ఉండి అదే విష్ణ్వంశ లేక అవతారమైన పరశురాముని కలిశాడు. కృష్ణుడు ఆయన సోదరుడు బలరాముడు ఇద్దరూ విష్ణ్వతారములే కదా! వారిద్దరూ ఒకేకాలం కలిసి కూడా ఉన్నారు. అవతారాలకు సంబంధించి ఇటువంటి ఆసక్తికరమైన అంశాలు అనేకం ఉన్నాయి.

ఇప్పుడు ఆచార్యులవారు తమ అవతారమునకు మూలమైన పార్వతీ పరమేశ్వరులను సందర్శించారు. పరమేశ్వరుడాయనకు అయిదు స్ఫటిక లింగములు, ఒక తాళపత్ర గ్రంథము ప్రసాదించాడు. కొందరు ఈ తాళపత్ర గ్రంథము అంబిక చేత ప్రసాదించబడిందని చెబుతారు. ఈ గ్రంథంలో అంబికపై వ్రాయబడిన నూరు శ్లోకములున్నాయి. కొందరు ఈ శ్లోకములు పరమేశ్వరుని చేతనే చేయబడినవంటే మరికొందరు లలితా సహస్రనామం వలె వశిన్యాది వాగ్దేవతలచేత పాడబడిందని అంటున్నారు. పరమేశ్వరుడే భక్తునిగా అంబికపై ఈ శ్లోకాలు చెప్పాడంటేనే ఎక్కువ ఉచితంగా ఉంటుందేమో!!

ఈశ్వరుడు ప్రసాదించిన అయిదు స్ఫటిక లింగములు తనవైన మూర్తులు, లింగమునకు చేతులూ, కాళ్ళూ, ముక్కూ, చెవులూ, కళ్ళూ లేక రూపారూపంగా ఉంటుంది. తాళపత్ర గ్రంథము అంబికా స్వరూపము. అంబిక మంత్రమూర్తి. ఈ గ్రంథములో అంబికకూ మంత్రశాస్త్రానికీ సంబంధించినది. ఏ రకంగా శివలింగము శివుని రూపమో ఈ గ్రంథం కూడా అడే విధంగా అమ్మవారి రూపమవుతుంది. కాబట్టి పరమేశ్వరుడు తన స్వరూపమైన స్ఫటిక లింగాలను ప్రసాదిస్తే అమ్మ తన రూపమైన గ్రంథాన్ని ప్రసాదించిందని చెప్పుకోవడం యుక్తంగా ఉంటుంది. ఇచ్చినవారూ, పుచ్చుకొన్నవారు, ఇచ్చినదీ మూడూ ఒక్క వస్తువే! ఇది ద్వైతాద్వైతముల కలయిక!

అట్టి అయిదు స్ఫటిక లింగములలో ఒకటి మన శ్రీ మఠంలో (కంచి కామకోటి మఠం) చంద్రమౌళీశ్వరుడనే పేరుతో అర్చించబడుతోంది. ఇది యోగలింగము. కేదారంలో ముక్తిలింగము, నేపాళంలో వరలింగము, చిదంబరంలో మోక్షలింగము, శృంగేరిలో భోగలింగము ప్రతిష్ఠించబడ్డాయి.

ఆచార్యులవారు ఈ అయిదు స్ఫటిక లింగాలనూ, తాళపత్రగ్రంథాన్ని తీసుకొని కైలాసం నుండి బయలుదేరారు. పార్వతీ పరమేశ్వరుల ఆరాధనా విధానాన్ని మరింత సుష్ఠుపరచాలని వారి ఉద్దేశ్యం. ఆచార్యులవారు కైలాసం నుండి బయటకు వెళుతుంటే ద్వారపాలకునిగా ఉన్న నందీశ్వరుడు చూచాడు. దేముడు వరమిచ్చినా పూజారి వరమీయడనే సామెత ఉన్నది కదా! పార్వతీదేవి అనుగ్రహించినా అంతటి మహోన్నతమైన మంత్రశాస్త్రము కైలాసంలో లేకపోవడం అన్నది ఆయనకు ఇష్టం లేదు. ఈ తాపం కోపంగా మారింది. ఆచార్యులవారి చేతినుండి తాళపత్ర గ్రంథాన్ని ఊడపెరుక్కున్నాడు. ఆచార్యుల వారెదురు చూడని సంఘటన ఇది. ఎక్కువ భాగం గ్రంథం నందికేశ్వరునికి చిక్కింది. మిగిలిన నలభై ఒక్క శ్లోకాలతో ఆచార్యులవారు బయటకు వచ్చారు.

ఇది వింటుంటే మీకందరికీ నందికేశ్వరునిపై కోపం వస్తున్నది కదా! మీ మనసులలో "అతడు ఆచార్యులవారి యెడ ఈ విధంగా ప్రవర్తింపనగునా? అంబిక ప్రచారం చేయడానికి అనుగ్రహించిన వంద శ్లోకాలలో ఏభైతొమ్మిది ఊడపెరుక్కోవడం న్యాయమా?" అన్న భావం వచ్చి ఉండవచ్చు. నాకు మటుకు నందికేశ్వరునికి మనం ఎంతో కృతజ్ఞులమై ఉండాలని తోస్తోంది

ఆచార్యులవారు జరిగినదానికి వ్యాకులితులైనారు. "అమ్మ మానవాళిపై దయతో వారికందించవలసినదని ఇచ్చిన పెన్నిధిలో ఎక్కువ భాగం పోగొట్టుకొనా." అంటూ ధార్మిక ద్రవ్యానికి ఏర్పరచబడ్డ ధర్మకర్తవలె బాధపడ్డారు. మరి శంకరులు లోక శంకరులు. తమ జీవితంలో ప్రతి క్షణమూ మానవాభ్యుదయానికై వెచ్చించిన వారు మరి!!

ఆ సమయంలో అంబిక గొంతు వినిపించింది. "పోయిన ఏభై తొమ్మిది శ్లోకాలూ నీవే పూరించు. అదే నన్ను తృప్తి పరుస్తుంది. నీ వలనే ఈ కార్యం అవ్వాలనే ఉద్దేశ్యంతోనే ఆ శ్లోకాలు పోయేట్లు చేశాను." అన్నది అంబిక. అంతే! అదే క్షణంలో ఆనకట్టల తలుపులు తెరవగానే పడత్రోసుకొని వచ్చే మహానదీ ఉత్తుంగ ప్రవాహంవలె ఆచార్యులవారి ముఖం నుండి ఏభై తొమ్మిది శ్లోకాలు వెలువడ్డాయి. ఇవి అంబిక కేశాలు పాదాంత వర్ణనతో కూడినవి.

(సశేషం)

#KanchiParamacharyaVaibhavam #కంచిపరమాచార్యవైభవం
#ParamacharyaSoundaryaLahariBhashyam

2/9/18, 16:27 - Paramacharyulu: <Media omitted>
2/10/18, 06:47 - Paramacharyulu: నువ్వు వారి మనవడివి కాదు

ఒకసారి నేను నా స్నేహితుడు గోపాలకృష్ణన్ ను కాంచీపురం పిలుచుకొని వెళ్ళాను. అతను ఒక పచారీ కొట్టు నడుపుతున్న ఒక తెలుగు బ్రాహ్మణుడు. శ్రీమఠం బాలు మామ మమ్మల్ని పరిచయం చేస్తూ, “విల్లుపురం చిదంబరం అయ్యర్ మనవళ్ళు వచ్చారు” అని చెప్పారు.

పరమాచార్య స్వామివారు నావైపు చూసి, “అవును ఇతను వారి మనవడే. కాని మరొకతను చూడడానికి తెలుగు బ్రాహ్మనుడిలా ఉన్నాడు” అని అన్నారు.

స్వామివారి పరిశీలనకి గోపాలకృష్ణన్ ఆశ్చర్యపోయి, “నేను కొండయ్యార్ మనవడిని” అని చెప్పాడు.

వెంటనే స్వామివారు, ”ఏ కొండయ్యార్? తురువణ్ణామలై దగ్గర్లోని సిరుపక్కమ్ అతనా? తన భూమిని అమ్మి దాంతో యజ్ఞయాగాది క్రతువులు చేసి ప్రజల కష్టాలు తీర్చాడు అతనేనా? మహాత్ముడు హఠయోగం ద్వారా అమ్మవారిని దర్శించుకున్నాడే అతనేనా? కూర్చున్న చోటినుండే రమణమహర్షితో మాట్లాడేవాడు అతనేనా? నలభైయేళ్ళ కిందట సమాధిపొందాడు అతనేనా? కాని నువ్వు అతని మనవడిని కాదు” అని చెప్పారు.

”కాదు కాదు. వారు మా నాన్నరికి మామగారు” అని బదులిచ్చాడు.

”ఆర్థికంగా ఎలా వున్నావు?” అని అడిగారు స్వామివారు.

బావున్నానని చెప్పాడు గోపాల్. “బాంబేలో ఉన్న కుటుంబం వారొకరు కొండయ్యార్ కి ఆరాధన చేసేవారు. కాని ఎందువల్లనో కొద్దికాలం క్రితం మానేశారు. నువ్వు దాన్ని మరలా ఆరంభిచగలవా? మీ కుటుంబానికి మంచి జరుగుతుంది” అని చెప్పారు స్వామి.

ఆ తిథి ఏమిటో తనకు తెలియదన్నాడు గోపాల్. అందుకు మహాస్వామివారు, “చెన్నైలోని లూజ్ కార్నర్ లో రాధాకృష్ణన్ అని ఒకరు ఉన్నారు. వారి చిరునామా మఠం మేనేజరు వద్ద ఉంటుంది. నువ్వు అతణ్ణి సంప్రదించగలిగితే అతను తన పెద్దమ్మ జయమ్మ ద్వారా తిథి కనుక్కోవచ్చు. ఈ పని త్వరగా చెయ్యి. నాకు తెలిసి తొందర్లోనే ఆ తిథి రాబోతోంది” అని ఆదేశించారు.

తరువాత మహాస్వామివారు కామాక్షి అమ్మవారి దర్శనానికి వెళ్ళిపోయారు. మేము మాట్లాడుకుంటూ ఉండగా ఒక యాభైఏళ్ళ వయసున్నాయన మావద్దకొచ్చి మేము విల్లుపురం నుండి వచ్చామా అని అడిగారు. పరమాచార్య స్వామివారు ఆయన్ని మాతో మాట్లాడమన్నారని తన పేరు లూజ్ కార్నర్ రాధాకృష్ణన్ అని వారి పెద్దమ్మ పేరు జయమ్మ అని చెప్పారు. తన స్నేహితుడు హఠాత్తుగా ఇంటికి వచ్చి తనను కాంచీపురం తీసుకుని వచ్చాడని తెలిపారు.

స్వామివారు చెప్పిన కొద్ది క్షణాల్లోనే ఆయన ఇలా రావడం మాకు ఆశ్చర్యాన్ని కలిగించింది.

పరమాచార్య స్వామివారు చెప్పినట్టుగానే కొండయ్యార్ తిథి మరొక వారం రోజుల్లోనే ఉంది. మేము మా కుటుంబాలతో సహా సిరుపక్కం వెళ్ళి కొండయ్యార్ ఆరాధన మళ్ళీ మొదలుపెట్టాము.

అపార కరుణాసింధుం జ్ఞానదం శాంతరూపిణం
శ్రీ చంద్రశేఖర గురుం ప్రణమామి ముదావహం ॥

--- శ్రీ వి. సూర్యనారాయణన్

#KanchiParamacharyaVaibhavam #కంచిపరమాచార్యవైభవం
2/10/18, 12:43 - Paramacharyulu: (శృంగేరి శారదా పీఠం 34వ పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ చంద్రశేఖర భారతీ మహాస్వామి వారి మహిమలు)

శ్రీ కృష్ణస్వామి అయ్యరు శ్రీ చంద్రశేఖరభారతీ మహాస్వామి వారి భక్తులు. ఒకనాటి సాయంత్రం మహాస్వామి అంతేవాసులు పూజా ద్రవ్యాలు, సామాను నదికి ఉత్తర దిశగా చేరుస్తూ కనిపించారు. భారీగా వాన పడేటట్లు ఉన్నందున నీటి స్థాయి పెరగవచ్చు అని, అందుకే ఈ పని చేస్తునట్లు చెప్పారు.

అయ్యరు స్వామి వారికి దగ్గరగా బస చేస్తున్నాడు. అతను స్వామి వారితో పాటుగా వెళ్లామనుకున్నాడు. మహాస్వామి అతనితో, "నేను అటు వెళ్తున్నాను అని నువ్వు రావలసిన అవసరం లేదు. నువ్వు ఇక్కడే ఉండు. ఈ రాత్రి వాన పడదు. వరదా రాదు. "

"వాన పడదు అని తెలిసిన గురుదేవులు మరి అంతేవాసుల చర్యను ఎందుకు ఆపడం లేదు" అని అయ్యరు అనుకున్నారు. స్వామి వారి కనులు "అక్కడైనా ఇక్కడైనా భేదం ఎమి ఉంది? ఏది ఐనా నాకు ఒకటే" అని చెప్పినట్టు తోచింది అయ్యరుకు.

సంసారంతో ముడిపడని అవధూతకు ఇవన్నీ లెక్కలోకి రావు. ఆ రోజు వాన పడలేదు అని వేరే చెప్పకర్లేదు అనుకుంటా.

#SringeriJagadguruVaibhavam #శృంగేరిజగద్గురువైభవం

2/10/18, 16:09 - Paramacharyulu: రెండవ భాగం

మొదటి నలభై శ్లోకాలు మంత్ర శాస్త్రమునకు సంబంధించినవి. మంత్రానుష్ఠానము కఠినమైన నియమాలతో కూడి ఉన్నది. కొద్ది మంది మాత్రమే వాటిని సజావుగా అర్థం చేసుకొని ఆచరించగలరు. ఇప్పుడీ మొదటి భాగంలో శ్లోకాలు మంత్రప్రయోగము లేక కుండలినీ యోగంతో కూడి ఉన్నది. ఇట్టి యోగ సాధనలో ఏమాత్రం తప్పు దొర్లినా సాధకునికి చెడు ఫలితాలను కలగజేస్తుంది. అంబికకు ఈ రకమైన విధానంలో ఆరాధించడంలో ప్రమత్తత పనికిరాదు.  అయితే అమ్మ లీల బహువిధమైనది. ఇట్టి కఠినమైన నియమాలతో ఆమెను చేరడానికి ఒక మార్గముండగా, సాధకులు తేలికగా తరించే మార్గాలు కూడా ప్రసాదించింది. ఏ మార్గమయినా ఆ మార్గమునకు ఏర్పాటు చేయబడ్డ నియమాలను సక్రమంగా పాటిస్తేనే పూర్తి ఫలితాలను ఇస్తుంది.

తేలిక మార్గములకూ నియమాలున్నాయి. అయితే అవి సామాన్యులకు సైతం ఆచరించడానికి అనువైనవి. దేవాలయ సందర్శనము, అక్కడి ఆరాధన, స్తోత్ర పారాయణాదులు, శాస్త్రీయ భక్తి సంగీతము, భజనలు, భగవద్విభూతులను తెలియజేసే పురాణాదులను వినడం వంటివి అంబికను ఆరాధించే తేలికైన మార్గాలలో కొన్ని. ఒకవేళ ఒక భక్తుడు ఈ మార్గాలు తనకు సరిపోవని జపము, యోగము, శ్రీచక్రార్చనము వంటి మార్గాలను నియమరాహిత్యంగా క్రమశిక్షణ లేకుండా అనుష్ఠించవచ్చని అనుకుంటే, అంబిక అట్టి ప్రవృత్తిని తుంటరి తనంగా భావిస్తుంది. అంబికారాధనములో కష్టసాధ్యమైన ఆరాధనా విధానములలో సాధన వాటిని ఆచారించడానికి సమర్థులైన కొంతమందికి వదిలివేస్తే మంచిది. ఆచార్యులవారి దయ అత్యున్నతమూ,సార్వజనీననమూ అయినది. వారు చెప్పిన ఏభై తొమ్మిది శ్లోకములలో అంబిక మంత్రమూర్తి కాదు. సర్వులూ తమ మనస్సులలో భావించి, దర్శించి మహదానందం పొందగలిగే మహా సౌందర్యరాశి. అమ్మ అద్భుతమైన సౌందర్యాన్ని ఆచార్యులవారు తమ కవిత్వంలో వర్ణించారనే దానికంటే అంబిక ఆచార్యులవారి కవితలో అవతరించిందని చెప్పుకోవడం సరి అయినదేమో!!

కైలాసం నుండి వచ్చిన నలభై ఒకటి శ్లోకాలు ఒక భాగం – ఆచార్యులవారి వాగమృత ఝరిగా ప్రవహించిన ఏభై తొమ్మిది శ్లోకాలు ఒక భాగం – అనుకొంటే మొదటి భాగానికి ఆనందలహరి అనీ, రెండవ భాగానికి సౌందర్యలహరి అనీ పేరు. ఈ రెండూ కలిసి ఒక శతకంగా“సౌందర్యలహరి” అనే పేరుతోనే పిలవబడుతున్నాయి.

పైన నేను చెప్పిన కథ మార్కండేయ సంహిత లోనిది. ఆనందగిరి శంకర విజయము ఈ కథనే గద్యరూపంలో చెబుతోంది. అయితే కొందరు ఈ నూరు శ్లోకములూ ఆచార్యులవారి చేతనే వ్రాయబడినాయంటారు. అలా అనడంలోనూ దోషం లేదు. వేదమంత్రములు మంత్రద్రష్టల పేర్లతో పిలవబడటం లేదా? కైలాస శంకరులచే చెప్పబడిన ఈ మంత్రశాస్త్రం కాలడి శంకరుల వల్లనే మనకు సంప్రాప్తమైంది. కాబట్టి వారినే కర్తగా చెప్పుకోవడంలో తప్పేమున్నది. అస్సలీ కాలడి శంకరులు కైలాస శంకరుల అపరావతారం అని అనేకసార్లు చెప్పుకొన్నాం కదా! ఆ విధంగా చూచుకొన్న ఆచార్యులవారిని సౌందర్యలహరికి మొత్తంగా రచయితగా చెప్పుకోవచ్చు.

మొదటి నలభై ఒకటి శ్లోకాలు త్రిపురసుందరీ అర్చనా విధానంలో గూఢమైన కుండలినీ యోగము మొదలుగాగల మంత్రశాస్త్రపు సూక్ష్మార్థాలతో నిండి ఉన్నాయి. దీనినే శ్రీవిద్య అంటారు. శ్రీవిద్యా ఉపసకులకు ఎంతో అవసరమైన సూక్ష్మార్థాలు ఈ భాగంలో పొందుపరచబడినాయి. ఇక ఆచార్యుల వారిచే చెప్పబడిన ఏభై తొమ్మిది శ్లోకాలు అమ్మ మాటలకందని మహాసౌందర్యాన్ని అందించే విధంగా ఉన్నయి. ప్రతి శ్లోకము ఎంతో మధురంగా, ఉదాత్తమైన భావాలను వెలువరించేదిగా ఉంటుంది. పదములకు ఇంతటి అర్థస్ఫూర్తి కలిగించే శక్తి ఉన్నదా అన్న అబ్బురపాటును కలగచేస్తాయి. ఆచార్యులవారి ఆలోచనలలో స్పష్టత, వారి భావప్రకటనా దక్షత ప్రతి ఒక్క శ్లోకము ఎత్తి చూపుతుంది. ఎంత లోతైన భావాలు? ఒక్కొక్క శ్లోకం వేలసార్లు చదివినా తీరని భావపుష్టి, ఆనందస్ఫూర్తి కలగచేయడానికి సమర్థములైనవి.

ఒక పురాతనమైన జీవకళ ఉట్టిపడే శిల్పం మరమ్మతు చేయాల్సివస్తే ఎంత ప్రయత్నించినా తిరిగి ఆ అందాన్ని, ఆ జీవకళను తీసుకొని రాలేము. ఆచార్యులవారి కవిత్వంలో ఒక పదం మార్చి వేరొక పదంతో అంతటి రసస్ఫూర్తిని పొందడం అసాధ్యం.

అందుకే నేనన్నాను, నందికేశ్వరులకు మనం కృతజ్ఞులముగా ఉండాలి. లేకుంటే ఆచార్యులవారి అత్యద్భుతమై కవితా సౌందర్యంలో ఓలలాడుతూ మహా సౌందర్యరాశి, అందములకెల్ల అందమైన అమ్మ అందాన్ని దర్శించే అదృష్టం మనకొచ్చేదా??

(సశేషం)

#KanchiParamacharyaVaibhavam #కంచిపరమాచార్యవైభవం
#ParamacharyaSoundaryaLahariBhashyam
2/11/18, 07:45 - Paramacharyulu: చంద్రమౌళీశ్వరుని కృప (పార్ట్ 1)

చాలా సంవత్సరాల క్రితం పరమాచార్య స్వామివారు జ్యేష్ఠ మాసంలో పరివారంతో సహ తంజావూరు జిల్లా ప్రాంతాలకు విజయం చేశారు. పరిసర తాలూకాలనుండి ప్రజలు తండోపతండాలుగా స్వామివారిని దర్శించుకోవడానికి వచ్చారు. మహాస్వామివారు అడుతురైలోని ఒక సత్రంలో మకాం చేస్తున్నారు.

నటరాజపురం, గోవిందపురం, త్యాగరాజపురం, సత్తనూర్, తిరుమనగలక్కుడి, అడుతురై మొదలైన ఊళ్ళల్లోని ప్రముఖులంతా కలిసి సమిష్టి భిక్షావందనం(స్వామికి, పరివారానికి భోజనాదులు పెట్టడం) చేసేవారు.

మా స్వగ్రామం మరుత్తువక్కుడి అడుతురైకి కేవలం ఒక కిలోమీటరు మాత్రమే. మా నాన్నగారు బ్రహ్మశ్రీ సంతాన వాధ్యార్ అక్కడున్న కంచి మఠానికి ముద్రాధికారి. మా ఊరితరుపున కూడా సమూహిక భిక్షాపందనం ఏర్పాటు చెయ్యాలని తలంచారు. మాఊళ్ళోని ప్రముఖులు కూడా దీనికి అంగీకారం తెలిపారు.

మరుసటి రోజు నన్ను కూడా తీసుకుని మా నాన్నగారు స్వామివారు బసచేస్తున్న సత్రానికి వెళ్ళారు. మా నాన్నని చూడగానే శ్రీమఠం శ్రీకార్యం "శాస్త్రిగారు. . . మీరు మరుత్తవక్కుడి ముద్రాధికారి కదూ? ఒకరోజు మీ ఊళ్ళోనూ భిక్ష ఏర్పాటు చెయ్యొచ్చు కదా? వీలైతే వచ్చే ఆదివారం చెయ్యండి" అని చెప్పారు.

మా నాన్న వెంటనే, "నేను కూడా ఇక్కడికి అది ఖాయం చేసుకుందామనే వచ్చాను. మేము ఈ ఆదివారమే పెట్టుకుంటాము" అని శ్రీకార్యంని అడిగారు, "అందాజుగా ఎంత ఖర్చు అవుతుంది మాకు?" అని.

ఆయన నవ్వి, "చెప్తాను ఉండు. మఠానికి రూ.250/- కానుకగా కట్టాలి. తరువాత పళ్ళు, కూరగాయలు, టెంకాయలు మొదలైనవాటికి మీ ఖర్చు, అంతా పూర్తయిన తరువాత స్వామివారినుండి ప్రసాదం తీసుకునేటప్పుడు పాదసమర్పణగా మీకు వీలైనంత ఇవ్వొచ్చు. అందరూ చెప్పినది దాదాపు ఒక ఆరేడువందల రూపాయలు అవుతుంది అని" చెప్పారు. "అవును మీ ఊరిలో అంత పోగు చెయ్యగలరా?" అని అడిగారు.

ఏమాత్రం సందేహం లేకుండా "ఖచ్చితంగా అవుతుంది" అని చెప్పారు. ఆత్రుతతో, "అదిసరే. అందరూ మామూలుగా పాదసమర్పణకి ఎంత ఇస్తారు?" అని అడిగారు. "అయిదొందల నుండి వెయ్యి రూపాయల దాకా ఇస్తారు" అనగానే మా నాన్న కొద్దిగా ఆలోచనల్లో పడ్డారు.

కొద్దిసేపట్లోనే మేము మహాస్వామివారిని దర్శించి సాష్టాంగం చేసి నిలబడ్డాము. మా నాన్న భిక్షావందనం గురించి స్వామివారికి చెప్పారు. "భిక్ష చక్కగా జరుగుతుందిలే" అని అనుగ్రహించారు. "ఒక్కరే చెయ్యగల ధనవంతులు లేరా మీఊళ్ళో?" అని అడిగారు స్వామివారు.

మా నాన్నగారు చిన్నగా, "ముగ్గురు నలుగురు ఉన్నారు. అందులో ఇద్దరు ముగ్గురు మద్రాసులో ఉన్నారు పెరియవ. మా ఉద్దేశం అందరమూ కలిసి సమిష్టి భిక్షావందనం చేద్దామని పెరియవ. ఆచార్యులు మమ్ము అనుగ్రహించాలి" అని వేడుకున్నారు. స్వామివారు నవ్వుతూ, రెండు చేతులు పైకెత్తి ఆశీర్వదించారు.

ఆదివారానికి కేవలం నాలుగు రోజులే ఉన్నాయి. నాన్నగారు ధనసేకరణ మొదలుపెట్టారు. మూడు అగ్రహారాల్లో కలిపి మొత్తం ముప్పై ఇళ్లదాకా ఉన్నాయి. గురువారం సాయింత్రానికి సేకరణ పూర్తై నాలుగు వందల రూపాయలు పోగయ్యాయి. మా నాన్న మరికొందరు వైదికులు కలిపి వంద రూపాయలు వేశారు. మొత్తం అయిదువందల రూపాయలు అయ్యింది. భిక్షావందనానికి ఇది సరిపోతుంది.

మహాస్వామివారి పాదసమర్పణకే ఇప్పుడు డబ్బు కావాలి. కనీసం అయిదొందల రూపాయలైనా సమర్పించాలని మా నాన్నగారి కోరిక. ఆరోజు రాత్రి వారు సరిగ్గా నిద్రపోలేదు.

శుక్రవారం మేము మహాస్వామి వారి దర్శనానికి వెళ్ళాము. స్వామివారు సత్రంలో ఒక పాకలో కూర్చుని దర్శనం ఇస్తున్నారు. భక్తులు చాలామంది వచ్చారు దర్శనానికి. కొద్దిదూరంలో ఒక మూలలో ఉన్నమేము అక్కడే స్వామివారున్న వైపుకి సాష్టాంగం చేశాము. నాన్నవైపు చూశాను; ముఖంలో ఆందోళన కొట్టొచ్చినట్టు కనబడుతోంది. పాదసమర్పణకు ఏం చెయ్యాలనే వారి వేదనంతా.

(సశేషం)

అపార కరుణాసింధుం జ్ఞానదం శాంతరూపిణం
శ్రీ చంద్రశేఖర గురుం ప్రణమామి ముదావహం ॥

#KanchiParamacharyaVaibhavam #కంచిపరమాచార్యవైభవం
2/11/18, 16:51 - Paramacharyulu: మొదటి శ్లోకము:

శివశ్శక్త్యాయుక్తో యది భవతి శక్తః ప్రభవితుం
నచే దేవం దేవో నఖలు కుశలః స్పందితుమపి
అతస్త్వామారాధ్యం హరిహర విరించాది భిరపి
ప్రణంతుం స్తోతుంవా కథమకృత పుణ్యః ప్రభవతి.

(శివుడు శక్తితో కూడి ఉన్నప్పుడే శక్తి గలవాడవుతున్నాడు. లేకుంటే ఆ స్వామి స్పందించడానికి కూడా సమర్థుడు కాడు కదా! హరిహర బ్రహ్మాదుల సైతం ఆరధించబడే అటువంటి నిన్ను స్తుతించడానికో, నమస్కరించడానికో ఎంతో పూర్వ పుణ్యం లేనివానికి ఎలా సాధ్యమవుతుంది.)

సౌందర్యలహరి ప్రథమ శ్లోకారంభంలోనే ఆచార్యుల వారు "అమ్మతో కూడి ఉండని అయ్య కొంచెమైనా స్పందించడానికి కూడా సమర్థుడు కాదు" అంటున్నారు. ఈ మాటలోని అంతారార్థము, ఈ మాటద్వారా మనకు చేసిన బోధ ఏమయి ఉండాలి? నాకు మాత్రం ఆచార్యుల వారు మనందరి తరఫునా అంబికతో "తల్లీ! నీ దయలేనిదే శివుని నిశ్చల తత్త్వాన్ని మేము పొందగలమా" అని చెబుతున్నట్లు తోస్తున్నది. ఆ తల్లి నిశ్చలమైన వస్తువును చలింపచేసే మహాశక్తి! ఆమె లీల శివునిలో (పరబ్రహ్మలో) తన పరిస్థితిని తాను గుర్తించే స్పందన కలగజేయడంతో ఆరంభంపుతుంది.

ఈ శ్లోకం పరమశివునిలో అట్టి మొదటి స్పందన అంబికవల్ల ఏర్పడిందని చెబుతోంది. స్పందన వెనుక స్పందన, కదలిక – ఇప్పటి మన

జీవితములలోని స్పందనలకు దారి తీసినవి. అనంతమైన జీవజాలంతో అంతమయ్యే ఈ స్పందనలు అవరోహణ క్రమంలో ఉన్నాయి. ఈ క్రమము వివిధ శాస్త్రములలో ఇరవై నాలుగు లేక ముప్పై తత్త్వములుగా చెప్పబడి ఉన్నది. ఈ అవరోహణా క్రమానికి పరిణామమని పేరు. ఇది డార్విన్ చెప్పిన పరిణామము వంటిది కాదు. అతడు ఏకకణజీవి క్రమక్రమంగా పరిణామం చెంది మనుష్యునిగా పరిణమిస్తోంది. అంతర్ముఖమైన బ్రహ్మపదార్థము బహిర్ముఖమవడం – లెక్కలేనన్ని ఉపాదులుగా మారడం – ఇట్టి క్రమాన్ని పరిణామమంటారు.

ఒక వ్యక్తి తన స్వస్థితిని అనగా బ్రహ్మైక్యాన్ని పొందడాన్ని మోక్షము లేక ముక్తి అంటున్నారు. బ్రహ్మనుండి వ్యక్తులుగా పరిణామం అవరోహణము. వ్యక్తి బ్రహ్మలీనుడవడం ఆరోహణము. సంగీతంలో సరిగమపదని ఆరోహణ క్రమము. సనిదపమగరి అవరోహణ క్రమము. మొదటి మెట్టయిన 'స' బ్రహ్మపదార్థమైతే తుదిమెట్టు 'రి' జీవాత్మ. జీవుడు ముక్తుడవాలంటే 'గమపదని' లను దాటుకుంటూ 'స'ను చేరాలి. ఈ అవరోహణ, ఆరోహణలనడం కంటే తనను తాను బహిర్గతం చేసుకోవడం, అంతర్ముఖుడవడం అంటె సరిగా ఉంటుందేమో? బ్రహ్మ పదార్థం బహిర్గతమయి తనను ఈ ప్రపంచంగా, జీవజాలంగా కనబరచుకోవడం పరిణామము. జీవులు బహిర్విషయములనుండి దృష్టి మరలించి తనలో తాను లీనమవడం అంతర్ముఖత్వం.

ఒకసారి బహిర్గతమైన వ్యాప్తి పొందిన జీవుడు బ్రహ్మాంతర్లీనుడవడానికి ఎంతో శ్రమించవలసి ఉన్నది. పోనీ, మనం శ్రమ పడితే సరిపోతుందా? అదీ కుదరదు. బ్రహ్మపదార్థము నుండి మనుష్యులుగా మారడమన్నది మనంతట మనం చేసుకొన్నది కాదు కదా! ఇది ఆ అంబిక లీల అని కదా ఆచార్యుల వారంటున్నారు!! ఆ తల్లి లీల వలన ఈ జగన్నాటకంలో మనకో పాత్ర వచ్చింది. అనుభవిస్తున్నాము. ఈ పాత్రనుండి ముక్తులమవడమనేది మళ్ళీ ఆ తల్లి అనుగ్రహం వల్లనే సాధ్యమవుతుంది. ఏ శక్తి అయితే మనలకు బహిర్గతం చేసిందో ఆ శక్తి దయ వలననే మనం అంతర్లీనులమవగలము. గాలికోసం పంఖా వేశాము. పంఖా తనంతట తాను ఆగిపోతుందా? రెక్కలు పట్టుకొని ఆపినా మళ్ళీ వదిలివేయగానే తిరగడం ఆరంభిస్తుంది కదా! ఏ మీట నొక్కితే తిరగడం ఆరంభించిందో అదే మీట నొక్కి కదా ఆపుచేయాలి!!

పరబ్రహ్మమైన పరమశివుడు ఈ ప్రపంచంగా పరిణామం చెందడానికి అంబిక కారణం. ఈ విషయం చెప్పడంలోనే ఆచార్యులవారు ఈ విషయపు రెండవ పార్శ్వం కూడా సూచించుతున్నారు. పరమాత్మ అయిన శివుడు జీవత్మగా అనిపించడానికి ఏ అంబిక కారణమో మళ్ళీ ఈ జీవ భావం వదిలి శివైక్యం చెందడానికి ఆ అంబికయే కారకురాలవుతుంది. అట్టి శివైక్యం కోసం మనం నిరంతరం అంబికా కటాక్షం కోసం ప్రార్థించాలి. ఆచార్యులవారు ఈ శ్లోకంలో బోధించినదదే!

అంబిక మనకై ఏర్పరచిన ఈ పాత్రనుండి బ్రహ్మానుభవస్థితిని పొందడానికి మనం ప్రయత్నించాలి అని చెప్పుకొన్నాం కదా! కర్మ, భక్తి, జ్ఞాన, యోగ మార్గములు ఇటువంటి ప్రయత్నములు. వీనిలో భక్తిమార్గము అత్యంత సులభ సాధ్యమైనది. ఆనందదాయకమైనది. ఈ మార్గాన్నే ఆచార్యులవారు సౌందర్యలహరిలో రూపొందించారు.

పొందశక్యముకాని స్థితిని పొందేదెలా? ఒక దయామయమైన, పరమప్రేమరూపమైన మూర్తిని భావించి చింతించాలి. అప్పుడు ఆ మూర్తి మనకు సమీపవర్తియై ఉంటుంది. భగవంతునిపై ఇట్టి భావన, భక్తి అని పిలవబడుతుంది. అనేకమైన మధురమైన ప్రేమ భావనలున్నాయి. వాటిలో తల్లికి తన పుత్రునియెడగల ప్రేమ వాత్సల్యములు స్వాభావికము, స్వార్థరహితము అయినవి. ఆచార్యులవారు జగన్మాత పరమ వాత్సల్యరూపాన్ని తమ కవితా సౌందర్యాలతో హృద్యంగా నిరూపించారు. వాత్సల్యాన్ని వర్షించే తల్లితో పాటు ఆమెనూ, మననూ ఆదరించే తండ్రి పరమశివుడు.

ఆచార్యులవారు "శివశ్శక్త్యా యుక్తో" అన్న వాక్యంలో జగత్తుకు పితరులైన ఆ ఆదిదంపతుల మిథునాన్ని మనకు సాక్షాత్కరింప చేస్తున్నారు. అదే సమయంలో అంబిక పరమమైన స్థితిని, తండ్రికి బలాన్ని చేకూర్చే తల్లిగా, మహాపతివ్రతగా అభివర్ణిస్తున్నారు.

(సశేషం)

#KanchiParamacharyaVaibhavam #కంచిపరమాచార్యవైభవం
#ParamacharyaSoundaryaLahariBhashyam
2/12/18, 07:02 - Paramacharyulu: చంద్రమౌళీశ్వరుని కృప (పార్ట్ 2)

హఠాత్తుగా స్వామివారి కరుణాపూరితమైన వాక్కులు, "సంతానం దగ్గరకు రా. ఎందుకు అక్కడే నిలబడ్డావు?". స్వామి నవ్వుతూ దగ్గరకు రమ్మనట్టు చెయ్యూపుతున్నారు. ఇద్దరము దగ్గరకు వెళ్ళి సాష్టాంగం చేసి నిలబడ్డాము. "ఏమి సంతానం, నిన్నంతా ఇక్కడ నువ్వు కనబడలేదు. ఊళ్ళో ఏమైనా పని పడిందా?" అని అడిగారు.

"అలాంటిదేమి లేదు పెరియవ. మా ఊరితరుపున వచ్చే ఆదివారం ఇక్కడ భిక్షావందనం చేస్తున్నాము కదా! అందుకోసమని ఆ ఏర్పాట్లలో ఉన్నాను అంతే". మా నాన్న పూర్తి చెయ్యక ముందే స్వామివారు అడ్డుపడి, "సరే సంతానం. సేకరణ పూర్తి అయ్యిందా?" అని నవ్వుతూ అడిగారు. సమాధానం ఇవ్వడానికి ఆయన సంకోచిస్తున్నారు.

ఏదో చెప్పడానికి నోరుతెరవక ముందే, స్వామివారు అర్థం చేసుకుని "దేని గురించి దిగులు పడవద్దు. ఆ "చంద్రమౌళీశ్వరు"ని కృపవల్ల అన్ని నువ్వు అనుకున్నట్టుగానే జరుగుతాయి" అని వారి మాటలతో అనునయించారు.

వెంటనే స్వామివారు, "ఎందుకు సంతానం, ఇక్కడున్న కావేరి నదిలో ఎక్కువగా నీరు ప్రవహిస్తున్నట్లు లేదు. కారణమేమైనా తెలుసునా?" అని అడిగారు. కావేరి నీళ్ల గురించి ఎందుకు అడుగుతున్నారో అర్థం కాక అందరూ ఒకరి మొహాలు ఒకరు చూసుకుంటున్నారు.

"నీరు బాగా ఎక్కువగానే ప్రవహిస్తోంది పెరియవ" అని బదులిచ్చారు నాన్న.

కాని స్వామివారు వదల్లేదు. "సరే. కావేరి స్నానానికి చివరిసారి ఎప్పుడు వెళ్ళావు?"

"వారం క్రితం పెరియవ"

"సరే వదిలెయ్. ఇప్పుడు ఎక్కువగా ప్రవహిస్తోందా? ఆ విషయం నీకు తెలుసా?" అని అడిగారు.

అక్కడున్న ఆ ఊరిభక్తుడొకరు వినయంతో, "నేను ఈరోజు ఉదయమే కావేరి స్నానానికి వెళ్ళాను పెరియవ. తగినంత నీళ్లతోనే కావేరి ప్రవహిస్తోంది" అని చెప్పాడు.

స్వామివారు దాంతో సమాధానపడలేదు. "తగినంత నీళ్ళతోనే అనేది అర్థం కావట్లేదు. అంటే ఒక వ్యక్తి మునిగి చక్కగా స్నానం చేసుకునేంతగా ప్రవహిస్తోదా. అది కావాలి నాకు" అని అన్నారు. స్వామివారు మా నాన్నవైపు తిరిగి మరలా, "సంతానం నువ్వు ఒక పనిచెయ్యి. రేపు ఉదయం నువ్వు కావేరి స్నానానికి వెళ్ళు. చక్కగా మునకలు వేసి స్నానం చెయ్యడానికి సరిపడా నీళ్ళు ప్రవహిస్తున్నాయో లేదో చూసి నాకు చెప్పు" అని ఆదేశించి హఠాత్తుగా లేచి లోపలికి వెళ్ళిపోయారు.

స్వామివారు తాము స్నానం చెయ్యడం కోసమే ఈ వివరాలన్నీ అడుగుతునారనుకొని మేము మా ఊరికి తిరిగొచ్చాము.

శనివారం సూర్యోదయమైంది. చిన్న తుంపరగా వర్షం పడుతోంది. స్వామివారి ఆదేశం ప్రకారం మేము కావేరి స్నానానికి వెళ్ళాము. అప్పుడు ఉదయం ఏడు గంటలు. నేను, మా నన్నగారు తప్ప ఒక్క ప్రాణి కూడా లేదు అక్కడ. స్నానానికి దిగుతూ మా నాన్న, "నీరు స్నానానికి కావలసినంత పుష్కలంగా ప్రవహిస్తున్నాయి. వెళ్ళి స్వామివారికి చెప్పాలి" అని అన్నారు.

తరువాత పెద్ద స్వరంతో కావేరి స్నాన సంకల్పం చెప్పడానికి మొదలుపెట్టారు. హఠాత్తుగా ఒడ్డునుండి ఒక గొంతు గట్టిగా వినబడింది. "శాస్త్రిగారూ కొద్దిగా ఆగండి. నేను కూడా వస్తాను. నాకు కూడా స్నాన సంకల్పం చెప్పండి. మీకు పుణ్యం ఉంటుంది". ఇద్దరము తిరిగి చూశాము. దాదాపు యాభైయ్యైదు సంవత్సరముల వయస్సున్న ఒకతను నీల్లల్లోకి దిగుతున్నాడు. మేము ఎప్పుడూ చూడని మొహం అది!!

(సశేషం)

అపార కరుణాసింధుం జ్ఞానదం శాంతరూపిణం
శ్రీ చంద్రశేఖర గురుం ప్రణమామి ముదావహం ॥

#KanchiParamacharyaVaibhavam #కంచిపరమాచార్యవైభవం
2/12/18, 12:57 - Paramacharyulu: (శృంగేరి శారదా పీఠం 35వ పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ అభినవ విద్యాతీర్థ మహాస్వామి వారి మహిమలు)

ఒకసారి నేను నా ద్విచక్ర వాహనం నడుపుతూ ఉండగా, నాకు ప్రమాదం జరిగింది. నన్ను వెంటనే ఆసుపత్రిలో చేర్చారు. వైద్యులు పరీక్షించగా భుజం జారింది అని, చాలా చోట్ల ఎముకలు విరిగాయని తెలిసింది. వెంటనే శస్త్ర చికిత్స అవసరమని చెప్పారు. శృంగేరిలో ఉన్న నా తల్లిదండ్రులకు ఈ వార్త తెలిసింది. వారు వెంటనే జగద్గురువులు అభినవ విద్యాతీర్థ మహాస్వామిని ప్రార్థించారు. జగద్గురువులు నాకు తొందరగా తగ్గడానికి నా తల్లిదండ్రులకు ప్రసాదం ఇచ్చారు. స్వామివారి ప్రసాదం నేను తీసుకునేంతవరకు శస్త్ర చికిత్స చేయవద్దని వైద్యునితో అన్నాను.

స్వతహాగా ఒక వైద్యురాలినయి ఉండి, గాయాల తీవ్రత తెలిసిన నేను అలా అనేసరికి ఆ వైద్యునికి కోపం వచ్చింది. నన్ను ఆసుపత్రిలోని ఆర్థోపెడిక్ విభాగానికి మార్చారు. ఆ విభాగాధిపతి పీఠానికి, జగద్గురువులకు భక్తులు. ఆయనకు నా భావం అర్థమైంది. మూడు వారాల తరువాతనే నాకు శస్త్ర చికిత్స చెయ్యడానికి ఒప్పుకున్నారు. స్వామి వారి ప్రసాదం రాగానే, దెబ్బలు తగిలిన చోట విభూతిని రాసుకున్నాను. అనుకున్న విధంగా మూడు వారాల తరువాత ఎక్స్-రే తీసారు. వాటిని చూసిన వైద్యుడు నిర్ఘాంతపోయాడు. భుజం జారిన చోటు ఏ ఇబ్బంది లేదు. మిగిలిన చోట్ల కూడ ఏ ఇబ్బంది లేదు. అంతా సవ్యంగా ఉంది. ఇది కేవలం జగద్గురువుల అనుగ్రహం. ఆ వైద్యుడు ఆ ఎక్స్-రేలను విద్యార్థులకు చూపించడానికి ఉంచుకున్నాడు.

ఈ సంఘటన డా.సుబ్బలక్ష్మి గారి జీవితం లోది.

#SringeriJagadguruVaibhavam #శృంగేరిజగద్గురువైభవం
2/12/18, 16:17 - Paramacharyulu: రెండవ శ్లోకం - మొదటి భాగం

తనీయాంసం పాంసుం తవచరణ పంకేరుహభవం
విరించిః సంచిన్వన్ విరచయతి లోకానవికలం
వహత్యేనం శౌరిః కథమపి సహస్రేన శిరసాం
హరః సంక్షుద్యైనం భజతి భసితోద్ధూళన విధిం.

(అమ్మా! నీ పాద పద్మముల ధూళిలోని ఒక చిన్న అణువును సాధనంగా గ్రహించి బ్రహ్మ లోకాలను సృష్టి చేస్తున్నాడు. సహస్ర శీర్షములతో శౌరి (విష్ణువు) అతి కష్టంగా మోస్తున్నాడు. దానినే చక్కగా మేదించిన రుద్రుడు ఆ భస్మం మేనంతా అలదుకొంటున్నాడు.)

ఇది రెండవ శ్లోకము. అమ్మ హరిహర బ్రహ్మాదులచేత కొలవబడుతుందని మొదట శ్లోకంలో చెప్పిన భావం ఇక్కడ విస్తరించబడుతోంది. త్రిమూర్తులు వారి ముఖ్య విధులైన సృష్టి స్థితి సంహారములు చేస్తున్నారంటే, దానికి అంబిక కృపావేశమే కారణము.

బ్రహ్మ ఈ ప్రపంచాన్ని అంబిక పాద ధూళిలో అతి చిన్న రేణువు నుండి సృష్టి చేస్తాడల్లేవుంది. “పాంసు” అంటే ధూళి. ఆ ధూళిలో కూడా చిన్న చిన్న రేణువులుంటాయి. ఆచార్యులవారు వాడిన “తనీయాంసం” అన్న పదం అట్టి ధూళి రేణువులను సూచిస్తుంది. పరబ్రహ్మయొక్క సమస్తమైన శక్తి ఒక ఆకృతికొన్నపుడు, మూర్తీభవించినపుడు అట్టి శక్తి యొక్క పాదరజపు అతి చిన్న రేణువు చతుర్దశ భువనములతో కూడి ఉన్న ఈ సమస్త విశ్వాన్నీ సృష్టించడానికి సరిపోతుందన్నమాట.

తరువాతది సంరక్షణ. అనంత పద్మనాభుడుగా విష్ణుమూర్తి శయనించే ఆదిశేషుడు, లేక అనంతుడు కూడా విష్ణ్వవతారమే! అట్టి అనంతుడు అంబిక పాదధూళి రేణువుతో చేయబడిన ఈ ప్రపంచాన్ని వేయి తలలతో మోస్తున్నాడట. ఇక్కడ ఆచార్యుల వారు విష్ణువును శౌరిగా పిలుస్తున్నారు. యాదవ శ్రేష్ఠుడైన శూరసేనుని మనుమడు కాబట్టి కృష్ణ పరమాత్మకు శౌరి అన్న పేరున్నది. బలరామునికి కూడా ఈ పేరు వర్తిస్తుంది. ఆయన కూడా శూరసేనుని మనుమడే! పెద్దవాడు కాబట్టి అతనిని ఆ పేరుతో పిలవడం మరింత న్యాయంగా ఉంటుంది. బలరాముడు, విష్ణుమూర్తి దశావతారములలో ఒకడు. అంతేకాదు. అతడు శేషుని అవతారంగా కొలవబడుతున్నాడు. కాబట్టి విష్ణుమూర్తి సహస్ర శీర్షములతో ఈ విశ్వమును మోస్తున్నాడనటంలో తప్పేమీ లేదు. పురుషోత్తముని (విష్ణుమూర్తి) వర్ణించే పురుష సూక్తంలో మొదటి పదమే వెయ్యి తలలు కలవానిగా అభివర్ణిస్తోంది – ‘సహస్ర శీర్షా’.

వాచ్యార్థం తీసుకోంటే వెయ్యి తలలతో విష్ణుమూర్తి ఈ ధరామండలాన్ని మోస్తున్నాడన్న అర్థం వచ్చినా, ఈ వాక్యపు భావం ఆయన ఈ సృష్టిని రక్షిస్తున్నాడు, పోషిస్తున్నాడు అని చెప్పుకోవాలి. ఈ కార్యాన్ని విష్ణుమూర్తి ‘కథమపి’ – కష్టపడి ఎలాగోలా పూర్తి చేస్తున్నాడట. బ్రహ్మసృష్టి గురించి వర్ణించినపుడు ఆచార్యులవారు ఆయన కష్టపడుతున్నట్లు చెప్పలేదు. సంహారంలో రుద్రుడు శ్రమపడుతున్నట్లు వర్ణించలేదు. విష్ణువుకు మాత్రమే ఇంత కష్టమెందుకు? సృష్టికార్యము అల్పకాలంలో అయిపోతుంది. సంహారం మరింత తేలిక కదా! అత్యల్పకాలంలో అయిపోతుంది కానీ ఈ పోషణా భారము యుగములు, కల్పాంతములు నిర్వహించవలసి ఉంటుంది. ఈ ఉద్దేశ్యంతో‘కథమపి’ అన్న పదం వాడబడింది.

(సశేషం)

#KanchiParamacharyaVaibhavam #కంచిపరమాచార్యవైభవం
#ParamacharyaSoundaryaLahariBhashyam
2/13/18, 06:38 - Paramacharyulu: చంద్రమౌళీశ్వరుని కృప (పార్ట్ 3)

సంకల్ప స్నానం ముగించి ఇవతలకు వచ్చాము. అతను బట్టలు మార్చుకుంటూ ఐదువందల రూపాయలను స్నానసంకల్ప దక్షిణగా నన్నగారికి ఇచ్చాడు. నాన్న ఆయన వివరాలు అడిగారు.

మా పూర్వీకులది కూడా మరుత్తువక్కుడి గ్రామమే. మా నాన్నగారి నాన్నగారు కూడా ఇక్కడివారే. మా అమ్మవాళ్ల నాన్నగారైన వేంకటాచలం అయ్యర్ గారికి మరుత్తువక్కుడిలో ఒక ఇల్లు ఉండేది. మా తాతదారి తరువాత మేము ఎవ్వరమూ ఇక్కడ నివసించలేదు. మేము బాంబే వెళ్ళిపోయాము. తిరునీలక్కుడి దగ్గర్లోని మేలూర్ చంద్రమౌళీశ్వర స్వామి మా ఇలవేల్పు. మా అమ్మ ఎప్పుడూ “అటువైపు వెళ్ళినప్పుడు అడుతురై కావేరిలో సంకల్పస్నానం చేసేరా” అని చెప్పేది. ఆ భాగ్యం నాకు ఈరోజే కలిగింది. ఒక కుటుంబ వ్యాజ్యం పైన తంజావూరు వెళ్తున్నాను. తృప్తిమేర కావేరీలో సంకల్ప స్నానం చేశాను. ధన్యావాదాలు!!” అని చెప్పాడు.

తరువాత అతనే కొనసాగిస్తూ, “అవును శాస్త్రిగారు, ట్రైన్ నుండి దిగగానే గమనించాను చాలామంది మడిచీరలతో, కచ్చపంచలతో గుంపులు గుంపులుగా కనిపించారు. ఏమిటి విశేషమిక్కడ?” అని అడిగారు. నాన్నగారు పరమాచార్య స్వామివారి విజయం గురించి, గ్రామాలవాళ్ళు చేస్తున్న సమిష్టి భిక్ష గురించి విపులంగా చెప్పారు. అదంతా విని ఆయన చాలా ఆనందపడ్డారు.

“అసలు వినడానికే చాలా సంతోషంగా ఉంది. ఆ జగద్గురువుకు భిక్షావందనం చెయ్యరాదనే నిర్బంధం ఉన్నది నాకు, నేను ఉన్న ఊరివల్ల. కాని, మా కుటుంబం తరపున కానుకగా ఈ డబ్బు ఇస్తున్నాను. దయచేసి దీన్ని కూడా మీ భిక్షా వందనంలో చేర్చండి” అని చెప్పి, మా నాన్నగారికి సాష్టాంగం చేసి ఒక కవరును మా నాన్నగారికి ఇచ్చాడు. మా నన్నగారికి ఏమి అర్థం కాలేదు. దాన్ని తెరిచి చూడగా అందులో ఐదువందల రూపాయలు ఉంది.

”నేను ఇక వెళ్ళొస్తాను శాస్త్రిగారు”, అని వెళ్తున్నవాణ్ణి మా నాన్నగారు ఆపి, “మీ నామధేయము” అని అడిగారు.

దానికి అతను చెప్పిన సమాధానం “చంద్రమౌళి”. విన్న మేము స్థాణువుల్లా నిలబడిపోయాము. అక్కడి నుండి మేము నేరుగా స్వామివారి బసకు వెళ్ళాము. మహాస్వామివారు అక్కడ లేరు, గోవిందాపురం బోధేంద్ర స్వామి మఠానికి వెళ్ళారు అని చెప్పారు.

శ్రీకార్యం దగ్గరికి వెళ్ళి, “స్వామివారు కవేరీలో స్నానం చెయ్యడానికి నీళ్ళు పుష్కలంగా ఉన్నాయో లేదో చూసి రమ్మన్నారు” అని ముగించక ముందే “మహాస్వామివారు కావేరీ స్నానాన్ని ముగించుకొని ఉదాయం నాలుగ్గంటలకే తిరిగొచ్చారు” అని చెప్పారు. మా ఆనందాశ్చర్యాలు రెట్టింపయ్యాయి.

ఆదివారం భిక్షావందనం ముగిసింది. మా ఊరివాళ్లమందరమూ స్వామివారికి సాష్టాంగం చేశాము. నాన్నగారు పాదసమర్పణగా ఒక పళ్ళెం నిండా పళ్ళతో ఐదువందల రూపాయలను సమర్పించారు.

కొద్దిసేపు ఆ పళ్ళెంవైపు చూసి స్వామివారు నవ్వుతూ, "ఏమి సంతానం, "చంద్రమౌళీశ్వరు"ని కృపతో నీ అభీష్టము సిద్ధించింది కదా" అని అన్నారు. మేమందరమూ ఆశ్చర్యపోయి స్వామికి సాష్టాంగం చేశాము.

అపార కరుణాసింధుం జ్ఞానదం శాంతరూపిణం
శ్రీ చంద్రశేఖర గురుం ప్రణమామి ముదావహం ॥

--- రమణి అన్న, 'శక్తి వికటన్' ప్రచురణ

#KanchiParamacharyaVaibhavam #కంచిపరమాచార్యవైభవం
2/13/18, 11:22 - Paramacharyulu: నామజప మహిమ

(శృంగేరి శారదా పీఠం 35వ పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ అభినవ విద్యాతీర్థ మహాస్వామి వారి బోధలు)

భగవంతుని నామం మనలను ఎంతటి చెడు నుంచి అయినా కాపాడగలదు. మన చేయి అగ్నికి తెలిసి తగిలినా, తెలియక తగిలినా కాలకుండా ఉండదు. అలానే, భగవంతుని నామం పలుకుటచే సర్వ పాపలను దగ్ధం చేయగలదు. అందుకే మనం ఏ పనిలో ఉన్నా, ఏ సమయములో అయినా భగవంతుని నామమును మననం చేస్తూ ఉండాలి.

అందరికి మంత్ర జపం చేయాలని కోరిక. ఒక మంత్రం ఉంది. ఈ మంత్రాన్ని ఎలా అయినా చేయవచ్చు. ఈ మంత్రం అందరు చేయవచ్చు. చిత్తశుద్ధి ఉన్నవాళ్ళు, లేని వాళ్ళు, ఆచారం పాటించే వాళ్ళు, పాటించని వాళ్ళు.

ఆ మంత్రం ఏంటి అంటే,

హరే రామ హరే రామ రామ రామ హరే హరే!
హరే కృష్ణ హరే కృష్ణ  కృష్ణ కృష్ణ హరే హరే !!

ఈ మంత్రం అందరు జపించ తగ్గది. క్రమం తప్పకుండా ఈ మంత్రం జపించడం వల్ల భగవంతుని కృప కలిగి, చిత్తశుద్ధి కలిగి, అన్ని పనులు నెరవేరగలవు. కాని, మనుషులు ఏమి చేస్తున్నారు? తింటున్నారు, పడుకుంటున్నారు, తిరుగుతున్నారు, చనిపోతున్నారు. పశువులు ఈ విధంగా జీవిస్తాయి. పశువులకి మనకి తేడా ఏమైనా ఉందా మరి?

అందుకే భగవంతుని నామాన్ని ఎప్పుడూ అనుకుంటూ ఉండాలి.

#SringeriJagadguruVaibhavam #శృంగేరిజగద్గురువైభవం
2/13/18, 11:28 - Paramacharyulu: <Media omitted>
2/13/18, 16:46 - Paramacharyulu: రెండవ శ్లోక భాష్యం - రెండవ భాగం

మహాత్ముల పాదరజము శిరస్సున ధరించడం ఎంతో అదృష్టముంటే కానీ సాధ్యపడదు. మహావిష్ణువు అంబిక పాదరేణువును శిరస్సున ధరించాడు. ఎట్టి పాదరేణువు? చతుర్దశ భువనములూ తానే అయిన పాదరేణువు!!

అంబిక పాదరేణువైన చతుర్దశ భువనములు ప్రళయకాలంలో ఈశ్వరునిచేత నాశనం చేయబడతాయి. ఆ భస్మాన్ని "చతుర్దశ భువనములు అంబిక పాద రేణువు కాబట్టి అది నాశనం చేయబడినపుడు మిగిలిన భస్మము కూడా అంబిక యొక్క పవిత్రమైన పాదధూళియే అన్న ఉద్దేశ్యంతో, ఈశ్వరుడు శరీరమంతా పూసుకొంటాడట.

అంబిక పాదములు ఎర్రటి ఎరుపు. ఆ పాదముల ధూళి కూడా అదే రంగులో ఉండి ఉండాలి. వేదమాత అంబిక పాదములనంటి నమస్కారం చేస్తే ఎర్రటి ఆ పాదధూళి వేదమాత పాపిట అంటుకొందట. లలితా సహస్ర నామములలో ఈ భావము "శ్రుతి సీమంత సింధూరీకృతపాదాబ్జ ధూళికా" అన్న నామంలో చెప్పబడింది. అట్టి కుంకుమపు రేణువు పదునాల్గు భువనాలయితే, ఆ కుంకుమపు రేణువే మహాప్రళయంలో భస్మంగా మారుతోంది. శివ ప్రసాదంగా విభూది, అంబికా ప్రసాదంగా కుంకుమ ఇవ్వడం ఆచారం కదా! ఇక్కడ కుంకుమే ఈశ్వరునికి విభూతిగా అవుతోంది.
మొదటి శ్లోకంలో త్రిమూర్తులు అంబికను ఆరధిస్తారని చెప్పి, రెండవ శ్లోకంలో ఆచార్యులవారు వారి విధులను గురించి ప్రస్తావించారు. కాబట్టి అంబికారాధన ఫలితంగానే త్రిమూర్తులకు, వారి విధి నిర్వహణా సామర్ధ్యము కలిగిందని అర్థమవుతోంది.

మొదటి శ్లోకం మంగళ శ్లోకము. అసలు స్తోత్రం రెండవ శ్లోకంతోనే ఆరంభమవుతోంది. మరి ఈ శ్లోకం అంబిక పాదాలను అభివర్ణిస్తోంది. సాధారణంగా స్త్రీ దేవతలను కేశాది పాదపర్యంతంగా వర్ణన చేయడం సంప్రదాయం. ఆచార్యులవారిక్కడ సంప్రదాయానికి విరుద్ధమైన వర్ణన ఎందుకు చేశారన్న ప్రశ్న ఉత్పన్నమవుతుంది. అయితే దేవతా మూర్తిని పూర్తిగా వర్ణించినపుడు కదా ఈ మర్యాద పాటించవలసింది. సౌందర్యలహరి మొదటి భాగమైన ఆనందలహరిలో అంబిక పూర్తి భౌతిక స్వరూపం అభివర్ణించబడలేదు. రెండవ భాగంలో ఈ మర్యాద పాటించబడింది. దేవతా మూర్తిని స్త్రీ మూర్తో, పురుష మూర్తో – ఆశ్రయించినపుడు మొట్టమొదట పాదములను పట్టుకోవాలి. ఆమె గురు రూపంలో తన పాదములను మన శిరస్సుపై నుంచి దీక్షనిస్తుంది. అంబిక అమ్మలగన్న అమ్మ. గురువులకు

గురువు. కాబట్టి ఆమెను అమ్మనుకొని శరణాగతి పొందినా, గురువు అనుకొని ఆశ్రయించినా పట్టుకోవలసినది పాదములనే!! కబట్టి మొట్టమొదటగా పాదములను అభివర్ణించడం ఎంతో ఉచితంగా ఉంది.

శివుడు, శక్తితో కూడి ఉండటమంటే శక్తి, శివునితో కూడి ఉన్నదనే కదా! ఇద్దరూ కలిసి అర్ధనారీశ్వర మూర్తిగా దర్శనమిస్తున్నపుడు, ఆ రూపం మరి శివ రూపమే కబట్టి పాదాదికేశ పర్యంత వర్ణనే సరిపోతుంది. ఇక్కడ అంబికను విడిగా స్వరూప వర్ణన చేయలేదు. అయినా పాదములను మొదట అభివర్ణించడంలో ఆచార్యులవారు శివశక్తులు సర్వకాలములందు కలిసి ఉంటారని, విడివడే ప్రసక్తే లేదని స్ఫురింప చేస్తున్నారు.

(సశేషం)

#KanchiParamacharyaVaibhavam #కంచిపరమాచార్యవైభవం
#ParamacharyaSoundaryaLahariBhashyam
2/14/18, 06:56 - Paramacharyulu: మహాస్వామి వారి చిత్రపటం

చిత్రకారుడు సిల్పి (పి.యమ్. శ్రీనివాసన్) తను చేస్తున్న ఒక పనికోసం నెలరోజులుగా నిరీక్షించిన పరమాచార్య స్వామి వారి దర్శనం లభించిన రోజది. ఆ గొప్ప చిత్రకారుడి జీవితాన్ని పూర్తిగా మలుపుతిప్పిన రోజు. రాత్రి చాలా పొద్దు పోయిన తరువాత, ప్రపంచం మొత్తం గాఢనిద్రలోకి జారుకున్న సమయాన ఇద్దరి మధ్య సంభాషణ జరిగింది.

ఒకరు జగద్విఖ్యాతి చెందిన మహాపురుషులైన సన్యాసులు కాగా, మరొకరు ప్రపంచానికి అంతగా తెలియని గొప్ప చిత్రకారుడు. ఆ పరమపవిత్రమైన గదిలో, నూనెదీపపు వెలుగులో ఆ చిత్రకారునికి ఒక రహస్యాన్ని చెప్పడానికి ఆ సన్యాసి కళ్ళు అత్యంత తెజోవంతములై మెరిశాయి.

“ఇప్పటిదాకా నువ్వు ఎన్నో జన్మలు ఎత్తావు. అన్ని జన్మలలో భగవంతుణ్ణి ఎంతో భక్తితో సేవించావు. క్రిందటి జన్మలలో ఎన్నో దేవాలయాలకు స్థపతివై ఎన్నో దైవీ శక్తులు కలిగిన శిల్పాలను మలిచావు. ఇది నీకు చివరి జన్మ. నీకు సంప్రాప్తమైన ఈ దైవకళను వ్యర్థం చెయ్యకు. ఇప్పటినుండి కేవలం దేవతా రూపాలను మాత్రమె చిత్రిస్తానని వాగ్దానం చెయ్యి. నీ ప్రతిభ ఆసాదారణమైనది. నీకు జన్మతః శిలా శాస్త్రము, సాముద్రికా లక్షణము తెలుసు. ఇక వేరే చదువు నీకు అక్కరలేదు. నీ దైవదత్తమైన కళ ద్వారా దైవిత్వాన్ని అన్ని ఇళ్ళల్లో ఆవిష్కరించే లక్ష్యంతో రేపు ఉదయాన్నే ప్రపంచంలోకి వెళ్ళు” అని ఆదేశించారు.

ఆ చిత్రకారుడు శ్రీవారి వద్ద సెలవు తీసుకుని, బాహ్య ప్రపంచానికి తెలియని ఎన్నో మారుమూల దేవాలయాలకు వెళ్లి అక్కడ ఉన్న వివిధ మూర్తులను తన క్యాన్వాసుపై చిత్రించసాగాడు. అది అంత సులువైన పని కాదు, అత్యంత నియమనిష్టలతో, భక్తిశ్రద్ధలతో ఉన్నవారికి మాత్రమె కుదిరే కార్యం.

“నీ ఊహలను ఎంతమాత్రమూ చిత్రించారాదు. శిల్ప శాస్త్రాన్ని అనుసరించి, సాముద్రికా లక్షణంలో తెల్పిన ప్రకారం వివిధ శక్తులతో ఉన్న దేవతా మూర్తులను నువ్వు ఎలా చూస్తున్నావో అలాగే చిత్రించాలి. కొత్తగా వెలుగును ఏర్పాటు చేసుకోకుండా, పరిమితమైన దీపపు వెలుగులో, నువ్వు చిత్రించే సమయంలో నీకు ధ్యానస్థితిలో అగుపించే విశేషాలను మాత్రమె చిత్రించు. నీ కుంచె కదిలికలవల్ల ఆ మూర్తి యొక్క శక్తిని, తేజస్సును కూడా నీ చిత్రాలలో చిత్రించగలుగుతావు” అని స్వామివారు చెప్పిన విషయాలను ఎన్నడూ మరువలేదు.

తనకు గురువు, దైవం, మార్గదర్శకులు చెప్పినట్టుగా కొత్త జీవితాన్ని ప్రారంభించి, జీవితాంతం స్వామివారు ఆశిస్సులే ఊపిరిగా బ్రతికాడు. సిల్పి సంసారస్థుడు. తన భార్య పరమాచార్య స్వామివారికి పెద్ద భక్తురాలు. ఆమె వయోభారం చేత మఠానికి వెళ్లి పరమాచార్య స్వామి దర్శనం చేసుకుని ఆశీస్సులు తీసుకోవడానికి కుదరడంలేదు. అందుకనే ఆమె పరమాచార్య స్వామివారి చిత్రపటాన్ని చిత్రించి ఇంటిలో ఉంచుకుంటే జీవితాంతం వారిని ఆరాధించుకుంటానని తన భర్తని కోరింది. 1956 లో తన భార్య కోసం స్వామివారిని చిత్రించడానికి సిల్పి వెళ్ళాడు.

కాని స్వామివారు అతనికి సహకరించడం తప్ప అన్నీ చేస్తున్నారు. అటూ, ఇటూ కదులుతూ సిల్పి సహనాన్ని, భక్తిని పరీక్షిస్తున్నారు. చివరికి అంతా ముగిసిన తరువాత సిల్పి చేతిలో ఒక గొప్ప కళాఖండం రూపుదాల్చుకుంది. తన భక్తికి పరాకాష్టలా మహాస్వామివారి కాలివేలి గోళ్ళు మొదలుకుని వారి నుండి వెలువడే దివ్యకాంతి వరకు ఆ చిత్రపటంలో నిండి నిబిడీకృతమైంది.

అది చాలా ప్రత్యేకమైన చిత్రపటం. మహాస్వామివారి చూపులను అత్యంత సూక్ష్మమమైన రంగుల్లో అందంగా చిత్రించాడు. వేసుకున్న బిల్వమాలలోని బిల్వ దళాలు తాజాగా ఉంటాయి. ఏ ఫోటో కూడా తనలో నింపుకోలేని తేజస్సును తన కుంచె ద్వారా ఆవిష్కరించాడు. ఆ గదిలో స్వామివారి పాదాల వద్ద వెలిగించిన ఒకేఒక్క దీపం స్వామివారి వెలుగులో చిన్నబోయింది. ఇంత అద్భుతంగా ఎప్పుడూ ఎవ్వరూ స్వామివారిని చిత్రించలేదు. ఆ గదిలో కదలకుండా కూర్చుని చిత్రకారుని గమనించి, పూర్తైన తరువాత ఆశీస్సులు అందించి మన పుణ్యవశమున దాన్ని బయలుపరిచారు.

చిత్రకారుడు సిల్పి క్యాన్వాసుపై కంచి పెరియవ శ్రీ జగద్గురు చంద్రశేఖరేంద్ర సరస్వతి స్వామివారు ఇప్పటికి సజీవంగా ఉన్నారు. 1956 లో సిల్పి కుంచె నుండి జాలువారిన మహోత్తరమైన స్వామివారి చిత్రపటం ఇదే.

అపార కరుణాసింధుం జ్ఞానదం శాంతరూపిణం
శ్రీ చంద్రశేఖర గురుం ప్రణమామి ముదావహం ॥

#KanchiParamacharyaVaibhavam #కంచిపరమాచార్యవైభవం
2/14/18, 08:44 - Paramacharyulu: <Media omitted>
2/14/18, 16:07 - Paramacharyulu: మూడవ శ్లోకం - మొదటి భాగం

అవిద్యానా మంతస్తిమిర మిహిర ద్వీపనగరీ
జడానాం చైతన్య స్తబక మకరంద శృతిఝరీ
దరిద్రాణాం చింతామణి గుణనికా జన్మజలధౌ
నిమగ్నానాం దంష్ట్రా మురరిపు వరాహస్య భవతి !!

ఈ మూడవ శ్లోకము అంబిక పవిత్రమైన పాదధూళి మనకు ఎంతటి ఉన్నతిని ప్రసాదించగలదో వివరిస్తుంది. రెండవ శ్లోకంలో అంబిక చరణ రజరేణువుచేత ఈ ప్రపంచ సృష్టి స్థితి లయములనే విధులు ఎలా నిర్వహించబడుతాయో వివరించబడింది కదా! అట్టి పాదధూళి సమస్త జీవజాలానికి ఏ విధంగా శ్రేయస్సును ప్రసాదించగలదో, మనలను ప్రాపంచిక స్థితి నుండి ముక్తులను చేయడమనే అనుగ్రహం ఏ విధంగా చూపగలదో ఈ శ్లోకంలో చెబుతున్నారు.

"అవిద్యానాం – అంతః – తిమిర – మిహిర –ద్వీపనగరీ"

అవిద్య అంటే అజ్ఞానం, తిమిర శబ్దానికి భయంకరమైన చిక్కటి చీకటి అన్నభావం. ఈ అజ్ఞానమనే చిక్కటి చీకటి మనలోని స్వయంప్రకాశమైన ఆత్మతత్త్వాన్ని మరుగు పరుస్తోంది. అటువంటి అజ్ఞానంలో చిక్కుకు పోయినవారికి అంబిక పాదధూళి జ్ఞాన ప్రకాశాన్ని కలుగజేస్తుంది. మిహిరుడు అంటే సూర్యుడు. ద్వీపనగరీ అనగా ద్వీపంపైనున్న నగరం. ఉదయిస్తున్న సూర్యుని చూస్తుంటే సముద్రగర్భంలోనున్న ఒకానొక ద్వీపంనుండి బయటకు వస్తున్నట్లు తోస్తుంది కదా! ఆ ద్వీపంపై ఒక నగరమున్నదనుకోండి. అంబిక ప్రసాదించే జ్ఞానప్రకాశం ఆ నగరము ఎంత ప్రకాశవంతంగా ఉంటుందో అంతటి ప్రకాశాన్ని కలగజేస్తుంది.

అంబిక పాదధూళి సూర్యునివలే అజ్ఞానాంధకారాన్ని తొలగిస్తుందని చెబితే సరిపోలేదా! ఈ ద్వీపాలూ, నగరాలు ఈ త్రిప్పటమెందుకు అనుకొనేవారికి ఈ వాక్యపు పాఠాంతరమున్నది. "తిమిర మిహిరోద్దీపనకరీ" ఉద్దీపన అనగా ఒక వస్తువును ప్రకాశవంతం చేయడం. ఈ పాఠాన్ననుసరించి "అంబిక పాదధూళి అంతరంగైకమైన అజ్ఞానపు చీకట్లను పారద్రోలి జ్ఞానప్రకాశం కలగజేసే సూర్యుడు" అన్న అర్థం వస్తుంది.

ప్రాపంచికమైన వ్యవహారాలతో సమబంధమున్న సగుణ బ్రహ్మము సప్రపంచకము. ముందు శ్లోకములో ఆమె పాదధూళి ఈ ప్రపంచ సృష్టిస్థితి లయములకు కారణమని చెప్పడం ద్వారా అంబిక సగుణ బ్రహ్మముగా సూచించబడింది. ఈ శ్లోకంలో మాయాంధకారాన్ని పారద్రోలే జ్ఞానసూర్య ప్రకాశమని అభివర్ణితమవడంలో అంబిక నిర్గుణ బ్రహ్మమవుతోంది.

నిరంతరం అద్వైత స్థితిలో ఉండే ఆచార్యులవారు, ద్వైతస్థితిలోని వారికై భక్తి సంబంధమైన కృతులు చేసేటప్పుడు కూడా అద్వైత సిద్ధాంతంలోనికి అప్రయత్నంగా వెళ్ళిపోతూ ఉంటారు. అంతలో ద్వైత ప్రపంచంలో ఉన్నవారికై కదా ఈ స్తుతి వ్రాస్తున్నాము అనుకొని అద్వైత తత్త్వాన్ని సూచించినప్పటికీ దాని వివరణ చేయక మళ్ళీ ద్వైతస్థితికి దిగి స్తోత్రం చేస్తారు. అదే విధంగా ఇక్కడ కూడా అజ్ఞానాంధకారమును జ్ఞానభాస్కరుని వెలుగుతో పారద్రోలాలనే తత్త్వాన్ని ప్రస్తావించి వెనువెంటనే సాధారణ ప్రజలు కోరుకునే లౌకిక ప్రజ్ఞ, సంపదల గురించి వ్రాశారు. ఎంతటి లౌకిక ప్రజ్ఞ ఉన్నా, ఎంతటి తెలివి తేటలుగలవారయినా వారందరినీ అవిద్య పట్టి పీడిస్తూనే ఉంటుంది. ఆత్మానుభూతిగల ఎవరో కొందరు మహానుభావులకు ఈ అవిద్యను పారద్రోలి, ఆత్మానుభూతి అనే మహా తేజస్సు అనుభవించడం అనే అట్టి మహోన్నతస్థితిని ప్రసాదిస్తుంది. అట్టి స్థితిని గురించి చెప్పిన ఆచార్యులవారు వెనువెంటనే ద్వైతప్రపంచమునకు సంబంధించిన కేవలము లౌకిక ప్రజ్ఞ, లౌకిక విజ్ఞానము గురించి ప్రస్తావిస్తున్నారు.

(సశేషం)

#KanchiParamacharyaVaibhavam #కంచిపరమాచార్యవైభవం
#ParamacharyaSoundaryaLahariBhashyam
2/15/18, 06:44 - Paramacharyulu: క్యాన్వాసుపై కరుణామూర్తి

ఒకసారి నా భార్య పద్మావతి నన్ను ఆటపట్టిస్తూ, నేను చిత్రకారుణ్ణి కాబట్టి, ఇవేవి కాదు గాని పరమాచార్య స్వామివారి చిత్రపటాన్ని చిత్రించమని, ఇక జీవితాంతం వేరే ఆలోచన లేక ఆ చిత్రపటాన్నే చూస్తూ ఉంటానని చెప్పింది. ఈ విషయమై కంచి శ్రీమఠానికి ఉత్తరం వ్రాయగా వెంటనే రమ్మని కబురు వచ్చింది.

నేను పరమాచార్య స్వామివారికి నమస్కరించి, నేను వచ్చిన విషయం విన్నవించగానే, "అయితే నువ్వు నా చిత్రపటాన్ని గీస్తావన్నమాట. నువ్వు మాలి (టి. ఆర్. మహాలింగం) శిష్యుడివి. నువ్వు నన్ను ని క్యాన్వాసుపై చిత్రించగలనని అనుకుంటున్నావా?" అని అన్నారు. కొన్నిరోజుల తరువాత ఎలాగైతేనేమి, శ్రీవారిని చిత్రించడానికి ఒప్పుకున్నారు. అది వేసవి మధ్యాహ్నం. శ్రీవారికి కొద్ది దూరంలో బాగా ఎండ పడే చోట నన్ను కూర్చోమన్నారు. ఎండవేడిమి వల్ల కూర్చోవడానికి చాలా ఇబ్బందిగా ఉంది. నేల బాగా కాలుతుండడంచేత నేను స్థిమితంగా కూర్చొలేకపోయాను. నా పరిస్థితిని స్వామివారు అర్థం చేసుకున్నారు. వారి కళ్ళల్లో అవ్యాజమైన కరుణ. వెంటనే అక్కడ ఉన్న దృశ్యం మారిపోయింది. అక్కడి వాతావరణం చల్లబడి ఎంతో ఆహ్లాదంగా అనిపించసాగింది.

ఇంకా శ్రీవారు తమ లీలలు చూపిస్తున్నారు. ఎంత ప్రయత్నించినా స్వామివారిని సరిగ్గా చిత్రించలేకపోతున్నాను. చివరగా ఎన్నో ఓటముల తరువాత ఎక్కువ అత్యంత నిబద్ధతతో శ్రీవారి చిత్రం పూర్తిచేసి, ఆశిస్సుల కోసం వారి పాదముల వద్ద ఉంచాము. నేను, నా భార్య

కన్నీరు ఆపుకోలేకపోతున్నాము. ఆ చిత్రపటం సరిగ్గా ఉన్నదని ఆశీర్వాదించమని వేడుకున్నాము. ఒకవేళ శ్రీవారు అది తనలా లేదు అని చెబితే, ధైర్యం చేసి ఆ చిత్రపటం మాకు వద్దు, మీవద్దనే ఉంచుకొమ్మని చెబుదాము అనుకున్నాము.

ఒకసారి ఆ చిత్రపటాన్ని తీసుకుని, గుండెలకు అన్చుకుని ధ్యానమగ్నులయ్యారు. ఒక్కసారి వరదరాజ స్వామి ఆలయం వంక చూశారు(అప్పుడు స్వామివారు చిన్న కాంచీపురంలో ఉన్నారు). స్వామివారి కళ్ళల్లో సన్నటి నీటిధార. అప్పుడే దేవలాయం గంటలు మ్రోగాయి.

శ్రీవారి శరీరంపై ఉన్న బిల్వదళాలు, తులసిమాలను తీసి అ పటంపై ఉంచారు. అక్షతలు, పటికబెల్లం దానిపై ఉంచి రెండు చేతులు ఎత్తి ఇద్దరినీ ఆశీర్వదించారు.

కొద్దిదూరంలో నిలబడి అంతా గమనిస్తూ ఉన్న జయేంద్ర సరస్వతి స్వామివారు నాకు పరమాచార్యుల వారి పూర్తి అనుగ్రహం లభించిందని, వారు ఆ చిత్రపటాన్ని అత్యంత కరుణాపూరిత చూపులతో చూశారని చెప్పారు.

అపార కరుణాసింధుం జ్ఞానదం శాంతరూపిణం
శ్రీ చంద్రశేఖర గురుం ప్రణమామి ముదావహం ॥

--- చిత్రకారుడు సిల్పి(పి.యమ్. శ్రీనివాసన్), ‘kamakoti.org’ నుండి

#KanchiParamacharyaVaibhavam #కంచిపరమాచార్యవైభవం
2/15/18, 16:21 - Paramacharyulu: మూడవ శ్లోక భాష్యం - రెండవ భాగం

“జడానాం – చైతన్య – స్తబక – మకరంద – శృతిఝరీ”

జడులంటే మందమతులు. వారి మతిలో విషయ పరిజ్ఞానమనే సారము పూర్తిగా ఎండిపోయి నిస్సారమయిపోయింది. అట్టి జడుల విషయంలో అంబిక పాదధూళి, వారి హృదయాలలో తేనె వాగులను ప్రవహింపచేసి సారవంతం చేస్తుందట. మకరందశ్శృతి ఝరీ – తేనె ప్రవాహం. తేనె పూలల్లోంచి కదా రావాలి. కొన్ని పూలతేనెలకు ప్రత్యేకమైన గుణాలుంటాయి. మరి అంబిక ప్రవహింపచేసే తేనె ఏ పూలనుంచి వచ్చినది? చైతన్యమనే పూలగుత్తులనుండి వచ్చే తేనె – నిజానికి చైతన్యమంటే “చిత్”గా పిలవబడే అత్యంతికమైన జ్ఞానమే! అయితే ఇక్కడ జడుల విషయంలో తేలికైన లౌకికప్రజ్ఞ అనే పూలగుత్తులనుండి ప్రవహించే తేనె అవుతోంది.

లలితా సహస్రనామములలో చైతన్యకుసుమప్రియా, చైతన్యార్ఘ్య సమారాధ్య అన్న నామములున్నవి. చైతన్యమనే పూలతో అంబికను అర్చించాలట. ఆమెకు ఆ పూవులు ప్రియమైనవట. చైతన్యమనే జలములచే అంబికకు అర్ఘ్యం సమర్పించాలట. కాళహస్తిలో అమ్మవారు జ్ఞానప్రసూన. ఆ పేర్లతోపాటే అమ్మవారి సదోదితా, తరుణాదిత్యపాటలా అన్న పేర్లు కూడా ఉన్నాయి. ఎల్లప్పుడూ ప్రతఃకాలపు వెలుగులతో ప్రకాశించేది సదోదిత. ప్రాతఃకాలపు సూర్యుని కాంతివలె అరుణవర్ణంతో ప్రకాశించేది తరుణాదిత్యపాటలా. ఆచార్యులవారు లలితా సహస్రనామములచేత ప్రభావితులయి “తిమిర మిహిర ద్వీపనగరీ”, “చైతన్య స్తబక”ములవంటి పదములను ఉపయోగించారని తోస్తుంది.

సాధారణంగా జనులు లౌకికప్రజ్ఞ, సంపద కోరుకుంటారు కదా! ఆచార్యులవారు అట్టి తెలివితేటల తరువాత సంపదగురించి ప్రస్తావిస్తున్నారు.

“దరిద్రాణాం – చింతామణి – గుణనికా”

కోర్కెలు తీర్చగల శక్తికలది చింతామణి. మనం కోరుకున్నవన్నీ సృష్టించగల సమర్థత దానికున్నది. దరిద్రులకు అంబిక పాదధూళి అట్టి చింతామణి. ఒక్క చింతామణి కాదు, చింతామణిమాల. మన సమస్తమైన కోరికలు తీరడానికి ఒక్క చింతామణి చాలు. అయితే అంబిక పాదధూళి మనం కోరుకున్నదాన్ని ఎన్నోరెట్లుగా ప్రసాదించగలట్టిది. అందుకే చింతామణిమాలగా అభివర్ణితమయింది.

మనకు ఈ లౌకికమైన తెలివితేటలు, సంపదలు ముఖ్యం. మరి ఆచార్యులవారికి మనము ఈ మాయనుండి, ఈ ప్రాపంచిక స్థితినుండి బయటపడి, ఉద్ధరించబడాలన్నది ముఖ్యోద్దేశ్యం. వారు శ్లోకారంభంలోనే అవిద్య నుండి ముక్తి గురించి ముచ్చటించారు. ఇక చివర్లో జనన మరణ ప్రవాహంనుండి ముక్తులవడం గురించి వివరిస్తున్నారు.

“జన్మ జలధౌ నిమగ్నానాం దంష్ట్రా మురరిపు వరాహస్య భవతి”.

పుట్టుక చావులనబడే ఈ మాయా మహాసముద్రంలో పూర్తిగా మునిగిపోయి కొట్టుమిట్టాడేవారికి ఆ తల్లి చరణధూళి విష్ణుమూర్తి యొక్క వరాహావతారపు కోఱవంటిదట.

హిరణ్యాక్షుడు భూదేవిని దొంగిలించి సముద్రగర్భంలో దాచివేశాడు. విష్ణుమూర్తి వరాహావతారం ఎత్తి సముద్రంలోనికి చొచ్చుకునిపోయి తన సుందరమైన కోఱతో భూమిని ఎత్తి, అలానే మోసుకొని పైకి తీసుకొని వచ్చాడు. భూవరాహావతారంలో తన కోఱపై భూమిని వహించే వరాహస్వామి విగ్రహాలు మనం చూస్తూ ఉంటాం కదా! సంసార సముద్రంలో మాయ చేత ముంచబడిన మనలను అంబిక పాదధూళి అట్టి వరాహస్వామి కోఱవలె రక్షిస్తుందట.

ఆచార్యులవారీ సంధర్భంలో విష్ణుమూర్తిని ముర రిపునిగా పేర్కొంటున్నారు. మురాసురుని సంహరించి విష్ణువు మురరిపుడైనాడు. మురారి

అన్నా అదే అర్థం. మురాసురుడు నరకాసురుని మిత్రుడు. కృష్ణావతారంలో వీరిరువురినీ సంహరించాడు. మహావిష్ణువుకు పది అవతారములు అనేక నామములు ఉన్నవి. అయినా ఆచార్యులవారు విష్ణుమూర్తికి కృష్ణావతారము మూలంగా ప్రసిద్ధి అయిన నామములతో పేర్కొనడం వారికి కృష్ణావతారం పైగల మక్కువను తెలియజేయడం లేదూ??

(సశేషం)

#KanchiParamacharyaVaibhavam #కంచిపరమాచార్యవైభవం
#ParamacharyaSoundaryaLahariBhashyam
2/17/18, 07:15 - Paramacharyulu: శ్రీ పరమాచార్యులు ఉపదేశించిన మంత్రం

ఆఫీసులో పని చేస్తున్న ఒక మహిళ పరమాచార్యులను దర్శించడం కొఱకు వచ్చింది. నేటి రోజుల్లో మహిళకు లోలోపల భక్తి ఉన్నప్పటికీ నిత్య విధులనూ, స్తోత్ర పఠనాదులనూ పద్ధతిగా నేర్చుకొని అనుష్ఠించడానికి వీలుగాలేదు అన్న తాపం ఆమెను దహించి వేస్తుంది.

పరమాచార్యుల మనసు కరిగే విధంగా ఈ విధంగా వేడుకొన్నది: “నేను పనికి వెళుతున్నాను. విరామ కాలం చాలా తక్కువగా వుంటున్నది. అంతేకాక మడి, ఆచారం అంటూ కఠినమైన నియమాలను ఆచరించడానికి వీలుగావడం లేదు. పొడవైన స్తోత్రాలు, పారాయణాలు చేయడానికి వీలుపడటం లేదు. కానీ, యేదో ఒక సులభమైన మంత్రజపం చేయాలన్న తీవ్రమైన కోరిక వుంటున్నది. మీరు అనుగ్రహించాలి.”

వెంటనే కరుణామూర్తియైన పరమాచార్యులు, ఆ మహిళయొక్క అంతర్భావనను, చింతనను అర్థం చేసుకొని, “చెప్పు” అని అన్నారు.

“హరి నారాయణ దురిత నివారణ
పరమానంద సదాశివ శంకర”

ఉపదేశాన్ని పొందిన ఆ మహిళామణి, మనసులో సంతోషం ఉప్పొంగుతుండగా పరమాచార్యులకు నమస్కరించింది.

‘ఆచార అనుష్ఠానాలు లేని నీ వంటి దానికి మంత్రోపదేశ మెందుకు?’ అన్న కఠినమైన వాక్కులను యెదురుచూచి వచ్చిన ఆమె, అమూల్యమైన ఉపదేశంచే సంపూర్ణమైన తృప్తిని అనుభవించింది.

కానీ, ఈ మంత్రం ఆమెకు మాత్రమే ఉపదేశించినది కాదు; మనందరికీ కూడా!

--- వైఖానస కరుప్పూర్ శ్రీనివాస అయ్యర్, కాంచీపురం.

#KanchiParamacharyaVaibhavam #కంచిపరమాచార్యవైభవం
2/17/18, 16:35 - Paramacharyulu: నాలుగవ శ్లోకం - మొదటి భాగం

త్వదన్యః పాణిభ్యామభయవరదో దైవతగణః
త్వమేకా నైవాసి ప్రకటితవరాభీత్యాభినయా
భయాత్ త్రాతుం దాతుం ఫలమపి చ వాంఛాసమధికం
శరణ్యే లోకానాం తవ హి చరణావేవ నిపుణౌ

ఈ నాలుగో శ్లోకంలో ఆచార్యులవారు అంబిక పవిత్రమైన పాదపద్మములను సంస్తుతిస్తున్నారు. అయితే మొదట్లోనే ఆ విషయాన్ని మనకు తెలియనీయక ఉత్సుకతను కలిగిస్తారు.

“మీ మిగతా దేవతలందరూ అభయ వరద ముద్రలు కలిగి ఉన్నారు. (అంటే వారు అభయాన్ని వరాలనూ ప్రసాదిస్తారని తెలియచేసే హస్తసంజ్ఞలు కలిగి ఉన్నారన్నమాట) నీవు ఒక్క దానివే నీ భక్తులకు అభయాన్ని వరాలను ప్రసాదిస్తానని సూచించే సజ్ఞలు ప్రదర్శించడంలేదు” ఇదీ శ్లోకంలో మొదటి రెండు వాక్యాల అర్థం.

ఏమిటి? ఆచార్యులవారెందుకిలా చెబుతున్నారు. అంబిక మనలను భయాల నుండి ముక్తులను చేయదు అని దీని అర్థమా? ఆమే మాయవరంలో అభయాంబికగా వెలిసిందే. ఆ ప్రాంతాలలో అనేక మంది స్త్రీలు ఆమె పేరుతో “అభయం” అభయం” అని పిలవబడుతున్నారే. ఆమెను వరప్రదాయిని కూడా అని పిలుస్తారే అని ఆశ్చర్యం వేస్తుంది.

ఆచార్యుల వారి అభిప్రాయం అంబిక అభయప్రధానం చేయదని వరాలీయదనీ కాదు. ఆయన చెప్పేది మిగతా దేవతలకు వలె ఆమె చేతులతో అభయాన్ని, వరాలనూ ఇస్తానని అభినయం చేయదన్నదే! దీనికర్థం ఏమిటి?

అంబిక మనకు అభయాన్ని, వరములను తన పాదముల చేతనే ప్రసాదిస్తుందని దీని భావం. ఈ విషయాన్ని ఆచార్యులవారు శ్లోకపు రెండవ భాగంలో తెలియజేస్తున్నారు. “తవహి చరణావేవ నిపుణౌ” – “నీ పాదములే ఆ పనులు చేయడానికి సమర్థములు” అంటే వరాలీయడానికి, భయాన్ని పోగొట్టడానికీ అన్నమాట. ఒట్టిగా చేయగలవనే కాదు. ఆ పని చేయడంలో ఆ నైపుణ్యం కలవని చెబుతున్నారు.

కల్పవృక్షం తనశాఖలతో (వానికి శాఖలే హస్తములు) చేయగలిగిన పనులు అమ్మపాదములు చేస్తాయి. ఆచార్యులవారు "నీ పాదములు భక్తులను భయాన్నుంచి రక్షించడానికి, కోరిన దానికంటే ఎంతో అధికంగా వరాలను వర్షింపచేయడానికీ ప్రత్యేక నైపుణ్యాన్ని కలిగి ఉన్నాయని" చెబుతున్నారు.. ఫలమపిచ వాంఛా సమధికం దాతుం. చేతులతో చేసే భౌతిక, మానసిక ప్రయత్నంగా పరిణమిస్తుంది. అసలు "కార్యము" అనే పదము "కరము" (చేయి) అన్నపదం నుంచే పుట్టింది. మిగతా దేవతలందరూ వరాలీయడానికి భయాన్ని పోగొట్టడానికీ చేతులతో ముద్రలు ప్రదర్శిస్తూ శ్రమ పడాలి. అంబిక మహాశక్తియుతమైనది కదా.

ఆమె సంకల్పిస్తే చాలు. పనులు తమంతట తాము సానుకూల పడతాయి. ఆమె కనుబొమల కదలిక చేత సృష్టిస్థితిలయాదులైన పంచక్రియలు నిర్వహించబడుతున్నాయి. ఆచార్యులవారు తరువాతి శ్లోకములో ఒకచోట "క్షణచలితయోః భ్రూలతికయో" (లతల వంటి కనుబొమలు ఒక్క క్షణం కదిలించడం ద్వారా) అంటారు. అసలు ఆమె ఇట్టి వరాలీయడానికి ఇతర దేవతల వలె ప్రత్యేక శ్రమ తీసుకోనవసరం లేదు. ఆమె సంస్థితి చాలు.

(సశేషం)

#KanchiParamacharyaVaibhavam #కంచిపరమాచార్యవైభవం
#ParamacharyaSoundaryaLahariBhashyam
2/18/18, 06:54 - Paramacharyulu: అప్పు - ఆలస్యం

నా కుమార్తె పెళ్ళికొరకు కొంత ధనం అవసరమై కాంచీపురంలోని ముదలియార్ గారిని అప్పు అడిగాను. తను నాకు ఇవ్వడానికి ఒప్పుకుని, ఫలానా రోజు మధ్యాహ్నం మూడుగంటలకు వచ్చి కలవాల్సిందిగా చెప్పాడు. నేను చెంగల్పేట్ నుండి బయలుదేరి అతను చెప్పిన రోజు కాంచిపురం చేరుకున్నాను. ఆయనను కలిసే ముందు ఒకసారి కంచి పరమాచార్య స్వామివారిని దర్శించుకుందామని శ్రీమఠానికి వెళ్ళను. మద్యాహ్నం రెండుగంటలకే నాకు మాహాస్వామివారి దర్శనం లభించింది.

అంతేకాక ఎప్పుడూ లేనిది మహాస్వామివారు ఆ ఎండలో తీరుబడిగా అన్ని విషయాలు నాతో ముచ్చటించడం మొదలుపెట్టారు. నా మనస్సంతా మూడుగంటలకు ముదలియార్ దగ్గరకు వెళ్ళాలని ఉంది. వెళ్ళడానికా స్వామివారు అనుమతి ఇవ్వట్లేదు. ఆఖరికి సాయింత్రం అయిదున్నరకి స్వామివారు నన్ను వెళ్ళనిచ్చారు.

వెంటనే ముదలియార్ ఇంటికి పరుగులాంటి నడకతో చేరుకున్నాను. చెప్పిన సమయానికి రానందున అతను మనసు నొచ్చుకుని ఇస్తాడన్న డబ్బులు ఇవ్వడేమో అని మనసులో చాలా భయంగా ఉంది. భయం భయంగానే ఇంటి తలుపు తట్టాను. ఆయనే స్వయంగా తలుపు తీసి ప్రేమతో లోపలికి ఆహ్వానించాడు. ఆయన నాతో, "నేను నిన్ను మూడుగంటలకు రమ్మన్నాను. కాని నేను కొద్దిగా పనిఉండి బయటకు వెళ్ళి ఇదిగో ఇపుడే వచ్చాను. అంతేకాక పంచాగం చూస్తే ఈరోజు సాయింత్రం ఆరుగంటల దాకా సమయం మంచిది కాదు అని తెలిసింది. నిన్ను ఆరుగంటలకు రమ్మని చెప్పి ఉంటే బావుండేది అని అనుకున్నాను. కాని నీకై నువ్వే మంచి సమయానికి వచ్చావు. ఇప్పుడు ముహూర్తం కూడా భేషుగ్గా ఉంది. ఇప్పుడు తీసుకో నీకు అప్పుగా ఇస్తానన్న ధనం" అని అన్నారు.

నన్ను ఎవరో తలపై గట్టిగా కొట్టినట్టు అనిపించింది. నాకు వెళ్ళడానికి అనుమతి ఇవ్వకుండా పరమాచార్య స్వామివారు అంతసేపు నన్ను అక్కడ ఎందుకు ఉంచుకున్నారో ఇప్పుడు అర్థం అయ్యింది.

--- పి.కె. రామనాథన్, చెన్నై-24. మహాపెరియవళ్ – దరిశన అనుభవంగళ్ 6

#KanchiParamacharyaVaibhavam #కంచిపరమాచార్యవైభవం
2/18/18, 18:09 - Paramacharyulu: నాలుగవ శ్లోక భాష్యం - రెండవ భాగం

"లోకానం శరణ్యే" ఆమె సమస్త విశ్వానికీ శరణు ప్రసాదించేది. అందువల్లనే సమస్త జనులు శరణమంటూ ఆమె చరణములపై వాలిపోతారు. ఆమె స్వభావం చేత లోకములకు శరణ్యమయితే ఆమెను శరణుకోరే వారికి ఆమె పాదము అభయాన్ని, వరాలను ప్రసాదిస్తున్నాయి. దీనికై ఆమె ప్రత్యేకమైన ప్రయత్నమేమీ చేయనవసరం లేదు. సువాసనలు వెదజల్లే పూవు వంటిది ఆమె.

మనమొక దేవతను భయాన్ని పోగొట్టమని ప్రార్థిస్తే భయం మాత్రం పోగొట్టబడుతుంది. అదే అమ్మను ఏ కోరికైనా కోరితే కోరిన దానికన్నా ఎక్కువ ప్రసాదించబడుతుంది. నువ్వు ఒక గది ఉన్న ఇల్లు అదిగితే మూడుగదుల ఇల్లు లభించవచ్చు. అమ్మ పాదాలు కూడా అట్టి విధంగానే కోరిన కోర్కెలకు ఎన్నో రెట్ల ఫలాన్ని ఇస్తాయి.

ఇక్కడో ప్రశ్న వస్తుంది. ఒకటి కోరితే పది ఇచ్చే అమ్మ ఆ పది కోరికలతో పాటు అభయాన్ని కూడా ప్రసాదించవచ్చు కదా! ఈ అభయాన్ని మాత్రం విడిగా ఎందుకు కోరాలి. ఇది మిగతా కోర్కెల వంటిది ఎందుకు కాదు.

అభయం ఇచ్చి పుచ్చుకొనే వస్తువు కాదు. అభయమన్నది అద్వైతస్థితికి ఒక పేరు. ఉపనిషత్తులు "రెండు వస్తువులున్నపుడే భయం పుడుతుంది" ఉన్నది. ఒకే వస్తువు అయినపుడు ఇక దేనిని చూసి భయపడాలి. రెండో వస్తువున్నపుడే కదా ఆ వస్తువు వలన కలిగే భయాన్ని గురించి ఆలోచన. తైత్తిరియోపనిషత్తు "తనకూ బ్రహ్మకూ కొంచెమైనా భేదం ఉన్నదన్న ఆలోచన కలిగినపుడే మనుష్యుడు భయపడతాడు" అని చెబుతుంది. బ్రహ్మ పదార్థము మనకన్నా భిన్నమైనదని, విడిగా ఉన్నదనీ భావించినపుడు అట్టి సగుణ బ్రహ్మయెడ మనకు భయంతో కూడిన భక్తి కలుగుతోంది.

పాశ్చాత్యులు భగవంతుని యెడ భయం కలిగి ఉండటం మంచి మానవ లక్షణంగా చెబుతుంటారు. అటువంటి భయం ఎప్పుడు

ఉంటుంది? మనకు అద్వైత సిద్ధి కలిగి బ్రహ్మాభిన్నమైన జీవాత్మ అన్నది కరిగిపోయినప్పుడు అట్టి భయమెక్కడిది? ఉన్నది ఒకే వస్తువయినపుడు, అది అద్వైతమైనపుడు, వరములను ప్రసాదించే ఉపాధి, వరాలను స్వీకరించే ఉపాధి అన్న రెండు భిన్నమైన ఉపాధులుండవు కదా! కాబట్టి అభయ ముద్ర కేవలం ఆ దేవతామూర్తికి సంబంధించిన గుర్తుగా మిగిలిపోతుంది కానీ నిజమైన స్థితిలో అభయమనేది భావగర్భితమైన సిద్ధాంతం.

ఆత్యంతికమైన సత్యస్థితికి గుర్తు అట్టి స్థితిలో వరములు ఈయడం, పుచ్చుకోవడమన్న ప్రసక్తేలేదు. భగవంతుడు మనలను జన్మభయం, జరాభయం, మరణభయం, ద్వైతస్థితి ఆయన నుండి విడివడి ఉంటాయనే భయం.. ఇట్టి భయాలన్నిటినీ రూపుమాపుతాడు. అయితే అభయమంటే అద్వైతానుభవం. అందువలనే అది మిగతా వరములతో చేర్చబడలేదు.

అభయం, వరం అనేవి రెండు ప్రత్యేక తరగతులుగా ఎందుకుండాలి మిగతా మార్గాలలో (ద్వైతాదులు) భవభీతిని రూపు మాపడమనేది భగవంతుని అనుగ్రహాలలో మహోన్నతమైనది. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకొని అభయం ప్రత్యేకంగా చూపబడింది. మిగతా మార్గాలు ఇంతకంటే ఎక్కువ వివరణనీయలేవు. భగవంతుని అభయముద్రలో దక్షిణ హస్తము పైకి చూపబడుతూ ఉంటుంది. ఆ చేయి ఊర్ధ్వలోకాలైన వైకుంఠ, కైలాసాదులను చూపుతోంది. మనము అది ఆకాశం వలె అనంతమైన పరిపూర్ణ అవిభాజ్యమైన బ్రహ్మ తత్త్వాన్ని సూచిస్తుందంటాం.

(సశేషం)

#KanchiParamacharyaVaibhavam #కంచిపరమాచార్యవైభవం
#ParamacharyaSoundaryaLahariBhashyam
2/19/18, 07:02 - Paramacharyulu: బిడ్డకు సంతోషం - స్వామికి తృప్తి

1970 లలో ఒక రోజు కంచి మఠంలో స్వామి వారు శ్రీ త్రిపురసుందరి చంద్రమౌళీశ్వర పూజ చేస్తున్నారు. వేలాది మంది భక్తులు కనురెప్పలు కొట్టడం కూడా మరచి అత్యంత శ్రద్ధతో పూజను తిలకిస్తున్నారు. త్రిపురసుందరీ దేవి అమ్మవారికి అలంకరించిన పట్టుచీర అందరినీ ఆకర్షిస్తున్నది.

వేదికకు దూరముగా ఒక మూలన బిడ్డతో సహా కూర్చొని ఒక తల్లి స్వామివారు శ్రద్ధగా చేస్తున్న పూజను తిలకిస్తోంది. తల్లిఒడిలో కూర్చున్న చిన్నపిల్ల అమ్మవారికి కట్టిన చీరను చూసింది. చూడటంతోనే ఆ చీరకావాలని తల్లిని వేధించడం మొదలుపెట్టింది అమాయకంగా. తల్లి కూతురిని ఎంతో బుజ్జగించింది, మందలించింది, విన్నదికాదు కూతురు. అలా అడిగితే అమ్మవారు కోప్పడుతుందని మంచి పిల్లలు అలా మారాం చెయ్యరాదని, భక్తితో అమ్మను ప్రార్థించమని చెప్పింది.

కాని ఆ పిల్ల ఆ మాటలేవి వినిపించుకోలేదు. అమ్మను వేధిస్తూనే ఉంది ఆ చీర కోసం. ఆవిడ బుజ్జగించడానికి ఏవేవో ప్రయత్నాలు చేస్తూనే ఉంది. ఎంత చెప్పినా ఆ పిల్ల వినకపోవడంతో ఆ ఆమే పిల్లని కాస్త గట్టిగా మందలించి, మాట వినకపోతే తనని ఇక్కడే వదిలేసి వెళ్ళిపోతానని చెప్పింది. ఆ పిల్ల భయపడిపోయి, కళ్ళనిండా నీళ్ళతో అమ్మను చూస్తూ ఉంది. పిల్లను వేంటనే గుండెలకు హత్తుకొని కళ్ళ నీరు తుడిచి, చిన్ని చేతులను నమస్కార ముద్రలో ఉంచి అమ్మవారి శ్లోకాలు చెప్పసాగింది. ఆ శ్లోకాలు వింటూ అమ్మని అమ్మవారిని తదేకంగా చూస్తూ ఉండిపోయింది.

పూజ ముగిసిన తరువాత స్వామివారు అందరికీ తీర్థం ఇస్తున్నారు. క్యూలో నిలబడ్డ అందరూ తీర్థం పుచ్చుకుంటున్నారు. ఆ తల్లి పిల్లతో సహా తీర్థం అందుకోవడానికి అందరితోపాటు వేదికమీదకు వచ్చినది.
హఠాత్తుగా స్వామివారు తీర్థం ఇవ్వడం ఆపేసారు. ఎందుకో ఎవరికి అర్థం కాలేదు. స్వామివారు లేచి గర్భగృహంలోకి వెళ్ళి, అందరిని ఆశ్చర్యపరుస్తూ అమ్మవారికి కట్టిన పట్టుచీరను తెచ్చి, ఆ పిల్లకు ఇచ్చారు. తరువాత తీర్థం ఇవ్వడం మొదలు పెట్టారు. ఇదంతా చూస్తున్న ఆ పిల్ల తల్లి విస్తుబోయింది, ఎక్కడో దూరాన ఒకమూలన కూర్చొని ఉన్న తన పిల్ల యొక్క కోరిక మహా స్వామివారికి ఎలా తెలిసిందా అని స్థాణువై చూస్తున్న ఆ తల్లితో స్వామివారు, “పిల్లలు దైవస్వరూపులు. ఏది అడగాలో అడగకూడదో వాళ్ళకు ఎలా తెలుసు? భగవంతుని సృష్టి మొత్తం వాళ్ళదే అని, వాళ్ళకోసమే అని వాళ్ళు అనుకుంటారు. పిల్లని ఎప్పుడూ కోప్పడవద్దు. నువ్వు కన్న తల్లివి మాత్రమే. ఆవిడే అందరికీ నిజమైన తల్లి” అని అన్నారు.

ఇద్దరూ స్వామివారికి నేలపై పడి నమస్కరించి స్వామి ఆశీస్సులు అందుకొని వెళ్ళిపోయారు. వారు వెళ్ళిన తరువాత స్వామివారు అక్కడున్న శిష్యులతో, “తన చీరను తీసుకోవడానికి త్రిపురసుందరి అమ్మవారే వచ్చింది. అది ఆవిడది. ఇవ్వను అనడానికి నేనెవర్ని. అందుకే అమ్మవారికే ఇచ్చివేశా” అని అన్నారు.

#KanchiParamacharyaVaibhavam #కంచిపరమాచార్యవైభవం
2/19/18, 16:05 - Paramacharyulu: నాలుగవ శ్లోక భాష్యం - మూడవ భాగం

వరహస్తం క్రిందికి చూపబడుతోంది. నాకు అది కావాలి. ఇది కావాలి అన్న కోర్కెలు భక్తుని ఆధ్యాత్మిక నిమ్నస్థితిని సూచిస్తాయి. అందువల్ల వరముద్ర క్రిందకు చూపబడుతోంది. ఎడమచేతితో ఇచ్చేది ఏదయినా అంత గౌరవ పాత్రమైనది కాదుకదా! అయితే దానికి ఇంకో మంచి అన్వయం చేయవచ్చు. అంబిక స్వామికి వామభాగంలో కదా ఉంటుంది. నిష్క్రియత్వాన్ని, శాంతాన్ని సూచించే అభయహస్తం నిశ్చలుడు, శాంతుడు, అయిన శివునకు చెందింది. వరాలను ఇచ్చేది అంబిక కదా! ఎడమ చేయి ఆమెది. ఆ చేయి దేనిని చూపుతోంది. అంబిక పాదాలని. “నేను నా పాదములను నీకు అనుగ్రహిస్తున్నాను. వదలకుండా గట్టిగా పట్టుకో అదే అన్ని వరముల కంటే పెద్దవరం” అని అంబిక చెబుతున్నట్లున్నది.

సరి! ఇంతకీ ఆచార్యులవారు ఏ దేవతామూర్తినుద్దేశించి ఈ శ్లోకం చెప్పి ఉండాలి. వరదాభయ ముద్రలు అభినయించని దేవతామూర్తి ఎవరు. నిశ్చయంగా లలితా త్రిపుర సుందరిని ఉద్దేశించే చెప్పి ఉండాలి. శివుడే ఆమె కారణంగా కదలడానికి శక్తుడవుతున్నాడని చెప్పడంతో ఆమె సకల దేవతా మూర్తులకు శక్తిని ప్రసాదించే కేంద్రమై ఉండాలి. వరాభయములను ప్రసాదించే దేవతామూర్తులు అట్టి ప్రసాద గుణాన్ని అంబికనుండే కదా పొంది ఉండాలి. కాబట్టి వరాభయములు ప్రసాదించడంలో ఆమెకంటే ఉన్నతులు ఉండే వీలులేదు. మిగతా దేవతలు చేతులతో చేసే పనిని ఈ అంబ ఎంతో తేలికగా పాదములతో చేస్తోంది. అయితే అంబిక భువనేశ్వరి రూపంలో వరాభయ ముద్రలను చూపుతోంది. త్రిపురసుందరి కూడా తన బాలా రూపంలో వరాభయ ముద్రలు కలిగి ఉన్నది.

“త్వదన్యః పాణిభ్యామభయవరదో దైవతగణః” నీకంటే భిన్నులైన దేవతలు వరాభయ ముద్రలు కలిగి ఉన్నారు. అన్న అచార్యుల వాక్యాల పూర్తి వాచ్యార్థం తీసుకోరాదు. విఘ్నేశ్వరుడున్నాడు. ఆయన ఈ ముద్రలు చూపడం లేదు. నటరాజుకు అభయ ముద్ర ఉన్నది కానీ వరదముద్ర లేదు. విష్ణు – దుర్గల అనేక విగ్రహములకు అభయ ముద్ర ఒక్కటే ఉంటుంది. మహావిష్ణువు శంఖం, చక్రం, గద, పద్మం నాలుగు చేతుల్లో ధరించి ఉన్నాడు. ఆయనకి ముద్రలు లేవు. కాంచీపురంలో మహావిష్ణువు వరదరాజు అని పిలవబడుతున్నప్పటికీ ఈయనకు వరద హస్తముద్ర లేదు. కేవలం అభయ ముద్ర మాత్రమే చూపుతున్నాడు. వరములీయవలసిన చేతితో గద పట్టుకుని ఉన్నాడు. మహాలక్ష్మికి అన్ని చోట్ల ఈ రెండు ముద్రలు ఉన్నాయి. సరస్వతీ దేవికి ఈ రెండు ముద్రలూ లేవు. దుర్గ, సుబ్రహ్మణ్య మూర్తులకు అభయహస్తం ఉంటుంది. వరదహస్తం ఉండవలసిన చోట ఆ చేయి తొడపై ఆనించి (ఊరుహస్తం) ఉంటుంది. వేంకటేశ్వరునికి కుడివైపు వరదహస్తం ఎడమవైపు ఊరుహస్తం ఉన్నది.

(సశేషం)

#KanchiParamacharyaVaibhavam #కంచిపరమాచార్యవైభవం
#ParamacharyaSoundaryaLahariBhashyam
2/20/18, 07:00 - Paramacharyulu: పాత గురువు - కొత్త గురువు

పరమాచార్య స్వామివారి దర్శనానికి వెళ్ళినప్పుడల్లా, గంటలతరబడి ఒకమూలన నిలబడి వచ్చిపొయే వారందరిని చూస్తుండేవాడిని. ఒకసారి స్వామివారు నన్ను చూసి, బాలు మామతో “అతను అక్కడెందుకు నిలబడ్డాడు? ఏమైనా కావాలేమో అతణ్ణి అడుగు” అని అన్నారు.

బాలు మామ వచ్చి నన్ను అడిగారు. “నీకు ఏం కావాలని పరమాచార్య స్వామివారు అడగమన్నారు. ఎందుకు స్వామివారిని చూస్తూ అలా నిలబడి ఉంటావు ప్రసాదం కూడా తీసుకోవడానికి రాకుండా?”

ఆనందభాష్పాలతో తడిసిన కళ్ళతో బాలు మామకు చెప్పాను. “నేను ఇక్కడకు వచ్చిన ప్రతిసారీ మహాస్వామికి వారి భక్తులకు మధ్య జరిగే అపూర్వ అద్భుతాలను చూస్తుంటాను. కనుక ఈరోజు కూడా అలాంటి సంఘటన కోసం పక్కన వేచియున్నాను”

స్వామివారు ఇది విని నవ్వుతూ, “ఇంకొద్దిసేపు వేచియుండమను. అలాంటి సంఘటన ఒకటి కొద్దిసేపట్లో జరగబోతోంది” అని అన్నారు.

చాలామంది మగవారు ఆడవారు స్వామివారి ఆశీస్సులు అందుకుని వెళ్ళిపోతున్నారు. అంతలోనే సరోజ అనే ఒక మహిళ స్వామివారి దర్శనానికి వచ్చింది. వారి వద్దకు వెళ్ళడానికి కొద్దిగా జంకుతున్నట్టుగా కనపడుతోంది. తనకేం కావాలో కనుక్కొమ్మని బాలు మామను ఆదేశించారు స్వామివారు.

ఆమె బాలుమామతో, “నేను ఇక్కడికి మొదటిసారిగా వచ్చాను. హైదరాబాదులో మా పొరుగువారు ఈ మహానుభావుల గురించి తెలుసుకుని వారిని దర్శించుకుందామని వచ్చాను” అని చెప్పింది. మహాస్వామివారు నవ్వుతూ, “దర్శనం మాత్రమే కాకుండా ఇంకా ఏదో కోరి నా వద్దకు వచ్చావు. అదేంటో చెప్పు” అని అన్నారు.

ఆమె చిన్నపిల్లల్లాగా ఏడవడం మొదలుపెట్టింది. బహుశా ఆమెకు ఒక యాభైఐదు సంవత్సరాలుంటాయి. “అవును స్వామీ నేను ఈ వేదనను భరించలేకున్నాను” అని చెప్పింది.

”మీరు ద్వైతులు కదూ” అని అన్నారు స్వామివారు. ద్వైతులు అంటే మధ్వ బ్రాహ్మణులు, మధ్వాచార్యుల అనునయులు. విశిష్టాద్వైతులు అంటే అయ్యంగార్ బ్రాహ్మణులు, శ్రీమద్రామనుజుల అనునయులు.

”అవును స్వామి అవును” అంటూ ఇంకా ఎక్కువగా బాధపడడం చూసి అక్కడున్నవారు ఆందోళనగా చూస్తున్నారు. “ఏమిటి నిన్ను అంతలా నిన్ను బాధిస్తున్న సమస్య” అని అడిగారు స్వామివారు. అలా ఏడుస్తూనే మధ్య మధ్యలో తన వ్యధను చెప్పనారంభించింది.

”ఇప్పటికి ఇరవైఅయిదేళ్ళుగా నేను ఒక గురువుగారిని అనుసరిస్తున్నాను. ఎప్పుడూ నాకు వారిదగ్గర చెడ్డ స్వభావము కనిపించలేదు. వారి వల్లనే నేను సన్మార్గములో పయనించగలిగాను. కాని చాలా ఆలస్యంగా అతను నిజమైన గురువు కాదు అని తెలిసింది. అతని ప్రవర్తన మంచిది కాదు అని తెలిసి అతని దగ్గరకు వెళ్ళడం మానేశాను. ఇంతలా నమ్మిన గురువుని హఠాత్తుగా ఇలా వదిలెయ్యడం వల్ల నాకు జీవితంలో, ఆధ్యాత్మిక జీవితంలో అంతా శూన్యంగా తోస్తోంది. ఈ విషయాన్ని నేను జీర్ణించుకోలేకపోతున్నాను. అందుకే మా సన్నిహితులు చెప్పడంతో, మీ దర్శనం కోసం ఇక్కడిదాక వచ్చాను. ఇక జీవితాంతం మీకు భక్తురాలిగా ఉండాలని కోరుకుంటున్నాను”

స్వామివారు నవ్వుతున్నారు. . .

”కాబట్టి నాలాంటి మరొక గురువును ఆశ్రయించినందువల్ల నీ సమస్యలన్నీ తీరిపోతాయని అనుకుంటున్నావు”

"అవుననే నేను అనుకుంటున్నాను"

"నువ్వు చేస్తున్నది తప్పు. గీతలో కృష్ణుడు, 'యతతో హ్యపి కౌంతేయ పురుషస్య విపశ్చితః' అన్నాడు. నువ్వు మనిషిగా పుటావంటేనే, నువ్వు తప్పులు చేయువాడవు అని అర్థం. దీన్ని ఎవ్వరూ తప్పించుకోలేరు. కేవలం నువ్వు నావంటి మరొక గురువును మార్చుకున్నంత మాత్రాన నేను ఉత్తమోత్తముడనని ఏమి నమ్మకం. ఆ ఆలోచనే తప్పు ఎందుకంటే ప్రతి మనిషికి పరిమితులు ఉంటాయి. నీ బాధ నాకు అర్థమైంది. నువ్వు చెయ్యవలసింది ఏమిటంటే మౌనంగా మనస్సులో నీ ఇష్ట దైవాన్ని ప్రార్థించడం. కృష్ణుడు చెప్పినట్టు అంతకంటే దారుణమైన మనఃస్థితి కలవాడైన మరొక్క గురువును అన్వేషించడం కంటే ఆత్మానందాన్ని పొందటం కోసం సాధన చెయ్యి"

అందరూ నిశ్శబ్ధంగా అలా వింటున్నారు . . .

నేను స్వామివారి ఆశీస్సులు అందుకోవడానికి ముందుకు వెళ్ళాను. స్వామివారు నవ్వుతూ, "నీకు నేనే ఎప్పటికి గురువుగా ఉంటాను భయపడకు" అన్నారు. నిశ్శబ్ధాన్ని ఛేదిస్తూ అంతటా నవ్వులు విరిసాయి.

#KanchiParamacharyaVaibhavam #కంచిపరమాచార్యవైభవం
2/20/18, 16:35 - Paramacharyulu: నాలుగవ శ్లోక భాష్యం - నాల్గవ భాగం

లలితా త్రిపుర సుందరికి అభయవరద హస్తములు లేవు. దాని బదులు ఆమె చెరుకువిల్లు, పూల బాణాలు కలిగి ఉన్నది. అయితే తరువాత వచ్చే ఒక శ్లోకంలో ఆచర్యులవారు అంబిక నాలుగు హస్తములు అభయ ప్రదానం చేస్తాయని చెబుతున్నారు. మొదట్లో బ్రహ్మకు కూడా శివునివలె అయిదు తలలుండేవి. అయితే ఆయన చేసిన నేరానికి శిక్షగా శివుడు ఒక తలను పెరికి వేశాడు. ఆచార్యుల వారు ఆ శ్లోకంలో మిగిలిన నాలుగు తలలూ భద్రంగా ఉండాలని బ్రహ్మ అంబిక నాలుగు చేతులను పూజిస్తాడని వ్రాస్తారు. నాలుగు చేతులతో ఆయన నాలుగు తలలకూ అభయ ప్రదానం చేస్తుందని ఉద్దేశ్యం. సాధారణంగా పాదములతో అభయ ప్రదానం చేసే అంబిక ఇతనికి మాటుకు హస్తములతో అభయమేల ఈయాలి. మరి బ్రహ్మ అభయాన్ని కోరేది ఆమె పతి అయిన శివుని కోపం నుండి కద! పాదంతో అభయం ఇస్తే తప్పుగా ఉండదూ!

సరి! త్రిపురసుందరికి వరదాభయ హస్తముద్రలు లేవు. ఆమెతో పాటు అనేక మంది దేవతామూర్తులకు కూడా ఆ ముద్రలు లేవని పైన చూశాం. అయితే ఇక్కడ కవులకున్న స్వతంత్రాన్ని ఉపయోగించుకొని ఆచర్యులవారు "నీకంటే భిన్నులయిన దేవతలందరూ వరదాభయముద్రలుపూనారని" అతిశయోక్తిగా పలుకుతున్నారు.

వారు ముద్రలను అభినయంగా వ్యవహరిస్తున్నారు. నృత్యశాస్త్రంలో అభినయానికి ముద్రలు వాడతారు. మంత్రశాస్త్రంలోనూ అంతే! ఒకరి ఆంతరంగికమైన ఊహలను, ఉద్వేగాలను, అనుభూతులను చేతులు, కాళ్ళు, ముఖకవళికల కదలిక ద్వారా బహిర్గత పరచడాన్ని అభినయం అంటారు. అట్టి భావములు చేతులతో ముఖ్యంగా వేళ్ళతో తెలియచేయడం ముద్ర అని పిలవబడుతుంది.

మొదటి మూడు శ్లోకాల్లో అంబిక యొక్క ఏ రూపాన్ని స్తోత్రం చేస్తున్నారో కనబరచలేదు. ఆనందలహరి, సౌందర్యలహరి అనే పేర్ల వలన కూడా ఈ విషయం స్పష్టమవడం లేదు. ఈ నాల్గో శ్లోకంలోనే ఆచార్యులవారు ఈ విషయకమైన జాడ తెలియజేశారు. అదికూడా ఆమె ఏ ముద్రలు చూపడం లేదో చెప్పారే కానీ ఆమెకు ఎన్ని చేతులు, ఏ ఏ చేతులతో ఏమి ధరించిందన్న విషయం ముచ్చటించనేలేదు. తరువతా రెండు శ్లోకలలో కూడా ఆయన తమ ఆంతర్యం వెల్లడించారు. కానీ మరికొన్ని జాడలు చూపుతారు. ఆ తరువాతవైన ఏడవ శ్లోకంవలె చెబుతూ ఆమె శ్రీవిద్యాతంత్రాధిదేవత అని తెలియజేస్తారు. ఇక్కడ కూడా ఆచార్యులవారు ఆమెపేరు తెలుపలేదు.

స్తోత్రం మొత్తంలో ఎక్కడా ఆ పేరు లేదు. వారు ఓ విలక్షణమైన కవితా వైఖరిని పాటించారు. మొదట్లో తాను స్తోత్రం చేసే అంబిక పేరు తెలియచేయకుండా, కొంచెం కొంచెం జాడలు తెలియచేస్తే, పాఠకుల ఉత్సుకతను పెంపొందిస్తూ చివరకి మొత్తంగా ఆ స్వరూపాన్ని వెలువరిస్తారు.

(సశేషం)

#KanchiParamacharyaVaibhavam #కంచిపరమాచార్యవైభవం
#ParamacharyaSoundaryaLahariBhashyam
2/21/18, 06:45 - Paramacharyulu: ఆచార్య - పరమాచార్య

శతాబ్దాలుగా మన పుణ్యభూమి భారతదేశం ఎందరో ఆచార్యులకు, సాధువులకు, సన్యాసులకు, మహాత్ములకు జన్మను ఇచ్చింది. అటువంటి వారి పాద రజస్సు చేత, లోతైన జ్ఞనము చేత, తపస్సు చేత, పాండిత్యము చేత దశాబ్దాల పాటు ఈ భారతదేశానికి దిశానిర్దేశం చేస్తున్నారు. వారందరికీ నా సాష్టాంగ ప్రణామాలు.

ఈ ప్రపంచం కాని, మన భారతదేశం కాని ఎన్నడూ చూడని గొప్ప సాధు సత్పురుషులు పూజ్య జగద్గురు శంకరాచార్య పరంపరలో వచ్చిన కంచి కామకోటి పీఠం 68వ పీఠాదిపతులు శ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతి పరమాచార్య స్వామివారు. మనకు తెలిసినంతలో 87 సంవత్సరాల పాటు పీఠాదిపతిగా ఉన్నవారు బహుశా ఎవరూ లేరు. అతి చిరు ప్రాయంలో 13 సంవత్సరాల వయస్సులో సన్యసించి జగద్గురు స్థానాన్ని అలంకరించి, 87 చాతుర్మాస్యాలను చేసి తమ నూరవ సంవత్సరంలోకి అడుగిడుతున్న వారు కూడా ఎవరూ లేరు.

దాదాపు 25 శాతబ్దాలకు పూర్వం సాక్షాత్ శంకరుడే కేరళలోని కాలడిలో శ్రీ ఆది శంకర భగవత్పాదులుగా ఈ భూమిపై వెలసి, 72

అవైదిక మతాలను ఖండించి అద్వైత సిద్ధాంతాన్ని ప్రతిష్ఠాపించి, సనాతన మతమును ఉద్ధరించారని మనకు చరిత్ర తెలుపుచున్నది. శతాబ్దాల తరువాత మరలా వైదిక మత స్థితిని, సమసిపోతున్న మానవతా విలువలను చూసి, ఆదిశంకరులే మరొక్కసారి అవతరించాలని నిర్ణయించుకున్నారు. మన పరమాచార్యుల వారి జీవితము, బోధలూ కూడా భగవాన్ ఆది శంకరులకు సమము. మన అదృష్టం ఏమిటంటే మనం జీవించిన కాలము శ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతి శ్రీపాదుల కాలము.

పరమాచార్యుల వారు నడిచే దైవం, జీవన్ముక్తులు, త్రికాలవేదులు. కేవలం భారతీయులనే కాక, విశ్వ మానవాళిని అనుగ్రహించిన ఇరవైవ శతాబ్దపు అవతారం. విశ్వ ప్రజల బాధలను, ఆర్తిని తీర్చడానికి వచ్చిన సమతామూర్తి. వారిపై వచ్చిన గ్రంథాలు అనేకం. కానీ అవన్నీ ఎప్పటికి అసంపూర్ణములే, ఎందుకంటే ఒక శతాబ్దపు జీవితాన్ని, బోధలను వ్రాయడానికి ఆ శతాబ్దపు జీవితాలన్నీ కూడా సరిపోవు.

మా తాతముత్తాతల ఆశీస్సుల వల్ల 1954 లో కలవైలో నాకు వారి ప్రథమ సందర్శనం కలిగింది. అప్పటినుండి నలభై ఏళ్లుగా ఎన్నో అనుభూతులు, అనుభవాలు, జీవితపాఠాలు నాకు ప్రసాదించారు. ఈ నాలుగు దశాబ్దాల కాలంలో వేలసార్లు స్వామిదర్శనం చేసుకున్నాను. వాటిలో ఎన్నో మరపులేని మరపురాని మధురస్మృతులు.

1967 లో పరమాచార్య స్వామివారు ఆంధ్రదేశంలోని ఏలూరులో చాతుర్మాస్యం చేస్తున్నారు. మేము ఒక యాభై మందిమి కలకత్తా నుండి స్వామివారికి భిక్షావందనం సమర్పించడానికి వచ్చాము. మాతో రావడం కుదరక కలకత్తాలో ఉన్న భక్తులకోసమై మహాస్వామివారి సందేశాన్ని రికార్డ్ చేసి సాయంత్రం వెళ్ళే కలకత్తా రైలుకి నాతో తీసుకుని తిసుకునివెళ్ళాలని భిక్షావందనం రోజు తెల్లవారుఝామున ఒక సేవకునితో చెప్పాను.

మధ్యాహ్నం మూడున్నర ప్రాంతంలో నను శ్రీవారు రమ్మన్నారు. కాని ఐదు ముప్పావు తరువాత కాని నాకు స్వామివారి పిలుపు రాలేదు. మిగిలినవారందరినీ సాయంత్రం రైలుకు కలకత్తా వెళ్ళమని చెప్పి, నేను నా భార్య మరుసటిరోజు వెళ్దామని అక్కడే ఉండిపోయాము. అపార కరుణాసముద్రులైన స్వామివారు మాకోర్కె మన్నించి టేప్ రికార్డర్ లో రికార్డు చేయబడిన సందేశాన్ని మాకు అనుగ్రహించారు.

కలకత్తాలో మా అందరి గురించి అడిగారు. దాదాపు 6-45 గంటలప్పుడు “కలకత్తాకి ఎప్పుడు వెళ్తున్నారు?” అని మమ్మల్ని అడిగారు. ఆరోజు 6-30 ట్రైనుకే మేము కలకత్తా వెళ్ళవలసి ఉందని, కాని ఆ ప్రయాణం కంటే మాకు స్వామివారి సందేశం చాలా ముఖ్యమని, మా ప్రయాణాన్ని మరుసటి రోజుకు వాయిదా వేసుకున్నామని వినయంతో స్వామివారికి చెప్పాను.

మహాస్వామివారు సన్నటి నవ్వుతో, “వెళ్ళు, వెళ్లి ప్రయత్నించు. బహుశా ఈరోజు రైలు ఆలస్యంగా రావచ్చు” అని అన్నారు. వెంటనే నా భార్యతో కలిసి పరుగు పరుగున స్టేషనుకు చేరుకుంటే, ఆరోజు మేము వెళ్ళవలసిన రైలు మూడు గంటలు ఆలస్యంగా నడుస్తోందని తెలిసింది. ఆ రోజు రైలు ఆలస్యంగా నడుస్తోందని ఆ జివన్ముక్తులకు తెలుసు. కాని అలా చెప్పక “వెళ్ళు, దొరకవచ్చేమో” అని అన్నారు.

--- “కైంకర్య శిరోమణి” డా. యస్.వి. నరసింహన్

#KanchiParamacharyaVaibhavam #కంచిపరమాచార్యవైభవం
2/22/18, 07:30 - Paramacharyulu: నువ్వు ఏమి చేస్తుంటావు?

1989 లో ఒకరోజు సాయింత్రం ఆరు గంటలప్పుడు కంచి శ్రీమఠంలో కూర్చుని స్వామివారు భక్తులకు దర్శనం ఇస్తున్నారు. పూర్వం కాంచీపురానికి తహసీల్దార్ గా పనిచేసిన మా పెద్దన్న తిరు. సుందరం, నేను మరియు అదనపు జిల్లాధికారి(అసిస్టెంట్ కలెక్టర్) స్వామివారి దర్శనం కోసం కూర్చుని ఉన్నాము. ఈ సంఘటన జరిగినప్పుడు మా అన్నయ్య తిరనల్వేలి జిల్లా కార్యాలయంలో బలహీన వర్గాల సంక్షేమాధికారిగా విధులు నిర్వహించేవాడు. అతను స్వామివారి దర్శనం ముగించుకొని ఆ రాత్రికే చెన్నై వెళ్ళిపోవాలి.

భక్తులందరూ ఒక్కొక్కరిగా ముందుకు వెళ్ళి స్వామికి నమస్కరించారు. మా వంతు రాగానే మేమూ స్వామివారికి సాష్టాంగం చేసి నిలబడ్డాము. స్వామివారు నవ్వుతూ, “వెళ్ళడానికి చాలా ఆత్రంగా ఉన్నారే? కొద్దిసేపు ఉండండి” అని ఆదేశించారు. స్వామివారి ఆదేశానికి కట్టుబడి మేము అక్కడే కూర్చున్నాము. స్వామివారి చేతులుపైకెత్తి, దర్శానానికి వచ్చిన దాదాపు ముప్పైమందిని కూర్చుండమని సైగ చేశారు.

స్వామివారు మొత్తం గుంపుని పలుసార్లు చూసి భక్తితో మూలగా కూర్చున్న ఒక వ్యక్తిపై పడ్డాయి. స్వామివారు అతనితో మాట్లాడగా అతను లేచి నిలబడ్డాడు. అతను చొక్కా తీసి పంచెపైన నడుము చుట్టూ కట్టుకున్నాడు.

“నీ పేరు?” అని అడిగారు స్వామివారు. ”మురుగేశన్” అని వినయంగా చెప్పాడు. ”ఏం చేస్తుంటావు?”

“వ్యవసాయం సామి”

“ప్రపంచానికి అన్నం పెడుతున్నావన్నమాట” అని చిన్నగా నవ్వి, కూచోమన్నట్టుగా సైగచేశారు. అతను కూర్చున్నాడు.

స్వామివారి కళ్ళు మరలా వెతకనారంభించాయి ఈసారి ఇంకొక భక్తుణ్ణి అడిగారు. అతను లేచి నిలబడి తన పేరు మునుస్వామి అని వెల్లోర్ లో రెవిన్యూ ఇన్ స్పెక్టర్ గా పనిచేస్తున్నానని చెప్పాడు.

“నువ్వు ప్రజలకు ఎలా సేవ చేస్తావు?” అని అడిగారు.

"నేను ప్రజలుకోరిన ప్రకారం భూయజమాన్య పత్రాలు, ఇంటి స్థాలాల హక్కు పత్రాలు వంటివి జారీ చేస్తుంటాను పెరియవ"

వెంటనే స్వామివారు నావైపు చూసి "ఇప్పుడు ఏ పదవిలో ఉన్నావు?" అని అడిగారు.

నాకు కాళ్ళుచేతులు అడడంలేదు. ఎందుకంటే, తమిళనాడు కంజ్యూమర్ ఫెడరేషన్ కి సహాయక తహసిల్దార్ గా చేస్తున్నాను. TASMAC(Tamil Nadu State Marketing Corporation)లో నా పని ప్రభుత్వ గోడౌన్ నుండి మద్యం చిల్లర వర్తకులకు వివిధ రకాలైన మద్యం అమ్మడం. ఇది ప్రజాసేవగా ఎలా చెప్పుకోను?

కాస్త సందేహిస్తూనే స్వామివారికి, "TASMAC లో డిప్యుటి తహసిల్దార్ గా చేస్తున్నాను" అని చెప్పాను. ఆందోళనతో చమటలు పడుతున్నాయి. కాని స్వామివారి నా ఉద్యోగం గురించి ఎక్కువగా అడగలేదు.

బ్రతుకుజీవుడా అని కూర్చున్నాను.

తరువాత మా అన్నయ్యని అడిగారు. అతను లేచి స్వామివారికి తాను అసిస్టెంట్ కలెక్టరుగా ఉచిత విద్య, బలహీన వర్గాలవారికి ఆహారము, ఉపాధి కల్పన, అర్హులకు కుట్టుమిషన్లు, ఇస్త్రీపెట్టెల పంపిణీ వంటివి చేస్తుంటాను అని చెప్పాడు.

అది విన్నతరువాత స్వామివారు ఇలా చెప్పారు, "ఇక్కడ ఉన్నవారిలో ప్రజలకు మేలుచేసే రెవెన్యూ అధికారి, సహాయ తహసిల్దార్, సహాయ కలెక్టరు వంటివారు ఉన్నారు. మనకు ఇంకేం కావాలి?" అని ఒక ఆకర్షణీయమైన నవ్వు నవ్వారు.

కాని నాకు మరలా స్వామివారి కళ్ళు నాపై పడొచ్చు అని గుండెదడగా ఉంది. ప్రజలకు హానిచేసే నా ఉద్యోగం గురించి స్వామివారికి ఎలా చెప్పగలను? నా మనసులోనే స్వామివారిని వేడుకున్నాను, "స్వామి గత మూడేళ్ళుగా నేను ఈ అధికారంలో ఉన్నాను. నాకు ఇక ఉండాలని లేదు. నాకు ఈ పనినుండి విముక్తి కల్పించండి". కరుణావరుణాలయులైన మహాస్వామివారు నా ఉద్యోగం గురించి అడిగి నన్ను ఇబ్బందికి గురి చెయ్యలేదు.

ఈ సంఘటన జరిగిన కొన్ని వారాల్లోనే అక్కడి నుండి బదిలీ అయ్యి కలెక్టర్ కార్యాలయంలో డిప్యుటి తహసిల్దార్ గా చేరాను. బదిలీ ఉత్తర్వులు ఇచ్చినది ప్రభుత్వమే అయినా, అవి వచ్చేలా చేసినది మాత్రం స్వామివారే అనడంలో ఏమాత్రం అతిశయోక్తి లేదు.

--- ఇరసు, చెన్నై-61. మహాపెరియవళ్ – దరిశన అనుభవంగళ్ 2

#KanchiParamacharyaVaibhavam #కంచిపరమాచార్యవైభవం
2/22/18, 15:26 - Paramacharyulu: ఐదవ శ్లోకం - మొదటి భాగం

హరిస్త్వామారాధ్య ప్రణతజనసౌభాగ్యజననీం
పురానారీ భూత్వా పురరిపు మపి క్షోభమనయత్ .
స్మరోఽపి త్వాం నత్వా రతినయన లేహ్యేన వపుషా
మునీనా మప్యంతః ప్రభవతి హి మోహాయ మహతామ్.

(నమస్కారము చేసేవారికి సమస్త సౌభాగ్యములు ప్రసాదించే ఓ తల్లీ! ముందు నిన్ను హరి ఆరాధించి మోహినీ రూపమును పొంది శివునికి చిత్త క్షోభను కలిగించాడు. మన్మథుడు నిన్ను ప్రార్థించి రతీదేవి కనులకు లేహ్యము వంటి మేనితో మునులను మహామోహవశులను చేయగలిగాడు)

ఈ శ్లోకంలో ఆచార్యులవారు మహా విష్ణువు అంబికను పూజించడం ద్వారా జగన్మోహనమైన మోహినీ రూపాన్ని పొంది స్థిర చిత్తుడైన శివుని మనస్సును కూడా చలింప చేశాడంటున్నారు. పాలకడలిని చిలికినప్పటి మాట. అమృతంకై దేవదానవులు పాలకడలి చిలికి అమృతం సాధించారు. విష్ణువు మోహినీ అవతారమెత్తి మహామోహ వివశులై ఉన్న అసురులకు తీయటి మాటలు చెబుతూ దేవతలకు అమృతాన్ని పంచిపెట్టాడు. ఈ కథ మనమంతా ఎఱిగినదే! అయితే విష్ణువు మోహినీ అవతారం ఎంత సమ్మోహనమైనదంటే, మహాశాంతుడైన పరమేశ్వరుణ్ణే మోహంలో పడవేసిందట. పరమేశ్వరునికి, ఆ మోహినికి కలిగిన పుత్రుడే హరిహర పుత్రుడు – అయ్యప్ప – శాస్తా. శివపాదాదికేశాంతస్తవంలో ఆచార్యులవారు విఘ్నేశ్వరుని, సుబ్రహ్మణ్యున్నీ, శాస్తనూ స్తుతిస్తారు. వారు అవతరించిన మలయాళ దేశంలో, మిగతా చోట్లకంటే, అయ్యప్ప ఎక్కువ ప్రసిద్ధిగా పూజించబడుతున్నాడు.

బ్రహ్మపదార్థమునకు సృష్టి చేయాలనే సంకల్పం కలిగినపుడు కామేశ్వరీ – కామేశ్వరులుగా వారి లీల శృంగారపరంగా అభివర్ణించబడింది. ఇప్పుడు అట్టి కామేశ్వరిని అర్చించడం ద్వారా మహావిష్ణువు పరమేశ్వరుణ్ణే ప్రేమలో ముంచివేసే మోహినీ అవతారమెత్తగలిగాడు. ఈ భావన వలన ఈ శ్లోకంలో సంస్తుతించబడింది కామేశ్వరి అని మనకు అర్థమవుతోంది. ముందు శ్లోకంలో ఈ స్తోత్రంలో స్తుతించబడిన అంబికామూర్తిని అభయ వరద ముద్రలు లేవని చెప్పబడింది కదా!!

ఈ శ్లోక ద్వితీయార్థం మన ఊహకు మరింత పుష్టిని కూర్చుతుంది. "నీ ఎదురుగా మోకరిల్లడం వలన మన్మథుడు రతీదేవి కనులచే త్రావబడే అద్భుతమైన రూపాన్ని అదీ ఆమెకే కనిపించే రూపాన్ని పొందాడు. అంతే కాదు, జితేంద్రియులైన మునివరులనే కామసమ్మోహితులను చేస్తున్నాడు". మన్మథుడు ఈశ్వరుని చేత బూడిద చేయబడి కామేశ్వరీ అనుగ్రహంతో పునరుజ్జీవితుడైనాడు కదా! ఈ సూచన ఆచార్యులువారు సంస్తుతించినది కామేశ్వరినని రూఢిపరుస్తోంది.

ఈశ్వరుడు జ్ఞానమయుడు, చిన్మయుడుగా, మనం పూజిస్తున్నాం. అటువంటి శాంతుని కామంలోనికి కూలదోసే శక్తిని మన్మథునికి ప్రసాదించిందని అంబిక ఎలా సంస్తుతింపబడుతోంది.? అంతేకాదు, జితేంద్రియులైన మునివరుల హృదయాలను సైతం కామవ్యాకులితులను చేసే శక్తి ఆమె మన్మథునికిచ్చిందని ఎలా పొగడబడుతోంది ?? ఎంతో ఉన్నత శ్రేణికి చెందిన ఆచార్యులవారి శ్లోకాల్లో ఇటువంటి కొఱతను చూపడం భావ్యమా ?? ఆచార్యుల వారిపై భక్తితో మనం ప్రశ్నించడానికి సాహసించినప్పటికీ ఇలాంటి ప్రశ్నలు ఉదయిస్తాయి కదా!! మాయామయమైన ఈ జగత్తు రూపుమాసినపుడే జ్ఞానం ఉదయిస్తుంది. అయితే ఈ స్తోత్రంలో జగత్సృష్టికి అంబికకు ఆపాదించబడింది. కామం లేనపుడే జ్ఞానం. కానీ ఇక్కడ అంబిక కాముణ్ణి పరిపుష్టం చేసేదిగా పొగడబడుతోంది.

(సశేషం)

#KanchiParamacharyaVaibhavam #కంచిపరమాచార్యవైభవం
#ParamacharyaSoundaryaLahariBhashyam
2/23/18, 07:12 - Paramacharyulu: అంతశ్శౌచము

శరీరాన్ని, వస్త్రాలను మనం పరిశుభ్రంగా వుంచుకొంటాము. రోగములు, నొప్పులనుండి శరీరాన్ని కాపాడు కొంటాము. బాహిరమైన ఈ శౌచం అవసరమే కాని అంతకంటే ప్రధానమైన ఆంతర శౌచముపట్ల మనకు శ్రద్ధ తక్కువ. శరీర మాలిన్యంకంటే మనోమాలిన్యం చెడ్డది. కామం, క్రోధం, భయం-ఈ మూడూ మనోమాలిన్యానికి ప్రధానకారణాలు. వీనివలన చెడుతలంపులు పుట్టి మనస్సు మలినమవుతుంది. తల్లి సమక్షంలో మనకు చెడ్డతలపులు పుట్టవు. ఇది అందరు ఎరిగినదే. కన్నతల్లి సాన్నిధ్యమే ఇంత పవిత్రమైతే ఇక జగన్మాత సన్నిధినిగూర్చి చెప్పేదేమిటి!
వీటివల్ల మనకు శరీర నైర్మల్యం కలుగుతుంది. అట్లే జగన్మాతృధ్యాన మనే తీర్థం మనస్సును నిర్మలంగా వుంచుతుంది. అట్టి మనోనిర్మలత్వంవల్ల సదసద్వివేచనం లభిస్తుంది. ఆ వివేచనముచే అసత్కామం నశించి, వైరాగ్యం అలవడుతుంది. కామంలేనిచోట క్రోధభయాదులు పుట్టవు. కామక్రోధాది నాశనముచే పరిపూర్ణానందము, పరమశాంతి లభిస్తావి.

మనస్సును, చిత్తమును అలా క్షాళితం చేసికొన్న దినమే సుదినం. తక్కిన దినాలు వృథాగా గడచిపోయినపని ఎంచుకోవాలి. శరీరము, వస్త్రములు మలినంగావుంటే రోగాదులు కలిగేమాట నిజమేకాని ఆ వ్యాధు లీ శరీరంతో అంతమవుతవి. మరి ఆంతరమాలిన్యంచే కలిగే మనోరుజలు అనేక జన్మల పర్యంతం ఆత్మను వెంటాడి బాధిస్తావి.

ఈశ్వరుడొక్కడే అయినా, ఆ ఈశ్వరుని మనం తండ్రిగా, తల్లిగా, గురువుగా ఆరాధిస్తాము. ఈశ్వరునిమాతృభావనచే ఆరాధించడంలో విశేషముంది. బిడ్డలపట్ల ఆ జగన్మాతకుండే వాత్సల్యం, ప్రీతి ఇట్టి దట్టిదని చెప్పలేము. ఆ తల్లిపాదముల నాశ్రయించినవారికి వెంటనే పరమశాంతిదొరుకుతుంది. కోరికలు అగ్నివంటివి. కట్టెలు వేసినకొద్దీ అగ్ని ప్రజ్వరిల్లుతుంది. అలాగే కామతృప్తివల్ల కామనాశం కలుగదు. మనోనిగ్రహమే వాటికిమందు.

కాబట్టిజననిపాదకమలముల మరుగుజొచ్చి ఆ మాతృధ్యాన తీర్థముచే చిత్తశుద్ధిని సాధించవలసి వుంటుంది. అప్పుడు భవరోగము, కామములు కూడా దూరమవుతావి.

అపార కరుణాసింధుం జ్ఞానదం శాంతరూపిణం
శ్రీ చంద్రశేఖర గురుం ప్రణమామి ముదావహం ॥

--- “జగద్గురు బోధలు” నుండి

#KanchiParamacharyaVaibhavam #కంచిపరమాచార్యవైభవం
2/23/18, 10:56 - Paramacharyulu: <Media omitted>
2/23/18, 16:12 - Paramacharyulu: ఐదవ శ్లోక భాష్యం - రెండవ భాగం

ఒకదానినొకటి వ్యతిరేకించే రెండు శక్తులుండాలి. వాటిమధ్య సంఘర్షణ జరుగుతూ ఉండాలి. మంచిశక్తులు చెడ్డశక్తులపై గెలుపు సాధించి విజయపతాకాన్ని ఎగురవేయాలి. అప్పుడే ఆ మంచిశక్తులు విజయగర్వాన్ని పొందగలవు. అప్పుడే జీవితంలో ఒక ఉత్సుకత జనిస్తుంది. మంచి శక్తులకు గుర్తింపు ఎలా?? జీవితం నిస్సారంగా మారిపోదూ!! ఒక రంగు వన్నె తెలియాలంటే పూర్వప్రకాశం ఉండాలికదా!!

పరస్పర వ్యతిరేక శక్తుల సంఘర్షణ చివరికి మంచి విజయం సాధిస్తుందని రూఢిపరచడానికే చెప్పబడుతుంది. ఈ సత్యాన్ని ప్రదర్శించడానికే నిశ్చలుడు, శాంతుడు అయిన పరబ్రహ్మ కామప్రేరితుడై ప్రాపంచిక వ్యవహారాలతో సంపర్కం పొందినట్లుగా చెప్పబడుతోంది. పరబ్రహ్మ యొక్క కామంచేతనే ప్రపంచమొచ్చింది. వివేకంగల ప్రతిజీవి కామ మోహితమవుతుండటంతో ఈ వివేకంగల జగత్తు పెరుగుతోంది.

ఈ పరస్పర విరుద్ధమైన మంచి చెడు శక్తుల విషయంలో విచిత్రమైన స్వభావం ఉంది. మంచి శక్తులు కొంచెం దుష్టత్వం కలిగి ఉంటాయి. అలాగే దుష్టశక్తులలో కూడా కొంత మంచితనం ఉంటుంది. వివిధ రసములలో, భావాలలో ఈ జగన్నాటకాన్ని అర్థం చేసుకోవడానికి మన సంఘర్షణలోని ఈ సూక్ష్మ సత్యంపై ఒక అవగాహన ఏర్పరచుకోవాలి. సాధారణంగా కామం, క్రోధం చెడ్డవని చెబుతాం. లోతుగా పరిశీలిస్తే వాటిలో కూడా కొంత మంచి ఉన్నట్లు అర్థమవుతుంది. మంచి విషయాలపై కోరిక ఉండాలి. చెడ్డ విషయాలపై కోపం ఉండాలి. ఈ రకంగా ఆలోచిస్తే కామక్రోధాలు చెడ్డవెలా అవుతాయి ?? మీదు మిక్కిలి కొన్ని సమయాల్లో అవసరం కూడా!! మంచిగా కనిపించే విషయాలలో కూడా చెడు ఉంటుంది.

మిగతా విషయాల గురించి ఆలోచించే ముందు రెండు విషయాలు జ్ఞప్తిలో ఉంచుకోవాలి. పరమేశ్వరుడు మనముందు దయామయుడై ఉన్నాడన్నది ఒకటి. మనం ఆయనముందు స్వాత్మ సమర్పణ చేసుకొని శరణాగతి పొందాలన్నది రెండవది. ఈ రెండూ కూడా ఈ జగత్తు, సృష్టి అందులో సంఘర్షణ పడవలసిన చెడ్డ విషయములు ఉన్నవి కాబట్టే సాధ్యపడుతున్నవి. భగవంతుడు మనకు చేయగల ఉన్నతమైన సహాయం మనపై తన కరుణను ప్రసరింపచేయడం, దానికై మనం ఆయనను శరణాగతి పొందాలి. మనం చేయగల గొప్పపని ఏమంటే, మనం ఏ పనీ చేయడానికి సమర్థులం కాదని ఎఱిగి, ఏ పనీ చేయకుండా ఉండటమే.

అసలీ సృష్టే లేకపోతే, ఒకవేళ సృష్టి ఉన్నా ప్రజలు ఈ కామక్రోధాది అరిషడ్వర్గాల చేత బాధింపబడకపోతే, అంబిక దయచూపే అవకాశమేది ? మన నెదిరించే ఈ శక్తులను జయించడానికి తగిన శక్తిలేనపుడు కదా అంబిక పాదాలనాశ్రయించి "అమ్మా నీకంటే వేరు దిక్కులేదని" ఆక్రోశిస్తాం. అప్పుడు కదా శరణాగతిలో ఉండే ఆనందం మనకు అర్థమయ్యేది. అంబిక మనను రక్షించడానికి పరుగున వచ్చినపుడు కదా ఆమె దయను సంపూర్తిగా చూడడానికి అవకాశం కలుగుతుంది. శరణాగతి ఈ ప్రక్కన, దయ ఆ ప్రక్కన రెండూ సంగమించి రెండువైపుల ఉండి ఆనందం ప్రవహిస్తుంది. అప్పుడు ఇక ఆ అరిషడ్వర్గములపై సాధింపబడిన జయం మనదా, అంబికదా అనే విషయంపై విచారించడంలో అర్థంలేదు. జీవాత్మ అంబికగా అయిపోతుంది. కోట్లాది ప్రజల జీవితాలు అర్థరహితమై పోయినా, ఒక్కరు ఈ దుష్టశక్తులపై విజయాన్ని సాధించి సృష్టిక్రమాన్ని అధిగమించి పొగలిగితే చాలు. చెట్టునుంచి వెలువడిన విత్తనాలన్నీ వృక్షాలవుతున్నాయా ?? మానవుని నుండి వెలువడే కోట్లాది జీవ కణాలన్నీ ఫలదీకరణం చెందుతున్నాయా ?? అలాగే కోటికొక్కడు పూర్ణత్వం చెందితే చాలు. అంబిక తన సృష్టి ప్రయోజనం నెరవేరిందనుకొంటుంది.

(సశేషం)

#KanchiParamacharyaVaibhavam #కంచిపరమాచార్యవైభవం
#ParamacharyaSoundaryaLahariBhashyam
2/24/18, 07:43 - Paramacharyulu: పాప పరిహరణము

మనోవాక్కాయములచే పాపమునుండి తొలగవలెనంటే సచ్చింతనమును, సత్కార్యాచరణమును విడువకుండుటొక్కటే ఉపాయం. సమర్థ రామదాసు, తులసీదాసు, అప్పయ్య దీక్షితులు, తాయుమానవారు, పట్టిణత్తారు. మున్నగు మహనీయులు, తేవారకర్తలు-సతతసత్కర్మాచరణంతోనేకాలమును గడిపిరి. వారు మనకిచ్చిన భక్తిరచనలు, ఆధ్యాత్మిక గ్రంథములు నేటికి మన కుద్బోధకములుగా ఉంటున్నవి. సమర్థ రామదాసస్వామి దాసబోధ, తులసీదాసుల రామచరితమానసం వంటి భక్తిగ్రంథములు మరిలేవు. పాపచింతనం, పాపాచరణం ఎట్టివో వారెరుగరు. మన ప్రాంతస్థులై తాయుమానవారు. పట్టిణత్తారుగూడా అట్టి భక్తశిఖామణులే.

పాపాచరణం, పాపచింతనం మానుకోవలెనని మనం నిశ్చయించుకొన్నకొద్దీ ఆ నిశ్చయంవల్లనే పాపస్పృహ కలిగి, వెంటనే పాపమార్గంలో తప్పకుండా పడిపోతూవుంటాము. నేను పైనచెప్పిన మహానుభావులు త్రికరణములచే పుణ్యమునుతప్ప మరొకటి ఆచరించు టెరుగరు. కాబట్టి వారి మనస్సులలో పాపం చొరబారుటకవకాశమేలేదు. 'మీరు కామాన్ని ఎలా జయించా'రని వెనుకటి కొక సన్యాసినడిగితే, ఆయన 'కామం నాచిత్తకవాటాన్ని తట్టినపుడు నాకు వినిపించుకొనే తీరిక ఉండేది కాదు. దాని దారి నది మరలిపోయేది' అని సమాధానం చెప్పెనట. కాగా, మనస్సు శూన్యంగా ఉన్నప్పుడే కామము, తత్సంబంధి సల్లాపాలు చల్లగా దానిలో ప్రవేశిస్తవి. అట్లుగాక ఎప్పుడు సచ్చింతనముతో ఉండే మనస్సులందరికీ కామం అడుగు పెట్టదు. కాబట్టి దుస్సంగాన్ని విడిచిపెట్టవలెనంటే సతత సత్సంగ మలవరుచుకోవాలి.

ఎప్పుడూ సదాచరణం చేస్తూవుంటే అదే అలవాటవుతుంది. అంతట ఆ పాపపు దుంపలు ఇరిగి, ఎండి, చచ్చిపోతవి. కనుక పాపాని కెప్పుడూచోటుపెట్టకు, సదాచరణం అలవాటు చేసుకో, ఏదో జపంచేస్తూ కూర్చుంటానంటే ప్రయోజనం లేదు. నోరు వూరకే జపిస్తూవుంటే మనస్సు తన పాపమార్గాన తాను విహరిస్తూనే ఉంటుంది. సద్గ్రంథపఠనం చేస్తూవుండు, లేదా సద్గ్రంథములకు ప్రతులు వ్రాస్తూవుండు. మనస్సుకు, నోటికి, చేతికి ఇలా మంచిపనులు చెప్పి చేస్తూవుంటే పాపం నీమనస్సుదరికి రాకుండా తొలగిపోతుంది.
అప్పయ్యదీక్షితులవారు శ్రీ వరదరాజస్వామి నెలా స్తుతించారో చూడండి!

''మన్యే సృజన్త్వభినతిం కవిపుంగవాస్తే
తేభ్యో రమారమణ మాదృశ ఏవ ధన్యః
త్వద్వర్ణనే ధృతరసః కవితాతిమాన్ద్యాత్
య స్త త్తదంగ చిరచింతన భాగ్యమేతి!''

స్వామీ! ఇతర కవిపుంగవులు ఆశురచనచే నిన్ను స్తుతిస్తారు. నిజమే. నేనట్లు శీఘ్రంగా రచన చేయలేను. కాని ఆలోచించిచూస్తే వారికంటే నేనే ధన్యుడను. ఎందువల్లనంటే నిన్ను వర్ణించునప్పుడు నీ వివిధాంగ సౌందర్యమీద నా మనస్సు చిరకాలం లగ్నమవుతుంది, ఇది నా భాగ్యం కదా!

కాబట్టి మనస్సు సచ్చింతనం చేస్తూవుంటే పాపం దానంతట అదే తొలగిపోతుంది. ఈశ్వరుని కల్యాణగుణాలను కీర్తించిన మన భక్తులు తమ చిత్తములను ఆ విధంగా ఈశ్వరాయత్తం కావించారు. 'పాపమా! నువ్వు తొలగిపో' అన్నంత మాత్రాన అది తొలగిపోదు సరికదా, అక్కడేపీట పెట్టుక కూర్చుంటుంది. పాపాన్ని పరిహరించుటకు-సత్సంగం. సచ్చింతనం. సద్భాషణం, సదాచరణం-వీనిని ఏమరకుండుటే మార్గం.

అపార కరుణాసింధుం జ్ఞానదం శాంతరూపిణం
శ్రీ చంద్రశేఖర గురుం ప్రణమామి ముదావహం ॥

--- “జగద్గురు బోధలు” నుండి

#KanchiParamacharyaVaibhavam #కంచిపరమాచార్యవైభవం
2/24/18, 10:02 - Paramacharyulu: సభ్యులకు విన్నపం

దయచేసి పోస్ట్స్ కు రిప్లై చెయ్యకండి. ఎటువంటి ఫార్వార్డ్ మెసేజస్, గుడ్ మార్నింగ్ మెసేజస్, వీడియోస్ పంపకండి

ఇది కేవలం పరమాచార్య స్వామి వారి విశేషాలు తెలియచేయటానికి మాత్రమే.

అతిక్రమించిన వారిని బ్లాక్ చేస్తాము
2/24/18, 15:50 - Paramacharyulu: ఐదవ శ్లోక భాష్యం - మూడవ భాగం

అలా అర్థరహితమైన జీవితాలు గడిపిన వారందరూ ఎల్లప్పుడూ అలాగే ఉండిపోరు. మన మతం నిరంతరమైన నరకాన్ని ఒప్పుకోదు. మధ్వాచార్యులవారు దానికి తుల్యమైన భావాన్ని వెలువరించారు. ప్రజలలో పాపభీతి కలిగించి సన్మార్గ వర్తనులుగా చేయాలన్నది వారి ఉద్దేశ్యంగా మనం గ్రహిద్దం. మహాపాపికి కూడా ఒకానొక సమయంలో ముక్తి లభిస్తుందని మన సాధారణమైన విశ్వాసం. యుగాల కాలం పట్టవచ్చు. కానీ అంబిక తన చెడిపోయిన పిల్లలను తన ఒడిలోనికి తీసుకొని నిశ్చయంగా సద్వర్తనులను చేసి ముక్తినిస్తుంది.

యుద్ధం కోసమొక రాజుగారు రాజప్రాసాదాన్ని విడిచి వెళ్ళారు. అక్కడ ఏకాంతంలో ఎవరో ఒక పౌరులు ఆయనకు సహాయం చేశాడు. లేదూ ఈతడికే ఆ పౌరునిపై అకారణమైన దయ కలిగింది. రాజప్రాసాదంలోకి వచ్చి తనను కలుసుకోమన్నాడు. “నా వంటివాణ్ణి రాజభవనంలోనికి రానీయరు కదా – రాజముద్ర ఏదైనా ఉంటే ప్రసాదించమ”న్నాడతను. రాజుగారు ఓ ముద్రిక ఇచ్చారు. పరిశీలించి చూస్తే అది శత్రురాజు యొక్క రాజముద్రిక. ఆ పౌరుడు తికమక పడ్డాడు.

రాజుగారు నవ్వుతూ శత్రురాజు రాజముద్రికను ఎందుకిచ్చారో చెప్పాడు. “చాలామందికి నేను రాజముద్రిక నిచ్చాను. అట్లాంటి వాళ్ళు పెద్దవరుసలో నించొని ఉంటారు. నువ్వావరుసలో చేరితే నిన్ను తొందరగా కలుసుకోవాలన్న ఉద్దేశ్యం నెరవేరదు. అందుకే నీకీ శత్రురాజు రాజముద్రికనిచ్చాను. ఇది అతని గూఢచారులను పట్టుకొన్నప్పుడు మా చేతబడింది. దీనిని దాచుకొని నా దగ్గరకు దొంగతనంగా వస్తున్నట్లు నటించు. ఆ అంగరక్షకులకు అనుమానం కలిగేలా ప్రవర్తించాలి. వాళ్ళు నిన్ను పట్టుకొని, సోదాచేసి, శత్రురాజు రాజముద్రిక ఉన్నందున నేరుగా నావద్దకు తీసుకొని వస్తారు.”

అంబిక చేసేది ఇటువంటి పనే! కామక్రోధములనేవి శత్రురాజు రాజముద్రిక వంటివి. కృష్ణపరమాత్మ కుంతీ దేవిని నీ కోర్కె ఏమిటో చెప్పు అన్నడు. “నాకు కష్టాలు రావాలి. అవి ప్రసాదించు. అప్పుడే నిన్ను నేను తలుచుకుంటాను” అన్నది. కష్టాలు ఎలా వస్తాయి ?? కామక్రోధాదుల చేత. వాటిచే బాధించబడినపుడు, ఫలితంగా కష్టబడేటపుడు, మనకు దేముడు గుర్తుకు వస్తాడు. ఆయనను ప్రార్థిస్తాం. అప్పుడు ఈ జగత్సృష్టి, కామక్రోధములు ఎంత ఉపయోగకరమైనవో గుర్తిస్తాం.

అంబిక ఒకనికి కామాన్ని కలిగించిందంటే కారణం అతడిపై కరుణ చూపే అవకాశం తనకు కలగడానికే!! ఈ ఏర్పాటు. ఆ వ్యక్తితోనే అంతరించదు. అతడి కామం వలన జనించిన పుత్రులపైన కూడా ఈ కరుణ ప్రసరిస్తుంది. మహాత్ములు మరింకో జన్మవద్దని ఆక్రోశిస్తారు. కానీ ఈ కామంచేత జనించిన అనేకమందికి అది ఆశీస్సుగా పరిణమిస్తోంది.

మరింకో జన్మ వద్దని మరి పోగులు పోగులుగా కర్మననుభవించ వలసినవారు జన్మవద్దంటే తీరుతుందా ? వారి శేషకర్మను అనుభవించడానికి జన్మించి తీరవలసిందే! ధర్మయుతంగా జీవించవలసిందే!! ఎవరికీ కామం లేకపోతే ఈ కర్మలను అనుభవించవలసిన వారు పుట్టేదెలా?? తమ కర్మ భారాన్ని వదిలించుకొనేదెలా ?? వారికి కర్మను వారనుభవించి ధర్మయుతంగా జీవించడానికి తద్వారా నైష్కర్మ్యాన్ని పొందడానికి ఒక అవకాశం ఈయబడింది. ఆ జన్మలో కూడా వారి పాతకర్మలను తుడిచివేసుకోగా కొత్త దుష్కర్మలను చేర్చుకుంటే దానికి ఎవరేం చేయగలరు ?? జన్మకు ప్రయోజనం ఇంకో జన్మ కలగకుండా చేసుకోవడానికి ప్రయత్నించడం. మనమీ సత్యమెరిగి తదనుగుణంగా వర్తించాలి.

(సశేషం)

#KanchiParamacharyaVaibhavam #కంచిపరమాచార్యవైభవం
#ParamacharyaSoundaryaLahariBhashyam
2/24/18, 20:08 - Paramacharyulu: <Media omitted>
2/25/18, 07:10 - Paramacharyulu: ఆరు గజాలు - తొమ్మిది గజాలు

ఒకరోజు కంచి శ్రీమఠానికి ఒకామె ఆరు గజాల చీర కట్టుకుని వచ్చింది. బహుశా ఆమె మొదటి సారి అక్కడకు రావటం ఏమో. మఠానికి వచ్చే ఆడవారు తిమ్మిది గజాల మడిచీర కట్టుకుని రావాలనే విషయం ఆమెకు తెలియదేమో.

పరమాచార్య స్వామికి పెద్ద భక్తురాలను అని భావించే మరొకామె ఈ ఆరు గజాల చీరావీడను చూసింది. వెంటనే ఏదో జరిగిపోయినట్టుగా ఆమె కోపంతో ఊగిపోతోంది.

“మడిచీర కట్టులో చీర కట్టుకోకుండా నువ్వు పరమాచార్య స్వామివారి దర్శనం చేసుకోవడానికి వీలు లేదు” అని ఆమెపై విరుచుకుపడింది.

ఆ భక్తురాలి దుర్దదృష్టం వల్ల మహాస్వామివారు అటువైపు రానే వచ్చారు. అక్కడ ఎందుకు అంత పెద్దగా అరుపులు వినపడుతున్నాయి అని అడిగారు. జరిగినదంతా స్వామివారికి చెప్పారు.

ఊగిపోతున్న ఆ మడిచీర భక్తురాలిని స్వామివారు పిలిచారు. “ఆమె చాలా బీదరాలు. ఆమెవద్ద తొమ్మిది గజాల చీర లేదు. కొనగలిగే శక్తి ఆమెకు లేదు. నువ్వు వేంటనే బట్టల దుకాణానికి వెళ్ళి తొమ్మిది గజాల చీర ఒకటి, రెండు రవిక బట్టలు తీసుకుని వచ్చి ఆవిడకు ఇవ్వు” అని స్వామివారు ఆదేశించారు.

వెంటనే ఆమె స్వామివారి ఆదేశాన్ని అమలుపరిచింది. వెళ్ళి తొమ్మిది గజాల చీర కొనుక్కుని వచ్చి, దాన్ని మడిచీర పద్ధతిలో ఆమెకు కట్టి పరమాచార్య స్వామి వద్దకు తీసుకుని వెళ్ళింది.

స్వామివారు చూసి, ”చాలా మంచిది, కాని నువ్వు చేసిన పని తప్పు కనుక ఆమె వద్ద క్షమాపణలు అడుగు” అని అన్నారు.

మహాస్వామివారు సాంప్రదాయానికి పెద్దపీట వేసినా, ఎక్కడెక్కడ మినహాయింపులివ్వాలో వారికి బాగా తెలుసు.

#KanchiParamacharyaVaibhavam #కంచిపరమాచార్యవైభవం
2/25/18, 11:14 - Paramacharyulu: 1968లో విజయవాడ లబ్బీపేటలోని శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దేవస్థాన ప్రాంగణంలో శివాలయ ప్రతిష్ట మహోత్సవ సందర్భంలో మహాస్వామి వారు చెప్పిన ప్రవచనం.

మన అదృష్టమేమిటంటే మహాస్వామివారు ఈ ప్రవచనాన్ని తెలుగులో అనుగ్రహించారు. బహుశా మనకు లభిస్తున్న తెలుగు ప్రవచనం ఇదొక్కటే.
2/25/18, 12:28 - Paramacharyulu: <Media omitted>
2/25/18, 16:05 - Paramacharyulu: ఐదవ శ్లోక భాష్యం - నాల్గవ భాగం

**అంబిక తన కరుణ వలన కామాన్ని సృష్టించి మన్మథుని అధికారంలో ఉంచింది. జనులు ప్రయత్నం చేత జన్మరాహిత్యాన్ని పొందే అవకాశమీయడం ఆమె ఉద్దేస్యం. ధర్మార్థమోక్షములనే పురుషార్థములలో కామాన్ని కూడా చేర్చి ఒక వ్యవస్థ చేసింది. గృహస్థ దశలో క్రమశిక్షణతోనూ, నియంత్రణతోనూ శాస్త్రోక్తరీతిలో కామాన్ని అనుభవించాలి. జీవితాన్ని ఆ విధంగా గడుపుకొంటే కామం బారినుండి ఉద్ధరించబడి, పవిత్రుడవయి, తరువాతిదైన సన్యాసదశకు చేరుకోవచ్చు.**

ప్రతి నిబంధనకు కొన్ని అపవాదాలుంటాయి. కొంతమంది, చాలా తక్కువమంది బ్రహ్మచర్యం నుండే నేరుగా సన్యాసులయి ఆజన్మాంతం అలా ఉండిపోతారు.

ఈ వివరణలన్నీ అలా ఉంచండి. జ్ఞానమూర్తి అయిన ఈశ్వరుడు కామంచేత ఎందుకు వికల్పం చెందాడు ? విజితేంద్రియులైన మునులు ఎందువల్ల ప్రమాదం పొందుతున్నారు. మరి ఇటువంటి పనికి కారణమయిన అంబిక పొగడబడుతున్నదేమి??

వారు కామమోహితులైనారన్నది కథకు అంతం కాదు. నిజానికి మళ్ళీ వారు పరిశుద్ధులైనారు. ఒకానొక సమయంలో వారు కామమోహితులైనారంటే అది లోకక్షేమం కోసం. హరిహరపుత్రుడు మాత్రమే తనను చంపగలడన్న వరమున్న రాక్షసుని సంహరించడానికి జన్మించాడు. విశ్వామిత్రునికి కామం లేనట్లయితే శకుంతల, భరతులు ఉండేవారే కాదు. మహాకవి అమరకావ్యమైన శాకుంతలముండేది కాదు. వ్యాసుడు ఘృతాచిని చూచి మరులు గొనకపోతే శుకబ్రహ్మవంటి మహావేదాంతి నైష్ఠిక బ్రహ్మచారి జనించేవాడే కాదు.

ఈ విషయాలన్నీ పరాశక్తి అనుగ్రహం, సహాయం లేకపోతే ఎంతటి వారయినా పతనంకాక తప్పదన్న విషయం తెలియచేస్తాయి. మన స్వయంకృషితో మనమేదైనా సాధించగలమని విఱ్ఱవీగి పోరాదు. వినయంతో ఆమె కరుణకై అర్థించాలి.

మనమొక విషయం అర్థం చేసుకోవాలి. ఎవరైతే ఒక వస్తువును సృష్టించే శక్తిగలవారో వారికే ఆ వస్తువును నాశనం చేసే శక్తి ఉంటుంది. చట్టసభకు చట్టం చేసే శక్తి ఉంటే దానిని సవరించే శక్తి దానికే ఉంటుంది. అంబిక ఈ ప్రపంచాన్ని, కామక్రోధాదులను సృష్టించింది. ఆమె ఒక్కతే మనను ఈ ప్రపంచం నుండి, అరిషడ్వర్గాల నుండి రక్షించగలదు. ఆమె మన్మథుని కామానికి అధిపతిగా చేసి మునులను కూడా ఆ పరిధిలోనికి తెచ్చింది.

ఆమె ఆదేశంతో కొంతమందికి మన్మథుడు దూరంగా ఉంటాడు. మనకు సంబంధించినంత వరకు మన్మథుడు అధికారి. ఆమెకు దాసుడు. మనం మన్మథుని జయించినంత సమర్థులం కాదు. ఆమె ఆజ్ఞ ఉంటేనే అది సాధ్యమౌతుంది. ఈ శ్లోకంలో మునులు సైతం మన్మథుని పరిధిలో ఉంచబడినారని చెప్పడంతో, ఆమె అనుగ్రహం ఉంటేనే మన్మథుని బారినుండి తప్పించుకోగలమని, ఆమె అనుగ్రహంతోనే కామనాశనం జరుగుతుందనీ అర్థం వస్తోంది.

(సశేషం)

#KanchiParamacharyaVaibhavam #కంచిపరమాచార్యవైభవం
#ParamacharyaSoundaryaLahariBhashyam
2/26/18, 07:06 - Paramacharyulu: ఆత్మార్పణము

మనస్సుకు సౌఖ్యమనేది ఎన్నడోకాని లభించదు. గాఢసుషుప్తి యందు మాత్రమే మనస్సు చీకూ చింతా లేకుండా సుఖిస్తుంది. మళ్ళా మెలుకువ కలిగిన వెంటనే సంసారతాపములన్నీ మనస్సు నావరిస్తావి. శరీరాన్నిగూర్చి మనస్సునుగూర్చి, సంఘాన్నిగూర్చి, ప్రభుత్వము, ప్రజలను గూర్చి - ఏదో వ్యాకులత బాధిస్తూనేవుంటుంది. నిద్రయందువలెనేమెలుకవయందు గూడ మనస్సును చింతా రహితంగా ఉంచుకో గలగడమే మోక్షం. దేశకాలాలచే మనకు దవ్వుగానున్న వారిబాధలను మనమంతగా పట్టించుకోము. కడచిపోయిన కష్టాలుగూడ మననంతగా బాధించవు. సన్నిహితంగాచుట్టుముట్టిన కష్టాలేమనకు బాధ కలిగిస్తూవుంటవి. ఎట్టి కష్టములందైనా మన విహిత కృత్యాలను ఆచరించుతూ వుండటం అలవాటు చేసుకోవాలి. పరమజ్ఞాన విధానములైన ఉపనిషత్తుల ఉపదేశసారం ఇదే.

ఉపనిషత్తులు కొన్ని వ్రతాలను, చాంద్రాయణపంచాగ్ని మధ్యాది తపశ్చర్యలను ఉపదేశిస్తున్నవి. అట్టితపోవ్రతాదులు సామాన్యు లాచరించలేరు. ఎంతో సహనముంటేకాని సాగవాతపశ్చర్యలు. అందువల్లనే బృహదారణ్యకోపనిషత్తు మనకు మరోతపశ్చర్య నుపదేశించినది. ''జ్వరము, తాపము వంటి శరీర బాధలు కలిగినపుడు వానిని ఓర్చుకో. ఈ మాయరోగాలు నన్ను బాధిస్తున్నవే అని వాటిని నిందించక, ఈశ్వరుడునీమేలుకొరకే అదోతపశ్చర్యను విధించాడని మనస్సును సమాధానపరచుకో. జ్వరంవచ్చినపుడు వైద్యుడు నీకులంఘనంవిధిస్తాడు. ఆ బలవదుపవాసంకూడా తపస్సే అనుకో. ఆ ఉపవాసంవల్ల నీకు అపేయపాపం, అభక్ష్యభక్షణం మొదలైనపాపాలు తప్పిపోయినవికదా అని సంతోషించు'' అని బృహదారణ్యకం నీకు విధించిన తపస్సు.

శ్రీ శంకరభగవత్పాదులుగూడా ఈ విషయాన్నే ఒక శ్లోకంలో చెప్పారు - మనంచేసే సమస్త కార్యాలూ - పాపం, పుణ్యం - అన్నీ ఈశ్వరపూజగానే ఎంచుకొని, భగవదర్పణం చేయవలసిం దంటున్నారు -
''ఆత్మాత్వం గిరిజామతిః పరిజనాః ప్రాణాః శరీరం గృహం
పూజా తే విషయోపభోగరచనా నిద్రా సమాధిస్థితిః
సంచరాః పదయోః ప్రదక్షిణవిధిః స్తోత్రాణిసర్వాగిరః
యద్యత్కర్మ కరోమి తత్తఖిలం శంభో తవారాధనమ్''

శంభూ! నేవే నా ఆత్మవు, అమ్మవారే నా బుద్ధి, నా ప్రాణాలు నీ పరివారం, ఈ నా శరీరం నీ యిల్లు, నేననుభవించే ఈ విషయోపభోగాలన్నీ నీపూజ, నానిద్రయే సమాధిస్థితి, నా పదచలనమే నీకు ప్రదక్షిణం, నా పలుకులన్నీ నీకు స్తోత్రములు, నే నేపని చేసినా సర్వమూ నీ పూజగా అనుగ్రహించు.''

ఇలా మన సర్వస్వము, మన సకలకార్యములు ఈశ్వరారాధనంగా ఎంచి అర్పించడంకంటె వేరే భగవదారాధనం లేదన్నారు భగవత్పాదులు. ఈ ఉపదేశాన్ని ఏమరకుండా మనం నడచుకొందుముగాక.

అపార కరుణాసింధుం జ్ఞానదం శాంతరూపిణం
శ్రీ చంద్రశేఖర గురుం ప్రణమామి ముదావహం ॥

--- "జగద్గురు బోధలు" నుండి

#KanchiParamacharyaVaibhavam #కంచిపరమాచార్యవైభవం
2/26/18, 12:42 - Paramacharyulu: <Media omitted>
2/26/18, 16:43 - Paramacharyulu: ఆరవ శ్లోకం - మొదటి భాగం

ధనుఃపౌష్పం మౌర్వీ మధుకర మయీ పంచవిశిఖాః
వసంతస్సామంతో మలయమరుదాయోధన రథః
తథా౭ప్యేకస్సర్వం హిమగిరిసుతే కామపికృపాం
అపాంగాత్తే లబ్ధ్వా జగదిదమనంగో విజయతే!!

ఈ శ్లోకం పూర్తిగా మన్మథునికై కేటాయించబడింది. ద్వైత ప్రపంచం అద్వైత స్థితి నుండి కామం కారణంగా జనిస్తోంది. ఆ ద్వైత ప్రపంచం మళ్ళీ అంబిక దయ చేతనే అద్వైతమవుతోంది. ఈ లీలలో అంబికదే ప్రధానపాత్ర. కామం యొక్క మూర్తిత్వమయిన మన్మథునికి ఇక్కడ ప్రాముఖ్యత ఉన్నది. మన్మథునకు కాముడని పేరు. అంబికకు కూడా కామేశ్వరి, కామాక్షి అన్న పేర్లున్నాయి.

ఏ మాత్రమూ పటుత్వంలేని ఆయుధాలతో మన్మథుడు ప్రపంచాన్నతటినీ జయిస్తాడు. ఆయనకంతటి శక్తినిచ్చేదేమిటి? అమ్మక్రీగంటిచూపు, ఇదీ ఈ శ్లోక భావం.

ఈ మన్మథుని ఆయుధాలేవి? మొదటిది "ధనుః పౌష్పం"- పూలతో చేయబడిన విల్లు. మన్మథుడసలు యుద్ధానికెందుకు వెళతాడు? ఈ ప్రపంచంలో జీవజాలాన్నతటినీ జయించి వానిని కామవశులను చెయ్యాలని రథమెక్కి విల్లు బాణాలు. చేబూని మిత్రులతోనూ, అనుచరులతోనూ బయలుదేరతాడట. ఈ రథమేమిటో తెలుసుకొంటే మనకు వింత తోస్తుంది.

సరి! మన్మథుని విల్లు చెరుకుగడ అనికదా ప్రసిద్ధి. యోద్ధలందరికి ఇనుముతో చేసిన విల్లులుంటాయి. ఈయనది చెఱుకు విల్లు. గట్టిగా వంచితే విరిగిపోతుంది. అయితే ఆచార్యులవారు అయనదీ ఇంకా సున్నితమైన పూలవిల్లు అంటున్నారు. ఇనుముతో ఘనంగా లేకపోయినా చెఱుకుగడతో కొడితే తలైనా పగులుతుంది. మరీ ఈ పూలవిల్లుతో ఏమి ప్రయోజనం?

ఆచార్యులవారు ఈ విధంగా మన్మథుని విల్లుని మార్చివేయడం న్యాయంగా ఉందా? ప్రతిదేవతకు ఆయుధాలు వారి అలంకరణలో భాగంగా ఉంటాయి. పూజలోనో హోమంలోనో సాంగంగా సాయుధంగా దేవతను ఆహ్వానిస్తాం కదా! మొదట్లో నేను "పౌండ్రం" అనేమాట

పొరపాటున్ "పొష్పం"గా వ్రాయబడిందా అనుకున్నాను. పుండ్రేక్షు అనేపదం పౌండ్రంగా వ్యవహరించబడి ఉండవచ్చు కదా! కానీ అమరకోశంలో మన్మథుని పేర్లలో "పుష్పధన్వా రతిపతిర్మకరధ్వజ ఆత్మభౌ" అని చెప్పబడ్డాయి. పుష్పధన్వా అన్నమాటని ఆచార్యులవారు ధనుఃపొష్పం అని వాడారు. చెఱుకువిల్లు ఊసేలేదు.

సుబ్రహ్మణ్యునకు రెండు నెమలి వాహనాలున్నాయి. ఒకటి చిన్నతనం నుండి ఆయన ఉపయోగిస్తూ ఉన్నది. సూరపద్మున్ణి ఖండించి అతనినొక నెమలిగా చేసి వాహనంగా ఉపయోగిస్తున్నాడు. కొన్ని దేవాలయాలలో ఎడమవైపు తల, కుడివైపు పుచ్ఛమున్న నెమలి వాహనంగా కనిపిస్తుంది. అతడు సూరపద్ముడు. చాలా గుళ్ళలో కుడివైపు తల ఎడమవైపు పుచ్ఛమున్న నెమళ్ళే ఉంటాయి. అది దేవతా నెమలి. మొదటనుండి ఉన్న వాహనం. ఆ రకంగా మన్మథునికి కూడా రెండు ధనస్సులున్నాయనుకుంటాను.

ఆయన బాణములు కూడా పూలే! అమరకోశంలో ఆయనకు "కుసుమేషుడు" అన్న పేరు కూడా ఉంది. పూలు బాణములుగా కలవాడని అర్థం. ఈ శ్లోకంలో "పంచవిశిఖా" అని మాత్రం చెప్పబడింది. అంటే అయిదు బాణాలు అర్థం. ఈ బాణాలు ఏ పదార్థంతో చేయబడినవో చెప్పబడలేదు. యోధులు తమ అమ్ములపొదిలో అనేక బాణాలు కలిగి ఉంటారు. మన్మథునికి మాత్రం అయిదే బాణాలు. అవి కూడా కోమలమైన కుసుమాలు. ఆ అయిదు పుష్పాలు – అరవిందము, అశోకము, చూతము, నవమల్లిక, నీలోత్పలం.

గట్టితనమే లేని విల్లు. అయిదే బాణాలు. మనం సామాన్యంగా ఏదైనా వస్తువు బాణంలా చొచ్చుకొనిపోతుంది అంటాం. ఈ మన్మథుని బాణాలు వ్యతిరిక్తమైన స్వభావంగలవి. అవి గుచ్చుకోవడం మాట అలా ఉంచి వాటిని చూడగానే మన శరీరంలో అతి సున్నిత భాగమైన కనులకు ఒత్తుకోవాలనిపిస్తుంది. "మౌర్వీ మధుకరమయీ" ఇక అల్లెతాడు తేనెటీగలతో చేయబడినదట. తేనెటీగలు భయంకలిగించే మాటవాస్తవమే. అవి కుడితే చాలాసేపు నొప్పి ఉంటుంది. అయితే వాటిని ఆయన బాణాలుగా ఉపయోగించలేదు. అలా చేస్తే అసలు విల్లేలా ఎక్కుపెడతాడు? మరెందుకున్నాయి ? ఆయన దగ్గరున్న పూలవిల్లుకి, పూలబాణాలకు ఆకర్షితమై వచ్చాయన్నమాట. ఆనందంతో ఝుంకారం చేస్తున్నయి.

(సశేషం)

#KanchiParamacharyaVaibhavam #కంచిపరమాచార్యవైభవం
#ParamacharyaSoundaryaLahariBhashyam
2/27/18, 07:05 - Paramacharyulu: కౌపీనం - కాషాయం

నేను రాముణ్ణి కాకపోయినా నా తమ్ముడు చంద్రశేఖర్ నిజంగా లక్ష్మణుని వంటివాడే. భారతీయ వాయు సేనలో కార్పోరల్ గా చేస్తున్నాడు. ఇవ్వకూడని ఇంజక్షన్ ఇవ్వడం వల్ల కోమా దశలో పూణేలోని సదరన్ కమాండ్ మిలటరీ ఆసుపత్రిలో ఉన్నాడు. తమ్ముణ్ణి చూడడానికి కలకత్తా నుండి వచ్చాను. బ్రిగేడియర్ గా ఉన్న డా. నారాయణ అయ్యర్ నా తమ్మునికి చికిత్స చేస్తున్నారు.

"వేలల్లో ఒక్కరు మాత్రమే ఈ స్థితి నుండి బయటపడగలరు కనుక మా చేతుల్లో ఏమిలేదు. మీ దేవుణ్ణి ఆచార్యులను ప్రార్థించండి" అని నాతో అన్నారు. నేను నా తల్లి వద్దకు వచ్చాను. ఎందుకు వాణ్ణి వదిలి వచ్చావు అని నన్ను అమ్మ అడిగింది.

"పరమాచార్య స్వామివారిని దర్శించాలి అనుకుంటున్నాను అందుకే
ఇంటికొచ్చాను"

"నాతో పాటు వస్తావా?" అని అడిగాను.

"నన్ను తిరువణ్ణామలైలో వదిలిపెట్టు. నేను శేషాద్రి, రమణుల వద్ద ఉంటాను".

"నేను ముందు పెరియవను దర్శించుకుంటాను అని సంకల్పం చేసుకున్నాను. అటుతరువాత నిన్ను తిరువణ్ణామలైలో వదిలిపెడతాను" అని చెప్పాను.

ఇద్దరమూ కాంచీపురం వెళ్ళాము. కాని మహాస్వామి వారు అక్కడ లేరు. తిరుమిలిసై ఆళ్వారుల 1001 వ జయంతి ఉత్సవాలకని ఒరిరిక్కై వెళ్ళారు. మేము ఉదయం ఆరు గంటలకు ఒరిరిక్కై చేరుకున్నాము. అమ్మ ఒక చెట్టు కిందనున్న బండపైన కూర్చున్నారు.

"అమ్మా! నాన్నగారు పోయాక ఎలాగూ నువ్వు పూర్వాసువాసినిలా కాశిలో ముండనం చేసికొని, తెల్ల చీర కట్టుకుని ఉన్నావు. నువ్వు కూడా పరమాచార్యుల దర్శనానికి రావచ్చు కదా?" అని అడిగాను

"లేదు రా, నేను రమణులను, శేషాద్రిని తలచుకుంటూ ఇక్కడే ఉంటాను. నువ్వు స్వామివారి దర్శనం చేసుకున్న తరువాత నన్ను తిరువణ్ణామలై తీసుకునివెళ్ళు"

ఆమె సమాధానంతో కాస్త చికాకుపడి, "కావాలనే పరమాచార్య స్వామివారి దర్శనం చేసుకోకుండా ఉంటె, భగవాన్ రమణులు, శేషాద్రి స్వామివారు నిన్ను అనుగ్రహిస్తారనుకుంటున్నవా?" అని అడిగాను.

"చూడు, నాతో వాదించకు. నువ్వు వెళ్లి దర్శనం చేసుకో. నిన్ను నేను అడ్డుకోవడం లేదు. నేను ఇక్కడే ఉంటాను"

ఈ మనస్తత్వం ఉన్న నిన్ను వందమంది రమణులు, శేషాద్రి స్వాములు కూడా కాపాడలేరు అని లోపలకు వచ్చి స్వామివారికి సాష్టాంగం

చేశాను. తమ్ముని దీన స్థితిని తలుచుకుని గొంతు గాద్గదికమవుతుండగా తిరువేంబావై నుండి 19వ పాశురాన్ని పాడాను.

తన్నుకొస్తున్న దుఃఖం వల్ల పాశురాన్ని పూర్తిచేయ్యలేక పోయాను. ఒక్క క్షణంపాటు నా తత్తరపాటును గమనించి, “పాశురాన్ని పూర్తిచెయ్యి” అన్నారు. స్వామి ఆజ్ఞమేరకు పూర్తిచేశాను.

“ఒంటరిగా వచ్చావా?” అని అడిగారు స్వామివారు.

“అమ్మతో పాటు వచ్చాను”

“అయితే, ఏమిటి విషయం?”

నా తమ్ముని దుస్థితిని స్వామివారికి తెలిపాను.

“మూత్రపిండం దెబ్బతినిందా?” అని అడిగారు.

“లేదు”

చేతితో స్వామివారి తలను చూపించారు.

“అవును, మెదడు దెబ్బతినింది” అని చెప్పాను.

చేతిలో తామరాకులో కొంచం కుంకుమ వేసి, రెండు నిముషాలు ధ్యానమగ్నులై కళ్ళు మూసుకున్నారు. “నువ్వు ఇప్పుడు కలకత్తా వెళ్తున్నావా?” అని అడిగారు.

“లేదు పెరియవ. మా అమ్మని తిరువణ్ణామలైలో విడిచి, పూణే వెళ్ళి కలకత్తాకు వెళ్తాను” అని బదులిచ్చాను. “వెంటనే ఈ కుంకుమని పూణేలో ఉన్న నీ తమ్మునికి పంపు” అని చెప్పారు. మరో పది నిముషాల పాటు ఇతర భక్తులతో మాట్లాడారు.

తరువాత నన్ను ఆశ్చర్యపరుస్తూ శ్రీవారు తమ కౌపీనాన్ని సర్దుకుని, పైకి లేచి కాషాయ వస్త్రాన్ని విప్పి రెండు మడతలు వేసి భుజంపైన వేసుకుని, ఎడమచేతిలో దండం పట్టుకుని బయటకు వెళ్తున్నారు. ఆ కౌపీనధారి కొద్ది దూరం నడిచి మా అమ్మ వద్దకు వెళ్ళారు. ఆమె స్వామివారిని చూడగానే ఆనందపరవశురాలై కాళ్ళపై పడి వెక్కి వెక్కి ఏడుస్తోంది.

అమ్మకి పరమాచార్య స్వామివారి మొదటి ప్రశ్నయే, “మీ మాతామహుల పూర్వీకులు ఎక్కడివారు?”

తిరువణ్ణామలై అని అమ్మ చెప్పింది.

“మీరు శేషాద్రి స్వామివారిని చూశారా? ఆయన మీ ఇంటికి వచ్చారు కదూ?” అని అడిగారు. ఈ ప్రశ్నతో చాలా సంబరపడింది.

“అవును”

“వారు ఏం చేశేవారు?”

“నన్ను వండిన అన్నాన్ని ఇమ్మనేవారు. చాలా వేడిగా ఉందని చెప్పేదాన్ని. కాని నాకు చాలా ఆకలిగా ఉందని నా మాటలను పట్టించుకునేవారు కాదు. అంతటి కాలుతున్న అన్నంలో చెయ్యిపెట్టి తినేవారు. సరిగ్గా రెండు సార్లు తినగానే తినడం ఆపేవారు. తరువాత మేమందరం దాని తినేవారం”

“భగవాన్ ని చూశారా?” అని అడిగారు ఈసారి.

“అవును వారిముంది మేము పాడేవారం”

“మీరు అక్షర మణిమాల పాడుంటారు కదూ”

“అవును. తెల్లవారుఝామున మూడున్నర నుండి వరుసగా వేంకటేశ్వర సుప్రభాతం, భగవద్గీత, వల్లల్లార్ తిరువరుత్ప, పాటలు పాడేవారం”

“ఇప్పుడు ఎక్కడికి వెళ్తున్నారు?”

“నన్ను తిరువణ్ణామలై తీసుకునివెళ్ళమని వాణ్ణి అడిగాను”
పరమాచార్య స్వామివారు నడిచి వెళ్ళిపోయారు. మహాస్వామి వారు తనతో భగవాన్ రమణులు, శేషాద్రి స్వామి గురించి అడిగారని అమ్మ ఎంతో ఆనందపడింది. ఇంకా నాతో అన్నది, “నువ్వు వారిని గమనించావా? నువ్వు వారిని పెరియవ అన్నావు, కాని వారు నావద్దకు

కోపీనధారియై వచ్చారు. భగవానుల దేహంలా వారి దేహమూ కాంతివంతముగా ఉంది. వీరి స్థితి కూడా రమణుల స్థితివలె తోస్తోంది. నువ్వు ఇది గమనించావా! వారి మాటతీరు అచ్చం శేషాద్రి స్వామివారి మాటల లాగే ఉంది"

రమణులు శేషాద్రి స్వామివారే కావాలి, పరమాచార్య స్వామి వారిని దర్శించను అన్న వ్యక్తికి మహాస్వామి వారు రమణులవలె కనిపించి, శేషాద్రి స్వామివారివలె మాట్లాడారు అని కొన్ని రోజుల తరువాత నాకు స్ఫురించింది.

రెండురోజుల్లో కుంకుమను నా తమ్మునికి పంపాను. అతని నుదుటికి, శరీరమంతా దాన్ని అలదారు. రాత్రి పదకొండు గంటలప్పుడు మగతగా పెరియవ పెరియవ అని కలవరించాడు. ఏదో చెయ్యాలని తాపత్రయపడి మంచం పైనుండి కిందకు పడిపోయాడు. ఏడుస్తూ, "ఓ! నేను పాపిని. సాష్టాంగం చెయ్యలేకపోతున్నాను. వారు వెళ్ళిపోతున్నారు" అని అన్నాడు.

అక్కడకు పరమాచార్య స్వామివారు వచ్చారని ఆపాదమస్తకం రెండు మూడు సార్లు తనని తీక్షణంగా చూశారని, వారికి నమస్కరించడానికి తన శరీరం సహకరించలేదని నాతో చెప్పాడు.

"అవును నిజం నేను పరమాచార్య స్వామివారిని ఆసుపత్రిలో నా పక్కన చూశాను!!!"

అపార కరుణాసింధుం జ్ఞానదం శాంతరూపిణం
శ్రీ చంద్రశేఖర గురుం ప్రణమామి ముదావహం ॥

--- తిరువణ్ణామలై గౌరీశంకర్ మామ

#KanchiParamacharyaVaibhavam #కంచిపరమాచార్యవైభవం
2/27/18, 09:26 - Paramacharyulu: <Media omitted>
2/27/18, 11:56 - Paramacharyulu: <Media omitted>
2/27/18, 16:29 - Paramacharyulu: ఆరవ శ్లోక భాష్యం - రెండవ భాగం

కాముడు (మన్మథుడు), కామేశ్వరి సేవకుడే కాబట్టి, ఆమె దగ్గరున్న చెఱుకువిల్లు కూడా ఈయన ధరిస్తూ ఉంటాడనడంలో తప్పులేదు. భావాల్లో ప్రేమ, రుచుల్లో తీపి వంటిది. అయినా ఎవరితోనైనా యుద్ధం చేసేటప్పుడు మిరపకాయల వంటి ఆయుధాలుంచుకోవాలి కదా! ఈయన దానికి పూర్తి వ్యతిరేకమైన ఆయుధాలు ధరిస్తాడు.

చెట్టు కాండం గట్టిగా ఉండవచ్చు. ఆకులు, పళ్ళు కూడా అప్పుడప్పుడు గరుకుగా కోసుగా ఉండవచ్చు. పూలు సుతిమెత్తటివి. అందమైన మనిషి ఎంతటి కఠుకువాడయినా కళ్ళు సున్నితంగానే ఉంటాయి. కొంచెం దుమ్ముపడితే కందిపోతాయి. అలాగే చెట్టంతా కఠినమైనా పూలు సున్నితంగా ఉంటాయి. మరి ఈయనో ? అరవిందం, అశోకం, చూతం, నవమల్లిక, నీలోత్పలం వంటి పుష్పాలు ఆయుధాలుగా పెట్టుకొన్నాడు. ఒక్క పూవు ఒక్కొక్క ఇంద్రియానికి ప్రతీక. లలితా సహస్రనామంలో కూడా అంబిక అయిదు బాణాలు అయిదు ఇంద్రియాలతో సంబంధమున్న వానిగా అభివర్ణించబడింది. "పంచతన్మాత్రసాయకా" పంచభూతములకు సూక్ష్మరూపము ఈ అయిదు తన్మాత్రలు అయిదు ఇంద్రియముల చేత గ్రహించబడతాయి. శబ్ద స్పర్శ రూప రస గంధాదులు పంచతన్మాత్రలు.

ఈ అయిదు పుష్పాలు అయిదు ఇంద్రియాలను సూచిస్తాయనుకొన్నాం కదా! అయిదు తన్మాత్రలకు కూడా సంబంధముంటుంది. పూవున్న చోట తేనెటీగ ఉంటుంది. పూలకు స్పర్శ రూప రస గంధ లక్షణములున్నయి. కానీ పూలకు శబ్ద లక్షణం లేదు కదా! ఈ తుమ్మెద ఆ కొరత తీరుస్తుంది. ఈ మన్మథుడు "చంపు", "చావగొట్టు" అనే అరుపులతో యుద్ధానికి వెళతాడు. అల్లెతాడుగా ఉన్న తుమ్మెదల ఝుంకారమనే సంగీతంతో కూడి యుద్ధనికి వెళతాడు.

రాజులు బలహీనులైనా విశ్వాస పాత్రులైన సామంతులు మహా పరాక్రమవంతులైతే రాజ్యం భద్రంగానే ఉంటుంది. యుద్ధాలలో విజయాలు వరిస్తాయి. మరి ఈ మన్మథరాజు సామంతులెటువంటి వారు ? "వసంత స్సామంతో" – వసంత కాలమన్నమాట. ఈ కాలంలో సమశీత ఉష్ణస్థితులతో వసంతం ఎంతో ఆహ్లాదంగా ఉంటుంది. దీనికి పుష్పసమయమన్న పేరుకూడా ఉంది. అటువంటి ఋతువుకు అధిపతి యుద్ధం చేయబోయే మన్మథునికి తోడు. యుద్ధంలో ఆగ్నేయాది అస్త్రాలు వేసి శత్రువును క్షోభింపచేయాలి. ఈ సామంతుడు తలపులలోకి వస్తేనే మనస్సు ప్రశాంతంగా మారిపోతుంది.

"మలయ మరుదాయోధన రథః" – "ఆయోధన" అంటే యుద్ధం కోసం అన్నమాట – మలయ పర్వతాల నుండి వచ్చే మంచిగంధపు వాసనలున్న చల్లటి గాలులు ఈయన యుద్ధం కోసం ఏర్పడిన రథము యుద్ధాలలో విషవాయువులు కదా వదిలి పెట్టాలి. మందంగా వీచే కాలుష్యత ఏమాత్రం లేని చల్లటి గాలి ఈయన రథమా?

మన్మథుని బాణాలు, విల్లు, వింటితాడు కనీసం కనులకు కనిపిస్తాయి. ఈ వసంతుడు కళ్ళకు కనిపించను కూడా కనిపించడు. ప్రకృతి పుష్పించినపుడు ఓహో వసంతోచ్చింది అనుకుంటాం. చల్లటి గాలులు సోకినపుడు మలయమారుతం వీస్తుంది అనుకుంటం. సామంతులు, రథము ఇంత లక్షణంగా ఉన్నాయి. పోనీ మన్మథుడు బలిష్టంగా కనిపిస్తాడా అంటే ఆయన అనంగుడు. మన్మథునకనేక పేర్లున్నాయి.

అయితే ఆచార్యులవారు ఇక్కడ సాభిప్రాయంగా అనంగుడనే నామమే తీసుకున్నారు. అనంగ అంటే అంగములు లేనివాడు. శివునిచేత భస్మం చేయబడిన మన్మథుని కామేశ్వరి పునరుజ్జీవితుణ్ణి చేసింది. కానీ శరీరమే లేకుండా ఆమే భర్త వేసిన శిక్షను పూర్తిగా మాఫీచేయడం ఆమెకు ఇష్టంలేదు. అందువల్ల శరీరాన్నీయలేదు. అయితే అతడి భార్యకు మాత్రం కనిపించే వరమిచ్చింది. "రతినయన

లేహ్యేన వపుషా" అన్నారు ఆచార్యులవారు. మిగతావారందరికీ అతడు కాంతి, శబ్దము, గాలి వలె ఒక శక్తి.

(సశేషం)

#KanchiParamacharyaVaibhavam #కంచిపరమాచార్యవైభవం
#ParamacharyaSoundaryaLahariBhashyam
2/28/18, 07:52 - Paramacharyulu: ప్రసాదం కలిపిన స్నేహం

తంజావూరులోని ఒక చిన్న గ్రామంలోని ప్రజలందరూ కంచి శ్రీమఠానికి భక్తులు. బ్రాహ్మణులు నివసించే వీధిలో ఏదో చిన్న కారణం వల్ల శతృత్వం పెరిగి వాళ్ళందరూ రెండు సమూహాలుగా విడిపోయారు. కారణం చాలా చిన్నదే అయినా వారి మధ్య శతృత్వం మాత్రం చాలా పెద్ద స్థాయిలో ఉంది.

కొన్ని కారణాలవల్ల ఇరు పక్షాలకు నాయకులైన అనంతు, సేథు ఒకేసమయంలో పరమాచార్య స్వామివారి దర్శనానికై మఠానికి వచ్చారు. ఇద్దరూ స్వామికి సాష్టాంగం చేసి నిలబడ్డారు.

స్వామివారు వాళ్ళని చూసి, "అద్భుతం! ఇద్దరూ కలిసే వచ్చారుగా?" అని అడిగారు.

వాళ్ళ మధ్యన ఉన్న శతృత్వం పరమాచార్య స్వామివారికి తెలియకూడదని ఇద్దరూ ఒక్కసారిగా "అవును పెరియవ" అని అన్నారు.

చాలాసేపు స్వామివారు వారిద్దరితో మాట్లాడారు. మాటల మధ్యలో శిష్యులకు మాత్రమే అర్థమయ్యే విధంగా, ప్రత్యేకంగా ఒక ప్రసాదం పొట్లం కట్టి ఉంచమని సైగల ద్వారా చెప్పారు.

మామూలుగానే ఇరు కుటుంబాల గురించిన విషయాలన్నీ విచారించారు స్వామివారు. అనంతు కుమారుని పైచదువులు, వారి పెదనాన్నగారి సహస్ర చంద్రదర్శన వేడుకలు, సేథు కుమార్తె సీమంతం, మారియమ్మన్ కోవెల అగ్నిగుండం ఉత్సవాలు, చిన్న మీరాసిదార్ చిట్టయ్యన్ గోవులు, ఇలా అన్ని విషయాలను అడిగారు.

వారికి ప్రసాదం ఇచ్చి వెళ్ళమని ఆదేశించి చివరగా, "మీరు ఇక్కడినుండి ఇంటికే కదా వెళ్తున్నారు?" అని అడిగారు.

"అవును"

"మన్నార్ గుడి ఎస్టేట్ శ్రీనివాస అయ్యంగార్ తెలుసునా మీకు?"

"తెలుసు పెరియవ" అన్నారు ఇద్దరూ.

"మీరిద్దరూ తిన్నగా అతని ఇంటికెళ్ళి ఈ పరసాదాన్ని అతనికందించి మీరు ఇంటికి వెళ్ళండి" అని ఆదేశించారు. మహాస్వామి వారి మాటలతో పెద్ద కొండలా వారిమధ్య ఉన్న శతృత్వం కృశించుపోయింది. ఇద్దరూ కలిసి కాంచీపురం నుండి మన్నార్ గుడి వరకు వెళ్తూ కూడా, ఒకరినొకరు పలకరించుకోకుండా, ఒకరి మొహాలు ఒక చూసుకోకుండా ఎలా ఉండగలరు?

ఇద్దరూ ప్రసాదం తీసుకుని శ్రీమఠం వెలుపలకు రాగానే మరలా మంచి స్నేహితులైపోయారు. భక్తితో ప్రసాదం తీసుకున్న శ్రీనివాస అయ్యంగార్ ఆశ్చర్యానందాలకు లోనయ్యారు. "మామూలుగా పరమాచార్య స్వామివారు శ్రీమఠం పరిచారకులతో ప్రసాదం పంపేవారు. ఈరోజు మీవంటి మహానుభావుల చేత పంపారు" అని అన్నారు.

ఎందుకు అలా పంపారో ఆ మహానుభావులకు తెలుసు.

అపార కరుణాసింధుం జ్ఞానదం శాంతరూపిణం
శ్రీ చంద్రశేఖర గురుం ప్రణమామి ముదావహం ॥

--- శ్రీమఠం బాలు మామ, మహా పెరియవళ్ - దరిశన అనుభవంగళ్

#KanchiParamacharyaVaibhavam #కంచిపరమాచార్యవైభవం
2/28/18, 10:14 - Paramacharyulu: <Media omitted>
2/28/18, 12:13 - Paramacharyulu: <Media omitted>
2/28/18, 12:39 - Paramacharyulu:
https://www.facebook.com/422560081180577/videos/1220446528058591/
2/28/18, 14:45 - Paramacharyulu: పరమపూజ్య శంకరాచార్య శ్రీ శ్రీ జయేంద్ర సరస్వతి స్వామివారి బృందావన ప్రవేశ సందర్భంగా రేపు ఉదయం 7:30 నుండి విష్ణుసహస్రం, భగవద్గీత పారాయణ చెయ్యవలసిందిగా చిన్నస్వామి వారి ఆదేశం
2/28/18, 16:07 - Paramacharyulu: ఆరవ శ్లోక భాష్యం - మూడవ భాగం

యోద్ధలు సామాన్యంగా పెద్దపెద్ద మీసాలతో కండలు తిరిగి చూడటానికి భయం కలిగించే విధంగా ఉంటారు. మన్మథునికి రూపమే లేదు.

పోనీ వసంతుణ్ణి ప్రకృతిని బట్టి గుర్తించవచ్చు. ఈ అంగాలన్నీ ఉన్న "అంగి" అయిన మన్మథుని ఏరకంగానూ గుర్తింపశక్యంకాదు. ఆయనను గుర్తించడానికి వీలుకాదు కానీ అందరిలోను ప్రవేశించి వారిని తన అదుపులో పెట్టుకొంటాడు. ఏం విచిత్రం – ప్రపంచాన్నంతా జయించే యోద్ధ ఇంతటి బలహీనుడు.

త్రిపురాసుర సంహారానికి పరమేశ్వరుడు బయలుదేరేటప్పుడు మేరు పర్వతం విల్లుగా, వాసుకి అల్లెతాడుగా, వాసుదేవుడు బాణంగా, బ్రహ్మదేవుడు రథసారథిగా ఏర్పాటు చేయబడింది. ఎంతటి బలిష్టమైన ప్రయత్నమో చూడండి. అయితే పరమశివుడు వీనిని వేటినీ ఉపయోగించలేదు. ధనుష్టంకారం లేదు, బాణప్రయోగం లేదు, భుజస్ఫాలనము లేదు. బాహాబాహిగా ముష్టాముష్టిగా తలబడటమూ లేదు, ఈశ్వరుడు కేవలం అట్టహాసం చేశాడు. ఎందుకా నవ్వు ? "అరె! పరాశక్తి నాలో ఉండగా నాకు సహాయంగా ఇన్ని సంభారాలు అమర్చబడ్డాయే" అన్న అలోచన వచ్చి ఆయనకు నవ్వు వచ్చింది. ఆ అట్టహాసానికి త్రిపురాసురులు మాడి బూడిదైపోయారు. పరమేశ్వరునికి బలిష్ఠమైన ఆయుధాలున్నా వాటిని ఉపయోగించుకోలేదు. మన్మథుడు బలమనే మాటకు ఎంతో దూరమైన ఆయుధాలతో యుద్ధం గెలుస్తాడు. ఈ ఇద్దరి గెలుపుకూ కారణం ఒక్కటే. పరాశక్తి పరమేశ్వర హృదయాంతర్గత అయి అక్కడ యుద్ధాన్ని గెలిపించింది. కేవలం తనక్రీగంటి చూపు ద్వారా ప్రసరింప చేసే కటాక్షం వలన మన్మథుని విశ్వవిజేతను చేస్తోంది.

మన్మథుడే శరీరం లేనివాడు. అతడి ఆయుధాలా అత్యంత బలహీనములు. అయినా ప్రపంచాన్నంతా గెలుస్తాడు. అతడికి కాల్బలమా, ఆశ్వికదళములా, గజ బలమా ఏమున్నాయి. పేరుకు వసంతుడొకడు చెలికాడు లేక సామంతుడు. అతడి గెలుపుకు కారణం అంబిక యొక్క కొంచెం దయ – శివుని విషయంలో వలే ఆమె హృదయంలో కూర్చోలేదు. పోనీ కనులన్నా పూర్తిగా తెరిచి దయాప్రసాదం చేయలేదు. ఇది అనిర్వచనీయమైన దయ అంటారు ఆచార్యులవారు. "కామపికృపాం" – వారు అంబికని హిమగిరి సుతా అని సంబోధిస్తారు. ఆమె క్రీగంటి చూపువలన కలిగిన దయాప్రసాదం వలన ఎందుకూ కొఱగాని మన్మథుడు "జగదిదం సర్వం విజయతే" రస ప్రపంచాన్నంతా జయిస్తున్నాడు.

ప్రపంచానికి చెందిన మాయా విలాసమైన వాటన్నిటికీ ఆమె ఒక్క క్షణం క్రీగంట ప్రసారం చేసే దయ చాలు. అన్నీ సిద్ధిస్తాయి. త్రిపురాసుర సంహారమంటే స్థూల సూక్ష్మ కారణ శరీరాల్నీ, మిగిలిన మహాకారణాన్ని (బ్రహ్మయొక్క) తిరస్కరించడం. అంటే నిష్ప్రపంచ స్థితిని పొందడం, అది అంబిక సంపూర్ణంగా అతనిలో ఉంటేనే సాధ్యమౌతుంది. త్రిపురాసురుని కాల్చినవాడే మన్మథునీ కాల్చేశాడు. మన్మథునికి అంబిక క్రీగంట ప్రసారం చేత లభించిన దయ, పరమేశ్వరుడు ఆమె నుండి పొందిన సంపూర్ణ అనుగ్రహం ముందు నిలవలేదు.

మన్మథుణ్ణి అంబిక విజేతను చేసిందనే విషయంలోనే మనకు కథ ఆగిపోలేదు. మనం మన్మథుణ్ణి జయించాలి. మన్మథుని దగ్ధం చేసినపుడు అంబిక అతని హృదయంలో ఉండి సంపూర్ణానుగ్రహం చూపిన విషయం మనం జ్ఞప్తిలో ఉంచుకోవాలి. మనకు ఆమె అనుగ్రహం కావాలి. ఆమె సృష్టించిన శక్తి ఆమెవల్లనే నాసనమవుతుంది. ఇక్కడ ఆచార్యులవారు అంబిక చేత సృష్టించబడిన శక్తి గురించి మాట్లాడుతున్నారు.

ఇట్టి ఉన్నతమైన ఉద్దేశ్యంతోనే అంబిక మన్మథునికి బలిమిలేని ఆయుధం ఇచ్చింది. అతడు ఈ సృష్టినంతటినీ ఒక ఆటపట్టిస్తున్నప్పటికీ అది తన ప్రతిభకాదనీ అంబిక కటాక్షమనీ క్షణక్షణం గుర్తుకు వస్తూనే ఉంటుంది. ఇతనికి అహంకారం జనించరాదనే దయచేతనేమో అంబిక అంతటి బలహీనమైన ఆయుధాలనిచ్చింది.

(సశేషం)

#KanchiParamacharyaVaibhavam #కంచిపరమాచార్యవైభవం
#ParamacharyaSoundaryaLahariBhashyam
3/1/18, 07:12 - Paramacharyulu: జయేంద్ర సరస్వతి స్వామివారు

ముఖ్యంగా సర్వజ్ఞత్వంలోనూ, కారుణ్యంలోనూ ఆ శంకర విభూతి రెండు రూపాలతో ఇప్పటికి ఈ పీఠంలో అధిష్టించి సనాతన ధర్మాన్ని కాపాడుతున్నది. ధర్మరక్షణలో ఎన్నెన్ని ఉద్యమాలు చంద్రశేఖరేంద్ర సరస్వతి స్వామివారు ప్రారంభించి వ్యవస్థీకరించారో వాటన్నిటిని పటిష్టపరచడమే కాకుండా ఆ మార్గంలో ఎన్నో నూతన వ్యవస్థలను తీసుకువచ్చి హిందూధర్మ పరిరక్షణలో జాగారణోద్యమాల లాంటివి కొన్ని దశాబ్దాల క్రితమే ప్రారంభించిన మహాత్ములు శ్రీ శ్రీ జయేంద్ర సరస్వతి స్వామివారు.

అటువంటి వారియొక్క అండదండల్లో మనమున్నామనేదే ఒక ధన్యతా భావన. ఒక ప్రత్యేక విషయం జయేంద్ర సరస్వతి స్వామి వారియొక్క వైభవాలు నాకు తెలిసిన ఒక రెండు ఇక్కడ ముచ్చటించుకుందాం. ఒకప్పుడు నేను చెన్నై నగరంలో ఉన్నప్పుడు నేను రాసిన ఒక పాటని యస్.పి. బాలసుబ్రహ్మణ్యం గారు పాడబోతున్నారు ఏవియం స్టూడియోలో. ఉదయం ఏడుగంటల ప్రాంతంలో పాట రికార్డింగ్. చాలా ప్రశాంతంగా ఉంది వాతావరణమంతా. అప్పుడు నేను స్క్రిప్టు ఆయన చేతికిచ్చాను. ఆయన చూస్తూ ఉన్నారు. ఈలోపల మైకును అమర్చే టెక్నీషియన్ వచ్చారు అక్కడకి. మైకు సరిచేస్తూ ఉంటే బాలుగారు ఒకమాట అన్నారు.

బాబు గురువుగారి వద్ద నీకు జరిగిన అనుభవాన్ని ఒక్కసారి వీరితో - శర్మగారితో చెప్పు అన్నారు. అనగానే ఆయన నాతో చెప్పారు, నేను ఆశ్చర్యపోయాను. జయేంద్ర సరస్వతి స్వామివారి దర్శనానికి వచ్చి వరుసలో నిలబడ్డాడుట అతను. ఆయన మనస్సులో హటాత్తుగా ఒక ఆలోచన వచ్చింది. ఏంటంటే, చిన్నప్పటి నుండి నాది ఆడగొంతు, మగ గొంతు లేదు ఎక్కడికెళ్ళినా అవమానంగా అనిపిస్తుంది. ఎంతటి మహాత్ములైనా దిన్ని మార్చగలరా? అని మనస్సులో అనుకున్నాడట ఆయన.

తిరిగి వరుసలో వస్తూఉంటే స్వామివారి దగ్గరకు రాగానే అందరికి ఇచ్చినట్టే పటికబెల్లం, కుంకుమ, అక్షతలు ఇచ్చారు. అవి తీసుకుని బయటకు వచ్చి పటికబెల్లం నోట్లోవేసుకుని పక్కకు తిరిగి ఆ స్థంభం నుండి ఇటువైపు వచ్చాడో లేదో గొంతు మారిపోయింది. ఇది

ఎవరో చెప్పడం కాదు, స్వయంగా ఆయన చెప్పింది.

నాకు సమీపంలో జరిగిన అంశాన్నే మీకు ప్రస్తావించాను.

మరొక్కటేమిటంటే ఒక వ్యక్తి కేవలం ల్యామినేషన్స్ వేసుకుని బ్రతికే ఒక సామాన్య యువకుడు, అతడు నాస్తికుడు సహజంగా. కాని ఒకసారి అతనికి ఏం బుద్ధిపుట్టిందో గాని, ఆదిశంకరుల యొక్క లైన్ డ్రాయింగ్ ఒకటి వేసి దాన్ని ల్యామినేషన్ చేసి ఒక చిత్రపటంగా చెయ్యాలని ఆలోచన అతనికి. ఆ డ్రాయింగ్ పూర్తి చేశాడు. తరువాత దాని ముద్రణ అవి పూర్తి చేద్దామని పక్కకు పెట్టి, సైకిల్ రిపేరు చేసుకుందామని చెన్నైలో ఆయన రహదారికి ఒక వైపు నిలబడి ఉన్నాడు సైకిల్ షాపు పక్కన. ఈలోపల జయేంద్ర సరస్వతి స్వామివారి వాహనం అటు వస్తోంది. హటాత్తుగా వాహనం ఇతడున్నచోట ఆపారు. స్వామివారు కిటికీని తెరచి ఈ పిల్లవాణ్ణి పిలిచారట. ఎవర్నో అనుకుని అటు ఇటు చూస్తున్నాడీయన. ఇలా రా అన్నారట. తననే పిలుస్తున్నారని తెలిసి వెడితే, అతడికి ప్రసాదంగా పూలదండ, విభూతి, కుంకుమ ఇవన్నీ ఇచ్చి, "నువ్వు ఇంట్లో రాసిపెట్టి ఉన్నటువంటి శంకరుల యొక్క చిత్రాన్ని బాగా వ్యాప్తి చెయ్యి" అని చెప్పారుట.

ఆ వ్యక్తి నాకు చాలా దగ్గరి పరిచయం. అలా పరంపరాగతంగా ఈ శంకర పరంపర సనాతాన ధర్మాన్ని రక్షిస్తూ వస్తున్నది.

--- బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖశర్మ గారి ప్రవచనం నుండి

#KanchiParamacharyaVaibhavam #కంచిపరమాచార్యవైభవం
3/1/18, 16:14 - Paramacharyulu: ఆరవ శ్లోక భాష్యం - నాల్గవ భాగం

ఇప్పుడు అనంగుడు (శరీరం లేనివాడు)గా పిలవబడుతున్న ఈ మన్మథునికి ఒకప్పుడు అతిలోక మనోహరమైన శరీరం ఉండేది. అందుకే ఇప్పటి అందగాళ్ళను నవమన్మథులంటాం. తన అందం చూసి అతడు అహంకరించాడు. ఆ రోజుల్లో సూరపద్ముడనే రాక్షసుని బారిన పడిన దేవతలు పడరాని కష్టం పడుతున్నారు. అతడిని ఈశ్వరునికి జనించిన పుత్రుడే చంపగలడట. మరి స్వామి అప్పుడు దక్షిణామూర్తి రూపంలో ధ్యానమగ్నుడై ఉన్నాడు. అప్పుడు అంబిక పర్వతరాజ పుత్రికగా వచ్చింది. వీరిరువురినీ సంధానం చేయడానికి దేవతలు ఈ మన్మథుణ్ణి పంపారు. ఈశ్వరుడు పూలబాణంచే కొట్టబడి కనులు తెరచి మన్మథుణ్ణి దగ్ధం చేశాడు. తరువాత మనస్సు మార్చుకొన్న పరమేశ్వరుదు పార్వతిని వివాహమాడాడనుకోండి. ఈ శ్లోకంలో అంబిక అనేక నామాలలో "హిమగిరి సుత" అన్న నామాన్ని ప్రస్తావించడంలో ప్రత్యేకమైన ఉద్దేశ్యముంది.

ఆరంభంలో పార్వతిపై స్వామి ప్రేమ భావనలను ఉత్తేజపరచడానికి దేవతలు మన్మథుని పంపారు. అప్పుడు మన్మథుడహంకరించాడు. పరమేశ్వరుని మనస్సు మథించి పెద్ద విజయాన్ని సాధిచగలననుకున్నాడు. మథనమంటే చిలకడం కదా. మనస్సును మథించేవాడు మన్మథుడు. మహా నిర్లిప్తుడైన పరమేశ్వరుని హృదయం చిలకడం సాధ్యమా ? మన్మథుడు గుర్తుబట్టడానికి సైతం వీలులేకుండా బూడిద చేయబడ్డాడు. అప్పుడు అంబిక అతనికి క్రొత్త జీవితాన్ని ప్రసాదించింది కానీ శరీరం లేదు. తనంతటతానేదైనా చేయగలనని గొప్పలు చెప్పుకోవడం ఇక కుదరదు తరవాత అతడు పరమేశ్వరునిపై విజయం సాధించాడు. ఈ విషయం మన్మథ పురాణంలో కాదు, కామాక్షి పురాణంలో ఉన్నది. ఆ పురాణం మన్మథుడు ఎంతో వినయంతో అంబిక అనుగ్రహం శివుని హృదయం కరిగిస్తుందనే భావంతో శివుని చేరాడని చెబుతుంది. శివుని చేత అతని శరీరమేకాక గర్వం కూడా హరించబడింది. ఆ గర్వం తిరిగి తలెత్త కూడదనే అంబిక అతన్ని అనంగునిగానే ఉంచింది.

తమిళంలో "వల్లవునకు పుల్లాయుధం" అన్న సామెత ఉన్నది. మహాయోధకు గడ్డిపోచే ఆయుధం అని దీనర్థం. కాకాసురుణ్ణి సంహరించడానికి రామచంద్రుడు ధర్భను అభిమంత్రించి వేశాడు. అంబిక కడగంటి చూపులచేత దయాప్రసాదం చేయబడిన మన్మథునకు పూలే ఆయుధాలు.

బూడిదగామారిన మన్మథుడు అంబిక కడగంటి చూపుల నుండి జాలువారిన దయామృతం చేత పునరుజ్జీవితుడైనాడు. ఆమె పతి మన్మథుణ్ణి కంటి మంటచే తగలబెట్టగా, అంబిక ఆ బూడిదపోగుపై తన అమృత వీక్షణం ప్రసారింపచేయగా, తక్షణమే మనమథుడు పునరుజ్జీవితుడైనాడు. కామాక్షి అంటే "కాముని తన కడగంటి చూపుచే సృష్టించినది" అని అర్థం. ప్రపంచాన్నంతటినీ జయించాడని చెప్పబడిన మన్మథుడు శివునిపై సాధించిన విజయం గురించి ఈ శ్లోకంలో ప్రస్తావించనేలేదు. శివుని జయించడమనేది కామేశ్వరి లీలలో ప్రధానమైనది. ఈ విషయం "హిమగిరి సుతే" అన్నపదం కొంత సూచితమైనప్పటికీ ప్రధానంగా చెప్పబడలేదు. తరువాత కాలంలో శివుడు పార్వతి యెడ మోహితుడైనప్పటికీ అది మన్మథుని కార్యం కాదు. అంబిక తన పరమ ప్రేమ చేత, ఆశ్చర్యకరమైన తపస్సు చేత దక్షిణామూర్తిని కదిలించివేసి కల్యాణ సుందరుని చేసింది. స్కాంద పురాణంలో ఈ విషయం చెప్పబడింది. దానినే కాళిదాసు కుమారు సంభవంగా వ్రాశారు.

క్రిందటి (5వ) శ్లోకంలో మహావిష్ణువు మోహినిగా శివుని మోహింపచేసిన విషయం ప్రస్తావించబడినా, కామారిపై కాముని విజయం స్పృశించబడలేదు. మహావిష్ణువు మన్మథుని తండ్రి, కృష్ణావతారంలో ఈ మన్మథుడు ప్రద్యుమ్నుడిగా పుట్టాడు. విష్ణువు మనస్సు నుండి ఉద్భవించిన మన్మథునకు "మనసిజు"డన్న పేరున్నది. తండ్రి యోగీశ్వరేశ్వరుడైన, మునులందరినీ మించిన దక్షిణామూర్తి ఆయిన స్వామిని మోహింపజేస్తే మిగతా మునుల సంగతి మన్మథుడు చూసుకొన్నట్లు వ్రాయబడింది.

సౌందర్యలహరి తరువాత భాగంలో మన్మథుడు స్వామిని జయించినట్లు చెప్పబడింది. అంబిక రెండు తాటంకములు (చెవి దిద్దులు) రెండు చక్రాలుగా, అద్దం వంటి ముఖం రథంగా అంబిక ప్రేమ పూరితములైన దృక్కులు బాణాలుగా మన్మథుడు స్వామిని జయించాడట. ఇంకో రెండు శ్లోకాలలో కూడా ఈ విషయం వివరించబడింది. మరొక్క శ్లోకం రథంపై నుండి శివునిపై బాణాలు వేస్తూ విజయోత్సాహంతో మన్మథుడు వేసే కేరింతలు వివరించబడ్డాయి. మొదటి భాగంలో ఈ విషయాలు లేవు. కవితా సౌందర్యానికి

ఆలవాలమయిన రెండవ భాగంలో చెప్పబడ్డాయి.

ఆచార్యులవారు ఈ శ్లోకం వరకూ కూడా తాను స్తోత్రం చేసే మూర్తి ఎవరో పూర్తిగా చెప్పలేదు. తరువాతి శ్లోకంలో కామేశ్వరిని పూర్తిగా అభివర్ణించబడింది.

(సశేషం)

#KanchiParamacharyaVaibhavam #కంచిపరమాచార్యవైభవం
#ParamacharyaSoundaryaLahariBhashyam
3/2/18, 06:56 - Paramacharyulu: శ్రీ జయేంద్ర సరస్వతి

కామకోటిపీఠం ప్రస్తుత పీఠాధిపతులు శ్రీ జయేంద్రసరస్వతీ శ్రీచరణుల పూర్వాశ్రమ నామం శ్రీ సుబ్రహ్మణ్యయ్యర్. వీరి తండ్రి శ్రీ మహదేవయ్యర్. తల్లి శ్రీ మతి సరస్వతీదేవి. జననం తంజావూరు జిల్లా తిరుళ్లిణికి గ్రామం. వీరిది ఔచథ్యగోత్రం ఋగ్వేదీయులు, వడమ శాఖ. 1935 లో యువ సంవత్సరం, ఆడిమాసంలో జననం. జన్మ నక్షత్రం ధనిష్ఠ. శ్రీ మహాదేవయ్యర్, సరస్వతి పుణ్యదంపతుల ముగ్గురి పుత్రులలో వీరు జ్యేష్ఠులు. శ్రీ సుబ్రహ్మణ్యయ్యర్ మూడు సంవత్సరాల వయస్సు వరకు తల్లిదండ్రుల వద్దనే ఉండి, అనంతరం మాతామహికి తండ్రిగారైన శ్రీ వీరాస్వామి ఘనాపాఠ వారివద్ద ఆరవ సంవత్సరం వరకు ఉన్నారు. తదుపరి తల్లిదండ్రుల వద్ద ఉండి నాలుగైదు తరగతులు ప్రాథమిక విద్యనభ్యసించారు. గర్భాష్టమున ఉపనీతులైనారు.

రైల్వేలో ఉద్యోగిగా ఉన్న తండ్రి శ్రీ మహదేవయ్యర్ తన కుమారునిచే వేదాధ్యయనం చేయించదలచి, సమీప గ్రామంలో యజుర్వేద పాఠశాలలో బాలుని చేర్పించారు.

ఇదే సందర్భంలో కామకోటిపీఠాధిపతులు శ్రీ చంద్రశేఖరేంద్రసరస్వతి శ్రీ చరణులు విల్లుపురానికి విజయం చేశారు. శ్రీ మహదేవయ్యర్ తన కుమారుని శ్రీ వారి దర్శనానికి తీసుకువెళ్ళి కుమారునిచే వేదాధ్యయనం చేయించే ఉద్దేశంతో ఉన్నామంటూ, స్వామివారి ఆశీర్వాదం కోరారు. ఉత్తమసంస్కారం కోసం రెండు మూడు సంవత్సరాలు మాత్రం బాలునిచే వేదాధ్యయనం చేయించి, అటు పిమ్మట, వృత్తి కొరకు లౌకికవిద్య నేర్పించదలచినట్లు శ్రీ మహదేవయ్యర్ స్వామివారికి నివేదించారు. కాని, స్వామి మాత్రం ఈ బాలునిచే పూర్తిగా వేదాధ్యయనం చేయించవలసినదిగా తండ్రికి ఉపదేశించారు.

ఆ మరునాడు కంచిలో శ్రీ కామాక్షి అమ్మవారి ఆలయానికి కుంభాభిషేకం చెయ్యడం కోసం శ్రీస్వామి వారు అక్కడికి బయలు దేరుతూ, విల్లుపురంలోని యజుర్వేదపాఠశాల అధ్యాపకులను, శిష్యులను కంచికి రావలసిందిగా ఆదేశించారు. తమ కుమారుని కూడా వెంటబెట్టుకొని శ్రీ మహదేవయ్యర్ కంచికి వెళ్లారు.

అది 1944 సంవత్సరం. శ్రీ కామాక్షి అమ్మవారికి ఆలయానికి కుంభాభిషేకం జరిగిన రోజునే అమ్మవారి సన్నిధిలోనే శ్రీ సుబ్రహ్మణ్యయ్యర్ ఋగ్వేదాధ్యయనం ఆరంభం అయింది. మధ్యార్జునంలోని ఋగ్వేద పాఠశాలాధ్యాపకులైన బ్రహ్మశ్రీ కృష్ణమూర్తి శాస్త్రి గారే అధ్యాపకులు. కాని, గృహస్థులు పీఠం సొత్తుతింటూ ఉండటం ఉచితం కాదని శ్రీ మహదేవయ్యర్ అభిప్రాయం వెలిబుచ్చటంచేత, చివరకు మధ్యార్జునంలో స్మార్తబ్రాహ్మణ పోషణలో ఉండి, కామకోటిపీఠ పర్యవేక్షణలో నడుస్తున్న వేదపాఠశాలలో ఈ బాలుడు ఋగ్వేదాధ్యయనం ప్రారంభించారు. ఆ విధంగా 13 సంవత్సరాల వయస్సు వరకు అక్కడనే ఋగ్వేదాధ్యయనం జరిగింది.

ఆ సమయంలో శ్రీ స్వామి వారు తమ విజయయాత్ర సందర్భంలో మధ్యార్జునం వచ్చారు. ఋగ్వేదం అభ్యసిస్తున్న శ్రీ సుబ్రహ్మణ్యయ్యంను 69 వ పీఠాధిపతిగా స్వీకరించదలచినట్లు, బాలుని తల్లితండ్రులకు కబురంపారు. తల్లితండ్రులు స్వామి ఆదేశాన్ని శిరసా వహించారు.

పీఠ సంప్రదాయాన్ని పలువిషయాల్లో ఈ బాలునికి మూడు సంవత్సరాలు శిక్షణ ఇచ్చారు. రెండు సంవత్సరాలు శ్రీ సుబ్రహ్మణ్యయ్యరు తల్లితండ్రుల వద్దనే ఉండి ఆంగ్లం మొదలైన భాషలను అభ్యసించారు. అటు తరువాత 1955 మార్చి 19 నుండి 22 తేదీ వరకు కంచిలో ఈ బాలునికి ఆశ్రమ స్వీకారోత్సవం మహావైభవంగా జరిగింది.

విశ్వేశ్వర సన్నిధిలో శ్రీ స్వామివారు శిష్యులకు మహావాక్యోపదేశం చేసి, 'జయేంద్ర సరస్వతి' అనే యోగపట్టాన్ని ఒక రుద్రాక్షమాలను పీతాంబరాన్ని ప్రసాదించారు, అదిమొదలు శ్రీ జయేంద్ర సరస్వతి శ్రీ చరణులు, శ్రీ చంద్రశేఖర సరస్వతులకు ప్రథమ శిష్యులై పీఠ కార్యక్రమాలన్నిటిలో పాల్గొంటూ వచ్చారు.

జన జాగరణ, జన కళ్యాణం

పీఠపరిపాలనాదక్షులు, పూజాకార్యక్రమదురంధరులు, ప్రస్తుతం దేశమంతటా ప్రబలుతున్న అధార్మిక వర్తనం, అలజడి, హింసాకాండను చూసి ఖిన్నులై జనసముదాయంలో ధార్మిక ప్రవృత్తిని పెంపొందించడానికి, ప్రతివ్యక్తి స్వయంకృషితో ద్రవ్యార్జన చేసికొంటూ సంసారాన్ని చక్కదిద్దుకొంటూ, దేశక్షేమానికి పురోగమనానికి ఎంతో దోహదం చేస్తాడనే భావంతో కుల, మత విచక్షణ లేకుండా, సమస్త ప్రజలు క్షేమంగా ఉండాలనే సంకల్పంతో “జన జాగరణ”, “జన కళ్యాణం” అను రెండు మహోన్నత కార్యక్రమాలను చేపట్టిన మహనీయులు జయేంద్ర సరస్వతి. ప్రజలలో మన సంస్కృతి, సంప్రదాయాలను పునరుజ్జీవింపచేయడానికి కార్యక్రమాలను రూపొందిస్తూ అర్హులకు ఆర్థిక సహాయం కల్పిస్తున్నారు. మత ప్రచారంతో బాటు సంఘసంస్కరణకు పూనుకొన్న పీఠాధిపతి శ్రీ స్వామివారు.

--- నీలంరాజు వెంకటశేషయ్య గారి "నడిచే దేవుడు" పుస్తకం నుండి

#KanchiParamacharyaVaibhavam #కంచిపరమాచార్యవైభవం
3/2/18, 07:34 - Paramacharyulu: <Media omitted>
3/2/18, 12:54 - Paramacharyulu: <Media omitted>
3/2/18, 15:54 - Paramacharyulu: ఏడవ శ్లోకం - మొదటి భాగం

క్వణత్కాంచీదామా కరికలభకుంభస్తననతా
పరిక్షీణా మధ్యే పరిణత శరచ్చంద్ర వదనా|
ధనుర్బాణాన్ పాశం సృణిమపి దధానా కరతలైః
పురస్తా దాస్తాం నః పురమథితు రాహోపురుషికా!!

ఆభరణములలో పొదగబడిన చిరుగజ్జెల సవ్వడి *క్వణత్* శబ్దంతో సూచించబడుతుంది. మొలనూలుకు మేఖల అని పేరు. గజ్జెలు పొదగబడిన మొలనూలును కాంచి అంటారు. లలితా సహస్రనామాలలో ప్రస్తావించబడిన *రణత్కింకిణి మేఖల* క్వణత్కాంచీ దామమునే సూచిస్తోంది. ఈ కాంచీ దామమునే మణిమేఖల అని పిలుస్తారు. తెలుగులో ఒడ్డాణమంటారు.

తమిళ పంచ కావ్యాలలో మణిమేఖల ఒకటి. దీనిలోని కథానాయిక పేరుకూడా అదే! మణిమేఖల బౌద్ధగ్రంథం. ఈ కథానాయిక కాంచీపురంలోని ఒక బౌద్ధాచార్యుని వద్ద ఉపదేశం పొంది కృతకృత్యత పొందినట్లు చెప్పబడింది. ఆమె తన చివరి రోజులలో కాంచిపురంలోని ప్రజల క్షామంతో కడగండ్ల పాలవుతుంటే, తన అక్షయపాత్రనుండి ఆహారం సృజించి అన్నార్తులకు పంచి పెట్టిందట. నిజానికి ఈ లీల కామాక్షీదేవిది. కామాక్షి పురాణాల నుండి వారు నకలు చేసుకొన్నారు. కామాక్షి పురాణమే మణిమేఖల వృత్తాంతం నుండి నకలు చేయబడి ఉండవచ్చు కదా అని కొందరు భావించవచ్చు.

మణిమేఖల కంటే పూర్వీకమైన సంగము కాలంలోని ఒక కవయిత్రి పేరు *కామకన్ని* అంటే కామాక్షి. కామాక్షి ఆరాధన పూరాతనమైనదన్నపుడు పై వృత్తాంతంతో సహా కామాక్షి పురాణంలో అన్ని కథలూ మణిమేఖలకంటే పురాతనమైనవే అనటంలో ఆశ్చర్యమేముంది. కామాక్షి ఒక్క అన్నదానమే కాదు, ముప్పైరెండు దానాలు చేసిందని అవ్వైయార్ పాడింది. సంప్రదాయంలోని అరవైనాలుగు దానాలు కుదింపబడి ముప్పైరెండుగా చెప్పబడ్డాయి. ఇంతకీ మణిమేఖల అంటే కాంచి – ఓఢ్యాణము. గజ్జెలు, రత్నాలతో పొదగబడిన మొలనూలు.

ఈ దేశంలో అంబిక కన్యాకుమారి, క్షీరభవాని (కాశ్మీరు), మీనాక్షీ, విశాలాక్షీ – ఈ రకంగా అనేక రూపాలలో ప్రార్థించబడింది. అయితే శ్రీవిద్యా తంత్రంలో వర్ణించబడిన ఆయుధములు, ముద్రలతో కూడిన లలితా త్రిపురసుందరి కంచి కామాక్షి మాత్రమే! ఆచార్యులవారు కామాక్షి పేరును నేరుగా చెప్పకపోయినప్పటికీ మణిమేఖలను కాంచీ దామమని చెబుతూ కామాక్షి దేవిని స్ఫురింపజేస్తున్నారు.

భూమిని మనం విష్ణుమూర్తి భార్య అయిన భూదేవిగా భావిస్తాం కదా! ఆ భూదేవి నాభి కాంచీపురంలో ఉంది. ఓఢ్యాణపు ముందుభాగం నాభికి పైన ఉంటుంది. కాబట్టి ఈ ప్రదేశానికి కాంచి అన్న ప్రసిద్ధి కలిగింది.

దామమంటే అనేక నూలుపోగులుతో పేనబడిన తాడు. ఓఢ్యాణము బంగారు దామములతో పేనబడినది కాబట్టి ఆచార్యులవారు దానిని *కాంచీదామ*మంటున్నారు. అమ్మ నడుస్తుంటే కాలిగజ్జెల గలగలలతో కాంచీదామపు చిఱుగజ్జెల సవ్వడులు కూడా కలిసి ఒక మధురనాదాన్ని సృష్టిస్తాయన్నమాట.

భూమినాభి నుండి బయలుదేరిన ఈ ఓఢ్యాణము చుట్టిరావాలంటే ఎంత పెద్దదిగా ఉండాలి ?? ఈ కాంచీ దామము అంబిక నడుముకు అలంకరించబడింది కాబట్టి, అంబిక నడుము ఎంతో పెద్దది అయి ఉండవచ్చునేమో అన్న స్ఫురణ కలుగుతుంది. కానీ, నిజానికి ఆమె నడుము ఎంతో పలచన. *పరిక్షీణా మధ్యే* – సన్నని నడుము, ఇది ఉత్తమ జాతి స్త్రీల లక్షణమని చెప్పబడుతోంది.

(సశేషం)

#KanchiParamacharyaVaibhavam #కంచిపరమాచార్యవైభవం
#ParamacharyaSoundaryaLahariBhashyam
3/3/18, 07:00 - Paramacharyulu: తత్వం - తత్త్వవిత్ – ఏకాత్మా

మన ఆళ్వారులు, నాయనారులు వారి పుణ్యమాయని తమిళభాషలో భక్తి గ్రంథాలను పుష్కలంగా రచించి మన కిచ్చిపోయినారు, వారు తీర్థయాత్రలుచేస్తూ, దివ్యస్థలములందు భక్తిపారవశ్యంతో పరమేశ్వరుని కీర్తించారు. మహరుల తపశ్చరణముచే పవిత్రములైనతీర్థములను, క్షేత్రములనుసేవించు కోవాలనే తలంపేగాని, ఒకరికి ఉపదేశించాలనీ, మత ప్రచారం చేయాలనీ వారు అనుకోలేదు.

మనదేశంలో 108 విష్ణుక్షేత్రాలున్నవి. ఇక శివక్షేత్రాలకు లెక్కేలేదు. భక్తిరసపానమత్తులైన, ఈ యాళ్వారులు, నాయనారులు ఆయాక్షేత్రములలో ఈశ్వరదర్శనంచేసి కండ్లవెంట ఆనందబాష్పములుకురుస్తూ పరమభక్త్యావేశంతో భగవత్కీర్తనం చేశారు. ఒక్కచోటనే కూర్చుంటే కామక్రోధాది సంసర్గం కలుగుతుందేమో అనేభయంకొద్దీవారు నిరంతరంగా తీర్థాటనచేస్తూ, ఒక్కొక్కచో ఒక్కొక్కరూపంతో వెలసిన స్వామికి గానరూపంగా హృదయాల నర్పించుకున్నారు.
పరమేశ్వరుని ఒక్కపేరుతో పిలిస్తే ఈభక్తులకు తృప్తి ఉండేదికాదు. వారిలో ఒక మహనీయుడు ''పేరాయిరం పరవి కానర్ యెట్టుం పెరుమానె'' అన్నాడు. ఈశ్వరునకు వేయి నామాలున్నవట. వేయి అనగా అనంతంగా అనిఅభిప్రాయం. మహాభారతంలో మనకు

విష్ణుసహస్రనామస్తోత్రం. శివసహస్రనామ స్తోత్రం కనిపిస్తవి. మొదటిదానిని వ్యాసుడు, రెండవ దానిని ఉపమన్యుడు రచించారు. విష్ణుసహస్రనామాలలో –

'తత్త్వం, తత్త్వవిత్ ఏకాత్మా జన్మ మృత్యు జరాధిగః' అనే పంక్తి ఒకటి వున్నది. ఈ పేళ్ళుఅలవోకగా గుచ్చి యెత్తినవికావు. వీటిలో ఒకసార్థక్యం గోచరమవుతుంది. ఈశ్వరుడు తత్త్వము - అనగాపరతత్త్వమనీ, పరబ్రహ్మమనీ అర్థం. తత్త్వమగు ఆ ఈశ్వరుడు తత్త్వవిత్తుకూడాను అంటే బ్రహ్మవేత్తయని తాత్పర్యం. బ్రహ్మమును తెలుసుకొన్నవాడు బ్రహ్మమేఅవుతాడనిఉపనిషత్తు చెపుతున్నది. కనుక తత్త్వము, తత్త్వవిత్తు ఏకాత్మగా గ్రహించాలి ఆత్మఅనేది ఒక్కటేగాని రెండుకాదు. కాబట్టి తత్త్వము. తత్త్వవిత్తు ఏకమని తెలిసికొంటే జన్మ మృత్యు జరాదులు లేని ముక్తావస్థ లభిస్తుంది. జన్మమృత్యు జరాతీతమైన ఈశ్వరునిస్థితియే జీవునకు దొరకుతుందని తాత్పర్యం. ఏకము, అద్వయము అయినపరతత్త్వమే ఈశ్వరుడు. ఆ ఈశ్వరుడే తత్త్వవిత్తు, ఏకాత్మ అని గ్రహించాలి.

అద్వయతత్త్వ సారాంశం ఈనాలుగునామముల్లో ఇంత చక్కగా సంగ్రహింపబడింది. ఈపరతత్త్వమును తెలియ జెప్పుటకే విష్ణునామములిట్లుగుదిగ్రుచ్చబడినవి. పాణినిసూత్రములు గూడా అర్థములను, శబ్దములను ఇట్లే సంగ్రహిస్తవి. ఒక సూత్రంలో నుంచి ఇంకోసూత్రం మొలుచుకువచ్చినట్లు వుంటవి. లలితా సహస్రనామస్తోత్రముగూడా ఇటువంటిదే.

అపార కరుణాసింధుం జ్ఞానదం శాంతరూపిణం
శ్రీ చంద్రశేఖర గురుం ప్రణమామి ముదావహం ॥

--- “జగద్గురు బోధలు” నుండి

#KanchiParamacharyaVaibhavam #కంచిపరమాచార్యవైభవం
3/3/18, 12:30 - Paramacharyulu: <Media omitted>
3/3/18, 16:07 - Paramacharyulu: ఏడవ శ్లోక భాష్యం - రెండవ భాగం

ఎనిమిది జానల శరీరంలో శిరస్సు ప్రధానమైనది కదా! అసలు ముఖం అన్న పదం నుండే ముఖ్యమనే పదం పుట్టింది. అంబిక ముఖమెలా ఉంది ? శరత్కాలపు చంద్రునివలె ఉందట. *పరిణత శరచ్చంద్ర వదనా* – శరత్కాలపు చంద్రుడు ఎంతో ప్రకాశవంతంగా ఉంటాడు. వెన్నెల పిండారబోసినట్లుందంటామే అది ఆ కాలంలోని వెన్నెల గురించే! ఆ కాలంలో రాత్రిపూట వాతావరణం ఎంతో చల్లగా, ఆహ్లాదంగా ఉంటుంది. *పరిణత* అంటే పూర్తిగా పరిణతి చెందినదన్నమాట.

అంబిక ముఖము శరత్కాల పౌర్ణమి చంద్రునివలె ప్రశాంతంగా ఉంటుందట. చంద్రుని బోలిన అంబిక ముఖము కరుణ అనే వెన్నెలను కురిపిస్తుందన్న మాట. ఆచార్యులవారు అరవైమూడవ శ్లోకంలో *స్మితజ్యోత్స్నాజాలం తవ వదన చంద్రస్య పిబతాం* అంటారు.

ఒక దేవతామూర్తిని, ఆ మూర్తికి ఎన్ని చేతులున్నదీ, ఏ ఏ ఆయుధాలు ధరించినదీ అనే విషయాల ఆధారంగా గుర్తిస్తారు. *ధనుర్బాణాన్ పాశం సృణిమపి దధానా కరతలైః* - ఆచార్యులవారు వర్ణించిన దేవతామూర్తి ఆ నాలుగు చేతులలో – విల్లు, బాణాములు, పాశము, అంకుశములను ధరించింది. శ్రీవిద్యాధిదేవత అయిన లలితా త్రిపుర సుందరికి లేదా కామేశ్వరికి చెందిన గుర్తులు ఇవి. పై రెండు చేతులలో పాశము, అంకుశము, క్రింది రెండు చేతులలో ధనుర్బాణములు ఉంటాయి. ఈ ధనుర్బాణములు మన్మథునికి మాదిరి చెఱుకువిల్లు, పూలబాణములే!!

*రాగద్వేషములు* – లోతుగా పరిశీలిస్తే మన లౌకిక జీవనమంతా ఈ రెంటి ద్వారానే చుట్టుముట్టబడినట్లు అర్థమవుతుంది. ఇవే కామక్రోధములు. ఈ రెంటినీ అదుపులో ఉంచుకోవాలి. చిత్రమేమంటే ఈ రెండిటి పుట్టుక అంబిక లీలే! ఆమె అనుగ్రహం వల్లనే అంతమవుతాయి. ఈ విషయం స్ఫురణలో ఉంచుకొన్నపుడే ఆ రెంటినీ అదుపులో ఉంచుకోవడం సాధ్యమవుతుంది. అంబిక చేతిలో పాశమున్నదే అదే ఈ రాగము లేక కామము. ఇక అంకుశమున్నదే అది ద్వేషము లేక క్రోధము. అంబిక వేయిపేర్లలో *రాగస్వరూప పాశాఢ్యా*, *క్రోధాకారాంకుశోజ్జ్వలా* అన్న రెండు పేర్లున్నాయి.

ఆశ పాశము వంటిది. మనం వాడుకలో కూడా ఆశాపాశం అంటూ ఉంటాం. ఈ ఆశాపాశం మనలను కట్టిపడవేస్తుంది. ఇక క్రోధము అంకుశం వంటిది. అది గుచ్చుకొని ఉసిగొల్పుతుంది. మన కోపాన్ని ఇతరుల లక్ష్యపెట్టకపోవచ్చు. కానీ అది మనకు చేసిన పుండు సలుపుతూనే ఉంటుంది. ఎవరి కోపం వారికే పొడుచుకొంటుంది.

ఆధునిక విజ్ఞాన వేత్తలు కూడా కోపము ఎంతో శక్తిని వృథా చేస్తుందని చెబుతున్నారు. శాస్త్రంలో చెప్పబడిన ఇంకో విషయంతో కూడా వారు ఏకీభవిస్తున్నారు. మనకు నచ్చని విషయాలపై నిప్పులు కక్కుతూ మనం వృథా చేసే సమయం కన్నా మనకు ఇష్టమైన విషయాలలో చిక్కుకు పోయినప్పుడు ఎక్కువ శక్తి వృథా అవుతుందట. కామం మనకు హితంగా ఉన్నట్లు కనిపిస్తూ గోతులు తవ్వే సామర్థ్యం కలది.

(సశేషం)

#KanchiParamacharyaVaibhavam #కంచిపరమాచార్యవైభవం
#ParamacharyaSoundaryaLahariBhashyam
3/4/18, 07:11 - Paramacharyulu: గుర్రప్పందెం - గుణపాఠం

పరమాచార్య స్వామివారి దర్శనానికి ఒకరోజు మధ్యవయస్కుడైన ఒక పెద్దాయన వచ్చారు. అతను చూడడానికి చాలా దిగాలుగా ఉన్నాడు. అతని కుమారుడు మంచి ఉద్యోగంలో ఉన్నాడు. చాలా మంచి సంపాదన, అయినా ఇంటికి ఒక్కపైసా కూడా రాదు. ఇంటికి

వెళ్ళేదారిలోనే అంతా అయిపోతుంది. గిండి రేస్ కోర్సులో గుర్రప్పందాల్లో మొత్తం పోగొట్టుకుంటాడు.

“కొన్నిసార్లు కార్యాలయం డబ్బుని కూడా దీనికోసం ఉపయోగిస్తాడు. అతని గౌరవం కాపాడడానికి అతని అధికారులకి నేను డబ్బు కడుతుంటాను పెరియవ. వాడి సంసారం కూడా సవ్యంగా లేదు. ఆ గుర్రప్పందాలు వాణ్ణి దయ్యంలాగా పట్టుకున్నాయి” అని స్వామివారి ముందు వాపోయాడు.

మహాస్వామివారు వారి అబ్బాయి గురించి మరికొన్ని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆ పెద్దాయనను అనునయించి ఇంటికి పంపించారు. తరువాత మహాస్వామివారు ఆ వ్యక్తి పనిచేసే కార్యాలయంలోని ఒక భక్తికలిగిన సహోద్యోగిని పిలుచుకు రమ్మని శిష్యుణ్ణి ఆదేశించారు. ఒక వ్యక్తిని తీసుకువచ్చాడు ఆ శిష్యుడు. అతను స్వామివారి ముందు భక్తితో చేతులు కట్టుకుని నిలబడ్డాడు.

“మీ కార్యాలయం దగ్గరున్న పోలీస్ స్టేషనుకు వెళ్ళి, అనధికారికంగా ఒక రక్షక భటుణ్ణి మీ కార్యాలయానికి రమ్మని చెప్పు. ఆ గుర్రప్పందాలకు వెళ్ళే అతను బయటకు వెళ్ళగానే ఈ రక్షక భటుణ్ణి అతనితో, కార్యాలయం లెక్కలలో అవకతవకలకు పాల్పడినందుకు నిన్ను అరెస్టు చెయ్యడానికి ఉత్తర్వులు ఉన్నాయని భయపెట్టమని చెప్పు. ఇలా చెయ్యమని నేను చెప్పానని ఆ రక్షక భటుడుకి చెప్పు“ అని స్వామివారు ఆ సహోద్యోగిని ఆదేశించారు.

పరమాచార్య స్వామివారి ఆజ్ఞానుసారమే అన్నీ జరిగాయి. అతని మాటలకు ఆ జల్సారాయుడు భయపడిపోయాడు. “నిన్ను ఇంకొక్కసారి రేస్ కోర్స్ దగ్గర చూసానంటే అదే నీకు అరెస్ట్ వారెంట్” అని గట్టిగా మందలించి వెళ్ళిపోయాడు ఆ రక్షక భటుడు. ఆనాటి నుండి ఆ యువకుడు ‘గిండి’ అనే పదం వింటేనే భయపడిపోయేవాడు.

ఇది మహాస్వామివారి ఆక్షేపణా? లేక దయా?

అపార కరుణాసింధుం జ్ఞానదం శాంతరూపిణం
శ్రీ చంద్రశేఖర గురుం ప్రణమామి ముదావహం ॥

#KanchiParamacharyaVaibhavam #కంచిపరమాచార్యవైభవం
3/4/18, 14:33 - Paramacharyulu: <Media omitted>
3/4/18, 16:01 - Paramacharyulu: ఏడవ శ్లోక భాష్యం - మూడవ భాగం

అంకుశమంటే మనకు ఏనుగు గుర్తుకువస్తుంది కదా! దానిని ఇనుప గొలుసులతో కట్టి వేస్తారు. మన కామక్రోధములు కూడా పరిమాణంలో, బలంలో ఏనుగంతటివి. అందువలననే వాటిని పాశాంకుశములతో అదుపులో పెట్టాలి. అంటే కామక్రోధములు ఉద్భవించే మనస్సును అదుపులో పెట్టుకోవాలన్న మాట. శివానందలహరిలో ఆచార్యులవారు మనస్సును *మదించిన ఏనుగు*తో పోలుస్తారు.

కామక్రోధములు పుట్టుక అంబిక లీలలో ఒక భాగమే అయినా ఆమె ఈ పాశాంకుశములు ధరించడానికి కారణం మరో విధంగా కూడా చెప్పుకోవచ్చు. ఆమెను ప్రార్థిస్తే మనకు ఆమెపై ప్రేమపాశాన్ని (భక్తిని) ప్రసాదించి ఇతర పాశముల నుండి దూరంగా లాగివేయగలదు. *అమ్మా* అంటూ ఆమె పాదాలను చుట్టుకొనిపోతే ఇతర బంధాల నుండి విముక్తి కలిగించే బంధాన్ని ప్రసాదించగలదు. అలానే ఆమె కోపాంకుశంతో మన క్రోధాల్ని అదుపులోనికి తీసుకొని రాగలదు.

లలితా సహస్రనామ స్తోత్రంలో పాశాంకుశముల తరువాత ధనుర్బాణాలు చెప్పబడ్డాయి. ఇలా చెప్పడంలో ఒక ఔచిత్యం ఉంది. చెఱుకువిల్లు, పుష్పబాణములు కామములలో బలిష్ఠమైనదైన లౌకిక శృంగారమునకు చెందినవి. అవి మన్మథునకు ముఖ్యమైనవి. పాశం అన్ని కామములకు, అంకుశము క్రోధమునకు చెప్పబడినవి. అంబిక విషయంలో మన్మథునకు ముఖ్యమైన ధనుర్బాణాలు చెబితే ఆమె ప్రాముఖ్యత ఎలా అర్థమవుతుంది. అందువలననే పాశాంకుశములు ముందు చెప్పబడ్డాయి. మన పుట్టుకకు, బంధానికి కారకుడు మన్మథుడని బాహ్యదృష్టికి తోచినప్పటికీ ఈ రెంటికీ వెనుక ఉన్నది అంబిక. మన్మథుని చేతిలోని విల్లు, బాణములు మనకు బంధాల్ని కలిగిస్తే అవే ఆయుధాలు అంబిక చేతిలోనికి మారినప్పుడు బంధ విముక్తికి సమర్థములన్న విషయం గుర్తించాలి.

ఏదో ఒక ఆశ జనించి అది తీరకపోతే క్రోధం వస్తుంది. ఈ ఆశ అంబిక పాదములపైన తీవ్రభక్తిగాను, క్రోధం కోపం మీద కోపంగానూ చెప్పుకొంటే ఈ పాశాంకుశాలు మన బంధముక్తికి హేతువులవుతాయి.

లలితా సహస్రనామ స్తోత్రంలో రాగానికి పాశమును, క్రోధమునకు అంకుశమును చెప్పిన తరువాత ధనుర్బాణాలకు చెందిన *మనోరూపేక్షుకోదండా, పంచతన్మాత్రసాయకా* అనే రెండు నామములు చెప్పబడ్డాయి. మనస్సుకు ప్రతీక అయిన కోదండాన్ని, తన్మాత్రలకు (శబ్ద స్పర్శ రూప రస గంధములు) ప్రతీకలయిన పుష్పబాణములను ధరించిందట అంబిక.

మన్మథునికి చేతిలో రెండే ఆయుధాలున్నాయి. ఆ ఆయుధాలు అంబిక చేతిలో కూడా ఉన్నాయి. అయితే మన్మథుని చేతిలో ఉన్నపుడు అతని చేత విడువబడిన బాణములు మానవులను ఇంద్రియలోలులను చేస్తాయి. అదే అంబిక చేతిలో ఉన్న ధనస్సు మనలో ముక్తి కాంక్షను కలిగిస్తుంది. పంచేంద్రియములను అంబిక వైపుకు త్రిప్పి వాటిని పవిత్రం చేయడానికి ఆ బాణములు ఉపయోగితాయి. అవి అంబిక గురించిన స్తోత్రములను వినాలనే ఆకాంక్షను ప్రోది చేస్తాయి. ఆమె పదకమలములను స్పృశించాలనే కోర్కెను జనింపజేస్తాయి. ఆమె పాదములు కడిగిన అమృతోదకాలను పానం చేయాలనే ఇచ్ఛను కలిగిస్తాయి.

(సశేషం)

#KanchiParamacharyaVaibhavam #కంచిపరమాచార్యవైభవం
#ParamacharyaSoundaryaLahariBhashyam
3/5/18, 07:01 - Paramacharyulu: సమస్యలు - సాలిగ్రామ పూజ

ఒకసారి శ్రీవైష్ణవ భక్తురాలు ఒకామె పరమాచార్య స్వామివారి దర్శనానికి వచ్చింది. ఆమె సాంప్రదాయం ప్రకారం స్వామికి నమస్కరించి ఎదురుగుండా నిలుచుంది. అప్పుడు అక్కడ అంత రద్దీగా లేదు. ఆవిడ కళ్ళల్లో నిరీక్షణ, నమ్మకం, ఆరాటం ఎవరైనా ఇట్టే కనిపెట్టేయొచ్చు.

ఆమె సంసారం సమస్యల సుడిగుండంలా ఉంది. కుటుంబం మొత్తం రోగాలతో అల్లాడుతోంది. కూతురికి పెళ్ళై ఏడెనిమిదేళ్ళు గడచినా పిల్లలు కలగలేదు. మరో అమ్మాయికి యుక్తవయస్సు దాటిపోతున్నా పెళ్ళి కావడం లేదు. చదువుపై శ్రద్ధ పెట్టక పాడైపోతున్న కుమారుడు, ఆర్థిక సమస్యలు ఇలా ఎన్నో. ఆమె వీటికి పరిహారం కోసమై కేరళలోని ఒక జ్యోతిష్య నంబూద్రిని సంప్రదించి సలహా అడుగగా, పితృదేవతలను నిర్లక్ష్యం చేయడం వలన కలిగిన దుష్ఫలితాలు అని తెలుసుకుంది. పితృదేవతలకి సరిగ్గా కర్మలు చేయకపోవడం వల్ల ఆమెని రామేశ్వరం వెళ్ళి ఆ కార్యాలు చేయమని చెప్పారు. తను శ్రీవైష్ణవ సంప్రదాయానికి చెందినందున రామేశ్వర యాత్ర, అక్కడ చేసే ప్రాయశ్చిత్త కర్మలూ వారికి నిషిద్ధం.

“నాకు ఏం చెయ్యాలో పాలుపోవడం లేదు. నా సాంప్రదాయాన్ని ధిక్కరించలేను. అలా అని నా సమస్యలకు పరిష్కారం తెలిసీ, చెయ్యకుండా ఉండలేను. నా సమస్యలు తొలగిపోవాలి. పెరియవ నాకు ఒక మార్గం చూపాలి” అని ప్రాధేయపడింది.

”మీరు టెంకలై తెగకు చెందినవారా?” అని అడిగారు స్వామివారు.

“అవును పెరియవ”

“ఉప్పునీళ్ళు, గోమయం కలిపిననీరు, జటల నుండి జారిన నీరు మీ సాంప్రదాయమునకు వర్జనీయములు కదా”

“అవును పెరియవ. ఉప్పునీరు, పేడనీళ్ళు, జటలనీరు మా అమ్మగారు పరిగణించేవారు కాదు”

“అవును సరిగ్గా ఇదే! రామేశ్వరంలో సముద్రస్నానం ఉప్పునీరు, పంచగవ్యప్రాశనం పేడనీరు, గంగా స్నానం పరమశివుని జటలనుండి వచ్చిన నీరు. మీ సాంప్రదాయం అనుమతించకపోతే మీరు రామేశ్వరం వెళ్ళవలసిన పనిలేదు. ప్రతిరోజూ ఉదయం శాస్త్రప్రకారం సాలిగ్రామ పూజ చేసి తీర్థప్రసాదాలు స్వీకరించండి. ఏకాదశి రోజు ఉపవాసం ఉండండి. పళ్ళు, పాలు, ఉడికించిన దుంపలు తీసుకోవచ్చు. ఆరోజు మీ భర్త ద్వాదశ పుండ్రాలను ధరించి పూజ చెయ్యాలి. మరుసటి రోజు ద్వాదశినాడు తెల్లవారుఝామునే పూజ ముగించి తులసీ తీర్థము, ప్రసాదం స్వీకరించి పారణ చేయండి. ప్రతిరోజూ ఒక ఆవుకి చేతినిండుగా గ్రాసం పెట్టండి. ఇవన్నీ చేస్తే అన్ని సమస్యలకు పరిష్కారం దొరుకుతుంది” అని చెప్పారు స్వామివారు.

మహాస్వామివారు ఇలా ఒక్కొక్కమాట చెబుతుంటే, ఆమె పెదవులు అదురుతుండగా, బయటకు రాని నీళ్ళవల్ల కళ్ళు మెరుస్తుండగా వింటోంది. “ఇది నాకు సాక్షాత్తు నారాయణుడే ఆజ్ఞాపించినట్టుగా భావిస్తాను. పెరియవ రామేశ్వరం వెళ్ళమంటారేమో అని నేను చాలా కలవరపడ్డాను. మహాస్వామివారి మనస్సు స్ఫటికం వలె స్వచ్ఛమైనది. నాకు ఒక మంచి మార్గాన్ని చూపారు” అని అన్నది.

ఆమె ప్రసాదం తీసుకొని వెళ్తున్నప్పుడు ఆమె ముఖం స్ఫటికంలా చలా నిర్మలంగా భాసించింది.

[విష్ణువును ఆరాధించే తమిళ బ్రాహ్మణులు వైష్ణవులు. వీరినే అయ్యంగార్లు అని అంటారు. అయ్యర్లు శైవులు. వైష్ణవులలో టెంకలై, వడకలై అని రెండు తెగలు. వడకలై సాంప్రదాయాన్ని ప్రారంభించినవారు శ్రీ వేదాంత దేశికులు. ‘U’ నామం ధరించేవారు వడకలై వారు, ‘Y’ నామం ధరించేవారు టెంకలై వారు]

అపార కరుణాసింధుం జ్ఞానదం శాంతరూపిణం
శ్రీ చంద్రశేఖర గురుం ప్రణమామి ముదావహం ॥

--- శ్రీమఠం బాలు మామ, మహా పెరియవళ్ - దరిశన అనుభవంగళ్

#KanchiParamacharyaVaibhavam #కంచిపరమాచార్యవైభవం
3/5/18, 16:17 - Paramacharyulu: ఏడవ శ్లోక భాష్యం - నాల్గవ భాగం

ఆమె పాదములు పూజించిన పుష్పములను గ్రహించి వాసన చూడాలనే ఆశను రేకెత్తిస్తాయి. ఆ తల్లి పద్మము పోలిన పాదములను మరీమరీ చూడాలనే తపనను కలిగిస్తాయి. మరి అమ్మ ఇంద్రియ సుఖాలనేకాదు అతీంద్రియమైన అత్యంతికమైన సుఖాన్ని కలగచేసే కరుణ కలిగినట్టిది.

దొంగ చేతిలో ఉన్న కత్తి మనను భయపెట్టి దోచుకోవడానికి ఉపయోగిస్తే, మన చేతిలోని కత్తి అతన్ని పరుగెత్తించేట్లు చేస్తుంది కదా!! మన్మథుని చేతిలో చెఱుకు వింటి రసం, పూల బాణముల నుండి స్రవించే తేనె కామరసంగా మారి లోకాన్ని కామమోహితుల్ని చేస్తుంది. అంబిక చేతులలో ఇదే వస్తువులు కరుణామృతాన్ని ప్రవహింపచేస్తాయి. తద్వారా మన హృదయాలలో ఆ తల్లిపై భక్తి ఏర్పడుతుంది. ఆమే కరుణా ప్రవాహం, మన భక్తి కలసి మన అస్తిత్వాన్ని మరపింపచేసి ముక్తిలోని బ్రహ్మానందాన్ని అనుభవింపచేస్తాయి.

మనను అంధకారంలో ఉంచేది మాయ. మన ఉనికిని మరిపింపచేసి కరిగింపచేసేది జ్ఞానం. ఒక్కమాటలో చెప్పాలంటే అంబిక చేతిలోని బాణాలు మన విషయ వాంఛలను అదుపులో పెడితే, ఆమె చెఱుకు విల్లు మన మనస్సును లయం చేస్తుంది. ఇది జరిగినప్పుడు ముక్తి సిద్ధిస్తుంది.

ఈ అయిదు బాణముల చేత పవిత్రము చేయబడిన పంచేంద్రియములు, చెఱుకు విల్లు చేత శుద్ధి చేయబడిన మనస్సు కూడి ఆరుకరణములుగా పిలవబడుతున్నాయి. తేనెటీగకు ఆరుకాళ్ళు ఉన్న విధంగా మానవునకు ఆరు కరణములు. తన ఆరుకాళ్ళతో తేనెటీగ పద్మంపై ఎలావాలుతుందో అలా మనమీ ఆరు కరణములతో అంబిక పాదపద్మములపై వాలిపోవాలి. ఆమె పాదములను పట్టుకొంటే మన రాగద్వేషములు కూడా అణగారిపోతాయి.

ఆచార్యులవారు అంబిక పాదములే వరదాభయములను ప్రసాదిస్తాయని పూర్వమే చెప్పారుకదా!! మళ్ళీ ఆమెకు నాలుగు చేతులెందుకు. ఆమె మహారాజ్ఞి!! రాజ చిహ్నములైన ధనుర్బాణాలను పట్టుకోవాలి. మరి ఆమె సామ్రాజ్యమెక్కడ ? అది జ్ఞాన సామ్రాజ్యం. రాగద్వేషాలను రూపు మాపి జ్ఞానాన్ని ప్రసాదిస్తుందని తెలియజేయడానికి పాశాంకుశములున్న చేతులు చూపబడ్డాయి. మీదు మిక్కిలి నాలుగు చేతులు ఆమెకు లోకాతీతమైన సౌందర్యాన్ని కలగజేస్తున్నాయి. ధనుర్బాణాలు మనంతటా మనం సమర్పించుకోవలసిన ఇంద్రియాలను, మనస్సును ఆమె పాదాలవైపుకు త్రిప్పుతాయి.

ఈ ధనుర్బాణాలతోనే అంబిక శుద్ధజ్ఞానమైన ఈశ్వరుని ప్రపంచ క్షేమం కోసం కామం వైపునకు మరలించి ఆయనను కరుణామూర్తిగా మలచింది. తాను శివకామసుందరి అయింది. యావజ్జీవజాలాన్నీ వారి ఇంద్రియాలను, మనస్సును తన చేతిలో ఉంచుకొని ఇవే ఆయుధాలతో రక్షిస్తోంది. ఆచార్యులవారు ఈ ధనుర్బాణాలతో చేయబడే లీల అమ్మ పాదములే చేయగలవంటున్నారు.

(సశేషం)

#KanchiParamacharyaVaibhavam #కంచిపరమాచార్యవైభవం
#ParamacharyaSoundaryaLahariBhashyam
3/6/18, 07:08 - Paramacharyulu: వర్ణవ్యవస్థ

మన వర్ణవ్యవస్థ అనర్థకారియనీ, దీనివల్ల ద్వేషములు ప్రబలుతున్నవిగనుక, దీనిని నిర్మూలించవలసివుంటుందనీ - అధికార దూర్వాహులయిన పెద్దలు అంటూవుండటం నేడు పరిపాటి అయిపోయింది. నిజానికి వర్ణ ద్వేష మనేది ఇటీవలనే పుట్టుకవచ్చింది. ఈ ద్వేషం తనంతట తానే బయలుదేరిందా? మన పూర్వపరిపాలకులవల్ల ఇది దాపరించిందా? అనే విచారణతో ఇపుడు పనిలేదు. వర్ణములమధ్యవిరోధములు పుట్టిన మాట నిజం. వర్ణ ద్వేషవాయు ప్రచారం జరుగుతున్న మాటా నిజమే. ఈ వర్ణ ద్వేషంకంటె మతద్వేషాలు మరీప్రబలంగా వున్నవి. ఈ మతద్వేషాలు నేటివికావు. వీటికి పూర్వచరిత్ర చాలావుంది. మతద్వేషా లలా వుండగా, ఒక మతములోనే శాఖకూ శాఖకూమధ్య సంఘరణలు పుట్టతూవచ్చినవి. క్రుసేడ్సనే వెనుకటి మతయుద్ధాలలా వుండగా, విమతస్థులపట్ల కాథలిక్కులు జరిపిన అత్యాచారాలూ, షియా, సున్నీవిరోధాలు, మనదేశంలో హిందూముస్లిము సంఘరణలు, బర్మాదేశంలో బౌద్ధులకూ ముస్లిములకూ కొట్లాటలు, తెంగల వడఘల విరోధాలు, శైవవైష్ణవ ద్వేషాలూ ఇవి అన్నీ ఏనాటినుంచో వుంటున్నవి. ఈయథార్థ సంఘటనలను చూచినమీదట - రక్తపాతాలకు, యుద్ధాలకు కారణమవుతున్న ఈవర్ణభేదాలను, మతభేదాలను నిర్మూలించవలెననే ఆలోచన ఒకటి బయలుదేరింది. స్థూలంగాచూస్తే ఈ ఆలోచన న్యాయమైన దనే తోస్తుంది.

మరి ఈవర్ణములకంటె, మతములకంటె అధికవిద్వేషాలను భాషాభేదాలు, రాజకీయ మతభేదాలు కల్పిస్తున్నవికదా, వాటి నేమిచేద్దామంటారు? మద్రాసు రాష్ట్రాన్నే చూడండి! ఇచట వర్ణములకంటె భాషలే ప్రబలవిరోధములుగా కనిపిస్తున్నవి. ప్రస్తుత మీ భాషావివాదం, దాని పుణ్యమాయని ఖండన మండనములతోనే సరిపెట్టుకొంటున్నది. ఉత్తరదేశమం దీవివాదం అంతటితో వూరుకొనక దొమ్ములాటలకుదారితీస్తున్నది. ఇలా వివాదాలకు, సంఘరణలకు కారణమవుతూ వున్నది. కనుక అసలు భాషనే నిర్మూలించి, మూగవాళ్ళంగా వుండడమే మేలు అందామా!
పూర్వం రాజ్యలోభంచే రాజులు పరస్పరం యుద్ధాలకు దిగేవారు. ఈనాడు చూడబోతే పరిపాలనావిధానం ఎలా వుండాలి. అనే మతభేదంవల్ల రాజ్యాలన్నీ రెండు తెగలుగా చీలి పరస్పరం ఢీకొనచూస్తున్నవి. ప్రజాసమ్మతిమీదనే పరిపాలనం నడవాలి అని అందరు అంగీకరిస్తారు. మరి, అమెరికా 'తనది ప్రజాసమ్మత ప్రభుత్వ' మంటే 'కాదు, అది సాహుకార్ల ప్రభుత్వ' మని ఆక్షేపిస్తుంది రష్యా. అలాగే రష్యాలో ప్రజా ప్రభుత్వంగా చెలామణి అయేదాన్ని కమ్యూనిజమనిఅమెరికా ఆక్షేపిస్తుంది. పూర్వపు రాజుల అహంకారంలాగే నేటి యీ రాజకీయ మతదురహంకారం స్పర్ధలను తెచ్చిపెట్టుతున్నది. ఈ రాజరికపు మతభేదాలతో మాకు సంబంధం లేదు. మే మడిగేది ఒక్కటే- ఈ రాజకీయభేదాలు వివాద కారణంగా వుంటున్నవి కనుక మొదట ప్రభుత్వమనేదాన్నే రూపుమాపి వెనుకటి ఆటవికావస్థకు మాత్స్యన్యాయానికి తరలిపోవలసిందేనా? అని.

ఒకరి మనస్సొకరికి తెలియజెప్పికోవాలంటే ఏకమో అనేకమో భాషలు ఉండితీరాలి. మన దేశంలోనే చూడండి! ప్రతి 500 మైళ్ళకు ప్రాంతీయభాషలు భిన్నంగా కనిపిస్తున్నవి. అంతే కాదు, ప్రతిభాషా 500 ఏండ్ల కొకతూరి పెద్దగా మార్పు చెందుతున్నట్లు కనిపిస్తున్నది. కన్యాకుమారి నుంచి హిమాలయాలదాకా, ప్రాచీన కాలమునుండి నేటిదాకా పరికించి చూస్తే ఈమార్పులు స్పష్టంగా గోచరిస్తవి. భాషవల్ల మనకెంతో ప్రయోజనం వుంటున్నది. అట్టి భాషను తుడిచి పెట్టవలెనంటే ఎవరూ సమ్మతించరు. భాషలు వ్యవహారం కోసం పుట్టినవి కాని విరోధాల కోసం పుట్టలేదు కదా. కాబట్టి బుద్ధిశాలురైనవారు ఈ భాషాద్వేషాలకు కారణం ఏమైయుటుందా అని పరిశీలించి, ఆకారణాన్ని పరిహరించుకోవాలిగాని భాషనే విడనాడరు.

తమిళనాడు ఇతర భాషల కెప్పుడూ ఆతిథ్యమిచ్చి ఆదరిస్తూనే వచ్చింది. ఆంధ్ర మహారాష్ట్ర దేశాలకు దక్షిణదేశస్తు లేనాడో వలసపోయినారు. అలా వచ్చినవారినే తెలుగువారు ద్రావిడులని పిలుస్తారు. ఆ ద్రావిడులకు ఒక్క ముక్కయినా తమిళం రాదు.

మహారాష్ట్రానికి వెళ్లిన ద్రావిడులుకూడా అచటి భాషనే అవలంబించారు. అట్లే ఆంధ్రులు, మహా రాష్ట్రులు, ఘూర్జరులు తమిళదేశంలో పాతకాపులైనారు. తమిళనాడులో ఎన్నో తరాలు గడచినా నేటికీ ఆయాదేశస్థులు తమ తమ మాతృభాషలను విడనాడలేదు. వారు తమిళభాషలోనూ పండితులై అనేక తమిళగ్రంధాలు రచించారు తమిళులు గూడా ఏ దేశం వెళ్లినా అచటిభాష నిట్టే అలవరచుకొంటారు. వస్తువుల చల్లదనాన్ని కాపాడే శైత్యకరండం వంటిది తమిళనాడు. తన మరుగుజొొచ్చిన భాషలనది కాపాడుతుంది. ఇతర ప్రాంతములను చేరిన భాషలు అట్లుకాక తమ స్వరూపాన్ని కాల క్రమాన కోల్పోయినవి. ఇతరభాషల నిలా ఆదరించి రక్షిస్తూవచ్చిన ప్రశస్తకీర్తిని రక్షించుకొనేభారం తమిళులపై వుంది. ఇతర భాషలకంటె తమభాష గొప్పదనే భావముంటే ఈభాషావైమనస్యంనశించదు. భాషలుపరస్పరం సౌహార్దంతో చెట్టలు పట్టుకొని మెలగుతూ ఇతర భాషలలోని భావరత్నాలతో తమ్ము నలంకరించకొంటూవుంటే సకల భాషలు సంపన్నము లవుతవి. భిన్న భాషలవారికపుడు పరస్పరాభిమానాలు నెలకొంటవి. భాషాదురభిమానాలు సమసి పోవుట కిదేమార్గం.

ఒక మంచివస్తువులో కొంత చెడ్డకూడా కనిపిస్తుంది. నిజమే. అపుడాచెడ్డను పరిహరించి మంచిని కాపాడుకోవడమే బుద్ధిమంతుల లక్షణం. మతవిషయాన, వర్ణవ్యవస్థవిషయాన కూడా ఈమార్గమునే అవలంబించాలి. వర్ణవ్యవస్తనేపరిశీలించండి సంఘవ్యాపారము సుష్ఠుగాజరగడంకోసం పుట్టిందా వ్యవస్థ వృత్తివిభజనచేసి ఎవరిధర్మాన్ని వారు నిర్వహిస్తూ, సమిష్టిక్షేమాన్ని సాధించడమే దాని ఉద్దేశం ఆయావృత్తుల కనుగుణమైనఆహారవిహారములు, నిత్యానుష్ఠానాదులు, జీవన విధానము ఏర్పాటయినవి. ఆశ్రమ వ్యవస్థకూడాఇటువంటిదే. ఒకవర్ణము తక్కినవానికంటె అధికమని చెప్పికొనుట సమర్థనీయం కాజాలదు. వివాహవిషయంలో, స్వీయాచారములవిషయంలో కొన్నికట్టుబాట్లువున్నవి. అంటే, అట్టివిలోకమంతటా వున్నవే. ఐరోపీయులగు క్రిష్టియనులు, నీగ్రోక్రిష్టియనులతో సంబంధభాంధవ్యముల నొల్లరు. ఆ కారణాన క్రయిస్తవమతము పనికిమాలినదని రూపుమాపవచ్చునా? కేవలం స్వకీయములైన ఆచారభేదము లున్నంతమాత్రాన వర్ణవ్యవస్థను ఖండించుటయు న్యాయముకాదు. ఇటీవలికాలమందుగాని, పరంపరా గతంగాకాని కొన్ని దురాచారములు ప్రవేశించిఉన్నట్లయితే వాటిని పరిహరించుకోవచ్చు ఇంతకు, ఒక వర్ణంకంటె మరొకటి అధికమనుకొనుటయే ఈ వివాదమంతటికి మూలంగా కనిపిస్తున్నది. ఇతరుల కష్టనష్టాలను, విపత్తులను మనవిగా ఎంచుకోవడం అలవాటుకావాలి. మనము ఇతరవర్ణస్థుడు కష్టాలలోవున్నప్పడు మనకష్టాలమాట అలావుంచి. ముందు అతని నాదుకోవాలి. శాస్త్రవిహితమైన ఇట్టి ఉదారదృష్టి అలవడితే నేటి పొరపులు సమసిపోయి సామరస్యం ఏర్పడుతుంది. 'సర్వేజనా స్సుఖినో భవంతు' అనేదే మనకు ధ్యేయం.

ఇక మతవిషయమంటారా ఇతరమతాలను, శాఖలను ఆక్షేపించటాన్ని ముందుగా మనం వర్జించాలి. ఇతర మతస్థుల నాక్షేపించేముందు ఎవరికివారు తమ మతధర్మాలను చక్కగా ఆచరిస్తున్నారో లేదో పరీక్షించుకోవాలి. మానవునకు ఆత్మ వికాసాన్ని ఘటించి, దివ్యత్వం సమకూర్చడంకోసం మతమనేది ఏర్పడింది. పరులకుపదేశించేముందు మనం కామక్రోధద్వేషాదులను జయించాలి. సమస్తమతాలను అడకువతో పరిశీలించి, వానియందున్న మంచిని గ్రహించుకోవాలి. అట్టి సహృదయత్వం ఏర్పడితే వోధబీజములు నశిస్తవి. విరోధకారణములుగా కన్పించే ఈ మతములప్పుడు ఆత్మకు పుష్టిని, ధర్మోత్సాహాన్ని సమకూరుస్తవి.

అనేకకాష్ఠములను ఒక్క త్రాడుబంధించి వుంచుతుంది. వానిలో ఒక్కకట్టెను వెలికిలాగితే, బంధనం సడలిపోయి. కట్టెలన్నీ విడిపోతవి. అలాకాకుండా ఆకట్టెలను ముందునాలుగైదు చిన్న కట్టెలుగాకట్టి. పిమ్మట అన్నిటినీఒకత్రాటితో బంధిస్తా మనుకోండి. అపుడుఒకకట్టెను జారలాగినా, తక్కనవిఆ యేక బంధమున సురక్షితంగా వుంటవి. అలాగే సమానధర్ములైన మానవులను వర్ణములనే చిన్నకట్టలుగా కట్టి, పిమ్మట వాని నన్నిటిని మతమనే ఏకసూత్రముతో బంధించాలి వర్ణములు, మతము అనేవి సంఘమును ఇలా ఏకబంధాన పరిరక్షిస్తున్నవి. మతమనే ఆ పెద్దమోపులో ఇమిడిన వర్ణములనే చిన్నకట్టలు పరస్పరసహకారభావంతో, ద్వేషమత్సరాలనువిడనాడి స్వక్షేమమును సమిష్టిక్షేమమును సాధించుకోవడంకోసమే మత వర్ణమలు ఏర్పడినవి. మనమిట్లు పాపచింతా విముఖలమై, మానవ సౌందర్యాన్ని ఆరాధిస్తూ, ఈశ్వరానుగ్రహానికి పాత్రులం కావాలి.

వర్ణమునుబట్టి, పదవినిబట్టి ఎవరును అహంకరింపరాదు. మన వర్ణ ధర్మాలను గూర్చిన విచారణతప్ప ఎక్కువతక్కువలను తలపెట్టగూడదు. ఏ వర్ణమువారైనను ఈశ్వరభక్తిచే ఈశ్వర పదాన్ని అధిష్టింపగలరు వర్ణాభిమానములు నశింపవలెనంటే స్వధర్మానురక్తి భక్తిజ్ఞానములే సాధనాలు. వివేక విజ్ఞానధనులైన పవిత్రులు - భక్తిజ్ఞాన ప్రపూర్ణులగుటచే వర్ణాభిమానం వారి నంటదు. మానవుని కర్మప్రవృత్తియందు ధర్మం లోపించగానే, హృదయంభక్తిశూన్యము బుద్ధిజ్ఞానశూన్యం అవుతుంది. అంతట వర్ణాభిమానాలు ప్రకోపిస్తవి. వర్ణములు నశించాలని చెప్పే పెద్దలు ధర్మమును, భక్తిని, జ్ఞానాన్ని వృద్ధిచేసుకోవాలనికూడా చెప్పవలసివుంటుది. వూరకే వర్ణ భేదాలు పోవాలి, పోవాలి అంటే అవి పెరుగుతవేకాని తరగవు మందు త్రాగేవాణ్ణి కోతినిగూర్చి తలచుకోవద్దు అన్నట్లుగా వుంటుందది. భక్తిజ్ఞానధర్మాలు వేరుదన్నుకొంటే వర్ణభేదాలు వాటంతటవే వెనుక బడిపోతవి. భక్తులపట్ల, జ్ఞానులపట్ల వర్ణభేదం చేయక వారిని ఆరాధిస్తాము. మహాత్ములైనవారు తమ్ము దాము పరమాణువులుగా ఎంచుకుంటారు. మనశాస్త్రాలు వర్ణాహం కృతిదూష్యమనీ, పాపమని చెప్పుతున్నవి. ఏ వర్ణానికి విహితమైన ధర్మాలను ఆ వర్ణం శ్రద్ధాలను ఆ వర్ణంశ్రద్ధాభక్తులతో ఆచరించవలెనేకాని స్వవర్ణాభిమానం వహించగూడదు. ఏ వర్ణమువాడైనా తన్ను నికృష్ణునిగా ఎంచుకోవాలేగాని ఉత్కృష్టత నాపాదించుకో గూడదు. శ్రీరంగ దేవాలయానికి పెద్దలు వచ్చినపుడు వారి కాలయమర్యాదలు నెరపుతారు. అపుడాపెద్దలు 'కుక్కకంటె హీనుడను' అని బదులుపలకడం ఆచారం. శైవ వైష్ణవభక్తి గీతాలలో ఈ నైచ్యానుసంధానం స్పష్టంగా గోచరిస్తూ వుంటుంది. మన తప్పులను దిద్దుకొనే వివేకాన్ని, శక్తిని పరమేశ్వరు డనుగ్రహించుగాక!

అపార కరుణాసింధుం జ్ఞానదం శాంతరూపిణం
శ్రీ చంద్రశేఖర గురుం ప్రణమామి ముదావహం ॥

--- “జగద్గురు బోధలు” నుండి

#KanchiParamacharyaVaibhavam #కంచిపరమాచార్యవైభవం
3/6/18, 12:25 - Paramacharyulu: <Media omitted>
3/6/18, 16:06 - Paramacharyulu: ఏడవ శ్లోక భాష్యం - ఐదవ భాగం

ఒక్కొక్క ఆయుధానికి ఒక్కొక్క శక్తి ఉంది. వీటికి ఆ శక్తి ఎక్కడ నుండి వస్తోంది ? ఆ శక్తికి ఆధారము అంబికే కదా!! ఆమెచేత అనుగ్రహించబడిందే ఈ శక్తి. స్వయంగా శక్తిలేని మనకు యుద్ధంలో విజయానికి ఆయుధాలు కావాలి. అన్ని శక్తులకు ఆధారమయి, అన్ని శక్తులు మొత్తంగా తానే అయి ఉన్న అంబిక చేతిలోని ఆయుధాలు ఆమె సంకల్పానుసారంగా కావలసిన రీతిలో ఆమె నిర్ణయించిన మేరకు ఫలితాన్నిస్తాయి. నిజానికి ఆమె సంకల్పమే ఈ ఫలితాలనీయగలదు. కానీ ఆమెకు అదో లీల. పరమేశ్వరుడు జ్ఞానివలె ప్రశాంతుడై ఉంటే ఈ జగన్నాటకం జరిగేదే కాదు. మన్మథుడు శివుని కామమోహితుణ్ణి చేయడంలో విఫలుడైనప్పుడు అంబిక అతణ్ణి ఈ భగవల్లీల లోనికి తెచ్చింది. మన్మథుడు ధరించిన ఆ ఆయుధములే ధరించి అంబిక శివుణ్ణి శృంగారాధిదేవుని చేసింది. మన్మథుని పునరుజ్జీవితుని చేసి జీవజాలమును కామప్రేరితులను చేయడానికి అధికారం ఇచ్చింది. అయినప్పటికీ ఆ ఆయుధాలను ఇంకా తన స్వాధీనంలోనే ఉంచుకుంది.

అయితే అప్పుడు అంబిక ఆ ఆయుధముల విధులను మార్చింది. మన్మథునికి తానిచ్చిన ఆయుధములలో ఆయన మానవులను వారి కర్మానుసారంగా కామప్రేరితులను చేస్తున్నారు. కానీ అంబిక ఆ కర్మ భారాన్ని మోస్తూ వారు విషయవలయంలో చిక్కుకుపోకూడదనే కరుణతో వారిని తమవైపుకు త్రిప్పుకోవడానికి ఆ ఆయుధాలు ఉపయోగిస్తున్నది.

మన్మథుడు ధరించిన ఆయుధాలనే ఆమె కూడా ధరించినా ఆమె ఒక్క మన్మథారి విషయంలోనే కామోద్దీపన కలగచేస్తున్నది. ఆమె శివునికొక్కనికే శివకామసుందరి. భక్తులకు జ్ఞానాంబ. వారికి బంధ విమోచనాన్ని కలగచేస్తుంది. మన్మథుడు సామాన్య ప్రజల విషయంలో తన ప్రతాపాన్ని చూపగలడు. ఈశ్వరుని ముందు బూదిగా మార్చబడిన శక్తిహీనుడు.

ఆచార్యులవారు అంబిక రూపాన్ని, నాలుగు చేతులను, ఒడ్డాణము ధరించిన సన్నని నడుమును, పూర్ణచంద్రుని పోలిన ముఖాన్ని వర్ణించిన తరువాత ఆమెలోని ఆంతరంగిక సత్యాన్ని, అంబికాతత్త్వంలోని సారాంశాన్ని వివరిస్తున్నారు. *పురమథితురాహో పురుషికా* ఆకృతిగొన్న త్రిపురారి యొక్క అహంకారమట ఆమె. కొంచెం లోతుగా ఆలోచిస్తే ఆమె శివుని యొక్క *నేను* అన్న భావనకు ఆకృతి అన్న అర్థం తోస్తుంది. బాహ్యంగా కాముడు ధరించిన ధనుర్బాణాలు ధరించిన ఈ తల్లి నిజానికి పరబ్రహ్మ యొక్క చిచ్ఛక్తి, జ్ఞానాంబ.

*పురస్తాదాస్తాం* - “మాముందు ప్రకాశించుగాక”. ఎవరైతే తన సన్నటి నడుముకు సవ్వడి చేసే చిఱుగజ్జెలు కూర్చిన మొలనూలు ధరించిందో, ఎవరి ముఖం శరత్కాలపు పున్నమి చంద్రుని పోలి ఉందో, ఎవరు తన నాలుగు చేతులతో ధనుర్బాణములను, పాశాంకుశములను పట్టుకుందో, ఆ పరమేశ్వరుని పరాహంత మాముందు ప్రత్యక్షమవుగాక! ఆచార్యులవారు మనందరి ముందు అటువంటి తల్లి ప్రత్యక్షమవ్వాలని కోరుతున్నారు. *నః* అంటే నేను అని కాదు *మేము* అన్న అర్థం వస్తుంది.

ఆచార్యులవారు ఈ శ్లోకంలో ఎంతో అందంగా వర్ణించిన ఆ తల్లి రూపాన్ని మన అంతర్నేత్రంతో చూడగలగడం ఇక మన పని.

(సశేషం)

#KanchiParamacharyaVaibhavam #కంచిపరమాచార్యవైభవం
#ParamacharyaSoundaryaLahariBhashyam
3/7/18, 07:03 - Paramacharyulu: భక్తి వలన ముక్తి

జగన్మాతపట్ల కేవల భక్తి పరమమైన అద్యయముక్తి నిస్తుంది. ఆదిశంకరులు సౌందర్యలహరిలో అంబికాస్తవంఇలా చేస్తున్నారు.

''భవాని త్వం దాసే మయి వితరదృష్టింసకరుణా
మతి స్తోతుం వాంఛన్ కథయతి భవాని త్వ మితియః,
తదైవ త్వం తస్మై దిశసి నిజసాయుజ్యపదవీం
ముకుంద బ్రహ్మేంద్ర స్ఫుట మకుట నీరాజితపదామ్||''

శివా, భవాని, రుద్రాణి, స్వరమంగళ అనేవి అంబికకు పేళ్లు 'నీకటాక్ష మీ దాసునిపై ఇంచుక ప్రసరింపచేయు' మని తల్లిని వేడుకో నెంచినవాడై భక్తుడు 'భవాని త్వం' అంటూ ఆరంభించాడు ముందు 'భవాని' అంటూ తల్లిని పిలిచాడు. వెంటనే 'త్వం' అన్నాడు. ఇక్కడ విశేషమేమిటంటే 'భవాని త్వం' అనే మాటలకు నేను నీవుగా అగుదునుగాక అనే అర్థం కూడా చెప్పవచ్చు భూ ధాతువుకు ఉత్తమ పురుషయందు 'భవాని, భవావ భవామ' అనే రూపములు కలుగుతవి కాబట్టి భక్తుడు 'తల్లీ! నువ్వు' - (భవాని త్వం) అని ప్రార్థన ఆరంభించేసరికి ఆ మాటలకు 'నేను నీవుగా అగుదునుగాక' అనే అర్థాన్ని ఆ తల్లిగ్రహించి, వెంటనే ప్రార్థన ముగియ కుండానే నిజసాయుజ్యపదాన్ని భక్తున కనుగ్రహిస్తుందని శంకరులీశ్లోకమందు చెప్పారు. నిజానికి భక్తుడు సాయుజ్యాన్ని అడుగలేదు. తల్లి అనుగ్రహాన్ని మాత్రమే అర్థించాడు. కనుక యథార్థమైన భక్తేవుంటే మనం కోరని అర్థాలనుకూడా ఆ తల్లి అనుగ్రహిస్తుందని ఇచట గ్రహించవలసివుంటుంది. శంకరులు మహాభక్తులూ, మహాజ్ఞానీ, మహాకవీ కనుక ఆ మాటలలో అంబికాసంబుద్ధినేకాక నిజమనోరథాన్నిగూడా ధ్వనింపజేయగలిగారు.

సాయుజ్యమనేది పరమశాంతిని తెలియజేస్తుంది. సముద్రాన్ని పొందిన నదులకు లభించే శాంతివంటి దది. కొండ కొమ్మున బయలు దేరిన నదులు ఆడుతూపాడుతూ, జలజలా క్రిందికి దిగివస్తవి. పిమ్మట సమతలములందు మహావేగంతో మంద్రగంభీర ఘోషంతో నిండుగా ప్రవహిస్తవి. సముద్రాన్ని చేరి దానితో చేతులు కలపగానే ఆ సందడీ, ఉరవడీ తగ్గి సాయుజ్యాన్ని పొంది పరమశాంతినిభజిస్తవి. అట్లే దాస్యాది ద్వైతభావములతో బయలుదేరిన భక్తుడు అంబికానుగ్రహం వల్ల ఆ తల్లి సాయుజ్యాన్ని పొంది శారతిచెందుతాడు. ఇచట ఇతరమతస్థులు - ఈశ్వరసాయుజ్యంవల్ల లక్ష్మీపతిత్వం కూడా కలుగవలసివస్తుందికదా అని ఆక్షేపించుట కవకాశం లేదు. ఎందువల్లనంటే ముందుగా తల్లితో సాయుజ్యం. ఆ వెనుక తల్లితో గూడ శివసాయుజ్యం ఇచట చెప్పబడింది.

అపార కరుణాసింధుం జ్ఞానదం శాంతరూపిణం
శ్రీ చంద్రశేఖర గురుం ప్రణమామి ముదావహం ॥

--- “జగద్గురు బోధలు” నుండి

#KanchiParamacharyaVaibhavam #కంచిపరమాచార్యవైభవం
3/7/18, 11:31 - Paramacharyulu: <Media omitted>
3/7/18, 16:05 - Paramacharyulu: ఎనిమిదవ శ్లోక ఉపోద్ఘాతం - మొదటి భాగం

(రాబోయే శ్లోకంలోని ఒక పాదానికి అర్థం చెప్పడానికి ఉపోద్ఘాతంగా స్వామివారు పంచబ్రహ్మాసనాన్ని గురించి వివరిస్తున్నారు)

మొట్టమొదటి శ్లోకంలో అమ్మతో కూడినపుడే శివుడు స్పందించడానికైనా – అంటే ప్రాపంచిక వ్యవహారాలు నిర్వహించడానికి – సమర్థుడౌతాడన్నారు ఆచార్యులవారు. తరువాత శ్లోకాలలో హరిహర బ్రహ్మాదులైన త్రిమూర్తులు నిరంతరం అంబిక పాదాలను అర్చిస్తూ ఉంటారంటారు. విష్ణువు స్థితికారకుడు. హరునిగా పిలవబడే లయకారకుడైన దైవతమూ, అంబికతో కూడి సమర్థుడౌతున్న శివుడు ఒకడేనా? స్తోత్రం అంతరంగికంగా అద్వైతము. ప్రపంచ స్థితిలో ద్వైత్వమన్న స్థితిలో వ్రాయబడింది కాబట్టి, ఇక్కడ అద్వైతానికి తావులేదు. శివుడు, హరుడు రెండు భిన్నమైన దేవతలు ఉండాలి. హరుడు లయకారకుడైన రుద్రుడు.

ఒకే పరమాత్మ తనను తాను ముగ్గురు దేవతలగా విభజించుకొని సృష్టి స్థితి లయములనే మూడు విధులను నిర్వహించడం జరుగుతుంది. ఈ ముగ్గురికీ ఆయా విధులు నిర్వహించే శక్తి మరి పరమాత్మ శక్తినుండే సంప్రాప్తమవాలి. ఆ మూలశక్తినే అంబిక అంటున్నాము. ప్రపంచంలో శక్తి లేని వ్యక్తికి సంస్థితి లేకపోవడం మనం చూస్తూనే ఉన్నాము. అతనిలోని శక్తి బట్టి అతనిని ఆ వ్యక్తిగా గుర్తిస్తాం. శక్తిపోతే ఆ వ్యక్తి ఉనికే పోతున్నది. ఈ రకంగా శక్తి వ్యక్తులకొక అభేదం సిద్ధిస్తోంది. పరబ్రహ్మ శక్తిగా పిలవబడే అంబిక నిజానికి పరబ్రహ్మ స్వరూపిణి. లోకంలో శక్తిగల వారెవరైనా తన శక్తి ఏ మాత్రం చూపక ఉదాసీనంగా ఉండిపోవచ్చు కదా!! పరబ్రహ్మ అయిన పరమశివుడు అలా నిశ్చల స్థితిలో ఉండిపోతాడు.

మనం నిశ్చలమైన అట్టి పరబ్రహ్మ తత్త్వం నుండి బహిర్వస్తువులవైపు ఆకర్షించే ఇంద్రియాలతో వెలుపలకు త్రిప్పబడిన మనస్సుతో పుట్టాము. నిజానికి మన అసలు స్థితి పరమశివుని నిశ్చల స్థితి. అయితే అది ఎప్పుడు అనుభవంలోకి వస్తుంది ? శివునిలో మనం విడదీయలేనంతగా లయమవగలిగినప్పుడని సమాధానం చెప్పాల్సివస్తుంది. లయకారకుడైన రుద్రుడు ప్రసాదించేది ఈ లయాన్నేనా ? ఇక నిశ్చలము నిర్మలమూ అయిన పరమశివుని నుండి మన స్వస్థితి గురించిన స్పృహలేని పరిస్థితిలో పడినామే?? మనలను ప్రాపంచిక స్థితి మాత్రమే సత్యమనే మాయలో పడవేసినదేవరు ? ఇది బ్రహ్మ సృష్టికార్యమా ? సృష్టి స్థితి లయములనే ఈ మూడు విధులతో పాటు బ్రహ్మ శక్తి అయిన అంబిక ఇంకో రెండు విధులను నిర్వర్తిస్తోందని చెప్పుకోవాలి. మన స్వస్థితి నుండి మనలకు మునుపు కలిగించే మాయలోనికి తోయడమే తిరోధాన కృత్యం. మాయను తొలగించి నిరంతర శాంతమైన, సత్యమైన పరమశివుని స్థితిని అనుగ్రహించడం అనే ప్రసాదకృత్యం అనేవి ఈ రెండు విధులు.

(సశేషం)

#KanchiParamacharyaVaibhavam #కంచిపరమాచార్యవైభవం
#ParamacharyaSoundaryaLahariBhashyam
3/8/18, 07:15 - Paramacharyulu: అమ్మ - అంత్యక్రియలు

కార్వార్ రామమూర్తి శ్రీమఠంలో పనిచేసేవాడు. తనికి సెలవు కావల్సివచ్చింది. “మా అమ్మగారి అంత్యక్రియలు” అని చెప్పాడు. పరమాచార్య స్వామివారే “నువ్వు వెళ్ళి రా” అని చెప్పారు.

శ్రీమఠం ఆనవాయితీ ప్రకారం ఒకనెల జీతం అదనంగా తీసుకుని వెళ్ళాడు. మరుసటిరోజు అతని తల్లిగారు మహాస్వామివారి దర్శనానికి వచ్చారు. అతను డబ్బుకోసం బతికిఉన్న తల్లిని చనిపోయిందని అబద్ధం చెప్పి వెళ్ళాడు అని అందరికీ అర్థం అయ్యింది. రెండు రోజుల తరువాత రామమూర్తి తిరిగొచ్చాడు. ఏమి జరిగిందో తెలుసుకున్నాడు.

ఇక మహాస్వామివారికి మొహం ఎలా చూపించగలనని ఎక్కడికో వెళ్ళిపోయాడు. దూరప్రాంతాలకి వెళ్ళి ఏవేవో పనులు చేసుకుంటూ బ్రతుకుతున్నాడు.

ముప్పై సంవత్సరాల తరువాత మహాస్వామివారి దర్శనానికి వచ్చాడు రామమూర్తి. ”మీ తల్లిగారు ఎలా ఉన్నారు?” అని అడిగారు స్వామివారు.

“ఆవిడ కాలం చేశారు”

“అంత్యక్రియలు నువ్వే చేశావా?”

“లేదు. నేను అప్పటికి చాలా దూరంగా ఉత్తర భారతంలో ఉన్నాను. నాకు విషయం కూడా చాలా రోజుల తరువాతనే తెలిసింది. మా చిన్న తమ్ముడే అన్ని కర్మలూ చేశాడు” అని బదులిచ్చాడు.

అతనికి ఐదువేల రూపాయలు ఇవ్వవలసిందిగా స్వామివారు మేనేజరును ఆజ్ఞాపించారు. కాంచీపురంలోనే అన్ని కర్మలనూ నిర్వహించవలసిందిగా అతణ్ణి ఆదేశించారు.

“శ్రాద్ధకర్మలు అన్నీ ముగించిన తరువాతనే దర్శనానికి రా” అని ఆదేశించారు.

అతను స్వామివారు చెప్పినట్టుగానే చేశాడు. తరువాత చాలా ఏళ్ళపాటు శ్రీమఠానికి సేవలు అందించాడు. తన యనభయ్యవ పడిలో శివుని పాదాలు చేరుకున్నాడు.

అపార కరుణాసింధుం జ్ఞానదం శాంతరూపిణం
శ్రీ చంద్రశేఖర గురుం ప్రణమామి ముదావహం ॥

--- శ్రీమఠం బాలు మామ, మహా పెరియవళ్ - దరిశన అనుభవంగళ్

#KanchiParamacharyaVaibhavam #కంచిపరమాచార్యవైభవం
3/8/18, 12:24 - Paramacharyulu: <Media omitted>
3/8/18, 16:03 - Paramacharyulu: ఎనిమిదవ శ్లోక ఉపోద్ఘాతం - రెండవ భాగం

*తిరస్* అంటే మరుగుపరచడం, గోప్యంగా ఉంచడం అన్న అర్థాలున్నాయి. వస్తువులు కనిపించకుండా మరుగుపరిచే తిరస్కరణీ విద్య గురించి మీరు విని వుంటారు. *తెర* అన్న పదం ఈ *తిరస్* నుండే పుట్టింది. పరాశక్తి మాయ అనే తెర కల్పించి స్వాత్మ సత్యస్థితిని మరుగుపరుస్తుంది. దీనిని తిరోధాన కృత్యమంటారు. ఆ తెర తొలగించి మోక్షప్రాప్తి కలగజేయడం అనుగ్రహ క్రియ. సృష్టి స్థితి లయలనే కార్యములకు బ్రహ్మ, విష్ణు, రుద్రులను అధికారులుగా నియమించినట్లుగానే తిరోధాన క్రియ మహేశ్వరుని చేతులలో ఉంచింది. మహేశ్వరుని తిరోధాన కృత్యంలో ఆరంభమయిన జగత్తు సృష్టి స్థితి లయలను హరిహర బ్రహ్మాదులు నిర్వర్తిస్తున్నారు.

మాయను తొలగించి మోక్షాన్ని ప్రసాదించడమనే ప్రసాద కృత్యములు సదాశివుని అధీనంలో ఉంచింది. ఈ అయిదు విధులను పంచకృత్యములంటారు. సదాశివుని ఆధీనంలో ఈ పంచ కృత్యములు పరమశివుడు నిర్వహిస్తాడు. నటరాజు నృత్యం *పంచకృత్య పరమానంద తాండవమని* పిలవబడుతోంది. శాక్తేయంలో ఇది అంబిక లీల. లలితా సహస్రనామస్తోత్రంలో *పంచకృత్యపరాయణా* అని అంబిక స్తుతించబడింది.

ఈ స్తోత్రం (సౌందర్యలహరి) అంబికకు సంబంధించినది కాబట్టి చెప్పడం కాదుకానీ, మనం నిష్పాక్షికంగా ఆలోచించినా పంచకృత్యములకు అంబికే మూలమని చెప్పుకోవడం సబబుగా తోస్తోంది. కృత్యము, కార్యము శక్తివినా సాధ్యము కాదుకదా! శక్తి అంటే అంబిక. శైవసిద్ధంతంలో కూడుకుని శక్తియుతునిగానే చెబుతారు. శివుడు తన భార్య అయిన శక్తితో కూడి ఉన్నాడంటారు. అద్వైతమునకు అతి సమీపంగా ఉండే కాశ్మీర శైవములో సౌందర్యలహరి చెప్పినట్లుగానే తురీయస్థితిలో పరమాత్మ శివశక్తిగానే చెప్పబడుతోంది. కాబట్టి పంచ కృత్యములు అంబిక పరిధిలోనికే తేవడమే ఉచితం.

ఈ అయిదు కృత్యములను నిర్వహించడానికి అధికారాలను నియమించిన అంబిక ఆ అయిదుగురికంటే ఉన్నతమైనదనడంలో సందేహమేమున్నది ? అయితే సదాశివుడు ముక్తిని ప్రసాదిస్తున్నాడు. జ్ఞానమయుడైనపుడు కానీ, జ్ఞాన ప్రసాదం చేసే సమర్థత అతనికి ఉండదు. జ్ఞాని కంటే భిన్నమైనదీ, ఉన్నతమైనదీ ఏదీ ఉండరాదు. అయితే అతడు ఒక కార్యం చేస్తున్నాడు. అలా చేసే స్థితిలో, చేసేందుకు శక్తినిచ్చే వస్తువు అతడికంటే ఉన్నతమైనదయి ఉండాలి.

మంత్రశస్త్రంలో సిద్ధి పొందినవారికి ఆమె పంచకృత్యముల నిర్వహించే ఈ అయిదు అధికారులపైన కూర్చుని సమస్తరాజ చిహ్నములతో కూడిన రాజరాజేశ్వరిగా దర్శనమిచ్చింది. ఈ సింహాసనానికి నాలుగు కోళ్ళు బ్రహ్మ, విష్ణు, రుద్ర, మహేశ్వరుడు. ఆ కోళ్ళపై సదాశివుడు పలకగా అమరినాడు. దానిపైన నిర్గుణ పరబ్రహ్మమైన కామేశ్వరునితో కూడి కామేశ్వరిగా దర్శనమిస్తోంది. ఆమె పంచకృత్యములను నిర్వహించే మహారాజ్ఞి. బ్రహ్మశక్తి – బ్రహ్మ స్వరూపిణి ఇక కామేశ్వరుడేందుకన్న ప్రశ్న ఉదయిస్తుంది.

(సశేషం)

#KanchiParamacharyaVaibhavam #కంచిపరమాచార్యవైభవం
#ParamacharyaSoundaryaLahariBhashyam
3/9/18, 08:57 - Paramacharyulu: శివాలయం - శివాచార్యుడు

ఒక మధ్యవయస్కుడైన శివాచార్యుడు తన గ్రామాన్ని వదిలి పట్టణంలో కొత్తగా నిర్మించిన ఆలయ అర్చకత్వ బాధ్యతలను నిర్వర్తించడానికి వెళ్ళాడు. అతని నిర్ణయాన్ని తండ్రి ఒప్పుకోకపోయినా లెక్కచేయక వెళ్ళిపోయాడు. పట్టణంలోని ఆ కొత్త దేవాలయంలో అతని పనికి బాగానే ఆదాయం వచ్చేది. అధికాదాయం అతని వల్ల జీవనప్రమాణాలు పెరిగాయి. కాని దుర్దృష్టవశాత్తు అహంకారం కూడా బాగా పెరిగింది.

దాని పర్యవసానం ఇటువంటివి సహించని దేవాలయ ధర్మకర్తలు అర్చక బాధ్యతలను వేరొకరికి అప్పగించారు. దేవాలయ తాళాలు అతనివద్ద నుండి తీసుకుని కొత్తగా వచ్చిన అర్చకుడికి ఇచ్చారు. ఉన్న ఉద్యోగం పోవడంతో ఆ శివాచార్యుడు పరమాచార్య స్వామి వద్దకు వచ్చాడు. దుఃఖం నిండిన మోహంతో స్వామివారి ముందు నిలబడ్డాడు.

"ఏమిటీ నీ సమస్య?" అని అడిగారు స్వామివారు.

"నా ఉద్యోగం పోయింది. పూట గడవడం కూడా చాలా కష్టంగా ఉంది"

"మీ తండ్రి ఏం చేస్తారు?"

"పల్లెటూరిలో ఉంటారు. అక్కడ ఉన్న శివాలయంలో పని చేస్తారు"

"మీ ఊరి ప్రాముఖ్యత ఏమిటి" అని అడిగారు.

అతనికి ఆ విషయం తెలియకపోవడం వల్ల ఊరకే నిలబడ్డాడు. స్వామివారే ఆ ప్రశ్నకు బదులివ్వడం ఆరంభించారు.

"మీ ఊళ్ళో ఉన్న శివాలయం గురించి, దాని వైభవం గురించి శైవ నాయనార్లు వారి పాటల్లో స్తుతించారు. ఆ దేవాలయం ఆగమశాస్త్రానుసారంగా నిర్మింపబడినది. దేవాలయంలోని ఈశాన్య భాగంలో ఒక పెద్ద చెట్టు ఉండేది. అది ఇప్పటికీ ఉందా?" అని అడిగారు.

తనకు అంతగా తెలియకపోయినా అవుననే చెప్పాడు ఆ శివాచార్యుడు. "మీ ఊర్లో ఉన్న పరమేశ్వరునికి నువ్వంటే చాలా ఇష్టం. చిన్న చిన్న దేవాలయాల్లో పనిచేస్తూ నువ్వు కష్టపడడం ఆయనకు ఇష్టం లేదు. మీ ఊరికి తెరిగివెళ్ళి మీ నాన్నగారికి ఆసరాగా ఉండు" అని ఆదేశించారు.

పరమాచార్య స్వామివారి ఆదేశానుసారం ఆ శివాచార్యుడు తన స్వగ్రామానికి తిరిగి వెళ్ళి శివాలయంలో బాధ్యతలను నిర్వర్తించసాగాడు. అప్పుడే ఒక అద్భుతం జరిగింది. మరుసటి నెలలోనే గ్రామప్రజలందరూ పూనుకుని దేవాలయ జీర్ణోద్ధరణకు ఒక బృందం ఏర్పాటు చేశారు. మరుసటి సంవత్సరం దేవాలయ కుంబాభిషేకం వైభవంగా జరిగింది. నాయనార్లు స్తుతించిన దేవాలయం కావడంతో గుంపులు గుంపులుగా పెద్దసంఖ్యలో భక్తులు వచ్చారు. రెండు సంవత్సరాల తరువాత ఆ శివాచార్యుడు మహాస్వామి వద్దకు వచ్చి సాష్టాంగం చేశాడు.

"ఏ దేవాలయంలో పనిచేస్తున్నాడో అడుగు?" అని అమాయకంగా ఏమీతెలియనట్టు పక్కనే ఉన్న శిష్యునికి చెప్పారు స్వామివారు. అప్పుడే మొత్తం జరిగిన విషయం అంతా ఆ శివాచార్యుడు స్వామివారికి చెప్పాడు.

"ఇప్పుడెలా ఉన్నావు?" అని అడిగారు స్వామివారు.

"పరమాచార్య స్వామివారి కరుణా వీక్షణాలు నాపై ప్రసరించాయి. ఆనందంగా. . . మహదానందంగా ఉన్నాను పెరియవ" అని బదులిచ్చాడు.

"శివుని కృపాకటాక్షవీణాలు నీపై ప్రసరించాయని చెప్పు. నేనేమి చేశాను?". ఇలా చెప్పి తప్పుకోవడంలో పరమాచార్య స్వామికి వారే సాటి.

అపార కరుణాసింధుం జ్ఞానదం శాంతరూపిణం
శ్రీ చంద్రశేఖర గురుం ప్రణమామి ముదావహం ॥

--- శ్రీమఠం బాలు మామ, మహా పెరియవళ్ - దరిశన అనుభవంగళ్

#KanchiParamacharyaVaibhavam #కంచిపరమాచార్యవైభవం
3/9/18, 12:09 - Paramacharyulu: <Media omitted>
3/9/18, 16:21 - Paramacharyulu: ఎనిమిదవ శ్లోక ఉపోద్ఘాతం - మూడవ భాగం

శ్రీవిద్యా సంప్రదాయంలో అన్నీ తానే అయిన ఆ తల్లికి ముఖ్యమైన రూపమొక్కటున్నది. ఆమె ఆబ్రహ్మకీటజనని. ఈ చరాచర సృష్టిజాలానికంతటికీ ఆమె తల్లి. మహాశక్తి అయినప్పటికీ, మనందరం ప్రేమతో, భక్తితో, గౌరవంగా తన ఒడిలో హత్తుకుపోవడానికి వీలుగా అమ్మలందరికన్నా అందమైన పరమ ప్రేమైక రూపమైన ఆకృతిని ధరించింది. సహస్రనామాల్లో మొదటి నామము *శ్రీమాత* . ఆమె మాయగా అవతరిస్తుంది. మనలను సృష్టిస్తుంది. రక్షిస్తుంది. జన్మలమధ్యలో మృత్యువు ప్రసాదించి విశ్రాంతి కలుగజేస్తుంది. తుదకు మాయను ఉపసంహరించి ముక్తిని ప్రసాదిస్తుంది. ఆమెకు బాల, కన్యాకుమారి వంటి అనేక రూపాలున్నాయి. దుష్టులను సంహరించేటప్పుడు దుర్గగా దర్శనమిస్తోంది. కానీ ముఖ్యంగా ఆమె శ్రీమాత. తల్లి ఉన్నప్పుడు తండ్రి ఒకరుండాలి కదా? లోకరీతికి భిన్నమైన దానిని మనమంగీకరించలేం. లోకధర్మాన్నాశ్రయించి అంతటి తల్లికి అంతటి మహోన్నతుడైన భర్తగా కామేశ్వరుని ధర్మపత్నిగా అభివర్ణిస్తున్నాం. శైవంలో శివుడు శక్తితో కూడిన వానిగా వర్ణించినట్లే శ్రీవిద్యాతంత్రంలో అంబిక తన భర్త అయిన కామేశ్వరునితో కూడి ఉన్నట్లు అభివర్ణించబడింది. పరిపూర్ణమైన అఖండమైన బ్రహ్మశక్తికి భర్త ఎవరు ? తాను తప్ప వేరొక స్థితిలేని అంబికకు భర్త ఎలా సాధ్యం ? శాంతుడు, నిర్మలుడు, నిష్క్రియుడు అయిన పరమశివుడే అట్టివాడు. శాంతుడైన ఆయన శక్తి ఆయన భార్య మూలంగా ప్రపంచీకరించబడింది. పంచకృత్యాలకు కారణమయింది.

తైత్తిరీయ ఉపనిషత్తు *ఏకం  అయిన పరబ్రహ్మ అనేకంగా అవుదామనుకొన్నది* అని చెబుతోంది. శాంతుడైన పరబ్రహ్మ క్రియాశీలుడైనపుడే అతడికి అట్టి కోరిక కలుగుతుంది. ఉపనిషత్తులో *అకామయత* అన్న పదం వాడబడింది. జ్ఞాన శక్తి అంతర్లీనంగా ఉన్న పరబ్రహ్మము

తన శక్తిని ఆవిష్కరించి లోక లీల నడపాలనుకొన్నది. దీనిని ఇచ్ఛాశక్తి అంటారు. కోరిక యొక్క శక్తి. ఇక పంచకృత్యలీలలను నడిపేది క్రియాశక్తి. ప్రస్తుతంలో బ్రహ్మ తనంతటతానే బహిర్ముఖమైనపుడు దానికి కోరిక జనించింది. ఉపనిషత్తు దీనిని *కామం* అంటోంది. దీనికి కోరిక అని తప్పితే వేరే లోకార్థమేదీ లేదు. పరిపూర్ణమైన బ్రహ్మనుండి, బ్రహ్మ శక్తినుండి మొట్టమొదటగా తనకన్న భిన్నమైనదేదో ఉన్నట్లు కోర్కె జనించింది. ఆ కామమే కోర్కె అతడి భార్య స్థానాన్ని ఆక్రమించింది. తల్లితండ్రుల కలయిక చేత పుత్రులుద్భవించినట్లు శాంతుడైన పరబ్రహ్మ ఇచ్ఛాశక్తితో కూడటంతో లోకలీల ఆరంభమైంది. పంచకృత్యములు కూడా దాని ఫలితమే. వారిరువురూ భార్యాభర్తలైనారు. అంబిక పరబ్రహ్మ కామాకృతి కాబట్టి ఆమె కామేశ్వరి అయింది.

కామేశ్వరి అన్నది బ్రహ్మ శక్తి మొదటి నామం. ఆ పరబ్రహ్మం తన కోర్కెను ఆవిష్కరించడం తప్పితే వేరే ఏమీ చేయలేదు. కోర్కె కలిగిన అతడు కామేశ్వరుడైనాడు. కామేశ్వరుని ఇచ్చను క్రియారూపంలోకి తెచ్చి పంచకృత్య లీలలను జరిపేది కామేశ్వరీ దేవి మాత్రమే. ఆమె విక్టోరియా, ఎలిజబెత్ ల వలె సార్వభౌమమున్న మహారాణి. అన్ని లోకాలకు, అన్ని జీవులకు, దేవతా గణాలకు ఆమె పాలకురాలు. మహారాజు భార్య అవడంచేత మహారాణిగా పిలవబడే రాణి వంటిది కాదీమె. స్వయంగా మహారాణి. లలితా సహస్రనామములలో శ్రీమాతా అన్న నామం తరువాత శ్రీమహారాజ్ఞి, శ్రీమత్సింహాసనేశ్వరి అన్న రెండు నామాలున్నాయి.

(సశేషం)

#KanchiParamacharyaVaibhavam #కంచిపరమాచార్యవైభవం
#ParamacharyaSoundaryaLahariBhashyam
3/10/18, 07:29 - Paramacharyulu: పరమాచార్య ఇచ్చిన భరణం

పంచపకేశన్ అనే ఒక పెద్దాయన 1952 దాకా శ్రీమఠంలో కైంకర్యం చేసేవారు. పరమాచార్య స్వామివారికి కైంకర్యం చెయ్యడమే ఆయన జీవితాశయం. కొద్దిగా అనారోగ్యం చేయడం వల్ల పరమాచార్య స్వామి వద్దనుండి సెలవు తీసుకుని తంజావూరు దగ్గరనున్న అతని స్వగ్రామానికి వెళ్ళిపోయాడు. కంచి మఠాని వదిలి వెళ్ళినా అతను మాత్రం ప్రతినిత్యమూ పరమాచార్య స్వామివారిని ఆరాధించేవాడు. ఎల్లప్పుడూ స్వామివారి స్మరణ చేసేవాడు. స్వామివారి పూజ విషయంలో చిన్న అలసత్వాన్ని కూడా చేసేవాడు కాదు. అతనికి ఇద్దరు కుమారులు ఒక కుమార్తె. అందరికి పెళ్ళిళ్ళయ్యాయి. తన తండ్రి అంత అనారోగ్యంలో కూడా ఇంకా పరమాచార్య స్వామివారి కైంకర్యం చెయ్యడం చూసి, అతని పెద్దబ్బాయి ఇలా అన్నాడు.

“ఎందుకు నాన్న ఎప్పుడూ పరమాచార్య స్వామి వారి సేవలో తలమునకలై ఉంటావు? మీరు చదివిన చదువుకి ఏదైనా ప్రభుత్వ ఉద్యోగం చేసినట్లైతే, మీకు ఈపాటికి దండిగా ఫించను(భరణం)గా వచ్చేది. ఆ డబ్బుతో మీరు హాయిగా బ్రతకేవారు కదా, ఏమంటారు?”

“రేయ్! మహాస్వామి వారి కైంకర్యం చెయ్యాలంటే పెట్టిపుట్టుండాలి రా! నాకు ఆ అదృష్టం దక్కింది. ఆసేవలో స్వామివారికి దగ్గరగా ఉన్నాను. దాని వల్ల మీకు కలిగిన ఇబ్బంది ఏముంది? మంచి చదువులు చదువుకున్నారు. పెళ్ళిళ్ళు కూడా చేసుకున్నారు. కేవలం మనుష్య రూపంలో ఉన్న ఆ భగవంతుడే మనకు ఏలోటు రాకుండా చూసుకోగలడు” అంటూ తన కొడుకు అలా అనడంతో ఆవేదనగా చెప్పసాగాడు.

”లేదు నాన్న, మీరు ప్రభుత్వ ఉద్యోగంలో ఉండి ఉంటే ఈపాటికి మీకు పింఛను వస్తుండేది కదా అనే ఉద్దేశంతో నేను అలా అన్నాను” అని ఈ విషయం ఇంతటితో ముగించాడు.

ఈ సంఘటన కొన్నిరోజుల తరువాత చెన్నైలో ఒక వివాహం జరిగింది. అత్యంత వైభవంగా జరిగిన ఆ వివాహానికి అతని పెద్దబ్బాయి కూడా వెళ్ళాడు. పెళ్ళిక్రతువు ముగిసిన తరువాత వధూవరులిద్దరిని కంచికి తీసుకునివెళ్ళారు స్వామివారి ఆశీస్సులకోసం. పంచపకేశన్ పెద్ద కుమారుడు కూడా వారితో పాటు కంచి వెళ్ళాడు. ఒకరి తరువాత ఒకరు స్వామివారి ఆశీస్సులు అందుకుంటూ ముందుకు సాగిపోతున్నారు. ఇతని వంతురాగానే స్వామివారిముందు నిలబడ్డాడు. స్వామివారు తలెత్తి అతణ్ణి చూసి, “నువ్వు పంచపకేశన్ కుమారుడివి కదూ?” అని అడిగారు. ఆశ్చర్యపడుతూ అవునని సమాధానమిచ్చాడు. “మీ తండ్రిగారు ఎలా ఉన్నారు? నాపై ఎంతటి భక్తి తెలుసా మీ నాన్నకి? వారిని బాగా చూసుకోండి. ఎంతమంది పిల్లలు మీరు?” మొదలైన విషయాలు అడిగారు.

“ఈ మఠంలో సేవచేసేవారికి చాలా చెయ్యాలని నాకు ఆశ. కాని నేను ఇక్కడ మఠం పరిపాలకుణ్ణి మాత్రమే. కనుక పెద్దగా ఏమి చెయ్యలేను. ప్రజలు ఇచ్చినదానితో మఠాన్ని పరిపాలిస్తున్నాను. ఇది ప్రభుత్వ కార్యాలయం కాదుగా. అందరూ బావుండాలని ఆ పరదేవత కామాక్షిని ప్రార్థించడం తప్ప ఏం చెయ్యగలను. కాని మీ తండ్రి భకికి అతని ఈ మఠానికి చేసిన సేవకి తనకి ఏమైనా చెయ్యాలని నా ఆశ. కనుక ప్రతినెలా 25 కలాల(12 మరక్కల్ ఒక కలం, 8 లీటర్లు ఒక మరక్కల్) ధాన్యం అందుతుంది ‘భరణం’గా” అని అన్నారు.

ఇది వినగానే అతడు స్వామివారికి సాష్టాంగపడి, ఏడ్చాడు. “సర్వేశ్వరా! కేవలం వారిగురించి ఆలోచించి అలా అన్నాను కాని మీకు చేసిన సేవని నేను నిందించలేదు. నన్ను క్షమించండి” అని వేడుకున్నాడు. ”నేను నిన్ను నిందించడం లేదు. పెద్ద సహాయం చెయ్యలేను కాబట్టి మీ నాన్నకి ఈ చిన్న ఏర్పాటు చేశాను” అని ఆ త్రికాలజ్ఞాని అతణ్ణి ఓదార్చాడు.

తన తండ్రిసేవకి ఈ ఫలితం చాలు అనుకున్న ఆ కుమారుడు కూడా తన తండ్రి దారిలోనే నడిచి పరమాచార్య స్వామివారికి సేవకుడయ్యాడు. ఈనాటికి నీడమంగళంలోని అతని ఇంటికి అతని భరణం ధాన్యం రూపంలో వస్తోంది.

అపార కరుణాసింధుం జ్ఞానదం శాంతరూపిణం
శ్రీ చంద్రశేఖర గురుం ప్రణమామి ముదావహం ॥

--- “కంచి మహనిన్ కరునై ఉళ్ళమ్” పుస్తకం నుండి

#KanchiParamacharyaVaibhavam #కంచిపరమాచార్యవైభవం
3/10/18, 16:29 - Paramacharyulu: ఎనిమిదవ శ్లోక ఉపోద్ఘాతం - నాలుగవ భాగం

అందరు మహారాణులు సింహాసనాలమీద కూర్చుంటారు. ఈమె ప్రత్యేకత ఏమిటి ? *పంచబ్రహ్మాసనము* అనే ప్రత్యేకమైన సింహాసనమున్నది. ఆ ఆసనంపై ఆమె ఒంటిగా నేరుగా కూర్చోలేదు. కామేశ్వరునితో కూడి అతడి ఒడిలో కూర్చున్నది. అంటే పంచబ్రహ్మాసనంతో పాటు కామేశ్వరాంకము కూడా ఆమె ఆసనమే. కోరిక ఉద్భవించడానికి ఒకరిపై ఒకరికి ఇచ్ఛ జనించడానికి ఇద్దరుండాలి కదా! మనకు సౌందర్యరాశులైన కామేశ్వరీ కామేశ్వరులు మిథునం పరబ్రహ్మాసనంపై సాక్షాత్కరిస్తోంది. పరబ్రహ్మ యావత్శక్తి తాను అయి పరబ్రహ్మ ఆవిష్కరించబడిన ఇచ్ఛా రూపమవడానికి కామేశ్వరిగా పొగడబడే ఆమె అతడి అంకపీఠపై అతడితో కూడి లోకలీల సాగిస్తోంది.

ప్రపంచ సృష్టి స్థితులకై ఈ పంచకృత్యాలు నిర్వహించబడుతున్నాయి. కామేశ్వరుని ఇచ్ఛారూపమైన కామేశ్వరి తనకుతాను అనేక రూపాల్లో సృష్టించడమే కాక, మాయా పొరలు కమ్మించి ఆ రూపాలన్నీ విడివిడి ఉపాధులన్న భ్రమ కలిగిస్తోంది. అసలు ఇటువంటి కోరిక ఉంటుందా? ఉన్నా అది క్రురమైనది కాదా అని మీరడగవచ్చు. యుగాలు కల్పాల తరువాత విడివడిన మనందరికీ కలిపి తనలో ఇక్యం చేసుకొంటుంది. ఎప్పుడూ కలిసి ఉండే వారికన్నా ఎంతో కాలం విడిపోయి కలిసిన వారిలో ఎంతో ఆప్యాయత కనిపిస్తుంది కదా !! అట్టి ఆనందం కలిగించడం ఆమె అభిమతమనుకోవాలి. తనను మనలాగా మార్చి, మనలో మాయ చొప్పించి, ఎంతో ప్రేమతో మనలను మళ్ళీ తానుగా మలుచుకోంటుంది. కలయికలోని మాధుర్యాన్ని చవి చూడడానికనేమో ఇది. తల్లి తన పిల్లలతో దాగుడు మూటలాడి ఆనందించదా ? సముద్రంలోని నీరు ఆవిరై మేఘాలు వేలమైళ్ళు పయనించి, ఎక్కడో వర్షించి కాలువల లాగ, నదులుగా మళ్ళీ సముద్రాన్ని చేరుతాయి కదా!

కామేశ్వరునితో కూడి కామేశ్వరి పంచ బ్రహ్మాసీనురాలయింది. పరబ్రహ్మ, అయన ఇచ్ఛారూపమైన శక్తి అందరికంటే మహోన్నతమయినది. ఈ మిథునమే పంచకృత్యములను, సృష్ట్యాదులైన లీలలగా నిర్వహిస్తున్నాయి.

ఈ సిద్ధాంతము స్థూల రూపంలో ఆవిష్కరించినపుడు పంచబ్రహ్మాసనంపై కామేశ్వరుని ఎడమతొడపై ఇరువురూ తూర్పుముఖంగా ఆసీనులై ఉన్నారు. ఆగ్నేయమున బ్రహ్మ, నైఋతిన విష్ణువు, వాయువ్యంలో రుద్రుడు, ఈశాన్యంలో మహేశుడు కోళ్ళుగా ఉన్నారు. నాలుగు కోళ్ళను కలుపుతూ సదాశివుడు పీఠంగా ఉన్నాడు. పరబ్రహ్మ శక్తి అయిన బ్రహ్మశక్తిచే అయిదుగురు దేవతల చేత నిర్వహించబడే ఐదు కృత్యములుగా వివరించబడింది. ఈ అయిదుగురు దేవతలను పంచ బ్రహ్మలంటారు. వారిచే ఏర్పరచబడిన ఆసనము పంచబ్రంహాసనం.

పరబ్రహ్మం వంటి అందమైన పేర్లతో పిలువబడిన ఈ ఆసనపు ఇంకొక పేరు మీకు భయంగా తొచవచ్చు. లలితా సహస్రనామ స్తోత్రంలో పంచబ్రహ్మాసనస్థితా అనే నామమే కాక *పంచప్రేతాసనాసీన*, *పంచప్రేత మంచాధిశాయిని* అన్న నామములు కూడా ఉన్నాయి. అంబిక వారి పంచ కృత్యములు నిర్వహణకు శక్తినీయకపోతే వారు ప్రాణంలేని వంటివారవుతారని భావం. బల్బులో ఫిలమెంటు పోయినట్లు. లలితా సహస్రనామాలలో ఆమెకు *కామేశ్వర ప్రాణనాడి* అనే పేరున్నది. కామేశ్వరి ఆమె ప్రాణభూతమైనదన్నమాట. కానీ లోకధర్మాన్ని ఆశ్రయించి పరాశక్తి తాను ఉత్కృష్టమైన శక్తి కలది అయినా ఉన్నత స్థితి నధిష్ఠించిన కామేశ్వరునితో కూడి ఉంటుంది.

(సశేషం)

#KanchiParamacharyaVaibhavam #కంచిపరమాచార్యవైభవం
#ParamacharyaSoundaryaLahariBhashyam
3/11/18, 06:59 - Paramacharyulu: కల - కామాక్షి

యూరోప్ వనిత ఒకామెకు కాంచీపురం గురించి కాని పరమాచార్య స్వామి గురించి కాని ఏమి తెలియదు. తనకు రెండుసార్లు స్వప్నంలో ఒకామె పచ్చని చీర కట్టుకొని, ఒంటినిండా ఆభరణాలు ధరించి, అభయహస్తంతో ఆశీర్వదిస్తూ, తనను చూడటానికి రమ్మని ఆదేశించినట్టుగా కనపడింది. ఏమి పాలుపోక పూణెలో పి హెచ్ డి చేస్తున్న తన సహోదరితో స్వప్నం విషయం చెప్పింది. అలాంటి వారు భారతదేశ దేవీదేవతలోనే ఉంటారని కనుక ఇక్కడకు వచ్చి స్వపనంలో కనిపించిన పచ్చ చీర ఆభరణములు ధరించిన ఆ స్త్రీ కోసం వెతకమని సలహా ఇచ్చింది.

ఆమె కొద్దిగా ధనం కూడబెట్టి భారతదేశానికి వచ్చి ఎన్నో ప్రాంతాలు, దేవాలయాలు తిరిగింది కాని తన కలలో కనిపించిన స్త్రీ మాత్రం ఎక్కడా కనపడలేదు. అలా అలా ఆమె కలవై చేరుకుంది. అప్పుడు మహాస్వామివారు అక్కడే ఉన్నారు. ఆమె మహాస్వామి వారికి తన స్వప్నం గురించి చెబుదాం అనుకుంది. తన కారు డ్రైవరు శ్రీమఠం భక్తుడితో ఆమెకు మహాస్వామివారి ఏకాంత దర్శనం కావాలని కోరుకుంటోందని చెప్పాడు. అతను స్వామివారికి తెలుపగా అనుష్ఠానము పూర్తిఅయిన తరువాత దర్శనం ఇవ్వడానికి పరమాచార్య స్వామివారు ఒప్పుకున్నారు. వెనకవైపునున్న బావిదగ్గరికి ఆమెని రమ్మన్నారు. ఒక ఆడసహాయకురాలితో ఆమె అక్కడకు వెళ్ళింది. మహాస్వామివారు బయటకు వచ్చి దర్శనం ఇచ్చారు.

ఆమె కొద్దిసేపు స్వామివారిని చూసి వెంటనే స్పృహతప్పి పడిపోయింది. అక్కడున్నవారు ఆమెచుట్టూ చేరి నీరు చెల్లి ఉపశాంతి చేశారు. ఒక గంట తరువాత ఆమె స్వస్థురాలైంది. ఏమి జరిగింది అని అడుగగా, “నా కలలో కనిపించిన పచ్చని చీరకట్టుకుని ఆభరణాలు ధరించిన స్త్రీని వారిలో చూశాను” అని చెప్పింది. కాశ్మీరం నుండి కన్యాకుమారి వరకు చేసిన ప్రయాణంలో ఈరోజుతో తన కలలో వచ్చిన స్త్రీమూర్తిని దర్శించుకుంది. నేను ఇప్పుడు చాలా సంతోషంగా ఉన్నాను అని స్వామివారి వద్ద వీడ్కోలు తీసుకుంది. మహాస్వామివారు ఒక ఆపిల్ ను ప్రసాదంగా ఇచ్చి పంపించారు.

మరుసటిరోజు మఠంలో ఒక సన్యాసితో మాట్లాడుతూ మహాస్వామివారు మూకపంచశతి గురించి అడిగారు. మూకశంకరులు పంచశతిలోని ఆర్యాశతకంలో అమ్మవారి గురించిన

కుండలి కుమారి కుటిలే చండి చరాచరసవిత్రి చాముండే
గుణిని గుహారిణి గుహ్యే గురుమూర్తే త్వాం నమామి కామాక్షి

శ్లోకంలో అమ్మవారు గురుస్వరూపంలో కొలువై వుంటారు అని చెప్పారు. ఆర్యాశతకంలోని చివరి వాక్యం గురించి అడుగగా అది చదివారు. పరమాచార్య స్వామివారు దాని గురించి వివరిస్తూ గురువు అమ్మవారు ఒక్కటే అని, “నిన్న ఆమెకు కలిగిన దర్శనం అదే” అని చెప్పారు.

అపార కరుణాసింధుం జ్ఞానదం శాంతరూపిణం
శ్రీ చంద్రశేఖర గురుం ప్రణమామి ముదావహం ॥

#KanchiParamacharyaVaibhavam #కంచిపరమాచార్యవైభవం
3/11/18, 13:26 - Paramacharyulu: <Media omitted>
3/11/18, 17:24 - Paramacharyulu: ఎనిమిదవ శ్లోక భాష్యం - మొదటి భాగం

సుధాసింధోర్మధ్యే సురవిటపివాటీ పరివృతే
మణిద్వీపే నీపోపవనవతి చింతామణిగృహే .
శివాకారే మంచే పరమశివపర్యంక నిలయాం
భజంతి త్వాం ధన్యాః కతిచన చిదానందలహరీమ్ ..

(అమ్మా! అమృత సముద్రం మధ్యలో ఉన్న కల్ప వృక్షాలు చుట్టూ ఉన్న మణిద్వీపంలో కడిమిచెట్ల ఉద్యానవనం మధ్యలో గల చింతామణులచే కట్టబడిన యింటిలో శివస్వరూపమయిన మంచమున పరమశివుని తొడపైనున్న జ్ఞానానంద ప్రవాహమైన నిన్ను కొందరు ధన్యులు సేవిస్తారు.)

శివుని ఆవాసము కైలాసం. విష్ణుమూర్తిది వైకుంఠం. ఆ విధంగానే లలితాంబికకూ తనదైన ప్రపంచమున్నది. శివకేశవులకు ఒకొక్క నెలవే! లలితాంబికకు రెండు ఇళ్ళు. ఒకటి బ్రహ్మాండంగా పిలవబడేది. ఇది గ్రహాలన్నీ ప్రదక్షిణం చేసే ఒక మేరు శిఖరం. మిగతా మూడు మేరు శృంగాలకు నడుమ నున్న ఉన్నతమైన శృంగంపైన ఉన్నది. లలితా సహస్రనామాలలో *సుమేరు శృంగమధ్యస్థా* అన్న నామం ఈ విషయాన్ని తెలియజేస్తోంది.

అంబిక రెండవ నివాసం బ్రహ్మాండమునకు ఆవలి ప్రక్కనున్నది. ఆమె విశాలమైన అమృతపు సముద్రాన్ని సృష్టించి, దానిమధ్యలో ఉన్న ద్వీపంలో నివసిస్తుంది. లలిత సహస్రనామాలలో అమృత సముద్రంలో ఉన్న ఈ నివాసాన్ని చెప్పిన వెంటనే కామాక్షీ నామం చెప్పబడింది. *సుధాసాగర మధ్యస్థా కామాక్షీ కామదాయినీ*. ఆచార్యులవారు ఈ శ్లోకంలో వివరించినది ఈ నివాసం గురించే! ముందే చెప్పుకొన్నట్లు ఈ లోకం అంబికచేత సృష్టించ బడిందే! మేరుపర్వతంపైన నివాసమున్నదే అది అంబిక చేత కటాక్షించబడిన శక్తితో విశ్వకర్మ నిర్మించినది.

దేవతలకు శత్రువైన భండాసురుని పరిహరించడానికి అంబిక ఆవిర్భవించినపుడు, దేవతలందరూ ఆమెను తమ మహారాజ్ఞి అయిన రాజరాజేశ్వరీగా పట్టాభిషిక్తను చేశారు. ఆ రాణిగారి కోసం విశ్వకర్మ మేరు పర్వతపు మధ్య శృంగంపై అనేక కోటలతో ప్రకాశించే శ్రీపురాన్ని నిర్మించాడు. అయితే ఆచార్యులవారు ఇక్కడ ప్రస్తావించినది సుధాసముద్రంలోని శ్రీపురం గురించి.

మేరు అగ్రంపై ఉన్నదైనా సుధాసముద్రంలోనిదైనా అంబిక నివాసంలో వ్యత్యాసమేమీ లేదు. బహిఃప్రాకారపు దుర్గముల నుండి, ఆమె ఆసీనురాలయే సింహాసనం వరకూ ఉన్న ప్రాకారాలు, సరస్సులు, ద్వారాలు రెండు నివాసాలలోనూ ఒకేరకంగా ఉంటాయి. అది ఆమె రాజధాని. శ్రీనగరమని, శ్రీపురమని పిలవబడుతుంది. ఈ శ్రీపురము ఇరవై అయిదు కోటలు, ప్రాకారాలతో చుట్టబడి ఉన్నది. ఆ కోటలు ఇనుము నుంచి బంగారం వరకు వివిధ లోహాలతో, నవరత్నాలలోని ఒకొక్క జాతి రత్నాలతో నిర్మించబడ్డాయి.

ఇంకా సూక్ష్మంగా పరిశీలిస్తే బుద్ధి, చిత్తము, అహంకారాల దుర్గాలు, సుర్యచంద్రుల ప్రకాశాలతో మన్మథుని కాంతితో కట్టబడిన కోటలు ఉంటాయి. ఈ కోటలన్నిటి మధ్యలో అరణ్యాలు, కల్పవృక్షపు తోటలు, ప్రవాహాలు, కాలువలు ఎన్నో ఉన్నాయి. వీటన్నిటినీ దాటుకుంటూ ఇరవై అయిదవ ఆవరణలోనికి వెళితే అది మహాపద్మవనం. వికసించిన పద్మాలతో నిండి ఉన్న అగడ్త. ఆ లోపల అంబిక భవంతి. ఇటుకలతో కట్టబడింది కాదు. చింతామణులతో కట్టబడింది. ఆ రమ్యహర్మ్యంలో నివసిస్తున్న మహారాణి పేరు రాజరాజేశ్వరి.

(సశేషం)

#KanchiParamacharyaVaibhavam #కంచిపరమాచార్యవైభవం
#ParamacharyaSoundaryaLahariBhashyam
3/12/18, 08:14 - Paramacharyulu: భక్తవత్సలుడు - భక్తవత్సలం

1964లో శ్రీమఠం మకాం కరైకుడిలోని శంకర మఠంలో ఉంది. పరమాచార్య స్వామివారి దర్శనంకోసం అప్పటి తమిళనాడు ముఖ్యమంత్రి శ్రీ యం. భక్తవత్సలం విచ్చేశారు. మహాస్వామివారు వారితో, “రామేశ్వరం దగ్గర ఉన్న ధనుష్కోటి అనే క్షేత్రం గురించి విన్నావా?

అక్కడున్న వారందరిని వెంటనే వారి సమానుతో పాటుగా అక్కడి నుండి ఖాళీచెయ్యించడానికి నువ్వు ఆదేశాలు జారీ చెయ్యి. నీ ప్రభుత్వ ఆస్తుల్ని కూడా సంరక్షించుకోవడానికి తగిన ఏర్పాట్లు చేసుకో" అని ఆజ్ఞాపించారు.

ఎందుకు? ఏమిటి? అని భక్తవత్సలం అడగాలి కదా. కాని ఒక్క విషయం కూడా అడగలేదు. ఎందుకంటె ఆ ఆదేశాలు వచ్చినది భూతభవిష్యత్ వర్తమాన కాలాలను ఎరిగిన పరమాచార్య స్వామివారి నోటి నుండి కనుక. కారణం అడగడం వల్ల కొత్తగా వొరిగేది ఏమీ లేదు. ఏదిఏమైనా అది చాలా పెద్ద కారణమే అయ్యి ఉంటుంది.

అవును నిజంగా అది చాలా పెద్ద కారణమే!!

సరిగ్గా స్వామివారు అలా ఖాళీ చెయ్యించమని చెప్పిన ఏడెనిమిది రోజులకే భయంకరమైన వేగం కలిగిన సుడిగాలులు, పెద్ద సముద్రపు అలలతో కూడిన భయంకరమైన తుఫాను వచ్చింది. మొత్తం ధనుష్కోటి నగరం తుఫానులో చిక్కుకొని సముద్రపు నీటిలో మునిగిపోయింది.

ఎవరు భక్తవత్సలుడు కాషాయం కట్టిన వాడా? లేక తెల్లని చేనేత దుస్తులు కట్టిన వాడా?

అపార కరుణాసింధుం జ్ఞానదం శాంతరూపిణం
శ్రీ చంద్రశేఖర గురుం ప్రణమామి ముదావహం ॥

--- వి.శ్రీనివాసన్, చెన్నై. మహా పెరియవళ్ - దరిశన అనుభవంగళ్ 2

#KanchiParamacharyaVaibhavam #కంచిపరమాచార్యవైభవం
3/12/18, 13:01 - Paramacharyulu: <Media omitted>
3/12/18, 17:09 - Paramacharyulu: ఎనిమిదవ శ్లోక భాష్యం - రెండవ భాగం

ఆమె పంచబ్రహ్మలు కోళ్ళు, ఆసనంగా గల సింహాసనంపై కామేశ్వరాంక నిలయ అయి ఎంతో రాజసంతో రాజ్య వ్యవహారాలను పరిశీలిస్తూ ఉంటుంది. ఇంద్రియాలను పూర్తిగా జయించి, శృంగారపు అంతరార్థం ఎరిగి, ఆ భావంలో లయమయ్యే పరిణతి కలిగి, ఆమె పరబ్రహ్మను సృష్టికార్యంలోకి మరల్చగలిగిన శృంగారాధిదేవతగా చూసాము, పంచబ్రహ్మాసనం మీద కూర్చుని దర్బారు నిర్వహించిన ఆమె, అంతఃపురంలో కామేశ్వరునితో కూడి మంచం పై కూర్చుని తల్లిగా దర్శనమిస్తుంది. దేవతలందరికంటే మహోన్నతురాలామె! దుర్నిరీక్ష్య. కానీ, పరిణత దశలోనున్న సాధకులకు కామేశ్వరుని మహాపతివ్రత అయిన ఆమె అమ్మగా దర్శనమిస్తుంది. *అమ్మేకాదు, నాన్న కూడా ఆమే!!* ఆమె అనుగ్రహం, పుత్రులమైన మనకు ఆ మాతాపితరులతో ఐక్యాన్ని ప్రసాదించే వరకు వెన్నటి ఉంటుంది.

మందారం, పారిజాతం, సంతానం, కల్పకం, హరి చందనమని పిలవబడేవి స్వర్గలోకంలో ఉండే దేవతావృక్షాలు. అమ్మ ఉండే మణిద్వీపం అటువంటి దేవతా వృక్షాలు నిండిన అరణ్యం. మణిద్వీపంలోని భూమి మట్టితో నిండిలేదు. అదే ఒక పెద్ద మణి. ఆ ద్వీపంలో ఒక కదంబ (కడిమి) వృక్షాల ఉద్యానవనమున్నది. తోటను ఉద్యానవనమంటారు. ఇది మనకు కావలసిన రీతిలో మనం పెంచుకొన్న అరణ్యం. ద్వీపం అంచులలో దేవతావృక్షాల అరణ్యం. అమ్మ భవంతి సమీపిస్తుండగా కదంబ వృక్షాల ఉపవనం.

పట్టణాలను, పట్టణశివార్లను అభివృద్ధి చేయడానికి మనం లక్ష్యం లేకుండా చెట్లను నరికివేస్తాం. చెట్లు లేకుంటే జనజీవనానికే ఆపత్తు అన్న విషయం తరువాతనే అర్థమవుతుంది. మళ్ళీ వనమహోత్సవాలు మొదలుపెడతాం. ఈ ఉత్సవాలు కేవలం కాగితం వరకే పరిమితం. పూర్వకాలం మహానగరాల శివార్లలో పెద్ద అరణ్యాలు లేక తోటలు ఉండేవి. కోట కట్టబడిన ముఖ్య పట్టణాలలో ఇటువంటి వనాలు తప్పనిసరిగా ఉండేవి. ప్రకృతి పరిరక్షణతో పాటు శత్రువునుండి కోటను రక్షించడానికిది ఉపయోగపడేది.

అంబిక రాజప్రాసాదం కడిమిచెట్ల తోటలో కట్టబడింది. చింతామణులను ఉపయోగించి కట్టడం వలన మహత్తరంగా తళుకులీనుతూ ఉంటుంది. అంబిక మీదనే కేంద్రీకరించబడిన మన ఆలోచనలు రత్నాలవంటివి. అటువంటి ఆలోచనా రత్నాలతో మన తల్లికి గుడికట్టుకోగలిగితే అది కూడా చింతామణి భవనమే అవుతుంది. అందులో అమ్మ నివసిస్తుంది. అంటే మన ఆలోచనలలో వసిస్తుందన్నమాట. అంబిక మన హృదయంలో నిత్యమూ వసించాలంటే ఆమెను ఎక్కడో బయట మహోన్నతమైన రమ్యహర్మ్యంలో నివసిస్తున్నట్లుగా ధ్యానం చేయడం ఒక మార్గం. కానీ తుదిన ఆమె మనలోనే నివసించాలి. అభిరామభట్టు అనే మహాభక్తుడు, *నీ కోవెల ఇక్కడ ఉన్నదా, అక్కడ ఉన్నదా ? నా హృదయంలో ఉన్నదా ??* అంటాడు. ఇంకోపాటలో *తనను తాను అనేకంగా, ప్రపంచమంతా సర్వవ్యాపిగా ఆవిష్కరించుకొన్న ఆ తల్లి, ప్రపంచం నాశనమైపోయినపుడు పరమాత్మగా అయిపోతుంది. అటువంటి మహాతల్లి, ఎలాగోలా నా చిన్న హృదయంలో వసిస్తోంది* అంటారు.

సరి! చింతామణులతో కట్టబడిన భవంతిలో అంబిక శివాకారమైన మంచంపైన కూర్చుంది. అది పంచ బ్రహ్మాసనం. పంచబ్రహ్మలపైన పరబ్రహ్మ స్వరూపుడైన కామేశ్వరుడు లేక పరమశివుని సంస్థితి. ఆయన ఒడిలో అంబిక ఆసీనురాలయి ఉందట. *పరశివ పర్యంకనిలయ* అంకమంటేనే ఒడి అన్న అర్థముంది. పర్యంకమంటే అనేక అర్థాలున్నాయి. అయ్య, మంచం, నడుముకు చుట్టుకొన్న వస్త్రం, ఒడి అన్న అర్థాలున్నాయి. గూడుకట్టబడిన పల్లకి అని వేరొక అర్థముంది. కామేశ్వరుని ఒడి అంబికకు పర్యంకం.

(సశేషం)

#KanchiParamacharyaVaibhavam #కంచిపరమాచార్యవైభవం
#ParamacharyaSoundaryaLahariBhashyam

3/13/18, 07:34 - Paramacharyulu: ఎవరు నిజమైన గురువు?

కంచి కామకోటి పీఠాధిపతులు శ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతి స్వామివారు ఉత్తర భారతదేశంలో పర్యటన చేస్తున్నప్పుడు అప్పటి దేశ ప్రధానమంత్రి శ్రీమతి ఇందిరా గాంధి గారు మహాస్వామివారి దర్శనానికి వచ్చారు.

దేశ ప్రధానమంత్రి పరమాచార్య స్వామిని ఇలా అడిగారు, “ఆధ్యాత్మికత, దైవం ముసుగులో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్న వ్యక్తుల గురించి మీరు నాకు చెప్తే, నేను వారిపై కఠిన చర్య తీసుకుంటాను”

పరమాచార్య స్వామివారు నవ్వి, ఇలా అన్నారు. “లేదు! దాన్ని ఈ విధంగా పరిష్కరించరాదు. ఎవరైతే అటువంటి దొంగ స్వాముల వద్దకు చేరతారో, కొంతకాలం తరువాత తమకు తామే వారి ఆధ్యాత్మిక పరిపక్వత స్థాయిని తెలుసుకుంటారు”

మహాస్వామివారు ఇచ్చిన సమాధానంతో శ్రీమతి ఇందిరా గాంధీ తృప్తిపొందలేదని అర్థం చేసుకున్నారు. అక్కడున్న భక్తులలోంచి చిన్నవారినొకరిని పిలుచుకుని రమ్మని సహాయకులకు చెప్పారు స్వామివారు. ఒక ఐదు సంవత్సరాల వయస్సున్న పిల్లని పిలుచుకుని వచ్చారు. చిరునవ్వుతో ఒక పళ్ళబుట్టని చూపిస్తూ “నీకు ఏమి కావాలో తీసుకో” అని అన్నారు. ఆ పిల్ల కొద్దిసేపు వెతికి ఒక పండిన పండు తీసుకుంది.

దీన్నంతా గమనిస్తున్న ఇందిరా గాంధీతో మహాస్వామివారు, “చిన్నపిల్లలు ఎలాగైతే పండినదో, పండనిదో తెలుసుకోగలరో, అలాగే సత్యాన్ని వెతుకుతూ వెళ్ళేవారికి జీవితంలో ఎదో ఒకరోజు సరియైన మహాత్ముడు దొరుకుతాడు”

అపార కరుణాసింధుం జ్ఞానదం శాంతరూపిణం
శ్రీ చంద్రశేఖర గురుం ప్రణమామి ముదావహం ॥

#KanchiParamacharyaVaibhavam #కంచిపరమాచార్యవైభవం
3/13/18, 16:48 - Paramacharyulu: ఎనిమిదవ శ్లోక భాష్యం - మూడవ భాగం

కామేశ్వరుని పర్యంక నిలయయైన అంబికకు భగవత్పాదులవారు కామేశ్వరి అనో, రాజేశ్వరి అనో, రాజరాజేశ్వరి అనో శృంగార సుందరి అనో పిలవడం లేదు. జ్ఞానంలో పరాకాష్ట చేర్చుతూ ఆమెను *చిదానందలహరి* అన్న పేరుతో స్తుతిస్తున్నారు. ఆచార్యులవారి కవిత్వపటిమను ఈ సంబోధన తెలియజేస్తుంది. అంబిక అయ్యతో శృంగార మూర్తిగా ఉన్నా అది ఆత్మ శృంగారం. సత్యవస్తువుకు అభిన్నమైన స్పృహవలన జనించిన బ్రహ్మానందం కదా అది. సింహాసనం పైనో, మంచం పైనో, మేరుపర్వత శిఖరం పైన ఉన్న భవంతిలోనో, సుధాసాగర మధ్యస్తమైన మహాప్రాసాదంలోనో ఎక్కడుంటే ఏమి ఆమె ఆత్మస్పృహ వలన జనించిన చిదానంద ప్రవాహం. ఈ పదం ఉపయోగించడంలో ఆచార్యులవారి ఉద్దేశం ఇది.

అటువంటి చిదానంద ప్రవాహాన్ని - *భజంతి త్వాం ధన్యః కతిచన* అంటే అదృష్టవంతులైన కొందరు అటువంటి నిన్ను పూజిస్తున్నారు. కొద్దిమంది మాత్రమే ఏమి. ఎంతోమంది దేవీ పూజలు చేస్తున్నారు. రోజురోజుకూ సంఖ్య పెరుగుతూ ఉంది కూడా! కొన్ని పదాలు గొణగడం, కర్పూరం వెలిగించడం పూజ అవుతుందా ? నిజమైన పూజ అంటే ఏమిటి ?

క్రిందటి శ్లోకంలో అంబిక మూర్తిని గురించి వివరించబడింది కదా! ఆ మూర్తిని భావించి హృదయంలో ముద్రించుకోవాలి. మనం కూడా అంబిక నివసిస్తున్న శ్రీనగరంలో ఉన్నామని భావించుకోవాలి. ఆమె దయ అమృతసాగరమని, మనం కల్పవృక్షాల మధ్యలో మణిద్వీపంపై ఉన్నామని, మన పూజగది సర్వకాంక్షలను తీర్చగలిగే చింతామణులతో నిర్మించబడిందని ఊహించాలి. ఈ భావం స్థిరపడినప్పుడు సిద్ధించేది *సాలోక్య మోక్షమని* నా ఉద్దేశం. సాధారణంగా సాలోక్యముక్తి అంటే మన ఇష్టదేవతలకు సంబంధించిన లోకంలో ఆవాసం చేయడమన్న భావం ఉంది. అయితే మనమున్న ఈ ప్రదేశమే మన ఇష్టదేవత నివసించే లోకమనే భావనను దిటవు చేసుకోవడమే ఉత్తమం.

*సాలోక్యం* తరువాతది *సామీప్యం*. సుధాసాగరపు గట్టుమీద నుండి కల్ప వృక్షాల అరణ్యాన్ని, కడిమిచెట్ల ఉద్యానవనాలను దాటుకుని, చింతామణి గృహంలో ప్రవేశించి అంబిక శయనించే మంచం దగ్గరకు చేర్చడం *సామీప్యం*. ఇక *సారూప్యం*. తుమ్మెద గురించి నిరంతరం ఆలోచిస్తూ తుమ్మెద అయిపాయే రీతిలో నిరంతరం అంబిక దివ్య మోహన రూపాన్ని ఆలోచిస్తూ అదే మూర్తిని పొందవచ్చు. ముందు శ్లోకంలో వర్ణించిన అంబిక స్వరూపాన్ని ధారణచేసి, ధ్యానిస్తే కామేశ్వర పర్యంక నిలయగా ఆ తల్లిని భావనతో చూస్తూ కరిగిపోతే *సారూప్యం* సిద్ధిస్తుంది.

పరమమైన ముక్తి *సాయుజ్యం* ఇష్టదేవతతో ఐక్యమయిపోవడం. ఇంతకుముందు ముక్తిలో మనం అంబికను పోలిన రూపాన్ని పొందాం. ఇప్పుడు అంబికే అయిపోవడం. అదే సత్యం మనమయిపోవడం. ఆ సత్యాన్నే ఆచార్యులవారు *చిదానందలహరి* - అనంతమైన ఆనంద ప్రవాహమైన ఆత్మస్పృహ అంటున్నారు. ఆ ప్రవాహంలో మనం కరిగిపోవాలి. అదే *సాయుజ్యం*. దానితరువాత మరి ఇంకే పూజా అవసరం లేదు. పూజ చేయవలసిన స్థితిలో ఉన్నంతవరకూ ఆ చిదానందలహరిలో ఆ అద్వైత తత్త్వంతో కరిగిపోయే లక్షణం పెంపొందించుకోవాలి.

అంబిక లోకమైన శ్రీపురాన్ని చేరడం, ఆమె రూపాన్ని పొందడం, ఆమెలో ఐక్యమయిపోవడం అని క్రమంగా జరగనీయండి. ప్రస్తుతానికి మానసికంగా మనలను ఆ స్థితులకు (సాలోక్య, సామీప్య, సారూప్య, సాయుజ్యాలకు) ఆయత్త పరుచుకోవాలి. పూజకు కూర్చున్నామా మన మనస్సు ఆమె పాదాలకు అటుఇటు కదలకూడదు. ఆఫీసుకు సమయం అయిపోతున్నదేమో, ఈ రోజు కాంటీనులో ఏ రకం వడ వేస్తాడన్న ఆలోచనలు మీ ఏకాగ్రతను భంగం చేయరాదు. మీ మనస్సు అమృత సముద్రపు అలలలో తడిసిపోవాలి. చివరకు చిదానంద సాగరమైన అంబిక సత్యరూపంతో కలిసిపోవాలి.

మనం ఆ రకమైన పూజ చేస్తున్నామా ? కొందరు మహాపురుషులు పూర్వజన్మ సుకృతం వలన అంబిక స్వరూపంలో చిదానంద రసాన్ని ఎముకలోనికి తెచ్చుకొనేంతటి ఏకాగ్రతతో పూజచేస్తారు. వారే ఆచార్యులవారు చెప్పిన *కతిచన ధన్యః* - కొందరు ధన్యులు.

(సశేషం)

#KanchiParamacharyaVaibhavam #కంచిపరమాచార్యవైభవం
#ParamacharyaSoundaryaLahariBhashyam
3/14/18, 07:15 - Paramacharyulu: సంప్రదాయం - సమస్య

చాలాసంవత్సరాల క్రితం ఉషోదయకాలంలో కాంచీపురం శ్రీమఠం. ఆ రోజు చాలామంది భక్తులు లేరు. పరమాచార్య స్వామివారు దర్శనం ఇస్తున్నప్పుడు దేవతలా నగలు వేసుకుని అలంకరించుకున్న ఒక సుమంగళి నేరుగా స్వామివద్దకు వెళ్ళి నమస్కరించింది. అశ్రుపూరిత నయనాలతో లేచి నిలబడింది.

పరమాచార్య స్వామివారి మార్గదర్శనం కోసం ప్రార్థిస్తోంది. బహుశా ఏదో విపరీతమైన వ్యక్తిగత సమస్య అయ్యింటుంది. కళ్ళతో అర్థిస్తూ, వణుకుతున్న పెదాలనుండి వస్తున్న మాటలతో, "ఒక్క క్షణం కూడా నాపై మీ అనుగ్రహదృష్టి ప్రసరించరా? కనీసం నా ప్రార్థన కూడా ఆలకించరా అని వేడుకుంటోంది". ఆ కరుణామయుడు ఆమె ప్రార్థనను వినాలనుకుంటున్నారు. కాని పక్కన ఎవరితోడు లేకుండా ఒంటరి ఆడవారి మాటలను వినరాదన్న పీఠ నియమానికి కట్టుబడి ఉన్నారు. ఆమె కళ్ళు ధారాపాతంగా వర్షిస్తుండగా నిస్సహాయురాలై అక్కడే నిలబడి ఉంది. ఆమె తప్పుకుంటే కాని ఇతర భక్తులు స్వామివారు దర్శనానికి రాలేరు. మరి అలా ఎంతసేపు అడ్డగించగలదు? స్వామివారు చేతి సంజ్ఞతో ఒక పరిచారకుణ్ణి రమ్మని పిలిచారు.

"ఇక్కడ పూర్తి చవిటివాడు ఎవరైనా ఉన్నారేమో చూడు" అని అన్నారు. సహాయకుని అదృష్టం కొద్దీ ఒక చవిటివాడు దొరికాడు. "నేను చెప్పేది విను. ఆ చవిటివాడు ఈమెతో కలిసి రాగానే నువ్వు చప్పట్లు చరిచి అతణ్ణి పేరుతో పిలువు. అతని ప్రతిక్రియను బట్టి అతను నిజంగా చవిటివాడో కాదో నీకు అర్థం అవుతుంది"

పరమాచార్య స్వామివారి సలహా అమోఘం. ఎవర్నో ఒకడిని తీసుకునిరావాలని నిజంగా చవిటివాణ్ణి కానివాడిని ఆ శిష్యుడు తీసుకునివస్తే. అప్పుడు కుటుంబ కష్టాలు చెప్పాలనుకున్న ఆమెకి హానికారం కదా! కనుక ఈ సలహా మహాస్వామివారు ఇంకొక శిష్యునికిచ్చారు కనిపెట్టమని. ఆ చవిటివాడు పక్కనుండగా ఆమె తన కష్టాన్నంతా స్వామివారికి చెప్పుకుంది. పరమాచార్య స్వామివారు ఓపికగా అంతా విని ఆమెను అనునయించారు. ఇప్పుడు కూడా ఆమె ఏడుస్తోంది, సంతోషంతో!! ఆమె ప్రసాదం తీసుకుని స్వామివారి ఆశీస్సులు తీసుకుని వెళ్ళిపోయిన తరువాత ఆ చవిటివాణ్ణి కూడా వెళ్ళమని చెప్పారు స్వామివారు.

ఎటువంటి పరిస్థితులలోనూ సన్యాసాశ్రమ ధర్మాలను తప్పేవారు కాదు స్వామివారు. అలా అని నమ్మిన భక్తులను కరుణించడంలో ఏమాత్రమూ అలసత్వం చూపేవారు కాదు.

అపార కరుణాసింధుం జ్ఞానదం శాంతరూపిణం
శ్రీ చంద్రశేఖర గురుం ప్రణమామి ముదావహం ॥

--- మహా పెరియవళ్ - దరిశన అనుభవంగళ్

#KanchiParamacharyaVaibhavam
#కంచిపరమాచార్యవైభవం
3/14/18, 12:26 - Paramacharyulu: <Media omitted>
3/14/18, 17:07 - Paramacharyulu: తొమ్మిది, పది శ్లోకాల ఉపోద్ఘాతం - మొదటి భాగం

(షట్చక్రముల ప్రస్తావన ఉన్న శ్లోకాలు రాబోతున్నందున దానికి ఉపోద్ఘాతంగా మహాస్వామి వారి ఉపదేశమిది)

ఈ రోజుల్లో చాలామంది కుండలినీ యోగ దీక్షనిస్తామని శిక్షణాశిబిరాలు ఏర్పాటు చేస్తున్నారు. పుచ్చుకొనేవారు ఎగబడుతున్నారు. తమకు కుండలినీ ప్రచోదన కలిగిందనీ, తాము మహాయోగులమనీ తమకుతామే ప్రచారం చేసుకొనేవారూ ఉన్నారు. ఉదయ సూర్యుని అరుణ ప్రకాశంతో మిలమిలలాడిపోయే ఆ తల్లి వీరందరికీ నిజంగా సంపూర్ణంగా ఆవిష్కృతమయి ఉంటే మాటలకందని మహదానంద స్థితిలో ఉండిపోయేవారు. మనందరిలోనూ శివశక్తి నాలుగింట మూడువంతులు నిద్రాణమై ఉంటే ఈ యోగులమని చెప్పుకొనే వారి విషయంలో మనకంటే కొంచెం మేరకు జాగృతమై ఉండి ఉండవచ్చు. కుండలిని కదిలితేనే నడినెత్తిన ప్రకంపనలు, భ్రూమధ్యంలో ఏకాగ్రత వంటివి సిద్ధిస్తాయి. అయితే దానికి కుండలిని తన గమ్యం చేరిందని అర్థంకాదు. తీవ్ర యోగాచరణ వలన కుండలిని తన స్వస్థానం నుండి స్వల్పంగా పైకి లేచి మళ్ళీ యథాస్థానం లోనికి ప్రవేశిస్తుంది.

ప్రతి అణువులోనూ అనంతమయిన శక్తి నిక్షిప్తమయి ఉండి తగినె పద్ధతిలో విస్ఫోటనం జరిపినపుడు అనంతమైన శక్తిని విడుదల చేస్తుందనీ, దానిని సక్రమమైన పద్ధతిలో ఉపయోగించి మానవ కల్యాణానికి ఉపయోగించుకోవచ్చునీ, దారిమళ్ళిస్తే ప్రపంచ నాశనానికి కారణమవుతుందనీ అణుశస్త్రం చెబుతోంది కదా! అలాగే ప్రతి వ్యక్తిలోనూ అనంతమైన పరబ్రహ్మ శక్తి కుండలినీ రూపంగా నిక్షిప్తమైయున్నది. మనవంటి సాధారణ మానవులలో ఆ శక్తి నిద్రాణమై ఉంటుంది. మనం కష్టతమమైన యోగసాధన చేస్తే – ఆ శక్తి కొన్ని చక్రముల ద్వారా పైకి వెళుతూ చివరకు పరాశక్తిగా జాగృతమవుతుంది. అటువంటి జాగృతమయిన పరాశక్తి పరబ్రహ్మలో

లీనమయిపోతుంది. కుండలినీ శక్తి ఒక్కొక్క చక్రమును దాటినపుడు సాధకునికి కొన్ని సిద్ధులు కలుగుతాయి. ఆ సిద్ధుల వ్యామోహంలో తనకు అత్యంతికమైన ఫలం సిద్ధించిందనే అపోహతో సాధన ఆపివేయరాదు. ఇదీ కుండలినీ యోగసారం. మనం ఇంతమాత్రం ఎఱిగి ఉంటే చాలు. అది కూడా ఎందుకంటే – ఈ దేశంలో పుట్టిన తరువాత మన పరంపరాగతమైన మహచ్ఛాస్త్రములు గురించి ప్రాథమికమైన అవగాహన ఉండాలనే! కుండలిని సరియైన పథం నుండి మరలినపుడు ఫలితాలు ప్రమాద భరితంగా ఉంటాయి. మతిస్తిమితం కూడా తప్పవచ్చు. సాధకులు ఈ విషయం అత్యంత జాగరూకతతో గుర్తించాలి.

ఈ ప్రపంచంలో మాయ అనేకరకాలు. ఆ మాయ నుండి బయటపడడానికి అనేక పద్ధతులు. కుండలినీ యోగపు తుదిగమ్యం అన్నిరకములైన మాయలను అధిగమించి పరమాత్మలో లీనమవడమనేది నిస్సందేహమైన విషయం. అయితే ఆ త్రోవలో అంబిక విరాట్ శ్శక్తిని సందర్శించవచ్చు. సాధకునికి కూడా శక్తులు సిద్ధిస్తాయి. అయితే ఈ యోగంలో అంబిక ఎంతో మాయను మేళవించింది. సాధకుడు అత్యంత సులభంగా ఆ మాయలో పడిపోవచ్చు. ఆమె ఎందుకలా చేసిందో మనమెలా చెప్పగలం ? ఒక పంట ఊరికే నేలపై విత్తులు జల్లినంతనే మొలచి పంటకొస్తుంది. కొన్ని పంటలు సరియైన నేల, వాతావరణము వెతికి అటువంటి పరిస్థితులలోనే పండించాల్సి ఉంటుంది. ఎందుకంటే, అది అంబిక లీల. ఆమె కుండలినీ యోగాన్ని అత్యంత కష్టసాధ్యమైన యోగంగా నిర్దేశించింది.

(సశేషం)

#KanchiParamacharyaVaibhavam #కంచిపరమాచార్యవైభవం
#ParamacharyaSoundaryaLahariBhashyam
3/15/18, 10:06 - Paramacharyulu: నెమలీకలు - జైనులు

ఢిల్లీకి చెందిన ఆర్.కె. రంగన్ పరమాచార్య స్వామికి పెద్ద భక్తుడు. దర్శనానికి వచ్చిన ప్రతిసారీ, నెమలీకలతో చేసిన విసనకర్రను తెచ్చి స్వామికి సమర్పించేవాడు. మహాస్వామివారు అప్పుడప్పుడు దోమలను ఈగలను తోలడానికి ఉపయోగించేవారు. రంగన్ ఒకసారి ఒక డజను నెమలీక విసనకర్రలను తీసుకుని వచ్చాడు. స్వామివారు వాటిని తీసుకొని మేనాలో పెట్టుకున్నారు. శిష్యులు ఈ విషయం చూసి ఆశ్చర్యపోయారు. తమకోసం వస్తువులను అలా దాచుకోవడం మహాస్వామివారు ఎప్పుడూ చెయ్యరు.

ఒకరోజు ఉదయం మహాస్వామి వారు మేనాలో కూర్చుని జపం చేసుకుంటుండగా, పెద్ద ఈగల గుంపొకటి అటుగా వచ్చింది. స్వామివారు నెమలీకల విసనకర్రను వాడుతున్నారు వాటిని పారదోలడానికి. అప్పుడు కొంతమంది జైన సాధువులు వచ్చారు. వారి సంప్రదాయం ప్రకారం నోటి చుట్టూ తెల్లని గుడ్డ చుట్టుకొని ఉన్నారు. చాలా విషయాలపై స్వామివారు మాట్లాడుకున్నారు.

సంస్కృత పదకోశమైన అమరకోశం రాసినవారు జైన రాజైన అమరసింహుడు. జైనులకు సంబంధించిన చాలా పుస్తకాలు సంస్కృతంలోనే ఉన్నాయి. వీటన్నిటిని విని ఆ సాధువులు చాలా సంతోషించారు.

“మీరు ఉదయం నిద్ర లేవగానే ‘విప్రక్షయం’ ప్రార్థన చేస్తారా?” అని అడిగాఅరు మహాస్వామివారు.

“లేదు. మా గురువుగారు ఇక దానితో పనిలేదని చెప్పారు” అని వారు బదులిచ్చారు.

అక్కడ ఉన్న శిష్యులకి పరమాచార్య స్వామివారు అడిగిన ప్రశ్న కాని, ఆ సాధువులు చెప్పిన సమాధానం కాని ఏమీ అర్థం కాలేదు.

మహాస్వామివారే దాని గురించి ఇలా చెప్పసాగారు. “వైదిక క్రతువులు, అగ్ని సంస్కారాలు చాలా బాగా జరుగుతున్న కాలంలో, శాస్త్రం చెప్పిన విధంగా వైదిక యజ్ఞాలలో జంతు బలులు జరిగేవి. అహింసా సూత్రం మూల సూత్రంగా గల జైన మతం ఉధృతిలోకి వచ్చాక రోజూ ఉదయం ‘విప్రక్షయం’ లేదా ‘బ్రాహ్మణులు క్షయించుగాక’ అని పఠించేవారు వైదిక మతం సమసిపోవాలని”

బహుశా స్వామివారి ఆంతర్యం గ్రహించారేమో ఆ జైన సాధువులు, “అవును, అవును. ఇప్పుడు దాదాపు బ్రాహ్మణులందరూ అగ్నికార్యం వదిలేశారు. కాబట్టి యాగాలలో జంతుబలులు జరగటం లేదు. కనుక మా గురువులు ‘విప్రక్షయం’ పఠించవలసిన అవసరం లేదని సెలవిచ్చారు” అని చెప్పారు.

మహాస్వామివారు వారందరికి ఒక్కొక్క నెమలీక బహుమానంగా ఇచ్చారు. నెమలిని హింసించకుండా అవి వదిలిపెట్టినప్పుడు కిందపడినవి కావున వారు సంతోషంతో వాటిని స్వీకరించారు. బహుశా ఈ జైన సన్యాసులు వస్తారనే వారికి వీటిని బహుమానంగా ఇవ్వొచ్చనే మహాస్వామివారు ఆ నెమలీకలను మేనాలో దాచుకున్నారేమో. ఏమో! నెమలిపై ఎక్కి విహరించే ఆ స్వామినాథునికే తెలుసు.

అపార కరుణాసింధుం జ్ఞానదం శాంతరూపిణం
శ్రీ చంద్రశేఖర గురుం ప్రణమామి ముదావహం ॥

--- మహా పెరియవళ్ - దరిశన అనుభవంగళ్

#KanchiParamacharyaVaibhavam #కంచిపరమాచార్యవైభవం
3/15/18, 12:52 - Paramacharyulu: <Media omitted>
3/15/18, 16:32 - Paramacharyulu: తొమ్మిది, పది శ్లోకాల ఉపోద్ఘాతం - రెండవ భాగం

కుండలినీ యోగం కష్టమే! అయితే భక్తి జ్ఞాన యోగ మార్గాల్లో సాధకుడు సులభంగా తుదిగమ్యాన్ని చేరగలుగుతున్నాడా అని

ప్రశ్నించవచ్చు. ఇది సముచితమైన ప్రశ్నే. అయితే ఆ సాధనా మార్గాలు కుండలినీ యోగమంతటి క్లిష్టతరమైనవి కాదు. ఆయా మార్గాలలో పయనిస్తుంటే తప్పులు దొర్లినా విపరీత ఫలాన్నీయవు. భక్తులకు, జ్ఞాన మార్గంలో ఉన్నవారికి కూడా అంబిక తన శక్తిని ఎఱుకపరుస్తుంది. ఆ భక్తునికో, ఆ సాధకునికో ఆ శక్తుల మీద ఇచ్ఛలేదు. అంబిక పాదాలపై చిక్కటి అనురాగంతో భక్తుడు ఆనందాంబుధిలో ఓలలాడుతుంటే,అనంతమైన శాంతితో నిశ్చలునిగా ఉండటానికి ప్రయత్నిస్తూ ఉంటాడు. అయినా నిర్మల హృదయులైన వీరికి లోకక్షేమార్థం అంబిక కొన్ని శక్తులను అనుగ్రహిస్తుంది. ఆ శక్తులను వారు తమ ప్రయోజనాలకు ఉపయోగించుకోరు. ఆర్తులనెవరినైనా చూసి వారి కష్టానికి వీరి హృదయం కరిగినపుడు అంబికానుగ్రహాన ఆ అర్తులకు కష్టాలు తీరుతాయి.

కుండలినీ యోగం చేసేవారిలో ఎక్కువమంది రాజసంతో ఏవో కొన్ని శక్తులు సంపాదించి చూపాలనే ఉద్దేశ్యంతో ఉంటారు. ఆ శక్తులకై వారు చెల్లించాల్సిన మూల్యం అంబిక గట్టిగా బేరం చేసి మరీ పుచ్చుకొంటుందా అనిపిస్తుంది. పరాశక్తి జీవిని నిశ్చల నిర్మల తత్త్వమైన పరబ్రహ్మలో లయం చేయడం కంటే మహాశక్తి స్వరూపమైన తన తత్త్వంలో కలుపుకోవడం కష్టతరంగా కల్పించింది. ఎలాగూ తుది గమ్యం ఏ మార్గంలో అయినా పరబ్రహ్మానుసంధానమే! మనలో లక్షకొకరు కుండలినీ యోగసాధనలో సరియైన దిశలో పయనిస్తే కోటికొకరు ఉత్తీర్ణత సాధించగలరేమో!

గీతలో భగవానుడు భక్తి యోగ మార్గాల గురించి –

*నేహాభిక్రమ నాశోస్తి ప్రత్యవాయో నవిద్యతే
స్వల్పమప్యస్య ధర్మస్య త్రాయతే మహతోద్భయాత్*

అంటారు. *ఈ మార్గంలో చేసిన ప్రయత్నమెప్పుడూ వ్యర్థమవదు. విపరీత ఫలాన్నీయదు. ఈ మర్గంలో చేసిన స్వల్ప ప్రయత్నమైనా మహాభయం నుండి రక్షిస్తుంది*. కుండలిని యోగ విషయంలో ఇది కుదరదు. అందులో ఉన్న అగాధాలని దాటే ప్రయత్నంలో నిస్పృహ చెంది. ఎక్కువశాతం సాధకులు ప్రయత్నాన్ని విరమిస్తారు. మళ్ళీ కుండలిని మామూలుగా యథాస్థానం చేరుతుంది. ప్రయత్నమంతా వృథా అయిపోతుంది. కొంచెం సాధన తప్పుదోవ పట్టిందా – విపరీత ఫల రూపంలో ప్రత్యవాయం కూడా సిద్ధిస్తుంది. తుదివరకూ తన ప్రయత్నం పై తనకు నమ్మకం లేక మహాభయాన్ని కలగజేస్తుంది.

సిద్ధి అనే విషయం అటుంచి ఈ యోగంలో ఇంకొక ప్రమాదం కూడా ఉంది. సాధకునికి మూలాధారంలో కుండలిని కదలిక ఆరంభమవగానే ఆ శక్తి సహస్రారం చేరిందనే ఆలోచన కలుగుతుంది. కొంచెం ఒకటి రెండు చక్రాలు తిరిగి వచ్చిందా, తద్వారా కల్గిన అల్ప శక్తులను చూసుకొని తానిక సిద్ధుడ్నయిపోయాననుకొంటాడు. ఇది సప్త ప్రాకారాలతో కూడి ఉన్న గుడిలో మొదటి గాలి గోపురాల్లో ప్రవేశించి గర్భగుడిలోనికి చేరాననుకోవడం వంటిది. సాత్వికతను పెంపొందించే భక్తి జ్ఞాన మార్గాలలో ఈ ఇబ్బంది లేదు. భక్తి జ్ఞాన మార్గాలు ద్వారా పొందలేని పరిపూర్ణత ఈ కుండలినీ యోగం వల్ల సిద్ధించదు. పరిపూర్ణత ఏ మార్గంలోనైనా ఒకటే!

ఎవరైనా కాంచీపురం కామాక్షీ గుడికి వెళ్ళడమెలాగని అడిగారనుకోండి. బ్రాడ్వేకి వెళ్ళి బస్సు ఎక్కితే కామాక్షీ గుడి సమీపంలోనే బస్సు ఆగుతుందని చెబుతాం. అంతేకాని తిరువట్రియూరు దేవాలయంలోని పల్లవుల కాలం నాటి సొరంగం నేరుగా కాంచీపురం కైలసనాథర్ దేవాలయంకి చేరుతుంది. అక్కడ నుండి ఒక అరమైలు దూరంలోనే కామాక్షీ గుడి ఉన్నదని చెబుతామా! అలాంటి సొరంగం ఉండి ఉండవచ్చు. కానీ దానిలో నుండి పోగల సాహసం చేయగల వారెవ్వరు ? దానిని గురించి తెలుసుకోవడం వల్లన మన పూర్వీకుల నైపుణ్యం పైన అబ్బుర పాటు కలుగుతుంది. కానీ ఆ మార్గాన్ని సాధారణ మానవుడు ఉపయోగించుకోలేడు.

(సశేషం)

#KanchiParamacharyaVaibhavam #కంచిపరమాచార్యవైభవం
#ParamacharyaSoundaryaLahariBhashyam
3/15/18, 22:01 - This chat may be with a business account. Tap for more info.
3/16/18, 07:36 - Paramacharyulu: వేదం - అనుగ్రహం

పరమాచార్య స్వామివారు సాక్షాత్తు దైవస్వరూపులు. కలియుగంలో వైదిక ధర్మాన్ని నిలబెట్టడానికి వచ్చిన అపర శంకరావతారులు. మా తండ్రిగారికి పరమాచార్య స్వామివారు తప్ప వేరు దైవము లేదు. స్వామివారి ఉపదేశం విని మా ముగ్గురు అన్నదమ్ములను వేదసేవకే వినియోగించారు. వేదపండితుడైన యువకునికే మా చెల్లిని ఇచ్చి కన్యా వివాహం చేశారు. అలాగే, వారి ఇష్టానుసారమే మా అన్నకు నాకు కూడా కన్యా వివాహమే చేశారు.

నేను వేదపాఠశాలలో విద్యార్థిగా ఉన్నప్పుడు రెండు మూడు రోజులు వరుసగా సెలవు వస్తే, మా గురువు గారు మమ్మల్ని మహాస్వామివారి వద్దకు "స్వామివారి సమక్షంలో వేదం చెప్పండి" అని పంపేవారు. అప్పుడు మహాస్వామివారు మా అహార విహారాదుల గురించి అన్ని విషయాలు అడిగేవారు. ఆంధ్రదేశ పర్యటనప్పుడు నేను వారితో పాటు కార్వేటి నగరం, బుక్క, రామగిరిలో ఉన్నాను. స్వామివారు నన్ను అనుగ్రహించి బ్రహ్మశ్రీ గోదా మంత్రాలయం వద్దకు పంపారు. తరువాత నేను తిరుపతిలో వేదపారయణదార్ ఉద్యోగానికి అర్జీ పెడితే స్వామివారి అనుగ్రం వల్ల పరీక్షలో ఉత్తీర్ణుడయ్యాను. స్వామివారి అనుమతితో వెళ్తామని చెప్పడానికి వారి వద్దకు వెళ్ళాను. అనుకోకుండా స్వామివారు వెళ్ళమని అనుజ్ఞ ఇచ్చారు. ఆశీపూర్వకంగా నాచేతిలో ఒక కమలం పెట్టారు. ప్రేమతో వారు నాతో, "శాస్త్రాన్ని ఉల్లంఘించకుండా నీ కర్తవ్యం నిర్వర్తించు. ఒకవేళ శాస్త్రాన్ని ధిక్కరించవలసిన పరిస్థితి వస్తే, ఉద్యోగం వదిలేసి నావద్దకు రా. నీ బాధ్యత నేను తీసుకుంటాను" అని అన్నారు.

చిన్న కాంచీపురంలోని మహాస్వామి వారి వేదపాఠశాలలో నేను వేదం నేర్చుకున్నాను. అక్కడ నేను విద్యార్థిగా ఉన్నప్పుడు మాకు భోజన సదుపాయాలు అంతగా ఉండేవి కావు. కనుక స్వామివారు భక్తులను ప్రతి నెలా తమ జన్మనక్షత్రం రోజున ఏవైనా మధుర పదార్థాలు,

తినుబండారలు చేసి తనకు చూపించి వేదపాఠశాలలో ఇమ్మని చెప్పారు. భక్తులు అలాగే చేసేవారు. మేము పరమాచార్య స్వామివారి దర్శనానికి వెళ్ళినప్పుడు స్వామివారు మమ్మల్ని ప్రేమపూరిత మాటలతో అడిగేవారు, “ఈరోజు తినుబండారాలను ఎవరు తీసుకొనివచ్చారు?” అని. ఫలనా వారు మీకు ఈరోజు మధుర పదార్థాలు తెచ్చారా? అని ప్రేమగా అడిగేవారు. దాన్ని తలచుకోవడం ఇప్పటికి ఒక మధురానుభూతి.

పరమాచార్య స్వామివారి కటాక్షం పొందాలంటే విశేషంగా ఏమీ చెయ్యనక్కరలేదు. వేదం పఠిస్తే పరమాచార్య స్వామివారు వారంతట వారే వచ్చి మనల్ని అనుగ్రహిస్తారు. “మంత్రాదీనంతు దైవతం” అంటే దేవతలు మంత్రం యొక్క ఆధీనంలో ఉంటారు అన్నట్టు మనం వేద పారాయణం మొదలుపెట్టగానే వారే స్వతహాగా మనం కూర్చున్న చోటికి వచ్చి మనల్ని ఆశీర్వదిస్తారు.

అపార కరుణాసింధుం జ్ఞానదం శాంతరూపిణం
శ్రీ చంద్రశేఖర గురుం ప్రణమామి ముదావహం ॥

--- శ్రీ కె. చంద్రశేఖర ఘనాపాటి, న్యాయ - వేదాంత శిరోమణి, తిరుపతి. మహా పెరియవళ్ - దరిశన అనుభవంగళ్

#KanchiParamacharyaVaibhavam #కంచిపరమాచార్యవైభవం
3/16/18, 07:40 - Paramacharyulu: వేదం - అనుగ్రహం

పరమాచార్య స్వామివారు సాక్షాత్తు దైవస్వరూపులు. కలియుగంలో వైదిక ధర్మాన్ని నిలబెట్టడానికి వచ్చిన అపర శంకరావతారులు. మా తండ్రిగారికి పరమాచార్య స్వామివారు తప్ప వేరు దైవము లేదు. స్వామివారి ఉపదేశం విని మా ముగ్గురు అన్నదమ్ములను వేదసేవకే వినియోగించారు. వేదపండితుడైన యువకునికే మా చెల్లిని ఇచ్చి కన్యా వివాహం చేశారు. అలాగే, వారి ఇష్టానుసారమే మా అన్నకు నాకు కూడా కన్యా వివాహమే చేశారు.

నేను వేదపాఠశాలలో విద్యార్థిగా ఉన్నప్పుడు రెండు మూడు రోజులు వరుసగా సెలవు వస్తే, మా గురువు గారు మమ్మల్ని మహాస్వామివారి వద్దకు “స్వామివారి సమక్షంలో వేదం చెప్పండి” అని పంపేవారు. అప్పుడు మహాస్వామివారు మా అహార విహారాదుల గురించి అన్ని విషయాలు అడిగేవారు. ఆంధ్రదేశ పర్యటనప్పుడు నేను వారితో పాటు కార్వేటి నగరం, బుక్క, రామగిరిలో ఉన్నాను. స్వామివారు నన్ను అనుగ్రహించి బ్రహ్మశ్రీ గోదా మంత్రాలయం వద్దకు పంపారు. తరువాత నేను తిరుపతిలో వేదపారయణదార్ ఉద్యోగానికి అర్జీ పెడితే స్వామివారి అనుగ్రం వల్ల పరీక్షలో ఉత్తీర్ణుడయ్యాను. స్వామివారి అనుమతితో వెళ్ళామని చెప్పడానికి వారి వద్దకు వెళ్ళాను. అనుకోకుండా స్వామివారు వెళ్ళమని అనుజ్ఞ ఇచ్చారు. ఆశ్శీపూర్వకంగా నాచేతిలో ఒక కమలం పెట్టారు. ప్రేమతో వారు నాతో, “శాస్త్రాన్ని ఉల్లంఘించకుండా నీ కర్తవ్యం నిర్వర్తించు. ఒకవేళ శాస్త్రాన్ని ధిక్కరించవలసిన పరిస్థితి వస్తే, ఉద్యోగం వదిలేసి నావద్దకు రా. నీ బాధ్యత నేను తీసుకుంటాను” అని అన్నారు.

చిన్న కాంచీపురంలోని మహాస్వామి వారి వేదపాఠశాలలో నేను వేదం నేర్చుకున్నాను. అక్కడ నేను విద్యార్థిగా ఉన్నప్పుడు మాకు భోజన సదుపాయాలు అంతగా ఉండేవి కావు. కనుక స్వామివారు భక్తులను ప్రతి నెలా తమ జన్మనక్షత్రం రోజున ఏవైనా మధుర పదార్థాలు, తినుబండారలు చేసి తనకు చూపించి వేదపాఠశాలలో ఇమ్మని చెప్పారు. భక్తులు అలాగే చేసేవారు. మేము పరమాచార్య స్వామివారి దర్శనానికి వెళ్ళినప్పుడు స్వామివారు మమ్మల్ని ప్రేమపూరిత మాటలతో అడిగేవారు, “ఈరోజు తినుబండారాలను ఎవరు తీసుకొనివచ్చారు?” అని. ఫలనా వారు మీకు ఈరోజు మధుర పదార్థాలు తెచ్చారా? అని ప్రేమగా అడిగేవారు. దాన్ని తలచుకోవడం ఇప్పటికి ఒక మధురానుభూతి.

పరమాచార్య స్వామివారి కటాక్షం పొందాలంటే విశేషంగా ఏమీ చెయ్యనక్కరలేదు. వేదం పఠిస్తే పరమాచార్య స్వామివారు వారంతట వారే వచ్చి మనల్ని అనుగ్రహిస్తారు. “మంత్రాదీనంతు దైవతం” అంటే దేవతలు మంత్రం యొక్క ఆధీనంలో ఉంటారు అన్నట్టు మనం వేద పారాయణం మొదలుపెట్టగానే వారే స్వతహాగా మనం కూర్చున్న చోటికి వచ్చి మనల్ని ఆశీర్వదిస్తారు.

అపార కరుణాసింధుం జ్ఞానదం శాంతరూపిణం
శ్రీ చంద్రశేఖర గురుం ప్రణమామి ముదావహం ॥

--- శ్రీ కె. చంద్రశేఖర ఘనాపాటి, న్యాయ - వేదాంత శిరోమణి, తిరుపతి. మహా పెరియవళ్ - దరిశన అనుభవంగళ్

#KanchiParamacharyaVaibhavam #కంచిపరమాచార్యవైభవం
3/16/18, 15:50 - Paramacharyulu: తొమ్మిది, పది శ్లోకాల ఉపోద్ఘాతం - మూడవ భాగం

సర్ జాన్ వుడ్రాఫ్ మహాశయుడు కిండలినీ యోగం పై *ది సర్పెంట్ పవర్* అనే పుస్తకం వ్రాశారు. ఏం జరిగింది ? సాధన ఏమీలేని, సాధన చేయాలనే అభిప్రాయం కూడా లేని పెద్దలు మూలాధారం, సహస్రారం అంటూ పుస్తకాలు వ్రాయడం మొదలు పెట్టారు. ఈ యోగాన్ని కరతలామలకం చేసికొన్నామనుకొంటున్న పెద్దలు ఏకంగా పెద్ద ఎత్తున శిక్షణా శిబిరాలనే ఏర్పాటు చేస్తున్నారు. సాధన చేసే వారెంతమందో, తుదివరకూ నిలబడే వారెంతమందో కానీ ఈ రోజుల్లో అందరూ కుండలినీ శక్తి గురించి మాట్లాడేవారే!

అయితే ఒకరకంగా మనం వుడ్రాఫ్ కు కృతజ్ఞులముగా ఉండాలి. పాశ్చాత్యులు మన యోగ రహస్యాలన్నీ కల్పనలని ప్రచారం చేసేవారు. చిలకపలుకులు వల్లించే మన పెద్దలు దానికి తాళం వేసేవారు. ఈయన వ్రాయడం వల్ల అటువంటి వారి దృక్పథంలో మార్పురావడమేకాక,ఎవరైనా ధీరులంటూ ఉంటే ఇటువంటి యోగమొకటున్నదనే విషయం తెలిసి దానికై ప్రయత్నించే అవకాశం కల్గించింది.

మంత్రయోగం విషయంలో కూడా కుండలినీ యోగమంత కాకపోయినా జాగ్రత్త అవసరం. నాడీ ప్రకంపనల ద్వారా మంత్ర ప్రయోగం కూడా కుండలినీ యోగపు ఫలితాలనిస్తుంది. సవ్యమైన గురూపదేశం లేని మంత్రములు ఎటువంటి ప్రయోజనమూ లేదు. ఇంట్లో వైరింగ్ అంతా చేయించి పంకాలు, దీపాలు అమర్చినా విద్యుత్ కేంద్రానికి తీగలద్వారా జోడించకపోతే ప్రయోజనమేమీ ఉండదు. మంత్రనాదం విద్యుత్ వంటిది. నేరుగా ముట్టుకొంటే ప్రమాదం. గురువనే తీగ ద్వారా గురుబోధన అనే బల్బులోనికి ప్రవేశపెట్టినప్పుడే కాంతి వస్తుంది.

తీగలద్వారా ప్రవహించే శక్తి మనకు కనబడదు. దాని మూలం కూడా మన మెరుగం. అలాగే మంత్రం కూడా గుప్తమైనది. మంత్ర శస్త్రం గోప్యమైనది. అలాగని మంత్రయోగము, కుండలినీ యోగములు అనుసరణీయమైన మార్గములు కావని, నే చెబుతున్నానని అపోహపడవద్దు. అద్వైత సిద్ధికి ఇది నిశ్చయంగా దగ్గర దారి. లేకుంటే మహామునులెందరో, అంతెందుకు భగవత్పాదుల వారే తమ గ్రంథాలలో ఈ యోగాన్ని పదేపదే ఎందుకు స్పృశిస్తారు. ఈ మార్గాలపైన ఆసక్తిగల సాహసులు ఉంటే వారికి నేనీయవలసిన సలహా ఒకటున్నది.

ఈనాటికీ ఈ యోగంలో నిష్ణాతులైన అనేకమంది మహానుభావులున్నారు. వారికి మనపై అవ్యాజమైన అనుగ్రహం తప్పితే వేరొక ఆశలేదు. వారు సాధనలో శిష్యుని ఒక్కొక్క మెట్టుగా పైకి తీసుకొని వెళ్ళదగిన సద్గురువులు. వారిని ఆశ్రయించండి. మీ అంతట మీరుగా పుస్తకాలు చదివి సాధన చేయవద్దు. యోగులమని పేర్లు పెట్టుకొని డంభంగా తిరిగేవారిని చూసి మోసపోవద్దు. ఎంతో జాగరూకత అవసరం. కానీ మరొక్కసారి నేను మీకు భక్తి జ్ఞాన మార్గాలలో కలగని ఆత్యంతికమైన అనుభూతి ఈ మార్గంలో క్రొత్తది ఏదీ లేదని గుర్తు చేస్తున్నాను. తుదికి అన్ని మార్గాలూ అక్కడ లయమవవలసిందే! అయినా మీమీ అభిరుచుని బట్టి ఈ మార్గంపైకి మక్కువ కలిగిందంటే సద్గురువును ఆశ్రయించండి. అటువంటి సద్గురువు లభించాలని భక్తితో అంబికను ప్రార్థించండి. ఆమె అనుగ్రహంతోనే సద్గురువు సంప్రాప్తమవుతాడు.

*కుండలి కుమారి కుటిలే చండి చరాచర సవిత్రి చాముండే! గుణిని గుహారిణి గుహ్యే గురుమూర్తే త్వాం నమామి కామాక్షి!!*
(మూకపంచసతి)

(సశేషం)

#KanchiParamacharyaVaibhavam #కంచిపరమాచార్యవైభవం
#ParamacharyaSoundaryaLahariBhashyam
3/17/18, 07:29 - Paramacharyulu: మండపం ఖాళీ చెయ్యండి

కర్ణాటక రాష్ట్రంలో హంపికి దగ్గర్లోని తుంగభద్రా నది ఒడ్డున గల ఆనెగొందిలో పరమాచార్య స్వామివారు మకాం చేస్తున్నారు. శ్రీకృష్ణదేవరాయల సామ్రాజ్యపు ఆనవాళ్ళు మనకు ఇక్కడ ఇప్పటికి కనిపిస్తాయి. ఇక్కడే శ్రీరాముడు బాణంతో వాలిని సంహరించాడని చెబుతారు. అలాగే మధ్వులకు పరమపవిత్రమైన నవబృందావనం కూడా ఇక్కడే ఉంది. తుంగభద్రా నదీ మధ్యభాగంలో ఉన్న ఒక చిన్న రాతి ద్వీపంపై మధ్వ సంప్రదాయంలోని ఆచారపురుషులవి తొమ్మిది బృందావనాలు ఉన్నాయి. ఇది మధ్వుల కాశి. కనుక ఎక్కువ సంఖ్యలో మధ్వులు ఇక్కడకు వచ్చి అత్యంత భక్తి శ్రద్ధలతో పూజలు చేస్తుంటారు.

హాస్పేట్ పట్టణంలో చింతామణి మఠం ఆధ్వర్యంలో అన్నపూర్ణా ఆలయం ఉంది. పరమాచార్య స్వామివారి ఆదేశం ప్రకారం అన్నపూర్ణకు లడ్డూలతో అలంకారం చేశారు. మధ్యాహ్నం దాదాపు రెండు గంటలప్పుడు హఠాత్తుగా మహాస్వామివారు వంట చేస్తున్న మండపాన్ని అత్యవసరంగా ఖాళీ చెయ్యవలసిందని ఆదేశించారు. మొత్తంగా ఖాళీ చేసి, అన్నపూర్ణ దేవాలయం పక్కకు మార్చమని చెప్పారు. “ఆ వంట గదిలో ఒక పిల్లి దాని పిల్లలు కూడా ఉన్నాయి. వాటిని కూడా బయటకు పంపండి” అని ఆజ్ఞాపించారు.

మండపం ఖాళీ చేసిన అరగంటలోపే కారణాంతరాల వల్ల మెల్లగా కూలిపోయింది. మహాస్వామివారు పిల్లి, పిల్లి పిల్లలతో సహా అందరినీ రక్షించారు.

అపార కరుణాసింధుం జ్ఞానదం శాంతరూపిణం
శ్రీ చంద్రశేఖర గురుం ప్రణమామి ముదావహం ॥

--- టి.యస్. సుప్పిరమణి. మహా పెరియవళ్ - దరిశన అనుభవంగళ్

#KanchiParamacharyaVaibhavam #కంచిపరమాచార్యవైభవం
3/17/18, 12:35 - Paramacharyulu: <Media omitted>
3/17/18, 16:27 - Paramacharyulu: తొమ్మిది, పది శ్లోకాల భాష్యం - మొదటి భాగం

*అంబికను కుండలినీ యోగంతోనూ, మంత్రయోగంతోనూ ఆరాధించడాన్నీ, అటువంటి ఆరాధన వలన కలిగే ఫలితాలన్నీ తరువాతి శ్లోకములు వివరిస్తున్నాయి.*

మహీం మూలాధారే కమపి మణిపూరే హుతవహం
స్థితం స్వాధిష్ఠానే హృది మరుతమాకాశముపరి .
మనో౽పి భ్రూమధ్యే సకలమపి భిత్వా కులపథం

సహస్రారే పద్మే సహ రహసి పత్యా విహరసే .. (9)

(అమ్మా! నీవు సుషుమ్నా మార్గములో మూలాధార చక్రమునందు భూతతత్త్వమును, మణిపూరక మందు జలతత్త్వమును, అనాహత మందు వాయుతత్త్వమును, విశుద్ధ చక్రమందు ఆకాశతత్త్వమును, ఆజ్ఞా చక్రమునందు మనోతత్త్వమును చేధించుకొని సహస్రార చక్రమందు నీ భర్తతో ఏకాంతముగా విహరిస్తున్నావు)

సుధాధారాసారై శ్చరణయుగలాంతర్విగలితైః
ప్రపంచం సించంతీ పునరపి రసామ్నాయమహసః .
అవాప్య స్వాం భూమిం భుజగనిభమధ్యుష్టవలయం
స్వమాత్మానం కృత్వా స్వపిషి కులకుణ్డే కుహరిణి. (10)

(తల్లీ! నీపాదద్వయము నుండి జాలువారిన అమృతధారలచే లోకమును తడుపుదువు. అమృత రూపమగు చంద్రుని వలన నీ స్వస్థానము చేరుటకు పాము వలె నన్ను నీ నిజరూపమును పొంది సూక్ష్మరంధ్రము గల సుషుమ్నా ద్వారమున వున్న మూలాధారమందు సర్వదా నిద్రించెదవు.)

మానవుని దేహంలో పద్మములని పిలవబడే చక్రములు ఆరింటిని గురించి కుండలినీ యోగము చెబుతుంది. అంబిక మొదట అయిదు చక్రాలలో పృథివ్యాపస్తేజో వాయురాకాశాదులు గాను, ఆరవచక్రములో మనస్సుగానూ వసించుతోందని ఆచార్యులవారు వివరిస్తారు. ఈ పద్మాలను కలుపుతూ వాటి నడుమ సుషుమ్నా నాడి ఉంటుంది. ఆ నాడి చివర వెయ్యి రేకులున్న పద్మంగా ప్రకాశించే సహస్రార చక్రమున్నది. ఆ పద్మంలోనే అంబిక తన పతి అయిన సదాశివునితో ఐక్యమవుతుంది. ఎప్పుడైతే జీవాత్మ కుండలినీ శక్తి ద్వారా సహస్రార పద్మమునకు తీసుకొని రాబడుతుందో, అప్పుడు అంబిక అద్వైతానందాన్ని ప్రసాదిస్తుంది. స్థూల ప్రపంచ నిర్మాణమే సూక్ష్మ ప్రపంచంలో కూడా కాన వస్తుంది. అంబిక తనను ప్రపంచంగా విస్తరించుకొనినపుడు మహాభూతములుగా, మహత్తు అని పిలవబడే లోకాలను శాసించే మహామనస్సుగా ఎలా వెలుగొందుతుందో, సాధకుడు ఆయా కుండలినీ చక్రాదులతో దర్శించవచ్చు. ఆయా అనుభూతులను పొందవచ్చు. ఆ మహామనస్సు సహస్రార పద్మములో పరబ్రహ్మయైన పరమశివునితో ఐక్యం చెందినపుడు అద్వైతానుభూతీ పొందగలుగుతాడు.

అటువంటి అద్వైత రసానుభూతి అమృత రసానుభూతి అవడం తరువాతి శ్లోకంలో చెప్పబడింది. పొందబడే అద్వైత రసము, పొందే జీవుడు, అనుగ్రహించే అంబిక – ఈ మూడింటి మధ్య భేదం లేదు. ఏదో మాటవరసకు దీనిని రసానుభవం అంటారు. కానీ నిజానికి ఈ స్థితి మాటలకందనిది. అనుభూతికి ముందు, తరువాత పొందేది, పొందబడేది, పొందించేది అన్న త్రిపుట ఉంటుంది. అనుభూతి కాలంలో నష్టమైపోతుంది.

నేను చెప్పిన పద్మములు చెరువులలో పెరిగే పద్మముల వంటివి కాదు. చెరువులోని ఆ పద్మములు సూర్యరశ్మికి వికసిస్తాయి. చంద్రకాంతికి ముకులించుకొని పోతాయి. నిప్పు సెగకు వాడిపోతాయి. నే చెప్పిన కుండలినీ పద్మములు అగ్నికాండము, సూర్యకాండము, చంద్రకాండము ఈ మూడిటికీ వికసిస్తాయి. తుదకు శిరస్సున పూర్ణచంద్రుడు సహస్రార పద్మాన్ని వికసింప చేస్తాడు. ఆ చంద్రకాంతితో అమృతం ప్రవహిస్తుంది.

అది అంబికానుగ్రహమును స్రవించిన రసం శిరస్సుపై నాడులను తడిపివేస్తుంది. నిజానికి అమృతం స్రవించినది పూర్ణచంద్రుని నుండి కాదు. జాగ్రత్తగా చూసామా ఆ పూర్ణచంద్రునిపై అమ్మ పాదాలు మన గురుపాదాలుగా దర్శనమిస్తాయి. ఆ పాదముల నుండే అమృతం ప్రవహించేది. జీవాత్మ ఆ అమృతాన్ని ఆస్వాదిస్తోంది. అంబిక చేత ప్రసాదించబడిన ఆ అమృతాన్ని ఆస్వాదించే జీవాత్మకు అద్వైత జ్ఞానముంటుంది. అటువటి స్థితి ఒక కుండలినీ యోగం ద్వారానే సిద్ధిస్తుందా ? నేను మరొక్కసారి చెప్పదలిచాను. *మీరెంచుకొన్న ఏ మార్గంలోనైనా నమ్మకంతో త్రికరణసుద్ధిగా సాధన చేయండి, మీకు తెలియకుండానే ఈ యోగఫలం మీకు సిద్ధిస్తుంది.*

(సశేషం)

#KanchiParamacharyaVaibhavam #కంచిపరమాచార్యవైభవం
#ParamacharyaSoundaryaLahariBhashyam
3/18/18, 06:57 - Paramacharyulu: పట్టమ్మాళ్ పరమాచార్య జ్ఞాపకాలు

ప్రముఖ గాయనీమణి, కర్ణాటక సంగీత త్రయంలో ఒకరుగా పేరుగాంచిన శ్రీమతి డి.కె పట్టమ్మాళ్ (మిగిలిన ఇరువురు శ్రీమతి యమ్.యస్. సుబ్బులక్ష్మి, శ్రీమతి యమ్.యల్. వసంతకుమారి) ఏడు సంవత్సరముల వయస్సప్పుడు కంచి పరమాచార్య స్వామివారి అనుగ్రహం పొందింది. చిన్నప్పుడు ఆమె తరుచుగా తన తండ్రితో పాటు కంచి మఠానికి వచ్చేది. తండ్రి ఆదేశం మేరకు కంచి కామాక్షి అమ్మవారి దర్శనం తరువాత మఠంలో శ్రావ్యంగా శ్లోకాలు చెప్పేది.

పట్టమ్మాళ్ లోని విద్వత్తుని గమనించిన మహాస్వామివారు ఆ పిల్లని స్వామివారు చాతుర్మాసం చేస్తున్న ఎసనూర్ కు తీసుకురావాల్సిందిగా ఆ పిల్ల తండ్రికి స్వయంగా చెప్పారు. నవరాత్రి పూజలో కృష్ణస్వామి దీక్షితర్ పాల్గొనాలని, అలాగే చిన్ని పట్టమ్మాళ్ కూడా తమ తొమ్మిది రోజుల పూజలో పాడాలని స్వామివారి కోరిక.

నవరాత్రి పూజలో పెట్టిన కలశంలోని టెంకాయను తమ తండ్రికి ఇచ్చి, దాంతో పాయసం చేసి పిల్లకు పెట్టమని చెప్పిన సంఘటనని పట్టమ్మాళ్ అమితానందంతో గుర్తుచేసుకుంటారు. తరువాతి కాలంలో ఆవిడ ఈ సంఘటనని ఆర్తితో గుర్తుచేసుకొని తన విద్వత్తు, గెలుపు అంతా స్వామివారి అరుదైన అనుగ్రహం వల్లనే కలిగింది అని చెబుతారు.

ముత్తుస్వామి దీక్షితర్ గారి ఆనందభైరవి రాగంలోని, ‘ఆనందేశ్వరేణ సంరక్షితోహం’ కీర్తన గురించిన ఒక సంఘటన ఆవిడ గుర్తుచేసుకున్నారు. ఒకసారి పట్టమ్మాళ్ కాంచీపురం వెళ్ళి, పరమాచార్య స్వామివారిని దర్శించుకొని, స్వామి ముందు ఈ కీర్తన పాడారు. స్వామివారు ఆమెని మెచ్చుకున్న తరువాత ఈ కీర్తనని ఎక్కడా కచేరీలలో పాడవద్దని సెలవిచ్చారు. మహాస్వామి వారి ప్రకారం ఆ కీర్తన సన్యాసులు యతుల సమక్షంలో, కేవలం పూజలలో, దేవాలయాలలో మాత్రమే పాడాలి.

“నా చిన్నతనంలో నేను ప్రతిరోజూ, కంచి పరమాచార్య స్వామివారి ముందు పాడేదాన్ని. నాకు మంచి వాక్శుద్ధి లభించిందని, నా ఉచ్ఛారణ చాలా స్పష్టంగా ఉన్నదని చెప్పారు స్వామివారు” అని ఆనందంతో చెబుతారు పట్టమ్మాళ్.

అపార కరుణాసింధుం జ్ఞానదం శాంతరూపిణం
శ్రీ చంద్రశేఖర గురుం ప్రణమామి ముదావహం ॥

#KanchiParamacharyaVaibhavam #కంచిపరమాచార్యవైభవం
3/18/18, 12:41 - Paramacharyulu: <Media omitted>
3/18/18, 16:54 - Paramacharyulu: తొమ్మిది, పది శ్లోకాల భాష్యం - రెండవ భాగం

సాధరణంగా మనం ఎడమ ముక్కుతో గాలి పీలుస్తాం. శాంతంగా ఉన్నప్పుడు కుడి ముక్కుతో శ్వాస నడుస్తుంది. మన సాధన ఉన్నత స్థితిని చేరినపుడు క్రమశః రెండు ముక్కులతోనూ శ్వాస నడవడం, ఆ తరువాత శ్వాస నిలిచిపోవడం జరుగుతుంది. అంటే ఊపిరి బిగబట్టి కుంభకంలో ఉన్నామన్నమాట. ఆ స్థితిలో మనం ఉక్కిరిబిక్కిరి అవము. అద్వైత స్థితి కలిగినపుడు మన శ్వాస నడినెత్తిన ఉన్న నాడులను తాకడం, అక్కడ అంబిక పాదాలను స్పృశించడం ద్వారా అమృతపానం చేయడం అసంకల్పితంగానే సిద్ధిస్తుంది.

సాధనలోనే కాదు. సాధారణ జీవితంలో కూడా మహదానందస్థితిలో శ్వాస ఆగిపోయి ఒక ఒడలు ఎరగని స్థితిని పొందుతాం. ఇది కుంభకంలోని (ప్రాణాయామంలో గాలి బిగపెట్టడం) స్థితిని తలచుకొని “ఆహా! నడినెత్తిన ఎంత చల్లటి అనుభూతి!” అనుకొంటాము. అంటే అప్పుడు ఒక అమృతపు తుంపర నడినెత్తిన ఉన్న నాడులపై జాలువారిందన్నమాట. భక్తి మార్గంలో కూడా అంతర్లీనమైన ప్రకృతి యొక్క అంతరంగికానుభవాన్ని పొందవచ్చని చెప్పడానికే నేనీ విషయం చెబుతున్నాను.నాయనార్లు, ఆళ్వార్లు, మహారాష్ట్ర, బెంగాలు, ఔత్తరాహిక భక్తుల పాటలు వింటుంటే వారెంత యౌగిక రహస్యాలను అంతర్లీనమైన జ్ఞానంతో చెబుతున్నారో అర్థమవుతుంది.

ఇక్కడ కొంచెం కామానుభవం గురించి మాట్లాడవలసి ఉన్నది. కామేశ్వరీ కామేశ్వర తత్త్వాన్ని సూచించే ఇచ్ఛాశక్తి నిర్మల శృంగారమునకు చెందినది. స్వాభావికంగా సూక్ష్మమైనది. నావంటి సన్యాసులకు కామమనే పదం గురించి చెప్పడం కొంచెం ఇబ్బందిగానూ, అదే సభలో మాట్లాడవలసినపుడు అసభ్యంగా తోచినప్పటికి సృష్టిని నడిపే ప్రధానమైన విషయం అవడాన, సృష్టి ఇలా అల్లుకుపోయి ఉండటనికి కారణమయినందువల్లనూ మాట్లాడడంలో తప్పులేదని తోస్తుంది. అంబిక సాధకులకు వారి (భక్తి) ఆధ్యాత్మిక సాధన ఫలించినపుడు యోగ జ్ఞాన సాధకులకు లభించే శృంగారానుభవాన్ని ప్రసాదిస్తోంది. పరబ్రహ్మ ప్రపంచంగా పరిణమించడానికి ఈ ఇచ్ఛ లేక కామన కారణమయితే, జీవుడు పరబ్రహ్మలో లయమవడానికి ముందు, అనేక మంది మహాపురుషుల విషయంలో నాయికా భావాన్ని పొందడం కనిపిస్తుంది.

ఈ పరిణామ దశలోని సాధకుడు శక్తిలో లయమయ్యాడన్నమాట. అప్పుడు నాయకుడైన శివునిలో ఐక్యమవాలనే తీవ్రేచ్ఛ కలుగుతుంది. ఆ భావనల తీవ్రతతో సాధకుడు శివునకు సర్వస్వాత్మ సమర్పణ చేసుకోంటూ “నాదంటూ ఏదీ లేదు స్వమి, అంతా నీ దయ” అనే భావనలోనికి వస్తాడు. తరువాత ఆ భావము కూడా శివునిలో ఐక్యమైపోతుంది. అప్పుడిక శివుని ఇచ్ఛ మాత్రమే మిగులుతుంది. అంటే ఆవృత్త చక్షుడైన (తనలో తనను చూసుకోవడానికి ప్రయత్నించే) సాధకుడు, శివుడు ప్రపంచంగా పరిణమించే ప్రథమ దశలో ఐక్యమవుతాడన్నమాట. ఇక్కడ సాధకునికి సంబంధించినంత వరకూ, శివుడు తనను ప్రపంచంగా విస్తరించుకొనే పరిణామం బదులు, తనలో ఐక్యం చేసుకొంటాడన్నమాట. సామాన్యంగా ప్రవహించే ఒక వస్తువును ఆ ప్రవాహం ఒడ్డుకు చేరుస్తుంది. అదే లోపల సుడిగుండం ఉంతే, తనలోనికి తీసుకొంటుంది. ఇదే పైన చెప్పిన జీవాత్మ దశ.

(సశేషం)

#KanchiParamacharyaVaibhavam #కంచిపరమాచార్యవైభవం
#ParamacharyaSoundaryaLahariBhashyam
3/19/18, 07:03 - Paramacharyulu: పళ్ళబుట్ట ప్రసాదం

నేను ఒకసారి పరమాచార్య స్వామివారి దర్శనానికి వెళ్ళినప్పుడు స్వామివారు నన్ను, “వేద పాఠశాల విద్యార్థులకు పళ్ళు కొనివ్వగలవా?” అని అడిగారు. నాకు చాలా ఆనందం వేసింది. “పళ్ళు కొనివ్వు” అన్న ఆజ్ఞ చాలు మహాస్వామివారి నుండి. వెంటనే అన్ని పనులు మొదట ఈ పనిచేసి పళ్ళను తలపై మోసుకొనిపోనూ!

ఎవరో మారాఠీలో ఎదో అడుగుతున్నట్టు వినవచ్చింది. అతణ్ణి లోపలికి తీసుకుని రావల్సిందిగా స్వామివారు ఆదేశించారు. అతను మహాస్వామి వారితో తన విశేషాలను ఇలా చెప్పుకున్నాడు. కాశ్మీర రాజ కుటుంబం దగ్గర పనిచేసి విరమణ పొదినవాడు. ప్రస్తుతం ఇప్పుడు సతారాలో నివసిస్తున్నాడు. ఆ కాశ్మీర రాజు పరమాచార్య స్వామివారికి బాగా తెలుసు అని చెప్పాడు. మహాస్వామివారు సతారాలో విజయం చేస్తున్నారని తెలుసుకొని ఆ రాజు పది చెక్క పెట్టెలలో మంచి నాణ్యత కలిగిన ఆపిల్ పళ్ళను స్వామివారికి కానుకగా పంపాడు. లారీ యాజమాన్యం వద్ద ఆ పళ్ళ పెట్టెలను తీసుకొని నేరుగా స్వామివారి వద్దకు వచ్చాడు.

ఆ పళ్ళ బుట్టలనన్నిటిని స్వామివారి ముందు పెట్టాడు. అపుడు స్వామివారు నాతో, “నీకు చాలా ఉపయుక్తమైంది. ఈశ్వరుడు ఖర్చు తప్పించాడు. రెండు మూడు పెట్టెలలోని పళ్ళను ఆ వేద పాఠశాల విద్యార్థులకు పంచిపెట్టు. నువ్వు ఒక పళ్ళ బుట్ట తీసుకో!” అని అన్నారు.

కేవలం ఒక్క పండు స్వామివారి నుండి పొందాలని వందలాది మంది భక్తులు ఎదురుచూస్తూ ఉంటే, నాకు ఏకంగా ఒక బుట్టెడు పళ్ళు ప్రసాదంగా లభించాయి.

అపార కరుణాసింధుం జ్ఞానదం శాంతరూపిణం
శ్రీ చంద్రశేఖర గురుం ప్రణమామి ముదావహం ॥

--- టి.యస్. సుప్పిరమణి. మహా పెరియవళ్ - దరిశన అనుభవంగళ్

#KanchiParamacharyaVaibhavam #కంచిపరమాచార్యవైభవం
3/19/18, 10:30 - Paramacharyulu: సభ్యులకు విన్నపం

దయచేసి పోస్ట్స్ కు రిప్లై చెయ్యకండి. ఎటువంటి ఫార్వార్డ్ మెసేజస్, గుడ్ మార్నింగ్ మెసేజస్, వీడియోస్ పంపకండి

ఇది కేవలం పరమాచార్య స్వామి వారి విశేషాలు తెలియచేయటానికి మాత్రమే.

అతిక్రమించిన వారిని బ్లాక్ చేయవలసి ఉంటుంది
3/19/18, 12:23 - Paramacharyulu: <Media omitted>
3/19/18, 16:13 - Paramacharyulu: తొమ్మిది, పది శ్లోకాల భాష్యం - మూడవ భాగం

సృష్టి ఆరంభానికి కారణమైన శివుని ఇచ్ఛ అంటే మొదటి కోరిక సాధకుని తుది కోరిక అవుతోంది. ఈ రెండూ శృంగారికంగా సూచించబడినాయి. మాణిక్య వాచకులు, గోదాదేవి, మీరాబాయి పాటలలోని పరమప్రేమ ఇటువంటి శృంగారాన్ని సూచించేదే! యోగ, జ్ఞాన, పరమ ప్రేమానుభవాలు అన్ని మార్గముల వారికి సమానంగా ఉంటాయి. తాను ప్రపంచీకరించుకొనే శివుని కామనకు, శివునిలో ఐక్యమవాలని ప్రయత్నించే సాధకుని ఇచ్ఛకు రెండింటికి కారణమైన అంతఃకరణములోని స్పందన అంబికదే! ఆ అంబిక పాదాల మీద పరమమైన భక్తితో కరిగిపోతే, సర్వస్వాత్మ నివేదనం చేసుకొంటే, ఇక యోగమూ, సాంఖ్యమూ, జ్ఞానమూ అన్ని మార్గాల ద్వారా పొందదగిన పరమమైన గమ్యాన్ని ఆమే చేరుస్తుంది. అత్యంతికమైన ఆనందాన్ని ఆమే ప్రసాదిస్తుంది. మనమేదో పెద్దసాధన చేస్తున్నామనే అహంకారంలో కూరుకుపోయి పతనమయ్యే అవస్థ అప్పుడిక ఉండదు.

లలితా సహస్రనామాల్లో ప్రాణశక్తి సహస్రారాన్ని చేరునపుడు నిండు చంద్రుని కాంతులు, అమృత ప్రవాహం సిద్ధిస్తాయని చెప్పబడింది. కుండలినీ యోగం చేయనందువల్ల అది మనకు సిద్ధించదనే భయం పెట్టుకోనక్కరలేదు. ముందు శ్లోకాలలో వర్ణించిన అంబిక శరచ్చంద్రవదనాన్ని ఆమె కడగంటి చూపునుండి జాలువారే దయామృతాన్ని, ఆమె చిరునగవు కాంతులనూ స్మరిస్తే, ధ్యానిస్తే చాలు. మన ధ్యానంలోని విషయాలను సత్యం చేస్తూ ఆమె మనకు అంతరంగికమైన సహస్ర చంద్రకాంతులను, అమృత ప్రవాహాన్ని అనుగ్రహిస్తుంది.

సమర్థులైన వారిని కుండలినీ యోగం చేయనీయండి. మనం దృఢమైన విశ్వాసంతో అమ్మ పాదాలు పట్టుకొందాం. కుండలినీ సాధకులకిచ్చే అన్ని పరమమైన ప్రయోజనాలనూ ఆమె మనకు సిద్ధింపచేస్తుంది. కావాలనుకొంటే తరువాత దశలలో మనలను ఆ యోగంలో ప్రవేశపెడుతుంది. అంతెందుకు కుండలినీ యోగం చేసేవారిని “చేసింది చాలు, నా పాదాలను ఆశ్రయించు” అని కూడా ఆమె చెప్పవచ్చు.

ఆచార్యులవారు ఈ శ్లోకాన్ని (10వ) ఎలా ముగించారో చూడండి. అంబిక సమస్త నాడులను అమృత ప్రవాహంతో తడుపుతుంది. జీవాత్మను తలలోనికి తీసుకొని పోయిన ఆమె, ఆ జీవాత్మను తనతో కలుపుకోకుండా, ఒక్కొక్క చక్రంగా దిగుతూ చుట్టుచుట్టుకొని మూలాధార చక్రంలో నిద్రపోతుందట. *కుండలిని అంటే చుట్టుకుని ఉన్నదని అర్థం.* నిద్రపోతున్న పాము చుట్టచుట్టుకొని ఉంటుంది. మనలో అంబిక శక్తిలోని పరమాణువు జాగృతమై ఉండి ప్రపంచ వ్యవహారాలు నడిపింపచేస్తుంది. మిగతా శక్తి అంతా మూలాధార చక్రాన్ని చుట్టుకొని నిద్రాణమై ఉంటుంది. ఇలా చుట్టుకోవడంలోనే కాక ఈ కుండలినికి పాముతో ఇంకొక సామ్యమున్నది. *పాముకు పవనాసి అని పేరు, గాలి ఆహారంగా కలది అని అర్థం.* మనం ప్రాణశక్తిని గాలిని పీల్చడం ద్వారా నిలబెట్టుకొంటున్నాం. ప్రాణశక్తికి మూలమైన కుండలినిని అందువలన కూడా పాముతో పోలుస్తారు.

అదలా ఉంచండి. ఆచార్యులవారు సాధకుడు అద్వైత స్థితికి అత్యంత సమీపస్థితిని పొంది, ఆ అనుభూతిని కూడా పొంది, అకస్మాత్తుగా క్రిందికి దిగిపోవడాన్ని చుపుతున్నారు. ఇది మన అజ్ఞానాన్ని, ఇంక సంసిద్ధం కాని లక్షణాన్ని తెలియజేస్తోంది. అంతేకాదు. యౌగిక శక్తులను పొందామని అహంకరించే కుండలినీ యోగులను క్రిందికి తోయగలదని సూచిస్తోంది. *ముక్తి ద్వారానికి తాళపు చెవి శరణాగతి, జ్ఞానం వలన కలిగే వినయం*. “నేను” కాదు – “నువ్వు”. నేను అని అహంకరించరాదు. అమ్మా నీ పాదాలే శరణని ఆశ్రయించాలి.

(సశేషం)

#KanchiParamacharyaVaibhavam #కంచిపరమాచార్యవైభవం
#ParamacharyaSoundaryaLahariBhashyam
3/20/18, 07:25 - Paramacharyulu: స్వామి వారి గో సంరక్షణ

టాటానగర్ లో కాంచి పరమాచార్య రైల్వే కేంద్రం అయిన ఖర్గపూర్ లో ఒక నెలరోజులుండాల్సి వచ్చింది. మఠం ఉద్యోగులు కొందరు అనారోగ్యం పాలు కావడంతో వారికి స్వస్థత చేకూరే దాకా అక్కడ ఆగాల్సి వచ్చింది. అక్కడి నుండి ఉక్కునగరం టాటానగర్ 1935 డిసెంబరు 4 న నిర్ణీత కార్యక్రమం ప్రకారం చేరాల్సి వుంది.

సాయంత్రం వేళ పల్లకీలో ప్రయాణం చేస్తున్న స్వామి వెంట కొందరు సేవకులు, అత్యవసర సరుకులు మోయటానికి ఒక గుఱ్ఱం దాని వెనుక ఆవుదూడా నడుస్తూ వచ్చాయి. అయిదు మైళ్ళు ప్రయాణం తర్వాత వారికి దారి చూపడానికి ఏర్పాటైన శిక్కు దారి తప్పినట్లు గుర్తించారు. వారిలో వారు చర్చించుకొని స్వామివారి పల్లకిని ఆపివేశారు. రైల్వే లెవెల్ క్రాసింగ్ వద్దకు రాత్రి 10 గంటలకు చేరారు.

క్రూర జంతువుల అరుపులు వినిపించాయి. ఆవు,దూడ అక్కడికి చేరగానే వాటిని అక్కడ గేటులోని గూడులోప్రవేశపెట్టి ద్వారానికి అడ్డంగా పల్లకిని వుంచమని కోరారు స్వామి.

వారి జీవకారుణ్యానికి ఇదొక ఉదాహరణ. తెల్లవారేదాకా ఆ రాత్రి అక్కడే గడిపి మర్నాడు ఉదయం9.30 గంటలకు టాటానగర్ చేరారు. టాటానగర్ లో కూడా స్వామి వారు ఆరువారాలు వున్నారు. ఒక నాడు టాటానగర్ లోని స్టీలు ఫ్యాక్టరీనీ దర్శించారు మహాస్వామివారు.

అపార కరుణాసింధుం జ్ఞానదం శాంతరూపిణం
శ్రీ చంద్రశేఖర గురుం ప్రణమామి ముదావహం ॥

#KanchiParamacharyaVaibhavam #కంచిపరమాచార్యవైభవం
3/20/18, 12:37 - Paramacharyulu: <Media omitted>
3/20/18, 16:16 - Paramacharyulu: పదకొండవ శ్లోక భాష్యం - మొదటి భాగం

చతుర్భి శ్శీకణ్ఠై శ్శివయువతిభిః పఞ్చభిరపి
ప్రభిన్నాభి శ్శంభోః నవభిరపి మూలప్రకృతిభిః!
త్రయశ్చత్వారింశ ద్వసుదళ కలాశ్రత్రివలయ
త్రిరేఖాభి స్సార్థం తవ శరణకోణాః పరిణతా!!

(తల్లీ! నాలుగు శివకోణములు. తద్భిన్నములైన అయిదు శక్తికోణములు, తొమ్మిది మూల ప్రకృతుల తోనూ, అష్టదళ పద్మము, షోదశదళ పదమము, మేఖలాత్రయము, భూపురత్రయములతో నీవుండే శ్రీచక్రము నలబదిమూడు త్రికోణములతో అలరారుచున్నది.)

ఈ శ్లోకములో ఆచార్యులవారు శ్రీచక్రమును వర్ణిస్తున్నారు. శ్రీచక్రమునకు శ్రీయంత్రమని కూడా పేరున్నది. శ్రీవిద్యా పూజ అన్న ప్రస్తావన వచ్చినపుడు శ్రీయంత్రాన్ని ప్రతిష్ఠించిన తరువాత చేసేదా ఈ పూజ? అన్న ప్రశ్న పుడుతుంది. అవును.

ప్రతి దేవతకు తనదైన యంత్రమున్నది. కానీ శివపూజ చేసేవారో, విష్ణువు ఆరాధన చేసేవారో సాధారణంగా యంత్రం పెట్టుకొని పూజచేయరు. అటువంటి యంత్రము దేవాలయాల్లో విగ్రహానికి క్రింద భూమిలో ప్రతిష్ఠించబడుతుంది. కొన్నిచోట్ల బయటకు కనిపించే విధంగానే ఉండవచ్చు. కానీ గృహపూజలలో యంత్రాలు పెట్టుకోవడం అరుదు. చాలామంది పంచాయతన పూజచేస్తారు. శివునికి ప్రతీకగా బాణ లింగాన్ని, విష్ణువునకు సాలగ్రామాన్ని పూజిస్తారు. ఇక్కడ అంబికకు ప్రతీకగా స్వర్ణరేఖ శిల పూజింపబడుతుంది. ఇది సహజశిల. కానీ చాలామంది ఈ శిలకు బదులుగా శ్రీచక్రానికి పూజచేస్తున్నారు. అలాగే గణపతికి, సూర్యునికి కూడా సహజ సిద్ధంగా లభించే శిలలు ప్రతీకలుగా ఉన్నాయి. సుబ్రహ్మణ్యుని పూజించేవారు ఆయన ఆయుధాన్ని ప్రతీకగా ఉంచుకొంటారు. అంబికకు మాత్రమే శ్రీచక్రపూజ జరుగుతొంది.

ఏ దేవతకు సంబంధించిన తంత్రాన్ని పరిశీలించినా ఆ దేవతకు యంత్రంతో పాటు ఒక మంత్రం చెప్పబడి ఉన్నది. ఒక విధివిధానంలో అమరించబడిన శబ్దాలు చెప్పబడిన ప్రత్యేకమైన పద్ధతిలో ఉచ్చరించి దానిలో సిద్ధిపొందితే ఆ మంత్రాధిష్ఠాన దేవత నేరుకునేరుగా ప్రత్యక్షమవుతుంది. అటువంటి శబ్దములు అమరింపు ఆ దేవత మంత్రంగా చెప్పబడుతోంది. ఒక దేవత కరచరణాద్యవయవముల వలెనే ఆ దేవతనుద్దేశించిన శబ్దముల సంపుటి ఆ దేవత రూపాన్ని ఏర్పరుస్తుంది. దీనిని శబ్ద రూపము లేక మంత్ర రూపము అంటారు. దీనితోబాటు ఆ దేవతకు యంత్ర రూపం కూడా ఉంటుంది. రేఖలో, త్రికోణములో, వృత్తములో యంత్రంలోని ప్రతి భాగము తనదైన అర్థాన్నే కాక అద్భుతమైన శక్తిని కలిగి ఉంటుంది. పరమాత్మ ఆయా ప్రత్యేకమైన దేవతగా అవతరించడాన్ని గ్రహించడానికి ఆయా యంత్రములు ఉద్దేశించబడినవి.

ఇక మంత్రములు మానసికంగా జపించడానికే కాక ఆ దేవతా పూజలో అంజలులు అర్పించడం నుంచి ఆ దేవతను ప్రత్యక్షం చేసుకోవడం వరకు ఉపయోగిస్తాయి. ఆ దేవత మంత్రాక్షరములు ఆ దేవతా యంత్రంపై చెక్కబడతాయి. మామూలుగా విగ్రహానికి చేసినట్లే ఆ యంత్రానికి సకలోపచారాలతోనూ పూజలు జరుగుతాయి. ప్రతి దేవతామూర్తిలో వసించే శక్తి ఈ యంత్రరూపంలో కూడా ఉండటమే దీనికి కారణం. నిజానికి యంత్రం ఆ దేవతా మూర్తి ఒక్కటే కాదు. పరివార దేవతలు, నివాసముతో కూడి ఉన్న దేవతామూర్తి.

అంబిక వివిధ రూపాలకు వివిధ యంత్రాలున్నాయి. కానీ ఆయా రూపాలలో దర్శనమిచ్చే అంబికను కూడా శ్రీచక్రంతోనే అర్చించడం మనం చూస్తున్నాం. తిరువణ్ణామలై గిరి ప్రదక్షిణం చేసే త్రోవలో దుర్గాదేవి ఉన్నది. దుర్గా యంత్రం ప్రత్యేకంగా ఉన్నా అక్కడ శ్రీచక్రమే ప్రతిష్ఠించబడి ఉన్నది. శృంగేరి శరదాంబాలయంలో కూడా పూజ శ్రీచక్రానికే! అంబిక వివిధ రూపాలలోని యంత్రాలలో శ్రీచక్రము ఒక ప్రత్యేక స్థానం కలిగి ఉన్నది.

రేఖలు, ఆ రేఖలతో రూపించబడిన త్రికోణములు, చతురస్రములు, వృత్తములు ఇవి చక్రములోని భాగములు. యంత్రము ఒక కేంద్ర బిందువును కలిగి ఉంటుంది. వీటితో నిర్మించబడిన పటములకు దేవతాశక్తిని ఆకర్షించగల కొలతకందని శక్తి ఉంటుంది. అవి దుష్టశక్తులను అణచివేయగలవు – దైవీశక్తులను ఆకర్షించగలవు.

(సశేషం)

#KanchiParamacharyaVaibhavam #కంచిపరమాచార్యవైభవం
#ParamacharyaSoundaryaLahariBhashyam
3/21/18, 07:03 - Paramacharyulu: శ్రీ గురుభ్యోనమః

నడిచే దైవం శ్రీ శ్రీ శ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతీ స్వామివారి దివ్య చరిత్రను భక్తజనులకు అందివ్వదలచి "పరమాచార్య భక్త సమాజం, హైదరాబాదు" వారు "శ్రీ కంచి కామకోటి జగద్గురు దివ్య చరిత్ర" పేరున పుస్తకాన్ని విడుదల చేశారు.

ఈ అద్భుత గ్రంథంలో ఎన్నో అమూల్య విషయాలు పొందుపరచడం జరిగింది. కావున భక్తులు ఈ గ్రంథాన్ని తప్పక చదివి పరమాచార్య స్వామి గురించిన అమూల్య విషయాలను తెలుసుకోగలరని మనవి.

రిజిస్ట్రేషన్ చేసుకుని ఈ అద్భుత పుస్తకంతో పాటు ఇతర పుస్తకాలను కూడా పొందవచ్చు.

http://www.chvratnaprasad.com/index.php?route=product/product&product_id=58

మరిన్ని వివరాలకు : 9704989260, 9849159260

అపార కరుణాసింధుం జ్ఞానదం శాంతరూపిణం
శ్రీ చంద్రశేఖర గురుం ప్రణమామి ముదావహం ॥

#KanchiParamacharyaVaibhavam #కంచిపరమాచార్యవైభవం
3/21/18, 16:36 - Paramacharyulu: పదకొండవ శ్లోక భాష్యం - రెండవ భాగం

శ్రీచక్రంలో వృత్తానికి నడుమన తొమ్మిది త్రికోణములు ఒకదాని పైన ఒకటి పేర్చబడి నలభై మూడు త్రికోణములుగా కనిపిస్తున్నాయి. మధ్యనున్న బిందువును కూడా త్రికోణంగానే భావించి మొత్తం నలభై నాలుగు త్రికోణములుగా చెప్పే పాఠాంతరము కూడా ఉన్నది. ఈ నలభై మూడు (నలభై నాలుగు) త్రికోణములు ఆరు ఆవరణములుగా ఉన్నాయి.

ఆవరణ అనేదానికి కప్పబడినది, మరిచి ఉంచెడిది అన్న అర్థం వస్తుంది. ఇక్కడ ఒక వృతాంగానో, వరుసగానో అర్థం చెప్పుకోవాలి. ఒక వ్యక్తి చుట్టూ అనేకమంది నుంచుని ఉన్నపుడు మధ్యలోని వ్యక్తి మరుగున పడతాడు కదా! ఆ రకంగా అర్థం చేసుకోవచ్చు. నలభై మూడు త్రికోణములు ఐదు ఆవరణలుగానూ, మధ్యలోని బిందువుతో చేర్చి ఆరు ఆవరణలుగాను ఉన్నది.

ముత్తుస్వామి దీక్షితుల వారి నవావరణ కృతి మీలో చాలామంది విని ఉంటారు. ఆ నవావరణ శ్రీచక్రానికి సంబంధించినదే! ప్రతి ఆవరణలోనూ ఎవరెవరు నివసిస్తారు. ఆయా ఆవరణలు ఏయే సత్యాలను తెలియపరుస్తాయి. ఈ ఆవరణల అధిష్టాన దేవతలెవ్వరు. ఏయే ముద్రలు ఆ ఆవరణకు చెందినవన్న విషయాలను చెప్పే శాస్త్రాలున్నాయి. దీక్షితుల వారు తమ నవావరణ కృతిలో ఈ విషయాల గురించి క్లుప్తంగా వివరించారు. నేను ఆరు ఆవరణల గురించి, 43 త్రికోణముల గురించి చెప్పాను కదా! ఈ ఆరు ఆవరణలకు వెలిప్రక్క మరో మూడు ఆవరణలున్నాయి. ఏడు ఎనిమిది ఆవరణలు పద్మపు రేకలున్న వృత్తములు. ఒకదానిలో ఎనిమిది, రెండవ దానిలో పది పద్మపు రేకులుంటాయి. ఈ ఎనిమిది ఆవరణలకు కలిపి బహిఃప్రాకార మొకటున్నది. నిజానికివి మూడు గోడలు. అన్నీ కలిపి కొలమానానికందని మహాశక్తిగల రేఖాచిత్రం తయారవుతోంది. అయితే దీనిని చిత్రంచడంలో అత్యంత జాగరూకత వహించాలి. ప్రతిరేఖ, ప్రతిత్రికోణము ఖచ్చితమైన కొలతలు కలిగి ఉండాలి. శబ్దంలో మార్పు వల్ల మంత్రం దుష్ఫలితాలనిచ్చే విధంగానే యంత్రనిర్మాణంలో చిన్న తేడా కూడా విపరీత పరిణామాలకు దారితీస్తుంది. నిర్మాణము సరిగానే ఉన్నా మధ్యనున్న త్రికోణం క్రిందకి కాక పైకి చూపబడితే మనమనుకొన్న ఫలితాలకు భిన్నమైన ఫలితాలుంటాయి. శ్రీయంత్రం పూజించే వారు విగ్రహాలను పూజించే వారికంటే ఎక్కువ ఆచారాన్ని, శౌచాన్నీ కలిగి ఉండాలి. శాస్త్రోక్తమైన విధివిధానాలను ఖచ్చితంగా పాటించాలి.

ఈ రోజుల్లో చాలామంది ఇళ్ళలో శ్రీచక్రపూజ అనే పేరుతో కొన్ని కర్మలు నిర్వహిస్తున్నారు. వారు దానిని ఒక ఫేషన్ గానో, తమ గొప్పతనాన్ని చాటుకుంటానికో చేస్తున్నట్లుగా అవుపిస్తాయి. వారిలో చాలామందికి పూజ ఎలా చేయాలో కూడా తెలియదు. ఏమయినా శ్రీచక్రార్చనలోని విధివిధానాలను సక్రమంగా అనుష్టించకపోతే ఫలితాలు దుఃఖదాయకంగా ఉంటాయి. మనశ్శాంతి కోల్పోతారు.

కర్మానుష్ఠానమో, పూజో చేయాలనే కోరిక ఉండటంతో సరికాదు. సత్ఫలితాలు పొందాలంటే శాస్త్రోక్త రీతిని చేయాలి. పెద్దలు, మహాపురుషులు ఏ రకంగా చేశారో వారిని ఆదర్శంగా పెట్టుకొని నేర్చుకొని చేయాలి. శ్రీచక్రార్చన మహత్త్వాన్ని గ్రథాలెంతగానో శ్లాఘించాయి. అవే గ్రంథాలు పూజ చేయవలసిన రీతులను వివరించాయి. *నా వీలుబట్టీ నాకిష్టమొచ్చిన రీతిలో నేను పూజ చేస్తానని* వాటిని విస్మరించడం మనకు సత్ఫలితాన్ని ఈయకపోగా, మనం అనుకొన్నదానికి వ్యతిరేకమైన ఫలితాన్నీయవచ్చు.

యంత్రం ఒక దేవతా నివాసమే కాదు. ఆ దేవత ప్రతినిధి కూడా! ప్రతినిధి అని చెప్పడానికి కూడా వీలులేదు. ప్రతి అంటె నకలుకదా, ఈ యంత్రం దేవతా స్వరూపమే. శ్రీవిద్యకు అంబిక దేవత. ఆమె సంస్థితి శ్రీయంత్ర రూపంలో ఉన్నదనటంలో సందేహం లేదు.

అందువల్లనే శ్రీయంత్రానికొక ప్రత్యేకత ఉన్నది. లోకాశ్చర్యకరమైన సౌందర్యంతో ప్రకాశించే అంబిక రూపాన్ని పూజించడం కంటే అంబికను శ్రీయంత్ర రూపంలో పూజించడం ఉన్నతంగా చెప్పబడింది. నేనితఃపూర్వం అంబికకు రెండు నివాసాలని చెప్పాను. ఒకటి అమృత సముద్ర మధ్యలో, రెండవది మేరు శిఖరం పైన. శ్రీయంత్రము అంబిక మూడవ నివాసం.

(సశేషం)

#KanchiParamacharyaVaibhavam #కంచిపరమాచార్యవైభవం
#ParamacharyaSoundaryaLahariBhashyam
3/22/18, 07:34 - Paramacharyulu: ప్రవచనం - పారాయణం - ప్రాణ రక్షణం (పార్ట్ 1)

పరమాచార్య స్వామివారి భక్తులైన బ్రహ్మశ్రీ వళత్తూర్ శ్రీ రాజగోపాల శర్మ గారు ప్రముఖ సంస్కృత విద్వాంసులు. వేదశాస్త్రాలను పాఠశాల ప్రణాళిక ద్వారా నేర్చుకున్నారు. చిన్నవయసులో కుంబకోణం గోవింద దీక్షితర్ రాజ వేద పాఠశాలలో చదువుకుంటూ సంస్కృతం కూడా నేర్చుకున్నారు. ఆచారం, అనుష్టానం, ఉన్నత విలువలు కలిగిన మనిషి. తరువాత మద్రాసు సంస్కృత కాలేజిలో ఉన్నత విద్యాభ్యాసం చేశారు.

సంస్కృత బోధన చెయ్యాలని వారికి మక్కువ ఎక్కువ. దాంతో వారికి ఎందరో శిష్యులయ్యారు. వారు మామూలు విద్యార్థులు కాదు. వారి వద్ద సంస్కృతం నేర్చుకునే అదృష్టం పొందిన ధన్యాత్ములు. చాలా పెద్ద పెద్ద పదవుల్లో ఉన్న పెద్దవారు కూడా వారికి విద్యార్థులే. కొంతమంది ఇతర భాషలందు నిష్ణాతులు కూడా.

భారతీయ విద్యాభవన్ మైలాపూర్ చెన్నై శాఖ శాస్త్రిగారి శక్తిసామర్థ్యాలకి నిలవెత్తు సాక్ష్యం. ఆదినుండే వారు సంస్కృత అభివృద్ధి మండలికి వారు అధ్యక్షులు. ఇరవైఏడేళ్ళ పదవీకాలంలో వేలమంది విద్యార్థులు సంస్కృతం నేర్చుకోవడానికి కారణభూతులయ్యారు. ఎందరో విద్యార్థులు వారిని కులగురువుగా భావించేవారు.

వారు సంస్కృత కళాశాలలో చదువు ముగించుకున్న తరువాత కుంబకోణం వెళ్ళి పళమనేరి ఆయుర్ అయ్యర్ వేద పాఠశాలలో చదివారు. తరువాత చెన్నై రామకృష్ణ మిషన్ పాఠశాలలో ఇరవైఆరేళ్ళ పాటు సంస్కృత అధ్యాపకులుగా చేశారు.

నలభై సంవత్సరాల క్రితం రామకృష్ణ మిషన్ పాఠశాలలో ఉన్నప్పుడు పురాణ ప్రవచన సభను నెలకొల్పి, చెన్నై రామకృష్ణ మిషన్ సెంట్రల్ ఎలిమెంటరి స్కూల్ ఆడిటోరియంలో వారంలో మూడురోజుల పాటు ప్రవచనాలు చెప్పేవారు.

ఆ సమయంలో కూడా నీటి కొరత వల్ల ప్రజలు చాలా ఇబ్బందిపడేవారు. అప్పుడు మహానుభావులు రాజాజీ చెన్నై స్టేట్ ముఖ్యమంత్రిగా ఉండేవారు. రాష్ట్రం మొత్తం పూజలు, ప్రార్థనలు చెయ్యాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

అప్పుడు కొందరు ఆస్తికులు నా వద్దకు వచ్చి, మహాభారతంలోని విరాటపర్వం పారాయణ చెయ్యవలసిందిగా అడిగారు. దాదాపు రెండు నెలల పాటు పారాయణ చేశాను. అప్పుడు రెండు మూడు సార్లు భగవంతుడు మాకు వర్షాలు ప్రసాదించాడు.

దాని తరువాత చాలామంది నన్ను మొత్తం మహాభారతం ప్రవచనం చెప్పమని అడగడం ప్రారంభించారు. ఆచార్యుల అనుగ్రహంతో సంపూర్ణ మహాభారత ప్రవచనానికి శ్రీకారం చుట్టాను. వారానికి మూడు రోజుల చొప్పున మొత్తం పూర్తవడానికి నాలుగున్నర సంవత్సరాలు పట్టింది. ధన, వస్తు ఇతర రూపేణా సహాయం కావాలని ఎవ్వరిని అర్థించింది లేదు. ధనసహాయం చెయ్యమని ప్రవచనంలో చెప్పింది లేదు. కేవలం ఒక చిన్న హుండి పెట్టాము ఎవరికీ తోచినది వారు వెయ్యడానికి. కేవలం పరమాచార్య స్వామివారి అనుగ్రహం వల్లనే నాలుగున్నర సంవత్సరాల పాటు ఏ అడ్డంకి లేకుండా జరిగింది. రోజూ ప్రవచనానికి ముందు నేను విష్ణుసహస్రం పారాయణ చేసేవాడిని. ఈ ప్రవచనం విజయవంతమవడంలో ఇదీ కూడా ఒక కారణం అని ప్రగాఢ విశ్వాసం.

దీని తరువాత పద్దెనిమిది పర్వాలకు గాను పద్దెనిమిది ఆదివారాలు పాటు పద్దెనిమిదివేల సార్లు విష్ణుసహస్రనామ పారాయణ నిర్వహించాలని సంకల్పించాను. ఆస్తికుల అభ్యర్థన మేరకు వివిధ చోట్ల దిన్ని నిర్వహించడం జరిగింది. పదిహేడు వారాలు పూర్తైన తరువాత చివరిదైన పద్దెనిమిదవ వారం పారాయణ స్థలంపై చర్చలు జరుగుతున్నాయి.

చెన్నై పర్యటన నిమిత్తం వచ్చిన పరమాచార్య స్వామివారు అభిరామపురంలోని శ్రీ శంకర గురుకులంలో మకాం చేస్తున్నారు. మేము శ్రీవారిని దర్శించి మా చివరి పారాయణ గురించి తెలిపాము. స్వామివారు చివరి పారాయణ తాము ఇప్పుడున్న ప్రదేశంలోనే జరపమని, దాన్ని ఇక్కడున్న అందరికి మైకులో తెలియజేయమని ఆజ్ఞాపించారు.

మరుసటిరోజు ద్వాదశి కావడంతో పారణకు ముందే పద్దెనిమిది వేలు పూర్తిచేయ్యడానికి మాకు చాలా తక్కువ సమయం ఉంది. పారాయణకు ముందు కలశపూజ, లక్ష్మీనారాయణుల పటానికి పూజ చెయ్యడం మాకు ఆనవాయితీ. ఆరోజు కూడా ఆ ప్రకారమే చేశాము. ఎంతసేపటికి పారాయణ పూర్తికాగలదని పరమాచార్య స్వామివారు అడిగారు. ఆరోజు పారాయణకి చాలామంది వచ్చినందువల్ల త్వరగానే పూర్తిచేస్తాము అని చెప్పాను.

స్వామివారు ఇచ్చే తీర్థం స్వీకరించేందుకు వచ్చిన భక్తుల కోసమని వెదురు కర్రలతో వరుసలు ఏర్పాటు చెయ్యవలసివచ్చింది. పారాయణ పూర్తై, దీపారాధన ప్రారంభించాము. ఘంటానాదం వినబడగానే భక్తులందరూ ఒక్కసారిగా “పుండరీక వరద . . .” అని ఎలుగెత్తి చెబుతున్నారు. అది వినగానే పరమాచార్య స్వామివారు వెదురుకర్రలను దాటుకుంటూ దీపారాధన దర్శనానికి వచ్చారు. దీపారాధన మొదలవగానే తనకు తెలపమని శిష్యులకు స్వామివారు తెలిపారని మాకు తరువాత తెలిసింది. నేను కుంభజప తీర్థాన్ని, పూలదండలను

స్వామివారికి సమర్పించడానికి తిసుకునివెళ్ళాను. అది మహాజప తీర్థం కావున దాన్ని ఉంచడానికి ఒక చెక్కబల్లను తెప్పించారు స్వామివారు.

మామిడి ఆకులతో ఆ తీర్థజలాన్ని అందరిపైన ప్రోక్షించారు. తరువాత దాన్ని తీర్థంగా ఇచ్చారు. ఒక పెద్ద పళ్ళెంలో తమలపాకులు, వక్కలు, అరటిపళ్ళు, టెంకాయ, పూలమాలలు, పద్దెనిమిది రూపాయి నాణాలు స్వామివారి పాదాలకు సమర్పించాను.

“పూర్తైన పదిహేడు పారాయణాలు ఇలాగే చేశావా?” అని అడిగారు స్వామివారు. అవునని చెప్పగా మరలా అడిగారు. నాకు కళ్ళల్లో నీరు తిరిగి, “అవును. మా శక్తి కొలది పెరియవ” అని చెప్పాను. పారాయణ చేసివారిని అక్కడే భోజనం చెయ్యమన్నారు. పరమాచార్య స్వామివారు సంతోషంతో చాలాసేపు నాతో మాట్లాడారు. పూర్తిగా సంస్కృతంలోనే మాట్లాడి చివరకు మమ్మల్ని ఆశీర్వదిస్తూ, “మహాత్ ఇథం కార్యం సౌభాగ్యోదయ ప్రవర్తతే” అని అన్నారు.

సాయంత్రం లక్ష్మినారాయణుల చిత్రపటాన్ని తేవడానికి గురుకులానికి వెళ్లాను. అది పరమాచార్య స్వామివారు సంస్కృత కళాశాలకు వెళ్ళే సమయం. శ్రీవారు అభిరామపురం నుండి మొదలై నాగేశ్వరరావు పార్కు వీధి, కర్పగాంబళ్ వీధి గుండా వెళ్తారు. చేతిలో చిత్రపటంతో నేను కూడా భక్తులతో చేరి ముందుగా నడుస్తున్నాను. కర్పగాంబళ్ వీధిలోకి వెళ్ళబోతుండగా, ఒక వ్యక్తి నావద్దకు పరిగెడుతూ వచ్చి, “స్వామివారు మీ ఇంటి మీదుగానే వెళ్తున్నారు” అని చెప్పాడు. నేను నివ్వెరపోయాను. అందరితోనే వస్తున్నా నాకు తెలియకపోవడమేమిటని వెంటనే ఇంటికి పరిగెత్తాను.

(సశేషం)

అపార కరుణాసింధుం జ్ఞానదం శాంతరూపిణం
శ్రీ చంద్రశేఖర గురుం ప్రణమామి ముదావహం ॥

#KanchiParamacharyaVaibhavam #కంచిపరమాచార్యవైభవం
3/22/18, 12:16 - Paramacharyulu: <Media omitted>
3/22/18, 16:02 - Paramacharyulu: పదకొండవ శ్లోక భాష్యం - మూడవ భాగం

ఇప్పుడు నే చెప్పిన దాంట్లో రెండు పొరపాట్లున్నాయి. ఒకటి శ్రీచక్రము అంబిక నివాసమొక్కటే కాదు. అంబికే ఆ శ్రీయంత్రం. యంత్రమే నివాసస్థలమూ, నివసించే మూర్తీ కూడా! ఇక ఈ శ్రీయంత్రం అమృత సింధువు, మేరు పర్వతముల వంటి ఆవాస స్థలముకాదు.

సుధాసింధువులోనూ, మేరు పర్వతంలోనూ కూడా శ్రీయంత్రముంటుంది. దానిపైనే చింతామణి గృహం ప్రతిష్టితమ్మై ఉంటుంది. మనింట్లో పూజించే శ్రీయంత్రం ఎంతో చిన్నది. సుధాసముద్రంలోనూ, మేరు పర్వతంపైనా ఉన్న శ్రీచక్రములు పరిమాణంలో ఈ శ్రీయంత్రానికి లక్షల రెట్లు పెద్దవి. వాటికీ నవావర్ణలున్నాయి. ప్రతి ఆవరణలోనూ అనేక దేవతలున్నారు. అమ్మ పరివారం, పరిచారికలున్నారు. బిందువుపైన, తొమ్మిదవ ఆవరణలో అంబిక పంచ బ్రహ్మాసనంపై కూర్చుని ఉంటుంది.

లిఖించబడిన లేక ఈ పలకపై చెక్కబడిన (Two Dimensional - 2D) శ్రీయంత్రము భూప్రస్తారమని పిలవబడుతుంది. ఆవరణలన్నీ ఒకదానికి పైగా ఒకటి చెక్కబడిన శ్రీయంత్రమునకు (3D - Three Dimensional) మేరు ప్రస్తారమని పేరు. కొన్ని ఆవరణలు ఒకదానిపై ఒకటి చెక్కబడి, మరికొన్ని ఆవరణలు భూమి ఎత్తులో ఉంటే దానిని అర్థమేరు అంటారు. అప్పుడు పైన చెప్పేనది పూర్ణమేరు. కామాక్షి సన్నిధిలో ఆచార్యులవారు లిఖించి ప్రతిష్ఠించిన భూప్రస్తారము. మన మఠంలో పూజలో ఉన్నది పూర్ణమేరు. మాంగాడులో కామాక్షి దేవాలయంలో అర్థమేరు ఉన్నది.

మిగతా యంత్రములన్నీ ఆయా యంత్రముల దేవతల పేర్లతో పిలవబడుతున్నాయి. శివచక్రము, మేధాదక్షిణామూర్తి యంత్రము, షడక్షర చక్రము – ఇలా! లలితా యంత్రం మాత్రం శ్రీచక్రమని పిలవబడుతుంది. శ్రీ అంటే ఎంతో పవిత్రమైనది. పూజనీయమైనది, శుభకరమైనది అని అర్థం. అసలు కేవలం చక్రమని పిలిస్తే దానికి శ్రీచక్రమనే అర్థం. అంబికా యంత్రానికి ప్రత్యేకమైన పేరు అవసరం లేదని దీని భావం. అలాగే ఆమెను పూజించే మార్గానికి కూడా శ్రీవిద్య అని పేరు. మిగతా దేవతల పూజా పద్ధతులు వారివారి పేర్లతోనో లేక ఆ మంత్రద్రష్టల పేర్లతోనో పిలవబడుతున్నాయి. శ్రీవిద్యలో కూడా అనేక మంత్రాలున్నాయి. ఆ మంత్రాలు కూడా మొదటి అక్షరంతోనో, మంత్రద్రష్ట పేరుతోనో పిలవబడతాయి. కానీ లలితా తంత్రాన్నంతటినీ కలిపి శ్రీవిద్య అంటారు. ఆవిడ మంత్ర యంత్రాలే కాదు, ఆమె నివసించే పురానికి కూడా కైలాసమో, వైకుంఠమో అనే ప్రత్యేక నామం లేదు. దానికి శ్రీపురము లేక శ్రీనగరమన్న పేరు. ఈ పేరు చాలు – లోకజనని అయిన తల్లి ఆవాసముండే నగరమని చెప్పడనికి.

ఆమె మనకు *నిత్యశ్రీ*ని ప్రసాదిస్తుంది. ఆత్మానుభూతి అనే ఎల్లలు లేని, పోలికలేని ఆనందాన్ని ప్రసాదిస్తుంది.  అందుకే లలితా సహస్రనామంలో ఆమె మొదటిపేరు *శ్రీమాత*. తదనుగుణంగానే *శ్రీవిద్య, శ్రీచక్ర, శ్రీపుర* మనే పేర్లు.

నేను సౌందర్యలహరిలో వివరించబడిన శ్రీయంత్రాన్ని గురించి కదా వివరిస్తున్నాను. తొమ్మిది త్రికోణాలు ఒకదానినొకటి ఖండించుతూ ఆరు ఆవరణలుగా నలభై మూడు (నలభై నాలుగు) త్రికోణములుగా ఉంటాయని చెప్పాను. ఆ తొమ్మిది త్రికోణములలో నాలుగు శివ చక్రములు. ఐదు శక్తి చక్రములు. బిందువు శక్తి చక్రములలో ఒకటి, పూజచేసే భక్తునకభిముఖంగా ఈ బిందువుండాలి. శివశక్తుల అద్వైత తత్త్వాన్ని ఒకదానినొకటి పెనవేసికున్న శివశక్తి చక్రాలు తెలియజేస్తున్నాయి. అందువలన ఉద్భవించిన కోణములు, పద్మదళము, బహిఃప్రాకారములు, వాటి పరిమాణముల గురించి ఈ శ్లోకం చెబుతోంది. శ్రీవిద్యా సంబంధించిన వాఙ్మయం ఒక నవల వలెనో, ఊరికే తెలుసుకోవటానికి కాలక్షేపానికి చదివే పుస్తకంగానో మీరు చదవరాదు. ఇది గురువు చేత ఉపదేశింపబడి గోప్యంగా ఉంచదగిన మహావిద్య.

విషయాన్ని పూర్తిగా వదిలి వేయరాదని నేను కొంచెంగా స్పృశించాను.

(సశేషం)

#KanchiParamacharyaVaibhavam #కంచిపరమాచార్యవైభవం
#ParamacharyaSoundaryaLahariBhashyam
3/23/18, 07:33 - Paramacharyulu: ప్రవచనం - పారాయణం - ప్రాణ రక్షణం (పార్ట్ 2)

వెంటనే ఇంటిముందు కళ్ళాపి చల్లి, ముగ్గులు వేయడానికి సమాయత్తపరిచాను. మావిడాకుల తోరణం కట్టి, చేతిలో ఉన్న పటాన్ని ఒక కుర్చీలో పెట్టి, పూలహారం వేసి, ఒక దీపం వెలిగించాను. పూర్ణకుంభం, కర్పూరహారతి పళ్ళెం సిద్ధం చేశాము. త్వరితగతిన అన్నీ సిద్ధం చేశాము. ఆ విధి గుండా పరమాచార్య స్వామివారు వెళ్తున్నారని జనమంతా దారికిరువైపులా నిలబడ్డారు.

ఇరుగుపొరుగు వారు మేము అందరమూ కలిసి ముకుళిత హస్తాలతో స్వామివారి కోసం బయట ఎదురుచూస్తున్నాము. నాకు అంతటి అర్హత లేదని స్వామివారిని ఇంటికి ఆహ్వానించలేదు. సాధారణంగా నాగేశ్వరరావు పార్కు వీధి, కర్పగాంబళ్ వీధి, వివేకానంద కళాశాల తూర్పు వీధి, సుల్లివాన్ గార్డన్ వీధి గుండా సంస్కృత కళాశాలకు వెళ్ళే మార్గమును వదిలి ఇలా ఆగమిస్తున్నారు.

ఎంతోమంది ఆ దివ్యచరణ కమలములు తమ ఇంటికి రావాలని ఆర్తితో ఎదురుచూస్తుంటే, నాకు కలిగిన భాగ్యానికి కళ్ళు తడి అవుతున్నాయి. ఇప్పుడు స్వామివారు వస్తున్న మార్గాన్ని శిష్యులు ఖచ్చితంగా వద్దు అని చెప్పి ఉంటారు. ఎందుకంటే ఆ మార్గమంతా నల్ల జండాలు, గోడలపై నాస్తిక వాదనలు రాశారు. కాని అటువంటి స్థలాన్ని వారి పాదముల చేత తరింపచేయాలనుకున్నారేమో. ఒకసారి టి. నగర్ లోని యునైటెడ్ ఇండియా కాలనికి ఒక మురికివాడ గుండా వెళ్ళడానికి అడ్డు చెప్పినప్పుడు, “అంతటి దారుణమైన పరిస్థితులు ఉన్న ప్రాంతమా? అయితే తప్పక వెళ్ళవలసింది అటే” అని అన్నారు.

మా ఇంటి ముందర పెద్ద గుంపు ఏర్పడింది. పరమాచార్య స్వామివారు లోపలికొచ్చి, ముగ్గు వేసిన చెక్కబల్లపై కూర్చున్నారు. పూర్ణకుంభ పాదపూజ, హారతి చేశాము. నా భార్యాపిల్లలతో పాటు స్వామివారికి ముమ్మారు ప్రదక్షిణ చేసి, నేలపై పడి నమస్కరించాము. స్వామివారు లోపల ఉన్న లక్ష్మీనారాయణుల చిత్రపటాన్ని చూపిస్తూ “పూజకు పెట్టిన ఈ లక్ష్మి నారాయణుల చిత్రపటంతో వీరు నాలుగున్నర సంవత్సరాలు మహాభారత ప్రవచనం, మూడు లక్షలా ఇరవైనాలుగువేల విష్ణు సహస్రనామ పారాయణం చేశారు” అని చెప్తూ పటాన్ని చూడటానికి త్రోవ ఇవ్వవలసినదిగా అక్కడున్నవారిని పక్కకు జరగమని చెప్పట్లు చరిచారు.

ఆ పటాన్ని తదేకదృష్టితో చూస్తూ, “రాజగోపాలా!” అని దగ్గరకు పిలిచారు. నేను ఉంటున్న ఆ పాత ఇంటిని ఒకసారి పరీక్షగా చూసి, “ఇదే మీ ఇల్లు. ఈ ఇంట్లోనే నువ్వు ఉండడం” అని అన్నారు. అవును అని చెప్పగా, మమ్మల్ని మరొక్కసారి నమస్కరించమని ఆదేశించారు. అందరమూ శ్రీవారికి నమస్కరించాము. కేవలం కొద్దిరోజుల్లోనే ఆ పాత ఇంటిని వదిలి, ఇప్పుడున్న పెద్దదైన ఈ కొత్త ఇంటికి వెళ్ళగలిగాము. ఇక్కడకు వచ్చిన తరువాత కాలంతోపాటు ఇంట్లోకూడా శుభకార్యాలు, పెళ్ళిళ్ళు జరిగాయి.

కేదార్ నాథ్, బదరీనాథ్ యాత్ర కూడా వెళ్ళే అవకాశం వచ్చింది. మహాస్వామివారు మదురైలో మకాం చేస్తున్నప్పుడు, ఈ యాత్రకోసం వారి ఆశీస్సులు అర్థించగా, “మొత్తం కుటుంబం అంతా వెళ్ళండి. బదరీనాథ్ మాత్రమే కాదు. కేదార్ నాథ్ కూడా వెళ్ళండి” అని అన్నారు. అప్పుడు ప్రపంచమంతా గ్రహాల అష్టగ్రహ కూటమి గురించి భయపడుతున్న కాలం. దానికి పరిహారంగా కేదార్ నాథ్ వెళ్ళమని ఒక ఒక రుద్రాక్ష మాలను అనుగ్రహించారు.

వారి అనుగ్రహం వల్ల వచ్చిన ఆటంకాలను అధిగమించి యాత్ర పూర్తీ చేశాము. బదరీనాథ్ వెళ్ళేదారిలో హిమాలయ పర్వతాల నుండి కొండ చెరియలు పడుతుండడంతో హృషికేశ్ లో మా ప్రయాణం ఆలస్యం అయ్యింది. రెండు మూడు రోజుల తరువాత మా ప్రయాణం ప్రారంభమైనా ఎక్కువ రద్దీ వల్ల హృషికేశ్ లో ఇంకా కొన్ని రోజులు ఉండిపోవాలేమో అనుకున్నాము.

మేము బస చేస్తున్న నేపాలి ఆశ్రమం వారి అభ్యర్ధన మేరకు పురాణ ప్రవచనాలు మొదలుపెట్టాను. నేను సంస్కృతంలో చెబుతుంటే, ఒక గురూజీ హిందీలో అనువదించి చెప్పేవారు. స్వామివారి అనుగ్రహం వల్ల ఉత్తరాదివారు కూడా నా ప్రవచనాలను ఇష్టపడేవారు. చివర్లో మా యాత్ర ఇబ్బందుల గురించి చెప్పాను. ఉత్తరాదివారికి సంస్కృత పండితులపై ఉన్న గౌరవ మర్యాదలు ఆ రోజే నాకు అవగతమయ్యాయి.

వాళ్ళల్లోనుండి ఒకతను లేచి, “మిమ్మల్ని బదరీనాథ్ తీసుకుని వెళ్ళే బాధ్యత నాది. ఉదయం సిద్ధంగా ఉండండి. మీతోపాటు ఎందరున్నారు?” అని అడిగాడు. అలాగే అతను మాట నిలుపుకున్నాడు. బదరీనాథ్ లో దర్శనమప్పుడు కూడా రద్దీ వల్ల చాలా ఇబ్బంది పడ్డాము. కాని ఎవరో మమ్మల్ని గుర్తుపట్టి అన్ని సదుపాయాలూ చేసేవారు. ఇదంతా కేవలం పరమాచార్య స్వామివారి అనుగ్రహం మాత్రమే. మొత్తానికి కేదార్ నాథ్ యాత్ర కూడా ముగించాము.

దాదాపు యాత్రకు వెళ్ళిన ఇరవై మందిమీ క్షేమంగా చెన్నై చేరుకున్నాము. మా క్షేమసమాచారముల గురించి వాకబు చూస్తూ, చాలామంది బంధువులూ, శిష్యులూ ఫోన్లు చేస్తున్నారు. ఇంతమంది చెయ్యడానికి కారణమేంటో తరువాత నాకు తెలిసింది. మేము తిరిగొచ్చిన తరువాత హిమాలయాల్లో భారీగా కొండచరియలు పడి చాలామంది యాత్రికులు గాయపడ్డారని వార్తలు వచ్చాయి.

రెండు మూడు రోజుల్లో ఇలయత్తాంగుడిలో మకాం చేస్తున్న పరమాచార్య స్వామివారిని దర్శించుకోవడానికి వెళ్ళాము. గంగానుండి తెచ్చిన తీర్థాన్ని స్వామివారి ముందుంచాను. అప్పుడే ధనుష్కోటి తీర్థం కూడా వచ్చింది. మరుసటిరోజు పరమాచార్య స్వామివారు స్నానం చేస్తున్నప్పుడు రెండు తీర్థాలను శరీరంపై వేసుకున్నారు. అది చూడగానే మాకు చాలా ఆనందం కలిగింది. ఇతర భక్తులతో పాటు మేము కూడా స్నానాలు ఆచరించాము.

తరువాత స్వామివారు మా యాత్రా విశేషాల గురించి అడుగుతూ, “హిమాలయాల్లో కొండచరియలు పడుతున్నాయని విన్నాను” అని అన్నారు. “మాకు కవచం ఉనడడం వల్ల మాకు అవేవీ ఇబ్బంది కలిగించలేదు” అని అన్నాను. “కవచమా?” అని అడిగారు. నా మేడలో ఉన్న రుద్రాక్షమాలను తాకి, “మీ ఆశీస్సులు ఈరూపంలో మావద్ద ఉన్నప్పుడు, మాకు ఇబ్బంది ఏముంది” అని చెప్పాను. స్వామివారు నవ్వారు. వారికి నమస్కరించి మేము వెనుదిరిగాము.

ఇది జరిగి ఎన్నో సంవత్సరాలు గడిచినా, వాటి జ్ఞాపకం ఇంకా తాజాగానే ఉంది.

--- పరంథమన్ వి. నారాయణన్, ‘పరమాచార్యర్’ నుండి

అపార కరుణాసింధుం జ్ఞానదం శాంతరూపిణం
శ్రీ చంద్రశేఖర గురుం ప్రణమామి ముదావహం ॥

#KanchiParamacharyaVaibhavam #కంచిపరమాచార్యవైభవం
3/23/18, 13:04 - Paramacharyulu: <Media omitted>
3/23/18, 16:24 - Paramacharyulu: పన్నెండవవ శ్లోక ఉపోద్ఘాతం - మొదటి భాగం

(అంబిక సౌందర్యాన్ని వర్ణించే శ్లోకాలకు ఉపోద్ఘాతంగా మహాస్వామి వారు చేసిన వివరణ)

శివానందలహరిలో ఆచార్యులవారు శివకథామృతం నుండి పెల్లుబికిన మహాప్రవాహం ప్రపంచ పరిస్థితి వలన జనించిన క్లేశములను, మాలిన్యములను కడిగివేస్తుందనీ, ఆత్మ స్పృహ అనే మహా తటాకాన్ని నింపివేస్తుందనీ ప్రస్తుతిస్తారు. ఈ కారణం చేతనేనేమో వారు శివానందలహరిలో శివలీలలను వివరించారు. శివుడు అనేక పాత్రలలో అనేక విధులు నిర్వర్తిస్తున్నట్లు చూపబడింది. సౌందర్యలహరి నిర్మాణంలో ఆచార్యులవారి పంథా వేరు. అంబిక చూపవలసిన లీల, చేయవలసిన విధి అంటూ ప్రత్యేకంగా ఏవీ లేవు. ఆ తల్లి ఒక మహాసౌందర్య ప్రవాహం. ఆ వెల్లువ మన సమస్త దురితములను ప్రక్షాళన కావిస్తుంది. మన హృదయాలను విస్తారంగా ఆనంద సాగరములుగా మలచి వేస్తుంది. ఆచార్యుల వారు వర్ణించాలంటే భండాసుర వధ వంటి రసవత్తరమైన ఘట్టాలను అనేకం వర్ణించవచ్చు. వారు అంబిక జగన్మోహనమైన రూపాన్ని వర్ణిస్తూ అదే సమస్త ఆనందములకూ, పరమానందములకూ ఆధారభూతమైనదని ఆవిష్కరించడంలో ప్రత్యేక శ్రద్ధ చూపారు.
వందలమైళ్ళ దూరం నుండి, ఒక్కసారి ఆ గంగా ప్రవాహంలో మునకవేస్తే సమస్త పాపములు ప్రక్షాళనమయిపోతాయనే ప్రగాఢ విశ్వాసంతో గంగను చేరుతున్నాము. ఒక్క మునక వేయడంతో మన ప్రయోజనం సిద్ధిస్తుంది. అయినా ఒకసారి గంగలో దిగిన తరువాత మనమెందుకు వచ్చామన్నది పూర్తిగా మరచిపోయి గంగా ప్రవాహమో ఓలలాడే ఆనందంతో అలానే మునుకలు వేస్తూ ఉంటాం. అమ్మ సౌందర్యమటువంటిది. మనలను మనం మరచిపోయి ఆ సౌందర్య ప్రవాహంలో ఓలలాడుతూ అలాగే ఉండిపోవాలనిపిస్తుంది.

మహోన్నతమైన హుందాతో కూడిన ఒక అందాన్ని చూడడం తటస్థ పడిందనుకోండి. అసంకల్పితంగా చేతిలోని పనుల్ని వదిలివేసి ఆ అందం వైపు నిశ్చేష్టులమై చూస్తూ ఉండిపోతాము కదా! అప్పుడు ఆ అందాల గురించి చర్చించడానికో, వర్ణించడానికో, వినడానికో బుద్ధి పుట్టదు. అలాచూస్తూ ఉండిపోతాం అంతే! అటువంటి పరిపూర్ణమైన అందం అమ్మది.

భగవంతుని పొందడనికి రెండు సులభమైన మార్గాలున్నాయి. ఒకటి నామజపం. రెండు రూప ధ్యానం. పరమేశ్వరుని సచేతనంగా తమ ఎదుట నడయాడుతున్నట్లు చర్మ చక్షుస్సులతో దర్శించి, మాట్లాడగలిగే మహాత్ములు కొందరున్నారు. మనం విగ్రహాలను మాత్రమే చూడగలుగుతున్నాం. సాధన చేత అంతర్నేత్రంతో స్వామిని దర్శించగలుగుతాం. అయితే విగ్రహానికి కూడా ప్రాణప్రతిష్ఠ జరుగుతుంది. వైష్ణవులు అలా ప్రతిష్ఠించబడిన విగ్రహాలను అర్చామూర్తులంటారు. దేవాలయములలోని అర్చామూర్తులను దర్శించి ధ్యానించడం వల్ల మన ప్రయత్న మెక్కువ లేకుండానే పరమేశ్వర రూపధ్యానం సిద్ధిస్తుంది.
నామమాహాత్మ్యం ఇనుమిక్కిలిగా వివరించబడింది. దానికి ఈ రూపధ్యానం కూడా జోడించినపుడు శీఘ్రగతిని ఏకాగ్రత సాధ్యం కాగలదు. కేవలం మంత్రజపంతో ఏకాగ్రత సాధించడం కంటే రూపాన్ని చింతిస్తూ లేక విగ్రహాన్ని దర్శిస్తూ చేయడం వలన ఏకాగ్రత శీఘ్రగతిన సిద్ధిస్తుంది. రామ జపం జపించేటపుడు ఆ కోదండధారి, నీలమేఘశ్యాముని మనస్సులో చింతించామంటే మనస్సు పరవశమవుతుంది. జగన్మోహనమైన స్వామి రూపాన్ని చింతించడం భక్తి మార్గములన్నిటికంటే శ్రేష్ఠమైనది.

(సశేషం)

#KanchiParamacharyaVaibhavam #కంచిపరమాచార్యవైభవం
#ParamacharyaSoundaryaLahariBhashyam
3/24/18, 08:13 - Paramacharyulu: కళద్వారా చిత్తశాంతి

గ్రంథ పఠనంవల్ల, ఉపన్యాస శ్రవణంవల్ల మనస్సుకు భావగ్రహణం చక్కగా లభిస్తుంది. ఆ ఉపన్యాసమేగానముతో కూడుకునివుంటే హరికథా కాలక్షేపంవలె మరీ మనోరంజక మవుతుంది. అలాగే గ్రంథంకూడా శబ్దార్థాలంకారాలతో విభావాదివర్ణనలతో కూడుకుని ఉంటే అందలి భావసౌందర్యం ఎంతో హృదయంగమ మవుతుంది. ఆ గ్రంథములే మహాకవి రచిత కావ్యములయితే మరి చెప్పేదేమిటి? కావ్యములు-శ్రవ్యములు-వినదగినవి. దృశ్యములు-చూడదగినవి, అని రెండు విధాలు. దృశ్యకావ్యములనే నాటకము లంటాము. చెవితో విన్నదానికంటే రంగస్థలమందు కండ్ల ఎదుట ప్రదర్శితమైనభావం సరాసరిగా హృదయాన హత్తుకొంటుంది. భాస కాళిదాస భవభూత్యాదులగు మహాకవులు చిరకాలమునాడే ఇట్టినాటకాలు రచించారు.

అచ్చుయంత్రం వచ్చినపిమ్మటచేతితో గ్రంథప్రతుల్లు వ్రాసుకునే శ్రమ తప్పిపోయి, వేలకొలది ప్రతులిట్టే సిద్దమవు తున్నవి. అట్లే ఇపుడు సినిమావచ్చింది కనుక, నాటకాన్ని నటులు మాటిమాటికి ప్రదర్శింపనక్కరలేదు. ప్రదర్శనాన్ని ఒక్కసారి సినిమాతీస్తే, దాన్నినే ఎన్ని సార్లయినా మనం చూస్తూవుండవచ్చు.

చిత్త మందుపుట్టే రసభావాలన్నిటికీ నాటకమందు ప్రవేశమున్నప్పటికీ ఒక్కొక్క నాటకం ఒక్కొక్కరసాన్ని ప్రధానంగాను, తక్కినవానిని అప్రధానంగాను ప్రదర్శిస్తూంది. ప్రధానమైన అంగిరసానికి తక్కినవి అంగములుగా ఉంటవి. మహావీరచరితం, వేణీ సంహారము అనే నాటకాలలో వీరం ప్రధానరసం. అట్లేశృంగార హాస్య కరుణాదులు కొన్ని నాటకాలలో ప్రాధాన్యం వహిస్తవి. నవరసాలలో శాంతరసం అగ్రగణ్యం. ఒక్కొక్క విధమయిన చిత్తవికారంవల్ల శృంగారాదిరసాలు పుట్టుతవి. శాంతరసం అట్టిదికాదు. వృత్తిరహితమై నిర్వికారమైన చిత్తస్థితినే శాంతమంటాము. కనుకశాంతమును నవరసాదులలో గణించకూడదనే మతభేదం ఉంది. ఆలంకారికులలో ఇతర రసములందు చింతాజడత్వాది వ్యభిచారిభావాలకు ప్రాధాన్యం వుంటుంది. కనుక స్థిరమైన ఆనందాన్ని కలిగించవు. శాంతరసము నిర్వికారము, సాత్త్వికము కావడంవల్ల దానిచే అభంగురము, సుస్థిరము అయిన ఆనందం లభిస్తుంది. త్యాగయ్యగారు చెప్పినట్లు ''శాంతములేక సౌఖ్యములేదు.'' కావున యితర రసములందుండే రంజకత్వము, ఉద్దీపనము లేకున్నను శాంతమునకు స్వతః రసత్వమున్నదని చెప్పవచ్చు.

జిహ్వాకు రుచినిపుట్టించే కటుతిక్తామ్లకషాయాదిషడ్రసములు కూడా ఈ నవరసాల వంటివే. ఈ షడ్రసాలు పాళ్ల చొప్పున ఒంటొంటితో కలిసి సంతోషాన్ని కలిగిస్తవే కాని, స్వభావముచే సాత్వికములు కావు. నాలుకపై రుచుల నుద్దీపింపచేసి ఇవి మనస్సును తల్లడిపెట్టుటేతప్ప చిత్తమునకు శాంతి నివ్వజాలవు. వీనిలోచక్కెరమున్నగు వానియందు మాధుర్యం లభిస్తుంది. ఆమాధురంకూడ మితిమీరితే మొగంమొత్తుతుంది. ఎంత అనుభవించినాతృప్తితీరని మాధుర్యంమరొకటి వున్నది. దానినే మధు-రసమంటారు. రుచినిపుట్టించేషడ్రసాలలో ఏదీ అందులో కలియదు. అది సాత్వికము, శ్రీకృష్ణుడారగించేదదే! విశుద్ధవర్ణము. కేవల సాత్వికము అయిన నవనీతమే ఆ పదార్థం, కృష్ణునినోటినిండా వెన్నా, మనమునిండా ఆనందమూను, ఆవెన్నచే మొగముమొత్తదు తనివితీరదు. వెన్నయందు లభించే మధురరసమే శాంతరసం.
రంగులప్రస్తావం వచ్చినప్పుడు వానిలో నలుపు తెలుపు అంటూ బేధంచేస్తాము. నలుపు తెలుపు వేర్వేరుగా మన కంటికి కనుబడునేగాని, నిజానికవి వర్ణములు కావని సైన్సు చెబుతుంది. సూర్యుడు ఏడుగుర్రాలరథంమీదప్రయాణంచేస్తున్నట్లు పురాణములు వర్ణిస్తవి. వేదములుకూడా సూర్యుని సప్తాశ్వుడంటున్నవి. ఈయశ్వశబ్దానికి, నిరుక్తం కిరణమని అర్థంచెపుతున్నది. కావున సప్తాశ్వుడంటే సప్తకిరణాలుకలవాడని గ్రహించాలి. పూర్వం సంపన్నులఇండ్లలో స్ఫటికగోళములుగృహములకలంకారంగా వ్రేలాడుతూవుండేవి. వానిలో దీపములు వెలిగించేవారు. ఆగోళములు దీపములతో వూగులాడినప్పుడు ఏడురంగులుగా కనుపించేవి. ఆఏడువర్ణములు ఏకమైనప్పుడు తెల్లగా కనుపించునేకాని, తెలుపు వేరేరంగు కాదు. శుద్ధమైన తేజస్సే తెల్లగా కనిపిస్తుంది. ఆవిశుద్ధకాంతిని మూడుపలకల కాచఖండములోనుండి చూస్తే ఏడురంగులుగా కానవస్తుంది. ఈ యేడురంగులను సమపాళ్లుగా కలిపితే తెల్లని తేజము లభిస్తుందని సైన్సు తెలియచెప్పుతున్నది. చమురు దీపం ఎర్రగాకనుపిస్తుంది. చమురునందు ఆయెరుపుపాళ్లెక్కువగా వుండుటే దానికి కారణం.

నేతి దివ్వెయం దంత ఎరుపు కనిపించదు. నూనెకంటె నేయి పరిశుద్ధం కనుకనే దేవాలయములందు గర్భగుడిలో స్వామిసన్నిధిని నేతిదివ్వెలు వెలిగిస్తారు. నిర్మలమైన ఆవెలుగు నందు రంగు కనిపించదు.

బంగారము, వెండి, ఇనుము మొదలైన లోహములను నిప్పులలో కాల్చి ప్రజ్వలింపజేసినపుడు ఆయాలోహాలనుబట్టి ఆజ్వాలయందు భిన్నవర్ణములుగోచరిస్తవి. ఇచట ఇంకో విశేషమేమిటంటే సూర్యకాంతిని వర్ణదర్శినితో పరిశీలిస్తే దానియందీ లోహాలుకనిపించుతవట. ఇవేకాక హీలియం అనే మరో ధాతువుకూడా సూర్యకాంతియందున్నదట. ఈహీలియమనే శబ్దం సూర్యుడనే అర్థంగల లాటిన్ శబ్దం నుంచి పుట్టింది. సంస్కృతభాషయందు సూర్యుణ్ణి చెప్పే 'హేళి' అనేశబ్దమున్నది. ఈ హీలియం సూర్యునియందేతప్ప భూమియందులభించదట. ఈవిశ్వాన్ని 'హీలియో సెంట్రిక్' అంటారు. అం టే విశ్వానికి సూర్యుడే కేంద్రమనితాత్పర్యం. హేళిశబ్దంనుంచే హీలియో సెంట్రిక్ శబ్దంకూడా పుట్టిందని మనం గమనించాలి.

సూర్యకాంతికి లేనట్లే స్ఫటికానికి గూడా రంగులేదు. అంతేకాదు, నీటికిగూడా రంగులేదు. శుద్ధస్ఫటికానికి పరీక్ష ఏమిటంటే, దానిని నీటిలో వేసినపుడది కనుపించగూడదు. కంటి కగుపించు వస్తువులలో స్ఫటికానికి రంగులేనట్లే రుచి చూచే వస్తువులలో వెన్నకుగూడా రుచిలేదు. ఈరెండివలెనే నవరసాలలో శాంతముగూడ నిర్మలం, పరిశుద్ధమూను, శాంత రసమందు మనస్సు వృత్తిరహితమై, సమాధిని పొందుతుంది. రసానుభవసమయమందు మనస్సు తన్మయత్వం పొందుతుంది. కనుక శాతరసమం దది శాంతిమయమవుతుంది. శృంగారాది రసప్రధానములైన నాటకాలు అనేకంగా వున్నవి. కాని శాంతరసనాటకాలు చాలా అరుదు. నేటి నాటకాలు చూడబోతే కామ క్రోధాదులను ప్రకోపింపజేసి మనుష్యుని అధమస్థితికికొనిపోయేవేతప్ప చిత్తశాంతినిచ్చి ఉన్నతిని కల్గించేవి కానరావు. శాంతరస ప్రధానములగు నాటకములు నేడు లేనే లేవు.

వెయ్యేండ్ల క్రితం రాజపుత్రస్థానవాసియైన కృష్ణమిశ్రుడనే కవి ప్రబోధ చంద్రోదయమనే శాంతరసప్రధానమైన నాటకం రచించాడు. దీనిని పోలినది మరొకటి లేదు. జ్ఞానమే మోక్ష సాధనమని కథారూపాన చెపుతుందీనాటకం. వివేకుడు, విష్ణు భక్తి, శ్రద్ధ, కరుణ, ధర్ముడు, వైరాగ్యం, అజ్ఞానం మొదలైన విందు పాత్రలు, ప్రబోధమనే సామ్రాజ్యంకోసం ఇందు ఇరు తెగలకుపోరాటం జరుగుతుంది. అశాంతి కారణమైన తెగ ఓడిపోయి, జ్ఞానఫలమైన శాతిపక్షం జయంపొందుతుంది. ఈనాట కాన్ననుసరించి శ్రీ వేదాంతదేశికులుగూడ సంకల్ప సూర్యోదయమనే నాటక మొకటిరచించారు. పరమేశ్వరాను గ్రహానికి కారణమైన భక్తికి ఇందు ప్రాధాన్యం చెప్పబడింది.

నాటక ప్రదర్శనాన్ని చూడటంవల్ల చిత్తశుద్ధీ, చిత్తశాంతీ కలుగవలెనేకాని కామాదులు ప్రకోపింపకూడదు. నేటి నాటకాలు, సినిమాలూ కామాదులను ప్రకోపింపజేయుటే పనిగా పెట్టుకొని ప్రజాసంఘములకు పరస్పరద్వేషం కలిగిస్తూ ఒక్కొక్కసంఘాన్ని పరిహాసపాత్రము చేస్తూదానిపట్ల అసూయా క్రోధాలను రేకెత్తిస్తున్నవి. పూర్వం నాటక ప్రయోగంకోసం ఏర్పడినతెగనుభరతపుత్రులనేవారు. నాటకాలాడడమే వారికే స్వధర్మంగా వుండేది. వారికదే జీవనాధారమైనవృత్తి. ఇతర వృత్తులు స్వధర్మములలో గల తెగలవారు ఈనాట్యవృత్తిలో ప్రవేశిస్తేభరతపుత్రుల వృత్తికిభంగం కలిగించినవారవుతారు. అంతేకాదు, స్వధర్మమును విడనాడి పరధర్మాన్ని స్వీకరించుటచే తమధర్మానికి

చేటూ, సంఘానికిహాని చేకూర్చినవారవుతారు. నాట్యజీవనులైన భరతపుత్రులకు కొన్ని నియమాలుఉండేవి. పురుషుడు స్త్రీవేషం ధరించి నటించరాదు. స్త్రీపాత్రధరించిన పురుషుని చూడడంపాపమన్నారు. నాటకంలో దంపతులవేషం ధరించే స్త్రీపురుషులు నిజంగా దంపతు లయ్యుండాలేకాని పరపురుషునకు భార్యగా స్త్రీనటింపగూడదు. నేటినాటకాలలో సినిమాలలో ఈనియమాన్ని ఉల్లంఘించటంవల్ల సంఘంలో బహిరంగంగానూ, చాటుమాటునా అవినీతి ప్రబలిపోతున్నది. ఇంతకు నేటి బాటకాలు కామాదిప్రకోపనమే పనిగా పెట్టు కొన్నవనీ, చిత్తశాంతినీ, ఆనందాన్నీ చేకూర్చే నాటకాలు మృగ్యమైనవనేదే సారాంశం.

అపార కరుణాసింధుం జ్ఞానదం శాంతరూపిణం
శ్రీ చంద్రశేఖర గురుం ప్రణమామి ముదావహం ॥

--- "జగద్గురు బోధలు" నుండి

#KanchiParamacharyaVaibhavam #కంచిపరమాచార్యవైభవం
3/24/18, 15:46 - Paramacharyulu: పన్నెండవవ శ్లోక ఉపోద్ఘాతం - రెండవ భాగం

సౌందర్యలహరిలో ఈ ప్రవాహం (లహరి) ఎక్కడ, ఎలా పుట్టి ఏ గతిన ప్రవహించిందో వివరించలేదు. తీపిగా ఉండే రసాలు మామిడిపండును ఆస్వాదించేటప్పుడు అది నూజివీడుదా, రాజమహేంద్రిదా అని అలోచిస్తామా ? ఆ తీపిని అనుభవించడంలోనే మనస్సు లగ్నమై ఉంటుంది. ఈ సౌందర్యలహరి అమృతంలో ఊరబెట్టిన రసాల పండు.

రసంకాని వస్తువు లేని పండు. అంతా తానే అయి నిండి ఉన్న అంబిక సౌందర్యాన్ని వర్ణించే శ్లోకమే అంబికగా సాక్షాత్కరిస్తోంది. స్తోత్రం చేయబడే వస్తువైన అంబిక, స్తోత్రమైన సౌందర్యలహరి స్తోత్రం చేసే మనమూ కూడా అంబికతోనే అయిపోతుంది. ఈ సౌందర్యలహరిని లోతుగా ధ్యానమగ్నులై మునిగిపోతూ శ్రద్ధగా చదివితే తాను చదివే సౌందర్యలహరితో బాటు తాను స్తోత్రం చేస్తున్న అంబికలో లయమయిపోతాడు. తనకు తానే అన్నీ తానే అయినస్థితిని పొందుతాడు. పరమపదాన్ని పొందుతాడు.

ఒక అందమైన వస్తువు మనకు కొంతసేపు ఆనందాన్ని కల్గిస్తుంది. అంబిక సౌందర్యం ఏకంగా అద్వైతానందాన్నే కలిగిస్తుందని చెప్పడం అతిశయోక్తి కాదా అని మీరనవచ్చు. అందమైన పద్మాన్ని చూశాం. పండు వెన్నెలలు కురిపించే పూర్ణచంద్రుని అవలోకిస్తున్నాం. నిశ్చయంగా మనకు ఆనందస్థితి కలుగుతోంది. కానీ ఇది ముక్తత్వ స్థితిలో మోక్ష స్థితిలో కలిగే ఆనందంతో పోల్చదగినదా అన్నది ప్రశ్న.

అసలు కవిత్వం వలన కలిగే అనుభూతి ఎటువంటిది ? మహా కవుల వర్ణనల నుండి, ప్రకృతి సౌందర్యాన్ని ఆస్వాదించగలవారు, ఆ అందంతో భగవంతుని చూడగలుగుతున్నారని, ఆ సమయంలో వారికి బ్రహ్మానంద స్ఫురణ కలిగి ఉంటుందనీ మనం అర్థం చేసుకోగలుగుతున్నాం. ప్రఖ్యాత ఆలంకారికులైన అభినవ గుప్తులు, జగన్నాథ పండితులు కవితా సౌందర్యం వలన జనించే అనుభూతి శాశ్వతమైనది కాకపోయినా, క్షణికమైన (తాత్కాలికమైన) బ్రహ్మానందాన్ని ప్రసాదించగలదని సిద్ధాంతీకరించారు. అభినవ గుప్తులు కాశ్మీర శైవమునకు చెందినవారు. కాశ్మీర శైవము అద్వైత సిద్ధాంతాలకు చేరువగా ఉంటుంది. వారు తమ సిద్ధాంతాన్ని కాశ్మీర శైవము ఆధారంగా సమర్థిస్తే, జగన్నాథ పండితులు తమ సిద్ధాంతం సమర్థించుకోవడానికి అద్వైతాన్నే ఆశ్రయించారు.

అదే ప్రకృతి, అవే కొండలు, గుట్టలు, సెలయేళ్ళు, జంతువులు, మనుష్యులు. మనం రోజూ చూస్తూ ఉన్నవే కదా ఇవన్నీ. మరి అదే ప్రకృతిని కవులు వర్ణించినపుడు మనకు ఆనందం ఎందుకు జనిస్తోంది. కవులు మన సౌందర్య పిపాసని ఉత్తేజ పరచగలిగారన్నమాట. దీనిని బట్టి మనకు కవిత్వం ఆస్వాదించడం వలన కలిగే ఆనందం సౌందర్యాస్వాదన వలన కలిగిన ఆనందమేనని అర్థమవుతున్నది కదా! అలంకార శాస్త్రంలో నిష్ణాతులైన పై పెద్దలు అటువంటి సౌందర్యానుభూతి ముక్తికి కారణభూతమవగలదని చెప్పారు.

పాశ్చాత్య కవులు కూడా ప్రకృతి సౌందర్యంలోని దైవత్వాన్ని గుర్తించారు. భగవంతునికి ముఖాముఖిగా ఎదురుపడటం వంటిది సౌందర్యానుభూతి అంటారు రవీంద్రనాథ టాగోరు వారు. టాగోరు గారి సమర్థన ఉన్న బ్రహ్మ సమాజం వారు కూడా *సత్యం శివం సుందరం* అన్న వాక్యము ప్రధానంగా తీసుకున్నారు. మనం సచ్చిదానందం అన్నపుడు (చిత్) జ్ఞాన ఆనందములు సత్యంతో విడదీయలేనంతగా కలిసిపోయి ఉన్నయని అర్థం. అలాగే మంగళము, సౌందర్యము కూడా సత్యంలో కలిసిపోయి ఉన్నాయి. శివం అంటే కల్యాణం, మంగళం, శుభం అన్న అర్థాలున్నాయి. ఇక సుందరమంటే అందమైనది అని అర్థం. ఈ రకంగా ఆనందమనేది పరబ్రహ్మ సిద్ధాంతంలో ముఖ్య భాగం. అటువంటి అందాన్ని సరియైన రీతిలో ఆస్వాదించగలిగితే అది బ్రహ్మానందానుభూతియే!

(సశేషం)

#KanchiParamacharyaVaibhavam #కంచిపరమాచార్యవైభవం
#ParamacharyaSoundaryaLahariBhashyam
3/25/18, 07:14 - Paramacharyulu: సంధ్యావందనం

ఒకసారి కంచి పరమాచార్యుల దర్శనానికి ఒక బ్రాహ్మణుడు వచ్చాడు. స్వామి వారిచ్చే తీర్థం తీసుకుని, అదే తీర్థం తనతో తెచ్చుకున్న చిన్న పాత్రలో కూడా కొద్దిగా ఇమ్మని అభ్యర్థించాడు. స్వామివారు దేనికని అడిగగా తన భార్యకు అస్వస్థతగా ఉన్నదని, తీర్థం ఇస్తే నయమవుతుందని విన్నవించాడు ఆ బ్రాహ్మణుడు.

స్వామివారు తీర్థం ఇవ్వడానికి నిరాకరించారు. నీవు గాయత్రి మంత్ర జపము చేస్తావా? అని అడిగారు. ఆ బ్రాహ్మణుడు నిత్యమూ చేస్తానన్నాడు. అయితే జపానంతరము నీవే తీర్థమివ్వచ్చు కదా! అన్నారు స్వామివారు. తమరిచ్చే తీర్థము, నాజప తీర్థము సమమవుతాయా స్వామి అన్నాడా బ్రాహ్మణుడు. ఎందుకు కాదు, నీవిచ్చినా నేనిచ్చినా 'గాయత్రిమంత్ర జప తీర్థమే' కదా, నీవే

యిచ్చిచూడు అని చెప్పి పంపారు ఆ బ్రాహ్మణుణ్ణి.

ఒక వారం తరువాత, ఆ బ్రాహ్మణుడు స్వస్థత చేకూరిన భార్యని తీసుకుని స్వామి వారి దర్శనానికి రాగా, స్వామివారు ఆ శక్తి 'గాయత్రి మంత్ర జప తీర్థానిదే' కాని, తనదికాదని చెప్పారు. గాయత్రి మంత్ర జప విశిష్టత అది.

అపార కరుణాసింధుం జ్ఞానదం శాంతరూపిణం
శ్రీ చంద్రశేఖర గురుం ప్రణమామి ముదావహం ॥

#KanchiParamacharyaVaibhavam #కంచిపరమాచార్యవైభవం
3/25/18, 11:48 - Paramacharyulu: <Media omitted>
3/25/18, 13:44 - Paramacharyulu: రామనామం – విభూతి

ఒక పెద్దమనిషి పరమాచార్య స్వామివారిని దర్శించుకోవడానికి వచ్చి తన గురించి చెప్పుకుని తను ఎక్కడనుండి వచ్చాడో చెప్పాడు.

"మీ ఊళ్ళో 'టుక్కిరి పాట్టి' అని ముసలావిడ ఉంది, నీకు తెలుసా" అని అడిగారు మహాస్వామివారు.

"ఆమె మాకు సంబంధీకురాలు" అని చెప్పాడు.

"రామ వినాయకుడు . . . ఇంకా ఉన్నాడా?"

“మా ఊరిలో ఉన్న దేవాలయలోని వినాయకుడు 'రామ వినాయకుడు' అని ప్రసిద్ధి” అని బదులిచ్చాడు. ఆ ముసలావిడ, వినాయకుని గురించి పరమాచార్య స్వామివారు చాలా విషయాలు అడిగారు. కాని ఆ భక్తుడు వాటికి సరైన జవాబులు చెప్పలేకపోయాడు. స్వామివారి ప్రశ్నలకు అతను కకావికలమైపోయాడు.

తరువాత మహాస్వామివారే ఆ కథనంతా ఇలా చెప్పారు.

"ఆ ఊళ్ళో శివాలయం కాని విష్ణ్వాలయం కాని లేవు. ఉన్నది ఒక్కటే ఆలయం అది వినాయకుని ఆలయం. రోజూ ఉదయం, సాయింత్రం ఆ ఊరి బ్రాహ్మణులు పొలిమేరులో ఉన్న వాగులో స్నానాదికాలు చేసుకుని సంధ్యావందనం చేసేవారు. తిరిగివస్తూ దార్లో ఉన్న వినాయకుని గుడికి వెళ్ళి అక్కడ కూర్చుని రామనామాన్ని జపం చేసేవారు. ఊళ్ళోనివారు కూడా వారితో కలిసి రామ సంకీర్తనం చేసేవారు. వారి నామజపం ఎతటిది అంటే ఒక మైలుదూరం నుండి కూడా వారి నామసంకీర్తనం వినపడేది అని నాతో చెప్పారు. వినాయకుని దేవాలయంలో రామనామం చేసేవారు కాబట్టి అది రామనామ వినాయక దేవాలయంగా ప్రసిద్ధికెక్కింది.

టుక్కిరి పాట్టి ఎవరంటే, ఏడేళ్ళ చిరుప్రాయంలో ఒక ఆడపిల్లకు వివాహం చేశారు. కాని విధివశాత్తు తొమ్మిదేళ్ళకే భర్త చనిపోవడంతో విధవరాలు అయ్యింది. ఆ ఊరివాళ్ళు ఆ అమ్మాయిని దురదృష్టవంతురాలుగా పరిగణించేవారు. దాంతో అమ్మాయిని 'టుక్కిరి (నష్టజాతకురాలు)' అని తన దురదృష్టాన్ని ఎత్తిచూపుతూ పిలిచేవారు.

ఆ అమ్మాయి పెద్దదైన తరువాత తన స్థితిని అర్థం చేసుకుంది. ఇప్పటిలాగా అప్పట్లో విప్లవాలు చేసి సంఘ సంస్కరణలు చేసే కాలం కాదు. ఊరి వాళ్ళని కాదని ఏమిచేసే పరిస్థితి కూడా కాదు. కాబట్టి పూర్వసువాసినులకు విధించిన పాతపద్ధతుల ప్రకారం ఆ అమ్మాయి జీవనం సాగించేది. రోజూ తెల్లవారుఝామున నాలుగు గంటలకే లేచి బయటకు వచ్చి ఇంటిముందు అలికి శుభ్రం చేసి, బయట ఒక దీపం వెలిగించి ఇంటిలోపలికి వెళ్ళిపోయేది. మరి ఆమె లోపల ఏం చేసేది? ఏమిలేదు కేవలం రామ నామ జపం. ప్రాణం నిలబెట్టుకోవడానికి ఏదో కాస్త వండుకుని తినేది. అప్పుడప్పుడు ఎవరో ఒకరు తినడానికి ఇచ్చి వెళ్ళేవారు.

తిరువయ్యారు త్యాగరాజు ఇరవైఒక్క సంవత్సరాల పాటు రామనామం జపించారు. ప్రతిరోజూ లక్షా ఎనిమిదివేల సార్లు రామనామాన్ని జపించేవారు. కాలగమనంలో టుక్కిరిగా ముద్ర పడిన ఆ అమ్మాయి 'టుక్కిరి పాట్టి (అవ్వ)' అయ్యింది. ఆమె జపం లెక్కపెట్టలేనంత అయ్యింది. ఆమె ఎంత జపంచేసిందో కేవలం రామచంద్ర ప్రభువుకు మాత్రమే తెలుసు.

ఒకరోజు ఆ ఊళ్ళో ఒక పిల్లవానికి విపరీతమైన కడుపు నొప్పి వచ్చింది. భరించలేనంత నొప్పితో అల్లాడిపోతున్నాడు. బాధతో ఏడుస్తున్నాడు. ఊర్లోని వైద్యుడు అల్లం, వాముతో కషాయం చేసి తాగించమన్నాడు. ఊర్లో ఎవరితోనూ ఇవి లేవు. ఇక గత్యంతరం లేక టుక్కిరి పాట్టి వద్ద ఉన్నయేమో వెళ్ళి అడగమన్నారు. ఆ చిన్నవాడు వెళ్ళి భయంతో, “కొంచం వాము కావాలి” అని అడిగాడు. పట్టి వాముతో పాటు మరికొన్ని అవసరమైన దినుసులు ఇచ్చి “ఎందుకు, ఏమైంది నీకు?” అని అడిగింది.

“కడుపు నొప్పి. . . చాలా ఎక్కువగా ఉంది . .”

“ఉండు... ఇప్పుడే వస్తాను”

పాట్టి కొంచం విభూతి తీసుకువచ్చి 'రామ నామం' చెప్తూ, ఆ పిల్లవాడి నుదుటున పెట్టింది.

వాడు ఇంటికి పరిగెత్తాడు. "నాకు కషాయం వద్దు"

“ఎందుకు?”

“కడుపునొప్పి పోయింది”

ఆ బాలుడి తల్లి విషయం అర్థంకాక తికమకపడి బాలుని నుదిటిపైనున్న విభూతిని చూసింది.

“పాట్టి పెట్టింది. వెంటనే నా కడుపునొప్పి పోయింది” అని చెప్పాడు.

మొత్తం ఊరంతా ఈ విషయం తెలిసిపోయింది. ‘టుక్కిరి పాట్టి’కి అంతటి సిద్ధి కలిగిందా?

అంటే ఆమె ఇప్పుడు టుక్కిరి కాదన్నమాట. రామనామ మహత్యాన్ని చాటిచెప్పడానికే విధి ఆమె తలరాతని అలా రాసింది. ఆ ఊరి వైద్యుడితో ఇక పనిలేదు. ఆయన స్థానాన్ని రామనామ పాట్టి తీసుకుంది. ఆవిడ వద్ద ఉన్న మందు కేవలం చిటికెడు విభూతి అంతే!!”

మహాస్వామి వారు వీటిని చెప్పగా విన్నవారు ధన్యులు.

--- మహాపెరియవళ్ – దరిశన అనుభవంగళ్

#KanchiParamacharyaVaibhavam #కంచిపరమాచార్యవైభవం
3/25/18, 16:35 - Paramacharyulu: పన్నెండవ శ్లోక ఉపోద్ఘాతం - మూడవ భాగం

అయితే మనలో ఎంతమందికి అందాన్ని సరియైన రీతిలో ఆస్వాదించడం తెలుసు? దగ్గర దగ్గర మనలో ఎవరికీ మన మనస్సును సౌందర్యానుభూతిలో లగ్నం చేయదం చేతకాదని చెప్పుకోవాలి. అందంలోని దైవత్వాన్ని గుర్తించదలిగిన పరిణతి మనలో చాలా మంది సాధించలేదు. అందాన్ని అభినందించి ఆస్వాదించగలిగి తద్వారా మనం పొందగలిగిన ఆనందం అత్యల్పం, క్షణికం. ప్రపంచ సంస్థితి నుండి విముక్తి మార్గంగా ఎంచుకొని సౌందర్యం పై దృష్టి సారించడానికి అధిక సంఖ్యాకులకు కుదరడం లేదు.

మనకు ఏది అందమైనదని తోస్తుంది. మనకు ఆనందాన్ని, సంతోషాన్నీ కల్గించే వస్తువు అందమైనదంటాం. ఏ వస్తువునైతే మళ్ళీ మళ్ళీ చూడాలనే ఇచ్ఛ జనిస్తుందో అది అందమైనది. అయితే దీనికి ఒక ముఖ్యమైన లక్షణం చేర్చాలి. ఆ వస్తువును చూడటం వల్ల జనించిన సంతోషం మన మనస్సును కలవర పరిచేలా ఉద్విగ్నతలకు లోను చేసేదిగా ఉండకూడదు. మనం ఆ వస్తువును చూసినప్పుడు అది మన మనస్సును ఒక పరిపూర్ణమైన పవిత్రమైన ఆనందంతో నింపివేయాలి. అప్పుడే ఆ వస్తువు అందమైనదని చెప్పవచ్చు. ఒక వ్యక్తి క్రూరమైన, అశ్లీలమైన దృశ్యాలను చూసి ఆనందించడంలో అభిరుచిని పెంచుకుంటే అటువంతి దృశ్యాలను అందమైనవి అనలేము. అందాన్ని అనుభూతిలోనికి తెచ్చుకునే వ్యక్తి మానసిక రుగ్మతలు లేనివాడై ఉండాలి.

ఇక్కడ ఇంకోక విషయాన్ని దృష్టిలో ఉంచుకోవాలి. అందంగా కనిపించే ఆ వస్తువు మనకు భయాన్నీ, శోకాన్నీ, క్రోధాన్నీ కలిగించరాదు. విశాలమైన పచ్చికబయలు లోతయిన లోయలో కనిపిస్తుందనుకోండి. అందమైన జలపాతం ప్రమాదకరమైన అగాథమైన లోయలో పడుతోందనుకోండి. వీటిని కొంత దూరం నుండి మాత్రమే చూసి ఆస్వాదించగలం. దగ్గరకు పోతే పడిపోతామనే భయంతో ఆ అందాన్ని ఆస్వాదించలేం. లేదూ! తళ తళ లాడుతూ ఎంతో అందమైన కృష్ణ మహా సర్పమున్నదనుకోండి, ఎంత అందమైనది అయినా వెళ్ళి చూసి ఆనందించే ధైర్యం మనకుండదు కదా. *జూ*లో పెట్టెల్లో బంధించబడి ఉన్న చిరుతలను, పులులను చూడగలమే గానీ అడవుల్లో తిరిగే మృగాల అందాలను ఆస్వాదించగలమా ? యోగి ఆ పాముతోనో, పులితోనో ఆడుకోవచ్చు. ఒక కవి (విలియం బేక్) వాటి సౌందర్యాన్ని అభివర్ణించవచ్చు. మనం మాత్రం ఆ వస్తువు మనలో భయాన్నీ, ప్రమాదశంకనూ కలిగించనంతవరకే ఆ వస్తువు అందాన్ని ఆస్వాదించగలం. కమలం, చంద్రుడు అటువంటివి. మనకు మల్లెపూవు వాసన ఎంతో అనందం కలిగించేదైనా మల్లిపొదలో పామును చూసినపుడు ఆ వాసన గురించి మరచి పారిపోతాం కదా !

ఇక మనుష్యుల సంగతి. ఒక మనిషి అందాన్ని అతనిలో ప్రేమాభిమానాలున్నప్పుడు మాత్రమే మెచ్చుకోగలం. ఒక అందమైన యజమాని సేవకుని ఎప్పుడూ తిడుతూ, అకారణంగా శిక్షిస్తూ ఉంటే ఈ సేవకునికి అతడు అందవికారంగానే కనిపిస్తాడు. కొండలు, మబ్బులు, వాగులు, తీగలు వలె కాక ప్రాణుల విషయంలో కూడా ఆ ప్రాణులు మనయెడ చూపే భావాన్ని పురస్కరించుకొని వాటి అందాన్ని మెచ్చుకోవడం జరుగుతుంది. మనుష్యులు మనపై ప్రేమ చూపకపోయినా మన ఎడల ద్వేషభావం చుపించనంత వరకూ వారి అందాన్ని హర్షించగలుగుతాం. అదే వారి స్ఫురద్రూపానికి మంచితనం, ప్రేమ కూడా తోడయితే ఇష్టపడతాం.

(సశేషం)

#KanchiParamacharyaVaibhavam #కంచిపరమాచార్యవైభవం
#ParamacharyaSoundaryaLahariBhashyam
3/25/18, 20:26 - Paramacharyulu: ధర్మాన్ని ఎందుకని ఆచరించాలి ?

వేద వేద్యే పరే పుంసీ జాతే దశరథాత్మజే,
వేదః ప్రాచేతసా దాసీత్ సాక్షా ద్రామాయణాత్మనా.

వేదవేద్యే-వేదంచేత తెలిసికోదగినవాడెవడూ? పరేపుంసి-పరమపురుషుడు శ్రీమన్నారాయణుడు. వేదవేద్యుడైన నారాయణుడు దశరథాత్మజుడైన వెంటనే వేదాలు వాల్మీకి శిశువుగా, రామాయణంగా అవతరించినవి. ఆ రామాయణం ఏమి చెపుతూంది? వేదాలు

ధర్మమును చెపుతై. ఆలాటి ధర్మస్వరూపుడే రాముడు అని రాముని తల్లి కౌసల్య, అడవులకు పోయే రామచంద్రుడితో చెప్పిన మాటలవల్ల రాముడు 'ధర్మస్వరూపుడు'. అని గోచరిస్తుంది.

పొరుగూరు పోయే బిడ్డకు తల్లి తినుబండారాలు కట్టి యివ్వడం వాడుక. రామునికి కౌసల్య యిచ్చిన తినుబండం ఏమిటి? ఆమె ఇచ్చిన ఆశీర్వాదమే.

'యం పాలయసి ధర్మం త్వం ధృత్యా చ నియమేన చ
స వై రాఘవశార్దూల ధర్మస్త్వా మభిరక్షతు'

రాఘవా! నీవు ఏ ధర్మాన్ని ధైర్యంతో నియమంతో ఆచరిస్తావో, ఆ ధర్మమే నిన్ను కాపాడేది'

ధృతి అంటే ధైర్యం. ఒకడు పరిహసిస్తాడని లెక్కచేయక ఎవరేమన్నా ధైర్యంతో ఉండడమే ధృతి. 'ఎవరేమన్నా సరే' అని కొందరు కొన్నాళ్ళు ధైర్యంతో ఉంటారు. పిదప పిదప మెల మెలగా దాన్ని వదిలివేస్తారు. దానికి ఒక కట్టుబాటో నియమమో ఉండదు. దానివల్ల ప్రయోజనం శూన్యం.

రాఘవుడు ధర్మాన్ని కట్టుబాటుతో నియమంతో ఒక పూటయినా వదలక కాపాడుకొంటూ వచ్చాడు. మనశ్చలనం లేక ధర్మం పాటిస్తూవచ్చాడు. ఎవరు నవ్వేది, మరి ఎవరడ్డు పెట్టేది మన ధర్మాన్ని మనం ఇందువల్ల వదలరాదు. ఆ ధర్మస్వరూపి ధర్మరక్షణ చేశాడు. అందుచేతనే అడవికి పోతూవున్నపుడు కౌసల్య కుమారుడికి 'ధర్మంగా వర్తించుకో' అని మాత్రమే చెప్పక, ఏ ధర్మాన్ని నీవు ధైర్యంతో నియమంతో కాపాడుకుంటూ వచ్చావో, ఆధర్మమే నిన్ను కాపాడుతుందని ఆ ఆపదల నన్నిటినీ నివృత్తి చేసే ఆశీర్వాదం చేస్తూంది.

ఒక కుక్క దొంగలబారినుండి మనలను కాపాడవలెనంటే దానిని మనం చక్కగా కాపాడాలి. మనం దేనిని కాపాడతామో అది మనలను కాపాడుతుంది- ''నీవు ధర్మాన్ని రక్షించుకొంటూ వచ్చావు, ఇకముందు గూడా రక్షించుకొంటూ వస్తావు. అదే. ఆధర్మమే నిన్ను రక్షించుకొంటుంది' అని ఇతరులు చెప్పటం అటుంచి సొంత తల్లి 'తన బిడ్డ అడవులపాలయిపోతున్నాడే' అని దుఃఖించక ఇట్లా చెబుతూంది. కూడా పుట్టిన సోదరుడే 'అన్నా! ధర్మం. ధర్మం' అంటూ ధర్మానికి కట్టుబడి ఉండడముచేతనే నీకు ఇంత శ్రమ ఇంత కష్టమూ సంభవిస్తూంది. దాన్ని వదలివేశావా నీకీబాధ ఉండదు' అని ఎన్నోసారులు చెప్పాడు. 'ఎవరు నవ్వినా, నాయనా! రాఘవా! ఏధర్మాన్ని నీవుధైర్యంతో నియమంతో వదలక అనుష్ఠిస్తున్నావో ఆ ధర్మమే నిన్ను కాపాడుతుంది.' అని తల్లి ఆశీర్వదిస్తున్నది.

'ధర్మం తలకాస్తుంది' అని ఒకసామెత ఉంది. ఆడవిలో రాఘవుని తల కాచింది ధర్మమే. రావణునికి పది తలలున్నప్పటికి తాను చేసిన ఆధర్మం ఒక తలనయినా కాచలేక పోయింది.

'వేదోఽ ఖిలో ధర్మమూలమ్' వేదమే ధర్మమును చెపుతూంది. వేదాలలో వర్ణింపబడిన పరమపురుషుడు దశరథునకు కొడుకుగా అవతరించా డనీ, 'వేదవేద్యే పరే పుంసి' అనే శ్లోకం చెపుతూంది. కౌసల్యాదేవి వాక్యంవల్ల 'ధర్మ స్వరూపుడే రాముడు' అని తెలియవస్తూంది. ఇంకో చోట 'రామో విగ్రహవాన్ ధర్మః' అని ఉన్నది. ధర్మం అనేది మనోభావం. అది ఒక రూపం ధరిస్తే ఎలావుంటుంది అని అంటే రాముడై కూచుంటుంది అని అర్థం. ఆపత్కాలంలో కూడా ఒక అడుగయినా వెనుకాడకుండా ధైర్యంతో నియమంతో ఉండే రూపమే ధర్మం. ఆ ధర్మ స్వరూపమే రామావతారం. వేదాలవలన తెలియదగిన వస్తువే అందరకూ కంటికి కనబడే వస్తువుగా అవతరించింది. అపుడే వేదం సైతం రామాయణంగా అవతరించింది.

సాక్షాద్రామ చంద్రమూర్తినే లక్ష్యంగా పెట్టుకొన్న రామమంత్ర జపపరాయణులకు కామం, మోహం మొదలయిన మకిల యేదీ మనస్సు కంటదు. అట్టివారు ధర్మమార్గం వదలిపోరు.

'వేదవేద్యే పరే పుంసి జాతే దశరథాత్మజే
వేదః ప్రాచేతసా దాసీ త్సాక్షాద్రామాయణాత్మనా'

వేదాలవల్ల తెలుసుకోదగిన పరమపురుషుడు దశరథునికి కొడుకుగా అవతరించినందున రామాయణరూపం ఎత్తిన వేదాలయొక్క సారం రామనామంలో ఇమిడి ఉంది. ఆ రామనామం చిత్తమాలిన్యం పోగొట్టి వేరొకదానిమీద ఆశ కలుగనీయక సదా ఆనందంగా ఉండేటటుల చేస్తుంది.

--- “జగద్గురుబోధలు”, http://jagadguru-vaibhavam.blogspot.in నుండి

#KanchiParamacharyaVaibhavam #కంచిపరమాచార్యవైభవం
3/26/18, 06:49 - Paramacharyulu: అంబికాతత్త్వము

అమెరికాదేశంలో ఫిలడెల్ఫియా అనే నగరంలో పెన్సిల్వేనియా యూనివర్సిటీ అనే సర్వకళాశాల ఒకటి ఉంది. అదే నగరంలో 'ఫిలడెల్ఫియా మ్యూజియం ఆఫ్ ఆర్ట్స్' అనే ప్రదర్శనశాలకూడా ఒకటి ఉంది. దానిలో భగవత్పాదులు వ్రాసిన సౌందర్యలహరిలోని ఒక్కొక్క శ్లోకాన్ని అనుసరించి గీయబడిన చిత్రాలు ఉన్నాయట. అవి సర్వాంగ సుందరాలట! అచటి ప్రధాన సంస్కృతాచార్యులు మూడు చిత్రాలను ఫోటోతీసి మద్రాసు విశ్వవిద్యాలయం వారికి పంపి, ఆ చిత్రాల వివరణ ఏమిటని ప్రశ్నిస్తూ ఒక ఉత్తరం వ్రాశారట. ఆచిత్రాలలో ఒకటి ''మనస్త్వం వ్యోమత్వం'' అన్న శ్లోకానికి గీచిన చిత్రం. దానికి ముందున్న శ్లోకం ''శరీరం త్వం శంభోః శశిమిహిరవక్షోరుహయుగం...''

పార్వతీ పరమేశ్వరుల సంబంధం - శరీర శరీరభావ సంబంధం; శేష శేషిభావసంబంధం. శరీరంలో ప్రాణం ఉంది. ఇవి రెండున్నూ ఒక దానిని విడచి మరొకటి ఉండటానికి వీలులేదు. 'శరీరం త్వం శంభోః' శంభునికి శరీరంగా అంబ ఉన్నదని ఆచార్యులంటున్నారు.

మన కండ్లకు గోచరించే ఈ వ్యస్తప్రపంచం నిజానికి అంబికాస్వరూపమే. అఖండంగా సర్వత్ర వ్యాపించి సర్వ ప్రపంచాకృతిగ వెలుగుతూఉన్న ఆ పరదేవత యొక్క స్తనద్వయమే సూర్యచంద్రులు. సూర్యరశ్మి, వెన్నెల లేకపోతే అసలు జగత్తు అనేది ఉండదు. ప్రాణికోటి సమస్తమూ ఆ జగద్ధాత్రికి, శిశుప్రాయం అవటంచేత, తల్లి తన బిడ్డలకు స్తన్యమిచ్చే విధంగా సూర్యచంద్రులనే స్తనద్వయంతో అమృతధారలు వర్షిస్తుంది.

మనస్త్వం వ్యోమ త్వం మరు దసి మరుత్సారథి రసి
త్వ మాప స్త్వం భూమి స్త్వయి పరిణతాయాం నహిపరమ్
త్వ మేవ స్వాత్మానం పరిణమయితుం విశ్వవపుషా
చిదానందాకారం శివయువతిభావేన బిభృషే||

''అమ్మా! పంచభూతముల రూపు నీవై యున్నావు. వాని కతీతమైన మనస్సున్నూ నీవే. ఈ ఆకాశం, ఈ గాలి, ఈ భూమి, ఈ జలం, ఈ తేజస్సూ, ఈ మనస్సూ ఇవన్నీ నీవు కాకపోతే మరెవరు? 'త్వయి పరిణతాయాం నహింపరమ్' ''అన్ని స్వరూపాలున్నూ నీయొక్క పరిణామంగానే ఉన్నాయి. అంతేకాదు. మావద్ద ఉండే ఈ జ్ఞానలేశమూ, ఆనందమూ నీచిదానందచ్ఛాయలే నీవు శరీరము; శివుడు శరీరి. శివ యువతిభావం మీ యిద్దరిలోనూ ప్రస్ఫుటమౌతోంది'' అని ఆచార్యులు వర్ణిస్తారు.

ఫిలడెల్ఫియా చిత్రాలను చూచినప్పు డీశ్లోకం గుర్తు వచ్చింది.

లీయే పురహరజాయే మాయే తవ తరుణపల్లవచ్ఛాయే,
చరణే చంద్రాభరణే కాంచీశరణే నతార్తిసంహారణే||

- మూకపఞ్చశతి.

''అమ్మా! నీపాదాలు లేజిగుళ్ళవలె విలసిల్లుతున్నాయి. చంద్రావతంసవై కాంచీనగరాన్ని నీవాశ్రయించి, నీపాదాల నాశ్రయించినవారి దుఃఖాన్ని పోగొట్టుతున్నావు. నీ చరణాలపై నాచిత్తం హత్తుకొనిపోయింది. దానితోబాటు నా ఆత్మకూడా ఐక్యం అవుతూఉంది'' అని మూక కవి అంబికను స్తవంచేశాడు. ఇందు ''మాయే'' అనే పదం ఉంది. మాయ అంటే ఏమిటి? పురాణాలు మాయాశబ్దానికి అర్థం వివరిస్తూ 'యామా' ఏది లేదో అదే మాయ అని అన్నాయి. ఐతే లేని వస్తువుకు నామకరణ మెందుకు? ఉన్నదా లేదా అన్న విచికిత్స - ఒక వస్తువు ఉన్నట్లు తోస్తేనే కదా కలుగుతుంది? మాయావస్తువు ఉన్నట్లు కనిపిస్తుంది. పరిశీలన ప్రారంభిస్తే లేదని తేలుతుంది. అదే మాయ, మా శబ్దానికి లక్ష్మి అనికూడ ఒక అర్థం. 'విద్యుచ్చపలాలక్ష్మీః' మాయా గుణం లక్ష్మికి సంపూర్ణంగా అన్వయిస్తుంది. లక్ష్మి మన వద్ద ఉన్నట్లే ఉంటుంది. కాని ఉండదు. గోచరిస్తూ ఉంటుంది. తీరా చూస్తే మాయమౌతూ ఉంటుంది.

లేని వస్తువు గోచరించడం దేనికి? పైగా చూడబోతే మాయ మవటమెందుకు? ఐతే ఇందులోనూ ఒక ఆనందం ఉందనక తప్పదు. ఇదీ ఒక ఉత్సాహమూ ఉల్లాసమూను. అంబిక ఆనందరూపిణి; ఆమె సూక్ష్మాతి సూక్ష్మంగా ఉంటుంది. సాధకుని ఆనందానికై తానొక రూపుదాల్చి, అనుగ్రహించడంకోసం అవతరిస్తూ ఉంటుంది. మన అల్పమైన మనస్సులకు ఒక ఆధారం కనిపిస్తేకాని ఆనందం కలగడం లేదుకదా!

తల్లి వంటయింట్లో యేదో చక్క బెట్టుకొంటూ ఉంటుంది. వసారాలో బిడ్డ ఆడుకొంటూ ఉంటుంది. కాని బిడ్డకు తల్లి జ్ఞాపకం వచ్చినంతనే బొమ్మలను ఒక ప్రక్కకు నెట్టి ఏడుపు ప్రారంభిస్తుంది. లోపలనుండి తల్లివచ్చి సముదాయించేవరకు రోదనానికి ఉపసంహారం ఉండదు. అట్లే దర్శనానికి తహతహలాడే భక్తునికోసం నిరాకార అయిన అంబిక సాకార ఔతోంది. 'ఘృతకాఠిన్యవత్' - ద్రవరూపంలో ఉన్నప్పుడు నేతికి రంగులేదు. కాని చలికాలంలో నేయి పేరినప్పుడు లేదా గాలి తగిలినప్పుడు గడ్డకట్టి తెల్లనిరంగు ఏర్పడుతుంది. అట్లే భక్తకోటి హృదయసీమలో ప్రేమశైత్యం అధికమైతే, అఖండాకార నిరాకార పరమాత్మ ఘనీభూతమై ఒక రూపునెత్తి ఆవిర్భవిస్తూ ఉన్నది. ఆమెయే త్రిమూర్తి స్వరూపిణియూ అయిఉన్నది.

'సృష్టికర్త్రీ బ్రహ్మరూపా గోప్త్రీ గోవిందరూపిణీ,
సంహారిణీ రుద్రరూపా తిరోధానకరీశ్వరీ,
సదాశివానుగ్రహదా పంచకృత్యపరాయణా||'

అని లలితాసహస్రనామములు చెప్పుతున్నాయి. మూడు మూర్తులనియు ఐదు మూర్తులనియు ఒక లెక్క లక్ష్మీ సరస్వతుల అష్టోత్తర శతనామావళులలో బ్రహ్మ విష్ణు శివాత్మికా అన్న సంబోధన ఒకేతీరుగా కానవస్తుంది. కార్యాల నుద్దేశించి ఆకారాలున్నా స్వరూపం ఒక్కటే. అనంతపద్మనాభస్వామికూడ త్రిమూర్తిస్వరూపమే. తిరువనంతపురంలో ఆయన శేషశయ్యపై పండుకొని ఉంటాడు. ఆయన నాభికమలంలో బ్రహ్మ శిరఃపార్శ్వాన లింగాకృతియై శివుడు కానవస్తారు. అశ్వత్థవృక్షం కూడా ఇదేవిధంగా బ్రహ్మ విష్ణు శివాత్మకమని ఈ క్రింది శ్లోకం చాటుతూ ఉంది.

మూలతో బ్రహ్మరూపాయ మధ్యతో విష్ణురూపిణే,
అగ్రతః శివరూపాయ వృక్షరాజాయతే నమః||

'నీవు నిరాకారవైనా నన్ను అనుగ్రహించే నిమిత్తం సాకార మవుతున్నావు; నీవు అనంతవు; నిరవధికవు! అని ఆచార్యులవారు అంబికను

స్తవం చేస్తున్నారు.

అంతములేనివాడనంతుడు.సంఖ్య ఒకటి, రెండు, మూడు అని పెరుగుతూపోతుంది. మరి అనంతానికి చిహ్నం ఏది? ఇన్ఫినిటీని (పారార్థ్యాన్ని) ఏ సంఖ్యతో చూపాలి?

భాస్కరాచార్యులవారు బీజగణితాన్ని వ్రాశారు. దానిలో మంగళశ్లోకం వ్రాస్తూ - 'అనంతమైన పరమాత్మచాలు నష్టమౌతున్నాయి. సృష్టికాలంలో ప్రపంచాలు పుట్టుకొస్తున్నవి. కాని ఆయనలో మాత్రం అణుమాత్రమూ భేదంలేదు. సమస్తమూ ఆయనలోనుండి నిర్గమించి ఆయనలోకి లయం ఔతున్నవి. అందులో అల్పం అధికం అన్నది లేదు. ఆయనే అనంతుడు. అట్టి అఖండానంద పరమాత్మకు నాప్రణతులు.'అని పరమాత్మను ప్రార్థన చేశారు.

దశోపనిషత్తులలో బృహదారణ్యకం ఒకటి. దానిపేరే దాని విస్తృతిని తెలుపుతుంది. ఆచార్యులు దీనికి భాష్యం కూడా విస్తారంగా వ్రాస్తూ సూక్ష్మంగా వ్రాస్తున్నానని సెలవిచ్చారు. తత్త్వంలో బృహదారణ్యం నిజంగా అరణ్యమే. అందులో శాంతిమంత్రం ఇలా ఉంది.

ఓం పూర్ణ మదః పూర్ణ మిదం పూర్ణా త్పూర్ణ ముదచ్యతే,
పూర్ణస్య పూర్ణ మాదాయ పూర్ణ మేవావశిష్యతే||

'అది పూర్ణము, ఇదీ పూర్ణమే. ఈ ప్రపంచము నిరవధికం. ఈ నిరవధిక ప్రపంచం పరమాత్మలో ఉంది. ఆ పూర్ణంలో ఈ పూర్ణం కలిపినా తీసివేసినా మిగిలేది పూర్ణమే.

'పరమాత్మ ఏకస్వరూపమూ అద్వితీయమూ అయిఉంది. లేనిదేదో అదే మాయ. ప్రకృతి మాయ. ప్రకృతిని తనలో కల పరమేశ్వరుడున్నూ మాయమే. అదీ లేనిదే, ఇతడూ లేనివాడే. పూజ్యమునకు పూజ్యముచేర్చిన మిగిలేది కూడ పూజ్యమేకదా! అందుచే ఎక్కువాలేదు. తక్కువా లేదు. అని ఆచార్యులన్నారు. పరమేశ్వరునే 'మాయ', 'లేనివాడు' అంటే మనల్ని పరిహసించరా? అని ఎవరో శంకిస్తే - పరమేశ్వరునే పరిహాసంచేస్తే మనలనూ చేయనీ - అని ఆచార్యులు బదులు చెప్పారట.

రజ్జు సర్పన్యాయం మనమందరమూ ఎరిగినదే..రజ్జువులో సర్పాన్ని చూస్తే రజ్జువు ఏ విధంగానూ అధికంకాదు. మిథ్యాసర్పం రజ్జువుగా మారితే దానికి కలిగే కొరత కూడ ఏమీలేదు.

సీతాదేవి ఎట్లున్నది? అని ఎవరో అడిగారట. దేవ మాయవలె ఉన్నదని సమాధానం. లేనివస్తువు ఉన్నట్లు కనబడితే ఎలా ఉంటుందో అలా ఉన్నదన్నమాట. చిత్రంలో దృశ్యాన్ని గీస్తారు. అది దృశ్యాన్ని స్ఫురింపజేస్తుంది. కాని దృశ్యంకాదు. సీతాదేవి విషయంకూడా అంతే.

అన్ని సంఖ్యలకు సంకేతాలున్నాయి. అనంతానికి సంకేతం ఏమిటి? భాస్కరాచార్యులు ఒకటిని లవంగాను పూజ్యాన్ని హారంగాను గ్రహించి ఒక భిన్నం చూపితే అది అనంతానికి సంకేతం అవుతుందన్నారు.(1/0). రెండును రెండుచే భాగిస్తే విభక్తం ఒకటవుతుంది. 2 ను విభాజ్యంగా తీసుకొని 1, ½, ¼ సంఖ్యలను విభాజకాలుగా తీసికొని భాగిస్తే 2, 4, 8 సంఖ్యలు విభక్తాలవుతాయి. ఇట్లే 16 ను 1/8 చే భాగిస్తే విభక్తం 128 అవుతుంది. విభాజకం పెరిగేకొద్దీ విభక్తం తగ్గుతుంది. విభాజకం తగ్గేకొద్దీ విభక్తం పెరుగుతుంది. విభాజకము అత్యంత కనిష్టమై అణుపరిమాణమై సూక్ష్మాతి సూక్ష్మమైతే విభక్తం 'అనంతమౌతుంది.' సున్న అతి సూక్ష్మసంఖ్య. 'ఖ' అనగా ఆకాశము, పూజ్యము. హారమనగా భాగించుట. సున్నను విభాజకంగా తీసుకొని ఎంతటి పెద్ద సంఖ్యనైనాసరే భాగిస్తే వచ్చే విభక్తం ఒకటే అవుతుంది. ఖహారమంటే ఇదే.

ఏ సంఖ్యనైనా భాగించేవేళ మనం కనుగొన్న విభక్తం సరైనదోకాదో తెలుసుకొనడానికి విభాజకాన్ని విభక్తంతో గుణించి విభాజ్యం వస్తున్నదా లేదా అని పరిశీలిస్తాం. ఈ ఖహారంలో - అంతే ఏ సంఖ్యనైనా సున్నతో భాగించే దానిలో విభాజ్యం ప్రపంచతుల్యం అవుతుంది. నానా నామ రూపాలతో అనంతంగా ఉన్న ఈ విశ్వమే విభాజ్యం సున్న లేక పూజ్యం, గణితపరిభాషలో అనిర్వచనీయం అనగా దాదాపు ఏమీలేని 'మాయచే' భాగిస్తే వచ్చే ఫలము లేక జవాబు-అనంతము! 'సత్యం జ్ఞానమనంతం బ్రహ్మ' ప్రపంచాన్ని సృష్టించడానికి బ్రహ్మ (బ్రహ్మ విభక్తము) తన్ను మాయతో (మాయ విభాజకము) గుణించుకొంటూ ఉంది. సున్నచే ఏ సంఖ్యను భాగించినా వచ్చే విభక్తం ఒకటే. ఒకటి, రెండు, మూడు మొదలైనవి భేదసంఖ్యలు. అని ప్రపంచంయొక్క నానాత్వ చిహ్నాలు. ఏకమే అనేకం అయింది. ఆ అనేకం కావడం మాయాసంపర్కంచేత. అనంతుడైన పరమాత్మ మాయా సంపర్కంతో తన్ను గుణించుకొంటూ ఒకటి రెండు మూడు అని అసంఖ్యాక నామ రూపాదులతో ఒప్పారుతున్నాడు. ఐతే ఏ విభక్తాన్నైనా సున్నతో పెంచితే సున్నయే వస్తుంది గనుక అనంతాన్ని మాయతో గుణిస్తే వచ్చేదీ మాయయే. అనంతుడు గుణ్యము; మాయ గుణకము; ప్రపంచము లబ్ధము. ఈ హారంలో విభాజ్యం ప్రపంచయొక్క నానాత్వమే. అనగా నానాత్వంలోని ఏకత్వమే, విభక్తం అంటే బ్రహ్మ (అనగా సత్యము) అఖండమూ, అనంతమూ అయిఉంది. శాంతి మంత్రంలో 'పూర్ణం అదః' అంటే విభక్తం; అద్వితీయమైన అనంతం. 'పూర్ణం ఇదం' అంటే విభాజ్యము; నానారూపాత్మకమైన అనంతం అద్వైతానంతాన్ని పూజ్యంచే గుణిస్తే ద్వైతానంతం లభిస్తుంది. ద్వైతానంతాన్ని ఖహారంచేసి, సున్న లేక మాయచే భాగించి దాని నానాత్వాన్ని తొలగిస్తే అద్వైతానంతం వస్తుంది. అనంతానికి రూపంలేదు. అది అద్వితీయం. మాయ దానిని గుణించి నానావిధ రూపాలను ధరిస్తూఉంది. ఉన్నది ఒక్కటి, దానికే విలువ, నానాత్వం మాయాకార్యం కనుక, మాయ అంటే ఏమీలేనిది కనుక ఈ నానాత్వంకూడా ఏమీ లేనిదే; అంటే విలువ లేనిది, అందుచే మాయ గుణించినా భాగించినా ఆ బ్రహ్మలో ఏవిధమైనా మార్పూ ఉండదు. ప్రపంచయొక్క సృష్టిప్రళయాలు ఆ అనంతునిలో ఏవిధమైన మార్పూ కలిగించలేకున్నాయి.

ఆ జగజ్జనని, శివయువతి, పురహరజాయ, నానా నామరూప భేదాలతో ఏకాన్ని అనేకం చేస్తూ నిరాకారబ్రహ్మకు ఆకారాలు అంటగట్టుతూ, మన ఆనందానికి, మనలను అనుగ్రహించడానికి చిదానందాకారంలో విశ్వశరీరయై విలసిల్లుతూ ఉంది. ఆ మాయాశక్తియొక్క అనుగ్రహం లేనిదే, అనేకత్వం నుండి ఏకత్వానికి చేరలేము. అద్వైతసిద్ధిని అందుకోవాలంటే ఆ ఆదిశక్తి అనుగ్రహం అవసరం.

అపార కరుణాసింధుం జ్ఞానదం శాంతరూపిణం
శ్రీ చంద్రశేఖర గురుం ప్రణమామి ముదావహం ॥

--- “జగద్గురు బోధలు” నుండి

#KanchiParamacharyaVaibhavam #కంచిపరమాచార్యవైభవం
3/26/18, 16:11 - Paramacharyulu: పన్నెండవ శ్లోక ఉపోద్ఘాతం - నాలుగవ భాగం

అందంగా లేకపోయినా మనపై అపారమైన ప్రేమను, ఆదరాన్ని వ్యక్తపరిచే వారి వంక అలా చూస్తూ ఉండిపోవాలనిపిస్తుంది. దీనిని బట్టి ప్రేమ అందంగా మారుతున్న విషయం అవగతమవుతుంది. ఒక తల్లి నల్లగా ఎత్తుపళ్ళతో చూడటానికి వికారంగా ఉండవచ్చు. కానీ అందమైన పక్కింటి ఆమె మచ్చిక చేసుకోవడానికి ప్రయత్నించినా ఆమె బిడ్డ ఆమెనే హత్తుకుపోతుంది. పక్కింటి ఆమె అందం తల్లి నుండి ఆమెను ఆకర్షించడానికి సమర్థం కాదు.

దీనికి కారణం ఏమయి ఉండాలి. ఆ బిడ్డ తన తల్లికి తనపై గల ప్రేమను గుర్తించింది. అష్టావక్రుడు ఎనిమిది వంకరలతో నడుస్తుంటే నవ్వు జనించేట్లుంటాడు. అయితే మునులు పండితులందరూ ఆయన చుట్టూ మూగుతూ వుంటారు. కొంతమంది మహాపురుషులు గడ్డాలు, మీసాలతో శరీర ధ్యాసే లేకుండ అందవికారంగా ఉండవచ్చు. కానీ ప్రజలందరికీ వారి సన్నిధిలో అలానే ఉండిపోవాలనిపిస్తుంది. వారిని పదే పదే చూడాలనిపించడమే అందమనే నిర్వచనాన్ననుసరించి వీరిదే మరి నిజమైన అందం. వారి అంతరంగంలో కరుణా భావం వారి శరీరమంతా భాసిస్తు వారిని స్ఫురద్రూపులుగా చేస్తోంది.

మొత్తం మీద చూస్తే ప్రేమ లేక కరుణ ఒకరి అందాన్ని ఇనుమడింప చేస్తుంది. అటువంటి ప్రేమ ఒకస్థాయిని దాటినప్పుడు ఆ ఆకృతి అందం యొక్క ప్రాధాన్యత నష్టమై ప్రేమే అందంగా పరిణమిస్తుంది.
ఒక వస్తువును మనం మరల మరల చూస్తున్నామంటే దాని మూలాన మనకు కలిగే ఆనందమే కారణం. ఆనందం కలిగించే వాటిలో ప్రధానమైనది ప్రేమ. ప్రేమ వలన కలిగే ఆనందానికి సమమైనది ఏదీ లేదు. కాబట్టి ఆనందాన్ని ప్రసాదించే ప్రేమే అందం అవుతుంది. అందమైన వారిని వారిలోనున్న ప్రేమించే ప్రకృతి మనచే తిరిగి తిరిగి చూసేలా చేస్తుంది.

అంబిక మూర్తీభవించిన సౌందర్యం. మూర్తీభవించిన ప్రేమ. అందమే తానయిన ప్రేమ. పంచదార అన్ని వంటకాలను తీపిని ఇస్తుంది. అలగే ఎక్కడెక్కడ అందమైన వస్తువులను చూస్తామో ఆ వస్తువులు ఆ అందాన్ని పొందింది అంబిక నుండే! ఆమె అందములన్నిటికీ మాతృక. పరబ్రహ్మ శక్తి అయిన ఆమె ఇక్కడ మొత్తమైన సంపూర్ణమైన అందం. అంబిక సౌందర్య ప్రవాహం. ఆ ప్రవాహము నుండి చిందిన బిందువులంటిన వస్తువులు ఎంతో సౌందర్యమైనవిగా భాసిస్తున్నాయి. అంబిక యొక్క అంతరంగికమైన కరుణ సౌందర్య ప్రవాహంగా రూపుదిద్దుకొంది.

ప్రేమకు రూపం లేదు. బయట చూపులకు అనాహ్లాదంగా కనిపించేవారు ఎంతో ఆపేక్ష కలిగి ఉండటం లోకంలో మనం చూస్తాము. అందమైన వారికి ఆపేక్షే లేకపోయి వుండవచ్చు. అయితే భౌతికమైన లక్షణాల మీద విజయం సాధించే ప్రేమ ఒక వ్యక్తిలో అందంగా మెరిసిపోతుంది. అంటే రూపంలేని ప్రేమలో ఎలాగోలా ఆ వ్యక్తిపై రూపిస్తుందన్నమాట. అంబికపై అటువంటి ప్రేమ ప్రతిస్పందించడం కాదు – ఆమె మొత్తంగా ప్రేమైకమూర్తి. రూపం లేని ప్రేమ ఆమె అందంగా అవుతుందన్నమాట. సంపూర్ణమైన ఆమె ప్రేమ సంపూర్ణమైన అందంగా మారుతుంది.

రూపంలేని పరబ్రహ్మ శక్తి తనను గుర్తించలేని పిల్లల (మానవాళి) కోసం అంబికగా రూపం ధరించింది కదా! కరుణ చేత ప్రేమ వలన ధరించిన రూపం మరి మూర్తీభవించిన ప్రేమే కదా! అంబిక ఇంత అందమైన రూపమును ధరించడానికి కారణం ఏమిటి ? వివేకం లేని పరిణితి చెందనివారితో సహా తన పిల్లలందరూ అల్పమైన అందాల జోలికి పోకుండా తనవైపు తిరుగుతారని కాదూ!!

(సశేషం)

#KanchiParamacharyaVaibhavam #కంచిపరమాచార్యవైభవం
#ParamacharyaSoundaryaLahariBhashyam
3/27/18, 09:32 - Paramacharyulu: మహిమాన్వితములైన మనప్రాచీన శాస్త్రములు

మనపెద్దలు చాలా శాస్త్రగ్రంథాలు వ్రాశారు. వానిలో ఎన్నో గ్రంథాలు మరుగైపోయినై. ప్రస్తుతం అందుబాటులోఉన్న గ్రంథాలకుకూడ సరిగా అర్థం తెలియదు. కొంత తెలిసినవారున్నారు. వారైనా కొద్దిమంది.

వరాహమిహిరుడనే ఆయన దాదాపు 1500 సంవత్సరాలకు వెనుక ఉండేవారు. ఆయన అనేక గ్రంథాలు వ్రాశారు. ఆయన విక్రమాదిత్యుని కాలంలో ఉన్నట్లు ప్రసిద్ధి.

విక్రమాదిత్యుని సభలో నవరత్నాలుండేవారని ఒక ప్రతీతి. నవరత్నాలనూ పేర్కొనే ఈ క్రింది శ్లోకం చాలా కాలంనుండి వాడుకలో ఉంది.

''ధన్వంతరి క్షపణకామరసింహశంకు
వేతాలభట్ట ఘటకర్పర కాళిదాసాః|
ఖ్యాతో వరాహమిహిరో నృపతే స్సభాయాం

రత్నాని వై వరరుచి ర్నవ విక్రమస్య||

'ధన్వంతరి మొదలైన ఈ నవరత్నాల కాలం ఒకటి కాదు'- అని శాస్త్రపరిశోధకులు అంటారు. వీరంతా విక్రమాదిత్యుని కాలంలో ఉన్నట్లు ఏదోవిధంగా పేరు వచ్చింది.

నాలుగు వందల సంవత్సరాలకు వెనుక కృష్ణదేవరాయలు విజయనగరాన్ని పరిపాలించాడు. ఈ విజయనగరం బళ్ళారిజిల్లా హోస్పేట ప్రాంతంలో తుంగభద్రాతీరంలో 'హంపి' అనే చోట ఉండేదని చెపుతారు. 'పంపాసరస్సు', 'కిష్కింధ' ఈ ప్రాంతంలోనివేనట. కన్నడంలో 'పంపాసరస్సు'ను 'హంపాసరస్సు' అంటారు. 'ప' అనే అక్షరం కన్నడంలో 'హ'గా మారుతుంది. కన్నడులు 'పాలను' ''హాలు'' అంటారు. ఈ కృష్ణరాయల ఆస్థానంలో అష్టదిగ్గజాలుండేవారు. అట్లే విక్రమాదిత్యుని సభలో నవరత్నా లుండేవారు.

పై శ్లోకంలో అమరసింహునకు, వరాహమిహిరునకు మాత్రం విశేషణాలున్నాయి. మిగిలిన ధన్వంతరి మొదలైన వారి పేర్లు మాత్రం పేర్కొనబడ్డాయి. వారికి విశేషణాలు లేవు. క్షపణకు డనగా జైనుడు. ''క్షపణకామరసింహ'' అంటే జైనుడైన అమరసింహుడని అర్థం. ఇచ్చట క్షపణక శబ్ద విశేషణం. అట్లే ''ఖ్యాతో వరాహమిహిరః'' అన్నపుడు ఖ్యాతశబ్దం వరాహమిహిరునకు విశేషణం. ఖ్యాతిశబ్దం శ్రేష్ఠతావాచకం. ఇట్లు విశేషించి పేర్కొనబడ్డారు. గనుక వీరిలో ఒక్కరైనా విక్రమాదిత్యుని కాలంలో ఉండి యున్నారనిపిస్తుంది.

వరాహమిహిరుడు వ్రాసిన గ్రంథాలనేకాలు. ఆయన వ్రాసిన 'బృహత్సంహిత' దాదాపు నూరు అధ్యాయాలు గ్రంథం. దాని ఉపోద్ఘాతంలో ఆయన - ''నేను ఒక్కొక్క అధ్యాయంగా వ్రాసిన విషయాలకు ఒక్కొక్క శాస్త్రమే పురాతనకాలంలో ఉన్నట్లు తెలుస్తూఉంది; ఇప్పుడు అన్ని ప్రత్యేక శాస్త్రాలు చదివే వాడుక నశించింది; అందుచే చెదరిపోయిన విశాలశాస్త్రగ్రంథాల విషయాలను ఒక్కొక్క అధ్యాయంగా ఇందు సంతరించాను'- అని వ్రాశారు.

బృహత్సంహితలో 'ఇది ఉంది, ఇది లేదు' అని చెప్పడం వీలుకాదు. అందులో సర్వవిషయాలూ ఉన్నాయి. 'ఫలానా చెట్టు ఫలానాచోట ఉంటే నీరు ఫలానా దెసగా ప్రవహిస్తుంది'- అని కూడ తెలుపగల స్థావర శాస్త్రము. ఇట్లే ధాతుశాస్త్రము, పశువులను పక్షులను గురించిన శాస్త్రము, మనకు ఎక్కడను కనపడని నాడీశాస్త్రము-ఇలా ప్రపంచంలోని అన్ని విషయాలు ఇందులో గుప్పబడ్డాయి. చాలామందికి ఇట్టి అపూర్వగ్రంథం ఒకటి ఉన్నదని కూడ తెలియదనడానికే ఇదంతా సోదాహరణం చెప్పాను.

ఇట్టి గొప్ప శాస్త్రగ్రంథాలు మనకు దక్కకుండ పోయాయి. బృహత్సంహితలో కొంచెం కొంచెంగా గ్రంథించిన అధ్యాయాలను చూస్తే - ఆ అధ్యాయాలకు మూలగ్రంథాలు ఎంత గొప్పవై ఉండేవో అని ఆశ్చర్యం వేస్తుంది. విక్రమాదిత్యుని కాలంలో ఆయన కీర్తి నలుదెసలా ప్రాకింది. గొప్ప గొప్ప పండితులు, కవులు ఆయన ఆస్థానానికి వచ్చారు. వారంతా పరిశోధించి ఉద్గ్రంథా లనేకాలు వ్రాశారు.

విజయనగర సామ్రాజ్యస్థాపనకు ముందు 'మాలిక్ కాఫర్' దక్షిణదేశం మీదకు దండెత్తి వచ్చాడు. అతడు ఆలయాలను కూలద్రోశాడు. పశువులను హింసించాడు. జనాన్ని ముప్పుతిప్పలుపెట్టి రణగొణధ్వనులతో రామేశ్వరందాక వెళ్ళాడు. అక్కడ ఒక మసీదును స్థాపించి మధురలోను, తిరుచునాపల్లికి ఉత్తరాన కొణ్ణనూరులో మారియమ్మ కోవెలగల సమయపుర ప్రాంతంలోను తన ప్రతినిధులను నిలిపి వెనుకకు మరలి వెళ్ళాడు. ఆచోటునే 'భోజేశ్వరం' అని అంటారు. ఇచ్చట కర్ణాట రాజు లుండేవారు.

శ్రీరంగాలయాన్ని గురించి ఏడెనిమిది వందల సంవత్సరాల చరిత్ర - 'దినచర్య గ్రంథం'లో వలె వ్రాయబడి ఉంది. అందులో మహమ్మదీయుల దండయాత్ర విషయం వివరంగా వ్రాసి ఉంది. ఒకప్పుడు ఆ కోవెలలో వైష్ణవశాస్త్ర కాలక్షేపం జరుగుతూ ఉండగా మహమ్మదీయులు వచ్చి పడ్డారట. అప్పుడా వైష్ణవులంతా భయపడి శ్రీరంగనాథు నెత్తుకొని మళయాళదేశానికి, ఇంకా ఇతర ప్రదేశాలకు వెళ్ళారట. చివరకు చెంజికోట దళపతి గోపన్న సాయంతో ఏభై, అరవై సంవత్సరాల తరువాత పెరుమాళ్ళును శ్రీరంగానికి చేర్చారట. ఈ విషయం ఆలయచరిత్ర ద్వారా తెలుస్తూ ఉంది. గోపన్న రాయలు ఆ కాలంలో చెంజికోటకు దళపతి. ఈయనను గూర్చి వేదాంతదేశికులు వ్రాసిన రెండు శ్లోకాలు నేటికి శ్రీరంగాలయంలో కానవస్తాయి. గోపన్న శ్రీరంగానికి పెరుమాళ్ళను తిరిగి తెచ్చాడన్న ప్రశంస వానిలో ఉంది.

మాలిక్ కాఫరు కాలంలో నేలగూలిన ఆలయాలు అడుగంటిన ఆచారాలు, నశించిన ధర్మాలు విద్యారణ్యుల కాలంలో పునరుద్ధరింపబడ్డాయి.
విద్యారణ్యులు నాలుగు వేదాలకూ కలిపి ఒక భాష్యం వ్రాశారు. అంతవరకు అట్టి గ్రంథం వ్రాసినవారు లేరు.

ఒక్కొక్క వేదానికి ఒక్కొక్క భాష్యం వ్రాసిన వారున్నారు. కాని నాలుగు వేదాలకు పూర్తిగా భాష్యం వ్రాసినది విద్యారణ్యు లొక్కరే. ఇంతే కాక 'జ్యోతిశాస్త్రము మొదలైన వానికి వీరు వ్రాసిన గ్రంథాలు లెక్కలేనన్ని. వీరి పేరే విద్యారణ్యులు. వీరు వ్రాసిన గ్రంథావళికూడ అరణ్య సమానమే.
చరిత్రాధారా లున్నాయో లేవోకాని, వీరినిగూర్చి ఒక కథ చెపుతారు. ఈకథ ఆదిశంకరుల సంన్యాస స్వీకార కథను పోలిఉంటుంది. శంకరులు తల్లితో స్నానార్థం నదికి వెళ్ళారు. స్నానం చేస్తూఉండగా ఒక మొసలి శంకరుల పాదం పట్టుకొంది. వెంటనే ఆయన తనకీ జన్మలో ఆయు విక లేదని తలచారు. తోడనే ఆయన తన సంన్యాస స్వీకారానికి అనుమతించవలసినదని తల్లిని ప్రార్థించారు. 'సంన్యాసం స్వీకరిస్తే తిరిగి జన్మించినట్లే. తాను బ్రతుక వచ్చును,' అని వారి ఊహ. శంకరుల తల్లి కుమారుని సంన్యాసస్వీకారానికి అనుమతించింది. తోడనే మొసలికూడ పట్టు విడిచింది. ఇది శంకరుల సంన్యాసస్వీకార కథ. విద్యారణ్యులు సంన్యసించిన కథ కూడ ఇట్టిదే.

విద్యారణ్యులు మహాలక్ష్మిని గూర్చి కఠినమైన తపస్సు చేశారు. ఏకాగ్రచిత్తులై వీరు చేసిన తపస్సువల్ల మహాలక్ష్మి ప్రత్యక్షం అయింది. వీరు చూస్తే పరమ దరిద్రులు. ''నీకు ఏమి కావాలి?'' - అని మహాలక్ష్మి ప్రశ్నించగా ''అంతులేని ఐశ్వర్యం నాకు అనుగ్రహింపు'' మంటూ వేడుకొన్నారట. దానికి లక్ష్మీదేవి- ''నాయనా! ఈజన్మలో నీకు ఐశ్వర్యం ఇవ్వడం శక్యంకాదు. కావాలి అంటే తరువాతి జన్మలో ఇస్తాను''. అని బదులాడినదట. అందుచే విద్యారణ్యులు తత్ క్షణమే సంన్యాసం స్వీకరించి 'ఇస్తానన్న ఐశ్వర్యం'

ఇమ్మన్నారట. సంన్యాసం తీసికొంటే శాస్త్రరీత్యా తిరిగి జన్మించినట్లే. అందుచే మహాలక్ష్మి మారుపలుకకుండ కనకవర్షం కురిపించింది.

ఎక్కడ చూచినా బంగారమూ, నవనిధులూ వెల్లివిరిశాయి. వీనినిచూచి విద్యారణ్యులు- ''అయ్యో! నే నెంత మొరకును, ఆశ్రమం తీసికొన్నవానికి ద్రవ్యంతో పనియేమిటి? సంన్యాసికి దీనిని తాకుటకూడ కూడదు. వరాలు కోరకపోతే ఈ ఐశ్వర్యం కనీసం మలిపుట్టుకునందైన లభించేదికదా!'' అని విచారించారట.

మాలిక్ కాఫర్ దండయాత్రచేసి అల్లకల్లోలం చేసిన సమయం అదే. మహాలక్ష్మీ ప్రసాదంవల్ల వచ్చిపడ్డ ఐశ్వర్యంతో విద్యారణ్యులు మాలిక్ కాఫర్ చేసిన అక్రమాలను సరిదిద్ద నిర్ధారించారు. హరిహరుడు, బుక్కడు అనే ఇద్దరూ గొర్రెల కాపరులు. విద్యారణ్యులు వారిని చేరదీసి వారి అండతో తుంగభద్రాతీరంలో విజయనగరసామ్రాజ్యానికి శంకుస్థాపన చేశారు. రాజ్యం ఎక్కడ స్థాపించాలో తెలిసికొనడానికి విద్యారణ్యులు ఒక జాతకం గుణించారు. ఆ విధంగా స్థాపించిన రాజ్యమే విజయనగర సామ్రాజ్యము.

హరిహర బుక్కరాయళ్ళ వంశంలో వారి జ్ఞాతి ఒకడు ఉండేవాడు. ఆయనపేరు కంపన్న. ఆయన ఉపాసనా బలం కలవాడు. మధురానగరదేవత అనుగ్రహంవల్ల ఆయనకొక కరవాలం లభించిందట. ఆయనను రాజ్యానికి సైన్యాధిపతిగా విద్యారణ్యులు నియమించినారు. కంపన్నకు 'ఉడయార్' అని బిరుదు ఉంది. మైసూరు రాజులనుకూడ 'ఒడయారు' లంటారు. దక్షిణంలో శిథిలములైన రాజ్యాలను విజయనగర సామ్రాజ్యం నీడలోనికి తెమ్మని కంపన్న ఒడయారును పంపారు. కంపన్న రామేశ్వరంవరకు జైత్రయాత్ర చేశాడు.

కంపన్న ఒడయారు అంతఃపురస్త్రీలలో గంగాదేవి అనే ఆమె ఒకతె ఉంది. కంపన్న ఎక్కడకు వెళ్ళినా ఆమె కూడ అనుగమించేది. ఆమెకు సంస్కృతంలో మంచి పాండిత్యంఉంది. కంపన్న జైత్రయాత్రలో జరిగిన విషయాలన్నీ దినచర్య వ్రాసినట్లు వ్రాసి కావ్యంగా ఆమె రూపొందించింది. ఆమె వ్రాతలు కాళిదాసు కవితను మించుతై. అంత చక్కని శైలి ఆమెది. ఆమె కావ్యం అంత మధురమైనది. దీనిని ఎథిగ్రాఫికల్ డిపార్టుమెంటువారు అచ్చువేశారు.

ఢిల్లీ రాజు ప్రతినిధులతో కంపన్న ఐదారు యుద్ధాలు చేశాడు. మధురలో జరిగిన యుద్ధం వీనిలో పెద్దది. అప్పుడు కంపన్నకు నగరదేవత కలలో కనబడి 'విజయం నిశ్చయంగా నీదే' అని అనుగ్రహించిందట. అటుపైన కంపన్న విరోధులను గెలిచాడట. దీనిని చాల సుందరంగా గంగాదేవి కావ్యంలో చిత్రించింది.

కన్ననూరులో స్వామికి భోజేశ్వరుడని పేరు. మైసూరుకు చేరిన కన్నడుల పరిపాలనలో ఆ ప్రదేశంఉంది. భోజేశ్వరుడను పేరిప్పుడు పోచలేశ్వరుడుగా మారింది. ఇపుడా కోవెల శిథిలమై పోయింది. ఆలయకుడ్యాలలోని శిలాశాసనాలలో కంపన్న ఈ ఆలయాన్ని రక్షించాడని వ్రాయబడి ఉంది. గంగాదేవి కావ్యంలో కూడ ఈ విషయప్రస్తావన ఉంది. తిరుచునాపల్లిలోని గుడిగోడల మీదకూడ కంపన్న పేరు కనిపిస్తుంది. తిరుచునాపల్లికి ప్రక్కగా 'కంపరసన్ పేట' అనే ఊరు ఉంది. ''కంపరాయ చతుర్వేది మంగళ'' మని దాని మొదటి పేరు. ఇలాచూస్తే ఈ ప్రాంతం నలభై ఏభై ఏండ్లు మాత్రం పరమతాలవారి పరిపాలనలో ఉన్నట్లు తెలుస్తుంది.

విద్యారణ్యుల కాలంలో విజయనగర సామ్రాజ్యస్థాపనానంతరము వేదాలు, ఆలయాలు, ధర్మాలు-పునరుద్ధరింపబడ్డాయి. 'కంపన్న ఒడయార్' జనులకు చాల సాయపడినట్లు ప్రతీతి. ఇతని కాలంలో ధర్మశాస్త్రాలు అభివృద్ధి చెందాయి. ఇట్లు మన శాస్త్రాల ఆధారంతో వెలసిన విజయనగర సామ్రాజ్యం చాల కీర్తి గడించింది. కృష్ణదేవరాయలు ఆ వంశంలోనే పుట్టాడు. ఆ రాయల ఆస్థానంలోనే అష్టదిగ్గజాలుండేవారు. తెలుగు భాషలోని బృహత్కావ్యాలలోకొన్ని ఈ కాలమందే వ్రాయబడ్డాయి. తెలుగుకావ్యముల ఉన్నతి ఈయన కాలమున నూతనశిఖరముల నధిరోహించెను. విక్రమాదిత్యుని కాలంలో వరాహమిహిరులుకూడ ఇట్లే అనేక శాస్త్రాలలో ప్రగతి సాధించారు. ఆయన బృహత్సంహితలో - వేదాంతం తప్ప, మిగిలిన యెన్నో ఉపయోగించే శాస్త్రాలు సంకలనం చేయబడ్డాయి.

భోజరాజు, అతని రాజధాని ధారానగరము ఇట్టివే. ధారానగరంలో కవికానివాడే లేడట. కవి కానివాడు ధారా నగరం వదలి వెళ్లాలని జారాజ్ఞ. రాజభటులు కవికాని వానికై మూలమూలల వెదక నారంభించారు. వెదుకగా వెదుకగా వారి శ్రమఫలించింది. ఒక సాలెవానికి కవనమల్లడం రాదు. రాజభటు లా సాలెవానిని భోజరాజు ముందు నిలువ బెట్టారు. కవికానివానికిసైతం భోజరాజు ముఖం చూచేసరికి కవితా శక్తి కలిగేదట.

భోజరాజు 'కవిత్వం అల్లగలవా?' - అని నేతగానిని ప్రశ్నించాడు. అతడు - 'కావ్యం కరోమి;' అని బదులు చెప్పాడు. అంతటితో ఆగక - 'నహి చారుతరం కరోమి' - అన్నాడు. అంటే 'కావ్యము వ్రాయగలనుగాని - అంత చక్కగా వ్రాయలే'నని అర్థం. వెంటనే అతడు - 'యత్నాత్ కరోమి యది చారుతరం కరోమి' - అని రెండవ చరణం చెప్పాడు. ప్రయత్నిస్తే కొంచెం చక్కగా వ్రాయుదునేమో' అని దీని భావం. నేతగా డింతటితో ఆగలేదు –

'భూపాలమౌళి మణిరంజిత పాదపీఠ |
హే! సాహసాంక! కమయామి వయామి యామి' ||

అన్నాడు. అనగా - ''రాజులందరు తలలువంచి నీ పాదాలకు నమస్కరించేవేళ వారి కిరీటాలలో పొదుగబడ్డ రత్నాల కాంతులు నీ పాదపీఠంలో ప్రతిబింబిస్తూ ఉంటాయి. అట్టి పాదపీఠముగల ఓసాహసాంకా! నేను కవిత్వమూ అల్లుతాను, బట్టలూ నేస్తాను, ఇక వెడతా''నని అర్థం.
ఇలా చెప్పి నేతగాడు బయలుదేరాడట. కవనమల్లండరాదని భటులు బంధించితెచ్చారు - కాని వాడే గడ గడ మంచినీళ్ళలా కవిత్వం చెప్పి 'యామి' అని శ్లోకం పూర్తిచేసి వెళ్ళాడట. ఇట్లు ధారానగరంలో కవికానివాడేలేడని ఒక ప్రతీతి.

మనదేశంలోరాజులంతా ధర్మానుపర్తులై శాస్త్రాలననుసరించి పరిపాలన చేశారు. శివాజీని చూడండి! ఆయన సామాన్యుడు కాడు. ఆయన

గురువు సమర్థ రామదాసస్వామి. ఆయన ఆంజనేయుని అవతారమని అంటారు. సదా రామనామపరాయణు డాయన ఆయనయొక్క ఆనుగ్రహబలంవల్లనే అందరిని కూడగట్టుకొని శివాజీ ఢిల్లీ రాజుల నెదిరించాడు. ఉత్తరభాగంలో ధర్మమార్గాన ఒక రాజ్యాన్ని స్థాపించాడు. శివాజీ ఎన్ని గ్రామాలు గెలిచినీ నాటికి నాదే సమర్థరామదాసస్వామి దగ్గరకు వచ్చి - 'స్వామీ! ఈ గ్రామాలన్నీ మీవి' అని సమర్పణ చేసేవాడట. 'ఈ గ్రామాలు నా కెందుకు? వీనిని నాకు ప్రతినిధిగా నీవే పరిపాలించు' - అని గురువు బదులు పలికేవారట. శత్రుకాంతను సైతం చెరపట్టక, హింసించక - శివాజీ వారికి తోడిచ్చి స్వజనులకడకు పంపేవాడట. శివాజీ చరిత్రలో ఇట్లు వ్రాయబడింది.

శివాజీకి గురువైన సమర్థ రామదాసస్వామి దాదాపు నలభై ఏభైమఠాలు స్థాపించారు. ఆయన తన శిష్యులకు 'శ్రీరామ జయరామ జయజయరామ' అనే మంత్రం ఉపదేశించి ఉంఛవృత్తితో జీవించండని ఆదేశించేవారట. తంజావూరు మహారాష్ట్రుల పరిపాలనలో ఉన్నప్పుడు - అక్కడ కూడ నాలుగైదు మఠాలు ఏర్పడ్డాయి. మహారాష్ట్రదేశంలో చాలామఠాలు వెలసాయి. వానిని 'రామదాసు'లనే అంటారు. ఇంతకూ కారణం సమర్థరామదాసుయొక్క మారుతి ఆంజనేయుని ప్రభావమే.

బుద్ధి ర్బలం యశో ధైర్యం నిర్భయత్వ మరోగతా!
అజాడ్యం వాక్పటుత్వం చ హనుమత్స్మరణా ద్భవేత్||

వేదాంతం క్షుణ్ణంగా పరిశీలించినవారు కొందరుంటారు. కాని వారి దేహం చిక్కి శిథిలమై ఉంటుంది. మనస్సులో ఎక్కడలేని ధైర్యమూ ఉంటుంది. కాని, శరీరంలో చేవ ఉండదు. కొందరికి అట్లుకాక దేహం క్రొవ్వి ఉంటుంది; కాని మనస్సుమాత్రం పిరికి. ఒకదాని కొకటి విరోధముగానుండును. మొదట మార్గమున - దుర్మార్గమున పోయెడువా డొకడుండును. భక్తియుండదు. కొందరికి భక్తియుండును. కాని జ్ఞానముండదు. మూఢభక్తి మాత్రముండును.

కాని ఆంజనేయ భక్తులట్లుకాదు. ఆంజనేయునిగూర్చి చెపుతూ శ్రీరామచంద్రు డాయనను 'నవవ్యాకరణవేత్త' అన్నారు. అంతే కాదు. ఆయన తత్త్వవేత్తకూడా. 'పైశాచి' అనేది ఒక భాష. ఆ భాషతో భగవద్గీతకు ఒక భాష్యం ఆంజనేయస్వామి వ్రాశారు. దానికి 'పైశాచ్యభాష్య' మని పేరు. హనుమ తన్నుపాసించినవారికి బలాన్ని ధైర్యాన్ని ప్రసాదిస్తాడు. 'బలం ఉంది - ధైర్యంలేదు', 'ధైర్యంఉంది - బలంలేదు'. అనుట ఉండదు.

అరవదేశంలో ఈయనకు 'హనుమార్' అని వ్యవహారం. తెలుగుదేశంలో ఆంజనేయశబ్దం ఎక్కువ. కన్నడులు 'హనుమంతయ్య' అని అంటారు. మహారాష్ట్ర దేశంలో మారుతికి 'మారుతి' అనియే ప్రసిద్ధి, 'బంగాళము-కాశ్మీరము మధ్యప్రదేశము - ఈ చోటులలో మహావీర్' శబ్దానికి వాడుక ఎక్కువ. ఆంజనేయుడు భక్తికి పరాక్రాంతికీ నెలవు. ఆయన కాయనయే సాటి.

''యత్ర యత్ర రఘునాథ కీర్తనం
తత్ర తత్ర కృత మస్తకాంజలిం|
బాష్పవారి పరిపూర్ణలోచనం
మారుతిం నమత రాక్షసాంతకం''

రామశబ్దము, రఘునాథుని కీర్తనము ఉన్న ఏ చోటనైనాసరే- మన కన్నుల కగోచరంగా - కనులనుండి నీరు ధారగా కారుస్తూ-ఆంజనేయుడు కీర్తన శ్రవణానందంలో మునిగి ఉంటాడు.
రామునియందాయన కంతభక్తి. బలంలో, ధైర్యంలో, కీర్తిలో, భక్తిలో-అన్నిట ఆంజనేయునిస్థానం అత్యున్నతమైనది.

వై దేహీసహితం సురద్రుమతలే
హైమే మహామంటపే
మధ్యే పుష్పక మాసనే మణిమయే
వీరాసనే సంస్థితం,
అగ్రే వాచయతి ప్రభంజనసుతే
తత్త్వం మునిభ్యః పరం
వ్యాఖ్యాతం భరతాదిభిః పరివృతం
రామం భజే శ్యామలమ్||

దక్షిణామూర్తి సనకాదులకు జ్ఞానోపదేశం చేసే రీతిలో శ్రీరాముడు- ఆంజనేయునివంక చూస్తూ మహర్షి

శైవసిద్ధాంతమున కైవల్యనవనీతము, శివజ్ఞానబోధము అను గ్రంథములు కలవు. హిందూస్థానీభాషలో విచారసాగరమను గ్రంథమొకటి తత్త్వగ్రంథము. ఇట్టిదే తెనుగున-సీతారామాంజనేయము అనుగ్రంథము. జ్ఞానము భక్తి, బలము, ధైర్యము, వీర్యము, శ్రేయముల నిచ్చునది ఆంజనేయులు, అన్నిటియందును వారు పరిపూర్ణులు. పైగా అఖండ బ్రహ్మచర్యనిష్ఠులు. ఒక్క క్షణముకూడ కామమనెడు విషయమే 'జ్ఞాపకములేని ఆంజనేయుల అవతారమే సమర్థ రామదాసస్వామి' వీరి బలముచేతనే మహారాష్ట్రమున ఒక పెద్ద రాజ్యమేర్పడినది. ఇంగ్లీషువారు సయితము ఎక్కువగ మహారాష్ట్రులతోనే యుద్ధము చేయవలసివచ్చినది. ఇట్లు తత్త్వము, శాస్త్రము- వీని ఆధారముపై లేచిన రాజ్యములు బహుకాలము కీర్తితో నిలిచియుండెను.

భోజుని ధారానగరంలో ఒక మసీదు ఉంది. అందులో ఒక శిలాశాసనం దొరకిందట. మసీదులోనికి వెళ్ళడానికి వీలులేక 10,15 సంవత్సరాలు ఊరకొన్నారు. ఈ మధ్య అనుమతి సంపాదించి ఎథిగ్రాఫికల్ డిపార్టుమెంటువారు ఆ శిలాశాసనాన్ని పరిశోధించారు. అందులో ఒక పెద్ద చక్రం- ఆ చక్రంలో శ్లోకాలు చెక్కబడ్డాయి. ఆ చక్రంలో వ్యాకరణం అంతా ఒక 'చార్టు'లా చెక్కబడి ఉన్నదట. తరువాత దానిని ఆ ఇలాకావారు అచ్చువేశారు. ఆ మసీదు ఉన్న చోటనే పూర్వం భోజరాజుకాలంలో సరస్వత్యాలయం ఉండేదట. ఇట్లు

భోజరాజుకాలానికి చెందిన ఒక శిలాచక్రం ఈనాటికి అగపడింది. వ్యాకరణశాస్త్రాన్ని శిలపై చెక్కి సరస్వత్యాలయంలో ప్రతిష్ఠించారు. ఆలయం మసీదుగా మారి, మరల ఆచక్రం మనకు ఫలప్రదం అయింది. ఈ శాసనాన్ని ఆంగ్లంలో ప్రశంసించారు.

భోజరాజు 'సమరాంగణసూత్రము' అనే గ్రంథం వ్రాశాడు. 'యంత్రాలు. మిషన్లు ఎట్లు చేయాలి? ఆకాశయానం ఎలా సాధ్యం?' అనే విషయాలిందు ప్రస్తావించబడ్డాయి. అమరంలో 'వ్యోమయానం విమానోస్త్రీ' అని ఉంది. ఆకాశంలో పయనించే వాహనానికి విమాన మని పేరు. రామాయణంలో కూడ విమాన ప్రశంస వస్తుంది. కాని మనము దానిని కథ అని వదలిపెట్టాము. భోజరాజకృతమైన 'సమరాంగణ సూత్రము'లో విమాన నిర్మాణవిధానం వ్రాయబడి ఉంది. దానిని గూర్చి వ్రాస్తూ- విమాన నిర్మాణం గురించి స్థూలంగా తత్త్వముమాత్రమే (థియరి) వ్రాస్తున్నాను. దానిని నిర్మించే విధానం తెలియక వదలలేదు. చేయుటెట్లో చెప్పడం వల్ల సామాన్యజనాళికి సౌఖ్యానికి బదులు అసౌఖ్యమే ఏర్పడుతుంది- అని ఇది వ్రాయబడలేదు' అని వ్రాశారు.

ఈ విషయం మన కిప్పుడు బాగా అర్థమౌతోంది. ఈ ప్రపంచము నిలుస్తుందా? మరునిముసం ఉంటుందా ఏ నిముసంలో మనమంతా నశిస్తామా? అన్న భయంతో ఆటంబాంబు హైడ్రోజన్ బాంబులయుగంలో మనం ఉన్నాము. చిత్తశుద్ధిలేని వారి చేతులలో ఈ మారణాయుధాలు ఉండడం పసిపాపల చేతులలో విషం ఉండడంవంటిది. అందు చేతనే దీనిని గూర్చి చెప్పనని భోజరాజు సమరాంగణసూత్ర గ్రంథంలో వ్రాశాడు. కొంతకాలానికి వెనుక దీనిని గురించి ఉత్తర దేశం నుండి నాకొక లేఖవచ్చింది. విమాన నిర్మాణ విధానం ఈ గ్రంథంలో ఉందికదా! ఇది ఏమైనా అర్థమౌతోందా? అని నేను కొందరు ఇంజనీర్లకు దానిని చూపాను. ఏవో బెలూన్లవంటి సాధనాలను గురించి వర్ణించారని వారన్నారు.

ఇతర దేశాలలో నూతనశాస్త్రాలు వృద్ధి చెందుతూ ఉండగా మనదేశంలో ఉన్నశాస్త్రాలు నామరూపాలు లేకుండ నశిస్తున్నాయి. ఉన్న శాస్త్రాల నుపయోగించుకొనే రీతి మనకు తెలియడంలేదు. ఇట్టిదే నాడీశాస్త్రం. నాడీ శాస్త్రమంటే సాముద్రికం కాదు. మనం ముక్కుదగ్గర చేయిపెట్టి చూస్తే తెలుస్తుంది. శ్వాస ఒకప్పుడు కుడినాసిక నుండి వస్తే ఒకప్పుడు ఎడమనాసికనుండి వస్తుంది. ఈ శ్వాసల పేర్లు యోగశాస్త్రములో చెప్పబడిఉన్నాయి. 'ఎడమ నాసిక నుండి శ్వాసవస్తే మనోవృత్తి ఇలా వుంటుంది- కుడి నాసికనుండి శ్వాసవస్తే మనోవృత్తి ఇలా వుంటుంది' అని నాడీ శాస్త్రములో చెప్పబడింది. 'మంచి చిత్తవృత్తి, శాంతము, ఆరోగ్యము-అన్నీ కుడినాసికనుండి శ్వాస వచ్చినప్పుడు కలుగుతాయి; ఎడమ నాసికనుండి శ్వాస వస్తే కోపము, రోగము, దుఃఖము కలుగుతాయి'- అని వ్రాయబడింది. మంచికి కుడి, చెరుపునకు ఎడమ, నాడీశాస్త్రాన్ని గురించి తమిళంలో కూడ ఒకటి రెండు పుస్తకాలు ఉన్నాయి.
ఇటులే కాశిలో మరణించినవారికి కుడిచెవిలో స్వామి తారకమంత్రోపదేశం చేస్తాడని ప్రతీతి. తారక మంటే ప్రణవం. రామనామానికిన్నీ తారకమనియే పేరు. జ్ఞానులకు ప్రణవాన్ని, భక్తులకు తదితరులకు రామమంత్రాన్ని స్వామి ఉపదేశిస్తారట. కాశీక్షేత్రము బహుదూరము. కాశికి సమానమైన క్షేత్రాలు ఇంకా ఉన్నాయా? అంటే, కాశితోబాటు ఏడు క్షేత్రాలను పేర్కొన్నారు.

అయోధ్యా మథురా మాయా కాశీ కాంచీ అవంతికా,
పురీ ద్వారవతీ చైవ సప్తైతే మోక్షదాయకాః,

ఇదేరీతిని పుణ్యనదులు ఏడు.

గంగే! చ యమునే! చై వ గోదావరి ! సరస్వతి!
నర్మదే ! సింధు ! కావేరి !......

పుణ్య క్షేత్రములు ఏడు. పుణ్యనదులు ఏడు. ఈ క్షేత్రాలలో మరణించినవారికి మోక్షము లభిస్తుంది. 'పురీ అనగా ద్వారకాపురి. జగన్నాథముకాదు. దక్షిణమున వొక్క కంచియేకదా! కావేరీతీరములో కాశికి సమానములైన క్షేత్రములు మరి లేవా? అంటే ఈ క్రింది క్షేత్రాలు చెప్పబడ్డాయి.

శ్వేతారణ్యం పంచనదం గౌరీ మాయూర మర్జునం,
ఛాయావనం చ శ్రీవాంచ్యం కాశీక్షేత్ర నమాని షట్||

పంచనద మనగా తిరువైయార్, 'ఛాయావనం' అనేది కావేరీ పట్టణానికి ప్రక్కన; 'శ్రీ వాంచ్యము' 'నన్నిలము' అనే చోటుకు దాపున ఉన్నాయి. 'గౌరీమాయూరము- అంటే- 'మాయవరము', ఇవి కాశికి సమానములైన ఆరు క్షేత్రాలు.

తిరువైయార్‌లో పశువులు సైతము కుడిచెవిపైన ఎడమచెవి క్రింద ఉండునట్లు పరుండి ప్రాణాలు వదలుతాయి. అని ప్రతీతి. కుడిచెవిపైన ఉండవలెనంటే ఎడమచెవి క్రిందుగా ఉండవలెను. ఎడమప్రక్కగా పండుకొనవలెను. ఎడమప్రక్క శయనిస్తే దేహభావం అంతా ఎడమ ప్రక్కపడి కుడినాసిక నుండి శ్వాస సులభంగా వస్తుంది. కుడినాసికలోనుండి శ్వాస వస్తే మంచి మనోవృత్తులు శాంతి కలుగుతాయి; అని నాడీ శాస్త్రము చెపుతూఉంది. స్వామి కుడిచెవిలోనే మంత్రోపదేశము చేయుననుటకూడ పొందికగనే ఉంది.

ఇట్లు మన ప్రాచీన శాస్త్రాలు, ప్రాచీన ప్రదేశాలు చాలా ఉన్నాయి. ఢిల్లీలో కుతుబ్‌మీనారుకు సమీపంలో ఉన్న శివాలయంలో ఒక పెద్ద ఇనుప ధ్వజస్తంభము ఒకటి ఉంది. అంతపెద్ద స్తంభమును కరగించి ఎట్లు మూస పోసినారని ఈనాటికిని ఆశ్చర్యంగా ఉంది. నూతనయంత్రములతో గూడిన టాటా కంపెనీ ఉక్కు-ఇనుము కర్మాగారములు ఈనాటివి. కాని, ఈ పరికరము లేవియు లేని ఆకాలంలో ఇంతపెద్ద స్తంభాన్ని ఏలా నిర్మించినారో, అన్న ఆశ్చర్యం ఇంతింతకాదు. ప్రపంచంలోని అద్భుతాలు ఏడు అంటారు. పైసా నగరంలోని వ్రాలుడు గోపురము, జిబ్రాల్టరులోని ఒక పెద్ద విగ్రహము, ఈజిప్టులోని పిరమిడ్లు, ది గ్రేట్ వాల్ ఆఫ్ చైనా, మాస్కో చర్చిలోని ఒక పెద్ద గంట-ఇలా ప్రపంచంలోని అద్భుతాలు ఏడు అని చెపుతారు. ఇవి మాత్రమే కావు. ఇంకను ఎన్నో?

మనకు చాలా వెనుకటివారు ఇట్లు నిర్మించిన మహోన్నత దేవాలయాలు-శిల్పాలు మనకు ఆశ్చర్యం కలిగిస్తాయి. వీనిని కట్టుట ఎటులో

ఉపదేశించు శాస్త్రములు ఉండి ఉండాలి. ఇపుడేవీలేవు. ఇప్పటివారు 'మతము సైతము శాస్త్రానికి (సైన్సు) అనుకూలంగా ఉంటేనే ఒప్పుకుంటారు అంటారు. సైన్సుకు అనుకూలంగా ఉండాలి అంటే ఏనాటి సైన్సుకు? ముప్పదేండ్ల క్రిందటి సైన్సు ఒకతీరు- ఏబదేండ్లకు వెనుకటి సైన్సు మరియొకతీరు. ఏ కాలమునాటి సైన్సు మనకు ప్రమాణము? ఏభై ఏండ్లకు వెనుక చెప్పిన విషయాలను జనము ఇప్పుడు ఒప్పుకొనడములేదు. ఇవన్నీ చూస్తే మన అజ్ఞానదశ వెల్లడిఔతోంది. 'మనకు తెలియనిదంతా అబద్ధము; వానిని తగుల బెట్టాలి', ఇది ఈ నాటి తీరు ఇప్పుడు ఉన్నశాస్త్రాలు మనం చదువాలి. మనకు అర్థము కాకపోయినా మన సంతతికొరకైనా వానిని రక్షించాలి. ఇప్పుడు అర్థము కాకపోయినా మరియొక కాలంలోనైనా ఇవి ఉపయోగిస్తాయి, పిరమిడ్లను చూస్తే నేటికీ ఆశ్చర్యమే! మనకు, ఆ పిరమిడ దేశమువారికిని సంబంధము ఉండేదట. ఆఫ్రికాదేశములో 'మేరు, రామ' శబ్దా లీనాటికీ ఉన్నాయట. ఇలా ప్రపంచంలో ఒకే తత్త్వము, ఒకే నాగరికత ఉండేదని తెలుస్తూఉంది.

అందుచే నేడు మనకు ఉపలబ్దములైన శాస్త్రాలను రక్షించడం ఎంతైనా అవసరం. మనకు అర్థము కాలేదని ప్రయోజనములేదని- త్రోసివేయకూడదు. వాని రక్షణ పూర్వరాజులకు ఒక విధిగా ఉండేది. ఇపుడు రాజులులేరు. రాజ్యాంగమువుంది. కాని వారికి నెమ్మది అన్నదిలేదు. ఒక ప్రక్క భాషావివాదము-మరొకవంక పొలిమేరల తగాదా, జాతిని గూర్చిన వివాదము-ఇక సాధారణ కుటుంబాలగతి మరీ అధ్వాన్నముగా ఉంది. ఇట్టియెడ జీవితం ఎలా గడపాలి? అన్నదే పెద్ద చింత.

రాజ్యమంటే ఈలాగే ఉంటుంది. ఆ కాలములో ఒక రాజుకు మరియొక రాజుకు కయ్యాలు. ఇపుడొకజాతికి మరొక జాతికి వివాదము. ఒక రాజ్యానికి మఱొక రాజ్యానికి యుద్ధాలు. యుద్ధములేక మనుష్యుడు జీవించడం కష్టం. 'అలలు తగ్గిన మీదట సముద్రస్నానం- అన్నది కల్ల. ఆ శుభదినం ఎన్నటికీ రాదు. అరణ్యములో పులిపై సింహము దూకుతుంది. జింకను పులి తన వాతబెట్టుకొంటుంది. కాని అరణ్యంలో ఇవన్నీ వృద్ధిచెందుతూ, ఆడుకొంటూ, జీవిస్తూనే ఉన్నాయి. 'మనం రేపు ఏమి చేయాలి? మరునిముసములో మనం చేయవలసిన పని యేమిటి?- అని అవి మనఃక్లేశము పొందడం లేదు. మనుష్యునకు బుద్ధిఉంది. అందువల్లనే మరుసటిరోజును గూర్చి అతనికి చింత, నిన్నటినిగూర్చి రేపటిని గూర్చిగాని చింత ఎందుకు? రేపటినిగూర్చి ఏడువవలసిన అవసరం కనిపించదు. అన్నీ ఈశ్వరసంకల్పాన్ని అనుసరించి జరుగుతాయి. జరిగేది జరుగనీ, ప్రస్తుతమేదో అదే కర్తవ్యము. దానిని గమనించి చేస్తే చాలు. ప్రాతశాస్త్రాలను అర్థం చేసికొనడానికి పరిశోధనలు చెయ్యాలి. అన్నిటినీ మించినది బ్రహ్మవిద్య. అది వట్టి బుద్ధిచేత మాత్రమే తెలియబడదు. అనుభవమునకు రావలసిందే. ఆత్మవిద్య అనుభవమునకు రావలెనంటే మనోవృత్తి దృఢంగా ఉండాలి. ఇతర విద్యలచే మనస్సు పరిపక్వమైనపుడే ఆత్మ విద్య అంటుతుంది.

మిగిలిన దేశాలు మొదట అజ్ఞానదశలో ఉండి క్రమేణ జ్ఞానదశకు వచ్చేయి. మన దేశము ఆరంభ కాలములో ఉచ్చస్థితిలోఉండి క్రమేణ క్షీణస్థితికి వస్తూ ఉన్నట్లు తోస్తుంది. అన్ని దేశములు శిలాయుగమునుండి స్వర్ణ యుగానికి పురోగమించేయి. మనదేశం స్వర్ణయుగమునుండి శిలాయుగానికి పర్యటిస్తూ ఉంది. మన శాస్త్రములను మూఢతచే పనికిమాలినవని పారవేయగూడదు. వానిని అర్థం చేసికొనడానికి ప్రయత్నించాలి. దేనినీ ఖండించుటకు మన కధికారంలేదు. అర్థము చేసికొనుటకే మనకు అధికారం. ఆంజనేయస్వామి మన కెల్లరకు మంచి బుద్ధియు, శక్తి ప్రసాదించాలి. ఆయనను ప్రార్థిస్తే మనకు ఏ విధమైన కొరత ఉండదు. అన్నిటికి ఆయన అనుగ్రహమే కారణము.

అపార కరుణాసింధుం జ్ఞానదం శాంతరూపిణం
శ్రీ చంద్రశేఖర గురుం ప్రణమామి ముదావహం ॥

--- “జగద్గురు బోధలు” నుండి

#KanchiParamacharyaVaibhavam #కంచిపరమాచార్యవైభవం
3/27/18, 15:56 - Paramacharyulu: పన్నెండవ శ్లోక భాష్యం - మొదటి భాగం

త్వదీయం సౌందర్యం తుహినగిరి కన్యే తులయితుం
కవీంద్రాః కల్పంతే కథమపి విరించి ప్రభృతయః
యదాలోకౌత్సుక్యా దమరలలనాయాంతి మనసా
తపోభిర్దుష్ప్రాపామపి గిరిశ సాయుజ్య పదవీం.

(అమ్మా! బ్రహ్మాదులైన కవీంద్రులు కూడా నీ చక్కదనమునకు సాటి చెప్పలేక కష్టబడి కల్పించుచున్నారు. నిన్ను చూడవలెనని ఉత్సుకతతో మనస్సుచేత తపస్సులకు కూడా పొందనలవిగాని శివసాయుజ్యమును పొందుతున్నారు.)

శ్రీయంత్రాన్ని వర్ణించిన ఆచార్యులవారు అంబిక సౌందర్యాన్ని చిత్రీకరిద్దామనుకొన్నారు. మరి తాము సౌందర్యలహరి కదా వ్రాస్తున్నాము అని తలపోసి ఉండి ఉంటారు. అంబిక సౌందర్యాన్ని అభివర్ణించాలనే ఉత్సుకత కలిగింది. *త్వదీయం సౌందర్యం* అన్న పదములతో ఆరంభించారు. వారనుకొని ఉండవచ్చు, అతః పూర్వము వర్ణించబడిన శ్రీయంత్రమంటే కోణములు, వృత్తములు, రేఖలు, చదరములు మొదలైన వివరములిస్తే సరిపోతుంది. మరి ఇప్పుడు వర్ణించాల్సినది అంబిక సౌందర్యమాయే. అది సామాన్యమైన కార్యమా ? అసలు సాధ్యమయ్యేదేనా ?? ఇంతవరకూ ఏ కవి ఉన్నది ఉన్నట్లుగా వర్ణించలేకపోయారే! బ్రహ్మగారు ఆదికవి, భాగవతంలో మొదటి శ్లోకమే ఆయన పేరు అభివర్ణిస్తుంది. మరి సాక్షాత్తు సరస్వతి శక్తిగాగల ఆయన ఎంతటి కవి అయి ఉండాలి. అంతకంటే గొప్ప కవి ఉండటం సాధ్యమేనా ? పురాణాల్లో కష్టాల్లో దేవతలందరూ ఆయన దగ్గరకు వెళ్ళినట్లు, వారిని వెంటబెట్టుకొని సందర్భాన్ననుసరించి శివుని వద్దకో, విష్ణువు వద్దకో, శక్తి వద్దకో ఆయన వెళ్ళినట్లు, వారిని ఉద్దేశించి ప్రార్థనా శ్లోకాలు చెప్పినట్లు, తరువాత ఆ దేవతల కష్టాలు తీర్చమని కోరినట్లు చదువుతూ ఉంటాం. తన కష్టాల కోసం మరి ప్రార్థించడా ! అటువంటి సందర్భాలలో అంబికను గురించి ఆయన పాడారు. దుర్గా సప్తశతిలో మధుకైటభులు చిక్కులపాటు చేసినపుడు ఆయన అంబికను ప్రార్థించాడు కదా! మరి అటువంటి బ్రహ్మ కూడా అంబిక అందాన్ని సరిగా వర్ణించలేకపోయాడట.

*విరించి ప్రభృతయః* - విరించి మొదలుగా గలవారు, ఆమె అందాన్ని అభివర్ణించే ప్రయత్నం చేశారు. *తులయితుం* అంటే తూకం వేయటమన్న అర్థము. *తుల* అంటే తక్కెడ కదా! ఒక వస్తువు బరువును ఎలాతూస్తాం. రెండోపక్క బరువైన వస్తువు అంటే ఏ కేజీ రాళ్ళో వేస్తూ రెండు తక్కెడ్లు సమమైనపుడు ఆ వస్తువు బరువు, వేయబడిన రాళ్ళెన్నో అన్ని కేజీలో గ్రాములో అని చెబుతాం. అంటే తూచడానికి తూచబడే వస్తువు ఒక్కటే సరిపోదు. మనకు తెలిసిన బరువున్న వస్తువు కావాలి. ఇప్పుడు అమ్మవారి అందాన్ని తూచడానికి బ్రహ్మగారు మొదలుగా గల కవులకు అంతటి గురుత్వం కలిగిన వస్తువేదీ తెలియకపోవడంతో ఆమె అందాన్ని కొలవలేకపోయారు. ఏ ఉపమానమూ ఆమెకు సరితూగదు. మామూలు స్త్రీలకైతే ముఖం చంద్రబింబం వలె ఉన్నది. కనులు పద్మమువలె ఉన్నాయి అంటూ వర్ణించవచ్చు. ఈ ఉపమానాలన్నీ అంబికముందు వెలవెల పోతాయి. పోల్చడానికి కూడా సరిపోవు. బ్రహ్మాదులైన కవులకు అమ్మవారి అందాన్ని తూచగల వస్తువేదీ కనిపించలేదు. ఆచార్యులవారు ఈ విషయం ఇన్ని పదాలతో చెప్పలేదు. వారు *కథమపి కల్పంతే* - ఎలాగోలా ఉహించడానికి ప్రయత్నించారు అంటారు. ఇది ధ్వని అని పిలవబడే అద్భుతమైన కవితా ప్రక్రియ. ధ్వనంటే శబ్దమని మామూలు అర్థం, ఇక్కడ ధ్వనింపచేయడం అంటే నేరుగా చెప్పకుండా స్ఫురింప చేయడమన్నమాట. *నేను ప్రదోష దీపారాధన చూడటానికి పరుగెత్తా అన్నది నిజం* అని చెబితే, *కానీ నే చూడలేకపోయానన్నది* చెప్పకనే చెప్పినట్లయింది. ఒక విషయం చెప్పకుండా, ఆ విషయం అవగతమయ్యేట్లు ఒక సూచన చేస్తే ప్రభావం ఎక్కువగా ఉంటుంది.

(సశేషం)

#KanchiParamacharyaVaibhavam #కంచిపరమాచార్యవైభవం
#ParamacharyaSoundaryaLahariBhashyam
3/28/18, 07:54 - Paramacharyulu: విభూది—షష్ఠిపూర్తి:

పరమ శివుడు ఒళ్ళంతా విభూది రాసుకోని ఉంటాడు, అలాగే పరమాచార్య స్వామివారు కూడా ఒంటి నిండా విభూది అలుముకొని వుండే వారు. ఒకప్పుడు పరమాచార్య స్వామివారి అనుయాయులలో(శిష్యులు) ఒక శిష్యుడు వచ్చి "అయ్యా మా నాన్నగారికి షష్ఠిపూర్తి చేద్దాం అని అనుకున్నాము, మా అమ్మగారి పరిస్థితి చూస్తే మాకు ఇక దక్కదు అని డాక్టర్లు చెప్పారు" అని ఆనాడు.

పరమాచార్యులవారు ఒక అరటి ఆకు తెప్పించి దానిపై ఒంటికి రాసుకున్న విభూది పడేలాగ ఒంటిని ఆడించారు. ఆ విభూదిని పొట్లం కట్టించి శిషుడికి ఇచ్చి "ఇది మీ తల్లీ గారి నోటిలో వేయి" అని చెప్పారు.

శిష్యుడు దానికి ఇప్పటికే నేను ఎక్కాల్సిన విమానం వెళ్లిపోయి ఉంటుంది అని చెప్పాడు, దానికి పరమాచార్య "విమానం వెళ్లదు, నువ్వు వెళ్ళు అని" చెప్పారు.

శిష్యుడు ఇంటికి వెళ్లగానే విభూది తీసి తల్లి గారి నోటిలో వేస్తుండగా, డాక్టర్లు అన్నారు మీ తల్లిగారు వెళ్లి పోయారు ఏం ఉపయోగం వుండదు అని, శిష్యుడు మా పరమాచార్య ఇచ్చారు నాకు నమ్మకం వుంది అని తల్లిగారి నోటిలో వేశారు. శిష్యుడి తల్లి గారు మంచంలోంచి లేచి "ఏమైంది" అని అడిగారు.

పరమాచార్య, ఆయినే స్వయంగా కామాక్షి. అంత అనుష్టానం చేశారు మరి ఆయన ఒంటికి అలదుకున్న విభూదికి ఆ మాత్రం మహిమ ఉండదా, కచ్చితంగా ఉంటుంది.

_/_ జయ జయ శంకర హర హర శంకర _/_

అపార కరుణాసింధుం జ్ఞానదం శాంతరూపిణం
శ్రీ చంద్రశేఖర గురుం ప్రణమామి ముదావహం ॥

#KanchiParamacharyaVaibhavam #కంచిపరమాచార్యవైభవం
3/28/18, 13:31 - Paramacharyulu: <Media omitted>
3/28/18, 16:13 - Paramacharyulu: పన్నెండవ శ్లోక భాష్యం - రెండవ భాగం

“నేను యంత్రం గురించి, దాని చిత్రణా వైఖరి గురించీ మాట్లాడాను. తరువాత అమ్మ అందాన్ని గురించి చెబుదామనుకొన్నాను కానీ, ఆ అందం వర్ణనాతీతమైనదిగా గుర్తించాను. ఈ విషయంలో బ్రహ్మాదులైన మహాకవులు కూడా విఫలులైనట్లు గుర్తుకు వచ్చింది.” ఈ విధంగా చెప్పడం ద్వారా ఆచార్యులవారు అంబిక అందము మరొక పోలికలేనిదని తత్తుల్యమైన వస్తువు వేరొకటి లేదనీ మనకు చెబుతున్నారు.

అంబిక అందమును ఒక కవి వర్ణించగలడా అన్న విషయమలా ఉంచండి. ముందు ఆ భక్తుడైన కవి అంబికను సంపూర్ణంగా ఎటిగి ఉండాలి. చూసి ఉండాలి. అలా ఎవరైనా చూశారా అంటే లేదని చెప్పవలసి వస్తుంది. చూడని అంబిక అందాన్ని గురించి ఒక కవి ఎలా వర్ణించగలడు.

అంబిక భౌతికరూపాన్ని భక్తులెవ్వరూ ఎందుకు చూడలేకపోయారు. ఎవరూ ఆమెను రేఖామాత్రంగానైనా చూడలేదని చెప్పలేం. నిజానికి భక్తులైన అనేకమంది కవులకు ఆమె దర్శనమయింది. అయితే ఆమె తనను సంపూర్ణంగా ఆవిష్కరించుకోదు. మెరుపులా ఒక్క క్షణం దర్శనమిస్తుంది. తమనుతాము సంపూర్ణంగా ఆమె సేవలో నియోగించుకొన్న వారు కూడా ఆమెను సంపూర్ణంగా చూడలేదు. ఆమె క్రీగంటి చూపును, ఆమె పెదవులు విచ్చీవిచ్చనట్లు చూపే చిఱునగువు సొబగులను – ఈ రకంగా ఆమె రూపంలో ఒక అంశము ద్యోతకమయి

ఉంటుంది. ఆపాదకేశాంతము సంపూర్ణమైన దర్శనం దుర్లభం.
అంబిక తన అందాన్నంతా ఒకే ఒక్కరికే చూపుతుంది. ఆయన పరమేశ్వరుడే ! ఆమె అసలు మహాత్రిపురసుందరిగా పరమ ప్రేమరుపమైన జగన్మోహనాకారాన్ని ధరించింది, ఆయన ఆమెతో ఏకమయి సృష్టి లీలలో పాల్గొనాలనే ! తన శరీరాన్నంతటినీ తన భర్తకే అంకితమిచ్చిన మహా పతివ్రత ఆమె. మిగతావారికి ఆమె రేఖామాత్రంగా తోచవచ్చుగానీ, తనను తాను పూర్తిగా ఆవిష్కరించుకోదు. భక్తులకు పరిపూర్ణంగా ప్రసాదించేది ఆమె కరుణను. అందం విషయానికి వస్తే మాత్రం అది తన స్వామి అయిన పరమేశ్వరుని సొత్తు.

మరి ఆచార్యులవారు ముందు శ్లోకాలలో  చేయబోయే అంబిక చిత్రీకరణ ఆమె అందాన్ని పూర్తిగా వర్ణించలేదని అనుకోవాలా ? అయి ఉండవచ్చు. తల్లి తన ప్రియపుత్రునికి ప్రేమను చూపుతుంది. సౌందర్యాన్ని కాదు. తనను అలంకరించుకొంటే అది తన స్వామి కోసం – తనయుని కోసం కాదు. అసలు అంబిక అలంకరించుకోవల్సిన అవసరమే లేదు. అలంకారాలకు అందాన్నిచ్చే సహజసిద్ధమైన సౌందర్యమామెది. ఆ సౌందర్యం ఒక్క పరమేశ్వరునికే తెలుసు. మరి కవులంతా ఎలా వర్ణిస్తున్నారు. అసలు అంబిక యొక్క అన్ని విధములుగా పూర్ణమైన అందపు పుష్కలత్వాన్ని వారెరుగరు. తమకు తెలిసి యత్కించిత్ వర్ణించడానికి తగిన మాటలో పోలికలో లేవు. అదీ ఆమె సౌందర్యపు ఉత్కృష్టత. అందుకే ఆచార్యులవారు అంబిక తన అందాన్ని పరమశివునికి మాత్రమే పూర్తిగా ఆవిష్కరిస్తుందన్న విషయాన్ని సూచించారు. ఎలా ?

“యదాలోకౌత్సుక్యా దమరలలనా యాంతి మనసా
తపోభిర్దుష్ప్రాపమపి గిరిశసాయుజ్య పదవీం."

(సశేషం)

#KanchiParamacharyaVaibhavam #కంచిపరమాచార్యవైభవం
#ParamacharyaSoundaryaLahariBhashyam
3/29/18, 07:38 - Paramacharyulu: గురువు - ఆత్మోద్ధరణ

సద్గురువు లభించడం అంత సులువు కాదు, జన్మ జన్మల తపః ఫలానికి చిహ్నం అది. ఎవరు భగవంతుని చేరుకొనే మార్గాన్ని సుగమం చేయగలరో అతనే నిజమైన గురువు. ఒక్కో ఇంట తండ్రే పిల్లాడికి సద్గురువు, ఒక్కో ఇంట , ఆ ఇంటి ఆడపిల్లను కన్యాదానం చేయడానికి తండ్రి గారు వెతికి మరీ , వేదం నేర్చిన సద్బ్రాహ్మనునికి ఇవ్వడానికే మొగ్గు చూపుతారు. అలాంటి వ్యక్తి దొరికిన పక్షాన వివాహానంతరం భర్తే ఆమెకు గురువు ,అది చాలు ఆ పిల్ల గృహస్థాశ్రమంలోనే తరించిపోవడానికి . గురువు గారిపై పై గల అచంచల నమ్మకమే ఆత్మోద్ధరణకు హేతువు, కలిసొచ్చినంత కాలం నమ్మటం ఒకరకం, కలిసివచ్చినా రాకపోయినా గురువు గారిపై గల విశ్వాసం సడలకపోవడమే నిజమైన శిష్యులకు ఉండాల్సిన లక్షణం. అందుకే భగవంతుడి దగ్గరా గురువు దగ్గరా ఒక పరీక్ష వుంటుంది, వీడు వూంచుకున్న వాడేనా? అని చూడటానికి గురువు గారు రకరకాల పరీక్షలు వెడుతుంటారు, ఒక్కోసారి శిష్యుని పట్ల చాలా నిర్లక్ష్యభావనతో వ్యవహరిస్తుంటారు. అలా ఉండటంలో అంతరార్థం ఏదో వుండే ఉంటుంది ,గురువుగారికి నాపట్ల చాలా ప్రేమ ఉంది , అది ఎప్పటికీ చెక్కుచెదరినిది అని ఎవరైతే నిలబడ గలరో వారే అంతిమంగా గురువుగారి జ్ఞాన సంపదకు, ప్రేమకూ పాత్రులు కాగలరు .

అంతే గాని అస్తమానం శిష్యుడు ఏది అడిగితే అది ఇచ్చిన గురువుగారు మంచివారు, శిష్యుడు ఏదో ప్రతిపాదన చేస్తే వద్దన్న గురువు పనికిమాలినవాడు అని అనుకున్న వాడు ఎలా వృద్ధిలోకి వస్తాడు? వాడు త్రిశంకుడు వలే అవుతాడు.

ఒక్కోసారి గురువుల పరీక్ష చాలా చమత్కారంగా ఉంటుంది. ఒకప్పుడు పరమాచార్య దగ్గరకు ఆయన శిష్యులలో ఒక వ్యక్తి, చాలా బాధపడుతూ వెళ్లాడు, వారి అన్నగారు చనిపోతారని, ఇక ఎక్కువ కాలంఉండరు కొద్ది సమయం మాత్రమే వుందని డాక్టర్లు చెప్పారని వాపోయాడు. మహాస్వామి వారు అలా నిలబడ్డారు, చూడలేదు, కనీసం పలకరించలేదు, మామూలుగా శ్రీవైష్ణవ సంప్రదాయంలో ఒకటి కట్టుదిట్టం గా ఉంటుంది, గురువు గారు చాలు అనేదాక సాష్టాంగ నమస్కారాలు చేయాలి. (మామూలుగా ఐతే గురువుకి నాలుగు సార్లు సాష్టాంగ ప్రణామం చేయాలి)

ఆ వచ్చిన శిష్యుడు నాలుగు మార్లు నమస్కారం చేసి నించున్నాడు. పరమాచార్య వారు "చేస్తూ వుండు అలానే నమస్కారాలు" అని అన్నారు. శిష్యుడు తెల్లబోయాడు, అలా చేస్తూనే వున్నాడు ఒళ్ళంతా చమటలు పట్టేసి, ఎముకల సంధి బంధాలలో నొప్పి వచ్చి ఇక నమస్కారాలు చేయలేక గోడ దగ్గర చతికిల పడిపోయాడు.

పరమాచార్య వచ్చి అన్నారు ,ఇక మీ అన్నయ దగ్గరకు పో అని . (మీ అన్నయ్య కష్టాన్ని నువ్వు నాకు చేసిన నమస్కారం తో తీసివేశాను, మీ అన్నయ్య బ్రతికిపోయాడు పో అని పరామాచార్య నోటితో చెప్పలేదు, శిష్యుడది విననూలేదు)

హాస్పిటల్ కి వెళ్లగానే డాక్టర్లు అన్నారు ,ఏమి ఆశ్చర్యం జరిగిందో మాకుతెలీదు మీ అన్నగారు బ్రతికారు అని.

అపార కరుణాసింధుం జ్ఞానదం శాంతరూపిణం
శ్రీ చంద్రశేఖర గురుం ప్రణమామి ముదావహం ॥

--- "చాగంటి కోటేశ్వరరావు" గారి గోవింద వైభవం ప్రవచనం నుండి

#KanchiParamacharyaVaibhavam #కంచిపరమాచార్యవైభవం
3/29/18, 16:11 - Paramacharyulu: పన్నెండవ శ్లోక భాష్యం - మూడవ భాగం

అమరలలనలు అంటే రంభాది అప్సరసలు. అప్సరసలు ఎంతో అందగత్తెలని చెప్పుకొంటాం. వారు అంబిక అందములను రేఖామాత్రంగా దర్శించి “అరెరె, ఆమె సౌందర్యపు లేశము ముందే మన అందాలన్నీ వెలవెల పోతున్నాయే ! ఆమె సౌందర్యం సంపూర్తిగా ఆవిష్కరించబడితే ఎలా ఉంటుంది.” అని పూర్తిగా సమస్తాలంకారాలతో ఆవిష్కరించబడితే చూడాలని తహతహలాడిపోతున్నారట సహజమే కదా!!

ఏ రంగంలో ఉన్నవారు ఆ రంగంలోని మహోన్నతుల వైశిష్ట్యాన్ని మరింత తెలుసుకోవాలని ఆరాధనా భావంతో ఎదురు చూస్తుంటారు. *యదాలోకౌత్సుక్యాత్* ఆమె సౌందర్యాన్ని తిలకించాలనే ఉత్సుకత వలన – ఇక్కడ *యత్* అనే పదం శ్లోకంలోని మొదటి పదములను సూచిస్తుంది. *త్వదీయం సౌందర్యం*

సరి! అంబిక అందాన్ని సంపూర్తిగా దర్శించాలనే ఆరాటపడే అప్సరసలు ఏం చేస్తారు ? అంబిక తన అందాన్నంతా తన స్వామి అయిన పరమేశ్వరునికే అర్పించేసింది. ఆయన ఒక్కడే ఆ సౌందర్యాన్ని చూడగలడు. కాబట్టి మనం శివునితో ఐక్యమైపోతే అంబిక అందాన్ని, ఆ జగన్మోహనమైన సౌందర్యాన్ని దర్శించగలము అనుకున్నారట ఆ అప్సరలు

భక్తులు, జ్ఞానులు కూడా శివ సాయుజ్యం కోసం ప్రార్థిస్తారు. భక్తులు భక్తివలన, జ్ఞానులు తమ జ్ఞాన తీవ్రతలో తామే శివులవ్వాలని ఎంతో ప్రయత్నం చేస్తారు. శివసాయుజ్యం. సిద్ధించిదంటే ఇక పొందదగినది ఏది లేదు. అదే తురియమైనది. ఈ అప్సరసలకు అలా కాదట. అంబిక సౌందర్యాన్ని సంపూర్తిగా దర్శించగలగడానికి వీరు శివసాయుజ్యం కోరుకుంటున్నారట.

శివసాయుజ్యం అంత తేలికగా పొందబడుతుందా ? రంభాది అప్సరసలకు కోరినంత మాత్రమే చిక్కుతుందా ? *తపోభిర్దుష్ప్రాపామపి అంటారు ఆచార్యులవారు. తీవ్రమైన తపస్సువలన కూడా పొందడం సాధ్యం కానిది.

ఈ అప్సరసలు అలా తపస్సు చేసేవారికి ఆటంకం కలిగిస్తుంటారు. వీరి వల్ల ఇంద్రియాలని అదుపులో పెట్టుకోవడం, వాసనలు, కోర్కెలను అధిగమించడం సాధ్యమా ? దానికేమి ! మనం ఇక్కడ కూర్చుని భారతదేశ ప్రధాని అయినట్లు ఊహించుకోవచ్చు. గాలిలో మేడలు కట్టవచ్చు. రంభ, మేనక వంటివారు తమను పరమేశ్వరునిగా ఊహించుకొంటున్నారట.

యాంతి మనసా గిరిశ సాయుజ్యపదవీం మానసికంగా శివపదాన్ని పొందుతున్నారు. నిజానికి శివసాయుజ్యం మనస్సుతో పొందబడేది కాదు.

“యన్మనసా నమనుతే” (కేనోపనిషత్తు) – మనసుతో ఊహించలేనిది. మరి అప్సరసలు మనసుతో గిరిశ సాయుజ్య పదవిని పొందాలంటే – అటువంటి సాయుజ్యాన్ని పొంది అంబిక సౌందర్యాన్ని సంపూర్తిగా దర్శించాలనే ఆకాంక్ష ఉన్నా విఫలులైనారని అర్థం.

శ్లోకంలోని ప్రథమార్థంలో బ్రహ్మాదులైన కవులు అంబిక సౌందర్యానికి పోలికకై వెతికి ఎలాగోలా కల్పించారనటానికి వారు సరైన పోలికను పట్టుకోలేకపోయారన్నది అంతరార్థం - వారు అంబిక సౌందర్యానికి ఉపమానం వెతుకడంలో విఫలులైపోయారన్నమాట. ఉత్కృష్టమైన తపస్సువలన కూడా పొందడానికి దుస్సాధ్యమైన శివసాయుజ్యాన్ని, మనస్సుతో పొందలేని దానిని మేనకాదులు మనస్సుతో పొందడానికి ప్రయత్నించారంటే వారు ఆ ప్రయత్నంలో విఫలురయ్యారనే కదా అర్థం. ఆచార్యులవారిది జాలిగుండె ! బ్రహ్మాదులు, అమరలలనలు వారి ప్రయత్నాలలో విఫలురయ్యారని నేరుగా చెప్పడానికి వారికి మనస్కరించలేదు.

“ఆనందలహరి” భాగంలోని ఈ శ్లోకం అంబిక సౌందర్యాన్ని అందుకోలేని ఎత్తులకు తీసుకొని వెళ్ళింది.

(సశేషం)

#KanchiParamacharyaVaibhavam #కంచిపరమాచార్యవైభవం
#ParamacharyaSoundaryaLahariBhashyam
3/29/18, 19:46 - Paramacharyulu: <Media omitted>
3/30/18, 07:46 - Paramacharyulu: చిరిగిన చీర

పరమాచార్య స్వామివారు ఆంధ్రదేశంలో మకాం చేస్తున్నప్పుడు కామాక్షి అమ్మవారికి ప్రత్యేక పూజ చెయ్యాలని తలచి పూజకు కావాల్సినవన్నీ సిద్ధం చేశారు. శ్రీకార్యం వ్యక్తులు కామాక్షి అమ్మవారిని చక్కగా అలంకరించారు.
మహాస్వామి వారు ఇక పూజ మొదలుపెట్టబోతూ, కామాక్షి అమ్మవారికి కట్టిన చీర మోకాలు వద్ద కొద్దిగా చినిగి ఉండడం గమనించారు. అమ్మవారికి కట్టిన చీర మార్చకుండా అలాగే పూజ కొనసాగించాలని నిశ్చయించుకున్నారు స్వామివారు. పూజ చాలా అద్భుతంగా జరుగుతోంది. ఆ పూజను తిలకించడానికి భక్తులు పెద్ద ఎత్తున వచ్చారు.

హఠాత్తుగా, చాలా చోట్ల చినిగి ఉన్న వస్త్రం ధరించిన ఒక భిక్షకురాలు పరిగెత్తుకుంటూ వచ్చి ఒక చీర, తినడానికి కాస్త ఆహారం కావాలని అడిగింది. ఆమె పరమాచార్య స్వామివారిని సమీపించకుండా అక్కడున్న వారందరూ అడ్డుపడుతున్నారు. కాని మహాస్వామివారు ఆమెని అడ్డగించవద్దని తన వద్దకు రానీయమని ఆదేశించారు. కరుణాసాగరుడు స్వామివారు ఆమెకేం కావాలని అడిగారు. తన దగ్గర ఈ చినిగిపోయిన చీర మాత్రమే ఉన్నదని, కావున ఒక మంచి చీరను ఇప్పించమని వేడుకుంది. ఒక మంచి చీర, పళ్ళు, ప్రసాదం ఒక పళ్ళెంలో తీసుకొనిరమ్మని పరమాచార్య స్వామివారు శ్రీకార్యాన్ని ఆదేశించారు. స్వామివారి ఆదేశానుసారం వారు అలాగే తీసుకునివచ్చి ఆమెకు అందించారు.

స్వామివారు నవ్వుతూ ఆమెని బావుండమని ఆశీర్వదించారు. ఆమె ఆ పళ్ళాన్ని తీసుకుని రోడ్డువైపుకు వెళ్ళింది. ఇలాంటి వారు ఆ చీరను డబ్బుకోసం అమ్ముకుంటారని తలచి శ్రీకార్యం వ్యక్తి ఒకరు ఆమెను అనుగమించి వెళ్ళారు. ఆమెకు, మహాస్వామి వారికి తెలియకుండా అతను ఆమెని వెంబడిస్తున్నాడు.

ఆమె రోడ్డును దాటి ఒక దేవాలయంలోకి ప్రవేశిస్తుండగా, ఎవరో ఇతణ్ణి గట్టిగా చరచడంతో మూర్ఛవచ్చి నేలపై పడిపోయాడు. ఆమె ఆలయం లోపలికి వెళ్ళి అదృశ్యమైపోయింది. దారిన వేళ్తున్న వారి సహాయంతో పూజామండపానికి తిరిగొచ్చాడు. ఈ సంఘటనను మహాస్వామివారికి చెప్పడానికి అతను చాలా భయపడ్డాడు. ఎవరూ ఏమీ చెప్పకుండానే మహాస్వామివారికి అంతా తెలుసు. అతణ్ణి నిలదీయడంతో తను కళ్ళు తిరిగి పడిపోయేదాకా జరిగిన విషయం మొత్తం చెప్పాడు. తను చేసిన పనికి క్షమించవలసిందిగా వేడుకున్నాడు.

అమ్మవారికి చిరిగిపోయిన చీర కట్టారని, అందుకే అమ్మవారు చిన్న లీల చేయదలచి ఇలా చేసిందని తెలిపారు. నిజమైన భక్తుణ్ణి కరుణించడానికి అమ్మవారు ఎంత కిందకైనా దిగి రాగలదు. అలాగే పరమాచార్య స్వామివారు కూడా, ఎందుకంటే అమ్మవారే పరమాచార్య స్వామి కాబట్టి.

అపార కరుణాసింధుం జ్ఞానదం శాంతరూపిణం
శ్రీ చంద్రశేఖర గురుం ప్రణమామి ముదావహం ॥

--- శ్రీ ఇంద్రా సౌందరరాజన్, కంచియిన్ కరుణై కడల్

#KanchiParamacharyaVaibhavam #కంచిపరమాచార్యవైభవం
3/30/18, 13:17 - Paramacharyulu: <Media omitted>
3/30/18, 17:48 - Paramacharyulu: పదమూడు, పధ్నాలుగు శ్లోకాల భాష్యం

13వ శ్లోకం:

నరం వర్షీయాంసం నయనవిరసం నర్మసు జడం
తవాపాఙ్గాలోకే పతిత మనుధావంతి శతశః
గలద్వేణీ బంధాః కుచకలశ విస్రస్త సిచయాః
హఠాత్త్రుత్య త్కాంచ్యో విగళిత దుకూలా యువతయః

(తల్లీ! నీ క్రీగంటి చూపుపడిన మానవుడు, అతడు కురూపియైనా, ముదుసలి అయినా, సరసమెరుగని వాడయినా, యువతులు మహా మోహముతో కొప్పులు వీడిపోవగా, పైట చెంగులు జారిపోవగా, గజ్జెలమొలనూళ్ళు తెగిపోవగా, వలువలూడిపోవగా అతని వెంటపడతారు.)

(మహాస్వామి వారీ శ్లోకమునకు వ్యాఖ్యానము చేయలేదు.)

14వ శ్లోకం:

క్షితౌ షట్పఞ్చాశ ద్ద్విసమధిక పఞ్చాశదుదకే
హుతాశే ద్వాషష్టి శ్చతురధిక పఞ్చాశదనిలే
దివి ద్విష్షట్త్రింశ న్మనసి చ చతుష్షష్టి రితి యే
మయూఖాస్తేషా మప్యుపరి తవపాదాంబుజ యుగం.

(మూలాధారము పృథ్వీతత్త్వముతో కూడినది. అందు కాంతి కిరణములు యాభైయ్యారు. మణిపూరకము జలతాత్త్వముతో కూడినది. అందు కాంతి కిరణములు డెబ్బైరెండు. స్వాధిష్ఠానము అగ్నితత్త్వాత్మకము. అందు కిరణములు అరవై రెండు. అనాహతము వాయుతత్త్వాత్మకము, అందు కిరణములు యాభైనాలుగు. విశుద్ధిచక్రము ఆకాశతత్త్వాత్మకము. అందలి మయూఖములు దెబ్బైరెండు. మనస్తత్త్వాత్మకమగు ఆజ్ఞాచక్రమునందు కిరణములు అరవై నాలుగు. అమ్మా! నీ పదపద్మ యుగళము ఈ కాంతులన్నిటి పైన ఉన్నది.)

(యోగశాస్త్రములోనికి లోతుగా వెళ్ళనని ముందే చెప్పిన మహాస్వామివారు ఈ శ్లోకము పైన పూర్తి వ్యాఖ్యానము చేయలేదు. అయితే అంబికను కాలస్వరూపిణిగా ఒక విలక్షణమైన వ్యాఖ్యానము చేస్తున్నారు.)

ఈ శ్లోకంలో అంబిక కాలస్వరూపిణిగా అభివర్ణించబడింది. “క్షితౌ షట్పఞ్చాశద్ – ద్విసమధిక – పఞ్చాశదుదకే” సంవత్సరముకున్న 360 రోజులు ఆరు ఋతువులుగా ఉన్నాయి. కుండలిని నుండి బహిర్గతమవుతున్న 360 కిరణములుగా ఈ 360 రోజులు చెప్పబడినాయి. ఒక్కొక్క చక్రము ఒక ఋతువును చెప్పుతున్నది. ఆ ఋతువులో ఎన్ని దినాలుంటాయో ఆ చక్రమున ఉన్న కిరణములు సూచిస్తున్నాయి.

క్షితౌ షట్పఞ్చాశత్ – భూమికి ప్రాతినిధ్యం వహించే మూలాధార చక్రములో యాభై ఆరు దినములు వసంత ఋతువుగా ఉంతున్నది. ఆ రకంగా ప్రతిచక్రము దినములు దానికి సంబంధించిన ఋతువు ఈ శ్లోకమున చెప్పబడింది.

అంబిక తాను వివిధ ఋతువులలో కాలంగా కుంచించుకొని కాలంగా అభివ్యక్తీకరించుకొంటోంది. నిజానికి ఆమె కాలాతీతురాలు. కాలాతీత

స్థితిలో ఆరు చక్రములకు ఉన్నతమైన సహస్రార చక్రంలో వసిస్తుంది. ఆమె పాదపద్మములు గురుపద పదమము వలె ప్రకాశిస్తాయి. "మయూఖాస్తేషామప్యుపరి తవ పాదాంబుజయుగం" – మయూఖమంటే కాంతికిరణము. కాంతి కిరణరూపంలోని ఒక దినము. అంబిక 360 రోజులకు అతీతమైనది. "తేషామప్యుపరి" అంటే సహస్రార పద్మంలో "తవ పాదాంబుజయుగం" నీ పదపద్మము యుగము.

(సశేషం)

#KanchiParamacharyaVaibhavam #కంచిపరమాచార్యవైభవం
#ParamacharyaSoundaryaLahariBhashyam
3/31/18, 08:07 - Paramacharyulu: గురువు - జగద్గురువు

ప్రముఖ ప్రవచనకారునిగా సామవేదం షణ్ముఖ శర్మ గారు చాలామందికి సుపరిచితులు. ఫాలభాగాన మూడు విభూతి రేఖలు ధరియించిన ప్రసన్న వదనం, శ్రీరామ చంద్రమూర్తిలో ఉన్న కారుణ్యాన్నంతటినీ పుణికిపుచ్చుకున్నారా? అన్నట్లు భాసించే పరమశాంత స్వభావి, సౌమ్యులు. పరమేశ్వరుని కోసం నాలుగు మాటలు చెప్పడంలో ఉండే పరమానందాన్ని అనుభవించి, ఈశ్వరుడు ప్రసాదించిన ప్రతి ఊపిరినీ, మాటగా మార్చి తిరిగి ఆయనకే సవినయంగా అప్పచెప్పే ప్రవచనకారునిగా స్థిరపడక ముందు, ప్రముఖ పత్రిక స్వాతిలో ఓ విభాగానికి వ్యాసకర్తగా వ్యవహరించేవారు.

అప్పటి స్వాతి ఎడిటర్ శర్మ గారిని "నడిచే దేవుడు" గా పేరుగాంచిన శ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతీ మహా స్వామి వారి మీద ఒక వ్యాసం వ్రాయమని చెప్పారు. దానిలో భాగంగా శర్మ గారు మహాస్వామి వారికోసం అనేక విషయాలు సేకరించి ఓ వ్యాసాన్ని తయారు చేశారు. దానికి పేరు ఏం పెడదాం అని ఆలోచిస్తూ "ప్రత్యక్ష పరమేశ్వరుడు" అని పెడదాం, అదే సరైనది అని భావించి నిర్ధారించినప్పటికీ మనసులో ఏదో మూల చిన్న శంక, కాంచీ క్షేత్రం లో కనిపించే కామాక్షిగా వెలుగొందుతున్న స్వామి వారికి ఈ శీర్షిక నప్పుతుందా అని!

ఇలా సందిగ్ధంలో ఉండగా శర్మ గారికి ఒకనాడు స్వప్నం లో చేతిలో త్రిశూలం, మెడలో నాగేంద్ర హారం తో జటాజూటధారియైన పరమేశ్వరుడు దూరం నుండి తనను సమీపిస్తున్నట్లు, చేరువగా వచ్చిన సమయాన చేతిలో ఉన్న త్రిశూలం మంత్ర దండంగా , ఫాలభాగపు మూడవ నేత్రం మూడు విభూతిరేఖలు గా రూపాంతరం చెందటం లీలామాత్రంగా గోచరించింది. అంతే, స్వామి వారే అపరశివావతారులు అని నిర్ధారించినట్లు అయ్యింది, అదే పేరును ఖరారు చేశారు.

ఆవిధంగా స్వామి వారితో షణ్ముఖ శర్మ గారికి ఏర్పడిన అనుబంధం, కాలక్రమములో స్వామివారికి మహాభక్తున్ని చేసింది.

షణ్ముఖ శర్మగారు చిన్ననాటి నుండే శివభక్తులు, ఆయన పదమూడవ యేటనే "శివపదం" పేరున అనేక కీర్తనలు రచించి" శ్రీశైల ప్రభ"అనే పత్రికకు ఇస్తుండేవారు. వారు వృత్తి రీత్యా సినిమాలో పాటల రచయితగా స్థిరపడవచ్చునన్న ఉద్దేశ్యంలో కొన్ని రోజులు చెన్నైలో ఉన్నారు, ఆ సమయంలో ఓ రోజు ఆయనకు కాంచీపురం వెళ్లి స్వామివారికి తాను వ్రాసిన కీర్తనలు చూపించాలని అనిపించింది.

అనుకున్నదే తడవుగా కంచి చేరుకొని, చేతిలో కీర్తనల తాలుకా కాగితాలు పట్టుకొని స్వామివారి దర్శనార్థమై క్యూ లో నిల్చున్నారు. అంతలో శిష్యు డొకరు అతని దగ్గరకు వచ్చి షణ్ముఖ శర్మ గారంటే మీరేనా ? మీరేవో కాగితాలు తెచ్చారంట కదా ? స్వామి వారు ఇమ్మన్నారు అని చెప్పి తీసుకు వెళ్లారు, మహా స్వామి వాటిని పరిశీలించి , తన స్వహస్తాలతో వాటి మీద అక్షితలు చల్లి వాని చేతికిచ్చారు. అంతే అప్పటి వరకూ, తీరిక సమయంలో మాత్రమే పరమేశ్వరుని కోసం చెప్పు కొని ఆనందపడదాం అనుకున్న వ్యక్తి ఆయనే తన వృత్తి ,వ్యా పకం, శ్వాసగా జీవిస్తున్నారు. ఈశ్వరుని కోసం అనేక ప్రవచనాలు చేశారు. ఇదంతా పరమాచార్య వారి అనుగ్రహమే అని అనేక ప్రవచనాల్లో ఉటంకించారు.

అపార కరుణాసింధుం జ్ఞానదం శాంతరూపిణం
శ్రీ చంద్రశేఖర గురుం ప్రణమామి ముదావహం ॥

#KanchiParamacharyaVaibhavam #కంచిపరమాచార్యవైభవం
3/31/18, 16:29 - Paramacharyulu: పదిహేనవ శ్లోక భాష్యం - మొదటి భాగం

శరజ్జ్యోత్స్నా శుద్ధాం శశియుత జటాజూట మకుటాం
వరత్రాసత్రాణ స్ఫటిక ఘుటికా పుస్తక కరాం!
సకృన్నత్వానత్వా కథమివ సతాం సన్నిదధతే
మధుక్షీర ద్రాక్షా మధురి మధురీణాః ఫణితయః!!

(తల్లీ శరత్కాలపు వెన్నెలవలె శుద్ధమైన తెల్లని కాంతి కలిగినట్టి, చంద్రునితో కూడిన జటాజూటమే కిరీటముగా కలిగినట్టి, వరదాభయ ముద్రలను, స్ఫటిక మాలా పుస్తకములను నాలుగు చేతులలో ధరించి ఉన్న నీకు ఒకసారైనా నమస్కరించక సజ్జనులు (కవులు) తేనె, పాలు, ద్రాక్ష పళ్ళయొక్క మాధుర్యము నిండి యున్న వాగ్వైఖరులను ఎట్లు పొందగలరు.)

ఆనందలహరిలో కొన్ని శ్లోకములలో ఆచార్యులవారు అంబిక తనదైన లలితా స్వరూపంలోనే కాక శ్రీవిద్యా తంత్రమునకు సంబంధించిన ఇతర దేవతా స్వరూపాలలో కూడా అనుగ్రహం చేయడం చూపారు. అంబిక ఇక్కడ వీణ ధరించిన వాగ్దేవీ రూపంలో చూపబడుతోంది. వాగ్దేవి అంటే సరస్వతీదేవి. అంబిక నారాయణ సహోదరి అని చెప్పబడినట్లుగానే లక్ష్మీదేవి బ్రహ్మసోదరి అనీ, సరస్వతీదేవి శివుని చెల్లెలనీ ప్రస్తుతించబడినారు. అన్నా చెల్లెళ్ళకు పోలికలుండటం సహజం కదా! సరస్వతి కూడా శివుని వలె తెల్లటి తెలుపు. ఆయనవలనే

ఈమెకూడా జటాజూటమే కిరీటంగా ఉంచుకొని, దానిపై ఒక చంద్రరేఖ కూడా ధరించింది.

“శరజ్జ్యోత్స్నా శుద్ధాం” – శరత్కాలపు వెన్నెలవలె ప్రకాశవంతమైన మేనుగలది ఆ తల్లి. అందువల్లనే ఆమెకు శారద అన్న పేరు. శరత్కాలంలోనే మనం సరస్వతీ పూజ చేస్తాం. అద్వైతం సుప్రతిష్ఠితం చేయడానికి అవతారమెత్తిన ఆచార్యులవారికి తమ భాష్య నిర్మాణంలో, స్తోత్రాదులు చేయడంలో వివిధ వాదనలలో సరస్వతీ కటాక్షం ఎంతో ముఖ్యమైనది. సరస్వతీ దేవి పలునామాలలో "శారద" అనే పేరంటే వారికి ఎంతో మక్కువేమో అనిపిస్తుంది. ఆ నామం సూచించే నిర్మలత్వం, ఆహ్లాదకరమైన చల్లదనం, తెల్లటి కాంతి దానికి కారణం కావచ్చు. ఉత్తరాది వారు శారదను “సారద”గా ఉచ్చరిస్తారు. “శ”, “స” లు ప్రతిక్షేపనీయాలు. సార-ద అంటే లోతైన సారాన్ని ప్రసాదించేది అని అర్థం వస్తుంది. జ్ఞానమే కదా వాఙ్మయ సారము! ఆమె జ్ఞాన ప్రదాత. ఆచార్యులవారికి ఈ పేరు నచ్చడానికి కారణం ఇదేనేమో! శృంగేరిలో అంబిక శారదా రూపంలో ప్రతిష్ఠించబడింది. ద్వారక శృంగేరీ పీఠములు శారదా పీఠములు. మన మఠము శారదా మఠము. అంబిక యొక్క లలితాది వివిధ నామాములు సౌందర్యలహరిలో ఎక్కడా ప్రస్తావించబడలేదు. అలాగే ఈ శరదా నామం కూడా ఎక్కడా ప్రస్తావించబడక పోయినప్పటికీ “శరజ్జ్యోత్స్నా శుద్ధాం” అన్న పదం శారదా నామమును స్ఫురింపజేస్తోంది. ఈ వాగ్దేవికి ఈశ్వరునివలె శుద్ధ ధవళకాంతులలో ప్రకాశిస్తుంది. ఆయనకు మల్లెనే జటాజూటం దానిపైన చంద్రవంక ధరించిందని చెప్పుకొన్నాం కదా! అసలే వెన్నెల వలె ప్రకాశవంతమైన మేనుగల ఆ తల్లి తలపై పెట్టుకొన్న చంద్రుని మూలంగా మరింత కాంతులీనుతోంది. “శశియుత జటాజూట మకుటం”.

ఆమె నాలుగు చేతులు కలట్టిది. రెండు చేతుల వరదాభయముద్రలను చూపుతున్నాయి. అభయ ముద్రను చెప్పడానికి “త్రాసత్రాణ” అనే పదం వాడబడింది. అంటే భయం నుండి రక్షించేది. అభయము. ఆచార్యులవారు పూర్వమున శ్లోకంలో “నీవు తప్ప ఇతర దేవతలందరూ వరదాభయ ముద్రలు కలిగి ఉన్నారు. నీ పాదములే వాటిని ప్రసాదిస్తాయి కాబట్టి వాటిని నీవు ప్రత్యేకంగా ధరించే అవసరం లేదు” అంటూ చెప్పుకొచ్చారు కదా! ఇక్కడ అంబికను లలితాంబ కంటే భిన్నమైన సరస్వతీ సంబంధమైన మూర్తిగా ప్రార్థిస్తూ, ఆమె వీణ, చిలుక కాక వరదాభయ ముద్రలు పట్టినట్లుగా వర్ణిస్తున్నారు. మిగతా రెండు చేతులతో సరస్వతీ లక్షణములైన స్ఫటికమాల, పుస్తకము ధరించినది. సరస్వతీ సోదరుడైన కూడా తన దక్షిణామూర్తి రూపంలో అక్షమాలా పుస్తకములను ధరించాడు. కదా! “స్ఫటిక ఘటికా పుస్తక కరాం” స్ఫటిక ఘుటిక అంటే అక్షమాల. “అ” నుండి “క్ష” పర్యంతమున్న అక్షరములు ఒక్కొక్కటి ఒక్కొక్క పూసగా అక్షమాల అయింది.

(సశేషం)

#KanchiParamacharyaVaibhavam #కంచిపరమాచార్యవైభవం
#ParamacharyaSoundaryaLahariBhashyam
4/1/18, 07:43 - Paramacharyulu: మద్రాస్ - 80 ఏది?

1980 లో లూకాస్ టివియస్ లో పనిచేస్తున్న నేనూ నా సహోద్యోగులు కొందరము కలిసి అధికారిక పర్యటనకై అహ్మద్ నగర్ వెళ్ళాము. అక్కడ మేము ఒక నాలుగు రోజుల పాటు ఉన్నాము. గురువారం రోజు శిరిడి దర్శించుకున్నాము. ఒకరోజు ముందుగానే మా పని అయిపోవడం వల్ల స్నేహితులందరూ విహారార్థమై బాంబే వెళ్ళారు. నేను మాత్రం పూణెలోనే ఉండిపోయాను.

సతారాలోని ఋగ్వేద పాఠశాలలో పరమాచార్యస్వామి వారు మకాం చేశారని నాకు తెలిసింది. పూణె నుండి నాలుగు గంటల ప్రయాణం కావడంతో నేను ఉదయాన్నే సతారాకు బయలుదేరాను. స్వామివారి దర్శనానికి కేవలం ముగ్గురు నలుగురు మాత్రమే ఉన్నారు. స్వామివారి శిష్యులు శ్రీ శ్రీకంతన్ ఇంకొకరు బహుశా శ్రీ వేదపురి శాస్త్రి అనుకుంటా ఉన్నారు.

నా వంతురాగానే మహాస్వామివారితో, “కార్యాలయం పనిమీద అహ్మద్ నగర్ వచ్చాను. మహాస్వామివారు సతారాలో ఉన్నారని తెలిసి మీ దర్శనం కోసం ఇక్కడకు వచ్చాను” అని చెప్పాను. కొద్ది క్షణాలు మౌనంగా ఉండి నా కళ్ళల్లోకి కళ్ళు పెట్టి సూటిగా చూశారు. వారు అలా చూడడంతో నాకళ్ళల్లోకి లేజర్ కిరణాలు దూసుకెళ్తున్న భావన కలిగింది. ఇక వారికళ్ళల్లోకి చూసే శక్తి లేక తలవంచుకున్నాను. కళ్ళనుండి నీటి ధారలు . . .

”మద్రాస్ - 80 ఏది?” అని ఆ సర్వేశ్వరుడు అడిగారు.

చాలాసేపు తీవ్రంగా అలోచించి, గుర్తురాక నాకు తెలియదని చెప్పాను. మహాస్వామివారు ఇతర భక్తులవైపు తిరిగి అందరికి దర్శనం ఇచ్చిన తరువాత కిటికీలను మూసివేసి విశ్రాంతికై లోపలికి వెళ్ళిపోయారు. నేను మద్రాస్ తిరిగొచ్చిన తరువాత మద్రాస్ - 80 ఎక్కడుందని పెద్ద వేట మొదలుపెట్టాను. డైరీలు, పిన్ కోడ్ లు, తపాలా కార్యాలయాలు, రెండు వారాలపాటు ఎక్కడ వెతికినా లభించలేదు. ఒకరోజు సాయింత్రం ఆఫీసులో నా సహోద్యోగిని అడుగగా, “మణి నీకు ఈ విషయం తెలియదా? నేను నివసించే కొరట్టూరే మద్రాస్ - 80” అని చెప్పాడు.

ఇక్కడ మరొక ఆశ్చర్యకరమైన విషయం ఏంటంటే, నేను దాదాపు పదహారు సంవత్సరాలు పనిచేసిన లూకాస్ టివియస్ కి ఈ మద్రాస్ - 80 పక్కనే ఉంది. కాని నాకు ఆ విషయమే తెలియదు. నన్ను అహంకార రహితుడుగా వినయవిధేయతలతో ఉండమని మహాస్వామివారు ఇలా ఉపదేశించారు.

ఆరునెలలు గడిచిపోయాయి. 1981 లో అన్నానగర్, కోరట్టూర్, అశోక్ నగర్, కెకె నగర్ లో తమిళనాడు ప్రభుత్వం వారు నిర్మించిన HIG ఫ్లాట్స్ కోసం ధరఖాస్తు చేసుకున్నాను. అలా లాటరీ పద్ధతిలో నాకు ఎక్కడ లభించిందో తెలుసా? కోరట్టూర్ అదే మద్రాస్ - 80 లోనే!!

పరమాచార్య స్వామివారు మద్రాస్ - 80 ని నాకు శాశ్వత చిరునామాగా మార్చారు.

అపార కరుణాసింధుం జ్ఞానదం శాంతరూపిణం
శ్రీ చంద్రశేఖర గురుం ప్రణమామి ముదావహం ॥

--- శ్రీ వి. మణి

#KanchiParamacharyaVaibhavam #కంచిపరమాచార్యవైభవం
4/1/18, 16:06 - Paramacharyulu: పదిహేనవ శ్లోక భాష్యం - రెండవ భాగం

ఇక్కడ శాక్త విధానమునకు ఆయువుపట్టయిన విషయం ముచ్చటించుకోవలసి వున్నది. శాక్తేయంలో అక్షరములకు, అక్షరములకు మూలమైన శబ్దములకు ఎంతో ప్రాధాన్యత ఈయబడింది. సృష్టి స్పందనల కారణంగా జనించింది. ఆ స్పందనలు సూక్ష్మరూపంలో ఆకాశము నందు శబ్దములుగా ఉన్నాయి. శబ్దమే సృష్టికి, వేదములకు, మంత్రములకు మూలము. అది ఆకాశపు సూక్ష్మశక్తి. తన్మాత్ర. ఈ సృష్టి విస్తరించడం తిరిగి మూలంలో లయమవడం శాక్తవ్యవస్థలో ప్రధానమైనవి.

ఈ జగత్తు వస్తు లేక అర్థ ప్రపంచంగానూ, శబ్ద ప్రపంచంగానూ, రెండు విధాలుగా చెప్పబడింది. వస్తు జగత్తుకు పరబ్రహ్మ నుండి భౌతిక ప్రపంచం వరకూ ఏర్పడడానికి కారణములుగా శివ, శక్తి, సదా శివ, ఈశ్వర శుద్ధ విద్యలుగా ఒక వంక చెప్పబడినాయి. మరో వంక శబ్ద ప్రపంచానికి పరా, పశ్యంతీ, మధ్యమా, వైఖరీ, వర్ణములు కారణములుగా చెప్పబడినాయి. శబ్ద ప్రపంచ విషయంలో చెప్పబడిన ఈ అయిదు తత్త్వములు అర్థ ప్రపంచంలో చెప్పబడిన అయిదు తత్త్వములకు సమానమైనవి.

పరా శబ్దము సూక్షతమమైనది. మనుష్యులకు వినిపించేది కాదు. స్పందరహితము. స్పందము ప్రారంభమయి విభాగము కలుగని స్థితి పశ్యంతి. ఇది పరా శబ్దం కంటే స్థూలమైనదే అయినా సూక్ష్మతరమైనది. పశ్యంతి అంటే "చూచెడిది" అన్న అర్థం. సూక్ష్మతరమైన ఈ పశ్యంతికీ, మానవుడు చేయగల శబ్దమునకు మధ్యలో ఇంకొక సూక్ష్మ శబ్దమున్నది. దీనికి "మధ్యమా" అని పేరు. మధ్యమ మానవుని ప్రయత్నంలో కాక తనంతట తాను ఉద్భవించినది. పశ్యంతీ శబ్దము మనో రూపము శబ్దార్థ రూపమున అభివ్యక్తమైన స్థితి మధ్యమ. దీనికి అనాహత శబ్దమని పేరు. ఆహత మంటే "కొట్టుట" "తాకుట" అన్న అర్థం. అనాహతం కొట్టబడినది. తాకబడినది.

అయితే మనం మాట్లాడే మాటలన్నీ దేనినో కొట్టడం వలన ఉద్భవిస్తున్నాయా? మనం మాట్లాడే మాటే కాదు – సంగీత వాయిద్యాలతో సహా మనం వినే అన్ని శబ్దములు ఏదో ఒక రకమైన సంఘటన కారణంగానే ఉద్భవిస్తున్నాయి. ఇటువంటి ఆహతమైన శబ్దము వైఖరీ రూపమైన శబ్దము. ఇది మనం నోటితో చేసే శబ్దం. ఈ వైఖరీ రూపము శబ్దము. ఇది మనం నోటితో చేసే శబ్దం. ఈ వైఖరిని రెండు రకాలుగా విభజించవచ్చు. ఒకటి ధ్వని. అర్థ స్ఫోరకము కాని శబ్దము. పిల్లవాడు చేసే ధ్వనులు, అక్షరములు సరిగా తెలియక అతుక్కుపోయినట్లుంటాయి. పెద్దవాళ్ళు కూడా నవ్వేటప్పుడో, ఏడ్చేటప్పుడో ఇటువంటి ధ్వనులను చేస్తుంటరు. అర్థంతో కూడిన శబ్దము – అర్థవద్ధ్వని వర్ణము అని పిలవబడుతోంది. దీనిని అయిదో వర్ణంగా చెబుతారు. వైఖరీ రూపమైన ఈ శబ్దంలో 51 అక్షరములున్నాయి. "పర" నుండి "వైఖరీ" రూపమైన శబ్దములో నున్న రెండు విభాగములతో కూడి మొత్తము శబ్దతత్త్వములున్నాయి. అర్థప్రపంచంలోని వస్తుజాలమంతా శబ్ద స్పందనల వలననే జనించింది. కాబట్టి శబ్ద తత్త్వములే ముఖ్యమైనవిగా ఎంచబడతాయి. స్థూల ప్రపంచంలోని వస్తువులను మనం పదార్థాలు అంటున్నాం. పదము శబ్ద ప్రపంచ సంబంధి. ఆ పదము యొక్క అర్థము లేక స్థూలరూపము ఈ పదార్థమన్న మాట.

అంబిక మూలాధారంలో పృథ్వీరూపంలో నివసిస్తుంది. పృథ్వీరూపం స్థూలమైనది. మూలాధారమునకు పైన ఉన్న చక్రములలో అంబిక అంతకంతకూ సూక్ష్మరూపములైన జల, అగ్ని, వాయు, ఆకాశ రూపాల్లో వసిస్తోంది. అంటే చక్రంలో (కంఠం) సూక్ష్మతమమైన ఆకాశతత్త్వంలో ఉంటుంది. దీనికి వ్యతిరేకంగా మూలాధారంలో అంబిక శబ్ద రూపములలో సూక్ష్మతమమైన పరతత్త్వంలో ఉంటుంది. స్థూలమైన వైఖరీ రూపంలో విశుద్ధి చక్రంలో ఉంటుంది. అంబిక తన మాయాశక్తి విలాసంతో చేసే అద్భుతాలలో ఇది ఒకటి.

(సశేషం)

#KanchiParamacharyaVaibhavam #కంచిపరమాచార్యవైభవం
#ParamacharyaSoundaryaLahariBhashyam
4/2/18, 09:41 - Paramacharyulu: దక్షిణమును చూచెడి రాజులు

సాధారణముగా ఆలయములలోని మూలవిగ్రహములు ప్రాగ్దిశాభిముఖములై యుండును. శివాలయములుగానీ, విష్ణ్వాలయములుగానీ - అనేకము లీ తరగతిలోనివే. కొలది ఆలయములలో మాత్రము స్వామి పశ్చిమాభిముఖుడై యుండును. ఇట్టి సన్నిధులున్న చోట కనీసము గోపురములైనను ప్రాగ్దిశాభిముఖములుగ కట్టుదురు. మైలాపూరులోని కపాలీశ్వరుని గుడి ఇట్టిదే. కాంచీపురమునందలి దైవరాజపెరుమాళ్లు - వరదరాజ పెరుమాళ్ళ సన్నిధియు నిట్టిదే. పెరుమాళ్లు పశ్చిమదిశను చూచుచుండును. గోపురము తూర్పుదిశలో మహోన్నతముగా కట్టబడినది.

సాధారణముగా జనుల పరిభాషలో స్వామి యనగా భగవానుడని యర్థము. కాని వైష్ణవ సంప్రదాయముస్వామి శబ్దము పూజ్యులగు పెద్దలనుగూర్చి చెప్పునప్పుడు మాత్రము వాడుకచేయుదురు. వారు దేవుని పెరుమాళ్లు అని వ్యవహరింతురు. స్మార్తులు వైష్ణవులను చూచినతోడనే పెరుమాళ్ళువచ్చినారని అందురు. వైష్ణవులు మరొకవైష్ణవుని రాకనుగూర్చి స్వామి వచ్చినారనియే చెప్పుదురు. వారు పెరుమాళ్ళను స్వామియని చెప్పరు. సకలవర్ణస్థులు స్వామియను పదమును సాధారణముగా భగవంతునకే వాడుదురు. ఇతరమతస్తులు బ్రాహ్మణులలో కడుయోగ్యులును. పూజనీయులును అగువారిని స్వామి యని పిలుచుటయు కలదు. ఇట్లు ఒక్కొక్క పదమునకు

లోకరీతిచే ఒక్కొక్క అర్థము, సంప్రదాయరీతిగా మరియొక అర్థము ఉండుట చూచియున్నాము.

ఒక్కొక్క సంప్రదాయమును అనుసరించి కొన్ని కొన్ని పరిభాష లేర్పడియున్నవి. రామానుజాచార్య సంప్రదాయమున ననేక పరిభాషలేర్పడినవి. శైవసిద్ధాంతము - శ్రీ కంఠుల శివాగమరీత్యా - వేళర్లు అని చెప్పబడు వర్గమునందు కొన్ని సంప్రదాయపు పలుకులున్నవి. వైష్ణవపరిభాషయు, శైవపరిభాషయు ఒకే విధముగా నున్నది. స్మార్తులకు పరిభాషయనునదిలేదు. శైవగ్రంథములను చూచినచో మనకు వైష్ణవపరిభాషకు అర్థము తెలియుచున్నది. వైష్ణవపరిభాషలో తిరుమంజనము చేయుట అనగా మెయ్అంజనము చేయుట యని చెప్పియున్నారు. మెయ్ అనగా తిరుమణి అంజనము. అనగా తైలాదులను పూయుట. కనులకు అంజనము వేయుట అనగా కాటుక పూసికొనుట. మెయ్ అంజనము అనగా - సత్యమునకు తైలాదులను పూయుట అని అర్థము. దీనినంతయు నేల చెప్పవచ్చితిననగా వైష్ణవపరిభాషలో స్వామియనిన మరొక వైష్ణవునే సూచించును. కాని నేను స్వామి, స్వామి యనునది లోకరీత్యా భగవంతుని సూచించుటకు.

సామాన్యముగా దేవాలయము లన్నిటిలో స్వామి తూర్పుదిశనో, పడమటిదిశనో చూచుచుండును. దక్షిణదిశను చూచెడివారు. ఇరువురే. వారిరువురును రాజులు. ఈ రాజు లిరువురు చిదంబరము నందును, శ్రీ రంగమునందును వెలసియున్నారు. ఒకరు నటరాజు, మఱియొకరు రంగరాజు. వీరు తూర్పు పడమరలవంక తిరిగియుండక - దక్షిణాభిముఖులై, కళాక్షేత్రమునకు చెందినవారై యున్నారు. రంగ మనగా నాట్యస్థలి. 'పూర్వరంగ ప్రసంగాయ నాటకీయస్య వస్తునః' అనునెడ (మాఘకావ్యము) రంగమనిన, నాట్యార్థము నర్తకులకు సభలో ఒకించుక ఉన్నతముగా నిర్మింపబడిన నాటకస్థలియని చెప్పబడినది. అట్టి రంగమందలి రాజుగానుండు నతడే రంగరాజు. మరియొకరు నటరాజు. నృత్యమాడెడి వారికిరాజు.

తిరుపతిలోని స్వామికి రాజబిరుదములేదు. వారిని ఊరక ఈశ్వరుడని పేరేచేర్చి వేంకటేశ్వరుడనియే చెప్పుదురు. మళయాళమున వెంటేశ్వరన్ అనుపేరు అధికము. తెనుగు దేశమునను వెంకటేశ్వరనామము బహుళముగా కలదు. కాని రాజశబ్దము మాత్రము ఈ ఇరువురకే:- రంగరాజు, నటరాజు.

శివాలయమునకు వెళ్ళిన మహాలింగము ప్రాగ్దిశాముఖమై యుండును. వారికి ఈశాన్యదిశలో నటరాజు దక్షిణాభిముఖుడై నాట్యభంగిమలో ఉద్ధితపాదుడై యుండును. ఆయనను మన హృదయమున ధ్యానించి ధ్యానించి, కొంచెము కొంచెము తలచి తలచి ఆ ఆనంద తాండవమూర్తి స్వరూపము మనస్సున స్ఫురించునట్లు చేసికొనిన అదియే సిద్ధియని అర్థము. మనకు మిగుల ప్రియులగు బిడ్డలనో బంధువులనో తలచినతోడనే వారిస్వరూపము మనస్సున పొడకట్టును. కాని వీరిని తలచి ఏమిప్రయోజనము? ఎన్నడో ఒకరోజు వీరందరు మనలను వదలి చనెడివారే. లేదా మనమైనా వారిని వదలి పోవలసినవారమే.

'వియోగే కో భేదః?' వియోగములో ఏమిభేదమున్నది? ఒకరి నొకరిని ఎంత ప్రేమించి, అభిమాన ముంచినను, ఆనందముగానున్నను - అంతకంతకు ఎవరో ఒకరు ఏడువవలసినదే. వియోగము కల్గియే తీరును. వియోగము లేనిస్థితి - స్వామియందలిస్థితి. అందు దుఃఖమునకు తావేలేదు. ఆ ఆనందమూర్తి మనోనేత్రములకు గోచరించినచో మనకు మంత్రసిద్ధి యయినదని అర్థము. దక్షిణాభిముఖమగు ఈ రాజద్వయము ఈ యిరువురయు రూపము మన మనోనేత్రములకు గోచరము కావలెను, దక్షిణాధీశుడు కాలుడు. కాలుని భయము మీ కక్కరలేదన్నట్లు భక్తుల కభయము ఒసగుచున్నాడా యన్నట్లు కుంచితపాదుడై నటరాజు ఆనందమను తాండవము చేయుచుండును. మఱియొకరాజు రంగరాజు. ఆనందసుషుప్తిలో మగ్నుడై యుండును. నృత్యము నందు, సుషుప్తి స్థితియందును ఆనందమే స్ఫురించును.

ఆనందము అధికమగుచో, నృత్యము చేయుదురా? నేను విన్నదేకాని చూచినదిలేదు. తెల్లదొరలకు కులాసా ఎక్కువ. అయినచో బాల్‌డాన్స్ చేయుదురట. ఎప్పుడును ఏడ్చెడి మనజాతికి అది తెలియదు. మనకు స్వాతంత్ర్యమూ లేదు, ఆనందమూలేదు. చూచినవారికెల్ల భయపడుచూ, కన్నులు లోనికిదించుకొనిపోయి, తిండిలేదే, పని దొరకలేదే, పనియున్నను వేతనాభివృద్ధి అనుస్వారముగా నున్నదే - అని సదాచింతలో మునిగినవాళ్ళము మనము. మనకు ఆనందమూ లేదు, ఆటలు అంతకుముందే లేవు.

తెల్లదొరలవలె మనము గంతులు వేయకపోయినను, కూనరాగములైనను తీయుదురు. మనకు ఎక్కువ ఉత్సాహము కలిగిన కాలములలో చేయు గానము. నృత్యము ఇవి ఆనందమునకు సంబంధించిన విషయములు.

ఆత్మజ్ఞానులు బ్రహ్మానుభవము కల్గినపుడు ఆనందముగా గానము చేయుదురు. సామగానము చేసినది ఆ సందర్భములందే 'హావు3' 'హావు3''హావు3' (ఏమీ యీ యాశ్చర్యము!) ఓహో ఏమి ఆశ్చర్యము! అని సామగానము చేసెడివారిని, బ్రహ్మవేత్తులని తైత్తిరీయము చెప్పును. ఇద్దరు కలిసినపుడు మిగుల సంతోషముగానున్న యొకడు కూనరాగమును దీయును. ఏమి నాయనా! ఈ సంగీతము? అని ప్రశ్నను అతడు గమనించడు. అటులనే మనస్సునకు కొంచెము వ్యాకులత యేర్పడినవానిని పాడుమని యెంత నిర్బంధించినను అతడు పాడడు. కొంచెము సంతోషము, నెమ్మది యేర్పడినపుడు నిదురవచ్చును. ఇంకను కొంచెము సంతోష మధికమగుచో పాట మొదలగును. మరింత సంతోష మధికమగుచో నృత్యము మొదలు. లోకములోని కాంతి ఎటుల సూర్యుని నుండి కల్గుచున్నదో, అటులనే మనలో ఏ కొంచెమో ఆనందముండినను, అది ఆ ఆనందసముద్రములోని పయిపయిపొంగే. గదిలో ఎంత చీకటియున్నను ఒక సన్నని కన్నమునుండి వచ్చెడి సూర్యకిరణలేశము ఎట్లు గదిని ప్రకాశముగావించునో, అటులనే మనకెంత మనోవ్యాకులత, చింతయున్నను ఆనందమున యోగనిద్రాస్థితుడగు రంగరాజును, నర్తనానందమున వెలిగెడి నటరాజును స్మరించినచో మన దుఃఖములు, చింతలు పోయి మన హృదమయులును ఆనందముచే ప్రకాశించును.

నటనోద్ధతిలో రేగి ప్రక్కకు నిక్కపొడుచుకొనిన జటలతో నటరాజు నిలిచి యుండును. ఆయన హస్తమున నున్న ఝల్లరినుండి 'అయిఉణ్ ఋఌక్' అను పదునాలుగు సూత్రము లేర్పడినవి. పరమగతికి మార్గమగు పదునాలుగు శ్లోకముల నందికేశ్వరకారిక అందుండి పుట్టినదే. దానికి శాండిల్యుడు భాష్యమును వ్రాసెను. ఈ ఆనంద నృత్య శబ్దములు కల్గిన పుస్తకమును చేతిలో నుంచుకొని దక్షిణామూర్తి దక్షిణాభిముఖుడై ఈశ్వరాలయమునకు దక్షిణపార్శ్వమున కూరుచుండి యుండును. ఈయన జటలు, మండలముగా ఏర్పడి

వ్రేలుచుండును.

నటరాజు ఆనందమూర్తి, దక్షిణామూర్తి జ్ఞానమూర్తి దక్షిణామూర్తి చూపెడిముద్రకు చిన్ముద్ర యని పేరు. ఆనందముపొంగి అణగునపుడు జ్ఞానపరిపూర్ణతయున్నచో అదియే శాంతము. జ్ఞాన పరిపూర్ణునికడ ఆనంద పరిపూర్ణతకూడ ఉండునని అర్థము. జ్ఞానానంద పరిపూర్ణుడగు దక్షిణామూర్తి సాన్నిధ్యమున ఆయనవలెనే కొందరు పెద్దలు కూర్చుండి కనులు మూసికొని - పంచాక్షరీ జప పరాయణులగుదురు. జపముచేయునది ఆనందతాండవమూర్తి, సన్నిధిలో కనులు తెఱచుచో ఎట్టెదుట ఆ మూర్తి దరిసెనము. కనులు మూసికొన్న అంతర్ముఖ జపము.

భిక్షాటనమూర్తి అధోన్ముఖముగా రెండు వ్రేళ్ళతో చూపెడి ముద్రను సయితము చిన్ముద్ర యనియే చెప్పెదరని తలచెదము. ఆయన చేతిలో రెండుకాళ్ళను పైకెత్తి నిలుచుండెడి బాలహరిణ మొకటి యుండును. ఇదిగో నీకు ఆహారము అన్నట్లు రెండు వ్రేళ్ళతో ఆయన కసవును చూపునట్లు కనపడును. రంగరాజు మాత్రము 'నిద్రాముద్రాం నిఖలజగతీ రక్షణే జాగరూకాం' అని నిద్రాముద్రలో నుండును. నిద్రయనునదొక అవస్థ. ఆ అవస్థలో అణగిన ఆనందమును నిద్రాముద్ర వెలిబుచ్చును. ఇట్లు అ నేక మూర్తులు. ఒక్కొక్క మూర్తికి ఒక్కొక్క విశేషము.

'దర్శనాత్ అభ్రసదసి' చిదంబరమున నటరాజు దర్శనీయమైన మూర్తి. ఆలంగుడి యను క్షేత్రమున దక్షిణామూర్తి ప్రసిద్ధి. తిరువారూరునందు త్యాగరాజ ప్రసిద్ధి. శ్రీరంగమందు రంగరాజ ప్రసిద్ధి. ఒక్కొక్క మూర్తికి ఒక్కొక్క క్షేత్రమునందు ప్రాధాన్యము.

ఇన్ని మూర్తు లెందుకు? ఒక్కమూర్తి యున్నచో చాలదా? మన మతముతక్క తక్కిన మతము లన్నియు ఒకే దేవుని గూర్చికదా చెప్పుచున్నది? అవి ఇంతమంది స్వాములను, ఇన్ని మార్గములను చెప్పుటలేదు. మనకును ఒక్కస్వామి చాలడా? అన్న సందేహము కలుగవచ్చును.

ఆకలి కొరకు మనము అన్నము తిందుము. కడుపు నిండుటకు మాత్రము వట్టి అన్నమును తినిన చాలును. నానా విధభక్ష్య భోజ్య చోష్య లేహ్య పానీయాదులు అవసరము లేదు. కాని తినుట కడుపు నిండుటకేకాక రసనేంద్రియమునకు గూడ రుచికరముగ ఉండవలెనని అభిప్రాయము. రుచికరములును, కనులకు సొంపగు వస్తువులును నాలుక కోరును. ఒక్కొక్కరికి ఒక్కొక్క పదార్థముపై రుచి, 'లోకో భిన్నరుచిః' ఇట్లు దేవుడొకడైన భక్తులు తమకు ఇష్టమగుమూర్తిపై ప్రేమనుంచి ఏ మూర్తియందు తమ మనసు సులభముగా లయమగునో ఆ మూర్తిని విశేషప్రేమతో నుపాసింతురు. గీతయందు భగవంతుడు-

యోయో యాం యాం తనుం భక్త్యా
శ్రద్ధయార్చితు మిచ్ఛతి,
తస్య తస్యాచలాం శ్రద్ధాం
తామేవ విదధా మ్యహమ్||

లోకమున ఎవడెవడు ఏఏ మూర్తిని శ్రద్ధాభక్తులతో నర్చించుటకు ఇష్టపడునో వానిశ్రద్ధను బలపరచి నేను అచలముగా చేయుదును అని అనును.

లోకమున ఒక్కొక్కరికి ఒక్కొక్క వస్తువుపై ఆశ. అదేకాక నేడు ఒక వస్తువుపై నున్న ఆశ రేపు ఉండదు. మరొక దానిపై మనసు పోవును. ఒకరోజు ప్రొద్దుపోక బజారులవెంట తిరుగుదమని యొకడు అనుకొనును. మరుసటిరోజు ఆ వ్యక్తికే సముద్రతీరమున షికారుచేయుటకు ఇచ్ఛ పుట్టును. అటులే భక్తులు తామర్చించు మూర్తులు 'ఈ విధముగానున్న బాగుగా నుండును, ఆ విధముగా నుండిన బాగుగా నుండును' అని అనేక విధముల కోరుదురు. ఇందుకొరకే మతాంతరములు వెలసినవి.

వైష్ణవులు పెరుమాళ్ళనే సేవించినప్పటికినీ అందులో కొందరికి కన్ననియందే మిన్నయగు ప్రేమ. మరియొకరికి రాముడు ఆదర్శమూర్తి. మరియొకరికి రుద్రస్వరూపుడును, భయంకరమూర్తియగు అగు నరసింహమూర్తిపై భక్తి. కొందరకు ఇట్లే పరమేశ్వరునియందు భక్తి, దక్షిణామూర్తి యందు భక్తి, అంబికయందు భక్తి, ఇటులు ఏమూర్తి యందు శీఘ్రముగా సులభముగా మనస్సుల యమగుచున్నదో ఆ రూపమును వారు కొలుతురు.

''యో యో యాం యాం తనుం భక్త్యా
శ్రద్ధయార్చితు మిచ్ఛతి''

ఇందు భగవానుడు 'ఇచ్ఛతి' యను పదప్రయోగమును చేసెను. 'ఏఏ మంగళస్వరూపములయందు భక్తుడు భక్తిశ్రద్ధలనుంచునో వాని శ్రద్ధను నేను అచలమొనరింతును అని యనును.

'సాంఖ్యయోగో వృథ గ్బాలాః ప్రవదంతి న పండితాః'

సాంఖ్యము వేరనియు, యోగము వేరనియు పండితుల అనుభూతిపరులు చెప్పడములేదు.

'ఏక మ ప్యాస్థితః సమ్య గుభయో ర్విందతే ఫలమ్'

ఏ ఒక్క దానిని చక్కగా నిర్వర్తించినను ఈ రెంటి నుండియు ఏ ఫలముకల్గునో, ఆ ఫలమే కల్గును.

'సాంఖ్యం యోగం పాంచరాత్రం వేదాః పాశుపతం'

అని ప్రాచీనకాలము నుండియు వచ్చుచున్న ప్రధాన మతములు అయిదు.

కొందరది సాంఖ్యమార్గము, మరికొందరది యోగ మార్గము, మరికొందరది పాంచరాత్రము. పాంచరాత్ర మనునదియే వైష్ణవమార్గము. పాశుపత మనునది శైవాగమమును అనుసరించునది. చర్య క్రియ యోగము జ్ఞానము ఇవి వీనికి చేరినవి. కొందరు పాశుపతమును అనుసరింతురు. వేదోక్తములగు యజ్ఞాది కర్మానుష్ఠానము చేయుచు, కర్మకాండము అనుసరించెడివారును కొందరున్నారు.

సాంఖ్యమునకు వేదము ప్రమాణము. అచేతనవస్తువులు, చేతనవస్తువులు అని విభజించి తెలిసికొనుటచేత మోక్షము కల్గును అని సాంఖ్యసిద్ధాంతము. (నిత్యానిత్యవస్తు వివేకము).
యోగ మనగా మనోవృత్తులను నియమించి విరోధించుట. ఈ ఐదుమార్గము లున్న- ఇవన్నియు భగవదాజ్ఞానుసారము ఏర్పడినవే యని తెలుసుకో - నాయనా! నీవే మార్గము నవలంబించినను తక్కిన మార్గములను యుక్తి చేత ఆక్షేపము చేయకుము. అని భగవానుడు ధర్మపుత్రునకు ఉపదేశము చేసెను.

ఈశ్వరుడు భూతగణములతో కైలాసమున నున్నపుడు అంబిక పుష్పదంతుని 'నీవు మనుజజన్మ నెత్తుదువుగాక'! యని శపించెనట. అతడు ప్రణామమొనర్చి శాపవిమోచనముగూర్చి ప్రార్థింపగా, 'నీకు మనుజజన్మ కలిగినను ఈశ్వరునిపై భక్తి మాత్రము మరుగుపడదు. అందుచే నీవు మరల ఈశ్వరుని యెడకు వచ్చెదవులే.' అని దేవి అనుగ్రహించెనట. అతడు మనుష్యుడుగా భూలోకమున పుట్టినపుడు శివమహిమ స్తోత్రమును వ్రాసెనని చెప్పుదురు.

వింధ్యకు ఉత్తరభాగమునను, పూనానగరమునకు ఉత్తరప్రాంతమునను శివమహిమస్తోత్రము తెలియనివారే యుండరు. అచ్చట అది అంత వ్యాప్తిలో నున్నది. గీతా శ్లోకమురీతినే భారతమునందున్న శ్లోకమునకు సారమో యనదగు శ్లోకమొకటి యున్నది.

త్రయీ సాంఖ్యం యోగః పశుపతిమతం వైష్ణవ మితి
ప్రభిన్నే ప్రస్థానే పర మిద మదః పథ్య మితిచ.
రుచీనాం వైచిత్ర్యా దృజు కుటిల నానాపథ జుషాం
నృణా మేకో గమ్య స్త్వ మసి పయసా మర్ణవ ఇవ.

వేదానుగమములగు వేద బ్రాహ్మణమతములను ఇందు పుష్పదంతుడు పేర్కొనును. త్రయీ అనగా వేదమతము. వేదము సాంఖ్యము పశుపతిమతము అని. 'ప్రభిన్నే ప్రస్థానే'ః పోయెడు మార్గములు అనేకములైనను అన్నియుపోయి చేరునదొక్కచోటే. ఒకే చోటునకు పోవుటకు నాలుగైదు మార్గములున్నట్లు ఉపాసనామార్గము లెన్నియయున్ననుగమ్యస్థానమేమో యొక్కటే. 'పరమిదం అదః పథ్య మితి చ'ః మార్గము లెట్లు అనేకములో - ఆయా మార్గములలోనికి ఆహ్వానించెడి వారును అనేకులు. రైల్వేస్టేషనునందు రిక్షావాడు, గుర్రపు బండివాడు, టాక్సీడ్రైవరు తమ తమ వాహనాదుల ప్రాశస్త్యమును వర్ణించుచు, మన మూటలను లాగుకొందురు. మిషనరీలును ఈతరగతికి చెందినవారే. 'మా మతమే గొప్పదిచాలా అనుకూలమైనది. మా మతమున జేరుడు.' అని అందురు. మునుపు శివదీక్ష, వైష్ణవదీక్షలు ఇట్లు ఏర్పడినవే. ఏ మార్గమున పోయినను చేరున దొక్కచోటునకే. 'పర మిదం అదః పథ్య మితి చ' ః పథ్యమనగా అనుకూల్యమని అర్థము. దేహమునకు అనుకూలించిన భోజ్యవస్తువులను పథ్యమందురు. ఈ మార్గములలోని కీడ్పబడిపోయెడువారును అనేకులు. 'రుచీనాం వైచిత్ర్యా దృజు కుటిల నానాపథ జుషాం'- లోకులరుచులు ఏకరీతి నుండవు. అందుచేతనే తినెడు తిండియందును, కట్టెడు బట్టయందును ఇంత వైవిధ్యము. అందరికిని రుచి ఒక్కటే ఐనచో ఒకే విధమగుతిండి, ఒకే విధమగుబట్ట, ఒకటే ఆకారము, ఒకదేవుని - నియమించుకొన వచ్చును. అది లేనికారణముననే - వివిధ ఆహారపదార్థములు, వివిధ వస్త్రసంచయములు, వివిధ ఆభరణములు, వివిధ అర్చనాస్వరూపము లేర్పడినవి.

బ్రహ్మసమాజము, ఆర్యసమాజము, థియాసఫీ, బౌద్ధము, గాంధీజము అని ఒక్కొక్క లక్ష్యమును ఆధారము చేసికొని ఒక్కొక్క మార్గము ఏర్పడినది. వ్యాధి వచ్చినచో ఔషధమును సేవింతుము. మూలతత్త్వము క్షీణించగా, పరదేశస్థులు మీ మతములోని లోపములు ఇవియని వేలెత్తి చూపినపుడు వారికి తృప్తికరముగా బదులు చెప్పవలెననెడు అభిమానముతో 'మా మతము ఆదిలో ఇట్లుండలేదు, ఇందులో ఇపుడు కలుపులు బయలు దేరినవి. వీనిని మేము నిర్మూలింతుము' అని కొందరు బయలు దేరుదురు. 'వేదోక్తమగు కర్మకాండ అనవసరము, మనకు ఉపనిషత్తులున్నచాలును. అదియే నిజమైన తత్త్వము.' అని రామమోహనరాయలు బ్రహ్మసమాజమును లేవదీసిరి. కర్మకాండయే ప్రధానము అని దయానందులు ఆర్యసమాజమును స్థాపించి, ఆలయములలోని ఆచేతనములగు ఈ శిలాస్వరూపములకు అర్చన పూజాదు లెందులకు అను ప్రశ్నకు ఆ కాలమున బదులు ఎట్లు చెప్పవలయునో తెలియలేదు. వెంటనే 'దేవుని పూజలకు విగ్రహాదులు అనవసరము. వీనిని మేమే నిర్మూలింతుము'అని కొందరు బయలుదేరిరి. ఇది ముస్లిముల సవాలును ఎదుర్కొని బదులుచెప్పలేక అటులెవ్వరు ఏది లోపమని చూపిరో, ఆయా లోపమును సంస్కరించుటకు మనవారు సమకట్టిరి, ఇట్లు ఆర్యసమాజ ముత్పన్నమాయెను క్రైస్తవుల పోటీ నెదుర్కొనుటను థియాసఫీ ఏర్పడెను. ఆ కాలమున వీరు మంచి కార్యము లనేకములు చేసిరి. వానిని మరవలేము.

రామకృష్ణపరమహంస కాళికాలయమున కాళీ, కాళీయని కాళికాపూజ ప్రారంభించిరి. వారియందు భక్తి మహిమలు ఏర్పడిన కాలమున విగ్రహారాధన అవసరమే యని మరల ఒప్పుకొన నారంభించిరి. 'వీడు అస్పృశ్యుడు, వాడు అస్పృశ్యుడు' అని చెప్పుట సరికాదు. 'మన మతములో చెప్పినది, తక్కినదెల్లయు సరే' యని గాంధీ కాలమున తక్కినవారెల్లరు ఒప్పుకొన నారంభించిరి. వర్ణాశ్రమము శరీరమునకే యని మన మెల్లరము అనుకొనుచుంటిమి. ఆత్మ కూడ అది కలదని థియాసఫీవారు మరొక మెట్టునకుపోయి ఉపదేశింపనారంభించిరి. వ్యాధి వచ్చునపుడెల్ల మందును వేయుదురు. గుణము కనుపించినతోడనే మందును నిలిపివేయుదుము. అటులనే మత విషయములలో సయితము ఏదో లోపములు కనుపించినపుడు తన్ని వారణార్థము ఒక్కొక్క తత్త్వము బయదుదేరి, ఆ లోపము నివారణ అయినంతనే, దానికొక సమాధానము లభించినంతనే ఆ తత్త్వము సయితము మాయమగును.
ఆయా కాలములయందు ఆయాయివారు అనేక కర్మానుష్ఠానములను బయటికి తెలియజేయుచుండెడివారు. వారును లోలోపల పాపములను రహస్యముగా చేయుచునే యుండిరి. అయినప్పటికి వారి మనస్సాక్షియైనను, కొన్ని కొన్ని సమయములలో వారిని

బాధించెడిది. ఇప్పుడు మనస్సాక్షి యనునదియే లేదు. పాపములు సయితము రహస్యముగా చేయడము లేదు. పాపకార్యము చేయుచున్నామే యనెడు మనశ్శంకయు, మహాబాధయులేదు. ఒక విధముగా ఆ కాలమున లోపల ఒకటియు, బయట మరొకటియుగా అపచారము చేయుచున్నను ఇప్పుడు అదియును లేదు. అనాచారములు పరోక్షముగా గాక ప్రకాశముగనే జరుగుచున్నవి. రహస్య మనునది లేదు. ఐనప్పటికినీ భక్తిశ్రద్ధలు వృద్ధియగుచున్నవనియే చెప్పవలెను. అది అటులుండనిండు.

ఇట్లు భారతోక్తములగు ఐదు మతములను 'యో యో యాం యాం తమం భక్త్యా' అను గీతాశ్లోకమును అనుసరించిన పుష్పదంతుని శివమహిమ స్తోత్రశ్లోకమును ఒక్క విషయమునే ప్రస్తావించుచున్నది. గీతాశ్లోకమందలి 'ఇచ్ఛతి' అనెడు పదమునకు 'రుచీనాం వై చిత్ర్యాత్' అని పుష్పదంతుని వివరణము: ఋజు, కుటిల నానాపథగాములయినను 'నృణాం ఏకో గమ్యః' అందరును భగవంతునికడకే వెళ్లుచున్నారు. ఐననూ అందరూ భగవంతునికడకే వెళ్లచున్నారని చెప్పుట ఎట్లు? 'దానిని గూర్చి నీకు విచారమక్కరలేదు. ఏదో ఒక మార్గమును త్రొక్కి పురోగమించుచునే యుండును. మార్గమధ్యమున మాత్రము నిలిచిపోకుము. గమ్యస్థానము తానుగ వచ్చును' అని సమాధానము.

మన మొకచోటునుండి బయలుదేరి ఏ దిశకు వెళ్ళినను పోయి చేరునది సముద్రము. భూమి నలుదెసలనూ సముద్రము చుట్టియున్నది. 'త్వ మసి పయసా మర్ణవ ఇవ' నీవే నాలుగు దెసలను సముద్రమువలె వ్యాపించియున్నావు' అని అనుట ఇందులకే.

నది ఎటుప్రవహించినను సముద్రములో కలియవలెనునట్టి సముద్రమే నాలుగు దెసలనూ ఆవరించియున్నది. ఇక కృపా సముద్రపుమాట ఏమిటి? మన మేమార్గమున వెళ్ళినను మనముపోయి చేరుచోటున అది ఉండకపోవునా? మన మేవంకకు వెళ్ళినను మనరాకకై ఆయన నిరీక్షించుచునేయుండును. 'నీ రుచికి తగిన మార్గములో వెళ్లు! మధ్యలో ఆగకు! నీవు వెపుడు వచ్చిచేరుదువు? అని నిరీక్షించెడి వాడొకడున్నాడు. ఆ కృపాసముద్రము నాలుగుదెసలనూ వలయితమయియున్నది. శ్రద్ధలో లోపించక - ఆరంభించిన కార్యమును మధ్యలో వదలక - ప్రయత్నించునే యుండును. ఇన్ని మార్గము లున్నవే యనిన, యాత్రికులు పెక్కుమంది, వారిరుచులు విచిత్రములు. (అనేక విధములు.)

యత్ సాంఖ్యైః ప్రాప్యతేస్థానం తత్ యోగై రపి గమ్యతే,<br>ఏకం సాంఖ్యం చ యోగం చ యః పశ్యతి న పశ్యతి||

అను గీతాశ్లోకభావమే శివమహిమస్తోత్రములోని శ్లోకమందును కలదు.

ఒక్కొక్కనికి ఒక్కొక్క మూర్తియందు భక్తి ఉదయించును. అందుచేత అతడు ఆ ఉపాసనామూర్తిని శ్రేష్ఠుడని భావించును. వానినేల ద్వేషించుట? వైష్ణవుడు ఈశ్వరుని నిందించుట అటుండనీ - ఎవరో ఒక వైష్ణవుడు రంగనాథుని గూర్చి పాడుచుండగా ఆయనను తిరుపతి పెరుమాళ్ళపై నొక కీర్తనను పాడుమన్నారట. 'రంగనై పాడియ వాయాల్ అంద కురంగనై పాడువెనో?' యని బదులిడెనట. కురంగు అనిని అరవమున కోతి అని అర్థము. తిరుపతిలో కోతులధికము. అందుచే - ఆయన 'రంగడినిపాడిన నోటితో ఆ కోతినిగూర్చి పాడుదునా?' యని తిరుపతి వేంకటేశ్వరుని ఒకకోతి క్రింద జమకట్టెనట. ఇట్లు కొందరు చెప్పుదురు. కాని వైష్ణవులు శివునిపై కోపగించుకొన్నను, శైవులు విష్ణువుపై కోపగించుకొన్నను వారి కోపము వారి ఉపాసనామూర్తుల యందలి భక్త్యాధిక్యమునే చాటును. 'న హి నిండా' అది నిందించినట్లు కాదని యర్థము. వీరు తమ దైవమతముల గూర్చి చేసెడు స్తోత్రమును ఇతర దైవతముల గూర్చి చేసెడు నిందయు అన్నియూ ఒకటే యగుచున్నది. అందుచే ఎవరికి ఏ ఏ రూపములందు మనసు లయమగునో ఆఆ స్వరూపములను ఉపాసించి సద్గతిని పొందచ్చును. అనుటకే వేదమూలము ననుసరించి ఇన్ని రూపములు, ఇన్ని మార్గములు ఏర్పడుట.

కాలబద్ధులమైన మనము, కాలవిజయమునకు దక్షిణాభిముఖులైన మూర్తులను ధ్యానించవలెను. ఒకరు జ్ఞానమూర్తి ఒకరు ఆనందమూర్తి, ఇంకొకరు యోగనిద్రామూర్తి. ఇందులో ఏ మూర్తినైనా ఉపాసనచేసి ధ్యానించి, స్మరించి ఆ మూర్తిని చిత్తము నావహించునట్లు ప్రకాశమగునట్లు చేసిన మరణనివృత్తియగును. మరణభయము వీడును. ఇట్టి తత్త్వమును బట్టియే ఆలయములు, ఆలయములలోని మూర్తులు ఏర్పడినవి. తత్త్వము తెలిసిననే సత్యము గోచరించును.

వైష్ణవులైనను, శైవులైనను, మాధ్వులైనను వేదము ప్రమాణముగా అంగీకరించువారి కందరకును భస్మధారణ కలదు. పాంచరాత్రదీక్షయందును హోమభస్మధారణ కలదు. భస్మమును ధరించునపుడు చాలామంది ఒక మంత్రమును చెప్పుదురు. దానికి త్ర్యంబకమంత్రమని పేరు. జలసంబంధము ఉచ్చరింతురు. సుగంధము, శ్రేయస్సు, పుష్టి, కల్యాణగుణములన్నియునుండిన యొకనికి త్ర్యంబకుడనిపేరు. అతడే ఈశ్వరుడు.

త్ర్యంబకం యజామహే సుగంధిం పుష్టివర్ధనమ్|<br>ఉర్వారుక మివ బంధనాత్ మృత్యోర్ముక్షీ యమామృతాత్||

అనునదియే ఆ మంత్రము.

అతడు మనకేమి ఇచ్చును? అమృతమును, మరణ రాహిత్యమును ఇచ్చును. ఇపుడు పుట్టినాము గనుక - ఇక పుట్టుక లేని స్థితినిచ్చి మృత్యువశముగాకుండ, ఆనందమునుండునట్లు చేసెడి మహాదేవుని మంగళచరణములలో ఆత్మలయమగునట్లు చేయవలెను.

ఈశ్వరుడు తక్క, తక్కినదెల్లయు మృతమే. మృతమనగా చచ్చునది యని అర్థము. మరణము మరుజన్మకు బీజ కారణము. మరుజన్మలేక - మరగిపోవుటకు -అమృతమని పేరు. అమృతముగ నుండునదొక్క దైవమే. మృతులమగు మనకు అమృతస్థితి నీయగల శక్తి ఆయనకు కలదు. ఇట్టి అర్థము స్ఫురించునట్లు చేసికొని త్ర్యంబకమంత్రము నుచ్చరించుచు భస్మధారణ చేయనగును.

అన్ని వస్తువులు దగ్ధముకాగా శేషించునది భస్మము. ఎరుపు, పసుపు, నలుపు మొదలగు వర్ణములన్నియు పోయిన పిదప మిగులునది ఏదియో అదియే తెలుపు. అదియే భస్మము. భస్మమును మరల అగ్నిలోవేసిన మిగులునది మరి భస్మమే. ప్రపపంచమంతయు నాశనముకాగా మిగులునది అదియే. అందుచే త్ర్యంబకుని ధ్యానించి భస్మధారణ చేయుదురు.
మూడు మూర్తులును మోక్షము నిచ్చినను మూడు కన్నుల ప్రభువు ముక్కంటి యిచ్చెడు మోక్ష మది యొక దినుసు. అది ఈ వేదమంత్రమునందే చెప్పబడియున్నది.
దుఃఖించుచు మనము చనిపోయిన, మరల దుఃఖించెడి జన్మయే కల్గును. ఆనందముగా సంతోషముగా ప్రాణత్యాగము కావించుచో అట్టిస్థితికి అమృతమని పేరు. మృతముకాకా అమృతము నొసగునది ముక్కంటి. రంగనాథుడైనను మూడు కన్నులవాడైనను ఇచ్చెడి మోక్షము ఒకతెరగే.

మోక్షము, మోక్షము - అననేమి? మోక్ష మను పదము 'ముఞ్చ' ధాతుభవము. దీనికి ముంచతి, ముంచతే ఇత్యాది పరిణామము. మోక్షమనగా విడివడుట. తగులుకొన్నవాడు తగులుబాటులోనుండి తప్పించుకొనుటయే మోక్షము. మనకున్న బంధములనుండి విడివడుటయే మోక్షము. తమిళ వ్యాకరణరీత్యా మోక్షమునకు గృహమని అర్థము. చెఱనుండి యొకనిని విడుదలచేసిన అతడు తన స్వగృహమునకు వచ్చి చేరును. విడుదల అయినతోడనే వచ్చిచేరునది గృహము. సంసార బంధములనుండి విడుదల కాగానే మనము మన స్వగృహములకు వెళ్ళి చేరవలెను.

మనము తలచినది తలచినట్లు చేయజాకుండ జేయునది సంసారబంధము బంధింపబడినవానికి స్వేచ్ఛ కొరత. మన మందరము బద్ధులమే. ఎదుటివారు ఎదురుచూచెడి తెరగు మనము నడచుకొన లేకున్నాము. అది అటుంచి మనము మన మనసు చెప్పినటులయినను నడచుకొన లేకున్నాము ఎవరో మనలను గట్టి త్రాళ్ళచే కట్టినట్లు తోచును. అల్లరి ఎక్కువగా చేయు పిల్లలను మనము కట్టివేయుదుము. వారు తమకు తెలియకయే తమకును ఊరివారికిని బందిలీదొడ్లకు తోలుదుము. లేనిచో చెట్టునకు కట్టివేయుదుము. వారికిని మనకును ఉపద్రవము లేదని నిశ్చయము కలిగిన పిదప వాని కట్లను వదలింతుము. మన బంధములు మనకెపుడు తొలగును? మనస్సు పక్వమగునపుడు, ఎంతదుఃఖము, ఎంత విచారము కల్గినను కామక్రోధముల వశము కాకుండ నిరంతరానందస్థితిలో నుండెడి పక్వస్థితి ఎపుడు కల్గునో అప్పుడే మన బంధములు వీడినవని అర్థము. ఇట్లు విడువటమే మోక్షము.
జగత్తున ఎన్నో రకములగు వృక్షములున్నవి. వాని కాయలు పులుపు, చేదు, వగరుగానున్నపుడు వృక్షమునుండి అవి విడివడవు. కాని పక్వస్థితికివచ్చి, మధురములైనపుడు ఆ వృక్షమే తాను చాలా రోజులు భరించలేనని తన సంతానమునకు చెప్పినచందముగా వానిని తానే తొలగించుచున్నది. మొదట మొదట పలురకముల రుచులతో కూడియున్నను కడపటిదశలో ఆ కాయలు మధురము లగును. అటులే జనులు సయితము మొదట కామక్రోధద్వేషాదులు కల్గియున్నను పక్వస్థితికి వచ్చినపిదప నిస్పృహులై సదా ఆనందముగా కరుణతో ఉండెడి సెలవును పొందెదరు. కాయలు పులుపు, చేదు, వగరుతో నున్నపుడు చెట్టును అంటిపెట్టుకొనియే యుండును. అటులే క్రోధాదులన్నంతవరకు మనకు సంసారవృక్షమునుండి విమోచనములేదు. బద్ధులమైయే యుందుము. పక్వస్థితిలో అరిషడ్వర్గము అడగి ఆనందనిలయుల మైనపుడు ఆత్మ తానుగ సంసారవృక్షమునుండి విడిపోవును. అదియే మోక్షము.

పచ్చికాయ వగరు. పండినపుడు తీపి, మనమును ఇటులే, భగవానుడు అందుచేతనే 'తస్మాత్ యుద్ధ్యస్వ భారత' - అని అనుట. మనము తప్పుత్రోవను చనక ధర్మపథగాములము కావలెను. అపుడే వృక్షమున పిందె క్రమాభివృద్ధినొంది పండుటకు అప్పదమగును.

పండినపండ్లు అన్నియు పతనము చెందును. పతనము చెందుట యొక మోక్షమా? ఇదేటి మోక్షము? అని అర్జునునకు దోచెను. అర్జునునిసారథి పార్థసారథి ఆ సంశయనివారణచేయును. 'సంసారవృక్షము అన్ని వృక్షములవలె కాదు. అది ఊర్ధ్వమూలమును, అధశ్శాఖమును, వ్రేళ్ళు పైన, శాఖలు క్రింద ఉండెడి అశ్వత్థవృక్ష మది. ఇందు పతనమనగా పైకి వెళ్లుటయే.'
ఉన్నచోటు వదలి వేరొక చోటునకు పోవు టెందులకు? స్వామి యిచ్చట తేడా? 'అంత ర్బహిశ్చ తత్సర్వం వ్యాప్యనారాయణః స్థితః' ఆయన బహిరంతరముల లోపలా, వెలుపలా, క్రిందా, పైనా అంతటా కలడని వేదవాక్కు.

ఉర్వారుక మనగా దోసకాయ. జన్మాష్టమికిని, వినాయకచతుర్థికిని - ఇవి అధికముగా దొరకను. ఉర్వారుక పండినచో ఏశ్రమలేక అనాయాసముగా తొడిమనుండి తొలగి తీవ ప్రక్కనే పడియుండును. అది ఉన్న ఎడము సయితము తెలియదు. గాలి బలముగా వీచి, తీగలు కదలాడినపుడు మాత్రము కన్నులకు తెలియును. ఇట్టి సులభమోక్షము, ఉన్నచోటనే లభ్యమగు మోక్షము- 'ఉర్వారుక' మోక్షము కావలెననియే వేదమంత్రమందలి ప్రార్థన.
అందుచే మనము మోక్షమును వెదకికొనుచు పోకుందుముగాక! మోక్షము మనమున్న చోటుననే కలదు. సంసారము మనలను వదలిపోవలెను. దాని వలన దుఃఖము, చింత మనల నంటకూడదు. అదియే నిజమైన విడుదల. దీని నెవరిత్తురు? మూడుకన్నుల తండ్రియే యీవలెను. అతడిచ్చు మోక్షమే నిజమగు మోక్షము. అందేచేతనే భస్మధారణ చేయునపుడు 'ఇట్టి మోక్షమును ప్రసాదించు తండ్రీ!' యని త్ర్యంబకుని ప్రార్థించుచు ధారణచేయుట.
పశువులవలె, మృగములవలె మనము మరణించిన యెడల నీమతమున నున్నందుల కేమిప్రయోజనము? దుఃఖముతో నసువుల బాసిన దుఃఖభాజనమగు పునర్జన్మ సిద్ధముగా నుండును. అందుచే అవసానకాలమున ప్రయాణ సమయమున ఆ ముక్కంటి స్వరూపమును హృదయస్థముచేసి ఆనందముగా కళేబరమును వదలవలెను. చిత్రములను వ్రాసెడువారికి మోక్షము సులభసాధ్యమనుట ఇందులకే. వారిమనసు వారి చిత్రములయందు లయించును. చిత్తముయొక్క స్వభావమే చాంచల్యము. అది లయించి, యొకచోట నిలుకడ చెందవలెనన్న ఈశ్వరకటాక్ష ముండవలెను.

అతని అనుగ్రహమే ఇన్ని రూపములు, ఇన్ని లీలలు, తత్త్వవేత్తలకు ఏభేదమునూ గోచరించదు. నటరాజు నాట్యమగ్నుడు. రంగరాజు యోగముద్రాస్థితుడు. దక్షిణామూర్తి జ్ఞానయోగారూఢుడు. లోకమే వాస్తవముగా వీరి లీల.

మాయా హ్యేషా మయా సృష్టా య న్మాం పశ్యసి నారద|
సర్వభూతగుణై ర్యుక్తం నైవం మాం జ్ఞాతు మర్హసి||

'నన్ను నీవు చూచుచున్నావే ఇదియే మాయ. ఎల్లలేనివాడు నీ కనులకు కట్టునట్టు రూపమును దాల్చుటయే మాయ యని తెలుసుకో. నా మాయాచేతనే నిన్ను అనుగ్రహించుటకై యీ రూపు దాల్చితిని.' అని కృష్ణపరమాత్మ అనును.

దక్షిణమును చూచెడి దైవతములు మువ్వురు. మన జన్మనివృత్తి కొఱకే వారు దక్షిణాభిముఖులగుట. వీరి అనుగ్రహ మున్నంతవరకు దక్షిణాధిపతి - తోకను ముడుచుకొని కూర్చుండును. అందుచే మనము వీరి శరణు చొరవలెను. వీరి స్వరూపములు స్మరణమాత్రమున హృదయదర్పణముల ప్రతిబింబితములు కావలెను. అందులకై నిత్యమును ధ్యానము చేయవలెను. వారి స్వరూపములు మన మనోవీథుల భాసిల్లుట మన యత్నముచే కాదు, వారి కటాక్షప్రాభవమే.

మనము వారల నెల్లయపుడు కొలుచుటచే మదిలోని మలము తొలగును. దాన వారి రూపు కనుగొను భాగ్యమబ్బును. వారి యనుగ్రహమున కాలజయము కలుగు శక్తి పొడమును. నాడు నాడును దక్షిణదిశ జూచెడి రాజుల యెట్టెదుట శరణాగతి చెందుట మన పని.

అపార కరుణాసింధుం జ్ఞానదం శాంతరూపిణం
శ్రీ చంద్రశేఖర గురుం ప్రణమామి ముదావహం ॥

--- “జగద్గురు బోధలు” నుండి

#KanchiParamacharyaVaibhavam #కంచిపరమాచార్యవైభవం
4/2/18, 16:00 - Paramacharyulu: పదిహేనవ శ్లోక భాష్యం - మూడవ భాగం

బహిర్గతమైన స్థూల శబ్దాన్ని తక్కువ వర్గానికి చెందినదిగా భావించరాదు. అర్థవద్ధ్వనికి ప్రాతినిధ్యం వహించే 51 అక్షరములు మాతృకలని పిలవబడుతున్నాయి. మాతృక అంటే తల్లి. ఒక స్త్రీ గౌరవ భాజన అయినప్పుడు ఆమెను గౌరవంగా “అమ్మగారు” అని పిలవడం వ్యవహారంలో చూస్తున్నాం. మహారాజ్ఞి అయిన అంబిక “అమ్మగారు”. మనతో మనలో కలిసిపోయినపుడు ఆమె మాతృక. అమ్మ. అంబికను మహారాజ్ఞిగా కొనియాడిన లలితా సహస్రనామ స్తోత్రం ఆమెను మాతృకా వర్ణరూపిణిగా ప్రస్తుతిస్తుంది. కాళిదాసు శ్యామలా దండకంలో ఆమెను సర్వవర్ణాత్మికగా ప్రస్తుతిస్తాడు. వేదములు మొదలుగా సమస్త సారస్వతము ఈ మాతృకల విన్యాసమే!

శాక్త తంత్రములో శబ్ద ప్రపంచమునకు గల ప్రాముఖ్యత చెప్పుకొన్నాం కద! అక్షమాల, పుస్తకము దానికి ప్రతీకలు. శ్రీవిద్యలోని మంత్రములు అంబిక నామములు కావు. బీజాక్షరములే. మంత్రములు, బీజమంటే విత్తనం. ఒక చిన్న విత్తు మఱ్ఱిచెట్టుగా విస్తరిస్తుంది. విత్తు అంతటి శక్తిని తనలో నిబిడీకృతం చేసుకొని ఉన్నదన్నమాట. బీజాక్షరాలలో పరమమైన అంబిక శబ్దరూపాన్ని ధరిస్తోంది. ఏకాగ్రతతో జపిస్తే శబ్దరూపంలో ప్రత్యక్షమయి అనుగ్రహిస్తుంది. అంతే కాదు. అంబికను ముఖాముఖి దర్శించడానికి ఆకేశపాదాంతం దర్శించడానికి వీలవుతుంది. మనం పూర్వపు శ్లోకాలలో సదాశివత్వం సిద్ధించకపోతే అటువంటి దర్శనం సాధ్యం కాదని చెప్పుకొన్నాం. అంబికాదర్శనమన్నది తురీయదశ. ఏకాగ్రతతో మంత్ర జపం చేయడం వలన కుండలినీ యోగం ద్వారా పొందగలిగే అనుగ్రహాన్ని మొత్తంగా పొందగలరు. అటువంటి జపం వలన మనకు ఇప్పుడు, ఇక మీదట కావలసినదంతా సిద్ధిస్తుంది.

శ్రీవిద్యా మంత్రములలో కూటములు అని పిలవబడే మూడు విభాగాలున్నాయి. మంత్రం మొత్తంగా అంబికా స్వరూపం. అందులో ముఖస్థానీయం వాగ్భవ కూటము. ఇదే మొదటిది. మనిషి శబ్దం చేయగలిగే నోరు ముఖంలోనే కదా ఉన్నది, వాగ్భవ కూట మంత్రములకు శాక్త గ్రంథములలో ప్రత్యేక ప్రాముఖ్యత ఈయబడింది. ఈ మంత్రములు జపించినవారు కవులవుతారు అని చెప్పబడింది. సౌందర్యలహరి కూడా అంబికానుగ్రహం కవిత్వాన్ని సిద్ధింపచేస్తుందని చెబుతోంది. ఎందువలన ?

పరాశక్తి ఒక మనుష్య జాతికి మాత్రమే వాక్శక్తిని ప్రసాదించింది. ఇది మనకు మాత్రమే లభించిన ప్రత్యేక ప్రసాదము. ఈ ప్రసాదాన్ని సరిగా వినియోగించుకొని శ్రేయస్సు పొందగల బుద్ధి మనకుంటే ధన్యులవుతాము. అంబిక చేత ప్రసాదించబడిన ఈ వాక్శక్తి మనం అంబికను చేరడానికి ఉపయోగపడాలి. అయితే ఆమె కొద్ది మందికి కవితా శక్తి హృద్యమైన వాగ్వైఖరిని ఎందుకు అనుగ్రహించింది? అంబికను దర్శించిన భాగ్యవంతుడు, తన తోటి వారికందరికీ ఎలుగెత్తి, హృద్యంగా చెప్పి, వారికందరికీ అటువంటి అనుభూతి కలగడానికై దోహదం చేసేందుకే ఈ శక్తి అనుగ్రహించబడింది. గురువు గమ్యార్థియైన తన శిష్యునకు కష్టసాధ్యమైన సాధనను, ప్రవర్తనా నియమావళిని ఏర్పరుస్తాడు. కవి తన పాటల ద్వారా, పద్యాలద్వారా అటువంటి గమ్యాన్ని నిరాయాసంగా, ఆనందంగా పాడుకుంటు చేరేట్లు చేస్తాడు. అంబిక అతనికి ప్రసాదించిన కవితా శక్తి అతని ఉద్ధరణకు మాత్రమే పరిమితం కాదు. సామ్యవాద శైలిలో అది సాధకులందరి ఉమ్మడి సొత్తు. మనకు అనుగ్రహించబడిన హక్కుతో ఆ స్తోత్రాలను పాడి, ఆ రూపాన్ని కీర్తించి ఉద్ధరించబడాలి. అంబిక చేసే ఈ కవితా శక్తి అనే అనుగ్రహం ఆమె వాగ్దేవి అనే ప్రత్యేక రూపంలో చేస్తున్నట్లు చెప్పబడింది.

వరదాభయ ముద్రలు, అక్షమాలాపుస్తకములు ధరించి ఉన్న వాగ్దేవికి సతాం = మంచివారు, సజ్జనులు, సాధువులు; సకృత = ఒక్కసారి; నత్వా = నమస్కారం చేస్తే చాలు. ఎవరైనా ఒకసారి నమస్కారం చేస్తే అమోఘమైన వాగ్వైఖరి సిద్ధిస్తుందని ఇక్కడ చెప్పబడలేదు. ఉన్నతులు సత్ శీలురు అయినవారి విషయంలో మాత్రమే ఇది వర్తిస్తుంది. “మధుక్షీర ద్రాక్షా మధురి మధురీణా ఫణితయ” అన్న పాదం అటువంటి సాధువుల విషయంలో మాత్రమే సిద్ధిస్తుంది.
ఇక్కడ ఆచార్యులవారు తీపి అయిన వస్తువులను, మూడింటిని ఉపమానంగా చెబుతున్నారు. అవి తేనే, పాలు, ద్రాక్ష. ఇవి ఒక మధురమైన వస్తువులేకాదు. తేలికగా జీర్ణమవుతాయి. పటుత్వాన్ని ప్రసాదిస్తాయి. ఈ ఉపమానాన్ని ఎన్నుకోవడం ద్వారా సత్పురుషుల వాక్యములు మనుష్యులు గ్రహిస్తే వారికి విషయం తేలిగ్గా అవగతమవడమే తమ గమ్యాన్వేషణలో పటుత్వాన్ని కలిగిస్తుందని ఆచార్యులవారు సూచిస్తున్నారు. సత్పురుషులు వాగ్దేవి రూపంలో ఉన్న అంబికకు ఒక్కసారి నమస్కరిస్తే మధురమైన వాగ్వైఖరి ప్రసాదిస్తుందని చెప్పడానికి కవిత్వ ధోరణిలో “కథమివ – సన్నిదధతే” ఎలా ప్రసాదించకుండా ఉంటుంది? అని ప్రశ్నిస్తారు.

(రాబోయే మూడు శ్లోకాలలోని విషయానికి, పై విషయానికి సంబంధమున్నందున ఆ శ్లోకములపై మహాస్వామివారి ప్రసంగాలు చదివేటప్పుడు ఈ ప్రసంగం పునరాలోకనం చేయవలసి ఉంటుంది.)

(సశేషం)

#KanchiParamacharyaVaibhavam #కంచిపరమాచార్యవైభవం
#ParamacharyaSoundaryaLahariBhashyam
4/3/18, 07:33 - Paramacharyulu: మూకశంకరులు - మూకపంచశతి

జగద్గురువులు శ్రీ శ్రీ శ్రీ ఆది శంకర భాగవత్పాదాచార్యుల వారు దిగ్విజయములను పూర్తి చేసిన తరువాత మోక్షపురి అయిన కాంచీపురం లో సర్వజ్ఞ పీఠం స్థాపించారు, అదే మన కంచి కామకోటి పీఠం. ఆది శంకరుల తరువాత ఈ పీఠమును అధిష్టించిన వారు శ్రీ సురేశ్వరాచార్యుల వారు. వారి తరువాత ఉత్తరాధికారం శ్రీ సర్వజ్ఞాత్మన్ సరస్వతి స్వామి వారు నిర్వహించారు. ఆనాటి నుండి ఈనాటి వరకు నిరంతర జగద్గురు పరంపర కొనసాగుతూనే ఉంది.

ఆ గురుపరంపర లో మనకు తెలిసిన ప్రఖ్యాతి గాంచిన జగద్గురువులు శ్రీ శ్రీ శ్రీ కృపా శంకరులు, శ్రీ శ్రీ శ్రీ మూక శంకరులు, శ్రీ శ్రీ శ్రీ అభినవ శంకరులు, శ్రీ శ్రీ శ్రీ పరమశివేంద్ర సరస్వతి, శ్రీ శ్రీ శ్రీ భోధేంద్ర సరస్వతి మరియు ఈ తరములో ఉన్న మనందరికీ తెలిసిన అరవై ఎనిమిదవ పీఠాధిపతి నడిచే దేవుడు, పరమాచార్య శ్రీ శ్రీ శ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతి మహాస్వామి వారు. శ్రీ పరమాచార్య తరువాత ప్రస్తుత తరములో ఉన్న జగద్గురువులు శ్రీ శ్రీ శ్రీ జయేంద్ర సరస్వతి స్వామి వారు మరియు శ్రీ శ్రీ శ్రీ విజయేంద్ర సరస్వతి స్వామి వారు.

ఈ ఆచార్య పరంపరలో 20 వ పీఠాధిపతి గా ఉన్న వారు శ్రీ శ్రీ శ్రీ మూక శంకరేంద్ర సరస్వతి స్వామి వారు. వీరినే మనం మూక శంకరులు అని అంటాము. వీరు క్రీస్తు శకం 398 నుండి 437 వరకు పీఠాధిపతిగా ఉన్నారు. వీరి తండ్రి గారి పేరు శ్రీ విద్యావతి, వారు ఒక ఖగోళ జ్యోతిష్యుడు. మూక శంకరులు పుట్టుకతోనే మూగ-చెవుడు ఉన్నవారు. అందుచేతనే వీరిని మూక కవి అనేవారు. కానీ అమ్మ వారి కటాక్షం ఉంటే, పుట్టుకతో మాటలు రాని వాడు మాట్లాడతాడు అనడానికి మూక శంకరుల జీవితమే నిదర్శనం.

ఒక రోజు మూక శంకరులు కామాక్షీ అమ్మ వారి ఆలయంలో కూర్చుని ఉన్నారు. వారితో పాటు వేరొక సాధకుడు కూడా అమ్మని ధ్యానిస్తూ కూర్చున్నారు. కామాక్షీ అమ్మ వీరిని అనుగ్రహించదలిచి, కర చరణాదులతో ఒక స్త్రీ రూపంలో కదలి వచ్చింది. అలా వచ్చిన అమ్మ వారు తాంబూల చర్వణం చేస్తూ, అమ్మ నోటిలోంచి ఆ తాంబూలం ముద్ద (పిడచ) కొంచెం తీసి మూక శంకరుల ప్రక్కన ఉన్న సాధకుడికి ఇచ్చింది. ఆయన పాపం అమ్మ యొక్క ఆగమనం గుర్తించలేక, మామూలు ఒక స్త్రీ అనుకుని, ఎంగిలి అనే భావముతో అమ్మ ఇచ్చిన తాంబూలం స్వీకరించ లేదు.

కామాక్షీ అమ్మ వెంటనే ఆ తాంబూలమును మూక శంకరుల చేతికి ఇచ్చింది. మహా ప్రసాదంగా తీసుకుని కళ్ళకద్దుకుని నోట్లో వేసుకున్నారు మూక శంకరులు. అంతే తక్షణమే కామాక్షీ అమ్మ వారి అనుగ్రహముతో మూక శంకరులకి మాట వచ్చింది. మాట రాగానే, ఆయనలో కవితా ప్రవాహం పెల్లుబికింది, వెంటనే కామాక్షీ అమ్మ వారిని చూస్తూ ఆశువుగా ఐదు వందల శ్లోకాలు చెప్పారు మూక శంకరులు. ఈ ఐదు వందల శ్లోకాలను కలిపి మూక పంచశతి అంటారు. ఇందులో అమ్మ వారి యొక్క గొప్ప తనం వివరిస్తూ నూరు శ్లోకములు (దీనిని ఆర్యా శతకము అంటారు), అమ్మ వారిని స్తుతి చేస్తూ నూరు శ్లోకములు స్తుతి శతకము), అమ్మ వారి కన్నులు చూస్తూ నూరు శ్లోకములు (కటాక్ష శతకము), అమ్మ వారి నవ్వును స్తుతిస్తూ నూరు శ్లోకములు (మందస్మిత శతకము) & అమ్మ వారి యొక్క పాదములు స్తుతి చేస్తూ నూరు శ్లోకములు (పాదారవింద శతకము), ఇలా మొత్తం కలిపి ఐదు వందల శ్లోకములు చేశారు.

కామాక్షీ అమ్మ అనుగ్రహముతో మాట వచ్చిన మూక శంకరులు భక్తి పారవశ్యంతో చేసిన స్తోత్ర రత్న మాలయే "మూక పంచ శతి". ఇవి ఐదు శతకాలుగా ఉంటాయి.

1. ఆర్యా శతకం
2. స్తుతి శతకం
3. కటాక్ష శతకం
4. మందస్మిత శతకం
5. పాదారవింద శతకం

ఈ పంచశతి సాక్షాత్తు కామాక్షీ అమ్మవారే చెప్పారు అంటారు పెద్దలు. అమ్మయే మూక శంకరులలో ప్రవేశించి, భావి తరాల వారు ఉద్ధరింపబడాలని ఇంత అద్భుతమైన శ్లోకములను కటాక్షించింది జగన్మాత కామాక్షీ అమ్మ.

అమ్మ అనుగ్రహముతో మాటలు వచ్చి, ఐదు శతకములతో అమ్మని స్తోత్రం చేసిన తరువాత కామాక్షీ అమ్మ ఏమి వరం కావాలి అని అడిగింది. అప్పుడు మూక శంకరులు "అమ్మా, నోరు లేనివాడి చేత ఇంత స్తోత్రం చేయించి అనుగ్రహించావు, ఏ నోటితో నీ స్వరూపమును కీర్తించగలిగానో, ఆ నోటితో ఇక వేరే మాటలు మాట్లాడలేనమ్మా, కాబట్టి నన్ను మళ్ళీ మూగ వాడిని చెయ్యి" అని వేడుకుంటారు. అమ్మ అనుగ్రహించి మళ్ళీ మూక శంకరుల యొక్క మాట్లాడే శక్తిని తీసివేసింది.

ఈ విషయం తెలుసుకున్న అప్పటి కామకోటి పీఠాధిపతి శ్రీ శ్రీ శ్రీ మార్తాండ విద్యా ఘనేంద్ర సరస్వతి స్వామి వారు వీరి తల్లి తండ్రులకు కబురు పంపారు. ఈ పిల్లవాడికి పీఠం యొక్క ఉత్తరాధికారం ఇవ్వాలని ఉంది, మీరు అనుమతిస్తే సన్యాసం ఇస్తాను ఈ పిల్లవాడికి అని

అడిగారు. తల్లి తండ్రులు సంతోషంతో అంగీకరించడంతో, వారు తరువాత పీఠాధిపతి అయ్యారు. ఉజ్జయినీ సామ్రాజ్యం పాలించిన విక్రమాదిత్యుడు, కాశ్మీర్ రాజు ప్రవరసేనుడు, మాత్రుగుప్తుడు మొదలగు వారు మూక శంకరాచార్యుల వారిని అనన్య భక్తితో సేవించారు.

ఈ విధంగా కామాక్షీ అమ్మ వారి సేవలో తరించిన మూక శంకరులు శ్రీ ధాతు నామ సంవత్సరములో శ్రావణ పౌర్ణమి నాడు, మన గోదావరీ నదీ తీరంలోనే ముక్తిని పొంది, కామాక్షి-ఏకాంబరేశ్వరులలో ఐక్యం అయ్యారు.

అపార కరుణాసింధుం జ్ఞానదం శాంతరూపిణం
శ్రీ చంద్రశేఖర గురుం ప్రణమామి ముదావహం ॥

#KanchiParamacharyaVaibhavam #కంచిపరమాచార్యవైభవం
4/3/18, 13:03 - Paramacharyulu: <Media omitted>
4/3/18, 16:05 - Paramacharyulu: పదహారవ శ్లోక భాష్యం

కవీంద్రాణాం చేతః కమలవన బాలాతప రుచిం
భజంతే యే సంతః కతిచి దరుణామేవ భవతీం!
విరించి ప్రేయస్యా స్తరుణతర శృంగారలహరీ
గభీరాభిర్వాగ్భిః విదధతి సతాం రంజనమమీ!!

(బాల సూర్యుని కాంతి పద్మములను వికసింపజేసినట్లుగా కవీంద్రుల హృదయ పద్మములను వికసింపచేసే నిన్ను అరుణవర్ణముగా ధ్యానించే కొంతమంది సత్పురుషులు సరస్వతీదేవీ నవయౌవన శృంగార ప్రవాహము వంటి గంభీరమైన వాగ్జాలముతో, నీ భావవిదులైన సత్పురుషుల హృదయములను రంజింపచేసెదరు)

క్రిందటి శ్లోకంలో పరమసాత్త్విక స్వభావంతో తెల్లటి వర్ణము కలిగిన తల్లిగా వాగ్దేవిని స్తోత్రం చేసిన ఆచార్యులవారు ఆమెను ఈ శ్లోకంలో రాజస కోణంలో అరుణవర్ణగా వర్ణిస్తున్నారు. సూర్యుని సారథిని అరుణుడు అంటాం. అతడు సూర్యునికంటే కొంచెం ముందు ఉదయిస్తాడు కదా! దానిని అరుణోదయమంటాం. ఈ అరుణుడు ఎఱ్ఱటి ఎఱుపు. ఆయన ఉదయిస్తున్నపుడు తూర్పు దిశ ఎఱ్ఱటి కాంతులీనుతూ ఉంటుంది. అసలు అరుణము అంటే ఎఱుపు అని అర్థం. అటువంటి అరుణకాంతులతో అంబిక ప్రకాశిస్తుంటుంది. ఎఱ్ఱటి ఎఱుపుగా అంబికను ఎవరైతే ప్రార్థిస్తారో వారికి రజో సంబంధియైన శృంగార పూరితమైన కవిత్వం సిద్ధిస్తుందంటారు ఆచార్యులవారు. శృంగారము, ఎఱుపు వర్ణము రెండూ రజోగుణ సంబంధులే! కాబట్టి అరుణారుణంగా భావించబడిన అంబిక అటువంటి అనుగ్రహాన్ని ప్రసాదిస్తుంది.

ఇక్కడ శృంగారము సామాన్యార్థంలో వాడబడే పదంకాదు. కామేశ్వరీ కామేశ్వరుల మిథున భావంలోని అంతార్థాన్ని అవగతం చేసుకొని వర్ణించగలగడం శృంగారం. ఆ ఆదిదంపతుల శృంగారం వెనుకనున్న శృంగారపు పరమార్థాన్ని ఆస్వాదించి ఆనందం పొందగలిగినవారు "సతాం" సజ్జనులు లేక సాధువులు. "శరజ్జ్యోత్స్నా" అన్న శ్లోకంలో ధవళవర్ణమైన వాగ్దేవి అనుగ్రహం వల్ల కలిగిన కవిత్వం సాత్వికమైనది అయి ఉండాలి. దానిని ఆస్వాదించగలిగిన వారు విరాగులు. ఒక రకమైన ఆధ్యాత్మిక పరిణత దశలో జ్ఞానవైరాగ్యములను శృంగారభావంలో కూడా ఆస్వాదించ గలుగుతారు. అటువంటి సరస్వతీదేవిని అరుణవర్ణగా భావించేవారు పై చెప్పిన పరిణత మనస్కులైన సాధువుల హృదయములను అలరించే విధంగా పాడగలరు.

క్రిందటి శ్లోకంలో అంబికను ధవళమూర్తిగా ఆరాధించి తేనె, పాలు, ద్రాక్షల వంటి మధురిమ కలిగిన వాక్కులను పొందిన సాధువులు ఈ శ్లోకంలోని అరుణ సరస్వతిని ఆరాధించిన కొద్దిమంది మహాత్ముల చేత చేయబడిన గంభీరవాగ్జాలమును ఆస్వాదించ గలిగిన రసికులు. ధవళ సరస్వతి అనుగ్రహాన్ని పొందిన మధురిమ గల కవులు సాధారణమైన సాధువులు. మరి ఈ శ్లోకంలో కవులెవరు? వారు సంతః సాధుశ్రేష్ఠులు, ముందటి శ్లోకంలోని సాధువుల కంటే ఉన్నత స్థితి గలవారు. ఎందుకంటే "కతిచిత్ సంతః" కొంతమంది సాధువులే, తాము పురుషోత్తముని నాయికగా గుర్తించుకొనగలిగినవారు మాత్రమే శృంగారపరమైన కవిత్వం వ్రాయగలుగుతారు. ఆ కొద్దిమంది సాధువులు మాత్రమే మనలను ఆత్యంతిక స్థితికి చేర్చగల సత్యములున్న శృంగారభరితమైన పాటలను పాడగలరు. ఇక మిగిలిన సాధువులు దానిని ఆస్వాదించి ఆనందించగలరు.
ఆచార్యులవారిక్కడ "రంజనము" అనే పదం వాడారు. ఈ పదములో శ్లేష ఉన్నది. "ర" అనే వర్ణము (అక్షరము) ఎఱుపు రంగును సూచించిస్తుంది. అగ్ని ఎఱుపు రంగు. కాబట్టి కామాగ్ని – వాంఛ "ర"తో సూచించబడుతుంది. రమ్+జనము= ఎఱుపును జనింపజేసేది. పరిపక్వస్థితి అన్నమాట. పండిన ఫలము ఎఱ్ఱగా ఉంటుంది గదా! ఎండిన ఫలము తగలబడుతున్న కట్టె అంతటి ఎఱుపుగా ఉంటుండి కదా! అరుణారుణమైన వాగ్దేవిని ధ్యానించి సంపూర్ణంగా పరిణతి చెందిన సాధువుల చేత చేయబడిన కవిత్వము మిగతా సాధువులకు పరిపక్వమైన ఆనందాన్ని కలిగిస్తుందని దీని భావం. ఈ సరస్వతి అరుణ (ఎరుపు వర్ణం) – ఆమె అనుగ్రహాన కవులు "రమ్" ఎఱ్ఱదనాన్ని – శ్రంగార తరంగాలతో కూడిన కవిత్వాన్ని సృష్టిస్తారు. ఆచార్యులవారు ఆ కవిత్వాన్ని "గంభీరాభిర్వాగ్భి" ఎంతో లోతైన భావగర్భితమైన, అంతరార్థం కలిగిన మాటలుగా వర్ణిస్తున్నారు. ఈ కవిత్వమనే మహాసముద్రంలో పైకి కనిపించేవి శృంగారపు కెరటాలు. లోపలికి దూకితే జ్ఞాన ముత్యములు, పగడములు దొరుకుతాయి.

కామేశ్వరీ దేవి కూడా అరుణ అని పిలవబడుతోంది. "అరుణాం కరుణతరంగితాక్షీం" అన్నది ఆమె ధ్యాన శ్లోకం. ఆచార్యులవారిచే ఈ శ్లోకంలో స్తోత్రం చేయబడిన అరుణ సరస్వతి అష్టభుజ అయిన కామేశ్వరీ దేవి అని విజ్ఞుల అభిప్రాయం. నాలుగు చేతులలో కామేశ్వరి ధరించే ధనుర్బాణ పాశాంకుశములు మిగతా నాలుగు చేతులలో సరస్వతీదేవి ధరించే వరదాభయముద్రలు, పుస్తక అక్షమాలను ధరిస్తుంది.

(సశేషం)

#KanchiParamacharyaVaibhavam #కంచిపరమాచార్యవైభవం
#ParamacharyaSoundaryaLahariBhashyam
4/4/18, 07:08 - Paramacharyulu: ఎట్లు, ఎందులకు ప్రార్థించవలెను?

భగవంతుని మనమెట్లు ప్రార్థించవలెను? ఆయనను ఏ వస్తువులను అడుగవలె?
ఈ విషయమున మనకు సలహా నొసగగల్గిన వారెవరైనా ఉన్న- వారు పుణ్యశీలురును, ఆధ్యాత్మిక శిఖరముల నందుకొన్నవారును అగు మహాపురుషులే. వారిచేతనే మనము ఉపదిష్టులము కావలెను. చికిత్సార్థమువైద్యునికడకు, బ్రతుకుతెరగునకు శ్రీమంతులకడకు యాచనకును, ఆస్తి- తగాదాలకు న్యాయస్థానములకు వెళ్లునట్లే ఆధ్యాత్మిక విషయ వివరణకు మనము మహాపురుషులను ఆశ్రయించవలెను. ఇట్లు ఒక్కొక్క కార్యార్థము ఒక్కొక్కరి దగ్గరకు వెళ్లుతున్నాము. కాని మానవసహాయముచే కోరినదంతయు మనకులభ్యమగుట లేదు. అందువలన మొట్టమొదట మన చిక్కులనూ, తగాదాలనూ భగవంతుని ముందుంచి అటుపై మానవుల సహాయమును ఆపేక్షించవలెను. ఇది ఒక దృష్టి. మరికొందరు భగవంతుని ప్రాపంచిక విషయములకై ప్రార్థించడమెందుకు మోక్షార్థమే ఆయనను ఆశ్రయించదగునని చెప్పుదురు. కాని మనకు బండెడుసంసారము. మనపై ఆధారపడిన బంధువులు అనేకులు. వారిని అనాశ్రయులనుగా వదలి మన విధులనుసరిగా నిర్వర్తించక స్వార్థపరులమై మోక్షకాములము కాలేము. అందుచే మన విధులను మనము నిర్వర్తించవలె. ఎవరయినను మనకు సాయముచేసెడు వారున్న వారి సాయమున మన కష్టములు తొలగించుకొనవలెను. పెరవారికడకుపోవుటకు ముందు మన చిక్కులను, కష్టములను భగవన్నివేదితము చేసి అనుగ్రహములనకై ప్రార్థించవలెను. అవి చిన్న కష్టము లయినను సరే. పెద్ద కష్టములయినను సరే. కర్మలు ఫలవంతము లగుటకు మూడు అంగములు అవసరము. అవి ఈశ్వరానుగ్రహము, పురుషప్రయత్నము, అదృష్టము ఈ మూడూ లేనిచో మన ఈప్సితములు సిద్ధించవు.
శ్రీకృష్ణపరమాత్మ తన భక్తులను నాలుగు తరగతులుగ విభజించెను.

''చతుర్విధా భజంతే మాంజనా స్సుకృతినోర్జున,
అర్తో జిజ్ఞాసు రర్థార్థీ జ్ఞానీ చ భరతం

అర్జునా! పుణ్యాత్ములగు వ్యక్తులు నాలుగు రకముల వారు నన్ను భజించుచున్నారు. అందు ఒకరకము ఆర్తులు. రెండవరకము జిజ్ఞాసువులు. మూడవరకము అర్థార్థులు. నాలుగవ రకము జ్ఞానులు.

ఆర్తుడు కుటుంబభారముచే క్రుంగిపోయినవాడు. అతని మానసిక దైహిక బాధలు ఇంతింతకాదు. జిజ్ఞాసువు తత్త్వ జ్ఞానార్థి. అతడు సత్యమును అన్వేషించును. వస్తుగుణములను తెలుసుకొనగోరును. శాస్త్రములు, కళలు మొదల్కొని దివ్య జ్ఞానము, మోక్ష సత్యము వరకు అత డర్థము చేసికొను నిచ్చించును. అర్థార్థి ఆర్తుడు కాకపోయినను సౌమంగల్యము, సౌభాగ్యముకల్గించు మంగళవస్తువులను దేవతానుగ్రహమున బొందగోరును. దానధర్మములు చేయునిమిత్తము అతడు ఈశ్వరుని ఐశ్వర్య మడుగును. జ్ఞనమును పొందినతర్వాతకూడ జ్ఞాని దేవుని భజించును. జ్ఞాననిష్ఠుడై ప్రపంచములోని సమస్త వస్తువులలోనూ, భగవంతుని దర్శించుచు ప్రపంచమే భగవత్స్వరూపముగా నాతడు భావించును. దేవుడు తప్ప ప్రపంచమున వేరేమియు లేదని అతని భావన. అందుచే అతడు ప్రాపంచిక విషయములను గూర్చి తలచినను అదియును భగవద్విషయమే అగును. భగవదారాధనమే అగును. 'వాసుదేవ స్సర్వ మితి భజతే జ్ఞనీ' అతని భక్తినీ, సాధననూ అతని జ్ఞనమే సూచించును. సమస్తము వాసుదేవమయమని అతని అనుభవము. 'స మహాత్మా సుదుర్లభః' అట్టి మహాత్ముడు సాధారణముగా ఎక్కడనోగాని ఉండడు.

'వాసుదేవ స్సర్వ మితి' యను జ్ఞానముకలిగేంతవరకు సాధకునివర్తన ద్వైతము. అందు దైవము వేరు సాధకుడు వేరు అనెడు ద్వైతభావనయున్నది. కాని జ్ఞానియొక్క భక్తి అద్వైతభావజనితము. అతని భజనము అనుభవరూప భజనము. అది ప్రార్థనారూప భజనము కాదు. ప్రార్థనారూప భజనమున ప్రార్థించువాడు ప్రార్థింపబడువానికంటె వేరయిన వాడు. ఆర్తుడు, అర్థార్థి, జిజ్ఞాసువుల ప్రార్థన ఈ రెండవ తరగతికి చేరినది.

ఇక దేవుని దేనికై ఏనిమిత్తమై ప్రార్థించుట? ప్రపంచమున నన్ను అనుభవయోగ్యములయిన వస్తువు లన్నిటినీ మనము సేకరించవచ్చును. కాని మనస్సునకుశాంతిలేకపోయిన ఈవస్తుపంచయము ఏతృప్తియను ఇవ్వజాలదు. అందుచే బాహ్య విషయములనుండి కలిగెడు దుఃఖవిమోచనకై మనము దేవుని ప్రార్థించియే తీరవలయును. కాని మనశ్శాంతిలేనిచో దుఃఖములు మనలను వదలిపెట్టక మనతోడనే కాపురము చేయును. భగవత్పాదులు మనకు ప్రార్థించుటెటులో ఆప్రార్థనలో అర్థించవలసిన విషయములేనియో చెప్పియున్నారు. వారు వ్రాసినదే ఈక్రింది షట్పదీస్తోత్రము.

అవినయ మపనయ విష్ణో |
దమయ మనః శమయ విషయమృగతృష్ణామ్,
భూతదయాం విస్తారయ
తారయ సంసారసాగరతః||
దివ్యధునీమకరందే
పరిమళ పరిభోగ సచ్చిదానందే,
శ్రీపతిపదారవిందే
భవభయ భేదచ్ఛిదే వందే||
సత్యపి భేదాపగమే
నాథ త వాహం న మామకీన స్త్వమ్,
సాముద్రో హి తరంగః|
క్వచన సముద్రో న తారంగః||
ఉద్ధతనగ నగభిదనుజ

దనుజకులామిత్ర మిత్రశశిదృష్టే,
దృష్టే భవతి ప్రభవతి
న భవతి కిం భవతిరస్రారః||
మత్స్యాదిభి రవతారై
రవతారవతాఽ వతా సదా వసుధామ్,
పరమేశ్వర పరిపాల్యో
భవతా భవతాపభీతోహమ్||
దామోదర గుణమందిర
సుందరవదనారవింద గోవింద,
భవజలధిమథనమందర
పరమందర మపనయ త్వం మే||
నారాయణ కరుణామయ
శరణం కరవాణి తావకౌ చరణౌ,
ఇతి షట్పదీమదీయే
వదనసరోజే సదా వసతు||

ప్రథమశ్లోకమున ఆచార్యులు 'అవినయమపనయవిష్ణో యని ప్రార్థించిరి. అనగా మనమును అట్లు ప్రార్థించవలెనని యర్థము. ప్రతియొక్కరికిని ముఖ్యముగా నుండవలసిన గుణము వినయము. వినయ మను ఒక పదము అణకువ మర్యాద మార్దవము తిన్నదనములను సూచించును. వినయము నాగరితాచిహ్నము. ప్రజలలో వినయమును పెంపొందించు విధి మన ఆచారప్రకారము రాజుయొక్క ధర్మము. దిలీపమహారాజు గూర్చి కాళిదాసు 'ప్రజానాం వినయాధానాత్ రక్షణాత్ భరణా దపి' అని రఘువంశకావ్యమున వ్రాసినాడు. అనగా అంతఃకలహము, విదేశీయుల దండయాత్రనుండి రక్షించుట, ప్రజల యోగక్షేమములను భరించుట. ఇవేగాక ప్రజలను వినయమార్గ ప్రవర్తకులుగా చేయుటకూడ రాజవిధియైయున్నది.
అటులనే శిష్యునియందు వినయము పెంపొందించుట గురువుయొక్క విధి. శిష్యుని 'వినేయు'డనియు అందురు. అనగా వినయమునకు శిక్ష కావలసినవాడని అర్థము. గురువు వినేత. ఈ వినయభావము, మన శాస్త్రము లెంత పురాతనములో అంత పురాతనమైనది. గీతయందు ''విద్యావినయ సంపన్నే'' యని ఉన్నది. శిష్యుడనగా వినయమున సుశిక్షితుడగు వాడని యర్థము.

శిష్య పదమునుండియే శిక్కులనెడు మాటయుపుట్టినది. శిక్కులు తమ గురువును పూజింతురు. వారి మత ప్రవక్తలు గురునానక్, గురుగోవిందుడు. తమిళములోను మళయాళములోను గల విత్తగన్ అనుపదము వినీత అను పదమునుండి వచ్చెను.
మొట్టమొదట ఆచార్యులు 'అవినయ మపనయ'ౖనా అవినయమును తొలగింపుమని ప్రార్థించిరి, వినయము సౌగుణ్యమునకు పునాది, అవినయము దానికి విరోధి. తరువాత 'శమయ మనః'ౖనా అహంభావమును పోగొట్టుము. 'దమయ విషయమృగతష్ణాం' ౖవిషయవాసనలు ఎండమావులవంటివి. మనస్సును సవికల్పము చేయునది. మరీచికలలో ఎంత నీరు త్రావినను దాహముతీరదు. 'భూతదయాంవిస్తారము'ౖసమస్త భూతములందును నాకు విస్తారమగు దయకల్గునట్లు చేయుము. (దీనిఫలముచే) 'తారయ సంసారసాగరతః'ౖఈ సంసారసాగరమును దాటింపుము.

రెండవ శ్లోకమున ఆచార్యులు శ్రీపతియగు భగవన్నారాయణుని పాదపద్మములకు ప్రణమిల్లిరి. మనమును అట్లే చేయవలెనని సూచన. మొదటిశ్లోకమున చెప్పబడిన గుణము శ్రీపతి యనుగ్రహమున కాని కలుగదు. ఆయన దయ చేగాని ఇవి మనకు పొందుపడవను దృఢవిశ్వాస ముండవలెను.

మూడవశ్లోకమున భగవంతునిపై మనము ఎట్లు ఆధారపడియున్నామో సూచింపబడినది. భక్తునకును భగవంతునికిని భేదభావము తొలగి అద్వైతానుభవమండఉద కలిగే భావమును ''నే నేమో నీవాడను కాని, నీవు మాత్రము నావాడవు కావు. తరంగము సముద్రమునకు చెందునుగాని. సముద్రము తరంగమునకు చెందదు. ఈ తరంగమునకును, సముద్రమునకును ఆ భేదము నిజమేకాని, తరంగము సముద్రమున పుట్టినది. సముద్రము తరంగమున పుట్టలేదు'' అని ఆచార్యులు వ్రాసిరి.

నాలుగవ శ్లోకమున ముక్తపదగ్రస్త అలంకారముకాననగును. ''ఉద్ధృతనగ నగభిదనుజ, దనుజకులామిత్ర, మిత్రశశిదృష్టే; దృష్టే భవతి, ప్రభవతి, న భవతి కిం భవతిరస్రారః''

ఉద్ధృతనగస్ఃఅనగా గోవర్ధనగిరిని పైకెత్తినవాడా?

నగభిదనుజ్స పర్వతములకు విరోధియగు ఇంద్రుని తమ్ముడవు, ఉపేంద్రుడవు.
దనుజకులామిత్స్ర రాక్షసగణములకు విరోధివి.

మిత్రశశిదృష్టేస్ సూర్యచంద్రులుకన్నులుగాగలవాడా!

భవతి దృష్టే ప్రభవతి (సతి)స నీ దృష్టి ఎపుడు నాపై ప్రసరించునో 'భవతిరస్కారః న భవతి కిమ్' స అపుడు ఈ సంసార సాగరము దాటుట కష్టమా ఏమి?

ఈ శ్లోకము ఈ క్రింది ఉపనిషద్వాక్యమును జ్ఞప్తికి దెచ్చును.

''భిద్యతే హృదయ గ్రంథి శ్ఛిద్యంతే సర్వసంశయాః,

క్షీయంతే చాన్య కర్మాణి తస్మిన్ దృష్టే పరావరే||''

హృదయగ్రంథులన్నియు భేదింపబడును. సంశయములన్నియు ఛేదింపబడును. సర్వకర్మములును క్షీణములగును. (నశించును) ఎప్పుడు? కడుపెద్దదియు, కడుచిన్నదియు అగు వస్తువును ఎపుడు దర్శింతుమో, అపుడు, ఇవి యన్నియు పరంపరగా జరిగిపోవును. ఐదు, ఆరవశ్లోకములు మత్స్య, కూర్మావతారముల గూర్చి ప్రార్థన. ఆచార్యులు- దామోదర గుణమందిర సుందర వదనారవింద గోవిందభవజలధి మథనమందర-అని ఈ అవతారములను ప్రార్థింతురు. తనలోని చెడ్డతనమును తొలగింపుమని ఇందలి ప్రార్థన.

కడపటిశ్లోకమున ఈషట్పదీస్తోత్రమున వదనసరోజమున సదా వసించవలెనను ప్రార్థన చేయబడినది. ఈ ఆరుశ్లోకములే కాదు, కడపటిశ్లోకమునందలి పూర్వార్థమునన్న 'నారాయణ కరుణామయ శరణం కరవాణి తానకౌచరణౌ' అనునది అనన్య శరణాగతిని సూచిస్తున్నది. ఇట్లు ఈస్తోత్రమున మొదటి ఆరు శ్లోకములొకషట్పది. కడపటిశ్లోకమున మరియొక చిన్నషట్పది. మరియొక విశేషము. షట్పది యనగా తేనెటీగ. భక్తుడనే తేనెటీగ అందు ఇందు తిరిగి-కట్టకడపట గోవిందుని ముఖారవిందమునను. నయనారవిందమునను, చరణారవిందమునను వ్రాలి అందలి మధువును గ్రోలును.

ఆరవ శ్లోకమునందలి గుణమందిర శబ్దమునకు భగవానుడు సర్వగుణ పరిపూర్ణుడని యర్థము. అద్వైతులు బ్రహ్మమును నిర్గుణమని యందురు. వేదాంతులలో కొందరు బ్రహ్మమును సగుణమని చెప్పుదురు. పగటిపూట సూర్యకాంతి తెల్లగ నుండును. తెలుపు ఒకరంగుకాదు; అన్ని రంగుల మిశ్రమము. అటులనే అన్ని గుణములు బ్రహ్మమందు కలియును. సగుణ బ్రహ్మము నిర్గుణమగును. కావున శాస్త్రయుక్తముగా గుణ పరిపూర్ణతయే నిర్గుణమగునని తెలియుచున్నది. అంతిమమున బ్రహ్మముయొక్క సగుణ నిర్గుణభావములకు విరోధము ఏదియును లేదు.

'భవ జలధి మథన మందర' యనుటలో మన మందరమును జీవితములోని కష్టసుఖముల నెదుర్కొనియే మోక్షమునొందవలెనని అర్థము. వృక్షమునకు పై బెరడున్నది. లెక్కలేనన్ని ఆకులున్నవి. బెరడు వృక్షములోని జీవమును రక్షించును. ఆకులవలన పూలు పుట్టుచున్నవి. జీవితవృక్షమున గల చేదు-మోక్షమనెడు తీపికి- దారితీయు సోపానము. ఇందు మరువ గూడని నియమము ఒక్కటే. అది దైవభక్తి. ఆయనయే మందరము అనగా కవ్వము. ఈ సంసారసముద్రమును మథించి అమృతమును పొందవలెనన్న మనము కవ్వమును మరువరాదు.

భగవద్గీతవలెనే షట్పదియు ఒకేపదముతో ప్రారంభించి అదే పదముతో ముగింపబడుచున్నది. అర్జునునికి ఉపదేశము 'అశోచ్యా నన్వశోచ స్త్వమ్' అని ప్రారంభింపబడి 'మా శుచః' అను పదముతో ముగింపబడును. షట్పదియందు ఆచార్యులును 'అవినయ మపనయ' యని ప్రారంభించి 'అపనయత్వమ్ మే' యని ముగించినారు.

పరమాచార్యులైన శంకరాచార్యులచే ప్రణీతమై పవిత్రమైన ఈ స్తోత్రము సదా మా వదనసరోజములయందు నిలుపుము శ్రీమన్నారాయణమూర్తిని మనము సదా ధ్యానింతము గాక!

అపార కరుణాసింధుం జ్ఞానదం శాంతరూపిణం
శ్రీ చంద్రశేఖర గురుం ప్రణమామి ముదావహం ॥

--- "జగద్గురు బోధలు" నుండి

#KanchiParamacharyaVaibhavam #కంచిపరమాచార్యవైభవం
4/4/18, 12:58 - Paramacharyulu: <Media omitted>
4/4/18, 16:07 - Paramacharyulu: పదిహేడవ శ్లోక భాష్యం

సవిత్రీభిర్వాచాం శశిమణి శిలాభఙ్గరుచిభిః
వశిన్యాద్యాభిస్త్వాం సహజనని సఞ్చింతయతి యః!
స కర్తా కావ్యానాం భవతి మహతాం భఙ్గిరుచిభిః
వచోభిర్వాగ్దేవీ వదన కమలామోద మధురైః!!

వాగ్దేవి అని ఏకవచనంలో సరస్వతి చెప్పబడుతోంది. వాగ్దేవతలు అని బహువచనంలో వాడితే ఎనిమిది మంది చెప్పబడుతున్నారు. "అ" తో మొదలయే అచ్చులు పదహారు మొదటి వాగ్దేవత. అలాగే "క" వర్గము (అంటే క, ఖ, గ, ఘ, ఙ) ఒక వాగ్దేవత – ఈ రకంగా 51 వర్ణములు కలిసి ఎనిమిది మంది వాగ్దేవతలు. అచ్చుల వర్గపు వాగ్దేవత "వశిని". ఈ ఎనిమిది మంది వాగ్దేవతలు వశిన్యాది వాగ్దేవతలుగా పిలవబడుతున్నారు. వీరు శ్రీచక్రంలో ఏడవ ఆవరణలో ఎనిమిది కోణములలో సంస్థితులై ఉన్నారు. అంటే అంబికను చుట్టి ఉన్నారన్నమాట. వీరే అంబిక ఆజ్ఞతో లలితా సహస్రనామ స్తోత్రమును పాడారు.

వారు సమస్త శబ్దజాలానికి తల్లులు కాబట్టి ఆచార్యులవారు "సవిత్రీభిర్వాచామ్" అంటూ శ్లోకాన్ని ఆరంభిస్తున్నారు. చంద్రకాంత శిల అనే స్ఫటికము ఒకటుంటుంది అని పుస్తకాలలో ఉల్లేఖించబడి, అది చంద్రకాంతికి కరిగిపోతుందని నమ్మబడుతోంది. ఈ వాగ్దేవతలు చంద్రకాంతిని తమలో ప్రతిబింబించుకొనే చంద్రకాంత శిలలవంటివారట. ఒక శ్లోకంలో ఆచార్యులవారు అంబికను "శరజ్జ్యోత్స్నా శుద్ధం" అని, తరువాత శ్లోకంలో "అరుణామ్" అని ప్రస్తుతించారు. ఇక్కడ వాగ్దేవతల మధ్య పరివేష్టించి ఉన్న అరుణ అయిన అంబిక చెప్పబడుతోంది. వాగ్దేవతలతో కూడిన ఆ మహారాజ్ఞి ఎవరు "సంచింతయతి" చక్కగా చింతనచేస్తాడో, ధ్యానిస్తాడో అతడు "మహతాం భఙ్గి (భంగి) రుచి" మహాత్ములవలె కావ్యములు చేయగలిగిన వాడవుతాడు. అతని వాక్కులు మహాత్ముల వాక్కరి యొక్క రసపుష్టిని సంతరించుకొని ఉంటాయి. రుచి అనే మాట తినే వస్తువులు విషయంలో వాడబడేది. ఏ భాషలోనైనా కవితా రసాస్వాదన చేయగలిగే శక్తికి

కూడా తినుబండారాల విషయంలో ఉపయోగించే "రుచి" అన్న మాట ఉపయోగించబడుతుంది. నాలుకతో తెలియబడే రుచిని మాత్రమే ఎందుకు వాడాలి. అందుకే ఆచార్యులవారు నాసికతో ఆఘ్రాణింపబడే వాసన గురించి కూడా చెబుతున్నారు. అటువంటి సాధువుల చేత పలుకబడిన కవిత్వం తేనె, పాలు, ద్రాక్షలవలె తీపిదనాన్ని మాత్రమే కాదు వాసన కూడా కలిగి ఉంటాయట. ఎనిమిది మంది వాగ్దేవతల సమిష్టి రూపమైన సరస్వతీ ముఖకమలం నుండి నిర్గమించే దైవికమైన వాసన అది. ఆ సువాసన పరమ ప్రేమను రేకెత్తిస్తుంది.

"వచోభిర్వాగ్దేవీ వదన కమలామోద మధురైః". సరస్వతీ దేవి మూర్తీభవించిన నిర్మలత్వము. శుద్ధత. సమస్త సాత్విక లక్షణములకు ఆలవాలమైనది. కళలకు పుట్టినిల్లు. అటువంటి తల్లి నోరు తెరిస్తే మనం పీల్చే గాలి సువాసన భరితమవుతుంది. ఆమె దానికై సుగంధ ద్రవ్యాలతో కూడిన తాంబూలము వేసుకోనక్కరలేదు. ఆమె పూలు ధరించకుండానే ఆమె కేశపాశములు నలుదిక్కులా సువాసనలను వెదజల్లుతాయి. సరస్వతీ కటాక్షమున్న మహాకవుల పద్యాలు, కవిత్వము అటువంటి సువాసనలను వెదజల్లుతుంది. అమ్మవారి నోటి సువాసనే ఈ కవిత్వపు సువాసన. పరమేశ్వరుని పాడిన కొద్దీ నోరు సువాసనా భరితమవుతుంది అంటారు వళ్ళలార్ అనే కవి.

అంబిక కవితా శక్తిని అనుగ్రహిస్తుందని ఆచార్యులవారు సౌందర్యలహరిలో అనేక శ్లోకాలలో చెప్పారు. ఒక శ్లోకంలో అంబికచే అనుగ్రహింపబడిన స్తన్యం అపారమైన కవితశక్తిని ఇస్తుందని చెబుతారు. వేరొక శ్లోకంలో అంబికా కటాక్షం బ్రహ్మకే అసూయ కలిగించే విధంగా కవితా వైభవాన్ని కలిగిస్తుంది అని చెబుతారు. మరొక శ్లోకంలో అంబిక పాదోదకము వానిని పరవళ్ళు తొక్కే కవితా ప్రవాహం గలవానిగా చేస్తుదని చెబుతారు. అంబికను దర్శించిన తన ఆనందాన్ని ఆచార్యులవారు అనుపమానమైన శైలిలో తమ వాక్ప్రవాహంతో మనలను ఓలలాడిస్తున్నారు. అయితే తిరిగి తిరిగి ఆమె ప్రసాదించే కవితా శక్తి గురించి ముచ్చటించడమెందుకు. ఈ స్తోత్రాన్ని చదివే వారు అటువంటి అంబికా కటాక్షాన్ని తాము కూడా పొంది ఆమె దయతో మళ్ళీ ఆమెపై స్తోత్రములు వ్రాసి తాము తరించి ఇతరులను తరింపచేయాలని ఆచార్యులవారి ఆకాంక్ష.

(సశేషం)

#KanchiParamacharyaVaibhavam #కంచిపరమాచార్యవైభవం
#ParamacharyaSoundaryaLahariBhashyam
4/5/18, 07:44 - Paramacharyulu: హోమం - క్షేమం

అవి నేను రాణీపేటలోని ప్యారి & కొలో పనిచేస్తున్న రోజులు. జనవరి 1978 లో పరమాచార్య స్వామివారి దర్శనం కోసం మాట్టుపొంగల్ (కనుమ) రోజు కాంచీపురం దగ్గర్లోని శివస్థానానికి వెళ్ళాను. ఎప్పుడూ చిరునవ్వుతో ఉండే దర్శనం కాకుండా నన్ను చూసిన వెంటనే, "మీ నాన్నగారి మరణం తరువాత ఆయన చేస్తున్న హోమాలను ఎవరూ చెయ్యడం లేదు. నువ్వు కార్యాలయానికి వెళ్ళడం రావడం అదే పెద్ద అనుష్టానంగా పెట్టుకున్నావు" అని అన్నారు. మహాస్వామివారు అలా మాట్లాడడం నేను ఎప్పుడూ చూడలేదు.

వైదిక క్రతువులు చెయ్యడానికి నాకు యోగ్యత లేనందుకు చింతిస్తూ, ఎదో సాకు చెప్పి తప్పించుకోవాలని, "పరమాచార్య స్వామివారి కోసం చాలామంది హోమం చేస్తున్నారు" అన్నాను. అందుకు స్వామివారు "ఎవరు ఏమైనా చెయ్యని. నువ్వు ఏమి చేస్తున్నావని అడుగుతున్నాను" అన్నారు. వెంటనే అక్కడున్న శిష్యుడొకరు నాతో, "ఇవి స్వామివారు నీకిస్తున్న ఆదేశాలు. ఇంకేమి మాట్లాడకుండా వెళ్ళి స్వామివారు చెప్పినట్టు చెయ్యి" అన్నాడు.

నేను రాణిపేట తిరిగిరాగానే మా నాన్నగారు చేస్తున్న హోమాల గురించిన విషయాలన్నింటిని సేకరించి, శ్రీవిద్యా ఉపాసకులొకరి ఆశీస్సులతో మొట్టమొదటిసారిగా గురు పుష్యమి రోజు పరమాచార్య స్వామి క్షేమం కోరి మొదలుపెట్టాను. అలాగే కొనసాగించి ప్రతి నెలా స్వామి వారి జన్మ నక్షత్రమైన అనూష (అనూరాధ) నక్షత్రం రోజున చేసి వీలున్నప్పుడల్లా స్వామివారికి ప్రసాదం పట్టుకెళ్ళేవాణ్ణి.

1989-90 లో ఒకసారి పరమాచార్య స్వామివారు శ్రీమఠంలో నవ్వుతూ అందరితో మాట్లాడుతున్నారు. వారికి నన్ను చూపిస్తూ, "వీరి నాన్న, పనాంపట్టు దురైస్వామి ఇరవై ఏళ్ళపాటు నా క్షేమం కోసం హోమాలు చేసి వీలున్నప్పుడల్లా నాకు ప్రసాదం తెచ్చి ఇచ్చేవారు. ఇప్పుడు చాలామంది నాకోసం హోమం చేస్తున్నారు. కాని అప్పుడు ఆయన చేసిన హోమాల యొక్క ఫలితాలు నేను ఇప్పటికి పొందుతున్నాను. వారు ఇప్పుడు శరీరంతో లేరు. కాని నా ఆయుష్షు మాత్రం పెరుగుతోంది. ఇతను కూడా పదేళ్ళుగా నాకోసం హోమం చేస్తున్నాడు" అని అన్నారు.

మా నాన్నగారు పనాంపట్టు దురైస్వామి అయ్యర్ పరమాచార్య స్వామివారికి పెద్ద భక్తులు. వారు చాలా నియమ నిష్టలు కలవారు, సదాచార పరాయణులు. మహాస్వామివారి క్షేమం కోరి జన్మనక్షత్రం, పౌర్ణమి మొదలైన విశేష దినాలలో హోమాలు చేసి వారే స్వయంగా వెళ్ళి ప్రసాదం సమర్పించేవారు. 1950 - 70 లలో ఇలా చేసేవారు.

స్వామివారి అపారమైన జ్ఞాపకశక్తిని, మా కుటుంబంపై స్వామివారి అవ్యాజ కరుణని తలచుకొని చాలా సంతోషించాను. మా భాగ్యవశమున గత ఇరవైమూడేళ్ళుగా ఏ అంతరాయమూ లేకుండా హోమాలు చెయ్యగలగుతున్నాము.

అపార కరుణాసింధుం జ్ఞానదం శాంతరూపిణం
శ్రీ చంద్రశేఖర గురుం ప్రణమామి ముదావహం ॥

--- పనాంపట్టు సుబ్బు, మహా పెరియవళ్ - దరిశన అనుభవంగళ్ 4

#KanchiParamacharyaVaibhavam #కంచిపరమాచార్యవైభవం
4/5/18, 16:11 - Paramacharyulu: ఇరవైయవ శ్లోక భాష్యం: ప్రథమ భాగం

కిరంతీ మఙ్గేభ్యః కిరణనికురుబామృతరసం
హృది త్వా మాధత్తే హిమకర శిలామూర్తి మివ యః !
స సర్పాణాం దర్పం శమయతి శకుంతాధిప ఇవ
జ్వర ప్లుష్టాన్ దృష్ట్యా సుఖయతి సుధాధార సిరయా !!

(అవయవముల నుండి కిరణ సమూహ రూపమున అమృత రసమును వెదజల్లుతున్న చంద్రకాంత శిలామూర్తిగ నిన్ను హృదయమందు ధ్యానించువాడు గరుత్మంతుని వలె సర్పముల యొక్క మదమడచగలడు. అమృతధారలు ప్రవహించు సిరులు గల దృష్టితో జ్వర పీడితులను చల్లబరచగలడు.)

ఇంతకు ముందు చెప్పుకొన్న శ్లోకములో అంబిక యొక్క పరిచారికలైన వాగ్దేవతలు చంద్రకాంత శిలల వర్ణంలో ప్రకాశిస్తూ ఉంటారని వర్ణించబడింది. ఈ శ్లోకంలో అంబిక అదే వర్ణంలో ధ్యానించబడడం సూచితమవుతోంది. ముందు శ్లోకంలో చంద్రకాంత శిలను చెప్పడానికి "శశిమణిశిల" అన్న పదం వాడబడింది. శశమంటే కుందేలు. చంద్రునిలో ఉన్న మచ్చ కుందేలుని పోలి ఉంటుందని చెప్పబడుతుంది కదా! అందువలన చంద్రుడు శశి అని పిలవబడతాడు. అలాగే చంద్రుడు అమృతం కురిపిస్తాడనే సంప్రదాయా న్ననుసరించి సుధాకరుడనీ, మంచు ఉత్పత్తికి కారకుడని నమ్మబడటాన "హిమకరుడనీ" పిలవబడతాడు. ఈ శ్లోకంలో చంద్రుడు హిమకరునిగా పిలవబడ్డాడు.

హిమకర శబ్దాన్ని వాడడంలో ఆచార్యులవారు మనకు అంబిక వసించే స్థలాన్ని గుర్తుకు తెస్తున్నారు. ఆమె హిమాలయాలలోని కైలాసపర్వతం పై వసిస్తోందని మన నమ్మకం. అంతేనా ! అసలా చల్లని తల్లి హిమగిరి సుత. చంద్రకాంత శిలల వర్ణంలో ధ్యానించబడే ఆ తల్లి చంద్రుడు కురిపిస్తాడని చెప్పబడుతున్న అమృతమును ధారలుగా తన క్రీగంటి చూపుతో ప్రవహింపచేస్తుంది. అంతటి ఆమె చేయడంలో ఆశ్చర్యమేముంది. ఆమెను అలా భావించే భక్తులు తమ దృక్ప్రసారంలో అమృతపు కాల్వలు ప్రవహింప చేయగలరనడం ఈ శ్లోకపు ప్రత్యేకత.

మానవులకు అనేక విధములైన శరీరక మానసిక రుగ్మతలతో బాధపడుతూంటారు. మా వంటివారి వద్దకు వచ్చే భక్తులలో నాలుగింట మూడువంతుల మంది అటువంటి రుగ్మతల నుండి ఉపశమనముకై ప్రార్థిస్తూ ఉంటారు. ఆచార్యులవారిని లక్షోపలక్షలుగా భక్తులు ఇటువంటి రుగ్మతల ఉపశమనము కొరకై ప్రార్థించి ఉండాలి. వారికి అటువంటి రుగ్మతలను ఉపశమింప చేసే సామర్థ్యముంది. చేసే ఉంటారు. అయితే రాబోయే తరములు వారి ఇక్కట్లను ఉపశమింపచేయడమెలా!

ఒక మహాపురుషుని నేరుకునేరుగా కరచరణద్వయములతో దర్శించినపుడు వారి వివిధ లక్షణములను మనం గుర్తించగలుగుతాం. ఆయన ఒక జ్ఞానే కావచ్చు. మన ప్రార్థనతో ప్రేమైకమూర్తి, మాతృమూర్తి, మాతృవాత్సల్య భరితులు అయిన ఆ మహాపురుషునిలో మనకు సమస్త ఐహిక ఆముష్మికత ప్రసాదించ గలిగే లక్షణం చూడగలుగుతాము. ఆయన దానికై ప్రయత్నం చేయవలసిన అవసరం లేదు. మన ప్రార్థనలన్నీ ఆయన ఆశీస్సువలన ఫలవంతమవుతున్నాయి. కొంత మంది సిద్ధపురుషులు శరీర త్యాగానంతరము కూడా ఐహిక వాంఛా పరిపూర్తికి ప్రార్థించబడినా, సాధారణంగా జ్ఞాని దేహాన్ని వదిలిన తరువాత జ్ఞాన సంసిద్ధికి మాత్రమే ప్రార్థించబడటం మనం చూస్తున్నాం. దేహత్యాగానంతరము ఆచార్యులవారు ఆ విధంగా జ్ఞాన సంసిద్ధికై మాత్రమే ప్రార్థించబడుతున్నారు. అందువలననే రాబోయే తరాల వారు తమ ఇచ్ఛా పరిపూర్తికై ప్రార్థనలు సలపడానికి అనుకూలంగా వారు అనేక దేవతామూర్తులను వివిధ ప్రయోజనములకై ప్రీతులను చేసే విధముగా స్తోత్రములను పాడి మనకు అందించారు. అవి భౌతిక ప్రయోజనములను సమర్థమంతంగా ప్రసాదించగల మహాత్త్వము గలవి. సుబ్రహ్మణ్య భుజంగ స్తోత్రము అటువంటి వానిలో ఒకటి.

(సశేషం)

#KanchiParamacharyaVaibhavam #కంచిపరమాచార్యవైభవం
#ParamacharyaSoundaryaLahariBhashyam
4/6/18, 07:24 - Paramacharyulu: కళ – సంస్కృతి

లోకమున ఉత్తమభావనలు పెంపొందవలెను.

వృక్షములు అనుకూలములగు వానలు పడు సుక్షేత్రములలో చాలా ప్రొదిగను, దృఢముగను, దట్టముగను పెరుగును, ఆర్ద్రత ఎక్కువగుకొద్ది వృద్ధియును అధికము. వృద్ధి అధికమగుకొద్ది ఉత్తమభావనలు జనించుచునే యుండును. ఒక్కొక్క దేశమునను మహనీయులు జన్మించి తరుచు మంచి విషయములనుగూర్చి బోధించుచున్నయెడల ఆ దేశపు నాగరికతయు, కళాచారమును (కల్చర్) గొప్పగా నుండును.

కల్ (అరవము) కళ, కాలేజీ, కళాచారము ఇవన్నియు ఒకేపదమునుండి పుట్టినవి. ఫ్రెంచిభాషలో 'కాలే' యని యందురు. కాని దీనికి మూలము 'కలా' యనునదియే. కళ యనగా వృద్ధి లెక్కించుట. దినదిన ప్రవర్ధమానమగునది చంద్రకళలవలె.

ఒక్కొక్క దేశమునందును- అందలి జనుల ఉత్తమ భావనలు స్వార్థ త్యాగము, ఇతరులయందు ప్రేమానురాగములు, శాంతస్వభావము. అందరు సుఖసౌఖ్యములుగా నుండవలెననెడి కోరికలు - ఆ దేశము సంస్కృతిని సూచించును. నాట్యము, సంగీతము, చిత్రము, కవనము మొదలగునవి - ఇట్టి ఉన్నతభావముల మూర్తులే; రూపములే, ఆ విశాల భావనలే చిత్రరూపముగను, నాట్యరూపముగను, సంగీతరూపముగను, దాన త్యాగములుగను పరిణామము చెందుచున్నవి.
సంస్కృతిగలమానవుడు సమస్తజనానీకమునకు మిత్రుడు. అతనికి విరోధులెవ్వరును లేరు. అతనిలో 'స్వదేశో భువనత్రయమ్' అన్నభావన

రూఢియైయుండును. అతని హృదయ వైశాల్యము, ఎల్లరిని తన అనురాగపు హద్దులలోనికి తీసుకొని వచ్చు ఇచ్ఛకల్గినదై యుండును. మనకు ఉన్నదంతయు ఊరి వారికి చేరబెట్టిన సంస్కృతిగలమానవుడు సమస్తజనానీకమునకు మిత్రుడు. అతనికి రోధులెవ్వరును లేరు. అతనిలో 'స్వదేశో భువనత్రయమ్' అన్న భావన రూఢియైయుండును. అతని హృదయ మనగతియేమిటి? అన్న ప్రశ్న అతని భావనా కాశమున ఏనాడునూ పొడసూపదు. అదియే తని సంస్కృతి.

ఒకనికి సంస్కృతి యున్నదా లేదా యనుటకు అతని మనోభావనల వైశాల్యము మనము గుర్తించవలెను. దేహమున ఎన్ని వ్రణములున్నను వైద్యుడు హృదయమును పరీక్షించి అతడు రోగియా కాదాయని తీర్మానించును, అటులనే ఒక దేశపు సంస్కృతి యొక్క ఔన్నత్యమునకు కొలబద్ద ఆ దేశములోని మహనీయుల భావనలు, ఉద్దేశ్యములు, ఆచారములును, అవి ఆ దేశపు మహాకవుల వాగ్ధారలో వ్యక్తమగును.

కవులన్న పలురకములు, ఒక సంవత్సరములో నూరుగురు కవులు పుట్టి నూరుగురును మరగిపోవుదురు. కొందరి వ్రాతలు వారితోడనే మరగిపోవును. కొందరు కీర్తిగాని ద్రవ్యమునుగాని ఆశించక బృహత్కావ్యములను వ్రాసి యొకమూల నుంచుదురు. వానికై పలువురు తహతహలాడుచు వెదుక సాగుదురు. ఆభాష తెలియనివారు కనీసము తర్జుమాచేసియైన అందలి సారమును గ్రహించుటకు ఉత్కంఠితు లగుదురు. మరియొకతెగ కవులు కావ్యములు వ్రాసి వాసి ముద్రణార్థము చందాలకై ప్రతి గుమ్మమును ఎక్కి సతమత మగుదురు. అచ్చుఅయిన అలాటి పుస్తకములు అమ్ముడుపోక వారి యింటియందే స్థిరనివాస ముండును. నిజమైన యోగ్యతగల కావ్యములు అన్వేషింపబడును. మహాకవుల వాక్యములకు ఉపేక్షాదోష మెన్నటికిని ఉండదు. పాశ్చాత్య కవులలో హోమరు. షేక్స్పియరు అను ఇరువురు కవులు ఈ తరగతికి చెందినవారు.

మతప్రవక్తలలో సైతము కవులుండవచ్చును. కాని వారికి తమసిద్ధాంతముల నిలబెట్టుకొనవలెననెడి వాంఛ బలీయముగా నుండుటనే వారికవనములు ఆ సిద్ధాంతముల ననుసరించుచుండును. కాని మహాకవులు ఘంటాఘోషముగా ఉన్న దున్నట్లు మంచియో, చెడ్డయో తమకు తోచినది స్వేచ్ఛగా పలుకుదురు. వారివర్ణనలు, వాక్కులు యథాతథములు. మహాకవి స్వేచ్ఛాజీవియై తాను చూచినది. తనకు తోచినది, అందమైనది, మనోజ్ఞమైనది అంతయుగ్రంథస్థముచేయును. లోకము వానిని గ్రహించిన అతనికి సంతోషముకానీ, నిరాకరించిన దుఃఖముకానీ లేదు. ఏ బాధ్యత విచారములేక ఉన్నదున్నట్లు చెప్పుట అతనికి పరిపాటి. అందుచేత మతప్రవక్తలు సైతము వారి సిద్ధాంత నిరూపణకై మహాకవుల వాక్యముల నుదాహరించుట యొక ఆచారము.

దాదాపు వేయి సంవత్సరముల క్రితము కుమారిలభట్టు అను వారొకరుండిరి. ఉదయనాచార్యులనువారు మరొక మహాపురుషుడు. చాలమంది - ఆదిశంకరులు బౌద్ధమతమును మనదేశమునుండి వెళ్ళగొట్టిరని అభిప్రాయపడుదురు. ఇది సరికాదు. ఆదిశంకరులు బౌద్ధమును ఉండుమనిగానీ, వెళ్ళుమనిగాని చెప్పలేదు. ఈ సత్యమును ఆయనపేరు పెట్టుకొన్న నేనే చెప్పుచున్నాను. చిత్రములందును, శిల్పములందును బౌద్ధ స్వరూపము లుండుటవల్ల దేశమున బౌద్ధమత బాహుళ్య ముండినదని అభిప్రాయమేర్పడి యుండవచ్చును. ఆచార్యుల శాస్త్రగ్రంథములను గానీ, వారిపిదప వచ్చిన ఆచార్యుల గ్రంథములనుగానీ, మనము పరిశీలించిన బౌద్ధమతఖండనచాలా స్వల్పము. వారందరు సాంఖ్య మీమాంసా తత్త్వములనే శోధించి వానిని అంగీకరింప వీలులేదని వ్రాసిరి.

బౌద్ధమతమున చేరినవారు. అధికులు బిక్షువులే. గృహస్థులలో బౌద్ధమతమునకు చెందినవారు చాలాకొద్ది. ప్రస్తుతపు థియసాఫికల్ సొసైటికి చెందినవారు అనేకులున్నారు. కానీ వారిగృహములకు వెళ్ళి చూచిన వారి సంప్రదాయమంతయు వైదికమతము ననుసరించియుండును. ఒక మహనీయుడు జన్మించిన అతనిపైగల ఆదరాభిమానములచేత - ఆయన చెప్పిన విషయములలో శ్రద్ధచూపి యుండవచ్చును. అంతమాత్రమున ఆయనమతములో పూర్తిగా కలిసినట్టుగాదు. అటులనే ఆ కాలమున రాజులు, గృహస్థులు బౌద్ధమతమున అభిమానముంచిరే కాని, బౌద్ధమతసాంప్రదాయములను వారి నిత్యజీవితములోనికి తీసికొనిరాలేదు. భిక్షువులుమాత్రము పరిపూర్ణ బౌద్ధులు.

కాని బౌద్ధమును విస్తారముగా ఖండన మొనర్చినది ఉదయనాచార్యులును, కుమారిలభట్టును, ఉత్తరబిహారములోని మిథిలానగరవాసులు ఉదయనాచార్యులు. వీరు న్యాయ మీమాంసమును పాటించెడివారు. కుమారిలభట్టునకు వేద శాస్త్రములలోని కర్మానుష్ఠానములే ప్రమాణము. అందుచే ''బుద్ధుడు జ్ఞాని కావచ్చును. ఆమాత్రమున ఆయన చెప్పినది సార్వకాలికము కానేరదు. ప్రపంచము పుట్టినప్పటినుండి వచ్చెడి వేదవాక్యములే మనకు ప్రమాణము. రాతితో కట్టిన కట్టడము క్రిందపడవచ్చును. శిలామండపములును శిథిలము కావచ్చును. కాని మహాపర్వతములకు నాశనమనునది లేదు. వాని ఘనతను వాని స్థిరత్వమే తెలుపును. ఇక వేదములో శైలముకంటె శాశ్వతములయిన పవనాకాశముల వంటివి. అందులోని కర్మానుష్ఠానములే మనకు ప్రమాణము. కార్యా కార్యవివక్షకు మనము వేదములనే పాటించవలెను.'' అని బౌద్ధులవాదనను వీరు ఖండించిరి.

ధర్మము, ధర్మము అనగానేమి? దాని భూమిక ఎట్టిది? మన ధర్మములను రాచచట్టములు నిర్ధారించును. చట్టములను చేయునవి శాసనసభలు. ఈ సభ్యుల నందరను మనమే ఎన్ను కొందము. ఈ ఎన్నుకొనబడినవా రందరూ యోగ్యతకల వారేనా? వారు సరియైన మార్గముననే వోట్లను బడసిరా ? ప్రజలలో అందరకును వోట్లహక్కుగలదు. దొంగకు, దొరకు, మోసగానికి, నిరక్షరాస్యునికి - అందరకును సమానమైన వోటింగుహక్కుగలదు. ప్రజాప్రభుత్వమున ఇన్ని దొసగులు తెలిసియే మనము అంగీకరించుచున్నాము. మెజారిటి సభ్యులు ప్రభుత్వమును నడుపుదురు. చట్టములను చేయుదురు. కొన్ని సందర్భములలో చట్టము చొప్పున చేయబడిన న్యాయస్థానపు తీర్పులలో న్యాయము కనుపించదు. అందు న్యాయాధిపతులు తీర్పు చెప్పుచు చట్టముల మార్చవలసిన అవసరమున్నదని తమ అభిప్రాయములను ప్రభుత్వమునకు తెలుపుదురు.

ఆత్మార్థముగా కార్యాకార్యవిచక్షణ దేనిననుసరించి నిర్ణయించవలెను? 'వేదోఽఖిలో ధర్మమూలమ్' అను సూత్రమున్నది. అన్ని ధర్మములకు మూలము వేదములే. అది అనాదిగ నున్నది. అవి సార్వకాలికమును, సనాతనమును. ''నాడు చెప్పునదిఏమైనా వేదవాక్యమాఏమి?'' యను పరిహాసముగా అనెడు మాట వేదముల ఆధిక్యమును సూచించును.
వేదానుసారము నడచుకొందమన్న వేదము లమితవిస్తారములు. అనంతా వై వేదాః' అని అందురు. సామవేదమునకు వేయిశాఖలు. యజుర్వేదమునకు 101 శాఖలు, ఋగ్వేదమునకు 21, అథర్వణవేదమునకు 11 శాఖలునుగలవు. వేదములను పూర్తిగా చదివినవారుగూడ అరుదు. అటులైనచో మనవర్తన వేదబద్ధముగా నుండవలయునన్న ఎవరిసలహా తీసికొనుట?

వేదములను చక్కగా చదివిన మహర్షులు

'వేదోఽ ఖిలో ధర్మమూలమ్ తద్విదాం చ స్మృతిశీలే'

-గౌతమ ధర్మసూత్రము.

మనుస్మృతి, పరాశరస్మృతి అనునవి మహర్షి

రఘువంశమున వశిష్ఠాశ్రమమున దిలీపమహారాజునందినీ సేవచేయు సందర్భమునుగూర్చి కాళిదాసు ఒక శ్లోకము వ్రాసెను. దిలీపుడు అనపత్యుడు. అనపత్యాదోష నివారణార్థము కులగురువగు వశిష్ఠుని అతడు ఆశ్రయించును. వశిష్ఠుడు దిలీపునికి నందినిని చూపి దీనికి భక్తిశ్రద్ధలతో సేవచేసినచో దోషమువాసి పుత్రుని బడయుదువని చెప్పెను? ఆనాటినుండి మహారాజు పసులకాపరి అయెను. ధనుర్బాణధారియై ఆయన నందినివెంట వెళ్లును. అది నిలుచున్న తానును నిలుచుండును. అది పడుకొన్న తానును పడుకొనును. దానివెంట ఆయన ఛాయవలె వెంబడించెను.

స్థితః స్థితా ముచ్చలితః ప్రయాతాం
నిషేదుషీ మాసవబంధ ధీరః,
జలాభిలాషీ జల మాదదానాం
ఛాయేవ తాం భూపతి రన్వగచ్ఛత్||

దిలీపుడు వసిష్ఠుని ఆశ్రమమునుండి నందినిని తోలుకొని వెళ్లునపుడు సహధర్మచారిణి సుదక్షిణ - కొంచెము దూరము నందిని వెంటవెళ్ళి అటుపై తిరిగి వచ్చెడిదట, దీనిని కాళిదాసు అతిసుందరముగా వర్ణించును. నందిని ముందు వెళ్ళును. సుదక్షిణ అటు ఇటు చూడక నందిని అడుగుజాడలయందే నడచును. నందిని గిట్టలనుండి ధూళి ఎగసెడిది. ఆ ధూళి ననుసరించియే సుదక్షిణ వెళ్ళెడిదట.

తస్యాః ఖుర న్యాసపవిత్రపాంసు
మపాంసులానాం ధురి కీర్తనీయా,
మార్గం మనుష్యేశ్వరధర్మపత్నీ
శ్రుతే రివార్థం స్మృతి రన్వగచ్ఛత్||

పాంసువు అనగా ధూళి, (ఖురవిన్యాసమున) అడుగులు వేయుటవలన, (పవిత్రపాంసువు) పవిత్రమైన ధూళి పై కెగయుచున్నది. 'అపాంసులానాం ధురి కీర్తనీయా' ్ప కొంచెమైనను మాలిన్యములేనిది, ధూసరితముకానిది, కళంకములేని ఉత్తమ స్త్రీమనుష్యేశ్వర ధర్మపత్నియగు సుదక్షిణాదేవి - నందినీఖుర విన్యాస పవిత్రపాంసువులను చూచుకొనుచు, నందిని అడుగుల వెంట చనును. ఆ వెంటాడుట – శ్రుతులను అనుసరించి మహర్షులు కాళిదాసుచే వ్రాయబడిన శాకుంతలమందు - దుష్యంతుడు కణ్వాశ్రమమున ప్రవేశించి అందు శకుంతలను గాంచును. అపు డతనికి దానిని వివాహమాడ నిచ్ఛ ఉదయించెను. 'ఇది ధర్మమా? నేను క్షత్రియుడను. ఈకన్యాశ్రమనివాసిని. నాకిట్టి దురాలోచన ఎన్నడును కలుగలేదే. నే డెందుల కీ తలంపు. నా మనసెందులకు ఈ కన్యపై ప్రియపడుచున్నది? ఇది ఈశ్వర సంకల్పమా?' అని అతడు ముందువెనుకలాడి తన అంతఃకరణము చెప్పినరీతి నడచుకొన నిశ్చయించెను.

అనంశయం క్షత్త్రపరిగ్రహక్షమా
య దార్య మస్యా మభిలాభి మే మనః,
నతాం హి సందేహపదేషు వస్తుషు
ప్రమాణ మంతఃకరణప్రవృత్తయః||

అని కాళిదాసు వ్రాయును.

కుమారిలభట్టు ఈవాక్యమును - 'ఆత్మనః తుష్టిః' అనుదానికి - ప్రమాణముగా గ్రహించెను. విశిష్టాద్వైతధర్మములనుగూర్చి చెప్పునపుడు - వేదాంతదేశికులు - 'కవిచక్రవర్తి కాళిదాసు ఇట్లు చెప్పెను'- అని వ్రాసెను. ఇట్లు ఒక దేశపు సంస్కృతిని సూచించుటకు ఒక మహాకవి వాక్యముచాలును. అదియే ప్రమాణమగును. మహాకవి యనుటకు నిదర్శనము - అతని గ్రంథములు కాలగర్భమున విస్మృతములుకాక చిరంజీవములై యుండుటయే. అట్టి గ్రంథరాజమే కాళిదాసు శాకుంతలము.

సాధారణముగా మన మతమును గూర్చి ఇతరులు చర్చించునపుడు, మీ మతములో ఎంతమంది దేవుళ్ళు? ఎన్ని కొబ్బరికాయలు కొట్టుదురు? ఎన్ని దీపాలు వెల్గింతురు? ఒక్కస్వామి చాలడా? యని పరిహాసము చేయుదురు. ఇట్లు అనేక ఉపాసనమూర్తులను కలిగియుండుటను 'సోతిథీయిజం' అని అందురు. ఒకే దేవుని కొలుచుటకు మానోథీయిజం' అనిపేరు. ఈ కొత్తమతములు వచ్చుటకు ముందు అన్ని మతములందును నానాదైవములుండిరి. ఉన్నదైవములందరిని పారద్రోలి దేవుడొక్కడేయన్న ఒక మతమును మహమ్మదు అరేబియాలో లేవదీసెను. గ్రీసుదేశముననను ఇటులనే యుండగా క్రీస్తుఅనంతరము ఒక్క దేవుని పూజించుట ఆరంభమయినది. అటులయినచో మనదేశముననున్న ఇంతమంది దేవుళ్ళనుగూర్చి మహాకవు లేమయిన చెప్పిరాయను విషయమును గమనింపదగును.

కాళిదాసువలెనే బాణుడను కవి సంస్కృతమున మహా కవి. ఒక విధముగా కాళిదాసుకంటె ఇత డధికుడనియే చెప్పవలెను. 'బాణోచ్ఛిష్టం జగ త్సర్వం' అనెడు సూక్తి యొకటి వాడుకలో నున్నది. మిగతకవులు చెప్పునది అంతయు బాణుడు చెప్పగా వదలినది. - అతని

ఉచ్ఛిష్టమే అని దీనిభావము.

ఈ విధముననే కాళిదాసు గూర్చిన ప్రశంసావాక్యములెన్నో యున్నవి.

ఉపమా కాళిదాసస్య భారవే రర్థగౌరవం
దండినః పదలాలిత్యం మాఘే సంతి త్రయో గుణాః||

అని చెప్పుదురు. పైగా మన వ్రేళ్ళలో చిటికెనవ్రేలు (కనిష్ఠము) నకు ముందున్న వ్రేలు అనామిక అని యందురు. ఒకప్పుడు మహాకవులను లెక్కవేయుటలో కాళిదాసు ఒకటి యని చిటికెనవ్రేలితో లెక్కించి అటుపై ఎవరును తోచకపోగా అంతటితో ఆగిపోయిరట. అందుచే అనామకమైనదట రెండవవ్రేలు.

పురా కవీనాం గణనాప్రసంగే
కనిష్ఠికాధిష్ఠితకాళిదాసః,
అద్యాపి తత్తుల్యకవే రభావాత్
అనామికా సార్థవతీ బభూవ||
బాణుడు ఇటులు వ్రాయును:-
రజోజుషే జన్మని సత్త్వవృత్తయే
స్థితౌ ప్రజానాం ప్రలయే తమస్పృశే,
అజాయ సర్గస్థితినాశహేతవే
త్రయీమయాయ త్రిగుణాత్మనే నమః||

బ్రహ్మ, విష్ణు, శివులు నిజమునకు ఒక్కడే, కాని మూడుకార్యముల నుద్దేశించి సృష్టిస్థితిసంహారార్థము- మూడు రూపములనుదాల్చి రజస్సత్త్వతిమోగుణములకు ప్రతినిధులగుదురు. త్రయీమయ- ఋగ్యజుస్సామవేదములం దుపదేశింప బడిన వస్తువు ఇదేయని బాణమహాకవి జెప్పును.

కాళిదాసుకూడ ఇదేవిధముగ చెప్పును:-

ఏకైవ మూర్తి ర్బిభిదే త్రిధా సా
సామాన్యమేసం ప్రథమాపరత్వమ్,
విష్ణోర్హర స్తస్య హరిః కదాచిత్
వేదా స్తయో స్తా వపిధాతు రాద్యౌ||

ఒక్కమూర్తి ముప్వురుగ దోచును వీనిలో హెచ్చు తక్కువ లేవియునులేవు. ఇట్లు చూచిన హిందూమతములోని ముప్పదిమూడుకోట్ల దేవతలకును మూలమూర్తి యొక్కడే, అయినచో ఈ వివాదము లెందులకు? దేవుళ్ళలో ఉచ్చ నైచ్యములకు ఎడమేది? ఒక వంతెనక్రిందనిలిచి చూచిన మన మున్న విభాగము తక్కినవానికంటె పెద్దదిగా కనబడును. కానీ నిజమునకు అవి సమాన పరిమాణము కలవి. భక్తునికి తాను కొలుచు దైవమందు భక్తి ప్రేమలు అధికముగా నుండుటచే తాను కొలుచు దైవము అధికుడన్న భావన ఉదయించును. కాని నిజమునకు అన్ని దైవములును మూలపరతత్త్వముయొక్క సమానచ్ఛాయలే.

ప్రపంచములో సమస్త వస్తువులకు మూలము దేవుడు. బీజముయొక్కవృద్ధి - భూసారము, జలము ఈ మొదలగువానిని బట్టియుండును. మట్టిలో పుట్టిన వృక్షము అంతిమదశలో జీర్ణించి మట్టిలోనే కలియును. ఇది వృక్షపు జీవితచరిత్ర. తక్కిన జడ వస్తువులు చేతనములు, అచేతనములు - అన్నియూ యీ తెరగే. వృక్షమునకు ఆధారము మన్ను. మట్టికి ఆధారము పృథివి. అటులే మనచైతన్యములకంతయు నొకమూలచైతన్యముండవలెను. అదియే చిత్; చిదానందము. అదియే రజస్సత్త్వ తమోగుణ సంబంధముచే సృష్టి స్థితి లయముల నొనర్చును. అందుచేతనే దేవుని త్రిగుణాత్మకుడని యందురు.

కేవలము నిర్గుణమగు చిత్ స్వరూపము-పరబ్రహ్మము. శుద్ధసత్త్వపరబ్రహ్మమే గుణములతో కూడిన ఈశ్వరుడగును. సృష్టిస్థితిలయములు ఈశ్వరుని కర్మలగుచున్నవి. రజోగుణ సంబంధముచే సృష్టికర్తయగు బ్రహ్మయగును. సృష్టింపబడిన జగత్తును పరిపాలించుటకు సత్త్వగుణసంబంధముచే లక్ష్మీనాథుడగు విష్ణువగును. బహిర్గతమైన ప్రపంచమునులోనికిగొనుటకు, లయమును కల్గించుటకు ఆయనయే తమోగుణసంబంధముచే శివుడగును. ఈ సంహారక క్రియయు ఒక కరుణాకార్యమే. అజ్ఞానమున చిక్కిన ఆత్మలకు ప్రళయాంతమువరకు ఆయన విశ్రాంతి యొసగును. పునః సృష్టిలో వారు మరల సంచితకర్మలను అనుభవింతురు. ఈమూడుగుణములును నిజముగా ఈశ్వరునికి చెందినవి కావు. కాని ఈ మూడుకార్యములకై ఆయన యీ గుణస్పర్శ గావించును. ఆయన రూపములు వివిధములు కావచ్చును. కాని మూలతత్త్వమునందు భేదములేదు.

బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులను పూర్తిగా రజస్సత్త్వ తమోగుణములని చెప్పుటయు సరికాదు. విష్ణువు సత్త్వగుణ సంబంధుడైనను నరసింహావతారముననను, రామావతారమున- ఖరదూషణ కుంభకర్ణ రావణాదులను చంపునపుడు తమోగుణమును తాల్చును, లంకకు దారి యీని సముద్రమును నిర్జలము చేయుదునని ఆయన శరసంధానము చేసినపుడును తమోగుణము స్ఫుటమగును. వాల్మీకి - 'క్రోధమాహారయత్ తీవ్రం' అని చెప్పును. క్రోధము తమోగుణలక్షణము. అటులనే శివుడు తమోగుణుడైనను నటరాజ, దక్షిణామూర్తి అవతారములయందు సాత్త్వికతను ప్రదర్శించును. నిర్గుణబ్రహ్మ యొక్క ఆహార్యమిశ్రసత్త్వము ఈశ్వరునికి కారణమగును. శుద్ధసత్త్వము - ఈశ్వరుని ఆహార్య మిశ్రరజోగుణము బ్రహ్మకును, ఆహార్యమిశ్ర సత్త్వగుణము విష్ణువునకును, ఆహార్యమిశ్ర తమోగుణము శివునికిని- కారణమగుచున్నది. అటులే విష్ణువుయొక్క ఆహార్య తమోగుణముచే నరసింహమూర్తిగను, శివునియొక్క ఆహార్య సత్త్వగుణముచే

దక్షిణామూర్తిగను - రూపము లేర్పడినవి.

ఇట్లు ఏకదైవము అనేకమైనట్లు మనమతమును, మహా కవులును పల్కుదురు. ఇందు హెచ్చుతక్కువలను చూచుట. వివాదములు సల్పుట - పనిలేనివారికి విషయము. వస్తువ ఒక్కటి, రూపములు, నామములు వేరు కావచ్చును. కాని అంతిమసత్యమేమో ఒకటియే. ఈ విషయమునే మహాకవులు ఘోషించిరి. బృహదారణ్యకము, ఋగ్వేదము, యజుర్వేదాంతర్గతమగు రుద్రాధ్యాయము ఈ సత్యమునే ఉద్ఘాటించును.

అపార కరుణాసింధుం జ్ఞానదం శాంతరూపిణం
శ్రీ చంద్రశేఖర గురుం ప్రణమామి ముదావహం ॥

--- “జగద్గురు బోధలు” నుండి

#KanchiParamacharyaVaibhavam #కంచిపరమాచార్యవైభవం
4/6/18, 16:59 - Paramacharyulu: ఇరవైయవ శ్లోక భాష్యం: రెండవ భాగం

మనమితః పూర్వము చెప్పుకొన్నట్లు సౌందర్యలహరి మొత్తంగా ఒక మంత్రశాస్త్ర గ్రంథము. ఒక్క శ్లోకమునూ మంత్రంగా తెలుసుకొని జపిస్తే ఉద్దేశించబడిన ఫలితాలను పొందవచ్చు. కొన్ని శ్లోకములను జపించడం వలన లక్ష్మీ సరస్వతుల క్రీగంటి కృపాకటాక్ష వీక్షణముల చేత పునీతులం కాగలము. సంగీత సిద్ధికి, పుత్రప్రాప్తికి, ఎక్కడో ఉన్నవారి ఆరోగ్యమునకు, పరకాయ ప్రవేశమునకు, భూత ప్రేత పిశాచాదులను తరిమికొట్టడానికి, గృహబాధలను తొలగించడానికి సమర్థములైన శ్లోకములెన్నో ఈ స్తోత్రములో ఉన్నవి. కొన్ని శ్లోకములు జ్ఞాన భూమికకు అత్యంత సమీపమునకు తీసుకొని వెళ్ళగల సమర్థత కలిగి ఉన్నవి. మరి ఏ కోరికగా లేకుండా జపిస్తే ఆ జపించే వారి పరిణతిననుసరించి అంబిక సగుణ నిర్గుణ గుణములలో అతనికి సాక్షాత్కరిస్తుంది. మొదటి శ్లోకము, తుదిశ్లోకము సర్వసిద్ధి ప్రదములు.

కొన్ని శ్లోకములు జపిస్తే ఫలితం ఆ శ్లోక భావంలోనే మనకు లీలగా గోచరిస్తుంది. ఆచార్యులవారు ఈ శ్లోకాన్ని ఈ సిద్ధి అని ప్రత్యేకంగా చెప్పలేదు. అర్థాన్ని ఈ శ్లోకానికి ఈ ఫలం అని ఊహించవచ్చు. కొద్ది శ్లోకములలో మాత్రం ఫలం స్పష్టిపరచబడింది. ప్రస్తుత శ్లోకం అటువంటి వానిలో ఒకటి. ఇక్కడ కూడా అంబికను ఫలానా రూపంలో ధ్యానించిన వారికి ఫలానా ఫలితం లభిస్తుందని చెప్పబడింది. కానీ ఈ శ్లోకం జపించినందువల్ల అటువంటి ఫలితం సిద్ధిస్తుందని చెప్పబడలేదు. ఆచార్యులవారి నేరు శిష్యులలో తరువాత వచ్చిన శిష్యపరంపరలోని వారు ఈ శ్లోకం జపిస్తే ఈ ఫలితం సిద్ధిస్తుంది. దీనిని ఫలానా యంత్రపు సాన్నిధ్యంలో, ఇంత సంఖ్యలో, ఇన్ని రోజులలో ఈ ఈ నియమాలతో జపిస్తే ఈ ఈ ఫలితాలు సిద్ధిస్తాయని నిర్దేశించారు.

అర్థాన్ని బట్టి ఆ శ్లోకం ఏ ఫలితాన్నిస్తుందో ఊహించవచ్చని ముందు చెప్పుకొన్నాం కదా! 66వ శ్లోకములో అంబిక సమక్షములో వీణావాదన చేస్తున్న సరస్వతీ దేవి, ఆమె శ్లాఘిస్తూ చేసిన శబ్దముల మధురిమకు సిగ్గుబడి వీణకు గౌసిగుడ్డ తొడిగి వేసిందని చెప్పబడింది. సరస్వతీదేవి అంతటి విదూషీమణి చేసే వీణానాదం కూడా అంబిక వాక్కుల మధురిమ ముందు వెల తెల పోతుందన్నమాట. అలాగే “అమృతం త్రావిన దేవతలు మహాప్రళయంలో అంతరించిపోతారు. విషం కంఠంలో ఉంచ్చుకున్న నీ భర్త మాత్రం మహాప్రళయంలో నీతో పాటు రమిస్తూ ఉంటాడు” అని చెప్పబడిన 28వ శ్లోకం జపిస్తే విషప్రభావం నుండి విముక్తి దీర్ఘాయుస్సు స్త్రీలకైతే మాంగల్యబలం ఫలితంగా ఊహించవచ్చు.

కొన్ని శ్లోకాలను రెండు పరస్పర భిన్నములైన ఫలితాలుండవచ్చు. “శ్రుతీనాం మూర్ధానో” అన్న శ్లోకం తీసుకోండి. ఇది పరకాయ ప్రవేశసిద్ధికై జపించదగిన మంత్రం. అయితే ఇది ముక్తి కలిగించగలదిగా కూడా చెప్పబడుతోంది. ఉపాసకుని కోర్కె, అతని అవసరములననుసరించి ఆ శ్లోకం ఆయా ఫలితాలను ప్రసాదిస్తుందన్నమాటా. ఉదాహరణకు తేనె తీసుకోండి. నిద్దుర పట్టనివారికి నిద్ర పట్టడానికి ఉపయోగపడుతుంది. ఎప్పుడూ నిద్రమత్తులో తూగేవారికి చురుకుదనాన్ని ఇస్తుంది. డెబ్బైమూడో శ్లోకం అంబికా స్తన్యపాన ప్రభావం చేత గణపతి సుబ్రహ్మణ్యులు నిరంతరం బ్రహ్మచారులుగా ఉండగలుగుతున్నారనే విషయం వివరిస్తుంది. ఈ శ్లోకం సాధారణంగా బ్రహ్మచర్య నిష్ఠకు జ్ఞాన సిద్ధికి ఉపయోగపడుతుంది. అయితే బాలింతరాళ్ళకు ఈ శ్లోకాన్ని భక్తితో జపిస్తే స్తన్యవృద్ధి కలుగుతుందని చెప్పబడుతోంది.

(సశేషం)

#KanchiParamacharyaVaibhavam #కంచిపరమాచార్యవైభవం
#ParamacharyaSoundaryaLahariBhashyam
4/7/18, 09:57 - Paramacharyulu: సుమంగళి కోరిన వైధవ్యం

ఒక నాడు పరమాచార్య స్వామి వారి దగ్గరకు ఓ వృద్ధ సువాసిని వచ్చి, స్వామి వారిని ఓ విచిత్రమైన కోరిక కోరింది.

"స్వామీ ఒకవేళ నా భర్తకు ఏదైనా జరగరానిది జరిగి ఆయువు చెల్లితే, అది నేను ఉండగానే జరిగేలా ఆశీర్వదిం చ ం డి. నా కన్నా ముం దు, నా కళ్ళ ముందు ఆయన వెళ్ళిపోయేటట్టు అనుగ్రహించండి" అని ఆర్తితో వేడుకుంది.

వెంటనే మహాస్వామి వారు చిరునవ్వుతో, "అలాగే అవుగాక" అని దీవించి పంపారు. కానీ అక్కడ ఉన్నవారందరూ ఈ మాటలను విని నిశ్చేష్టులైపోయారు.

ఆమె అలా వెళ్ళిన వెంటనే స్వామివారితో, “స్వామీ! పెళ్ళి కాక ముందు చేసే నోములూ వ్రతాలు మంచి భర్త రావాలని, పెళ్ళైన

తరువాత చేసే సమస్త పుణ్యకర్మలూ భర్త ఆయురారోగ్యాలతో ఉండి ఆయన చేతుల్లో తను పుణ్య స్త్రీ గా పోవాలనీ కదా! మరి ఈవిడ ఇంత విపరీతమైన కోరిక కోరడమేమిటి? మీరు కూడా అలాగే అని దీవించడం. . .” అని ఆశ్చర్యంగా అడిగారు.

అందుకు స్వామివారు చిరునవ్వుతో "వారిది అన్యోన్య దాంపత్యం. భర్త మీద వల్లమాలిన ప్రేమ ఆవిడకి. ప్రారబ్ధమో లేక శాపమో వారికి పిల్లలు లేరు. వృద్ధాప్యం మరో బాల్యం అంటారు కదా! ఈ వృద్ధాప్యంలో ఆ భర్తకు ఈవిడే అన్నీ. ఆయన్ని చంటి పిల్లాడిలా సాకుతోంది. పైగా ఆయనకు జిహ్వాచాపల్యం కాస్త ఎక్కువ. మరి ఆవిడే ముందు కాలం చేస్తే ఆయన్నెవరు చూసుకుంటారు, ఆయన అవసరాలను పట్టించుకోనేదేవరు అని బెంగ ఆ తల్లికి. అందుకే ఆ కోరరాని కోరిక కోరింది" అని సెలవిచ్చారు.

భర్తకోసం పద్నాలుగేళ్ళు కారడవులను సైతం లెక్కచేయక ఆయన తోడిదే నా స్వర్గం అని సమస్త భోగాలను త్యజించి ఆయన్ని అనుసరించిన సుకుమారియైన రాకుమారి మన సీతమ్మ తల్లి. ఇప్పటికీ అటువంటి ఎందరో మహాతల్లులకు సీతమ్మ తల్లి ఆదర్శం.

భర్తే తన దైవంగా భావించి "శ్రీవారు" అని పిలుస్తూ గృహస్థాశ్రమంలోనే తరించిన అనేక మహాతల్లులు నడయాడిన నేల ఇది. వారందరినీ సీతమ్మవారి అంశగాగాక మరెలా పరిగణించగలం?

అందుకే స్వామి వారికి అంతటి అపార కరుణి ఆ తల్లిపై.

అపార కరుణాసింధుం జ్ఞానదం శాంతరూపిణం
శ్రీ చంద్రశేఖర గురుం ప్రణమామి ముదావహం ॥

#KanchiParamacharyaVaibhavam #కంచిపరమాచార్యవైభవం
4/7/18, 16:04 - Paramacharyulu: ఇరవైయవ శ్లోక భాష్యం: మూడవ భాగం

ఉత్తమశ్రేణికి చెందిన భక్తుడు “అమ్మా! నిన్ను అది ఇవ్వు, ఇది ఇవ్వు అని అడగను. నాకేది మంచిదని నీవనుకొంటే అది ఇవ్వు! నువ్వు ఏదీ ఈయకపోయిన పరవాలేదు. నా ఆనందం కోసం ఈ స్తోత్రంతో నిన్ను ప్రార్థిస్తూ ఉంటాను” అనుకొంటాడు. ఐతే అంబిక మనమేది కోరితే అది ప్రసాదిస్తుంది.

కొన్ని శ్లోకాలు అన్ని రోగములను నయం చేయగలవి ఉన్నాయి. “తవ వదన సౌందర్యలహరి” అన్న వాక్యమున్న శ్లోకం అటువంటి ఫలాన్నిచ్చేవాటిలో ఒకటి. కొన్ని శ్లోకాలు కంటివ్యాధులు, నరాల బలహీనత, మధుమేహము, కీళ్ళనొప్పులు, పాపాచరణ వలన కలిగిన మూగతనం వంటివి నయం చేయడానికి సమర్థములై ఉన్నాయి. ఏభై రెండవ శ్లోకంలో నీ కనులు చెవుల వరకూ విస్తరించి విశాలంగా ఉన్నాయని భావం వ్యక్తపరచబడింది. ఈ శ్లోకం జపించడం వల్ల చెవ్వి, కంటి వ్యాధులు నయమవుతాయి. శ్లోకము యొక్క అర్థము శబ్దం యొక్క అర్థానికి ఈ రకమైన సంబంధం చెప్పవచ్చు. అయితే ఈ శ్లోకం జపించడం వల్ల రోగాలు ఉపశమిస్తాయన్ని చెప్పబడింది. కారణం ఆ శ్లోకములో కూర్చబడిన శబ్దముల యొక్క మహిమ – నేనింత వరకూ జ్వరం ఉపశమింపచేయగలవి, విషాన్ని హరించగలవీ అయిన శ్లోకములు ఉదహరించలేదు.

“కిరంతీ మజ్గేభ్యః కిరణనికురుంబామృతరసం” అంబికను శరీరం నుండి కిరణరూపంలో అమృతం స్రవిస్తున్నట్లుగా ధ్యానించాలి. ఆమె “హిమకరశిలా మూర్తి” – చంద్రకాంతశిల వలె ప్రకాశిస్తుంది. చంద్రకాంతశిల వర్ణం ఎటువంటిది? శుద్ధ నిర్మలమైన స్పటికంలో చంద్రకాంతి ఎలా ప్రతిఫలిస్తుంది. చల్లగా, కాంతిమంతంగా, అతిమనోహరంగా ప్రతిఫలిస్తుంది కదా! అంబికను ఆ విధంగా అమృత కిరణములు వెదజల్లే చంద్రకాంత శిలతో చేయబడిన మూర్తిగా భావన చేయాలి. ఆమె మంచును కురిపించే చంద్రుని కాంతికి కరిగిపోయే స్వచ్ఛమైన చంద్రకాంత శిలావర్ణంలో ఉంటుండి. ఆమె రోమరోమం నుండి చల్లటి అమృత కిరణాలు వెదజల్లబడతాయి. ఈ ఆలోచనే ఒళ్ళు కాలిపోతున్నంత జ్వరం వస్తున్న రోగికి ఒక ఆస్వాదనను ప్రసాదిస్తుంది కదా! ఈ రకంగా అంబికను అమృతమూర్తిగా ధ్యానిణిన వారికి అమృతత్త్వం సిద్ధిస్తుంది. అమృతం మరి విషానికి విరుగుడు కదా! మరి అటువంటి వానికై విషప్రభావం ఏమి ఉంటుంది. విషానికి అమృతం వ్యతిరేకమైనదైతే, విషాన్ని నింపుకొన్న పాముకు వ్యతిరేకమైనవాడు గరుత్మంతుడు.

(3,12,15,16,17,60,64,75,98 శ్లోకాలు సరస్వతీ దేవి క్రీగంటి చూపులతో కలగచేసే అనుగ్రహానికి, 23,45,71,91 శ్లోకాలు లక్ష్మీదేవి కటాక్షానికి, 96, 99 శ్లోకాలు లక్ష్మీసరస్వతుల కృపకు, 66, 69 శ్లోకాలు సంగీత శాస్త్రంలో సిద్ధికి, 6,11,46,98 శ్లోకాలు పుత్రప్రాప్తికి, 30, 84 శ్లోకాలు పరకాయ ప్రవేశ సిద్ధికి, 24, 37, 85, 90 శ్లోకాలు భూత ప్రేతాదుల నుండి విముక్తికి, 40వ శ్లోకము గ్రహ బాధనుండి విముక్తికి 27,63,73,84,97, జ్ఞాన ప్రాప్తికి చెప్పబడినవి. 52వ శ్లోకము నేత్ర రుగ్మతలకు, 95, 96 శ్లోకములు వ్రణములకు, 41వ శ్లోకము కడుపులోని వ్రణములకు, 95వ శ్లోకము నరముల బలహీనతకు, 54వ శ్లోకము పాపాచరణము వలన కలిగిన రోగములకు, 60, 98 శ్లోకములు చెముడుకు నివారణోపాయముగా సూచించబడినవి.)

(సశేషం)

#KanchiParamacharyaVaibhavam #కంచిపరమాచార్యవైభవం
#ParamacharyaSoundaryaLahariBhashyam
4/7/18, 17:01 - Paramacharyulu: <Media omitted>
4/8/18, 07:04 - Paramacharyulu: దైవభకి – గురుభక్తి

ఈశ్వరుడు ఎట్లు నిర్వచించుట? ప్రతి మతమును భగవంతుని 'కర్త' యని పేర్కొనును. సృష్టిస్థితులకు ఆయన అధి కర్తయని చెప్పును. ప్రతి కార్యమునకును కారణ మొకటి యుండవలెను. సృష్టియు నొకకార్యమే. ఆకార్యఫలమే ఈ ప్రపంచము. ఈ సృష్టి

కార్యమునకు మూలకారణ మొకటి యుండవలెను. అట్టి కారకుడే ఈశ్వరుడు. బ్రహ్మసూత్రములందు 'కర్తాశాస్త్రార్థతత్వాత్' అని చెప్పబడినది ఈశ్వరుడు కర్మఫలదాత యనియును నుడువుదురు. మంచియు చెడ్డయు రెండును ఆయననుండియే కల్గును.

ప్రతి మతమును, భగవద్భక్తి అవసరమని ఉద్ఘాటించును. ఎందుచేత? ఈశ్వరుడు సృష్టికర్త; కర్మఫలదాత. ఆయనచేసెడి ఈ రెండుకార్యములకును, ఆయనయందలి మన భక్తికిని ఏమిసంబంధము? సృష్టించుట కర్మఫలముల నిచ్చుట ఈ రెండింటినీ ఆయన స్వేచ్ఛగా చేయును. ప్రపంచమును సృష్టించుమని ఆయనను ఎవరును అడుగలేదు. మన కోరికపై గాక తన కోరికకొద్దీ ప్రపంచమును సృష్టించిన సృష్టికర్తకు - మనము కోరిన ఫలములను నీయక తన ఇష్టానుసారము ఫలములు నిచ్చెడి కర్మఫలదాతకు - మనమేల భక్తిని చూపవలెను?

నాస్తికునకు ఈ ప్రశ్న అసలు ఉదయించదు. అతడు కర్తనుగానీ, కర్మఫలదాతనుగానీ అంగీకరించడు. అతనిది వైదిక సంప్రదాయము కాదు. వైదిక సంప్రదాయములో వచ్చిన సాంఖ్యము సృష్టికర్తను ఒప్పుకోనదు. అందులో ఒక తెగ నిరీశ్వరసాంఖ్యము. పూర్వమీమాంసకులు దేవుని కర్మఫలదాతగ నంగీకరించరు. వారికి దేవునితో, పనిలేదు. ఇట్లు ఈ ఇరు తెగలవారికి దేవు డక్కరలేదు. సాంఖ్య మతాను సారము ప్రకృతియే విశ్వమునకు కారణము. 'అదృష్టముచే కర్మఫలము సంభవించు' నని పూర్వమీమాంస చెప్పును. పూర్వమీమాంసకులకు కర్మఫలముల నిచ్చుటకు ఒక భగవంతుడు కాబట్టడు.

ఈ వాదముల రెంటిని ఆదిశంకరులు ఖండించిరి. ప్రకృతి జడము. ప్రపంచమును జడమే. ఒక జడవస్తువు మరియొక జడ వస్తువునుండి పుట్టజాలదు. అందుచే చేతనమగు వస్తువే ప్రపంచమునకు మూలకారణముగా నుండవలెను. కర్మఫలముల నిచ్చుటకు సైతము ఒక చైతన్యమూర్తికి వీలగును కానీ, జడవస్తువునకు వీలుకాదు. సాధారణముగా జనులు, 'బౌద్ధమతమును శంకరులు ఖండించి' రని చెప్పుదురు. కాని వారు ముఖ్యముగా సాంఖ్య మీమాంసావాదములనే ఖండించిరి. బౌద్ధమతము బోధించిన వైదికకర్మ నిరాకరణమును, నిరీశ్వరత్వమును మీమాంసకులగు కుమారిలభట్టును తార్కికులగు ఉదయనా చార్యులును ఖండించిరి. నిజమునకు బౌద్ధమత ప్రతిపక్షులు వీరు.

సృష్టికర్తయు, ఫలదాతయు నగు ఈశ్వరు డొకడున్నాడని అంగీకరించిన యెడల ఆయనను పూజచేయ నవసరమేమి? దీనికి బదులు పతంజలి మహర్షి మనస్సు నేకాగ్ర మొనరించి యేదే నొక వస్తువును ధ్యానించిన ధ్యేయమగు ఆవస్తుగుణములు మనకు అలవడును. కట్టకడపట ఆవస్తువే మన మగుదుము. ఈశ్వరుడు సర్వజ్ఞుడు. ఆయనకు కోరికలేమియు లేవు. అందుచే ఆయన తన్ను ధ్యానించినవారిని తనవలెనే ఆశారహితులుగ చేయును. అచలముగ, ఈప్రపంచమున స్థాణువువలె మనముండగోరినచో స్థాణువగు ఈశ్వరునియందు మనము భక్తినుంచవలెను.

ప్రార్థన భక్తియందొక విభాగము. జనులు ఇది ఇమ్మని అది ఇమ్మని భగవంతుని ప్రార్థింతురు. ఒక ప్రయోజనమును ఉద్దేశించి ప్రార్థన ముండరాదు. కోరినదానిని దేవుని అడుగనేల? నీకోరిక ఏమిటో తెలియలేని, అజ్ఞానియా అతడు? అతడు సర్వజ్ఞుడుకదా! తనకడకు నీవు వచ్చెదవనియు, వచ్చి ప్రార్థింతువనియు ఆయన నీకై వేచియుండునా ? నీవు అడుగు నంతవరకు నీ కోరిక ఏమిటో ఆయనకు తెలియదనుట ఆయన సర్వజ్ఞత కొక కొరత, నీవు అడుగునంతవరకు నీకు వలసిన వస్తువును ఈయక జాగుచేయుచున్నాడనిని ఆయన దయ కొక కొరత.

తల్లి మీనాక్షిని సంబోధించుచు, శ్రీ నీలకంఠదీక్షితులిట్లు చెప్పును.

ఆవేద్యతా మవిదితం కి మథాప్యనుక్తం
వక్తవ్య మాంతర రుజోపశమాయ నాలమ్,
ఇత్యర్థసే కి మపి తచ్ఛ్రవణే నిధాతుం
మాతః ప్రసీద మలయధ్వజ పాండ్యకన్యే||

'అవిదితం ఆవేద్యతాం కిం' నీకు తెలియనిది నేను చెప్పబోవుచున్నానా ఏమి? 'అథాపి' కానీ, 'వక్తవ్యం అనుక్తం (చేత్) చెప్పవలసినది చెప్పకపోయినచో, అంతరరుజ ఉపశమాయ నాలం' అంతర్యముననున్న బాధ శమింపదు. 'ఇతి' అందుచే, 'కి మపి తత్ శ్రవణే నిధాతుం అర్థ్యసే' నేను చెప్పు దానిని కొంత చెవియొగ్గివినుము. 'మలయధ్వజ పాండ్యకన్యే!' ఓ మీనాక్షీ! నాయెడల ప్రసన్నవుకమ్ము.

అందువలన 'ప్రార్థనయొక్క ప్రయోజనమేమి?' అని ఎవరయిన ప్రశ్నించిన, 'చెవియొగ్గి విను దయాశీలియగు పరమేశ్వరునికి మన హృదయబాధలను తెలుపుటయు, తద్వారా కొంత బాధోపశమనము పొందుటయు'' అని చెప్పవలసి వచ్చును.

ప్రార్థన చేసినంతమాత్రమున మనము దేవుడు నిర్ణయించిన విధిని మార్చి వేసితిమని కాదు. నిజమునకు ఆయన విధిని ఏమానవుడును మార్చలేడు. మనము ప్రార్థించుట మనమనో మాలిన్యములను పోగొట్టుకొనుటకు, నిస్సంగత్వము అలవరచుకొనుటకు. 'సాంగత్యదోషము పోవలెనన్న నిస్సంగితో సంగిత్వమును పెంచుకొమ్ము' అని తిరువళ్ళువరు బోధించును. దేవుడొక నిస్సంగి. ఆయనతోడి సాంగత్య మభివృద్ధి అగుకొలది మన సాంగత్యదోషము లన్నియు, ఒక్కటొక్కటిగా జారిపోవును. దైవప్రార్థన క్రమమార్గమున చేసిన ఆయన తన సాంగత్యమును మనకు చేకూర్చి ప్రాపంచిక విషయములలో నిస్సంగత్వమును అలవాటుచేయును. విషయబద్ధమగు మనస్సును మరల్చి, చిత్తస్వాస్థ్యము లభించునట్లు చేయును. అదియే చిత్తవృత్తి నిరోధము. అదియే యోగము. అట్టి యోగము భక్తిచేత లభించును.

మన సంప్రదాయమున ఈశ్వరుడును, గురువును ఒక్కడే.

యస్య దేవే పరాభక్తి ర్యథా దేవే తథా గురై,
తస్యైతే కథితా హ్యర్థాః ప్రకాశంతే మహాత్మనః||

కానీ, దేవుడు చేయు మూడుకార్యములు సృష్టి, స్థితి, లయములు మాత్రము గురువునకు లేవు. దేవుని కడకుమనము ఏ విషయమునకై వెళ్ళుదుమో వానిని గురువే మనకొసగగలడు. పరాభక్తి మాత్రము మనకు మన గురువునం దుండవలెను. దేవునియం దెట్టి భక్తినుంచెదమో, అట్టి భక్తియే గురువునందు సహిత ముంచవలెను. గురువు దొరకనప్పుడే దేవుని అవసరము. దైవభక్తికంటె గురుభక్తి గురుతరము. ప్రయోజనకారి. 'దేవుడు గురువుకంటె అధికుడని నేను చెప్పజాలను' అని వేదాంతదేశికులందురు.

''శివే రుష్టే గురు స్త్రాతా గురౌ రుష్టే న కశ్చన''

శివుడు కోపగించుకొన్న గురువు రక్షించును. గురువే కోపగించిన అతనిని రక్షించుటకు ప్రపంచముననే రక్షకుడు లేడు అని అనుట వాడుక. గురువునందు అనన్యభక్తితో ఏ దాపరికము లేక శరణుజొచ్చిన అతడు మనలను దుఃఖముల నుండి రక్షించి మోక్షమునకు గొనిపోవును. ఈశ్వర భక్తికి గురుభక్తి అవసరము. ప్రజలకు గురుభక్తి లేమిచేతనే దైవభక్తి కుదరుటలేదు.
గురువు త్రిమూర్తి స్వరూపము. అతడే బ్రహ్మ, విష్ణు, మహేశ్వరుడు. అనుదినము చేయు గురుప్రార్థనతో

గురు ర్బ్రహ్మ గురు ర్విష్ణు ర్గురుర్దేవో మహేశ్వరః,
గురు స్సాక్షాత్ పరబ్రహ్మ తస్మై శ్రీ గురవే నమః||

అందుచే మనము ఈశ్వరభక్తి, గురుభక్తి యుక్తులమై గురువునే దైవముగా గౌరవించి భజింతుముగాక!

అపార కరుణాసింధుం జ్ఞానదం శాంతరూపిణం
శ్రీ చంద్రశేఖర గురుం ప్రణమామి ముదావహం ॥

--- “జగద్గురు బోధలు” నుండి

#KanchiParamacharyaVaibhavam #కంచిపరమాచార్యవైభవం
4/9/18, 06:44 - Paramacharyulu: నందనార్ పరంపర

పరమాచార్య స్వామివారు మకాంచేసిన ఒక ఊర్లోని గ్రామదేవత ఆలయం దర్శించుకొని తామింటున్న బ్రాహ్మణ వీధిలోకి నడుచుకుంటూ వస్తున్నారు. వారితో పాటు ఏడెనిమిదిమంది పరిచారకులు శిష్యులు ఉన్నారు. దార్లో ఇరువైపులా రెండడుగుల గోడతో ఒక చిన్న కల్వర్టు ఉంది. ఒక గోడపై గుమ్మడికాయలు, శెనక్కాయలు, అనపకాయ మొదలైన చాలా కూరగాయలు, కొబ్బరికాయలు, కొబ్బరి బోండాలు పెట్టి ఉన్నాయి. దేవాలయానికి వెళ్ళేటప్పుడు కనపడని ఆ సంభారాలను ఇప్పుడు చూసి వారందరూ ఆశ్చర్యపొయారు. కాని జరగబోయే మరో పెద్ద ఆశ్చర్యం వారికి తెలియదు.

ఆ గోడ దగ్గరకు రాగానే మహాస్వామివారు ఆగారు. స్వామివారికి పదిహేను అడుగుల దూరంలో ఒక తక్కువ కులస్థుడు నిలబడి ఉన్నాడు. అతను అత్యంత భక్తితో చేతులు కట్టుకుని, స్వామివారి దివ్యమంగళ రూపాన్ని కళ్ళతో జుర్రుకుంటూ వినయవిధేయతలతో నిలబడ్డాడు. బాలు మామ అతణ్ణి “తిరుక్కుళత్ తిరుత్తొండన్” అని పిలిచేవారు.

అతని కళ్ళనీరు పెల్లుబికి బయటకు రావడానికి సిద్ధంగా ఉన్నాయి. స్వామివారు ఉన్న చోట నిలబడకుండా, ఆత్మప్రదక్షిణ చేస్తున్నట్టుగా చాలా సార్లు అటువైపు ఇటువైపు తిరుగుతూ అక్కడున్నవారితో పిచ్చాపాటి మాట్లాడుతున్నారు. అవును చిన్నపిల్లాడిలా ఏమి సంబంధంలేని మాటలు మాట్లాడుతున్నారు.

అలా మాట్లాడటంలో ఆంతర్యం ఏమిటి? ఎవరికి అర్థం కావడంలేదు. అతను వాటిని అక్కడ ఎందుకు ఉంచాడో అడగమని వారిని అడిగారు.

“నేను వాటిని ‘సామి’ కోసమే అక్కడ పెట్టాను. ఇవన్నీ మా తోటలో పండించినవి. ‘సామి’ గుడికి వెళ్ళడం నేను చూశాను. మళ్ళా ఇటే తిరిగొస్తారని తెలిసి, పరిగెత్తుకుంటూ ఇంటికి వెళ్ళి తెచ్చాను. పాలో, పెరుగో అయితే ‘సామి’ తీసుకోరు కదా! ఇవైతే తీసుకుంటారని. తీసుకుంటారు కదా?” అని అన్నాడు.

వాటిని తీసుకోవాల్సిందిగా పరిచారకుణ్ణి ఆదేశించారు స్వామివారు. ఆటవికుడైన గుహుడు భక్తితో ఇచ్చినదాన్ని శ్రీరామచంద్రుడు ఆనందంతో స్వీకరించినట్టు. ధర్మాన్ని ఎలా ఆచరించాలో చూపినవాడు శ్రీరాముడు. ఇవన్నీ రేపు చంద్రమౌళీశ్వరునికి సమర్పించడానికి.

ఒక పదడుగులు ముందుకు వెళ్ళి స్వామివారు వెనక్కు తిరిగి చూశారు. అతను కళ్ళనీరు తుడుచుకుంటున్నాడు.

“నాకు సాష్టాంగం చేసినవారు నా వెనక్కు చూడగలరా?” అని అడిగారు.

"లేదు, చూడలేరు”

“మరి నా వెనుకకు చూడాలంటే ఏం చెయ్యాలి?”

“వారు పరమాచార్యకు ‘ప్రదక్షిణం’ చెయ్యాలి”

ఒక్క నిముషం అంతా నిశ్శబ్ధం.

"లేదా నేనే అతనిముందు ఆత్మప్రదక్షిణం చెయ్యాలి. అప్పుడు అతను నన్ను అన్నివైపులనుండి చూడగలడు. అవును కదా?" అని అన్నారు.

అందరూ నిశ్చేష్టులయిపోయారు. "ఓహ్! అదా సంగతి. కల్వర్టు దగ్గర చేసిన పనంతా ఇందుకోసమేనా? ఆత్మ-ప్రదక్షిణం. అవును కదా"

ఎవరి కోసం? ఏ శివభక్తుని కోసం ఈ దర్శనమంతా? అవును అతనికోసమే; ఆ నిజమైన భక్తునికోసమే. భక్తులకు ఆ కూరగాయలన్నీ శబరి రామునకిచ్చిన పళ్ళు. తెల్ల గుమ్మడికాయ 'శివలింగము'. దానిపైనున్న బూడిద 'విభూతి'.

అందరూ విడిదికి చేరుకున్నారు.

"అతను నందనార్ పరంపరకు చెందినవాడు" అని స్వామివారు లోపలికెళ్ళారు.

అక్కడున్నవారందరూ ఈ సంఘటనకు చాలా ఉద్వేగం చెందారు.

దేశాధినేతలకు కూడా లభించని ఇంతటి విశ్వరూప దర్శనం అతనికి లభించింది. మహాస్వామి వారి దృష్టిలో అతనే నిజమైన పరమేశ్వర భక్తుడు. మరి ఇక అంతకంటే అర్హత ఇంకేంకావాలి?

అపార కరుణాసింధుం జ్ఞానదం శాంతరూపిణం
శ్రీ చంద్రశేఖర గురుం ప్రణమామి ముదావహం ॥

--- శ్రీమఠం బాలు మామ, మహా పెరియవళ్ - దరిశన అనుభవంగళ్ 6

#KanchiParamacharyaVaibhavam #కంచిపరమాచార్యవైభవం
4/10/18, 09:02 - Paramacharyulu: మహత్వం - మాయ

కంచి మఠంలో త్రిపురసుందరీ చంద్రమౌళీశ్వరుల నైవేద్యముకు చేయవలసిన అన్నము అధరవుల విషయంలో ప్రమాణమున్నది. ఎన్నిసార్లు పూజ జరిగినా అడ్డడో కుంచడో ఆ ప్రమాణం ప్రకారం అన్నం వండి వార్చాల్సిందే! ఒకసారి మూడు కాలముల పూజ ఒకేసారి జరుగుతోంది. మూడో కాలంలో ఆ ప్రమాణంలో అన్నం వండడానికి బద్ధకించాడు పాచకుడు. అందువల్ల గుండిగలో ఒక గిన్నె బోర్లించి పైన అన్నం సర్ది గుండిగ చక్కగా శుద్ధిపరచి ముగ్గు వేసిఉన్న ప్రదేశంలో పెట్టాడు.

ధూపం దీపం ఇంకా అవకముందే సహస్రనామార్చన ముగిసే సమయానికి స్వామివారు ఆ గుండిగను ఉద్ధరిణ పట్టుకొని మోగించి చూశారు. సాష్టాంగ పడినాడు పాచకుడు. మళ్ళీ అన్నం క్రొత్త అధరువులతో సహా వండి తెచ్చేదాకా స్వామివారు సహస్రనామార్చన చేస్తూనే ఉన్నారు.

మరి ఈ పారిషదులు, పరిచారకులు స్వామివారి మహత్వం తెలియనివారా? నిశ్చయంగా మనకంటే వారికే స్వామివారి గురించి తెలిసి ఉండాలి. వారు ఆ మహత్వాలను కథలు కథలుగా చెబుతారు. మరి అంతలోనే స్వామివారిని కికురించగలమనుకోవడం ఏమిటో? మనమూ సరిగ్గా భగవంతుని ఇలాగే మోసగించుదామని ఆయన మహత్త్వం తెలిసిన్నీ ప్రయత్నిస్తాము. అదే వింత. పూజలో కూర్చున్న మహాస్వామివారికి అనేక సంధర్భాలలో బయట జరుగుతున్న విషయాలపై స్పృహ ఉండేది కాదు. వారు ఈ లోకంలో లేరన్న అందరికి అవగతమవుతూ ఉండేది.

ఒకసారి విశేషపూజలో త్రిపురసుందరీ చంద్రమౌళీశ్వరులకు అనేక హారతులు ఇచ్చారు స్వామి. హారతులలో ముఖ్యంగా నక్షత్రహారతి వంటివాటిలో నెయ్యిలో నానపెట్టిన వత్తులు వెలిగించ వెలిగించబడతాయి. పూజంతా అయి ప్రసాదాలిచ్చి లోపల కూర్చున్న స్వామి ఏదో మంటగా ఉన్నదే అని శాఠీ తొలగించి తొడపై చూసుకొన్నారట. హారతులలో కరిగిన వేడినెయ్యి పడి తొడపై చర్మం కమిలిపోయి ఉన్నదట. 'అయ్యో స్వామీ! నెయ్యి పడింది, చూసుకోలేదా' అన్నాడట 'ఏకదేశవైతా'. "ఏమోరా? అప్పుడు తెలియలేద"న్నారట స్వామి.

పీఠాధిపత్యం అత్యంత సమర్ధవంతంగా నిర్వహించిన మహాస్వామి వారికి దాని వెన్నంటి ఒక ప్రగాఢ వైరాగ్యం అంటూ ఉండింది.

--- శ్రీకార్యం చల్లా విశ్వనాథ శాస్త్రి, ఋషిపీఠం ప్రచురణల నుండి

#KanchiParamacharyaVaibhavam #కంచిపరమాచార్యవైభవం
4/12/18, 07:15 - Paramacharyulu: జీవన్ముక్తులు - జిహ్వాచాపల్యం

కుంబకోణం దగ్గర్లో నివసించే ముసలామె ఒకరు పరమాచార్య స్వామి వారికి పెద్ద భక్తురాలు. ఆమె చాలా ధనవంతురాలు, భూస్వామి కూడా. తనకు పిల్లలు లేకపోవడంతో మొత్తం ఆస్తినంతా కంచి మఠానికి ఇచ్చివేసి, మఠంలో సేవ చేస్తూ ఉండేది.

ఒకరోజు స్వామివారు ఆమెను పిలిచి తనకు తీరని కోరిక ఏదైనా ఉన్నదా అని అడిగారు. అందుకామె నేను చేసిన పదార్థాన్ని మీరు స్వీకరించి తినాలని ఒక చిన్న కోరిక ఉన్నదని చెప్పింది. మహాస్వామి వారు ఆమె అభ్యర్తనను మన్నించి ఆమె చేసిన సున్నుండలను స్వీకరించారు. అది చూసి ఆమె చాలా సంతోషించింది.

ఆరోజు సాయంత్రం శ్రీమఠం అధికారి ఒకరు ఏదో విషయమై మాట్లాడడానికి స్వామివారి వద్దకు వచ్చారు. స్వామివారు చేతిలో ఏదో పెట్టుకొని దాన్ని తింటూండడం ఆయన గమనించారు. మఠంలోని వారిని పిలిచి స్వామివారు ఇప్పుడు భిక్ష స్వీకరించారా? అని అడిగాడు.

వెంటనే వారు ఆ ముసలామె కోరికను స్వామివారు మన్నించారని చెప్పారు. ఆ అధికారి స్వామివారిని కలవడానికి వెళ్ళారు. అతని మనుస్సులో ఉన్న విషయాన్ని స్వామివారు పసిగట్టి “నేను ఏమి తిన్నానో అని ఆలోచిస్తున్నావు?” కదా. ఉదయం ఆ ముసలామె తినడానికి ఒక తీపి పదార్థం ఇచ్చి వెళ్ళింది. అంత రుచికరమైన పదార్థం తిన్న తరువాత నాలుక పదే పదే అది కావాలని కోరుకుంటుంది. ఆ ఆశను వదిలించుకోవడానికి ఈ రుచిలేని పేడ ముద్దలు తింటున్నాను అని చెప్పారు.

నారాయణీయంలో చెప్పినట్టుగా “ఇంద్రియనిగ్రహమే మహాత్ములకు అలంకరణ. మనం కూడా అటువంటి వారి సాంగత్యం పొందితే మనకు కూడా ఇష్టాలు అయిష్టాలు లేని ఋషి జీవనాన్ని పెంపొందించుకోగలము”.

పరమాచార్య స్వామివారు అటువంటి మహాత్ములే అని చెప్పడానికి ఇది ఒక దృష్టాంతం. కేవలం మనలను ధర్మానువర్తనలను చెయ్యడానికే స్వామివారు ఈ లీల చేశారు.

అపార కరుణాసింధుం జ్ఞానదం శాంతరూపిణం
శ్రీ చంద్రశేఖర గురుం ప్రణమామి ముదావహం ॥

#KanchiParamacharyaVaibhavam #కంచిపరమాచార్యవైభవం
4/13/18, 07:10 - Paramacharyulu: ఆ జాతకం ఇలా ఇవ్వు

ఆత్తూర్ గ్రామంలో ముకుందరాజ్ పోస్ట్ మాస్టర్ గా పనిచేస్తున్నాడు. పదోన్నతితో అక్కడి నుండి చెన్నైకి మకాం మార్చాడు. అతనికి యమ్.టెక్ చెదివిన ఒక కుమారుడు ఉన్నాడు. ఉన్నత చదువులు చదివి ఉండడం వల్ల కుమారునికి యు.యస్. లో ఉద్యోగం లభించాలని ఆశించేవాడు. కనుక ఉద్యోగ ప్రయత్నాలకు ముందు అబ్బాయి జాతకం ఒకసారి చూపించాలని అనుకున్నాడు. అప్పట్లో బేతనాయకన్ పాళ్యంలో ఉంటున్న ఆంధ్రదేశానికి చెందిన రాంబట్ల శాస్త్రిగారు ప్రముఖ జ్యోతిష్యులు. వారితో మంచి పరిచయం ఉన్న శ్రీనివాసన్ అనే సహాయకునికి అబ్బాయి జాతకం ఇచ్చాడు.

ఆయన జాతకాన్ని పరిశీలించి యు.యస్ లో ఉద్యోగం లభిస్తుందని, తెలిసిన బంధువుల పిల్లతో వివాహం నిశ్చయమవుతుందని చెప్పారు. నాలుగు నెలలోనే ఇవన్నీ జరుగుతాయని కూడా చెప్పారు. దీన్నంతా కాగితంపై వ్రాసి శ్రీనివాసన్ కు ఇచ్చారు.

ముకుందరాజ్ ఊర్లో లేకపోవడం చేత, తను వచ్చిన తరువాత ఈ విషయాలు చెబుదామని జాతకాన్ని శ్రీనివాసన్ తన బ్యాగులో ఉంచుకున్నాడు. ప్రతినెలా పరమాచార్య స్వామివారిని దర్శించడం శ్రీనివాసన్ కు ఆనవాయితీ. కొన్నిరోజుల తరువాత మహాస్వామి వారి దర్శనానికి వెళ్ళాడు. ఆరోజు దర్శనానికి చాలామంది భక్తులు వచ్చారు. వారి కష్టాలను చెప్పుకొని స్వామివారి ఆశీస్సులు అందుకుంటున్నారు.

అలా వరుసలో ఉన్న ఒకామె వంతు రాగానే తన కుమారునికి యు.యస్ ఉద్యోగం లభిస్తుందా? త్వరగా పెళ్ళి కుదురుతుందా? అని స్వామివారిని అడిగింది. కాని ఆమె తమ పోస్ట్ మాస్టర్ ముకుందరాజ్ భార్య అని శ్రీనివాసన్ కి తెలియదు.

స్వామివారు నవ్వుతూ శ్రీనివాసన్ వైపు చూసి, “నీ బ్యాగులో ఉన్న ఆ జాతకం ఇలా ఇవ్వు” అని అడిగారు. శ్రీనివాసన్ జాతకంతో పాటు ఆ జ్యోతిష్కుడు వ్రాసిచ్చిన కాగితాన్ని కూడా బయటకు తీసాడు. దాన్ని ఆమెకు ఇవ్వమని స్వామివారు ఆదేశించారు. ఏంజరుగుతోందో అప్పుడు అర్థమైంది ఇద్దరికి.

బ్యాగులో జాతకం ఉందన్న విషయం స్వామివారికి ఎలా తెలుసు? మనుషుల మనస్సులను తెలుసుకునే మహాస్వామివారికి బ్యాగులో ఏముందో తెలుసుకోవడం పెద్ద కష్టమా?

అపార కరుణాసింధుం జ్ఞానదం శాంతరూపిణం
శ్రీ చంద్రశేఖర గురుం ప్రణమామి ముదావహం ॥

#KanchiParamacharyaVaibhavam #కంచిపరమాచార్యవైభవం
4/13/18, 12:20 - Paramacharyulu: <Media omitted>
4/14/18, 07:06 - Paramacharyulu: విష్ణు సహస్రనామం ఎలా వచ్చింది

భీష్మపితామహుడు విష్ణు సహస్రనామం పలుకుతున్నప్పుడు అందరూ శ్రద్ధగా విన్నారు. కృష్ణుడు, ధర్మరాజుతో సహా, కాని ఎవరూ రాసుకోలేదు. మరి మనకెలా అందింది ఈ అద్భుతమైన విష్ణు సహస్రనామం?

అది 1940వ సంవత్సరం. శ్రీ శ్రీ శ్రీ మహాపెరియవా కంచి పరమచార్య చంద్రశేఖరేంద్ర సరస్వతి మహాస్వామి వారిని ఒక వ్యక్తి ఇంటర్వ్యూ చేయడానికి టేప్ రికార్డర్‌తో వచ్చాడు. ఆ టేప్ రికార్డర్ చూసి స్వామి వారు ఆ వ్యక్తిని అక్కడున్న వారినందిరినీ ఉద్దేశించి, "ప్రపంచంలో అతి పురాతన టేప్ రికార్డర్ ఏది?" అని అడిగారు.

ఎవరూ సమాధానం చెప్పలేక పోయారు. మళ్ళీ స్వామివారు, "విష్ణు సహస్రనామం మనకెలా వచ్చింది?" అని అడిగారు

ఒకరన్నారు, "భీష్ముడందించారన్నారు"

స్వామివారు, "భీష్ముడు విష్ణు సహస్రనామం పలుకుతున్నప్పుడు ఎవరు వ్రాసుకున్నారు?"

మళ్ళీ నిశబ్దం.

స్వామివారు చెప్పడం మొదలుపెట్టారు. భీష్ముడు సహస్రనామాలతో కృష్ణుడిని స్తుతిస్తున్నప్పుడు, కృష్ణుడు, పాండవులు, వ్యాస మహర్షితో సహా అందరూ అత్యంత శ్రద్ధగా వినడం మెదలుపెట్టారు. ఎవరూ వ్రాసుకోలేదు.

అప్పుడు యుధిష్ఠురుడన్నాడు, "ఈ వేయి నామాలని మనమంతా విన్నాము కాని మనమెవరం వ్రాసుకోలేదు. ఇపుడెలా కృష్ణా" అని.

"అవును కృష్ణా ఇప్పుడెలా! ఆ సహస్రనామాలు మాకందరికీ కావాలి" అని అందరూ కృష్ణుడిని వేడుకున్నారు.

శ్రీ కృష్ణుడన్నాడు. "అది కేవలం సహదేవుడు, వ్యాసుడి వల్లనే అవుతుంది" అని చెప్పాడు.

"అదెలా" అని అందరూ అడిగారు.

శ్రీ కృష్ణుడు చెప్పాడు, "మనందరిలో సహదేవుడొక్కడే సూత స్పటికం వేసుకున్నాడు. ఈ స్పటికం మహేశ్వర స్వరూపం. దీని ప్రత్యేకతేంటంటే వాతావరణంలోని శబ్ద తరంగాలని గ్రహించి తనలో దాచుకుంటుంది. సహదేవుడు శివుడిని ధ్యానించి ప్రార్థిస్తే ఈ స్పటికంలోని సహస్రనామ శబ్ద తరంగాలని వెనక్కి రప్పించి (రిప్లే) వ్యాస మహర్షితో వ్రాయించమని కృష్ణుడు సలహా ఇచ్చాడు.

శ్రీ కృష్ణుడి ఆజ్ఞ మేరకు, ఆ సహస్రనామ శబ్ద తరంగాలు వచ్చిన చోట అనగా భీష్ముడికి అతి సమీపంలో సహదేవుడు, వ్యాసమహర్షి కూర్చుని, ఆ సహస్రనామ శబ్ద తరంగాలు రిప్లే అవుతూంటే వ్యస మహర్షి వ్రాసిపెట్టాడు.

ఆ విధంగా మనకు మొట్టమొదటి టేప్ రికర్డర్ శివస్వరూప స్పటికం ద్వార మనకి విష్ణు సహస్రనామం అందిందని మహాస్వామి వారు సెలవిచ్చారు.

అపార కరుణాసింధుం జ్ఞానదం శాంతరూపిణం
శ్రీ చంద్రశేఖర గురుం ప్రణమామి ముదావహం ॥

#KanchiParamacharyaVaibhavam #కంచిపరమాచార్యవైభవం
4/15/18, 06:19 - Paramacharyulu: గురువు - గుహుడు

పరమాచార్య స్వామివారి మకాం పండరీపురంలో ఉంది. మహాస్వామివారి దర్శనానికి వెళ్ళేవారు బస్సు దిగిన తరువాత చంద్రభాగ నదిని దాటి వెళ్ళాలి. మేము పండరీపురం చేరుకునే సమయానికి రాత్రి ఎనిమిదయ్యింది. ఆకాశం మేఘావృతమై చిన్నగా వర్షం కూడా మొదలైంది.

క్రమంగా పెరిగి చంద్రభాగ నదికి వరద మొదలైంది. అక్కడ ఉన్న పడవవాడు ముందు రానన్నాడు. అతను మరాఠీలో “ఇప్పుడు నది దాటడం చాలా అపాయకరం. మీరు ఉదయం వెళ్ళడం మంచిది” అని మాతో అన్నాడు. వెంటనే మేము “మేము మహాస్వామివారి దర్శనానికి వచ్చాము” అని చెప్పగానే అతడు ఆనందంతో “శంకర్ గురుజి? అచ్చా! సరే పడవ ఎక్కండి” అని చెప్పాడు.

అవతలి ఒడ్డుకు చేరగానే కొంత డబ్బు తీసి అతనికి ఇవ్వబోయాను.

ఆ పడవవాడు, ”లేదు. లేదు. నేను డబ్బు తీసుకోను. శంకర్ గురుజి మేము మా కళ్ళతో చూడగలిగే దైవం. ఆయనే మా పండరినాథుడు. మమ్మల్ని పిలిచి మాతో మాట్లాడారు కూడా. మాకు సాక్షాత్తు ఆ విఠలుడే ఇక్కడకు వచ్చి మాతో మాట్లాడినట్టు“ అని పారవశ్యానికి లోనయ్యాడు.

భువినేలే భూపతులు, అక్షరజ్ఞానం కలిగిన పండితులు మాత్రమే స్వామివారిని ఆరాధిస్తారు అనుకున్నాను. కాని ఇక్కడ ఒక పామరుడు ఆ జగద్గురువును అత్యంత భక్తితో ఆరాధిస్తున్నాడు. ఇది ఎలా సాధ్యం?

సమాధానం కోసం ఆలోచించడం వదిలి, పరమాచార్య స్వామివారి దివ్య చరణాలకు ప్రణమిల్లుతునాను. బహుశా సమాధానం కూడా ఇదేనేమో.

అపార కరుణాసింధుం జ్ఞానదం శాంతరూపిణం
శ్రీ చంద్రశేఖర గురుం ప్రణమామి ముదావహం ॥

--- టి.యస్. సుప్పిరమణి, మహా పెరియవళ్ - దరిశన అనుభవంగళ్ 3

#KanchiParamacharyaVaibhavam #కంచిపరమాచార్యవైభవం
4/15/18, 17:43 - Paramacharyulu: <Media omitted>
4/16/18, 07:34 - Paramacharyulu: ఈ మాలను ధరించు

కంచి పరమాచార్య స్వామివారు ఆత్మజ్ఞాని అన్నపదానికి సాకార రూపం. వారి కేవల దృష్టికే మహత్తరమైన శక్తి కలదు. స్థాయిభేదం లేకుండా వారు అందరిపై అపారమైన కరుణను చూపారు. వారి కరుణకు ఏదో పెద్ద కారణం అవసరంలేదు. వసంత ఋతువు రాగానే ప్రకృతి అపారమైన సౌందర్యమును ఆహ్లాదమును పొందినట్టు వారి సమక్షంలోకి మనం వెళ్ళగానే వారి కరుణాసముద్రంలో తడిసి ముద్దవుతాము. అలా వారి అపార కరుణకు పాత్రుడవడం నా పూర్వజన్మ సుకృతం.

కొన్నేళ్ళక్రితం నేను చాలా మానసిక సంఘర్షణకు లోనై నెమ్మదిని కోల్పోయాను. నా చుట్టూ ఉన్న ప్రపంచంపై వస్తువులపై నిర్మోహం కలిగి, ప్రాపంచిక విషయలపై ఆసక్తి తగ్గి కనీసం తాత్విక విషయాలను చదవడం కూడా మానేశాను. మరో విచిత్రం ఏటంటే నా జ్ఞాపకశక్తి కూడా సన్నగిల్లుతోంది. దశాబ్దాలపాటు నేర్చుకున్నదేదీ గుర్తుకురావట్లేదు. అన్ని రకాల చికిత్సలు విఫలమయ్యాయి. కుటుంబంలో అందరూ నా పరిస్థితి చూసి ఆందోళన చెందుతున్నారు.

ఇటువంటి దీనావస్థలో కంచిలో చాతుర్మాస్యం చెయ్యలని శ్రీ జయేంద్ర సరస్వతి స్వామివారి అభ్యర్థనను మన్నించి పరమాచార్య స్వామివరు మహారాష్ట్ర నుండి కంచి వచ్చారని తెలుసుకున్నాను. వెంటనే కుంటుబ సమేతంగా కంచికి వెళ్ళి మహాస్వామి వారి పాదపద్మాలకు సాష్టాంగపడ్డాను. సంపూర్ణ శరణాగతితో స్వామివారిని అర్థించాను.

స్వామివారికి మొత్తం నా బాధలను వేదనలను చెప్పుకున్నాను. ముఖ్యంగా నాకు జ్ఞాపశక్తి తగ్గిపోవడం, దీనివల్ల నాకు ఎంతో ప్రీతిపాత్రమైన శాస్త్రబోధన కుంటుబడటం అన్ని విన్నవించాను. ఇంతకుముందు పరమాచార్య స్వామివారి ఆదేశం మేరకు శ్రీ జయేంద్ర సరస్వతి స్వామివారికి తర్కశాస్త్రం బోధించాను.

తరువాత స్వామివారు నన్ను శాశ్వతంగా కంచి శంకర మఠంలో ఉండిపొమ్మని ఆజ్ఞాపించారు. శిష్యులొకరిని ఒక రుద్రాక్షమాలను తోసుకురావల్సిందిగా ఆదేశించారు. ఆ రుద్రాక్షమాలను చేతితో తడుముతూ చాలాసేపు మా కుటుంబ యోగక్షేమాలను విచారించారు. “ఈ మాలను ధరించు” అని వారు ఆజ్ఞాపించగానే తీసుకుని వెంటనే వేసుకున్నాను.

అంతే తరువాత కొన్నిరోజులకు మెల్లిగా నా రోగాలు, బాధలు మాయమై నా నేర్చుకున్న విషయజ్ఞానమంతా స్ఫురణకు రాసాగింది. కేవలం కొద్ది రోజులలోనే శాస్త్రబోధన చేసే దశకు చేరుకున్నాను. పరమేశ్వరుణ్ణి అర్చించే చేతులు పరమేశ్వరునికంటే మహోన్నతమైనవని మనకు “శ్రీరుద్రం” చెబుతుంది. అది పరమాచార్య స్వామివారి విషయంలో నిజం అయ్యింది.

అపార కరుణాసింధుం జ్ఞానదం శాంతరూపిణం
శ్రీ చంద్రశేఖర గురుం ప్రణమామి ముదావహం ॥

--- ‘శాస్త్ర రత్నాకర’ యస్. ఆర్. కృష్ణమూర్తి శాస్త్రిగళ్

#KanchiParamacharyaVaibhavam #కంచిపరమాచార్యవైభవం
4/16/18, 16:46 - Paramacharyulu: <Media omitted>
4/17/18, 07:03 - Paramacharyulu: కలకత్తాలో వేద భవనం

1957లో మద్రాసులోని ఎన్నోర్ దగ్గర్లోని కట్టుపల్లిలో పరమాచార్య స్వామివారు మకాం చేస్తున్నారు. అప్పుడు నేను కలకత్తాలో నివసిస్తుండేవాడిని. వ్యాపార నిమిత్తమై మద్రాసుకు వచ్చాను. కొద్దిగా సమయం చేసుకొని మహాస్వామివారి దర్శనానికై కట్టుపల్లి వెళ్దామని నిర్ణయించుకున్నాను. ఆరోజు సాయింత్రం మూడుగంటలకే మద్రాసు తిరిగివెళ్ళాలనే ఆలోచనతో ఉదయం పదిన్నరకు కట్టుపల్లి చేరుకున్నాను. అప్పుడు స్వామివారు ప్రాతఃకాల పూజ చేస్తున్నారు. కాని నా మనసంతా మద్రాసుకెళ్ళిపోవాలని ఉంది.

స్వామివారు పూజ అయిపోగానే విశ్రాంతికి వెళ్తూ శిష్యులతో నన్ను భోజనం చేసి ఇక్కడే ఉండమని నాకు చెప్పమని చెప్పారు. సాయింత్రం అయిదు గంటలప్పుడు మహాస్వామివారు భక్తులకు దర్శనం ఇవ్వడానికి వచ్చారు. దాదాపు ఒక నూటయాభై మంది ఉన్నారు అక్కడ. నన్నే మొదట పిలిచి నేను వెళ్ళడానికి అనుమతి అస్తారు అని భావించాను. కాని చివరిగా రమ్మన్నది నన్నే. అప్పుడు సమయం ఆరున్నర అయ్యింది. అక్కడ ఉన్నది నేను ఒక్కడినే. మహాస్వామివారు నన్ను వారి గదికి పిలిచి నన్ను కూర్చుండబెట్టి నన్ను అడిగిన మొదటి ప్రశ్న “ఉదయం వచ్చినప్పటినుండి తిరిగివెళ్ళడానికి చాలా ఆత్రుతగా ఉన్నావు. అవునా?” అని. నేను నిర్ఘాంతపోయాను. అవును, కాదు అని కూడా చెప్పలేని పరిస్థితి. నా మనస్సును పొంతం చదివేశారు. నన్ను ఆ సాయింత్రం దాకా అక్కడే ఉంచడం వెనుక పెద్ద కారణం ఉంది. మహాపురుషుల అలోచనల వెనుక మానవాళికి చాలా పెద్ద ఉపయోగమే ఉంటుంది.

కలకత్తా నడిబొడ్డున ఒక పెద్ద భవంతిని కొని బెంగాలీ బాలుర కోసం అందులో ఒక సామవేద పాఠశాలను నెలకొల్పాల్సిందిగా స్వామివారు నన్ను ఆదేశించారు. నం. 50, లేక్ అవెన్యు, కలకత్తాలో దక్షిణభారత భజన సమాజం వారు ఇప్పుడు అద్దెకున్నారు. “నువ్వు ఈ

భవంతిని కొన్న తరువాత ఆ భజన సమాజం వారు అక్కడే ఉండేలా చూడు” అని ఆదేశించారు. నేను వినయంగా స్వామివారితో అది చాలా ఖర్చుతో కూడుకున్న వ్యవహారం అని నాకు ఇబ్బంది కలుగుతుంది అని చెప్పాను. వెంటనే స్వామివారు, “అన్నాదురై అయ్యంగార్ వద్ద యాభైవేలు తీసుకుని వెళ్ళు” అని చెప్పారు. నేను అదే వినయంతో ఆ యాభైవేలు నాకు యాభై కోట్లతో సమానం అని చెప్పి, విరాళాలు సేకరించిన తరువాత ఆ సొమ్మును మఠానికి ఇస్తానని చెప్పాను.

మరుసటిరోజు ఉదయం విమానంలో కలకత్తా చేరిన వెంటనే నేను చేసిన మొదటి పని భూస్వామి శ్రీ అశుతోష్ ముఖర్జీని కలవడం. నేను ఈ విషయం గురించి చెప్పకముందే ఆయనే నాతో, “రాత్రి నాకు కలలో కాళి అమ్మవారు కనిపించి ఆ భవనాన్ని నీకు అమ్మమని ఆదేశించింది. ఇక ఆ పని మొదలుపెడదాము” అని చెప్పారు.

ఇంతకంటే చెప్పడానికి ఇక ఏం ఉంది? పరమాచార్య స్వామివారే కాళి రూపంలో స్వప్నదర్శనం ఇచ్చి ఆ భవనాన్ని అమ్మమని చెప్పారు. మూడు నెలల్లో మొత్తం పని పూర్తి అయ్యింది. “వేద భవనం” పేరుతో ఈనాటికీ సుస్వరమైన వేద ధ్వని ఆ భవంతి నుండి వినవస్తోంది.

అపార కరుణాసింధుం జ్ఞానదం శాంతరూపిణం
శ్రీ చంద్రశేఖర గురుం ప్రణమామి ముదావహం ॥

--- “కైంకర్య శిరోమణి” డా. యస్.వి. నరసింహన్

#KanchiParamacharyaVaibhavam #కంచిపరమాచార్యవైభవం
4/18/18, 09:32 - Paramacharyulu: అందుకు ఒకరు వస్తారు

1945 ఫెబ్రవరిలో పరమాచార్య స్వామివారు రాణీపెట్టైలో మకాం చేస్తున్నారు. అక్కడ నివసించేవారు దాదాపుగా హైందవేతరులే అయినా కులమతాలకతీతంగా మహాస్వామివారి దర్శనానికి వచ్చేవారు. రాణీపెట్టై సమీపంలోని నావల్పూర్ ప్రజలు “కరుమారుయమ్మన్ దేవి” ఆలయం కట్టడానికి లక్షలలో నిధులు కావాలని గ్రహించి కాస్త కలత చెందారు. పరమాచార్య స్వామివారి ఆశీస్సుల కోసం వారు స్వామివారి దర్శనానికి వచ్చారు.

“మేము ఒక మంచి కార్యక్రమం చెయ్యలనుకున్నాము. దానికి కావాల్సిన నిధులు మావద్ద సమృద్ధిగా లేవు.

పరమాచార్య స్వామివారు మమ్మల్ని అనుగ్రహించాలి“ అని వేడుకున్నారు. స్వామివారు కొద్దిసేపు మౌనం వహించి, “కోవెల అమ్మవారికి. కదా? ఆమెయే చూసుకుంటుంది” అని చెప్పారు.

“మాకు ఆ నమ్మకం ఉంది కాని కావాల్సిన ధనంలో పాతికవంతు కూడా సేకరించలేకపోయాము. . . ”.

అందుకు మహాస్వామివారు “నేలపై నాలుగడుగుల ఎత్తున నిర్మాణం చెయ్యండి” అని చెప్పారు.

”మరి గోపురం, విగ్రహాలు, కుంబాభిషేకం మొదలగువాటికి ఎలా?” అని అడిగారు వారు.

”వాటన్నిటి కోసం ఒక వ్యక్తి వస్తాడులే” అన్నారు.

వారికి ఒక దేవరహస్యం అవగతమైంది. కాని “ఎప్పుడు వస్తాడు? ఎలా గుర్తుపట్టాలి?” అని పలు సందేహాలతో సంతోషంతో ప్రసాదం స్వీకరించి, అనుమానంతో, కలతతో వెళ్ళిపోయారు.

ఈ సంఘటన జరిగినది ఫెబ్రవరి 14, 1945న. మరి ఆ వ్యక్తి ఆరోజు ఎక్కడున్నాడు?

1939లో ప్రారంభమైన రెండవ ప్రపంచ యుద్ధం 1945 వరకు కొనసాగింది. అలీన సేనలు బర్మాలోని ఐరావతి నది వద్ద జపాన్ తో తలపడుతున్నాయి. జపాన్ సైన్యం తూర్పు ఒడ్డున, అలీన సేనలు పశ్చిమ ఒడ్డున పోరాడుతున్నాయి. అలీన సేనలకు ఆ ప్రాంతము, ఆ వాతావరణము అంతగా అలవాటు లేదు. నదీజలాల దగ్గర యుద్ధం చేయగల నైపుణ్యం కలిగిన వారిని ఇక్కడకు పంపవలసిందిగా అలీన సేనలకు నాయకత్వం వహిస్తున్న మేజర్ లండనుకు అత్యవసర సమాచారం పంపారు. అటువంటి యుద్ధనైపుణ్యం కలిగిన బెటాలియన్ మడగకార్.

ఆ సైనిక దళాన్ని వెంటనే ఐరావతికి పంపారు. భారత సైనికులను ఒడ్డుకు పంపి వారు నదిలోకి దిగారు. ఈ హఠాత్పరిణామాన్ని జీర్ణించుకోలేని జపాన్ సేనలు రాక్షసులుగా మారి ఒడ్డున ఉన్నవారిని పిట్టల్ని కాల్చినట్టు కాల్చి చంపారు. ఆ ఊచకోచలో కేవలం ఒక్కరే బ్రతికి బయటపడ్డారు.

”నేను ఒక్కడినే ఎందుకు బ్రతికాను దేవుడా?”

1945 మేలో జెర్మనీ ఓటమితో యుద్ధం ముగిసింది.

ఐరావతి యుద్ధంలో బ్రతికి బయటపడ్డ మేజర్ నారాయణస్వామి, సైన్యం నుండి విరమణ పొందిన తరువాత భార్య చంద్రికతో కలిసి

రాణిపెట్టైలో నివాసం ఏర్పరుచుకున్నాడు. ఒకరోజు సాయింత్రం వారు నడుడుచుకుంటూ వెళ్తుండగా అనుకోకుండా అసంపూర్తిగా ఉన్న మందిరాన్ని ఆరుబయట అలా ఎండకి ఎండుతూ, వానకు తడుస్తూ ఉన్న అమ్మవారిని చూశారు. “చూడు! నన్ను ఎలా వదిలేశారు. నేను అంతటి భయంకర యుద్ధం నుండి నిన్ను కాపాడితే, నాకు ఒక నీడ కల్పించవా” అని అమ్మవారు అడిగినట్టు అనిపించింది.

మహాస్వామివారి దర్శనానికి వచ్చిన ఆ భక్తులందరి ఆనందభాష్పాలతో ఆ ప్రాంగణం అంతా నిండిపోయింది. ”ఈయన మిలటరి మేజర్ నారాయణస్వామి, ఆవిడ ఈయన భార్య. ఆలయ నిర్మాణాన్ని వారు పూర్తిచేసి, కుంబాభిషేకం కూడా చెయ్యడానికి ముందుకు వచ్చారు. కొద్దిరోజుల క్రితం అచ్చం స్వామివారు చెప్పినట్టుగానే”

పరమాచార్య స్వామివారి ‘కరుణాకటాక్షం’ ఆ దంపతులపై ప్రసరించి వారిని పునీతులను చేసింది.

అపార కరుణాసింధుం జ్ఞానదం శాంతరూపిణం
శ్రీ చంద్రశేఖర గురుం ప్రణమామి ముదావహం ॥

--- మహా పెరియవళ్ - దరిశన అనుభవంగళ్ 7

#KanchiParamacharyaVaibhavam #కంచిపరమాచార్యవైభవం
4/19/18, 07:02 - Paramacharyulu: కాఫీ ఖాతా

ఒకరోజు అకస్మాత్తుగా పరమాచార్య స్వామివారు తము మకాం చేసినచోట ఉన్న ఉగ్రాణంలోకి వెళ్ళి అలా బయటకు వచ్చారు. మహాస్వామివారికి తెలియకుండా నలుగురైదుగురు సిబ్బంది కాఫీ తయారుచేసుకొని తాగుతున్నారు. స్వామివారు ఆ విషయం గమనించారేమో అని వారు భయపడ్డారు. కాని స్వామివారు ఆ విషయమై ఏమి అడగకపోవడంతో వారు కాస్త ఊపిరి పీల్చుకున్నారు. స్వామివారు ఏమీ గమనించలేదని సంతోషపడ్డారు.

రాత్రి స్వామివారు నన్ను పిలిచి, ఫలహారం అయిన తరువాత సిబ్బంది అందరినీ సమావేశపరచాలని మేనేజరుకు చెప్పమని నాకు చెప్పారు. ఆ సమావేశానికి పద్దుల పుస్తకంతో రావాల్సిందిగా చెప్పమన్నారు. ”ఏ లెక్కల పుస్తకం?” అని నన్నడిగారు మేనేజరు. నేను స్వామివారిని అడగగా, “ఏవో ఒకటి రెండు లెక్కాపద్దుల పుస్తకాలు పట్టుకుని రమ్మను” అని ఆదేశించారు.

సిబ్బంది అందరూ సమావేశమయ్యారు. స్వామివారు వారితో, “ఈ పుస్తకంలో ఉన్నది అంతా సరైనది అని ఒప్పుకుని నమస్కారం చెయ్యండ”ని ఆదేశించారు.

మనసులో భయంతో వారిలో కొంతమంది అలా చెయ్యడానికి ముందుకురాలేదు. “ఎందుకు ఆలోచిస్తున్నారు? అందులో ఉన్నది అంతా నిజమే అయితే నమస్కారం చెయ్యండి”

“అదీ. . . ”

“ఆ ఖర్చును ఏ లెక్కలో చూపిస్తున్నారు?” అని అడిగారు స్వామివారు.

“ఆవుల ఆహారం కోసం పత్తి విత్తనాలు కొన్నట్టుగా” అని బదులిచ్చారు.

వారి ఇబ్బందిని స్వామివారు అర్థం చేసుకొన్నారు. పీఠాధిపతుల భిక్ష తరువాతనే వారు ఆహారం స్వీకరించడం ఆనవాయితీగా వస్తోంది. చాలాసార్లు స్వామివారు భిక్ష చెయ్యడానికి మధ్యాహ్నం రెండు అవుతుంది కాబట్టి వారికి తాగడానికి ఏదో ఒకటి కావాలి.

అందుకనే స్వామివారు ఇలా తీర్మానించారు, “రేపటి నుండి మొదటికాల పూజ ఉదయం పది గంటల లోపు పూర్తిచేస్తాను. మీరందరూ భోజనం చేసిన తరువాత, నేను భిక్షావందన పూజ చేసి కొద్దిసేపటి తరువాత నేను భిక్ష చేస్తాను.”

అప్పటినుండి ఇలా సిబ్బందికి అనుకూలమైన సంప్రదాయం శ్రీమఠంలో మొదలైంది.

అపార కరుణాసింధుం జ్ఞానదం శాంతరూపిణం
శ్రీ చంద్రశేఖర గురుం ప్రణమామి ముదావహం ॥

--- ఎన్. వెంకట్రామన్, మైలదుతురై. మహా పెరియవళ్ - దరిశన అనుభవంగళ్ 2

#KanchiParamacharyaVaibhavam #కంచిపరమాచార్యవైభవం
4/19/18, 16:37 - Paramacharyulu: <Media omitted>
4/20/18, 08:23 - Paramacharyulu: అవతారమూర్తి – ఆదిశంకరులు

అనుదినమూ శివపూజా సమయమున మన మీ క్రింది శ్లోకమును పఠింతుము.

ఆపాతాళ సభస్థలాంతభువన బ్రహ్మాండ మావిస్ఫుర

జ్యోతిస్స్ఫాటికలింగమౌళి విలసత్ పూర్ణేందువాంతామృతైః,
అస్తోకాప్లుత మేక మీశ మనిశం రుద్రాను వాకాన్ జపన్
ధ్యాయే దీప్సితసిద్ధయే ధ్రువపదం విప్రో భిషించే చ్ఛివమ్ః

ఈ శ్లోకము పరమేశ్వరుని స్వరూపమును వర్ణించి పూజాసమయమున చేయవలసిన జపమును, దేవుని ధ్యానించవలసిన రీతిని, ఆ ధ్యానఫలమును తెలుపును. సర్వేశ్వరుడు ఆపాతాళ సభస్థలాంతు-హతాళమునుండి ఆకసమువరకు వ్యాపకుడై యున్నాడు. అతడు కాలాతీతుడు, నిరవధికుడు, ఆదిమధ్యాంతరహితుడు, అంతర్బాహ్యముల అవిచ్ఛిన్నముగా వెలిగెడు పరిపూర్ణమూర్తి , జ్యోతిస్వరూపి, పూర్ణేందు శేఖరుడు, మన అభీప్సితములు నెరవేరుటకై ఆయనను స్ఫటికలింగమున అభిషేకసమయమున పై రీతిని ధ్యానించవలెను.

స్ఫటికలింగము దొక విశేషము గమనించదగినది. గ్రాహ్యమగు వస్తువును స్థూలముగ నర్థము చేసికొనుటకు మనమొక చిహ్నము నుపయోగింతుము. ఆత్యంతములు లేని అనాదిని-పరమేశ్వరుని, ఏ ప్రతీకమందు చూచుట? అది చదరముగనో దీర్ఘ చతురస్రముగనో ఉండగూడదు. అట్టి ప్రతీకమునకు ఆత్యంతములుండును. కానీ వర్తులమునకు స్ఫుటమగు ఆద్యంతములు లేవు. అదుచేతనే ఈశ్వరచిహ్నము శివలింగము-గుండ్రముగా నుండుట.

లింగము స్ఫాటికముగ నుండుటలో కూడా ఒక అర్థమున్నది. మనమే లింగమును పూజచేసినను, మనస్సున అవి స్ఫటికములనియే భావించదగును. స్ఫటికము బ్రహ్మమువలె శుద్ధమైనది, అది నిష్కళంకము, నిరంజనము, శుభ్రము. శివలింగమును ఏ వర్ణపు పుష్పముతో, పత్రముతో అలంకరింతుమో ఆ వర్ణమునే ప్రసరించును. ఆ రంగును ప్రతిబింబించును. స్వతహా దానికి రంగులేదు. భక్తు డేరంగుల వస్తు సంచయముతో పూజ చేయునో లింగమును అవేరంగులను ధరించును. అదేరీతిని ఈశ్వరస్వరూపము త్రిగుణాతీతము. కాని సాధకుని మనోభావమును అనుసరించి సత్త్వరజస్తమో గుణాకృతులను దాల్చినట్లు కాననగును.
పరమేశ్వరుడు, ఆహ్లాదకరుడగు అమృతకిరణుని శిరమున దాల్చియున్నాడు. ఈ శిరోభూషణమునకు అనుగుణ్యముగా స్ఫటికలింగమును సంతతక్షీరధారచే పూజా సమయనస్నానము చేయింపదగును. అభిషేకసమయమున యజుర్వేదాంతర్గతమగు రుద్రమును పఠింపతగును. చమకప్రశ్నమున 'శంచమే మయశ్చమే' యనియు, శ్రీరుద్రమున 'శంభవే మయోభువే, శంకరాయ, మయస్కరాయ' యనియు నున్నది. శం, శంభు శంకర, మయః, మయోభూః, మయస్కర-అనిన అర్థమేమి? ఒక్కొక్కరు ఒక్కొక్క విధముగ వ్యాఖ్యానింతురు. వేద మంత్రములకు వివిధార్థము లుండుట సరికాదు. వానికంతయు ఒక్కటే అర్థము. వేదముల పరమ తాత్పర్యమును గూర్చి శ్రుతి యీ క్రింది విధముగా చెప్పును.

సర్వే వేదా యత్పద మామనంతి
తపాంసి సర్వాణి చ య ద్వదంతి|
య దిచ్ఛంతో బ్రహ్మచర్యం చరంతి
తత్తే పదం సంగ్రహేణ బ్రవీమి||

సర్వవేదములకు ఏది అంతిమమో, తపస్సు దేనికి దారితీయునో, సాధకులు దేనినికోరి బ్రహ్మచర్యము చేయుదురో అట్టి పరమోన్నతస్థితిని నేను నీకు సంగ్రహముగా చెప్పుదును అని నచికేతునితో యముడనును. ఆయన సంగ్రహముగా చెప్పినది: ' ఓ మిత్యేతత్' అను వాక్యము. ఆ పరమపదమును ఓంకారము సూచించును. ఓంకారమునకు వివరణము:

మాండూక్యోపనిషత్తున - ''సర్వం హ్యే తద్బ్రహ్మ-అయమాత్మా బ్రహ్మ-సోయ మాత్మా చతుష్పాత్'' అనియు ప్రథమావస్థ- జాగృతియు, ద్వితీయావస్థ- స్వప్నమును, తృతీయావస్థ-సుషుప్తియు, చతురము-పూర్ణమును. అంతిమమును అగు తురీయమని చెప్పబడినది. తురీయమును గూర్చి ఉపనిషత్తు, అదృష్టము, అవ్యవహార్యము, అగ్రాహ్యము. అలక్షణము, అచింత్యము, అవ్యపదేశ్యము, ఏకాత్మప్రత్యయసారము, ప్రపంచోపశమము, శాంతము, శివము, అద్వైతము అని పలికి 'స ఆత్మా విజ్ఞేయః' అనియు వక్కాణించును. కనుక వేదముల అంతిమలక్ష్యము- ఓంకారము. అదియే వాఙ్మనసాతీత మగు పరబ్రహ్మము. 'ఏకమేవా ద్వితీయం బ్రహ్మ' అని శ్రుతి. శంకరులును దశశ్లోకియందు దీనినే యీ క్రింది విధముగా చెప్పిరి.

న చోర్ధ్వం న చాధో న చాంత ర్న బాహ్యమ్
న మధ్యం న తిర్య జ్న పూర్వా పరా దిక్,
వియద్వ్యాపకత్వా దఖండై కరూప
స్త దేకో వశిష్టః శివః కేవలోఽ హమ్||
న జాగ్రన్న మే స్వప్నకో వా సుషుప్తిః
న విశ్వో న వాతైజనః ప్రాజ్ఞకో వా,
అవిద్యాత్మకత్వాత్ త్రయాణాం తురీయః
త దేకో వశిష్టః శివః కేవలోఽ హమ్||

ప్రథమ శ్లోకమున ఈశ్వరుని సర్వవ్యాపకత్వమును, అఖండత్వమును సూచింపబడినది. శాంతము, శివము, అద్వైతము అని చెప్పబడు పరబ్రహ్మము సాధకుల ధ్యానార్థము పూజార్థము, ఆపాతాళ సభస్థలాంత భువన బ్రహ్మాండ మావిస్ఫురజ్జ్యోతిగ - శివస్వరూపముగా చెప్పబడుచున్నది.

సాధారణముగా - ఏ వస్తువునకైనను ముఖ్యభాగము కేంద్రమున స్థాపితమైయుండును. ఉదాహరణముగా శ్రీరంగములోని ఆలయమును దీసికొందము. అందు సప్తప్రాకారములు ప్రతి ప్రాకారమందును ఎన్నియో విగ్రహములు. ఆలయమునకు మూలవిగ్రహమేది యనివెదకునపుడు ఇతరుల సాయములేకయే ఆలయమునకు కేంద్రమున ఏవిగ్రహము స్థాపితమైయున్నదో అదియే మూలవిగ్రహమని నిర్ధారింతుము. గర్భగుడిమీదనే ముఖ్య విమానము నిర్మించియుందురు. కనుక ఏ వస్తువుకైనను నడుమ చెప్పినది, కేంద్రమున,

పలికినది అతిముఖ్యము. వేదముల ముఖ్యోపదేశమేమి? వేదములను 'త్రయీ'యని యందురు. వేదత్రయములగు ఋుక్, యజు, స్సామములలో యజుర్వేదము మధ్యనున్నది. ఇందు సప్త కాండములు, సప్త కాండములకు నడుమ నాలుగవ కాండము ఆ నాలుగవ కాండ మధ్యభాగము పంచాక్షరీ మంత్రము. 'శివ' ఇత్యక్షరద్వయమ్-అందుచే వేదశిం
ఓంకారమును, ఏకరూపమును అగు పరబ్రహ్మ స్వరూపమునకే 'శంభు' అని ధ్యానపూజాదుల నొసర్తురు. ఆయనయే ఆపాతాళ సభస్థలాంతవ వ్యాపించిన ప్రభువు పూజాదికముల గ్రహించు ఆపరమశివుడే శంభుడనియు శంకరుడనియు తెలియబడును. మనము 'శంభవే, మయోభువే, శంకరాయ, మయస్కరాయ' యని పరబ్రహ్మమును గూర్చి చెప్పుదుము. అదే పరబ్రహ్మను వేదములు 'శాంతము, శివము, అద్వైత' మని వర్ణించును, శంకరవిజయములను గ్రంథములలో భగవత్పాదుల జీవితచరిత్ర వర్ణితము. అందు ఆదిశంకరులు విరాట్స్వరూపుడగు పరమశివుని అవతారమేయని చెప్పబడినది.

''మూర్ధని హిమకరచిహ్నం
నిటలే నయనాంక మంసయో శ్శూలమ్,
వపుషి స్ఫటిక సవర్ణం
ప్రాజ్ఞా స్తం మేనిరే శంభుమ్||''

శంకరులు శిశువుగ నున్నపుడు ఆయన శిరమున చంద్రుని చిహ్నముండెడిదట. నిటలమున నేత్రచిహ్నమట. భుజములయందు శూల చిహ్నమట. వారిదేహము స్ఫాటిక చ్ఛాయలతో వెలిగిపోయెడిదట.

అజ్ఞానాంతర్గహనపతితా నాత్మవిద్యోపదేశైః
త్రాతుం లోకాన్ భవదవశిఖాతాప సాపచ్యమానా9,
ముక్త్వా మౌనం వటవిటపినో మూలతో నిష్పతంతి
శంభో ర్మూర్తి శ్చరతి భువనే శంకరాచార్యరూపా||

శంకరాచార్య రూపమున భువనమున తిరుగునది శంభుమూర్తియే. వటవృక్షమూలమువదలి మౌనమును త్యజించి అజ్ఞానారణ్యమున చిక్కిన వారును, భవతప్తులును అగు మానవానీకమును రక్షించుటకై ఆత్మవిద్యోపదేశమును చేయుచూ తిరుగులాడెడి శంకరాచార్యులు సాక్షాత్ దక్షిణామూర్తియే యని దీని తాత్పర్యము. ఇట్లు శంభువు శంకరుడాయెను. శ్రుతిలోని శంభువవు, శంకరుడు అను ఈ పదద్వయము ఒకే పరమాత్మను సూచించును. 'శంభుశబ్దమునకు సంభావయతి-ఉత్పాదయతి ఇతి శంభుః' అనియు శంకరశబ్దమునకు 'శంకరోతి ఇతి శంకరః' అనియు వివరణము, ఆనందమునకు మూలము శంభువు ఆనందమును లేక సుఖమును కల్గించెడివాడు శంకరుడు. ఆనందమూలమును మనము వెదకికొనుచు పోవలెను. కాని 'శంకరోతి' యనునపుడు ఈశ్వరుడు తన యునికిని వదలి ఆనందమును నాలుగుచోట్లకు కొని తెచ్చి ఆనంద పిపాసువులకందజేయును. మనమొక అరణ్యమున దప్పికొన్నప్పుడు జలాశయమునకై అన్వేషింతుము. కాని నది తన జన్మస్థానమునుండి జలవాహికమై పిపాసార్తులకు నీటిని తానుగ గొని తెచ్చును.

ఇచట మరికొన్ని గమనించదగిన విషయములున్నవి. శ్రుతి శంభువును వర్ణించునపుడు 'కపర్దినేవ్యుప్త కేశాయ' యని చెప్పును. కపర్ది యనగ జటలను దాల్చినవాడని అర్థము. శంభువును స్థాణువనియు, మౌనియనియు చెప్పుదురు. వట వృక్షచ్ఛాయలలో మౌనియై స్థాణువై అచలుడై ఆయనకూచుండును. ఆయన ఆనందమునకు మూలము, యోగమార్గమున గాని, తపోమార్గమునగాని ఆయనను మన మన్వేషించదగును. ఆయనకడకు మనము వెళ్ళవలెను. కానీ శంకరులట్లు కాదు నిత్యసుఖమును ఆయన మనమున్న కడకుదెచ్చి పడవైచి వెళ్ళును. మన వాకిలికి ఆయనయే అరుదెంచును. అజ్ఞాన గహనమున చిక్కిన మనలను చూచిన ఆయనకు అంతటిదయ.

శంభువు కపర్ది, జటాధారి శంకరులన్ననో వ్యుప్తకేశులు. కేశముండను గావించుకొన్నవారు. శంభువు స్థాణువు. అచలుడు. వటవృక్షచ్ఛాయలలో ఆసీనుడు. కానీ శంకరులు 'లోకాం స్త్రాతుం చరతి' ఒక్క చోటున నిలువక యత్యాశ్రమమున లోకములను కాపాడుటకై సన్యాసియై తిరుగులాడును. శంభువు మౌని, శంకరులు ఉపదేశకులు ఆత్మవిద్యోపదేశమును చేయుదురు. శంకరులు నాలుగాశ్రమములలో యత్యాశ్రమము నేల గ్రహింపవలెను? నాలుగు ఆశ్రమములందు సన్యాసమే దేశభ్రమణకు అనుకూలము. బ్రహ్మచారి గురువుకడ అంతే చోటునుండి మరొక చోటునకు పోవుట అనునది యుండదు. గృహస్థు డన్ననో తన భార్యాబిడ్డల యోగక్షేమముల గమనించుచు అతిథులను అభ్యాగతులను ఆదరించుచు ఇంటికడనే యుండును. వానప్రస్థుడు అడవులకేగి తపోధ్యానములలో కాలము గడపును. కాని సన్యాసి నిలకడలేక ఏ ఒక్కచోటునను మూడురాత్రులమించి గడపక చరించుచునే యుండును. అందుచే వేదాంతోపదేశమునకు సన్యాసాశ్రమమే అత్యుత్తమ మైనదని శంకరులు గుర్తించి సన్యాసియై అజ్ఞానములో మునిగిన మానవానీకమునకు సరియగు మోక్షమార్గమును చూపెను.

ముందు చెప్పిన మంత్రమున 'మయశ్చ నమోమయోభువే, నమో మయస్కరాయ'- అను పదము లున్నవి. మయః అను పదమునకు మనము అర్థము తెలిసికొనవలెను. మయస్ యనగా మోక్షసుఖము. మయః ''సుఖం భావయతి ఇతి మయోభూః'', ''ఆచార్యశాస్త్రాదిరూపేణ మోక్షసుఖం కరోతి ఇతి మయస్కరః'' మయస్ అనగా నిత్యసుఖము, ఈ నిత్యసుఖము నుత్పానచేయువాడు మయోభూః. మయస్కరుడు ఈ నిత్యసుఖమును దెచ్చియిచ్చెడివాడు. 'యద్వైశివం త న్మయః' అని యజుర్వేదము. 'శాంతం శివం అద్వైతమ్' అని చెప్పబడు ఆ పరబ్రహ్మమే 'మయః.'

ఈ నిత్యసుఖమును అందుకొనవలెనని శాంతి అవసరము. అదియే మన నైతిక- ఆధ్యాత్మిక సాధనలకు అంతిమ ఫలము. వృక్షములకు షడ్రసములు కలవు. అవి ఆవు లవణ కటు కషాయతిక్త మధురములు, వృక్షములో ఫలించెడు ఫలములకు సహిత మీరసములే. వృక్షము ఫలోన్ముఖమై ఫలించుటయే దాని పరిపూర్ణదశ, కాయలు ఫలించిన పిదప వృక్షమునకు వేరు పరిణామముగాని, అభివృద్ధిగాని యుండదు. షడ్రసములలో కడపటిది మధురరసము. ఏకాయయయినను సరే- ఫలించిన మధురమగును. చేదగు వేపకాయలు సైతము ఫలించినపుడు చేదుపోయి యించుక తీపికిదిగును. కాని కొన్ని ఫలములు వెఱ్ఱితీపి.
ఫలములలోని షడ్రసములవలెనే మనః పరిణామమును గూర్చి పలుకునపుడు నవరసములని వ్యవహరింతురు. అవి శృంగార వీర

కరుణాద్భుత హాస్య భయానక భీభత్స రౌద్ర శాంతరసములు అన్నిటికీ కడపటిది శాంతము.

ఆవ్లులవణరసాదులెట్లు మధురమున లయించుచున్నవో అటులనే శృంగార వీర కరుణరసాలు శాంతమున లయించి పరిపూర్ణత నొందును. శాంతి పక్వమైన మనఃస్థితికి చిహ్నము మనస్సు వృత్తిరహితమైనచో శాంతినొందును. బాహ్యవిషయ సంపర్కముచే కలుగు మనో వ్యాపారములోని మార్పులు నవరసములు సూచించును. అడవిలోనొక పులిని చూచిన తోడనే మనిషి భయకంపితుడగును. సౌందర్యముచే నుద్దీపించునొక మగువను చూచి పురుషుడు కామ వివశుడగును. ఏ స్థితియందు మగువ సౌందర్యము కామమునుగాని, వ్యాఘ్రదర్శనము భీతినిగాని కల్గింపదో అదియే శాంతము. ఆ స్థితి యందు వస్తుదర్శనముగాని, వస్తుస్మృతిగాని ఎట్టి మనోవికారమును గల్గించదు. ఆస్థితి మనస్సుయొక్క అసంగత్వమును స్వచ్ఛతను తెలుపును. సత్త్వ రజస్తమోగుణముల ననుసరించి మనోవృత్తుల మార్పులను గ్రహించదగును. ఇందు సాత్విక చిత్తవృత్తి ఉత్తమము. సాత్త్విక చిత్తవృత్తి వృద్ధి అయినదనిన తక్కిన రెండుగుణములు జరస్తమముల వృత్తులు క్షీణించిన వని యర్థము. కాని యీ సాత్త్విక చిత్తవృత్తిని సైతము నిరోధించవలెను. అపుడే శాంతి, ఈశాంతి చేతనే మయన్ అనెడు నిత్య సుఖమును అందుకొనగలము. 'మయోభూః' అనియు, 'మయస్కరః' అనియు వర్ణింపబడిన శంకరులు యతియై దేశాటనము గావించి రక్షణకును విమోచనమునకును కారకులైరి.
మనమందరము ఈ శాంతిని సాధించవలెను. ఈ శాంతి నందుటయే మోక్షము. ముక్తుడు సంసారమునుండి విడివడును. అతనికి మరుజన్మయనునదిలేదు. 'తమేవం విద్వానమృత ఇహభవతి' యని శ్రుతి. ఈ లోకమునందే యీ జీవితమునందే ముక్తి నందునని దీని తాత్పర్యము. ఈ శ్రుతి జీవన్ముక్తిని గూర్చి ముచ్చటతించుచున్నదిగాని విదేహముక్తిని గూర్చి కాదు.

మరణసమయమున మన మనోవృత్తులు అనగా మనో వ్యాపారములు ఎట్లుండునో వాని ననుసరించి మనుష్యునకు మరుజన్మ కలుగుచున్నదని శాస్త్రములు చెప్పుచున్నవి. విదేహముక్తియే సత్యమైనచో మరణానంతరము శాంతినొంది తద్ ద్వారా ముక్తి నందవలెను. కాని చావునకు ముందులేని శాంతి చచ్చినతర్వాత ఎట్లువచ్చును? కావున ముక్తి కాములు జననినివృత్తి కొరకు ప్రయత్నించెడివారు. ఈ జీవితముననే బ్రహ్మజ్ఞానమునొంది తద్వారా శాంతినందవలెను. శ్రుతిలోని 'ఇహభవతి' యనుటకు అదియే అర్థము. 'ఇహ' అను పదమే భగవద్గీతలోని యీ క్రింది శ్లోకమున వాడబడినది.

''శక్నోతీహైవ యః సోఢుం ప్రాక్శరీర విమోక్షణాత్,
కామ క్రోధోద్భవం వేగం న యుక్తః స సుఖీ నరః||

ప్రాక్ శరీ విమోక్షణాత్స్శరీరమును వదలిపెట్టుటకు మునుపే కామ్రక్రోధోద్భవ వేగమును వహించి ఇహ జీవితముననే శాంతి ద్వారా మోక్షము నందవలెనని భగవానుడి బోధచేయును.
నిత్యసుఖము శాంతి స్వరూపము. దానికై మనము అనుదినమును యత్నించవలెను. విషయసుఖములపై మనస్సును మళ్ళనీయక అనవరతము కడు జాగరూకతతో ఇంద్రియముల నియమ మొనర్పవలెను. దానికి మార్గములు రెండు నిరతసాధన యొకటి. నిత్యధ్యానముచే లబ్దమగు పరమాచార్యుని దయ రెండు.

ఏ విద్యకైనను గురువు ననుగ్రహము, శిష్యుని అభ్యాసము రెండు ముఖ్యమైన అంగములు, శిష్యునికి దైవమందెంత భక్తియుండునో అంత భక్తియే గురువునందు సైతము ఉండవలెను. లేనిచో మనస్సున కొక అనాదర మేర్పడును. గురువునే భగవత్స్వరూపముగ భావింపవలెను. గురువులు సాధారణులైన అట్టి మనోభావమును (అనగా భగవత్ స్వరూపులను భావమును) కల్పించుకొనవలెను. కాని మన ఆచార్యులకడ అభావము స్వభావసిద్ధముగ అయత్నముగా కల్గుచున్నది. శంభువే శంకరుడుగ అవతరించెను. వారు సాక్షాత్ శంకరులే. అందుచే మనకు సులభముగా వారియందు భక్తి జనించును. మన మనస్సును, మనోవృత్తులను నిరోధించి మన ఆచార్యుల కడ భక్తి ప్రపత్తుల నెరపినచో మనకు ఈ జీవితమునందే ముక్తి సులభసాధ్యమగును.
చాలమంది తమ జీవితములను వృధా యొనర్చు కొందురు. మోక్షాన్వేషణ మే గొప్పధీమంతులకోగాని సాధానణులకు గాదని వారి అభిప్రాయము. ఇది మిథ్యాశంక. తప్పు అభిప్రాయము. స్వల్పమైనను- కొంచెము సాధనచేసి యయినను- చిత్తశుద్ధి నొందుటకు యత్నించిన- అంతవరకు మన మెంతయో ధన్యులము. ఆచేసిన కొంచెము మరుజన్మకు మూలధనమగును. మోక్షమునకు పెట్టుబడియగును. అందుచే పురుషయత్నముచేసి ఆచార్యుల దయ సంపాదించుట మన కందరకును విధి. అపుడే మనకు ఉత్తమపుణ్యగతి గల్గును.

అపార కరుణాసింధుం జ్ఞానదం శాంతరూపిణం
శ్రీ చంద్రశేఖర గురుం ప్రణమామి ముదావహం ॥

--- “జగద్గురు బోధలు” నుండి

#KanchiParamacharyaVaibhavam #కంచిపరమాచార్యవైభవం
4/20/18, 16:07 - Paramacharyulu: ఇరవైయవ శ్లోక భాష్యం - నాలుగవ భాగం

శేషశాయి అయిన విష్ణుమూర్తికి వాహనం గరుత్మంతుడు. నాగరాజుని పిలవబడటమే కాక అనేక క్షేత్రాలలో సర్పాకృతిగా ఆరాధించబడే సుబ్రహ్మణ్యేశ్వరుని వాహనం నెమలి. ఈ రెంటికీ సర్పములంటే బద్ధ విరోధం. తన స్వామి పవళించే సర్పజాతితో గరుత్మంతునికి విరోధం. స్వయంగా తన స్వామి ఏ రూపంలో ఆరాధించబడతాడో ఆ రూపంపై నెమలికి ద్వేషం. ఈ వైరుధ్యాన్ని ఎలా సమన్వయ పరిచేది?

కుండలినీ శక్తికూడా సర్పంతో పోల్చబడు తుంది. ఒకే కుండలినీ సర్పం మూలాధారంలో నిదురించే సమయంలో కామసంబంధిగా తెలియబడుతుంది. అప్పుడది విషపూరితమైన చెడ్డ పాము. ఈ విషాన్నే విష్ణుమూర్తి వాహనమైన గరుడుడు, సుబ్రహ్మణ్యుని వాహనమైన నెమలి హరించేది. ఈ విషపూరితమైన కామ వ్యవహారమంతా అణగిపోయి, చుట్టుకొని నిదురిస్తున్న కుండలిని సహస్రారం చేరి అమృతమును వరిస్తుంది కదా! అప్పుడది దేవతా సర్పము. కుండలిని మూలాధారంలో నిదురించే సమయంలో ప్రాణశక్తిని రేతస్సుగా

పరిణమింపచేస్తుంది. రేతస్సు కామోద్దీపన వలన జనిస్తుందన్న విషయం సాధారణంగా అందరూ ఎరిగినదే! మానవుడు యోగసాధన వలన ఊర్ధ్వరేతస్కుడైనపుడు, కుండలిని సహస్రారం చేరినపుడు ఈ రేతస్సే అమృతంగా మారి వర్షించి డెభై రెండువేల ప్రాణనాడులనూ తడిపి వేస్తుందని యోగశాస్త్రం చెబుతోంది. ఇది స్వానుభవైక వేద్యము. యోగాభ్యాసం చేయకుండా, స్వానుభవంలో తెలుసుకోకుండా అలా జరగదు అనిచెప్పే అధికారం మనకు లేదు.

యోగులు యోగప్రక్రియలో నాడులన్నింటినీ అమృతమయం చేసి ఉంటారు కదా! అయినప్పటికీ వారికి అమరత్వం సిద్ధించలేదేమన్న ప్రశ్న ఉదయించడం సహజం. కొంతమంది మూడు నాలుగు వందల ఏళ్ళు జీవించిన యోగులున్నారని, మనం విన్నప్పటికీ ఆ తరువాత వారు కూడా శరీరాన్ని త్యజించారు. అమృతమయమైన వారు శరీరాన్ని త్యజించడానికి కారణమేమై ఉండవచ్చు?

దేవతలు త్రావిన అమృతం పాలకడలి చిలకడం ద్వారా లభ్యమైన ఒకానొక ఉత్కృష్టమైన ఔషధము. అది దేహాన్ని ఎంతో కాలం నాశనం కాకుండా ఉంచుతుంది. అయితే అది శరీర రుగ్మతలను పోగొట్టి శరీరాన్ని నిత్యనూతనంగా ఉంచగలదేమో కానీ, ఆత్మోన్నతికి ఉపయోగించదు. అమృతం త్రావిన అమరులు జ్ఞానులవలేరు. వారు శరీర వాంఛల నుండి సుఖాలనుండి తప్పుకోలేరు. ఇక వైరాగ్యానికి తావులేదు. సాధారణ మానవులకు కొంతకాలం సుఖానుభవం తరువాతనో, జవసత్వాలుడిగిపోయిన తరువాతనో ఈ రకమైన జీవితమిక చాలునన్న వైరాగ్యం కలిగే అవకాశమున్నది. దేవతలకు శరీర దారుఢ్యత తగ్గే అవకాశం లేదుకదా!

పరమమైన కుండలినీ యోగసాధనల వల్ల జనించే అమృతం కేవలం క్షుద్రమైన ఆనందముల అనుభవం కోసం శరీరమును నిత్య నూతనంగా ఉంచడానికి మాత్రమే ఉపయోగించేదే అయితే యోగులు అటువంటి యోగంపై  ఆసక్తి చూపేవారే కాదు. వారు చేసే సాధన పరమమైన ఆనందాన్ని ప్రసాదించేది. సహస్రారం నుండి జాలువారే అమృతధారల చేత సమస్త నాడీ మండలం తడపబడటం వలన జన్మించిన ఆనందం అద్వైతానుభవాన్ని ముందు కలిగే ఆనందం. ఈ అమృతానికి కూడా సాధకుడైన యోగి శరీరాన్ని కాంతిమంతంగానూ, ఆరోగ్యవంతంగానూ ఉంచేశక్తి ఉన్నప్పటికీ, దాని పరమ ప్రయోజనమది కాదు.

(సశేషం)

#KanchiParamacharyaVaibhavam #కంచిపరమాచార్యవైభవం
#ParamacharyaSoundaryaLahariBhashyam
4/20/18, 18:46 - Paramacharyulu: <Media omitted>
4/21/18, 07:03 - Paramacharyulu: వేదవ్యాసులు – ఆదిశంకరులు

మన మతానికి మూలము వేదము. ఒక విధంగా చూస్తే మన మతాన్ని హిందూమతము అనుటకూడా సరికాదు. సింధునదీ తీరంలో ఉన్నవారి మతానికి పాశ్చాత్యులు పెట్టిన పేరు హిందూమతం. అందుచే మన మతాన్ని వైదికమతమనుటసరి. దీనిని సనాతనధర్మమని కూడా చెప్పుతున్నారు. అన్ని మతములకు ఒక ప్రవక్తో, మూలగురువో ఉండును. కాని మనమతమునకు చారిత్రకముగా ఒక ప్రవక్తలేడు. ఇది ఎన్నియో శతాబ్దములుగ అనాదిగ వచ్చుచున్నది. వేదములెట్లు అనాదిగా నున్నవో ఈ మతమున్నూ అనాదియే.
వేదములు అనంతములు. 'అనంతావై వేదాః' వేద వ్యాసులు తమశిష్యులైన పైల జైమిని, సుమంత, వైశంపాయనుల సాహాయ్యముతో వేదములను నాలుగు భాగములుగా విభజించిరి. వేదములు మంత్రములు. ఇవి వ్రాయబడలేదు. ఒకరు చెప్పగా, ఒకరు వినుచు వల్లన వేయబడుచు వచ్చు చున్నవి. (వాక్కుద్వారా ఒకరినుండి యొకరికి బోధింపబడినవి.) అందుచేతనే వీనికి శ్రుతులనిపేరు. శ్రుతి యనగా వినబడునదని అర్థము. వేదములను విని వల్లించుటకే అధ్యయనమని పేరు. వేదాధ్యయనమును సక్రమముగా చేసిన ఆమంత్రశక్తిచే ప్రపంచమే బాగుపడును. ఇట్లు వేదాధ్యయనమును చేసిన ఋషుల మూలమునుండియే మనము జన్మించితిమని చెప్పుదురు. అందుచే అట్టి గొప్ప ఋషుల వారసులమగు మనకు వేదాధ్యయనము చేయుట ఒకవిధి.

ఋషులు మంత్రద్రష్టులు. అనగా మంత్రములను వారు దర్శించిరని యర్థము. శబ్దము అనాది. రేడియోను ట్యూను చేసి పాటలను విందుము. ఋషులు తమ మనస్సులను యోగ మార్గమున ట్యూన్‌చేసి శ్రోత్రేంద్రియముల కతీతములగు అనాది శబ్దములను గ్రహించిరి. కృష్ణపరమాత్మ తన విశ్వరూపమును చూచుటకు సమర్థములగు దివ్యచక్షువులను అర్జునునకు ప్రసాదించెనట. మన దేహమునగల కొన్ని నాడీవర్గములచేత ఇట్టి శక్తిని పొందవచ్చునని యోగశాస్త్రము చెప్పును.
వేదములను వాని సహజశక్తిలో నుంచుటకు కొన్ని నియమములను ఏర్పరచిరి. మంత్రశక్తిని అవిచ్ఛిన్నముగా నిలబెట్టుటకు వేదాధ్యయన పరులకు ఉపాకర్మ, గాయత్రీ జపము మొదలగు విధులను నియమించిరి. మంత్రద్రష్టలగు ఋషుల యోగశక్తి ద్వాపరమున క్షీణించునని తెలిసియే వ్యాసులు వేదవిభజన చేసిరి. వ్యాసమహర్షి

ఇదే కాక బ్రహ్మసూత్రములకు వ్యాసభగవానులు గ్రంథకర్త. ఉపనిషత్తులకు మూలమగు పరబ్రహ్మతత్త్వమును, దానిని పొందుమార్గమును ఇవి విశదీకరించును. బ్రహ్మసూత్రములకు శ్రీశంకరులు, శ్రీరామానుజులు, శ్రీమధ్వాచార్యులు - ముగ్వురును భాష్యములను వ్రాసిరి. వీరేకాక శ్రీ వల్లభాచార్యులు, శ్రీనింబార్కులు, శ్రీకంఠులు సైతము బ్రహ్మసూత్రములకు వ్యాఖ్యాతలే. అన్ని సిద్ధాంతములును వ్యాసులకు నివాళులనిచ్చును. వేదధర్మశాస్త్రపరిపాలనా సభా సమ్మేళనములలో వ్యాసుల పటమునుబెట్టి పూజింతురు. ఈ సభయొక్క ఉద్దేశ్యము వేదశాస్త్రజ్ఞానమును, ధర్మశాస్త్రజ్ఞానమును నిలబెట్టుటయే. వేదాధ్యయనమును చేయుటకు వీలులేనిచో కనీసము ఒక రూపాయి చందానైనను ఈ సభకిచ్చి సభ్యుడుగా నుండుట కర్తవ్యము. తమ కౌమార, ౖ ౦వన దశలను వేదాధ్యయనమునకై వెచ్చించినవారికి జనము ఋణపడియున్నది. వేదాంతమార్గము నవలంబించే వివిధ శాఖీయులు కూడా ఈ సభలో సభ్యులై వేదవ్యాసులను పూజింపదగును.

ఆధ్యాత్మిక విషయమున విదేశీయులు మనదేశముపై కడు గౌరవభావ ముంచియున్నారు. ఈ అనాది సత్యమును తెలిసికొనుటకు వారు యాత్రికులై వచ్చుచున్నారు. ఈనాడు మనకు గౌరవమున్నదనిన, మన పెద్దలు మన కనుగ్రహించిన వేదముల ఫలితమే. మన మతము వైదికభూమికపై నిలిచియున్నది. కనుక వేదములను విధిగా మనము నేర్వవలెను. వైదికాచారములను చక్కగా తెలిసికొనుటకు

వేదాంగములు ప్రయోజన పడుటయేకాక వేదప్రాముఖ్యమును స్ఫుటముగా అవి చాటుచున్నవి. వేదమునకు కర్మానుష్ఠానము అతి ముఖ్యము. మతమునిలువవలెనన్న మతాచారములను పాటించవలెను. వానిని ధర్మశాస్త్రములు విశదీకరించును. అవియే మనుస్మృతి, యాజ్ఞవల్క్యస్మృతి. పరాశరస్మృతి - వీని ననుసరించి నిర్ణయ సింధు, మితాక్షరము అనెడు గ్రంథములును వెలువడినవి. ఇవి అందరును చదువుటకు అందుబాటుగా నున్నవి.

వేదమతమునకునూ, ఇతరమతములకునూ ఒక ముఖ్య భేదముగలదు. వైదికమతమునవలంబించే మనము దేవతలకునూ, పితరులకును చేయవలసిన విధులను నిర్వర్తించవలెను. మనకు దేవలోకమున్నదనుట ఒక దృఢనమ్మకము. అందుచే మతకర్మలలో దేవతలకు ఆహుతుల నిచ్చి

దేవాన్ భావయ తానేన తే దేవా భావయంతు వః!
పరస్పరం భావయంతః శ్రేయః పర మవాప్స్యథ!

''ఈ యజ్ఞములచే మీరు దేవతలను ప్రీతినొందింపుడు. ఆ దేవతలు మీకు వం
అగ్నియందు వ్రేల్చిన ఆహుతులు దేవునకు చేరునాయనెడు విషయమున సందేహములేదు. దేవుడు అంతర్యామి ఆయన ఎందునూగలడు. అగ్నిలో వ్రేల్చిన ఆహుతులతో ఆయన తృప్తినొందును. గ్రామమున రాజునకు చెల్లింపవలసిన పన్నును గ్రామస్థుడు రాజునకు స్వయముగా నందించుటలేదు. పన్నును గ్రామపుతలారికి ఇచ్చిన అతడు రాజునకు అందజేయును. అటులే సమస్త దేవతలకును చేయు అప్పనములన్నియు పరమేశ్వరునకు చెల్లుచున్నవి. ఆ సర్వేశ్వరుని ప్రభుత్వము అట్టిది. ఆ ప్రభుత్వపు చట్టములే వేదములు. వానివిభజనమే వ్యాసులవా రొనర్చినది.

అపార కరుణాసింధుం జ్ఞానదం శాంతరూపిణం
శ్రీ చంద్రశేఖర గురుం ప్రణమామి ముదావహం ॥

--- “జగద్గురు బోధలు” నుండి

#KanchiParamacharyaVaibhavam #కంచిపరమాచార్యవైభవం
4/21/18, 15:17 - Paramacharyulu: <Media omitted>
4/21/18, 16:40 - Paramacharyulu: ఇరవైయవ శ్లోక భాష్యం - అయిదవ భాగం

కుండలినీ యోగాన్ని సాధన చేసే శాక్తయోగులు వేదాంతుల వలే ఈ దేహాన్ని మాయ అని త్రోసిపుచ్చారు. వారికి ఈ ప్రపంచం వ్యవహారమంతా అంబికలీల. ఆవిష్కరించబడిన ఆమె శక్తి విశేషం. ఈ శరీరంలో ఉండాలన్న ఇచ్ఛఉన్నంత వరకు, అంబికలీలను చూడగలిగేందుకు ఈ అమృతము అతనికి ఉపయోగిస్తుంది. కొంతకాలం గడచి అంబికలో లీనమవాలనే సంకల్పం కలిగిన తరువాత ఈ దేహాన్ని త్యజిస్తారు. సర్పాకృతిలో ఆరాధించబడే సుబ్రహ్మణ్యుడు ఇటువంటి అమృతం కురిపిస్తాడు. కుండలినీయోగం గురించి చెప్పకపోయినా యోగశాస్త్రాన్ని మనకు అందించిన పతంజలి ఆదిశేషుని అపర అవతారము. పాములకు జన్మ విరోధియైన జీవి ఇంకొకటున్నది. అది ముంగిస, ముంగిసను సంస్కృతంలో 'నకుల'మని పేరు. అంబిక యొక్క ఒక రూపము నకులేశ్వరి. మహారాజ్ఞి అయిన అంబికకు మంత్రిణి, రాజమాతంగి అని పేర్లుగల మంత్రిణి ఒకరున్నారు. ఆమెకు లలితాంబిక తన సర్వంసహా అధికారాలన్నీ ఒప్పగించి, ఆమె చేత పరిపాలన చేయిస్తోంది. సహస్రనామాలలో “మంత్రిణీ న్యస్త రాజ్యధూ” అన్న నామం ఇందువలననే వచ్చింది.

మధుర మీనాక్షి రాజమాతంగి ఒక్కరే! ఆమెకే నకులేశ్వరి అన్న పేరున్నది. కుండలిని మూలాధారంలో సర్పాకృతిగా నిదురించేటప్పుడు ఆత్మప్రగతికి అవరోధంగా ఉంటుంది. సర్పంతో ఆజన్మ విరోధమున్న ముంగిస పేరు దాల్చిన ఈ అంబిక అటువంటి అవరోధాలను తొలగించి ఆంతరంగిక మైన సంపదలను ప్రసాదిస్తుంది.

మూలాధారమునకు 'కుల' మని పేరు. సౌందర్యలహరిలోనే “కులకుండే స్వపిషి...” అన్న పదములు చూస్తాము. ఆత్మస్పృహ లేకుండా ఆమె మూలాధారంలో నిదురిస్తూ ఉంటుంది. తద్భిన్నమైన పరిస్థితిని సృజించి ఆత్మసాక్షా త్కారానికి దోహదం చేసేది 'నకులి'. 'కుల' పదమునకు వ్యతిరేకము 'నకుల'-

పాములకు సహజ శత్రువులైన గరుత్మంతుడు, నెమలి, ముంగిసలలో గరుత్మంతునకు ఒక ప్రత్యేకత ఉన్నది. ఆయన పాములను సంహరించడమే కాదు. అమృతం తెచ్చినవాడు కూడా! సర్పజాతికి తల్లి అయిన కద్రువ గరుత్మంతునికి సవతి తల్లి. ఆమె పందెంలో కపటం చేసి తన సవతి అయిన వినతను (గరుత్మంతుని తల్లి) దాసిగా చేసుకొంది. తన తల్లి దాస్యవిముక్తికై ప్రార్థించిన గరుత్మంతునికి ఆమె దానికై ఒక షరతు విధించింది. ఆ షరుతు మేరకు సర్పములు తాగడానికి గాను దేవేంద్రునితో పోరి గరుత్మంతుడు అమృతకలశాన్ని తెచ్చి కద్రువకు సమర్పించాడు. చివరికి అది సర్పమునకు దక్కలేదు. సరికదా గరుత్మంతుడే పాములను తినడం మొదలుపెట్టాడు.

గోదాదేవి అవతరించిన శ్రీవల్లిపుత్తూరు క్షేత్రంలో గరుత్మంతునకు 'అమృతకలశం' అని పిలవబడే తిను బండారము నైవేద్యంగా సమర్పిస్తారు. లోపల ఉన్న పూర్ణము (తీపి)ను అమృతంగా, చుట్టి ఉన్న తోపుపిండి కలశంగాను భావించాలన్నమాట. శ్రీవల్లిపుత్తూరులో మిగతా క్షేత్రాలలో వలె గరుడాళ్వారు విష్ణుమూర్తికి ఎదురుగా కాక, గోదాదేవికి సమానంగా ప్రక్కనే ఉండటం విశేషం. శ్రీరంగనాయకుడు గోదాదేవిని తనలో ఐక్యం చేసుకొన్న తరువాత విష్ణుచిత్తుడు స్వామిని, “నాకు పెంపుడు కూతురిని ప్రసాదించినట్లే ప్రసాదించి, నీవే తీసుకుని మళ్లీ నన్ను ఒంటరిని చేయడం న్యాయమా' అని ప్రార్థించాడట. స్వామి గోదాదేవిని శాస్త్రోక్తంగా వివాహమాడి ఆమెతో కూడి నీ కంటికి ఎదురుగా విలిపుత్తూరులో నివాసముంటానని అనగ్రహించాడు. స్వామి నోట మాట వెలువడినదే తడవుగా గరుత్మంతుడు కనురెప్ప పాటు కాలంలో వారిని శ్రీవిల్లిపుత్తూరు చేర్చాడు. ఈ కైంకర్యానికి ఆనందించిన స్వామి గరుత్మంతుని గోదాదేవితో తన ప్రక్కనే ఉంచుకున్నాడు. పెరియాళ్వారుగా పేరుపొందిన విష్ణుచిత్తుడు గరుత్మంతుని అవతారంగా భావించబడుతున్నాడు.

(సశేషం)

#KanchiParamacharyaVaibhavam #కంచిపరమాచార్యవైభవం
#ParamacharyaSoundaryaLahariBhashyam
4/22/18, 08:15 - Paramacharyulu: తలపై భారం - కంట్లో నీరు

పండానైనల్లూర్లోని శ్రీ పందాడు నాయకి పశుపతినాథ స్వామి దేవాలయంలోని శ్రీ విష్ణు దుర్గా అమ్మవారి కంటికొనలలో నుండి నీరు స్రవించడం భక్తులందరూ ప్రత్యక్షంగా చూశారు. ఇది 1986 ఫెబ్రవరి 19న జరిగింది. వారు పరిగెత్తుకొచ్చి నాకు ఆ విషయం చెప్పగా నేను కూడా వెళ్ళి చూశాను. అమ్మవారి కళ్ళల్లో నుండి నీరు కారుతోంది. అమ్మవారిని అలా చూస్తున్న మా బాధను వర్ణించడానికి మాటలు చాలవు.

ఒక కన్నెపిల్లను దుర్గా స్వరూపంగా భావించి ఆమెకు పూజ చేయడానికి సిద్ధం చేశాను. ఆ కన్నిక దుర్గకు మంగళద్రవ్యాలు సమర్పించి, నవాక్షరి మంత్రజపం చేశాను. “తల్లీ ఏమిటి మా దోషం?” అని అమ్మవారిని అడిగాను. దుర్గా స్వరూపంగా ఉన్న ఆ కన్నెపిల్ల మాతో, “నాకు పచ్చని పట్టు లంగా కట్టుకున్న ఒక అమ్మవారి స్వరూపం కనపడి ‘నా భారం తొలగించండి’ అని అన్నదని” మాతో చెప్పింది. తరువాత మేము ప్రత్యేక అభిషేకము ఆరాధనలు చెయ్యడంతో విష్ణు దుర్గా అమ్మవారి కళ్ళ వెంట నీరు కారడం ఆగిపోయింది.

ఈ విషయాన్ని పరమాచార్య స్వామివారికి తెలిపి వారినుండి వివరణ ఏమిటో తెలుసుకోవాలని మేము కంచి బయలుదేరాము. మహాస్వామివారు మాకు ఇరవైఅయిదు లీటర్ల గంగాజలం ఇచ్చి, లక్ష ఆవృత్తుల నవాక్షరి మంత్రజపంతో ఆ నీటిని బలోపేతం చేసి విష్ణు దుర్గకు అభిషేకం చేసి నా వద్దకు రండి అని చెప్పారు.

నాలుగునెలల తరువాత స్వామివారు చెప్పినట్టుగా చేసి కాంచీపురం దగ్గర్లోని ఒరిరుక్కైలో మకాం చేస్తున్న పరమాచార్య స్వామివారి దర్శనానికి వచ్చాము. అమ్మవారి కళ్ళల్లో నుండి వస్తున్న నీరు ఆగిపోయిందని స్వామివారికి నివేదించాను. స్వామివారు కొద్దిసేపు ఆలోచించి, “అమ్మవారికి పైకప్పు తగులుతోందా?” అని నన్ను అడిగారు.

ప్రతిరోజూ పూజ చేస్తున్నా నేను ఆ విషయం అంతగా ఎప్పుడూ గమనించలేదు. అందుకే నేను స్వామివారితో, “నేను అంతగా గమనించలేదు. వెళ్ళి చూసివచ్చి చెబుతాను” అని చెప్పాను.

నేను తిరిగివెళ్ళి ఒక తాడుని అమ్మవారి తలకు పైకప్పుకు మధ్య ఉంచి చూడగా, స్వామివారు అనుమానపడ్డట్టు ఆ పైకప్పు అమ్మవారి తలను తాకుతోంది. కాస్త పరిశీలించగా గోడలో పడిన ఒక చీలిక వల్ల పైకప్పు కొద్దిగా వాలి అది అమ్మవారి తలను తాకుతోంది. మేము మరలా స్వామివారిని కలిసి ఈ విషయం చెప్పాము.

దుర్గా అమ్మవారి విగ్రహాన్ని బయటకు తీసి, పైకప్పును కాస్త లోతుగా చేసి, అమ్మవారిని పీఠంపై పునః ప్రతిష్టించి కుంబాభిషేకం నిర్వహించండని స్వామివారు ఆదేశించారు. స్వామివారి అదేశం ప్రకారం మార్పులుచేసి 1987లో తై మాసంలో కుంబాభిషేకం నిర్వహించాము. ప్రసాదం తీసుకొని స్వామివారి దర్శనానికి వచ్చాము. మహాస్వామివారు విశేషాలన్నిటిని తెలుసుకొని ప్రసాదాన్ని స్వీకరించారు. “మీ ఊరి ప్రజలు చాలా అదృష్టవంతులు. అమ్మవారు అలా కన్నీరు కార్చడం మీకందరకూ అనుగ్రహాన్ని ప్రసాదించడానికే” అని స్వామివారు మాతో అన్నారు.

మేము అలా స్వామివారితో మాట్లాడుతూ ఉండగా ఒక గుజరాతీ భక్తుడు స్వామివారి దర్శనానికి వచ్చాడు. స్వామివారు తనితో కాసేపు మాట్లాడారు. తరువాత మావైపు చూసి, “మీరు ఇక్కడికి రావడానికి మీకు ఎంత ఖర్చు అవుతుంది?” అని అడిగారు.

“దాదాపు మూడువందల రూపాయలు అవుతుంది”

స్వామివారు ఆ గుజరాతీ భక్తుణ్ణి మాకు మూడువందల రూపాయలు ఇవ్వాల్సిందిగా ఆదేశించారు. అతను స్వామివారి ఆదేశాన్ని శిరసా వహించి పరమసంతోషంతో మాకు ఇచ్చాడు. భవంతుణ్ణి తాకి పూజించే శివాచార్యులంటే పరమాచార్య స్వామివారికి అపారమైన కరుణ. మా బాగోగుల కోసం వారు నిత్యమూ శ్రమించేవారు.

పరమాచార్య స్వామివారు కేవలం విష్ణు దుర్గ అమ్మవారి తలపైన ఉన్న భారాన్నే కాదు మా గుండెల్లో ఉన్న భారాన్ని కూడా తొలగించారు. కేవలం ఆ చంద్రశేఖరుడు తప్ప ఎంకెవ్వరు ఇలాంటి ఆదేశం ఇవ్వగలరు?

అపార కరుణాసింధుం జ్ఞానదం శాంతరూపిణం
శ్రీ చంద్రశేఖర గురుం ప్రణమామి ముదావహం ॥

--- శివశ్రీ జగదీశ శివాచార్య, పండానైనల్లూర్. మహా పెరియవళ్ - దరిశన అనుభవంగళ్ 2

#KanchiParamacharyaVaibhavam #కంచిపరమాచార్యవైభవం
4/22/18, 16:16 - Paramacharyulu: ఇరవైయవ శ్లోక భాష్యం - ఆరవ భాగం

అమృతంతో సంబంధమున్న గరుత్మంతుడు ప్రజలను విషము నుండి రక్షిస్తాడు. చంద్రకాంత శిలామూర్తిగా అంబికను ధ్యానం చేసినవారు

గరుడుని వలే పాముల విషాన్ని శమింప చేయగలడని ఆచార్యులవారంటున్నారు. “ససర్పాణాం దర్పం శమయతి శకుంతాధిప ఇవ”. 'శకుంతము' అంటే పక్షి. మేనకా విశ్వామిత్రుల సంతానము పక్షుల చేత పెంచబడి శకుంతల అయింది కదా! గరుత్మంతుడు శకుంతాధిపుడు పక్షిరాజు.

ఈ శ్లోకం జపం చేయడం వలన పాముకాటు వల్ల ఎక్కినా విషము హరించడమేకాక, దోమవంటి కీటకముల వలన కలిగిన చలిజ్వరములు, వైరల్ జ్వరములు కూడా శమిస్తాయి. అంబికను అమృత కిరణమూర్తిగా ధ్యానించిన వారికి అమృతనాడి సిద్ధిస్తుంది. లేక సహస్రారంలో కురిసిన అమృతపు జల్లులకు అతడి నాడీమండలమంతా అమృత మయమవుతుంది. అమృత నాడులున్న అతడి దృష్టి జ్వరగ్రస్తుని పై పడితే చాలు, జ్వరం మటుమాయమయిపోయి అతడు సుఖిస్తాడు.

“జ్వరప్లుష్టాన్ దృష్ట్యా సుఖయతి సుధాధార సిరయా”

అంబిక అరుణారుణమైన తనుచ్ఛాయతో నభోంత రాళములు ప్రకాశిస్తున్నట్లు ఆ కాంతితో భూమ్యాకాశములు నిండిపోయినట్లు భావించిన సాధకునికి వశీకరణ శక్తి లభిస్తుందని పద్దెనిమిదవ శ్లోకంలో చెప్పబడి ఉంది. సాధారణంగా అంబిక తనుచ్ఛాయ శుద్ధస్ఫటికం వలె ప్రకాశించేదే అయినప్పటికీ, శ్రీవిద్యాధిదేవతగా అంబిక అరుణవర్ణంతో ప్రకాశిస్తుందని చెప్పబడింది. అది శ్రీ విద్యాధిదేవత యొక్క ప్రత్యేకత. సూర్యోదయ కాలంలో ఆకాశమంతా అరుణిమతో ప్రకాశిస్తుంది కదా! అదే విధంగా భూమ్యాకాశములు, సమస్త బ్రహ్మాండము ఆమె తనుచ్ఛాయవలన అరుణారుణంగా ప్రకాశిస్తోందనే భావన చేయాలన్నమాట. వశీకరణ విషయంలో మనం వశీకరింపబడకూడదనే ఉద్దేశంతో నేనా శ్లోకాన్ని వ్యాఖ్యానించలేదు. అయితే అంబిక యొక్క ప్రత్యేకత అయిన ఈ అరుణ వర్ణం గురించి చెప్పుకోకుండా ఉండేదెలా? అదీకాక వశీకరణం యొక్క అంతరార్థం గురించి మనం చెప్పుకోవద్దా?

సౌందర్యలహరిలోనూ మరి అటువంటి ఇతర శాక్త గ్రంథములలోనూ వశీకరణ, స్త్రీవశ్యము, మన్మథునిబోలిన గురించి బహుధా చెప్పబడి ఉంటుంది. ఆ మాటల అర్థాన్ని కేవలం వాచ్యార్థంగా తీసుకొంటే ప్రమాదమున్నదే. ఒక వ్యక్తి ఇంకొకరిని ఆకర్షించడానికి ప్రయత్నిస్తున్నాడంటే అర్థమేమిటి? అతడు వారిచే ఆకర్షించబడినాడన్న మాట. అందువల్లనే వశీకరణ మంత్రాలను ఉపయోగించి వారిని స్వంతం చేసుకోవాలని ప్రయత్నిస్తాడు. ఒకరు ధన కనక వస్తువాహనాది సంపదను సంపాదించి, వాటిని తాను స్వంతం చేసుకొన్నానని భావిస్తారు. నిజంగా జరిగేది ఏమంటే అతడు వాటిచేత స్వంతం చేసుకోబడ్డాడు. వాటికి బానిస అయినాడు. దీనికి తార్కాణమేమిటి? ఒకవేళ ఆ సంపద పోయినట్లయితే ఈతడి మతి చలించిపోతోంది కదా! ఏదో ఒక వస్తువునో, వ్యక్తినో వశీకరించుకోవాలని మంత్రజపం చేసే వ్యక్తి, తన వశ్య మంత్రానికి గమ్యమైన వస్తువు లేక కోరికకు బానిస అయిపోయాడు. అటువంటి వానికి అంబికను సదా తన హృదయంలో ఉంచుకొని ధ్యానిస్తూ క్రమశః ఆత్మసాక్షాత్కారం పొందే దారి మూసి వేయబడుతుంది.

మంత్రశాస్త్రాన్ని ఆవిష్కరించిన ఆచార్యుల వారి వంటి మహాపురుషులు ఒక మనిషి తన పరమగమ్యము చేరుకోవడానికి పయనించవలసిన దారిని మూసివేసే పద్ధతి ఉపదేశిస్తారని మీరనుకొంటున్నారా? అంబిక భక్తులు మనఃస్థితిని ఆచార్యులవారు “మృదితమల మాయేన మనసా” అని అభివర్ణిస్తారు. భక్తుని మనసు చెడ్డ ఆలోచనలకు, కోరికలకు దూరంగా మాయను అణచి ఉండే విధంగా ఉంటుందట. అంబిక భక్తుడు తుచ్ఛమైన వశీకరణాది విషయాల్లో మనస్సు పెట్టేవాడుకాదు. మాయ అనే మహా సర్పాన్ని కాళీయ మర్దనం చేసిన కృష్ణునివలె మర్దించేవాడు. కాబట్టి 'వశ్యము' అనేదానికి అంబికను ధ్యానించే సాధకుడు ఎటువంటి ఆకర్షణలకు బానిసకాడనీ, అతడి మనస్సు ఎప్పుడూ అతడి అధీనంలోనే ఉంటుందనీ అర్థం చెప్పుకోవాలి. అతడు వశీకరించు కొన్నాడన్న మాటకు ఆ వస్తువు అతనిలో ఐక్యమయిందనే అర్థం చెప్పుకోవాలి. గీతలో భగవానులు “సముద్రం ఆపః ప్రవిశంతి యద్వత్ తద్వత్ కామాయాం ప్రవిశంతి సర్వే” అంటారు. సముద్రం నదులన్నిటినీ తనవైపుకు లాగి తన అధీనంలోనికి తెచ్చుకొన్నట్లు - వశ్యమంటే తన వైపుకు లాగుకొనడమేకదా! నదులుగానీ, సముద్రం గానీ ఒకదాని కొకటి భిన్నంగా గుర్తించుకోలేవు కదా! సముద్రము నదులూ కూడా అద్వైత భావాన్ని పొది “శాంతిం ఆప్నోతి” శాంత స్థితిని పొందుతాయి.

(సశేషం)

#KanchiParamacharyaVaibhavam #కంచిపరమాచార్యవైభవం
#ParamacharyaSoundaryaLahariBhashyam
4/23/18, 07:05 - Paramacharyulu: ఒక ఔన్సు జలం

ఒకసారి శంకర జయంతి రోజు జలతరంగం నిర్వహించడానికి ఒక కళాకారుడు ఉద్యుక్తుడయ్యాడు. జలతరంగం అనేది మన సనాతన భారతీయ సంగీత కళ. నీరు నింపిన పింగాణి లేదా లోహపు గిన్నెల అంచులను చిన్న కర్రలచేత రెండు చేతులతో రాపాడించి చేసే ఒక కచేరి. ఆనాటి కచేరిని ‘వాతాపి గణపతింభజే హం’ అనే కీర్తనతో మొదలుపెట్టాలని అంతా సిద్ధం చేసుకుంటున్నాడు.

అతను ఈ కళలో బాగా ఆరితేరిన సంగీతజ్ఞుడే అయినా ఆరోజెందుకో ఎంత ప్రయత్నించినా శృతి కుదరటం లేదు. చాలా సార్లు ఏదేదో ప్రయత్నించాడు కాని అన్నీ నిష్ఫలమయ్యాయి. పరమాచార్య స్వామివారి ముందు ఇలా జరగడంతో అతనికి చాలా బాధ వేసింది. ఆవేదనని మనస్సులోనే అణచుకొని శృతి సరిచెయ్యడానికి ప్రయత్నిస్తూనే ఉన్నాడు.

మహాస్వామివారు ఆ సంగీతకారుని అవస్థను గమనించారు. శిష్యుడొకరిని దగ్గరకు పిలిచి అతనివద్దకు ఒక వార్తను చేర్చారు. “ఆ అయిదవ గిన్నెలో నుండి ఒక ఔన్సు జలం తిసెయ్యమని అతనికి చెప్పు”. స్వామివారి ఆదేశం ప్రకారం అతను చెయ్యగానే శృతి సరిగ్గా సరిపోయింది.

ఆ విద్వాంసుడు దిగ్గున లేచివచ్చి ఒక్కసారిగా నేలపై పడి స్వామివారికి సాష్టాంగ నమస్కారం చేశాడు. క్షమాపణ పూర్వకంగా చిన్న స్వరంతో “ఈ విషయాలన్నీ మహాస్వామికి ఎలా తెలుసు? నాకు కూడా ఈ విషయం తెలియదు” అని కృతజ్ఞతలు తెలియజేశాడు.

అపార కరుణాసింధుం జ్ఞానదం శాంతరూపిణం
శ్రీ చంద్రశేఖర గురుం ప్రణమామి ముదావహం ॥

--- ఎన్. వెంకట్రామన్, మైలదుతురై. మహా పెరియవళ్ - దరిశన అనుభవంగళ్ 2
4/23/18, 18:28 - Paramacharyulu: ఇరవైయవ శ్లోక భాష్యం - ఏడవ భాగం

జ్ఞాని విషయమూ అంతే. కోరికలు అతనిలోనికి ప్రవహిస్తాయి. అతడు కోరికలన్నీ లయమయిపోయే స్థితిని చేరుకొంటాడు. ఒక వస్తువును నీదిగా చేసుకొనేకంటే ఆ వస్తువునే నిన్నుగా చూడగలిగితే ఇక ఆ వస్తువు పై నీకు కోరిక అనే అవకాశమే ఉండదు కదా! ద్వైత ప్రపంచంలో ఒక వస్తువుని విడిగా చూసి దానిపై వ్యామోహం పెంచుకోవడాన్ని అంతరంగికంగా మలుచుకొని ఆ వస్తువు తన కంటే భిన్నం కాదని తనలోనికి తెచ్చుకోవడం వశీకరణం. ఒక స్త్రీనే కాదు ఈ విధంగా త్రిభువనములను తనలోనికి తెచ్చుకోవడం, ఈ బ్రహ్మాండమంతా తనకు భిన్నం కాదు, తనలోని భాగమే అని తెలుసుకోవడం వశీకరణలోని అంతరార్థం. తానే మన్మథుడైపోతే మన్మథుడు కలిగించే కామ వికారాదులు మనకు ఉండవు. అదే కామ జయము.

అంబిక రెండు విధాలైన విధులను నిర్వహిస్తుంది. పరమే శ్వరుని సృష్టి కార్యోన్ముఖుని చేస్తుంది. మానవులను తిరిగి ముక్తులను చేస్తుంది. శ్రీ విద్యా సంప్రదాయంలో అంబిక ప్రకాశవంతమైన అరుణ వర్ణమని చెప్పుకొన్నాము. పార్వతి ఆకుపచ్చ - గౌరి పసుపు వర్ణంగా చెప్పబడినప్పటికి తెలుపు. కాళి నలుపు, దుర్గ నీలము. మన కామేశ్వరి సూర్యోదయా మాత్మునితో ఐక్య మొనరించడాన్ని సూచిస్తోంది. తెలుపు సూర్యకాంతి చేత విడదీయ బడినపుడు ఏడు వరము లేర్పడుతున్నాయి. ఈ వర్ణముల మొదటి అక్షరములన్నీ, చేర్చి VIBGYOR అని చెబుతారు. చివరివర్ణంగా చెప్పబడే ఎరుపు తెలుపు ప్రక్కనే ఉంటుంది. తెలుపు వర్ణంగా గుర్తించబడదు. కాబట్టి ఎఱుపే మొదటి వర్ణము. ఊదారంగుకు ప్రక్కనును నలుపుకూడా వర్ణంగా గుర్తించబడదు. ఎందువలన? మనం అనేక రంగులున్న వస్తువులను చూస్తూ ఉంటాము. ఒకటి ఆకుపచ్చ, వేరొకటి నీలము - ఆకుపచ్చగా కనిపించే వస్తువు మిగతా కాంతితరంగాలనన్నిటినీ లీనం చేసుకొంటుంది. కాంతి తరంగాలు అంతటా నిండి ఉంటాయి. వాటి విషయం లో మనం రెండు లక్షణాలను గమనించవచ్చు. ఒక విధమైన కాంతి తరంగము (వస్తువులపై) పరావర్తించబడుతుంది. మిగతా అన్ని కాంతి తరంగములు (ఆ వస్తువుచే) లయము చేసుకొనబడతాయి. ఏ వర్ణపు కాంతి తరంగము పరావర్తనం కాబడుతోందో ఆ వస్తువుది ఆ వర్ణమని చెబుతున్నాము. ఈ పరావర్తన లయములనే లక్షణములలో తెలుపు రంగుకు చెందిన వస్తువులకు పరావర్తించే లక్షణం మాత్రమే ఉన్నది. అలా ప్రతిబింబించబడిన వర్ణ తరంగములన్నీ చేరి తెలుపుగా భాసిస్తాయి. నలుపు వస్తువులకు అన్ని కాంతి తరంగములను తమలో లయం చేసుకొనే లక్షణము మాత్రమే ఉన్నది.

మనం త్రిగుణములగురించి చెప్పుకొంటాము. సత్త్వ రజస్ తమోగుణములు. తనలో తనకై ఏమీ ఉంచుకోక మొత్తం బయటకు విడుదలచేసి స్వచ్ఛంగా, కాంతిమంతంగా తెల్లగా ఉండేది సత్త్వం. ఇది పరబ్రహ్మ లేక జ్ఞానమునకు సంజ్ఞ. అంతటినీ తనలోనే ఉంచుకొనే నలుపు తమోగుణము లేక అజ్ఞానమునకు సంజ్ఞ, ఎఱుపు రజోగుణమునకు సంజ్ఞ. క్రియాశక్తి-బ్రహ్మను జీవాత్మగానూ, జీవాత్మను తిరిగి బ్రహ్మ గానూ మార్చే క్రియ వెనుకనున్నది ఈ క్రియాశక్తే, చలన రహితము, శుద్ధసత్వము, తెల్లటి తెలుపుగానున్న జ్ఞాన తత్త్వమైన శివుడు ప్రకాశవంతమైన ఎఱుపువర్ణం గల కా శ్వరిగా ఆవిష్కరించబడడానికి పరాశక్తికి మూలమైనవాడు. దీనిని అనుగమించి తమస్సు వరకూ సమస్త సృష్టి జరిగింది VIBGYOR లో ఉన్న సప్త వర్ణములు సృష్టిలోని వివిధ దశలకు వైవిధ్యాలకు ప్రాతినిధ్యం వహిస్తాయి. అన్ని రంగులు కలిసి తెలుపుగా అయినట్లు ఈ ప్రపంచం శుద్ధ ధవళ వర్ణం అయిన శుద్ధ బ్రహ్మ నుంచి ఉద్భవించి తిరిగి తెల్లటి తెలుపుగా బ్రహ్మగా అయిపోయింది. ఈ సృష్టి లయములకు కారణం శుద్ధ బ్రహ్మమునుండి మొదటగా ఆవిర్భవించి, ఆ శుద్ధ బ్రహ్మకు చేరువగా ఉన్న సంస్థితి - అరుణారుణమైన కామేశ్వరి. అందు వలననే అరుణ మార్గానికి శ్రీవిద్యలో అంతటి ప్రాధాన్య మీయబడినది. పరిణామము పొంది తమస్సులో చేరుకొన్న మనం తిరోధానము చెంది తెల్లటి తెలుపు అయిన పరబ్రహ్మలో లయమవాలంటే దారిచూపవలసింది ఈ ఎఱ్ఱటి స్త్రీనే.

(సశేషం)

#KanchiParamacharyaVaibhavam #కంచిపరమాచార్యవైభవం
#ParamacharyaSoundaryaLahariBhashyam
4/24/18, 07:05 - Paramacharyulu: పండరీపురంలో పరమాచార్య

కంచి కామకోటి పీఠం పీఠాధిపతులు జగద్గురువులు శ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతీ స్వామివారు మకాం చేస్తున్న పండరీపురానికి వెళ్ళాకనే తెలిసింది ఆధునిక నాగరికతకు విషపు కోరల్లో పడకుండా పల్లెటూళ్ళు ఎంత అద్భుతంగా ఉన్నాయో. కురుద్వాడి నుండి పండరీపురానికి వెళ్ళే ట్రైను చాలా పాతకాలం నాటిది. చిన్న బోగీల్తో, చిన్న చిన్న సీట్లతో ఉంది. ప్రయాణీకులు అందరూ పల్లెటూరివారు మరియు యాత్రికులు. చాలామంది కిందనే కూర్చున్నారు. పచ్చని పొలాల మధ్య రెండున్నర గంటల పాటు ఎంతో ఆహ్లాదంగా జరిగింది. అంత పాతకాలం నాటి ట్రైను కూడా ఖచ్చితంగా సమయానికి చేరుకుంది.

నాకు హిందీ సరిగ్గా రాకపోయినా నాకు కావాల్సిన సమాచారం తెలుసుకున్నాను. ట్రైనులో ఒక ప్రయాణికుడు నాతో, “శ్రీ శంకరాచార్య మహారాజ్ విఠల ఆలయానికి కొద్ది మైళ్ళ దూరంలో ఉన్నారు” అని చెప్పాడు. అందరూ నా రాక గురించి మరాఠిలో అడగడం మొదలుపెట్టారు. స్టేషనులో మనకు లభించే ఒకేఒక్క ప్రయాణ సాధనం టాంగా. ఒక టాంగా వాడు మొత్తం సామాన్లతో సహా ప్రయాణికులను కూడా కుక్కేశాడు. ప్రయాణం మొత్తం ఏవేవో విషయాలు చెబుతూనే ఉన్నాడు. బస్సు ప్రయాణాల వల్ల కలిగే ఇబ్బందుల నుండి విఠలుని గొప్పదనం దాకా! నన్ను ఒక హోటలు వద్ద దింపి చక్కాపోయాడు.

ఒక గంట తరువాత మరొక టాంగావాలాను చూసుకుని శంకరాచార్య మహారాజ్ వద్దకు తీసుకుని వెళ్లి తిరిగి నా బసకు

తిసుకునిరావడానికి మాట్లాడుకుని బయలుదేరాను. చాలా దూరం అని, కష్టతరమైన ప్రయాణం అని కూడా చెప్పాడు. కాని తరువాత నాకు తెలిసింది అతని చెప్పినంత దూరం, కష్టం ఏమి కాదు.

ఆ టాంగావాలా చెప్పినట్టు పండరీపురంలో నది చంద్రవంక లాగా ఉన్నందున దాన్ని చంద్రభాగ నది అంటారని చెప్పాడు. ఆ నది చాలా చూడముచ్చటగా ఉంది. విఠలాలయం నుండి వస్తున్నా భక్తులను శంకరాచార్యుల దర్శనం కోసం ఒకవైపు నుండి మరొక్క వైపుకు తీసుకువెళ్తున్న పడవలు కనిపించాయి. అప్పుడే తెలవారుతుండగా దర్శనం కోసమని స్వామి సన్నిధికి నడిచాను. దేశం నలుదిక్కుల నుండి వచ్చిన భక్తులు అక్కడ ఉన్నారు. లోపల ఉన్న పెద్ద హాలులో తెల్లవారుఝాము నుండే పరమాచార్య స్వామివారి దర్శనం కోసం వేచి ఉన్నారు. ఆశ్రమ సహాయకులొకారు భక్తుల ప్రార్థనలను స్వామివారికి చేరవేస్తున్నారు. "స్వామివారు ఎప్పుడు బయటకు వస్తారు?, దర్శన సమయం ఎప్పుడు?" లాంటి ప్రశ్నలకు సమాధానం ఇస్తున్నారు.

కొద్దిసేపటి తరువాత భక్తుల సంఖ్య ఎక్కువవడంతో ముందున్న మరొక్క హాలులోకి పంపారు. భక్తులందరిని ఒక వరుసలో నిలబెట్టి, రెండు చెక్కబల్లలను భక్తులను నియంత్రించడానికి పెట్టారు. ఇద్దరు కానిస్టేబుళ్ళు అక్కడున్నవారిని వరుసగా నిలబెడుతున్నారు. ధృడకాయుడైన ఒక చౌకిదారు వంటి వ్యక్తి భక్తులకు సూచనలు ఇస్తున్నాడు.

ఒక యువతి "హర హర శంకర, కాలడి శంకర" అని భజనలు మొదలుపెట్టింది. ఒక్కసారిగా మొత్తం హాలంతా భక్తితో నిండిపోయింది. ఒక యువకుడు అందరికంటే బిగ్గరగా భజనలు పాడడం మొదలుపెట్టాడు. అక్కడ పరమాచార్య స్వామివారు రావడానికి మూడు ద్వారాలు ఉన్నాయి. బహుశా వారు ముందున్న ద్వారంగుండా వస్తారేమో, అక్కడ కొందరు ఆడవారు, మగవారు పూలు, పళ్ళు, హారతి పళ్ళాలు పట్టుకుని ఉన్నారు. వారి వెనుక ఒక మధ్యవయస్కుడైన వ్యక్తి వరుసలో ముందు నిలుచున్నందుకు చాలా సంతోషంతో కనిపిస్తున్నాడు. కొద్ది దూరంలో నిలబడియున్న భార్య, కుమార్తెలను వచ్చి తన వెనకాతల నిలబడమని చెబుతున్నాడు. క్షణాలు గడుస్తున్నాయి. అనదరి కళ్ళూ ముందున్న ద్వారం పైనే ఉన్నాయి.

అప్పుడే కొంతమంది మాటలు విన్నాము. మహాస్వామివారు శిష్యునితో కలిసి మరొక్క ద్వారం గుండా వచ్చారు. అందరూ "జయ జయ శంకర!" అంటూ అటువేపు తిరిగారు. అందరిని కూర్చోవలసిందిగా చేతితో సైగ చేశారు స్వామివారు. ఆ చౌకిదారు స్వామివారికి సాష్టాంగం చేశాడు. అతణ్ణి గుర్తుపట్టి పేరు పిలిచి, మాట్లాడడంతో తనకు కలిగిన గౌరవానికి మహదానందపడ్డాడు.

అపార కరుణాసింధుం జ్ఞానదం శాంతరూపిణం
శ్రీ చంద్రశేఖర గురుం ప్రణమామి ముదావహం ॥

--- ఎ. ప్రసన్న కుమార్, "ఎ సేజ అట్ పంధర్ పూర్" నుండి

#KanchiParamacharyaVaibhavam #కంచిపరమాచార్యవైభవం
4/24/18, 16:04 - Paramacharyulu: ఇరవైయవ శ్లోక భాష్యం - ఎనిమిదవ భాగం

ప్రేమగా ఐక్యమవడంలో నున్న మహదానందము కొంతకాలం ఎడబాటు అనంతరం జరిగితే చాలా అనుభవం లోకి వస్తుంది. ఇద్దరు విడిపోయిన తరువాతనే కదా కలవడం సంభవిస్తుంది. అసలు ఎప్పుడూ విడిపోకపోతే కలవడంలో ఉన్న ఆనందం ఎలా తెలుస్తుంది. అందువలననే అద్వైతస్థితి శివశక్తులుగా, కామేశ్వరీ కామేశ్వరులుగా, సృష్టిగా పిల్లలుగా విడిపోయింది. మరో రకంగా చూస్తే ప్రేమ ఆప్యాయతలను అనుభవంలోకి తెచ్చుకోవడానికి మూలకారణమైన పరబ్రహ్మ ఆ తెలుపు - ఎఱుపుగా అయింది. అందువలననే ఎఱుపు శృంగార భావానికి ప్రతీకగా చెప్పబడుతోంది.

ఈ ప్రపంచ సృష్టికి మూలం ఎఱుపు. కోరికలు లేని అద్వైత స్థితి కోరికచే ఉత్సాహపరచబడింది. అది ఈ సృష్టికి ప్రధాన కారణమయింది. అందువల్లనే ఈ సృష్టి ఎరుపు రంగుగా చెప్పబడుతోంది. సృష్టి కార్యాన్ని నిర్వహించే చతుర్ముఖ బ్రహ్మ ఎరుపురంగు. రక్తప్రసారం జరుగుతున్నంత కాలమే జీవం ఉంటుంది. ఈ నెత్తురు ఎటుపు. అసలు సంస్కృతంలో ఎటుపకు రకవరమని పేరు. కవులేమి చేస్తారు. కోరికతో ఒక గీతం సృజిస్తారు. ఆ అనుభవం పంచడం ద్వారా తన శ్రోతలతో ఒక రకమైన ఐక్యతను సాధిస్తారు. అందువలననే కవితా శక్తి ఎఱుపుగా అర్థం చేసుకోబడుతుంది.

దయ అనేది ప్రేమ యొక్క పరిణత స్తితి. పరమాత్మ నుండి ప్రవహించిన ఉన్నత శ్రేణికి చెందిన ప్రేమభావమే దయ. అందువలననే సౌందర్యలహరి 93వ శ్లోకంలో ఆచార్యుల వారు శంభుడనే వర్ణరహితమైన పరబ్రహ్మ ప్రపంచాన్ని రక్షించడానికి అరుణ వర్ణాన్ని పొందారని అభివర్ణిస్తారు. ఆయన తన కరుణ వలన అరుణ అయినారు. అంతేకాదు. ఆ రక్షణ కార్యాన్ని జయవంతంగా నిర్వహించారు.

"జగత్రాతుం శంభోర్జయతి కరుణా కాచిదరుణా" - అంతకు ముందు శ్లోకంలో ఆచార్యుల వారు "అమ్మా! నీ అరుణకాంతి శుద్ధ స్ఫటిక సంకాశమైన పరమేశ్వరునిపై పడి ఆయనను శృంగారమూర్తిగా చేస్తోంది" అంటారు.

మనకు సత్త్వం తెలుపు, రజస్సు ఎఱుపు అని తెలుసు. సత్త్వం కంటే రజస్సు తక్కువైనదని కూడా తెలుసు. అయితే ఇక్కడ ఎరుపును ఇంత గొప్పగా చెప్పటం దేనికి? ద్వైత ప్రపంచానికి చెందిన ప్రేమ అనే , లక్షణానికి ఇద్దరు వ్యక్తులు కావలసి వస్తుంది. శుద్ధ ధవళము, సాత్త్వికము, అద్వైతము అయిన బ్రహ్మము నుండి ప్రేమ ఆవిష్కరించ బడినపుడు, అది ఉన్నతమైన రాజసిక అరుణంగా అవుతుంది.

సాత్త్వికస్థితిలో శాంతిగా ఉండటంలో సాధా రణంగా వైయక్తికమైన జీవాత్మ ఆనందాన్ని పొందు తుంది. ఒక వ్యక్తి రాజసిక ప్రవృత్తిలో కార్యమగ్నుడై ఉన్నప్పుడు ప్రశాంతత కొరవడుతుంది. మరి పరమశాంతుడైన పరమాత్మ విషయంలో మాత్రం ప్రపంచ వ్యవహారంలో ఉన్నప్ప

టికి శాంతి భంగమువదు. స్పటికమును పోలిన ఆయన నిజ రూపం అలానే ఉంటుంది. ఎఱుపు ఆ స్పటికంలో ప్రతిబింబిస్తుంది. కాబట్టి ఆయన విషయంలో మాత్రం పతితమవడమనేది ఉండదు. మనం మామూలు రజోగుణం నుండి ఉత్కృష్ట స్థాయికి చెందిన రజోగుణం ఆవిష్కరింప చేసుకోవాలి. అప్పుడు పరమేశ్వరుడు రజోగుణం యొక్క ఉన్నతమైన స్థితి అయిన దయా, ప్రేమలతో మన ప్రయత్నమునకు తోడై త్రిగుణాతీతమైన స్థితికి చేరడానికి చేరడానికి దోహదం చేస్తాడు.

(సశేషం)

#KanchiParamacharyaVaibhavam #కంచిపరమాచార్యవైభవం
#ParamacharyaSoundaryaLahariBhashyam
4/25/18, 07:07 - Paramacharyulu: శ్రీ గురుభ్యోనమః

నడిచే దైవం శ్రీ శ్రీ శ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతీ స్వామివారి దివ్య చరిత్రను భక్తజనులకు అందివ్వదలచి "పరమాచార్య భక్త సమాజం, హైదరాబాదు" వారు "శ్రీ కంచి కామకోటి జగద్గురు దివ్య చరిత్ర" పేరున పుస్తకాన్ని విడుదల చేశారు.

ఈ అద్భుత గ్రంథంలో ఎన్నో అమూల్య విషయాలు పొందుపరచడం జరిగింది. కావున భక్తులు ఈ గ్రంథాన్ని తప్పక చదివి పరమాచార్య స్వామి గురించిన అమూల్య విషయాలను తెలుసుకోగలరని మనవి.

రిజిస్ట్రేషన్ చేసుకుని ఈ అద్భుత పుస్తకంతో పాటు ఇతర పుస్తకాలను కూడా పొందవచ్చు.

http://www.chvratnaprasad.com/index.php…

మరిన్ని వివరాలకు : 9704989260, 9849159260

అపార కరుణాసింధుం జ్ఞానదం శాంతరూపిణం
శ్రీ చంద్రశేఖర గురుం ప్రణమామి ముదావహం ॥

#KanchiParamacharyaVaibhavam #కంచిపరమాచార్యవైభవం
4/25/18, 07:07 - Paramacharyulu: <Media omitted>
4/25/18, 13:32 - Paramacharyulu: <Media omitted>
4/25/18, 16:16 - Paramacharyulu: ఇరవైయవ శ్లోక భాష్యం - తొమ్మిదవ భాగం

గురువిందగింజ, కాకరపండు, ఆపిల్ పండు మూడూ ఎరుపుగానే ఉంటాయి. గురివింద గింజ విషం. కాకర చేదుగా ఉన్నప్పటికీ ఒంటికి మంచిది. పళ్ళు తీపిగానూ ఉంటాయి, ఆరోగ్యానికీ మంచిది. అలాగే బంధన హేతువైన రజస్సు, ముక్తి తుదిలక్ష్యంగా గల రజస్సు, ముక్త స్థితి వరకు పైకెత్తే రజస్సు అని రకరకాలుగా ఉంటాయి. కామేశ్వరీ దేవి అరుణ వర్ణం. నిన్ను ముక్త స్థితికి వరకు ఎత్తే రజోగుణము. వశీకరణశక్తి మనలను ఒక శక్తి లేక ప్రభావపు అదుపులో ఉంచేది. ఈ ఎఱుపు మనలను బంధనాల నుండి విముక్తి చేసేది. ఆచార్యులవారు పద్దెనిమిదవ శ్లోకంలో 'అంబిక యొక్క అరుణ వర్ణాన్ని భూమ్యాకాశముల మధ్య అంతా తుడిచిపెట్టి తానే నిండి ఉండే “శ్రీసరణి”గా ధ్యానించాలని " చెబుతారు. “శ్రీ” అన్ని శుభములను, అదృష్టము లను సూచిస్తుంది. సరణి అంటే లహరి లేక ప్రవాహము, వరద. మనలను ముంచెత్తి వేసే సమస్త శుభములను ప్రసాదించే సంపద ‘శ్రీసరణి'. అదే సౌందర్యలహరి. పన్నెండవ శ్లోకంలో వారు “త్వదీయం సౌందర్యం” అన్న పదములతో ఆరంభిం చారు. 'శ్రీసరణి' 'సౌందర్యలహరి'కి సమానార్థకము. ఆనంద లహరి భాగములో (మొదటి నలభై నాలుగు శ్లోకములు) ఉండే యంత్ర మంత్ర శాస్త్రములు, వేదాంత తత్త్వములకు లక్ష్యము మనలను సౌందర్యలహరి వైపునకు తీసుకొని వెళ్ళటం. అంబిక మహోన్నతమైన సౌందర్యమును దర్శింప చేయడం అన్న విషయాన్ని ఇది సూచిస్తోంది. అంబిక యొక్క అనితరసాధ్యమైన రూపము, సౌందర్యము కేశాది పాదాంత వర్ణనములో వివరించబడింది. కానీ ఆమె నుండి వెలువడే అరుణ కాంతి ప్రకాశము విశ్వమంతా నిండి ఉంది.

లలితా సహస్రనామములలో అంబిక యొక్క కేశాది పాదాంత వర్ణనములు చేయటానికి ముందుగా ఆమె ఆయుధాల గురించి ప్రస్తావించబడింది. సాధారణంగా ఒక దేవతను వర్ణించేటప్పుడు కేశములతో మొదలుపెట్టి చేతుల వద్దకు వస్తారు. సహస్రనామంలో మాత్రం ఆయుధాలు ముందు వర్ణించబడ్డాయి. ముందు పాశము, తరువాత అంకుశము, చెఱకువిల్లు, బాణములు - ఈ విధంగా. ఒక్క ఆయుధాల వర్ణనమేకాదు ఆ వెనుకనున్న భావం కూడా వర్ణించబడింది. “రాగ స్వరూప పాశాఢ్యా”. రాగమంటే కోరిక - ఎరుపు వర్ణమని కూడా అర్థం ఉంది. ఇక్కడ రాగం మంచికోరిక చెడు కోరికల వల ఏర్పడిన బంధాలను తొలగించే అంబికతో కలిపి ఉంచే రాగము. ద్వేషము, ఒకరిపై కోపము పూర్తిగా తొలగించబడాలి. దీనికై ద్వేషంపై ద్వేషం ఉండాలి. ఆ ద్వేషాన్ని అంకుశంతో పొడిచి పొడిచి మదపుటేనుగును అదుపులో ఉంచినట్లు అదుపులో ఉంచాలి. “క్రోధాకారాంకుశోజ్వలా”. అటువంటి క్రోధము అంకుశంగా గలిగింది అంబిక. మన పంచేద్రియాలను, మనస్సును ఆవిడ అధీనంలో ఉంచాలి. వీటిని ఆకర్షించటానికే ఆవిడ కోదండమును, బాణములను ధరించింది. ఈ రకంగా అంబికకు అధీనం చేయబడిన కామ క్రోధములు, మనస్సు, పంచేంద్రియములు, పంచతన్మాత్రలు (పంచేంద్రియములచే గ్రహింపబడే శబ్ద స్పర్శ రూప రస గంధాదులు) కలవారే అంబికను కేశాది పాదపర్యంతము కొంత దర్శించటానికి అర్హులవుతారు.

(సశేషం)

#KanchiParamacharyaVaibhavam #కంచిపరమాచార్యవైభవం

#ParamacharyaSoundaryaLahariBhashyam
4/26/18, 07:15 - Paramacharyulu: అనన్యభక్తి – ఆత్మార్పణ

''జగన్మాతయందు మనకు అనన్యభక్తి కల్గిన, ఆమె అద్వైతముక్తినిచ్చుననుట తథ్యము. ఆదిశంకరులు. సౌందర్యలహరిలో అంబిక నిట్లు వర్ణించిరి.

భవాని! త్వం దాసే మయి నితర దృష్టిం సకరుణా
మితిస్తోతుం నాంఛన్ కథయతి భవాని త్వమితి యః,
తదైవ త్వం తస్మై దిశసి నిజసాయుజ్యపదవీం
ముకుంద బ్రహ్మేంద్రస్ఫుట మకుటనీరాజిత పదామ్||

'శివా భవానీ రుద్రాణీ శర్వాణీ సర్వమంగళా' - యని అమరము. ఇందు భక్తుడు 'తల్లీ! నీకింకరుడనగు నన్ను దయచూడుము' అన్న ప్రార్థనను, 'భవానిత్వం' అను పదములతో ప్రారంభించును. భవాని త్వం అనుటకు - 'భవాని' ు 'నీవు' అను అర్థమేగాక, 'నేను నీవు అగుదుముగాక' (భవాని, భవాన, భవాను) అను అర్థముకూడ కలదు. భక్తునియందు జగన్మాత కటాక్ష మెట్టిదనిన, ఆమె భక్తుని ప్రార్థనను సాంతముగా వినక అతని నోటినుండి మాట వచ్చినదో లేదో (భవాని త్వం అనుమాట) సాయుజ్యమును ఆక్షణమే ఇచ్చునట. అతడు ప్రార్థించినది ఆమె కరుణాదృష్టిని, ఆమె యిచ్చినది సాయుజ్యమును, అతడు దాని నెన్నడు ఎదురుచూడలేదు. పరిపూర్ణమగు భక్తియొకనికి ఉండిన అతనికి ఆయాచితములగు వస్తువులు సైతము లభించునని ఇందలి భావము. ఇందు ప్రార్థకునకు లభించిన సాయుజ్యము సముద్రమును చేరిన అది ఎట్లు శాంతిబొందునో, అట్టిశాంతిని బోలినది. నదులు వేగవంతములై కొండచరియల నుండి సంతోషముతో క్రిందికి దుముకుచు చదునునేలలో ఉరవడులతో, పరవడులతో, సమృద్ధములై ప్రవహించును. కాని అవి సముద్రమును చేరినగాని శాంతి పొందవు. భక్తుని సాయుజ్యమును అట్టిదే. ద్వైతభావముతో దాస్యభావముతో సాధకుడు ప్రారంభించి అంబికా కటాక్షవీక్షణమున ఆమెతో నేకమగును. తద్వారా శివసాయుజ్యము పొందును. అదియే మోక్షము.

పై చెప్పినరీతిగా అనన్యభక్తికల్గియుండుటేగాక, పారమార్థిక జీవనమున మనోవృత్తులును, పలుకును పాటును పరిశుద్ధ పరచుకొనవలయును. సమర్థ రామదాసు, తులసీదాసు, అప్పయదీక్షితులు, తాయుమానవర్‌స్వామి ఇత్యాది మహాత్ములు దైవభక్తి అపరిమితముగా కల్గియుండుటయేగాక, కాలమంతయు సత్కార్యములను చేయుటయందే వినియోగించిరి. వారు వ్రాసిన గ్రంథములు భక్తిపూరితములై, వేదాంతబోధకములై, ఉత్తేజకరములై ఈనాటికి వర్ధిల్లుచున్నవి. రామదాసు వ్రాసిన దాసబోధనము, తులసీదాసు వ్రాసిన రామ చరితమానసము ఈ తెగకుచెందిన భక్తిగ్రంథములు. ఈ మహాత్ములు ఒక చెడుతలపు దలచిగాని, ఒక చెడ్డ కార్యము చేసిగాని ఎరుగరు.

మన జీవితములనుండి చెట్టను తొలగించవలెనని మనమెంత ప్రయత్నించినను, ఈ యత్నమే చెడ్డను జ్ఞప్తికి దెచ్చి దానికి లొంగిపోవునట్లు చేయును. కాని మహాత్ములు సదా ఏదో సత్కార్యమును చేయుచునే యుండుటచే వారికి చెడ్డను గూర్చి తలచుటకు ఒక నిముసమయినను తెరపిలేకుండెడిది. ఒక సన్యాసిని, 'మీరు 'కామమును ఎట్లు జయించితిరి?' అని ఎవరో అడిగిరట. కామము నా మనోద్వారముకడకు వచ్చి తలుపు తట్టినపుడు నేను ఏదోయొక కార్యమున నిమగ్నుడనై యుండుటచే దానికి విసుగుబుట్టి తిరిగిపోయెడిది' అని ఆయన బదులు చెప్పెనట.

నిరుద్యోగమగు మనసు వృథా భాషణములను చేయ నిచ్చగించును అంతటితో నితరులనుగూర్చి దూషణ ప్రారంభమగును. కామాదులు తలెత్తును. సత్కార్యాచరణము చేయుచున్నచో చెడుతలపులు పుట్టవు. దుస్సాంగత్యమను వ్యాధికి సత్సాంగత్యమే చికిత్స.

వర్తన చక్కబడుటకు నిరంతర సత్కార్యాచరణ మవసరము. అపుడు చెట్టయనుచెట్టు వ్రేళ్లతో సహా ఎండిపోయి సమూలముగా నశించును. దురాలోచనలకు ఎడమీయ గూడదు. వట్టి ధ్యానజపాదులతో ప్రయోజనము లేదు. అదియును ఒక వాడుకగా అయిపోయి మనస్సును సంస్కరించక కలుషమునకు లొంగునట్లుచేయును. మహాత్ముల చరిత్రలు స్వయముగా వ్రాయుటయందుగాని లేక చూచివ్రాయుట యందుగాని కాలము గడుపుట మంచిది. అపుడు మనలను కళంకితులుగా చేయుటకు కలుషమునకు వీలుండదు. అప్పయ దీక్షితులు కంచి వరదరాజస్వామి సంబోధించుచు నిట్లు వ్రాసిరి:

మన్యే సృజం త్యభినుతిం కవిపుంగవాస్తే
తేభ్యో రమారమణ ! మాదృశ ఏవ ధన్యః!
త్వదర్ణనే ధృతరసః కవి తాతి మాంద్యా
ద్య స్త త్తదంగ చిరచింతనభాగ్య మేతి||

''ప్రభూ ! అతి త్వరితగతిని నీపై కవనమల్లెడు శక్తి గల యితర కవులున్నను ఉండవచ్చును. కాని నేనొక మందుడను. ఐనప్పటికిని వారికంటె నేనే ధన్యుడను అని అనుకొందును. ఏలన, నీ వర్ణనను కవితాగుంభనము చేయలేక ముందు వెనుక ఆడుచున్నప్పుడు నీ అంగచింతనాభాగ్యము నాకు వారికంటెను మరింత ఎక్కువగా లభించుచున్నది.' ఇట్లు మహాత్ముల చరిత్ర మనకు సత్కార్యాచరణ అవసరమని తెలుపును.

సత్కార్యములు చేయుట అనునది ఆధ్యాత్మిక జీవనమున కొక అంగము. దీనితో పాటు పరమేశ్వరునికి మనము పరిపూర్ణముగా ఆత్మార్పణము చేయవలెను. సుషుప్తియందు మనలను ఏవిషయమును బాధించుటలేదు. నిదురనుండి లేచినదే తడవు మన చింతలన్నియు మనలను ఆవరించును. దేహము, మనస్సు, సమాజము, ప్రభుత్వము, దేశము - మన జీవితమున ప్రతి యొక్క విషయమునకును సంబంధించిన చింతలు ఎడతెగె సుషుప్తిలో మనలను ఎట్లు బాధించవో, అట్టినిర్బాధాకరమగు స్థితిని జాగ్రదవస్థలోనికి సహితము మనము తేగల్గిన నదియే మోక్షము. దేశ కాలములందు దూరముగ నున్న వారినిగూర్చిన చింతలు మనలు అంతగా

బాధించవు. కొన్ని సంవత్సరముల క్రితము జరిగిన సంతాపకరములగు విషయముల స్మృతి నేను పెద్దగా మనలను కలవరపెట్టదు. విచారమెట్టిదైనను, దుఃఖమెంత తీవ్రతరమయినను, మన విధులను మనము నిర్వర్తించవలెనని జ్ఞానశిఖరములనదగు ఉపనిషత్తులు మనకుబోధించును.

ఉపనిషత్తులలో చాంద్రాయణము, పంచాగ్నిమధ్యము అని ఎన్నో తపస్సులు చెప్పబడినవి. కాని అవి సాధారణుల కసాధ్యములు. వానికి గొప్ప తితీక్ష యవసరము. అందుచే బృహదారణ్యకము, వానికి బదులు మరియొక విధమగు తపస్సును గూర్చి చెప్పును. 'ఎన్నడైన నీకు శరీరమున జబ్బు చేసిన, ఆ వ్యాధిని ద్వేషించక, ధృతితో ఓర్చుకొమ్ము. ఈ వ్యాధి సైతము, దైవనియుక్తమగు తపస్సుగా లెక్కించుము. వైద్యులు జబ్బుచేసినపుడు పథ్యమును విధింతురు. అదియొక విధమైన తపస్సే'. వేళయు వ్యవస్థయు లేక కనబడిన దంతయు తినెడి అలవాటు కల్గినవారికి ఇది యొక నియమము. తాత్కాలిక నియమము.

ఆదిశంకరులు ఈభావమునే గ్రహించి యొకశ్లోకమును వ్రాసిరి. చేయునది సర్వము - మంచి చెడ్డ అన్నియు - భగవదర్పితముచేసి దీనిని నాచేయు పూజగా గ్రహించుమని దేవుని ప్రార్థించుటను అది బోధించును.

ఆత్మా త్వం గిరిజామతిః ప్రియజనాః ప్రాణాః శరీరంగృహం
పూజా తే విషయోపభోగరచనా నిద్రా సమాధిస్థితిః,
సంచారః పదయోః ప్రదక్షిణవిధి స్తోత్రాణి సర్వా గిరః
యద్యత్కర్మ కరోమి తత్తదఖిలం శంభో! తవారాధనమ్|

ఓ శంభూ ! నీవు నా ఆత్మవు. గిరిజయగు పార్వతి నా మతి. నాప్రాణములే నీ ప్రియజనములు. నాశరీరమే నీగృహము. నేను అనుభవించు విషయములే నీపూజాదికములు. నానిద్రయే సమాధి. నేను చేసెడి సంచారమే నీకు ప్రదక్షిణము. నేను మాటాడునదంతయు నీస్తోత్రములే. నేను చేసెడి ప్రతికర్మయు తండ్రీ నీ ఆరాధనమే!

ఇట్లు సర్వమును ఈశ్వరార్పణ చేయుట మహోన్నత పూజావిధి యని ఆచార్యులు సెలవిచ్చిరి.
పారమార్థిక జీవనమునకు - అనన్య భక్తి. నిరంతర సత్కార్యాచరణము, ఆత్మార్పణము అనునవి అత్యవసరములగు అంగములు.
సర్వకర్మలను ఈశ్వరార్పితముచేసి మనము జీవితములను గడపవలెను.

అపార కరుణాసింధుం జ్ఞానదం శాంతరూపిణం
శ్రీ చంద్రశేఖర గురుం ప్రణమామి ముదావహం ॥

--- "జగద్గురు బోధలు" నుండి

#KanchiParamacharyaVaibhavam #కంచిపరమాచార్యవైభవం
4/26/18, 16:47 - Paramacharyulu: ఇరవైయవ శ్లోక భాష్యం - పదవ భాగం

అయితే ఆమె రూపాన్ని కొంత దర్శించగలగడానికి ముందు ప్రపంచమంతా, ఆకాశమంతా వ్యాపించి ఉన్న ఆమె అరుణ ఈ వర్ణాన్ని దర్శించగలుగుతాయి. అందువల్లనే సహస్ర నామములలో "చంపకాశోకపున్నాగ సౌగంధి లసత్కచా" అన్న కేశములను వర్ణించే నామం చెప్పటానికి ముందు "నిజారుణ ప్రభా పూర మజ్జద్బ్రహ్మాండమండలా" అన్న నామం చెప్పబడింది. దీని అర్థం మనం పద్దెనిమిదవ శ్లోకంలో చెప్పుకొన్న "దివా మర్వీం సర్వాం అరుణిమ నిమగ్నాం" అన్న వాక్యమే! ఆమె ప్రేమ, దయలతో కూడిన రాగంలో ఎరుపురంగులో నిమగ్నమయితే ఆమెపై భక్తి భావం అతిశయిస్తుంది. తక్షణమే అంబిక కేశాది పాదపర్యంతము తళుక్కున మెరుపువలె దర్శనమిస్తుంది.

సహస్రనామాలలో అంబిక ప్రథమనామం శ్రీమాత. ఆమె మనందరికీ తల్లి - మనల నందరినీ సృష్టించిన తల్లి, రెండవ నామం మహారాజ్ఞి - మనలను రక్షించి మన స్థితికి కారణమైనది. మూడవ నామము సింహాసనేశ్వరి. 'సింహ' అంటే హింస, సంహారము. సృష్టిస్థితి సంహారములన్నవి చిచ్ఛక్తి యొక్క లీల. ఈ చిచ్ఛక్తికి మొదలు లేదు. ఈమే మొదటి శక్తి - 'చిదగ్నికుండ సంభూత' అన్న నామం ఈ విషయాన్ని సూచిస్తోంది. ఆది అనేది లేని అంబిక ఆ చిచ్ఛక్తి లలితాంబికగా ఆవిర్భవించిందని ఈ నామమే చెబుతున్నా తరువాతి నామం మరింత స్పష్టపరుస్తుంది. "దేవకార్యసముద్యతా" - అసురులు పెట్టే కష్టాలు భరించలేని దేవతలు తమను తాము అగ్నికి ఆహుతి ఇచ్చారు. వారి దేహాలు అంతరించిపోయినా, 'చిత్'గా మిగిలి పోయింది. 'చిత్'(జ్ఞానము) అంతటికీ మూలమైన, ఆధారమైన అంబిక లలితాంబికగా ఆవిర్భవించి దేవతలనందరిని పునరుజ్జీవితులను చేసింది. భండాసుర సంహారం చేసింది. "చిదగ్నికుండ సంభూతా" అన్నదానికి ఈ అర్థం ఉంది.

ఈ రకంగా సృష్టి స్థితి సంహారములకు కారణమైన అంబిక లలితాంబికగా ఆవిర్భవించిన కథనం చెప్పిన సహస్రనామ స్తోత్రం వెనువెంటనే ఆమె ప్రకాశపు ఎర్రదనాన్ని వివరిస్తుంది. "ఉద్యద్భానుసహస్రాభా" సహస్ర ఉదయసూర్యుల అరుణారుణ కాంతిని కలిగి ఉన్న తల్లి ఆమె. ఆ వెంటనే ఆమె నాలుగు చేతులు, ఆ చేతులలో ఆయుధాలు చెప్పబడ్డాయి. వెంటనే బ్రహ్మాండ మండలాన్నంతటినీ ముంచెత్తే ఆమె సహజమైన అరుణ ప్రకాశం గురించి చెప్పబడింది. ఈ రకంగా రెండు అరుణ కాంతుల మధ్య ఆమె హస్తములను, ఆయుధములను వర్ణించ టానికి కారణం ఆమెను క్రియాశక్తిగా తెలియచేయటం. కార్య రహితుడైన నిశ్చల బ్రహ్మను కొన్ని కార్యముల యందు ప్రవేశ పెట్టినది కదా! కార్యమంటే కరములతో చేసేదేకదా! అందువల్లనే అంబిక చేతులు ముందు చెప్పబడ్డాయి. క్రియాశక్తిని రెండు వైపుల నుండి ఇచ్ఛాశక్తి ప్రోద్బలం చేయాలి. ఇచ్ఛ అంటే కోరిక. ఎటుపురంగుతో సూచించబడుతుంది. అందువల్లనే "ఉద్యద్భాను సహస్రాభా", "నిజారుణప్రభాపూర మజ్జద్బ్రహ్మాండమండలా" అనే రెండు నామాల మధ్య "చతుర్బాహుసమన్వితా" మొదలుగా గల నామములు కూర్చబడ్డాయి. ఆచార్యులవారిచే వాడబడిన "దివాం సర్వాం ఉర్వీం అరుణిమ నిమగ్నా" అన్న మాటలకు అర్థమిదే.

(సశేషం)

#KanchiParamacharyaVaibhavam #కంచిపరమాచార్యవైభవంas
#ParamacharyaSoundaryaLahariBhashyam
4/27/18, 07:04 - Paramacharyulu: భగవద్గీత

వేదాంతగ్రంథములలో భగవద్గీత కున్నంత ప్రాముఖ్యము మరొక గ్రంథమున కుండదు. దేశభాషలలోనేకాక పాశ్చాత్యభాషలలో సహితము గీతకు అనువాదములు వ్యాఖ్యానములు ఎన్నియో కలవు. యుద్ధభూమిలో అర్జునునికి కృష్ణభగవానుడిచ్చిన సందేశము నాడేకాక నేటికిని అనుగుణమై చదివినవారికి ఉత్తేజకరమై వెలయుచున్నది. గీతతో సమానోత్కృష్టతగల మరికొన్ని గ్రంథములు గీతలని పేరుపెట్టుకొన్నను భగవద్గీతకే ఇంతటిపేరు. పార్థునికి బోధింపబడి, దివ్యజ్ఞాన సంపన్నమై సత్యామార్గదర్శినియై చిరతరోన్నత స్థాయిని వహించిన ఈ గ్రంథరాజము - ప్రాముఖ్యమునకు కారణము గీతాభూమికయందు కాననగును.

ఈ మధురనాటకమున అర్జునునిది ప్రధానపాత్ర. అర్జునుడు రథోపనిష్టుడై యుండును. రథమునకు సారథి కృష్ణుడు. ఒక్క క్షణము క్రితము అర్జునుడు కృష్ణుని 'సేనయో రుభయోర్మధ్యే రథం స్థాపయ మేఽచ్యుత' అని అడిగియుండెను. కాని ఇపుడో? గురుచరణ సాన్నిధ్యమున వినతుడగు శిష్యునివలె అతడు శరణుజొచ్చి తన్ను అనుగ్రహించి మార్గము చూపుమని కృష్ణుని వేడుకొనెను.

'శిష్య స్తే హం శాధి మాం త్వాం ప్రపన్నం'

చెప్పుటకుకాని, చదువుకొనుటకుకాని ఎంతతగినచోటు ఆ రణభూమి! మరుసటి క్షణమున శిరసు ఉండునో లేక తెగిపడి రక్తసిక్తమై రణభూమిలో దొరలాడునో అర్జునునికి తెలియదు. ఒక వేదాంతసభ జరుగుచున్న దనుకొనుడు. చిన్న వానవచ్చిన చాలును. శ్రోతలు అటులనే కరగిపోవుదురు. వినుచున్న తత్త్వమెంత గొప్పదైనను శ్రోతలకు ఉపన్యాసము కంటే తమ వస్త్రరక్షణమే ముఖ్యము. కాని ఇచట తత్త్వమును వినగోరువాడు మృత్యుదంష్ట్రాగ్రస్తుడు. అతనికి తత్త్వ బోధచేయుటకు భగవానుడు సిద్ధుడైయే యుండును. భగవద్గీత తదితర గ్రంథములకంటె ప్రశస్తినొందుటకు ఈ భూమికయే కారణము. ఈసన్నివేశమునే మరొకదృష్టిని చూడవచ్చు. తాను జ్ఞానోపదేశము పొందుటకు అర్హుడని అర్జునుడు భగవానునికి నిరూపించుకొనెను. యుద్ధమపుడే జరుగబోనున్నది. యుద్ధము మొదలుపెట్టినయెడల ఇరుసేనలలో బ్రతికి బయటపడువారెవరో ఎవరికిని తెలియదు. యుద్ధము చేయనని చెప్పినను అర్జునుడు భీరువుకాడు. యుద్ధభూమినుండి పారిపోవలెనని కాదు అతడుకోరుకొన్నది. అతని యుద్ధవైముఖ్యమున కొక్కటియే కారణము. యుద్ధమున పెద్దలను బంధువులను చంపవలసి వచ్చును. అది అతని కిష్టములేదు. తాను నిరస్త్రుడైనను శత్రువులు తన్ను చంపినను సరే వెనుదీయనని అతడు కృష్ణునితో విన్నవించెను. నిజమున కాతడు అట్టిస్థితిని నిరీక్షించు చుండెను. తాను చచ్చిననుసరే యుద్ధములోని హింసాకాండ నివారణమగునని అతని ఆశ. అనగా అర్జునుడు తన కోరికలన్నిటిని అణచుకొని విరాగియాయెను. వైరాగ్య మెపుడాతనికి కల్గెనో సత్యజ్ఞాన గ్రహణమున కాతడు పాత్రుడాయెను. వైరాగ్య మొకనికి సిద్ధించినదా లేదా యని పరీక్షించుటకు యుద్ధభూమికి సమానమగు ఒరపిడిరాయి మరొకటి కానుపించదు. అర్జునుడు జ్ఞానమునకై ఆతురపడు చుండెను. పరీక్షలోనెగ్గి తన పాత్రను నిరూపించుకొన్నందున భగవానుడతనికి జ్ఞానబోధచేసెను. గీతాసందేశపు శాశ్వతౌన్నత్యమున కిదియే పునాది.

యుద్ధ బహిష్కరణకై అర్జునుడు పరమాత్మతో ఎంతయో హేతువాదము చేసెను. ఏ సందర్భమైనను సరియే యుద్ధము అక్రమము. ప్రతిపక్షము మూర్ఖతతో యుద్ధమును కోరుకొని యుద్ధోత్సుకతను ప్రదర్శించినను మనము యుద్ధముచేయ నిరాకరించవలెను. అట్టితరి హానితక్కువ - న్యాయస్థానమున న్యాయాధికారి విధించు శిక్షకును యుద్ధమునకును ఎట్టి పోలికయునులేదు. న్యాయాధికారి నిష్పక్షపాతి. అతడు విధించెడి శిక్ష ఇతరులను క్రూరకర్మలనుండి మరలించును. శిక్షితుడయినాడన్న దుర్యశము, చెరసాలలోని కష్టజీవనములు నేరముచేసిన వానికి ఒక గుణపాఠము నేర్పును. వాడు మరల అట్టి కార్యము చేయడు. కావున శిక్షయనునది నేరముల కొకవిధమైన నిరోధమే కాని యుద్ధవిషయ మటుకాదు. యుద్ధమున వృద్ధులు పెక్కుమంది మరణింతురు. అప్పుడు స్త్రీ బాలురకు సదుపదేశము లీయజాలని అసహాయస్థితి యేర్పడును. అందుచే కుల నాశనమున కులధర్మచ్యుతియును సంభవించును. కుల స్త్రీలు చెడిపోవుదురు. వారి వినష్టతచే వర్ణసంకరమగును. వర్ణ సంకరమునకు కారణభూతులు నరకమునబడి అమితబాధలనొందుదురు. అందుచే యుద్ధము మోక్షమునకుగాని నిత్యసుఖమునకుగాని దారిదీయుటకు బదులు నిత్యదుఃఖమునకు హేతువగును. ధర్మరక్షణార్థము మనము నాశనమైననుసరే, యుద్ధోన్ముఖులపై మరింత మానవక్షీణతకు మనము కారకులమగుట తప్పు. ఇట్లు తన ఉద్దేశమును అర్జునుడు భగవానునితో చెప్పి శోకసంనిగ్న మానసుడై కూర్చుండెను.

దీనికి భగవాను డేమి బదులిచ్చును? ఆయన ప్రత్యుత్తరమున మందలింపు గర్భితమై ఉండును. 'ఈ హృదయదౌర్బల్యము వదలిపెట్టు.' అర్జునా!లే! లెమ్ము.

'క్షుద్రం హృదయదౌర్బల్యం త్యక్త్వోత్తిష్ఠ'

నీవు యుద్ధమునుండి - వారు చచ్చెదరని. వీరు చచ్చెదరని దుఃఖమునకు భయపడి విరమించుకొనిన అదితప్పు. నీకు అహంకారము మమకారము ఇంకను వదలలేదని అర్థము, నీవు క్షత్రియుడవు. యుద్ధము చేయుట నీవిధి. ఇప్పటికి మనస్థితిలో నీకు కర్మసన్యాసమునకు అధికారములేదు. నిస్సంగికి కర్మ అవసరము లేదు. కానీ నీకు కాదు. నీ పెద్దలయందును బంధువు అందును గురువులయందును సంగముంచి వారెక్కడ నశింతురోయని దుఃఖించుచున్నావు. అందుచే నీవు కార్యవిముఖుడవు కారాదు. ఆకర్తృత్వసిద్ధి నీకు ఇంకను లభించలేదు. అట్టి సిద్ధిని నీవు పొందవలెనినన, నీస్వధర్మము నీకు ఏకర్మను విధించియున్నదో దానిని నీవు చేయక తప్పదు అని భగవానుడు అర్జునుని మందలించును.

ఇందు భగవానుడు 'జీవకారుణ్యభూతమగు యుద్ధవిముఖతకు అధికారము కావలెనని ఒకడు ఇచ్చగించిన తన్ను తాను ముందు సంస్కరించుకొనవలె' నని అర్జునునకు బోధించును. మన లోపములు మనము సంస్కరించుకొనని పక్షమున లోక క్షేమముకొరకు

యత్నించుటకు మనకు అధికారములేదు. దుఃఖమునకును క్రోధమునకును లొంగిన యొకడు ఇతరుల దుఃఖ క్రోధములనెట్లు తొలగించగలడు? భ్రాంతియుక్తుడైన మానవుడు ప్రపంచములోని యితరుల భ్రాంతినెట్లు పోగొట్టగలడు? అట్లుగాక మానసిక దౌర్బల్యమును అణచి దుఃఖాతీతుడై యొకడు ఆత్మోపలబ్ధినందుచో అతని ఉనికి ప్రపంచసౌఖ్యమునకు కారణమగును. అతడు ప్రపంచసంస్కరణ కొరకు పాటుపడ నవసరములేదు. లోకక్షేమమునకై యత్నపడ నక్కరలేదు. అతనిని చూచి లోకము తన్ను, తనవర్తనము సంస్కరించుకొనును. అట్టి పరివర్తనము కల్గినవాడు లోకక్షేమము తానుగ సిద్ధించును. దుఃఖాదులు తొలగవలెనన్న జ్ఞానమే సాధనము. అందు చేతనే భగవానుడు అర్జునునికి ఆత్మజ్ఞానమును బోధించుట, దానిని సాంతము విన్న అర్జునుడు 'నష్టో మోహః' అని ఆత్యంఠతతో పల్కుట.

అర్జునుని విషాదముతో గీత ప్రారంభమగును. విషాద గ్రస్తుడగు అర్జునుని ప్రథమమున భగవానుడు మందలించును. కడపట 'మాశుచః' యని ఊరడచేయును. తస్మాత్ 'యధ్యస్వ' యని ఆజ్ఞాపించుటచే ఇరుప్రక్కల, ఎంతమంది వీరులు హతులైనను క్షత్రియుడు తన స్వధర్మమును చేసితీరవలెనని తెలియుచున్నది. జ్ఞానప్రాప్తికి చిత్తశుద్ధి అత్యావశ్యకము. అది సంగరాహిత్యముతో దైవమునందు భారమువైచి స్వధర్మము చేయుటచే కల్గును. అట్టి జ్ఞాని పవిత్రహృదయుడై తన యునికి చేతనే లోకసంగ్రహ మాపాదించును. తన్నుద్ధరించుకొన్న వాడే ఎదుటవారిని ఉద్ధరించగలడు.

అపార కరుణాసింధుం జ్ఞానదం శాంతరూపిణం
శ్రీ చంద్రశేఖర గురుం ప్రణమామి ముదావహం ॥

--- “జగద్గురు బోధలు” నుండి

#KanchiParamacharyaVaibhavam #కంచిపరమాచార్యవైభవం
4/27/18, 18:05 - Paramacharyulu: ఇరవైరెండవ శ్లోక భాష్యం - మొదటి భాగం

భవాని త్వందాసే మయి వితర దృష్టిం సకరుణామ్
ఇతిస్తోతుం వాంఛన్ కథయతి భవాని త్వమితియః !
తదైవ త్వం తస్మై దిశసి నిజసాయుజ్యపదవీమ్
ముకుంద బ్రహ్మేంద్ర స్ఫుటమకుట నీరాజితపదామ్ !!

(అమ్మా! భవానీ! నీ దాసుడనైన నాయందు కరుణతో కటాక్షవీక్షణములను బరవుపు అని స్తుతింపకోరి “భవాని త్వం” అనినంతనే ఎవరి పాదములకు బ్రహ్మేంద్ర విషాదులు తమ కిరీట కాంతులతో నీరాజనమెత్తు చున్నారో అటువంటి నీ సాయుజ్య ! మొసగుచున్నావు. అనగా నీలో ఐక్యము గ్లొ నీవు” అని ఒక అర్థ ముండగా “నేను నీవగుదును గాక” అని వేరొక అర్థముంది.)

ఆనందలహరి భాగంలో కేవలం శాక్త శాస్త్రమే కాదు భక్తి భావ సంభరితములు, కవితా సౌందర్యము కలవి అయిన శ్లోకములు కూడా ఉన్నాయి. ఈ శ్లోకం అందుకు ఉదాహరణము. ఇందులో ఆచార్యులవారు శ్లేషను ఉపయోగించి ద్వైతభక్తి నుండి భక్తి శక్తి జ్ఞాన సమ్మిళితమైన ఒకానొక అద్వైత స్థితికి తీసుకుని వెళ్ళారు. నా మాటలను జాగ్రత్తగా గమనించండి. ఆచార్యులవారు మనలను ఈ శ్లోకం ద్వారా జ్ఞాన దశకు తీసుకొని వెళ్ళారని నేననడంలేదు. భక్తి శక్తి జ్ఞానములు కలిసిన ఒక రకమైన అద్వైతస్థితికి తీసుకొని వెళ్ళారంటున్నాను. శ్లోకం మొదటి నుండి అర్థం చేసుకొంటే ఈ భావం బాగా అవగతమవుతుంది. భవానీ = తల్లీ! భవానీ - భవ అనేది శివుని నామములలో ఒకటి. భవుని శక్తి భవాని. అష్టమూర్తి అయిన శివునకు భవ, శర్వ, ఈశాన, పశుపతి, రుద్ర, ఉగ్ర, భీమ, మహాన్ అన్న ఎనిమిది ప్రత్యేక నామాలున్నాయి. జీవరాశికి మూలమై సంస్థితుడై ఉన్నవాడు భవుడు. ఆయన పత్ని అయిన అంబిక భవాని.

త్వం = నీవు ; దాసేమయి = నీ దాసుడనైన నాపైన; సకరుణామ్ = దయతో; దృష్టిం వితర = వీక్షణములను ప్రసరింపచేయి; తల్లీ! భవానీ! నీ కరుణ అయిన నీ దృక్కులను నాపై ప్రసారం చేయి. ఇతి = ఈ రకంగా యః = ఎవరైతే; ఆతడు గొప్పవాడా, తక్కువవాడా, తగినవాడా కాదా అన్న ప్రశ్నలేదు. అంబిక కృపాకటాక్ష వీక్షణములు కోరుకున్న వాడయితే చాలు స్తోతుం వాంఛన్ = ప్రార్థిద్దామన్న వాంఛతో; “భవానీ త్వం దాసే మయి వితర దృష్టిస్సకరుణా” అనే పదములతో అంబిక కృపాపాంగ వీక్షణములకై పార్థిద్దా మనుకొని మొదటి రెండు పదములయిన “భవానిత్వం” అని పలికేసరికి; “భవాని త్వమిత యః కథయతి” యః = ఎవరైతే భవానిత్వం అని పలుకుతారో తదైవ = తత్క్షణమే; తత్క్షణమే ఏమవుతుంది! “తదైవ త్వం తస్మైదిశసి నిజసాయుజ్యపదవీం” త్వం = నీవు; తస్మై = ఆతని , నిజ = నీ, నీది ఏమిటి, నీకు సహజమైన, నీ స్వంతమైన నిజసాయుజ్యపదవీం = నీ స్వస్థితి అయిన సాయుజ్యము, నీవుగా అయిపోవటం దిశసి అంటే నీవు ఇస్తావు.

(సశేషం)

#KanchiParamacharyaVaibhavam #కంచిపరమాచార్యవైభవం
#ParamacharyaSoundaryaLahariBhashyam
4/28/18, 07:53 - Paramacharyulu: పార్థసారథి

దాదాపు రెండువేలేండ్ల క్రితం శంకరభగవత్పాదులవతరించి ఆసేతుశీతాచలమూ సంచరించి ప్రజకు యోగ క్షేమములు చేకూర్పు బోధలు ఎన్నో చేశారు. తాము చేసిన బోధలు తమతోనే తరలిపోకుండా నాలుగుమఠాలు ఏర్పరచి ప్రజలు ధర్మాచరణమునుండి తొలగిపోకుండా ఉండేట్లు చూస్తూ ఉండండని తమ తరువాత రాబోవు పీఠాధిపతులకు కట్టడి చేశారు. ఏవి చేసిన క్షేమము కలిగించునని తోచునో అట్టి సంగతులను ప్రజల బుద్ధి శక్తులకు తగినటులు చెప్పవలయునని మాబోటివారికి వారిచ్చిన ఆదేశము. ఇంతేకాక ఉత్తమ క్షేత్రముల నన్నిటినీ దర్శనము చేసికొనవలయునని కూడా మాకు వారి ఆజ్ఞయే. మే మూరూరు తిరుగాడుటయు పూజ్యపాదుల ఆనను అనుసరించుటయే.

మద్రాసు నగరములోని ఈ తిరువల్లిక్కేణి ఉత్తమ క్షేత్రములలో నొకటి. ఇందలి మూర్తి అనాది, అక్షరమును ఐన తత్త్వమునుపదేశించు శ్రీకృష్ణభగవానుడు, వారు పార్థునిసారథ్యమేకాక యెన్నో పనులు చేశారు. బృందావనంలో గొల్లపిల్ల డాయెను. వేణుగోపాలు డాయెను. ఇవి ఆయా సమయములకు సరిగా తగియుండవచ్చును. కాని పార్థ సారథియై చేసిన గీతోపదేశముమాత్రము మూడు కాలములకును ఉపయోగించి సంసారపు చీకటికి దివ్వెయై భవార్ణవమునకు నౌకయై వెలయుచున్నది. అట్టి పార్థసారథి ఆవిర్భవించిన యీ క్షేత్ర మొక జ్ఞానభూమి.

పార్థసారథి వ్యక్తిత్వమును చూడండి. సాధారణంగా సారథ్యము తక్కువపని, కాని మధురాధిపతికి అఖిలమూ మధురమే. ఆయన కెక్కువ తక్కువలులేవు. రథచోదన చేసి కర్మయోగము నుపదేశించి జ్ఞానయోగము నా యోగీశ్వరుడు తన జీవితమునందే నిరూపించెను. అష్టాదశాక్షౌహిణుల నడుమ శాంతముగా వినుకనుమాట లేక నిర్భయముగా ఆయన అర్జునుని సందేహ పరంపరను పటాపంచలు చేశాడు. ఎంతో ప్రశాంతమైన దేశకాలాలలో చేసిననైనా పారమార్థిక బోధలు మనకు మనసుకు పట్టడం కష్టం. 'యస్మిన్ స్థితో న దుఃఖేన గురుణాపి విచాల్యతే' ఎంతటి దుఃఖం వచ్చినా కలవరం కలుగనీయని ఉపదేశం అది. దానిని ఆ పార్థసారథి ఒక్కడే చేసేదీ. అ పార్థు డొక్కడే తెలిసికొనేది.

మనిషికీ మనసున్నది. అది సరిగా లేకపోతే తక్కిన ఇంద్రియాలన్నీ ఉన్నా ఒకటే ఊడినా ఒకటే. మనస్సు గిరాగిరా తిరుగుతుంటే ఎవడేం చేయగలడు? చిత్తంలో చాంచల్యం పోవాలి; ఇంద్రియాలు చెప్పిన మాట వినాలి. మంచి మనసు కలవారు నలుగురికీ మంచి చేస్తాడు. దుష్టబుద్ధి కలవారు నలుగురికీ క్షోభపెటతాడు. ఇక పిచ్చివాని మాట చెప్పనే అక్కరలేదు. వాడు పరులకేకాక తనకుకూడా హింసచేసికొంటాడు. అదృష్టవశాత్తు మనకు కొంచెం చిత్తచాంచల్యమే ఉందికాని చిత్తభ్రంశం లేదు. అలాగే అయితే మనలను మించిన పిచ్చివాండ్లు వేరే ఉండరు. మనకు కోపతాపాలున్నవి. వానితోపాటు శాంతగుణంకూడా కొంత మనకు భగవంతు డిచ్చాడు. మనస్సులో మంచితనం లేకపోతే పిచ్చి అంకురించడం ఆరంభమవుతుంది. దానివల్ల తనకూ పేదవారికీ దుఃఖమ. మనలోని మంచితనాన్ని మనం ఇబ్బడిచేసినకొలదీ శాంతి పెరుగుకొంటూ పోతుంది.

ఎట్టి కష్టాలు రానీ, కదలక కొండవలె ఉండాలి. దానికి ఉపాయ మేమిటి?
ఉత్తమ పదార్థంతో లగ్నమైన మనస్సు ఉత్తమ భావనతో ఉద్దీపిస్తుంది. దేవుడు పురుషోత్తముడు గనుక అతని పాదాలకంటె ఉత్ కృష్టమైన వస్తు వింకొకటి లేదు. భగవత్ పాదాలే భగవత్ పాదులు. భగవద్ స్మరణరూపంగా భగవచ్చరణ స్మరణఉంటే మనకు ఉత్తమస్థానం దొరుకుతుంది.

శైశవమాదీ మనం పాపంచేస్తూనే ఉన్నాము. వానితోపాటు ఈశ్వరుణ్ణి తలచుకుంటూవుంటే మన పాపాలెంతో తగ్గి ఉండేవి. జన్మకు ఫలం ఏమిటి? మరవక ఈశ్వరస్మరణ ప్రణిధానము చేసి కృతకృత్యుడు కావటమే. ఆచార్యులవారు మాకిచ్చిన ఆజ్ఞా అదే. మే మీశ్వరస్మరణ చేయడమే కాదు. ఇతరులచే చేయించడంకూడా.

రాజా రాష్ట్రకృతం పాపం రాజపాపం పురోహితమ్|
భర్తారం స్త్రీకృతం పాపం శిష్యపాపం గురుంవ్రజేత్|

దుర్బలులను ప్రబలులు బాధించకుండా ఉండేటటులు మాచే బాధ్యత రాజుది అట్లా రాజు ప్రజలను రక్షించకపోతే ప్రజలులు చేసిన ఆ పాపం రాజుకు చుట్టుకుంటుంది. అట్లే శిష్యుని పాపం గురువుకు చుట్టుకుంటుంది. అందుచే శ్రీ శంకర భగవత్పాదులు మమ్ము ప్రతినిధులనుగా చేసి అందరికిన్నీ భగవచ్చరణస్మరణం బోధింపండని ఆజ్ఞాపించారు. మీరు చెప్పినట్లు వారు చేయకపోతే మీరయినా చేయండని మాకు కట్టడి చేశారు.

మనం ప్రతిరోజు చేసే కార్యకమం పరిశీలిస్తే పరమేశ్వరునికై వెచ్చించే కాలం పదిక్షణా లుంటుందా? మన తీరిక అంతా వ్యర్థప్రసంగాలతోనూ వృథాలోచనలతోనూ కయ్యాలతోనూ వియ్యాలతోనూ గడిపేస్తున్నాం. మనం ప్రతి దినమూ వార్తాప్రతికలు చదువుతాం. దీనివల్ల బాధలేదుకాని దానిలోని విషయాలను చర్చించడంవల్ల ఫల మున్నట్లు కనిపించదు. కాలాన్ని ఇట్లా వమ్ము చేయడానికి బదులు భగవత్ స్మరణకై వినియోగిస్తే పాపభయం ఉండదు. బ్రతికి ఉన్నంత వరకూ పరహింస చేయకుండా రాచకార్యాలూ దేశకార్యాలూ మనం చేయవచ్చు. ప్రజాహితకరమై ప్రభుత్వం ఉంటేకాని ఐహికసౌఖ్యాలు అనుభవించలేము. తమ బుద్ధికి తోచిన రాజ్యాంగలోపాలను ప్రభుత్వానికి తెలపడం ప్రజకు విధి. రాజు ఐహికవిషయాలు కెట్టిబాధ్యత వహిస్తాడో ఆచార్యుడు ప్రజల పారమార్థిక విషయాలకు అట్టి బాధ్యత వహిస్తాడు. ఐహిక విషయసౌఖ్యం ఒకటే చాలదు. అముష్మికానందం కూడా అనుభవించవద్దా?

పాపం విరగడ కాకపోతే ఆనందం అందదు. పాపక్షాళనానికి కావలసిన హంగు-మనస్సూ దేహమూ శాస్త్రమూ తీర్థమూ క్షేత్రమూ. ఇవన్నీ ఇహలోకంలోనే ఉన్నవి. వరుస పుట్టుక ఏదో మనకు తెలియదు. కనుక ఈ పుట్టుకలోని పాపాలీ పుట్టుకలోనే పోవాలి. మనం చేసినపాపం కొద్దీ మరుపుట్టువులో పశువులంగా గానీ కీటాదులంగా గానీ పుటితే పూజాపురస్కారాలు పరోపకారాదులు ఇవన్నీ పాపమోచకాలున్నూ చిత్తశోధకాలున్నూ, కార్యం చిన్నదయినా పెద్దదయినా మనం చిత్తశుద్ధితో చేయాలి.

అపి చే దసి పా పేభ్యః సర్వేభ్యః పాప కృత్తమః|
సర్వం జ్ఞానప్లవేనైవ పృజినం నంతరిష్యసి.

-గీత

పాపాలు చేశాననేభయం అక్కరలేదు. బ్రహ్మజ్ఞానం అనే తెప్పవల్ల ధర్మాన్నీ ఆ ధర్మాన్నీ అతిక్రమించాలి. పాపసముద్రాలు దాటిపోవడానికి జ్ఞాననౌకను మించిన దేదీలేదు. అందుచేత మనోమాలిన్యాన్ని పోగొట్టుకొని నిఃశ్రేయసము నందుటకు భగవత్ పాదరూపమైన ఆచార్యచరణ

ధ్యానం చేయాలి.

ధ్యానానికి మన మెంత యెక్కువ కాలం వీలు చేసుకుంటే అంత మేలు. ఐశ్వర్యమున్నా సరే. లేకున్నా సరే ధ్యానం మాత్రం వదలకుండా ఉండాలి. మనంమాత్రం చేయడమే కాదు; మన అభిరుచులతో ఏకీభావమున్న మనచుట్టు ప్రక్కల నున్నవారినికూడా చేయండని చెప్పాలి. వారొకవేళ మన మాట పాటిచేయకపోతే మనం కినుకపడరాదు. కాని వారి వారి విధులను మెత్తగా వారికి గుర్తు తేవాలి. మంచిమాటకు కరగని మనసంటూఉండదు. వేరు వేరు పనులను క్రమక్రమంగా తగ్గించుకొని ధ్యానకాలాన్ని పొడిగించుకొని ఈశ్వర స్మరణలో మునిగి తేలుతూవుండాలి. ఇట్టి మేలిపనిని అడ్డమూ ఆకా లేకుండా నిర్వర్తిస్తూ అనవసర ప్రసంగాలలో వృధా అయిపోయే కాలాన్ని ధ్యానానికి ఉపయోగిస్తే శ్రేయస్సు పొందగలం.
ప్రజల పారమార్థిక ప్రయోజనార్థం ఈ విషయాన్ని తెలుపవలెనన్న ఆచార్యులవారిమాట పాటించి, మావిధిని నెరవేర్చుకొనే భాగ్యం మాకున్నూ, శ్రవణభాగ్యం మీకున్నూ కలిగింది.

అపార కరుణాసింధుం జ్ఞానదం శాంతరూపిణం
శ్రీ చంద్రశేఖర గురుం ప్రణమామి ముదావహం ॥

--- “జగద్గురు బోధలు” నుండి

#KanchiParamacharyaVaibhavam #కంచిపరమాచార్యవైభవం
4/28/18, 12:24 - Paramacharyulu: <Media omitted>
4/28/18, 16:07 - Paramacharyulu: ఇరవైరెండవ శ్లోక భాష్యం - రెండవ భాగం

“భవానీ! నీ దాసుడనైన నామీద నీ కరుణా కటాక్ష వీక్షణములు ప్రసరింపచేయి అని చెప్పడానికి ఆరంభించి రెండో పదము చెప్పాడో లేదో నీవు (అంబిక) అతడికి నీ సాయుజ్యాన్నే ప్రసాదిస్తావు. ఆ స్థితిలో ఆ సాధకుడు నీలో ఐక్యమయిపోతాడు.” ఇది ఈ శ్లోకపు మొదటి మూడు పాదాల  భావం. సాధకుడు తాను ఏకాగ్రచిత్తంతో దేనినైతే ధ్యానిస్తు న్నాడో తాను ఆ వస్తువు అవడం సాయుజ్యం. ఇక్కడ చెప్ప బడింది జ్ఞానం వలన సాధించబడే నిర్గుణబ్రహ్మైక్యస్థితి - అద్వైత స్థితి కాదు. నేనూ చెప్పడానికి ఈ శ్లోకపు నాలుగవ పంక్తే ఆధారం.

ముకుంద బ్రహ్మేంద్ర = విష్ణువు, బ్రహ్మ, ఇంద్రుడు; స్ఫుటమకుట = ప్రకాశవంతములైన కిరీటములు. నీరాజన మంటే మనమెరిగిన దీపారాధన - హారతి. నీరాజిత పదామ్ = నీరాజనము లెత్తబడుతున్న పాదములు. ఎవరి పాదముల కైతే ముకుంద బ్రహ్మేంద్రుల ధగద్ధగాయమానమైన కిరీటములు నీరాజనము లెత్తుచున్నవో అటువంటి నీతో సాయుజ్యము పొందుతాడు. కిరీటము దీపారాధన చేయడమేమిటి? ముకుంద బ్రహ్మేంద్రులు అంబిక పాదముల పైల శిరస్సు వంచి నమస్కరిస్తారు కదా. అప్పుడు వారి కిరీటములు కాంతి అమ్మ పాదములపైన పడి నీరాజనము లిస్తున్నట్లుంటుందన్న మాట. భక్తుడు అంబికతో ఐక్యమయితే, వరసాయుజ్యం సిద్ధిస్తే, ఆమె పాదములకు జరిగే దీపారాధన ఈతని పాదములకు జరిగినట్లే కదా! జ్ఞానమార్గంలో అద్వైత సాయుజ్యమును పొందిన వారి స్థితి వేరు. అ స్థితిలో కరచరణాద్యవయువములతో దేవత ఉండే అవకాశమే లేదు. సృష్టి స్థితులే లేవు కాబట్టి ముకుంద బ్రాహ్మల అవసరమే లేదు. ఈ శ్లోకంలో వివరించబడింది సప్రపంచ స్థితి. అక్కడ ఈ ప్రపంచం, ప్రపంచ వ్యవహారములు, సగుణదేవతలు ఉంటారు. ఈ శ్లోకంలో ఆచార్యులవారు ప్రస్తావించినది అద్వైత స్థితిలోని సాయుజ్యం కాదు.

నిశ్చలమైన పరబ్రహ్మ ప్రపంచ కారణమువడానికి పరాశక్తిగా అవుతాడు. మహారాజ్ఞి అయిన ఆ పరాశక్తి జగత్పాలసకు బ్రహ్మేంద్రాది దేవతలను నియమిస్తుంది. ఈ దేవతలందరూ ఆమె పాదములనంటి నమస్కరించేటంతటి ఉన్నతమైన సితి ఆమెది. ఇక్కడ చెప్పబడిన సాయుజ్యము - జీవాత్మ అటువంటి పరాశక్తితో సాయుజ్యమును పొందటం. జీవాత్మ పరాశక్తితో ఐక్యమయి పరాశక్తిగా అయిపోతుంది.

అద్వైత విధానంలో కూడా, గమ్యం అది కాకపోయినప్పటికీ, ఇటువంటి స్థితి ప్రస్తావించబడి ఉండటం ఆసక్తికరమైన విషయం. పరమమైన గమ్యము అఖండము, అనంతము అయిన నిర్గుణ స్థితి. అది శక్తితో కానీ, ఎటువంటి ప్రపంచ విధులతో కానీ సంబంధం లేని శాంత స్థితి. అయితే ఈశ్వరుడు (అద్వైత సిద్ధాంతంలో పరాశక్తి ఈశ్వరుడని పిలువబడుతుంది) ఏదైనా చేయదలచుకుంటే, “నేను అద్వైతిని అలా చేయవద్దు” అని చెప్పగలమా? చెప్పినా ఆయన వింటాడా? నీ మాట వినమని ఆయనను నిర్బంధించగలవారెవ్వరు? కాబట్టి ఆయన తన లీల అద్వైతుల ముందు కూడా ప్రదర్శిస్తాడు.  అందువలననే కొన్ని ఉపనిషత్ పంక్తులలో ఎవరికైతే కామం  లేదో, సంకల్పం లేదో అటువంటివాడు కోరిన కోర్కెలు అన్నీ  తీరతాయి, సంకల్పాలన్నీ నెరవేరతాయి అని చెప్పబడింది.  దీని అర్థం ఏమిటి? అతనికి ఈశ్వరస్థితి అయిన ఐశ్వర్యం  సిద్ధిస్తుందన్న మాట. అతడు జ్ఞానమార్గంలో పయనిస్తూ నిర్గుణ  బ్రహ్మలో ఐక్యం చెందాలనుకొంటున్నా, సగుణ పరాశక్తి "నాలో  కూడా ఐక్యమయి శక్తి నాటకమాడుతూ సమాధి స్థితిని  పొందు” అని చెబుతుందన్నమాట. సమాధి స్థితికి చేరిన  తరువాత కూడా అతని సమాధిస్థితి చెడకుండానే ఈ ప్రపంచ  నాటకం శక్తి లీలలో మగ్నుణ్ణి చేస్తుంది.

(సశేషం)

#KanchiParamacharyaVaibhavam #కంచిపరమాచార్యవైభవం
#ParamacharyaSoundaryaLahariBhashyam
4/29/18, 07:39 - Paramacharyulu: దేవ్యుపాసనాఫలము

సౌందర్యలహరిలో చిట్టచివరిశ్లోకానికిముందటిశ్లోకంలో శాక్తోపాసకులు ఉపాసనా ఫలితముగా ఏయే ప్రయోజనాలు పొందుతారో ఆయాప్రయోజనాలను శ్రీమత్ శంకర భగవత్పాదులు విశదీకరించారు.

శైశవంలో ఆకలివేసినప్పుడూ దడపుట్టినప్పుడూ మనం మన శరీర ధారణకు కారణమైన కన్నతల్లి ఒడిలో చేరి ఆక్రందనం చేసి పాలు క్రోలి పెరిగి పెద్దలమైనాము. బిడ్డ కొంచెం ఏడిస్తే చాలు. తల్లితన పనులన్నీ ఒకవంకకునెట్టి తన శిశువును గమనిస్తుంది. శిశువులు తల్లిని నోరార 'అమ్మా' అని పిలిచేటట్లు లేగదూడలుకూడా తమ తల్లులను అంబా అని సంబోధిస్తవి. 'మేస్తూవున్న గడ్డి వదిలిపెట్టి దూడదగ్గరకు వేగముతో పరిగెత్తే గోమాత హృదయానికే ఆయేడ్పులోని కలత తెలుసు.' అంబా రవము నుండియే అమ్మ అనే మాట పుట్టివుండాలి. అంబాఅని ఆక్రందించే లేగదూడలవలె మనంకూడా ఆబ్రహ్మ కీటజననియైన అంబిక మ్రోల మొరపెట్టుకుంటే ఆలోకమాత అనుగ్రహానికి పాత్రులము కాగలమని గ్రంథాంతంలో ఆచార్యులవారు గ్రంథ ఫలశ్రుతిగా కాక అంబికాచరణ దాన ఫల శ్రుతిగానే చెప్పారు.

సరస్వత్యా లక్ష్మ్యా విధి హరి సపత్నో విహరతే
రతేః పాతివ్రత్యం శిథిలయతి రమ్యేతి వపుషా,
చిరం జీవన్నేవ క్షపిత పశుపాశ వ్యతికరః
పరానందాభిఖ్యం రసయతి రసం త్వద్భజనవాన్.

భక్తవత్సలవు నీవు. నీ భక్తులు నిన్ను ఏం కోరినా యిస్తావు. నీవో, లక్ష్మి ఒక చేత్తోనూ వాణి ఒక చేత్తోనూ వింజామరలు వీస్తుండగా కొలువుతీరుస్తావు. లక్ష్మీసరస్వతులు నీకు దాసికలై వింజామరలతో సేవ చేస్తుండగా నీ కతివత్సలుడైన నీభక్తునికి సైతం వారు సేవ చేయరా ఏమి? పరిపూర్ణతకు లక్ష్మీకటాక్షం తప్పనిసరి. ఆ లక్ష్మీ పురుషోత్తమునిధామం వైకుంఠం వదలి నీపాదాలముందే పడిగాపులు కాస్తూంది. అంతటితో ఆగక నీభక్తునికి సైతం పరిచర్యచేయడానికి సమకట్టుతూంది. అపుడు నీభక్తుణ్ణి చూస్తే పురుషోత్తమునికి అసూయ కలుగుతూంది.

ఎవరైనాసరే లక్ష్మీకటాక్షాన్నే మొదట కోర్తారు. తన బిడ్డ తెలివితక్కువతనం తల్లికి తెలుసుగనుక లక్ష్మీకటాక్షాన్నే మొట్ట మొదట అనుగ్రహిస్తే అజ్ఞానవశాన ధనం దుర్వ్యయం చేసేసి పాపాలు మూటకట్టుకుంటాడని అతనికి మొదట సరస్వతీ ప్రసన్నత అనుగ్రహించి, తరువాత ఐశ్వర్యాన్ని చక్కగా అనుభవించే వివేకం ఇస్తుంది శ్రీమాత.

'స మేంద్రో మేథయా స్పృణోతు తతో మేశ్రియ మావహ' అని తైత్తిరీయం మొదట మేధ తరువాత శ్రీ ప్రసాదం. దీనికి ఆచార్యులవారు భాష్యం వ్రాస్తూ 'ఏవమాదిని కుర్వాణా శ్రీర్యా తాం తతో మేధా సాహిశ్రీ రనర్థాయేవేతి' మేధలేని వానికి డబ్బిస్తే అనర్థమే కలుగుతుందట. డబ్బెందుకు? పుణ్యము సంపాదించటానికి బుద్ధి లేని వానికి డబ్బిస్తే వాడు పాపాలభైరవు డవుతాడు. అట్టిచోట అర్థానికి అర్థం అనర్థమే- ''అర్థమనర్థం భావయ నిత్యం నాస్తి తతః సుఖలేశ స్సత్యమ్'' అని భజగోవిందంలో భగవత్పాదులే బోధించారు.

సర్వోత్పాదకశక్తి పరాశక్తి. ఆమె కటాక్షమాత్రం చేత భక్తునికి ఎక్కడలేని తెలివీ పుట్టుకొని వస్తుంది. అతని మనస్సనే ఆకాశంలో మెరుపుతీగవలె అపూర్వములైన సత్యాలు హఠాత్తుగా మెరుస్తాయి. మంచిపనులు చేయడం అతనికి అలవాటవుతుంది. అతడెప్పుడూ ఇహానికీ, పరానికీ ఉపయోగించే కార్యాలనే ఎల్లప్పుడూ చేస్తుంటాడు. జగన్మాత యెడల ఏకాంతభక్తి నెరపినవానినాలుకమీద పలుకుల వెలది కాలి గజ్జలమోతలు వినిపిస్తయ్. అట్టి భక్తునియెడల సరస్వతికి గల మక్కువను చూచి బ్రహ్మగారికే కలవరం పుడుతుందిట.

ఐశ్వర్యానికి ఏమిటి ప్రయోజనం? అది మొదట తన అనుభవానికి రావాలి. పరహితకోసం చేసే దానధర్మాలకు కూడిరావాలి. పాపికి ఐశ్వర్యంపడితే అది అతనికి కోపమోహ కారణమవడమేకాక లోకానికి కష్టకారణంకూడా అవుతుంది.

డబ్బుమాట యెత్తితే అందరికీ కొరతే. అందరికీ ధనవాంఛే. ఒకనికెంతధనమున్నా బ్యాంకిలో ఎంత నిలువచేసినా అతన్ని అడిగిచూడండి. మీరేమిటో అనుకుంటున్నారు! నాదంతా పైవేషమే. నాచేతిలో నయాపైసా లేదు అని చెపుతాడు. 'ఫలానా ఆయన డబ్బుకలవాడు' అని ఎవరైనా చెపితే ఆ ఆసామికి ఆ చెప్పినవాడిమీద ఎక్కడలేని కోపం వస్తుంది. తమకు ఎంతధనమున్నా అదిఅల్పమనే అందరిభావన. మరింత సిరిపట్టకూడదా అని ఆగర్భ శ్రీమంతులుకూడా ఎదురుచూస్తుంటారు. ఇదిలోకంతీరు. అందుచేతనే భక్తుని చూచి 'నీకు డబ్బుకావాలా నాయనా? కావలిస్తే మొదట మేధావంతుడవు, వివేకివి కా. అప్పుడుకాని నీకిచ్చే అర్థం సార్థకం' అని అమ్మ బుద్ధి చెప్పుతుంది.

నిజానికి దారిద్ర్యం అంటే ఏమి? నేను దరిద్రుడను అని చెప్పుకోడమే తృప్తికలవాడు నిత్యసంతోషి. 'నేనుదరిద్రుణ్ణి' 'నేనుదరిద్రుణ్ణి' అని సొద వెళ్ళబోసుకుంటే ఒక్కనయాపైసా యిచ్చే పుణ్యాత్ముణ్ణి చూపండి. 'అంతో ఇంతో దేవుడిచ్చాడు' అని తలపోస్తే సంతోషంగానైనా బ్రతకవచ్చు.
సరి, వేదశాస్త్ర పరిజ్ఞానం, వివిధ భాషా కోవిదత్వం ఐశ్వర్యం వివేకం అన్నీ ఉన్నవి. అయినా ఏదోకొరత వున్నది. అదేమి?

విద్యాధనాలుంటే చాలదు. అందచందాలు మీద ఇచ్ఛ పరుగులెత్తుతుంది. చూచేవాళ్ళకు కొట్టవచ్చినట్లుండే తేజస్సు కావాలని కోరిక పూరుతుంది. అంబికానుగ్రహంవున్న ఉపాసకునకు అదిన్నీ చేకూరుతుంది. అందంలో వధిపొందిన వాడు అంగలేనివాడు. 'కోటిమన్మథ విగ్రహమ్' అని ఈశ్వరాదుల వర్ణనం అనంగుని మించిన అందగాడు మరొకడులేడు. అతని శ్రీమతి రతి మహాసౌందర్యవతి. మగనికి తగిన మగువ. ఓ అమ్మా! నిన్ను ధ్యానించేవాడు రతీదేవి పాతివ్రత్యానికి శైథిల్యం కలుగజేసి అందచందాలతో అలరారుతాడట.

చదువూ డబ్బూ అందమూ ఇవి అన్నీవున్నా ఆయుర్దాయం లేకపోతే నిష్ప్రయోజనం. అంబికా కటాక్ష మున్న సాధకుడు దీర్ఘాయుష్మంతుడౌతాట్ట.

మంచిది. అన్నీ అమరినవి. తతః కిమ్ - తరువాత? ఈ అనుభవానికి పిదప ఈప్రశ్న వైరాగ్యానికి బీజం. మనకు వైరాగ్యం గనుక సొంతంగానే కలిగితే అది క్షణకాలం ఉంటుందో. ఉండదో, అమ్మ దయచే కలిగితే ఆ వైరాగ్యం మేకు పాతినట్లే.

అక్కరలేని విషయాలమీద ప్రేమ మనలను బాధిస్తూంది. బంధిస్తూంది. ఈ పాశాలు వున్నంతవరకూ మనం పశువులం. భగవానుడు

పశుపతి. డబ్బు, మనస్సు, అందము, ఆయుస్సు అనే పాశాలతో ఆయన మనలను బంధించివున్నాడు. ఎన్నడు నిర్వేదపూర్వకమైన వైరాగ్యం కలుగుతుందో ఆనాడు మన పాశాలు జారి పశుత్వంపోయి పరబ్రహ్మలమై కూర్చుంటాము. శుద్ధప్రకాశచేతనవస్తువే ఆత్మ. మనము పాశవిముక్తులమైతే పరమానందం మన సొమ్ము. అంబిక మనకిచ్చే అంతిమ ఫలం అదే.

పురుషార్థాలను ప్రసాదించేది పరమేశ్వరి. గోమాత కడకు వెళ్ళే లేగలవలె శ్రీమాత చరణారవిందములను చేరితే గాని ఐహికవిషయానుభవము పిదప మనకు ఆముష్మికమగు కైవల్యానందం దొరకదు.

అపార కరుణాసింధుం జ్ఞానదం శాంతరూపిణం
శ్రీ చంద్రశేఖర గురుం ప్రణమామి ముదావహం ॥

--- “జగద్గురు బోధలు” నుండి

#KanchiParamacharyaVaibhavam #కంచిపరమాచార్యవైభవం
4/29/18, 10:34 - Paramacharyulu: <Media omitted>
4/29/18, 22:22 - Paramacharyulu: ఇరవైరెండవ శ్లోక భాష్యం - మూడవ భాగం

ఇదంతా ఎవరిచేత చేయించబడిందో ఆ వ్యక్తి తుదిన కేవలం “శక్తిమంతుడు” గానే మిగిలిపోడు. కేవలం శక్తి అంటే దానితోపాటు అహంకారం, అధికారం ఉంటుంది. అక్కడ దైవరసము యొక్క దైవానుభూతి ఉండదు.

పరాశక్తి అనుగ్రహం కలిగిన వారికి దైవీ స్పృహ ఉంటుంది. అటువంటి వాళ్ళు ఆమెతో భక్తితో కలిసిపోతారు. ఆపైన ఉన్నత స్థితులకు వెళ్ళినప్పుడు భక్తుడు తన శక్తిని ప్రదర్శించడు. తన కోర్కెలను అభిమతాన్ని ఆవిష్కరించడు. పరాశక్తి లీలను తెలుసుకొనిన అనుభవం అతడికి ఒక శాంత భావాన్ని కలిగిస్తుంది. అంబిక పైన భక్తి అంతర్లీనంగా ప్రవహి స్తూనే ఉంటుంది. సగుణ పరాశక్తి నిర్గుణ పరబ్రహ్మయే మూలమనే అనుభూతి లేక స్పృహ వలన అతడికి నిర్మలత్వం సిద్ధిస్తుంది. ఇది జ్ఞాన మార్గంలో సాగిపోయే  వ్యక్తి అనుభవించే నిర్మలత్వం. కాబట్టి ఇక్కడ ఆచార్యులవారు చెప్పినది జ్ఞాన, భక్తి, శక్తి పద్ధతులు కలిసిన సాయుజ్యము. అద్వైత శాస్త్రంలో బోధించబడిన సాయుజ్యం కాదు. వేదాంత సిద్ధాంతాలలా ఉంచండి. మనం ఇప్పుడు ఈ శ్లోకంలో శ్లేషను గురించి చెప్పుకొందాం.

ఒకే శబ్దాన్ని లేక పదాన్ని ఉపయోగించి వివిధ అర్థాలను సాధించడం శ్లేష, భక్తుడు ఒక అర్థంలో “భవానిత్వం” అంటే భవుని రాణి అయిన నీవు అని చెప్పుకొన్నాం కదా! 'భవ" అన్న క్రియకు 'ఉండుట' అన్న అర్థమున్నది. ఉదాహరణకు దీర్ఘ సుమంగళీభవ, ఆయుష్మాన్ భవ. "భవానీత్వం” అన్న రెండు పదాలలో 'భవానీ' శబ్దాన్ని క్రియగా తీసుకొంటే “నేను నీవగుదువుగాక” అన్న అర్థం వస్తుంది. పరమమైన కరుణతో - భక్తుల కోర్కెలను కోరినదానికి కోటి గుణితంగా తీర్చడానికి సిద్ధంగా ఉన్న అంబిక ఈ అర్థంలో తీసుకోన్నట్లున్నది. అపరిమితమైన దయతో సాయుజ్యాన్నే ప్రసాదించింది.

భక్తునకు సంబంధించినంతవరకూ అతడు ఆమెను తల్లిగా తలచడానికి కూడా అరుడననుకోవడం లేదు. అతడు తాను దాసుడననుకుంటున్నాడు. కేవలం కటాక్షుపాంగవీక్షణకై, ఆమె కరుణతో నిండినటువంటి చూపుకై ప్రార్థిస్తున్నాడు. అదే ఆ మహద్భాగ్యమని భావిస్తున్నాడు. ఆ భక్తుడు
నిజంగానే యోగ్యత లేనివాడయి ఉండవచ్చు. ఆచార్యులవారు సాధు, పతి అన్న పదాలు వాడక యః అన్నపదం వాడారు. “యః” ఎవరైనా కావచ్చు. అతడికి సాయుజ్య మంటే ఏమిటో కూడా తెలిసిఉండక పోవచ్చు. కానీ “నేను నీవగుదునుగాక” అన్న పదములు ఉచ్చరించడంతో అంబిక సాయుజ్యమే ప్రసాదించింది.

ద్వైత స్థితిలో ముక్తిలో కూడా ప్రభువు - దాసుడు రెండు స్థితులున్నాయి. అంబిక ద్వైత భావంతో ఉన్న భక్తునికి కూడా అద్వైత ముక్తిని ప్రసాదిస్తుంది. ప్రస్తుతానికి సగుణ అద్వైత స్థితి. ఈ స్థితిని ప్రసాదించిన నిర్గుణ బ్రహ్మైక్యాన్ని కూడా ప్రసాదిస్తుంది.

నిరంతరం దాసోహం, దాసోహం అంటూనే ఆంజనేయ స్వామి సోహం స్థితికి చేరారు. సా, అహమ్= అతడు (పరమాత్మ) నేనే! ఆచార్యులవారు అంబికను దాసోహం అంటూ చేరినవారు సోహం స్థితికి తీసుకొని వెళ్ళబడతారు ఆంజనేయస్వామి సోహం స్థితికి చేరినా రామదాసునిగానే ఉండిపోయాడు.

అహం బ్రహ్మాస్మి - నేను ఒక బ్రహ్మను అయి ఉన్నాను అన్నది వ్యక్తి తనంతట తానుగా చెప్పుకునేది. తత్త్వమసి - అది (పరమాత్మ) నీవే అయివున్నావని గురువు చెప్పేది. ఈ మహావాక్యములను ధ్యానించే సాధకుడు ఎంతో శ్రమపడినా గమ్యాన్ని చేరడం అతని శక్తికి మించినదిగా తెలుసుకోవచ్చు.

(సశేషం)

#KanchiParamacharyaVaibhavam #కంచిపరమాచార్యవైభవం
#ParamacharyaSoundaryaLahariBhashyam
4/30/18, 07:37 - Paramacharyulu: చంద్రమౌళీశ్వరి

దేవీపరమైన స్తోత్రగ్రంథాలలోమూకకవి చెప్పిన మూకపంచశతికి చాలా గౌరవ మున్నది. మూగవాడొకడు పరమేశ్వరీ కరుణాకటాక్షంచేత మహాకవి అయినాడు. ఆయన వ్రాసినదే మూకపంచశతి. దీని ప్రతిశ్లోకంలోనూ జ్ఞానం చిప్పిలుతూ చదువరులను తన్మయులనుగా చేస్తుంది. ఆ గ్రంథంలో కాంచి కామకోటి అనే పదాలు దాదాపుగా ప్రతి శ్లోకంలోనూ కనపడతవి.

ఐశ్వర్య మిందుమౌళే
రైకాత్మ ప్రకృతి కాంచిమధ్యగతమ్
ఐందవ కిశోర శేఖర
మైదంపర్యం చకాస్తి నిగమానామ్

పైశ్లోకం మూకపంచశతిలోనిది. దీంట్లో చంద్రమౌళికి ఐశ్వర్యం ఏమిటయ్యా అని అంటే అంబికియే అని కవిచమత్కరిస్తాడు. ఈశ్వరుని ఈశ్వరతత్త్వం ఆమె. చంద్రమౌళీశ్వరి అనుగ్రహం ఉంటేనే కాని వ్యాపకుడైన పరమేశ్వరుని తత్త్వం అవగతం కాదు. ఆమె ప్రకృతి. ఆమె కాంచీక్షేత్రం నడుమ ఉండి లేజాబిల్లిని తలలో తాల్చి నిగమ తాత్పర్యమో అనే టట్లుగా అద్వైతామృతం వం శ్రీమ చ్ఛంకర భగవత్ పాదుల సౌందర్యలహరిలోని యీశ్లోకం చూద్దాం.

అహ స్సూతే సవ్యం తవ నయన మర్కాత్మకతయా
త్రియామాం వామం తే సృజతి రజనీనాయక తయా,
తృతీయా తే దృష్టి ర్దరదళితహేమాంబుజరుచిః
సమాధత్తే సంధ్యాం దివస నిశయో రంతరచరీమ్.

ఈ శ్లోకంలో అంబిక మూడుకన్నులు కలదిగా త్రినయనిగా వర్ణింపబడినది. సూర్యచంద్రాగ్నిలోచని ఆమె. ఆమె ఎడమకన్ను సూర్యుడై పగటిని, కుడికన్ను చంద్రుడై రాత్రినీ రెంటికినీ నడుమనున్న లలాటనేత్రం రేయింబవళ్ళకు నడుమదైన సంధ్యనూ సృజిస్తూ అరవిచ్చిన బంగారు తామరపువ్వు వలె వెలుగుచున్నదని ఆచార్యుల వారనిరి.

'త్వయా హృత్వా వామం వపు రపరితృప్తేన మనసా
శరీరార్థం శంభో రపరమపి శంకే హృత మభూత్
యదేత త్త్వద్రూపం సకల మరుణాభం త్రినయనం
కుచాభ్యా మానమ్రం కుటిల శశి చూడాల మకుటమ్.'

నీవు ఈశ్వరుని వామభాగంమాత్రం అపహరిస్తేచాలునని మొదట అనుకొన్నట్లు ఉన్నావు. కానిదానితో నీమనస్సు తృప్తిపడలేదు. తక్కిన సాబాలు కూడా నీవే ఆశ్రమించు కొందామనుకొన్నావు. మూడు కనులతో ముక్కంటివై ఎఱ్ఱనికాంతులను వెడలగ్రక్కుచున్నావు. నీమూడో కన్ను చూచి, నెలవంకతోడి నీకిరీటంచూచి ఈశ్వరుడవని అనుకొన్నాను. తీరాచూస్తే శివస్వరూప అవశేషంగా వున్నావు.

ఒక శుక్రవార ప్రదోషసమయంలో ఏకశరీరులైన అర్థనారీశ్వరులను ప్రత్యేకించి ప్రార్థించడం సమంజసంగా లేదు. అని ఎవరో అన్నప్పుడు ఈ శ్లోకం గుర్తుకొచ్చింది.

త్రిమూర్తులు సత్త్వరజస్తమోగుణోపేతులు. మరో శ్లోకంలో ఆచార్యులవారు త్రిమూర్తులకూ ప్రత్యేకంగా పూజ చేయనక్కరలేదని అంటారు. అంబ అడుగుదమ్ములకు చేయు పూజ వారి పూజే. ఆమె అడుగులు మోసే మణిపీఠం క్రింద, ఒగ్గిన దోసిలులే కిరీటములుకాగా ఆమె ఆజ్ఞకై వేచి ఉంటారు. కాబట్టి ఆమె పాదాలమీద సమర్పించిన పూజాద్రవ్యాలే వారి తలలమీదగూడా పడతవి. ఆమె కిచ్చు ఆరతి వారికిన్నీ ముట్టుతుంది. దైవమును తల్లిగా ధ్యానించడమే అంబికాధ్యానం. అర్జునుడు శ్రీకృష్ణుని స్నేహితునిగా తలచాడు. యశోదకు కృష్ణుడు బిడ్డడే అయినాడుగదా. రుక్మిణీ సత్యభామలు ఆయను భర్తగా భావించారు. అందుచేత మనం అంబికను అమ్మగా భావనచేసి ధ్యానిస్తే ఆమెయూ, మాతృ ప్రేమతో మనలను ఒడిలోకి తీసుకుంటుంది. ఏ రూపంతో మనం ధ్యానించినా ఆ రూపంతో వచ్చి అనుగ్రహంచేశక్తి పరమాత్మకుఉన్నది. పరబ్రహ్మస్వరూపిణి అయిన అంబిక అమ్మయై మనలను ఆదరిస్తుందనడంలో సందేహంలేదు.

కాళీకటాక్షంచేత ఒకడు కాళిదాసయినాడు మూకకవి కామాక్షీదేవి ఉచ్ఛిష్టం తినగా ఆ ఉచ్ఛిష్టమే అమృతలహరియై అతని వాక్కులలో ప్రవహించి మూకపంచశతిరూపం తాల్చింది. భగవత్ పాదులమాట వేరుగా తలవనక్కరలేదు. ఈ ముప్పురయూ వాఙ్మయం చదువుకోడానికి మనం సంస్కృతం తప్పక నేర్చుకోవాలి.

అంబిక వాగ్రూప. ఆమె అకారాది క్షకారంత వర్ణస్వరూప. ముక్తావళి అనే తర్కగ్రంథంలో వీచీతరంగ న్యాయమనిన్నీ. కదంబముకుళ న్యాయమనిన్నీ రెండు న్యాయాలు (ఉపమానాలు) శబ్దాన్ని గూర్చి చెప్పబడ్డవి. గాలికి ఒక అలలేస్తుంది. దాని తాకువల్ల ఇంకో అల పుటుతుంది. దాని కింకొకటి ఇట్లా ఒడ్డువరకూ ఒక అల తరువాత వరుసగా ఇంకొక అల పుటుతూ వుంటుంది. దీనినే 'వీచీతరంగన్యాయం' అని అంటారు. శబ్దం పుట్టి ఒక స్పందం తరువాత మరొక స్పందంగా వచ్చి చెవికి తగులుతవి. కడిమి మొగ్గలన్నీ ఒకే ఒకసారి విచ్చుతవి. అది 'కదంబముకుళ న్యాయం' వెనుకటి న్యాయానికి ఇది విపరీతం. ఆకాశంలో స్పందాలెన్నో కడిమి మొగ్గలవలె ఒకే ఒకసారి పుటతై. ఈశబ్దమునే అక్షరాలనిన్నీ మాతృకలనిన్నీ అంటారు. మాతృకా స్వరూపిణియే అంబిక. శ్యామలాదండకంలో కాళిదాసు అంబికను - 'సర్వవర్ణాత్మికే' అని సంబోధిస్తారు. అంగన్యాస కరన్యాసాలు చేసేటప్పుడు ఆయామంత్రదేవతలకు సంబంధించిన అక్షరాలు చెప్పుతాము. అనగా ఆమంత్రి దేవత ఆయా అక్షరస్వరూపిణియై ఉన్నదని భావం.

ఆ లోకమాతకు 'పరాశక్తి' అని పేరు. ఆమె కటాక్షం ఎట్టివానినైనా ఆకాశానికి ఎత్తేస్తుందని శాస్త్రాలు చెప్పుతున్నయ్. నాదబిందు కళాస్వరూపిణి వేదమాతా అయిన అంబికను భక్తిభరంగా అఖేదంగా ధ్యానించాలి.

సౌందర్యలహరిని గూర్చి ఈక్రింది జనశ్రుతి ఉన్నది. ఆచార్యులవారు కైలాసం వెళ్ళి ఐదులింగాలు తెచ్చారు. వానిలో ఒకలింగమే చంద్రమౌళీశ్వరుడు. కైలాసంలో ఈశ్వర సన్నిధిని మంత్ర శాస్త్రం ఉన్నది. దానిని తీసుకువచ్చేటప్పుడు నందికేశ్వరుడు ఆచార్యులవారిని అడ్డగించి లాగుకోటంలో కొంతభాగం మాత్రమే ఆచార్యులవారికి దక్కింది. దానిలో నలుబదిఒక్క శ్లోకాలు మాత్రం ఉన్నవి. యాభై తొమ్మిది

శ్లోకాలను ఆచార్యులవారు స్వయంగా రచించి పూర్తి చేశారట.

తైత్తిరీయం - 'మాతృదేవోభవ, పితృదేవోభం' అని బోధించింది. ఒక్క జన్మలో ఏర్పడ్డ అమ్మనే దేవతగా చూడమని ఉపనిషత్తు ఉపదేశిస్తే ప్రతిజన్మలోనూ మనకు అమ్మగావుండే అంబికమాట వేరుగా చెప్పాలా. సొంత తల్లికి ఎంత సంతానమున్నా అయిదుగురు ఆరుగురుకంటె మించరు. పోనీండి, ఇంకా కొందరుంటారని అందాం. ఆ తల్లియో అందరికీ తల్లి. అందుచేత మనకు అన్నాదమ్ములు అక్కా చెల్లెండ్రు ఒక్క మానవలోకంలోనేకాక పశు పక్షి కీటకాది ప్రపంచంలోనూ ఉన్నారు. తల్లిని దైవముగా తలపుమని చెప్పడంచేత అట్లా తలచడానికి వీలవుతుందని తెలుసు కోవాలి.

అందుచే సౌందర్యలహరి అసమానమైన మంత్ర శాస్త్రంగా పరిగణింపబడుతున్నది.
కైలాసంనుంచి మంత్రశాస్త్రం పూర్తిగా రాకపోవడం కూడా ఒక అదృష్టమే. లేకపోతే ఆచార్యులవారు పూర్తి చేసిన శేషభాగాన్ని చదివే భాగ్యము మనకు అబ్బేదికాదు. ఆచార్యులవారు వ్రాసిన శ్లోకాలు ఏవిధంగానూ తీసిపోవు. మొదటిభాగం మంత్రంశాస్త్రం, రెండవది ఆనందం కలిగించే స్తవం. అందలిదే మరొక శ్లోకం:

విపఞ్చ్యా గాయంతీ వివిధ మపదానం పశుపతే
స్త్వయా రబ్ధే వక్తుం చలిత శిరసా సాధువచనే,
తదీయై ర్మాధుర్యై రపలపిత తన్త్రీకలరవం
నిజాం వీణాం వాణీం నిచుళయతి చోళేన నిభృతమ్.

అంబిక సన్నిధిలో సరస్వతి వీణవాయిస్తూంది. పాట పశుపతిని గూర్చి త్రినయనుని గూర్చిన వీణాలాపన అంబికకు మిక్కిలి ప్రియమైనది. సరస్వతి సర్వజ్ఞ కాబట్టి అంబికకు ఏది ప్రియమో దానినే పాడుతూంది. శ్రోతల ముఖభావాన్నిబట్టి గాయకులకైతేనేం వక్తలకైతేనేం ఉత్సాహమో నిరుత్సాహమో కలుగుతూవుంటుంది. అందుచేత శ్రోతలు రంధ్రాన్వేషణ చేస్తూ తమ అభిప్రాయం దాచిపెట్టుకోటం ఉచితంకాదు. ఔచిత్యం ఎరిగిన అంబిక ఆమోదసూచకంగా శిరఃకంపనంచేస్తూ బలే బలే అని అనడానికి ఉపక్రమిస్తూన్నది. ఆ గళమాధుర్యంలో వాణి వీణలోంచి బయలుదేరే మాధుర్యం లయమైపోయింది. సరస్వతి సిగ్గుపడి వీణకు గవిసెన తొడుగుతూందిట.

కల మఞ్జుల వా గనుమిత
గళ పఞ్జర గత శుకగ్రహౌత్కంఠ్యాత్,
అంబ రదనాంబరం తే
బింబ ఫలం శంబరారిణా న్యస్తమ్,

- మూకపంచశతి.

ఈ శ్లోకంలో అంబిక గళం పంజరంగానూ గళరవం చిలుకగానూ చెప్పబడినది. అంబిక మోవి దొండపండని చెప్పబడినది. చిలుకలకు దొండపండ్లంటే ఆసక్తి మెండు. అంబికా గళరవమనే చిలుకను ఆకం
చేటీ భవ న్నిఖిల ఖేటీ కదంబ వనవాటీషు నాకి పటలీ
కోటీర చారుతర కోటీ మణీకిరణ కోటీ కరంబిత పదా,
పాటీర గంధ కుచ శాటీ కవిత్వ పరిపాటీ మగాధిప సుతా
ఘోటీకులా దధిక ధాటీ ముదార ముఖ వీటీ రసేన తనుతామ్.

దేవతా స్త్రీల కిరీటాల మణికాంతులు అంబికాచరణాలకు నివాళి ఇస్తున్నవి. ఆమె తాంబూలరసం గుఱ్ఱపునడిని మించిన వడితో అల్లే శక్తి నీయగలదని కాళిదాసు వ్రాస్తాడు.

అట్టి సర్వమంగళప్రదాయిని, లోకమాత, చంద్రమౌళీశ్వరి చరణములు ధ్యానం చేస్తే ఆనందలహరులలో మనం తేలాడగలమని అంటే అది అసత్యమా?

అపార కరుణాసింధుం జ్ఞానదం శాంతరూపిణం
శ్రీ చంద్రశేఖర గురుం ప్రణమామి ముదావహం ॥

--- “జగద్గురు బోధలు” నుండి

#KanchiParamacharyaVaibhavam #కంచిపరమాచార్యవైభవం
4/30/18, 16:19 - Paramacharyulu: ఇరవైరెండవ శ్లోక భాష్యం - నాలుగవ భాగం

అంబిక మాత్రం తన పరమమైన కరుణ వలన అటువంటి స్థితిని కోరకుండానే, కేవలం అర్థం తెలియక వేరొక అర్థంలో ఉచ్చరించిన మాత్రానే ప్రసాదించగలదు. “భవాని త్వం” అన్న రెండు పదములతో ఆచార్యులవారు ఒక మహావాక్యము కూర్చిపెట్టారు.

కవిత్వం, అమరత్వం అన్న శబ్దాలు పరికించండి. ఇక్కడ త్వం అన్న పదం కవి, లేక అమరుల లక్షణాన్ని చెప్పడానికి ఉపయోగిస్తోంది. అలాగే భవానిని భవానిగా చేసిన లక్షణం భవానిత్వం అని చెప్పుకోవచ్చు. అంబిక కడగంటి చూపుకై అర్థించే భక్తుడు “భవానిత్వం” అని ఆరంభించేటప్పటికే అతడికి భవానీస్థితిని, భవానిత్వాన్ని ప్రసాదిస్తోంది అంబిక.

ఆచార్యులవారు యః అన్న పదాన్ని ఉపయోగించారు కదా అని ఎందుకూ పనికిరానివారు "భవానిత్వం" అనగానే సాయుజ్యాన్నిస్తుంది అనుకోరాదు. మనలను మనం త్రికరణ శుద్ధిగా ఆమె దాసునిగా భావించి, హృదయ పూర్వకమైన భక్తితో ఆమె కడగంటి చూపుకై అర్థిస్తున్నప్పుడే ఇది సిద్ధిస్తుంది.

మనం నాలుగవ శ్లోకంలో "వాంఛా సమధికమ్" అన్న వాక్యం పరిశీలించాము కదా! అక్కడ ఆచార్యులువారు అంబిక వాదములు మనం కోరుకున్నదానికి అనేక రెట్లుగా ప్రసాదించ దానికి సమర్థము అని చెప్పారు. ఇక్కడ ఈ భక్తుడు పూర్తిగా కోరిక చెప్పలేదు. "స్తోతుం వాంఛక" తన స్తోత్రాల ద్వారా తన కోర్కెను పూర్తిగా చెపుదామనుకొన్నాడు. అంతే! ఆతడు కోరుకోవాలనుకున్న దానికంటే కోటిరెట్లుగా అమ్మ ప్రసాదించింది (వాంఛా సమధికమ్)-అంబిక కరుణరసాన్ని ఆచార్యుల వారు అవలీలగా కనితారసంతో క్రియతో క్రీడించడం ద్వారా ఆవిష్కరించారు.

ఆచార్యులవారు శాస్త్రములతో, ధీవిశేషముతో ఇంకొక పోలిక చెప్పలేని ఉన్నత స్థితిలో ఉన్నప్పటికీ, అంబిక యెడ ఎంతో వినయంతో, దాస భావంతో కన్పిస్తారు. ఎటువంటి సంస్కారము లేక కేవలం భక్తి కలిగిన వారినే ఉద్ధరించే అంబిక సమస్త శాస్త్రములను చదివి భక్తితో వాడే వాక్యముల అర్థం తెలిసి ప్రార్థించేవారిని ఉద్ధరించదా! చదువుకున్న వారయినా, చదువురాని వారయినా వినయంతో సరస్వాత నివేదన భావంతో అంబికను ప్రార్థించాలి. అంతే - ఆమె "వాంఛా సమధికం" మనం ఊహించలేనంత ప్రసాదిస్తుంది.

శైవ వైష్ణవాలలో నిర్గుణ అద్వైతము గురించి మాట్లాడనప్పటికీ, ముక్తులు ఆయా దేవతల పూర్తి శక్తులు, స్వరూపాలతో సగుణ మహావిష్ణు లేక సగుణ పరమశివుని స్థితిని పొందుతారని చెబుతారు. అయితే ఒకే ఒక తేడా! ఆ ముక్తులు మహాలక్ష్మికో, ఉమకో భర్త కాలేరు. ఇది మంచి నడవడికి గల సూత్రాలను ఉల్లంఘించకూడదనే సదుద్దేశ్యంతో ఏర్పాటు చేయబడింది. అయితే ముక్త స్థితిలో కూడా లక్ష్మీ నారాయణులు, శివ శక్తులు విడిగా ఉండవలసి వస్తుంది. ఆ ఒక్కటి తప్పితే మిగతావన్నీ సిద్ధిస్తాయనటంలో మిగతా గుణాల విషయంలో అనుమానాలు రావడం సహజం.

(సశేషం)

#KanchiParamacharyaVaibhavam #కంచిపరమాచార్యవైభవం
#ParamacharyaSoundaryaLahariBhashyam
5/1/18, 07:09 - Paramacharyulu: శివభక్తి

'సర్వేవేదా యత్పద మామనంతి' మనము శ్రుతుల నుండి ఒక విషయాన్ని శివభక్తి
తెలిసికొంటున్నాము. అదేమిటి? ఒక వేదాలేకాక ఋషులూ, మునులూ, జ్ఞానులూ, యోగులూ, అందరూ ఏవస్తువును పొందగోరి దేనిని వెతుకుతున్నారో ఆ వస్తువేది? అది ఓంకారము. ఈ ఓంకారమును మాండూక్యము విరివిగానూ స్పష్టంగానూ చెప్పింది - 'శాంతం శివమద్వైతం చతుర్థం మన్యంతే ఆత్మా స విజ్ఞేయః' అని అనగా ఆ బ్రహ్మము శాంతమూ శివమూ. అంతేకాక అద్వయమైన విశ్వతైజసప్రాజ్ఞులకు మీదివస్తువూ అదియే; అట్టి ఆ ఆత్మ ఎరుగదగినదీ అని :

'విద్యాను శ్రుతి రుత్కృష్టా రుద్రైకాదశినీ శ్రుతౌ,
తత్ర పంచక్షరీ తస్యాం శివ ఇ త్యక్షరద్వయమ్||

వేదములో యజుర్వేదము మేలుబంతి. యజుర్వేదములో నాలుగవ కాండలో రుద్రము ఉండుటవల్ల నాలుగవ ప్రశ్నముదానికి మిక్కిలి. రుద్రము మధ్య పంచాక్షరి దాని కంటె దొడ్డది. ఆ పంచాక్షరిలోనూ రెండు అక్షరము లిను మిక్కిలి. ఆ అక్షరములు శివ అనునవి. ఈ అక్షరద్వయము జీవరత్నమని శ్రీమరప్పయ దీక్షితులవారు బ్రహ్మతర్కస్తవములో ఇట్లా చెప్పారు:

యజ్జీవరత్న మఖిలాగమ లాలనీయం
యే చ త్రినేత్ర మృడ శంకర నామధేయైః,
ఏతై రపి స్ఫుట మనన్యసమాశ్రయం తే
విఖ్యాప్యతే సకల జీవ సుఖ ప్రదత్వమ్.

అట్టి పరమమంగళమైన శివస్వరూపాన్ని అనుసంధానం చేయగోరేవారు చేయవలసిన పని ఏమిటి? మొదటిది విభూతిధారణ. విభూతి అనగా ఐశ్వర్యం అది అగ్నిలో కాలి శుద్ధమైన వస్తువు. ఈశ్వరుడు ఒంటినిండా భస్మ అలదుకుంటాడు. రెండవది రుద్రాక్షధారణ రుద్రాక్షం అంటే శివుని మూడవ కన్ను. ఇంతమంది దేవతలలో ఫాలమందు కన్ను ఉన్నవాడు ఆయన ఒక్కడే. మూడవది పంచాక్షరీజపము. పంచాక్షరీ మంత్రోపదేశం లేనివారు శివశివ అన జపం చేయాలి. నాలుగవది మారేడు దళాలతో శివుని పూజించటం. లక్ష్మి ఐదు చోటులలో ఎక్కువగా ఉంటుందట. మారేడు, ఆవు వెనుక తట్టు, పతివ్రతల పాపట, ఏనుగుతల పద్మము అనేవి లక్ష్మి నివాసస్థానాలు. అందుచేత లక్ష్మీప్రదమైన మారేడుదళాలతో చేసే పూజ శివునికి అత్యంత ప్రీతి కల్గిస్తుంది. ఐదవది హృదయంలో సదా సదా శివధ్యానంపై జెప్పిన వెలుపలి పూజతో పాలులోపల శివస్వరూపానుసంధానం ఎడతెగకుండా చేయాలి అని అభిప్రాయం.

సాయంకాలం సమయాన్ని ప్రదోషం అని అంటారు. త్రయోదశినాటి సంధ్యాకాలం మహాప్రదోషం. ప్రదోష సమయాలలో శివస్మరణ విధిగా చెయ్యాలి. కనీసం ఐదు నిమిషాలైనా ప్రదోషసమయంలో శివస్మరణ చేస్తారని సంకల్పం చేసుకొని మానసికంగా స్మరణమూ వాచికంగా శివశబ్దోచ్చారణమూ చేస్తే ఆత్మకు శ్రేయస్సు కలుగుతుంది.

శివ అంటే మంగళం. 'శ్వశ్రేయసం శివం భద్రరి కళ్యాణం మంగళం శుభం' అని అమరుడు. ప్రాయోపవేశానికి సిద్ధుడైన పరీక్షిత్తుకు శుకాచార్యులవారు భాగవతం వినిపించారు. దానిలో దక్షునికథ ఉన్నది. దక్షుడు శివద్వేషి, శివుడు మంగళస్వరూపుడు. అట్టి శివుని

ద్వేషించినవానికి అమంగళం అశివం కాక మరేమి తటస్థిస్తుంది? 'దాక్షాయణిదక్షునిచూచి
యద్ ద్వ్యక్షరం నామ గిరే రితం నృణాం

సకృత్ప్రసంగా దఘ మాశు హన్తి తత్,
పవిత్ర కీర్తిం త మలంఘ్య శాసనం
భవా నహూద్వేష్టి శివం శివేతరం||'

ఇదెక్కడి పాపం! నీవు శివుణ్ణే ద్వేషిస్తున్నావు! నీకు అశివమే ప్రాప్తించక ఓహో ఏంప్రాప్తిస్తుంది?

పూర్వం ఎవరైనా సహగమనంచేస్తే వారివస్త్రాలు భద్రపరచి కొలిచేవారట. మనోనిగ్రహం ఎంతో ఎంతో లేకపోతే సహగమనం చేసే ధైర్యం కలుగదు. అట్టి నిగ్రహంతో మనోనిశ్చయం చేసుకొని సహగమనం చేసినవారు ఆత్మజ్ఞానం కలవారితో సమానమైనవారు. అందుచేతనే పూజింపదగినవారు అయ్యేవారు. అట్టి సందర్భంలో అంబిక ఈ మాటలు చెప్పింది గనుక ఇది ముమ్మాటికీ సత్యం. నిప్పుగుండంలో శరీరం త్యాగం చేసేటప్పుడు చెప్పిన మాటకంటే నిక్కమైన మాట వేరే ఏమన్నా ఉంటుందా?

పాపాన్ని వొక్కకోణంలో పోగొట్టగలిగే వస్తువు ఒక్కటి ఉన్నది. దానికై అన్నిచోట్లా వెదకనక్కరలేదు. వేదాలకు జీవరత్నమూ, దేహానికి ప్రాణమూ, దేవాలయానికి మహాలింగమువలె వెలుగుచున్న శివ అనే రెండక్షరాలు పాపాన్ని పటాపంచలు చేయటానికి పరమౌషధం. మనిషి పుట్టక పుట్టి సాఫల్యం కోరేవానికి శివనామోచ్చారణ తప్ప వేరే ఉపాయంలేదు. పరమేశ్వరుడు మనకు నాలుక యిచ్చినందులకు ఫలం శివ శివ అని జపం చేయడమే.

అపి వా య శ్చాండాలః శివ ఇతి వచం విసృజేత్
తేన సహ సంవసేత్

అని శాస్త్రాలు చండాలునికి సైతం శివనామోచ్చారణం విధించినవి. సారాంశం ఏమిటంటే ఎప్పుడూ శివస్మరణం వైష్ణవ ప్రధానమైన భాగవతం శివనామ ప్రశస్తిని చెప్పటం మరొక విశేషం. ఒకానొక గొప్ప స్త్రీ ఒకానొక గొప్ప సమయంలో చెప్పిన మాటలు ఇవి.

పరమేశ్వరునికీర్తిని నోరారా వర్ణించడం చేతనూ వీనులారా వినడంచేతనూ మనము పవిత్రులము అవుతాము. అతని ఆజ్ఞ అనుల్లంఘనీయం, అతడు అంతటా నిండి ఉన్నాడు.

అహంభావమున్నవారిని ఆయన శిక్షిస్తాడు. తప్పుచేసిన పిల్లలను దండించే తండ్రివలె దేవతల నాతడు దక్షయజ్ఞంలో శిక్షించాడు. సముద్రమథన కాలంలో కాలకూటం పుట్టినపుడు ఆయన దానిని గుటుక్కున మింగి వానినందరిని రక్షించాడు. ఇట్లా రక్షణ శిక్షణాలు రెండూ చేయగల దక్షుడు ఆయన. పరమేశ్వరుని ముఖాముఖిగా చూడవనిలేదు. ఆయన నామం వొకటేచాలు. పాపపరిహారానికి శివనామం కంటె సులభోపాయంలేదు. ప్రదోషంలో శివ శివ అంటే చాలు. శిష్టులు సాయంసమయమున శివనామం చెప్పడం వాడుక. ఆపరమేశ్వరుడు వేదముల కన్నింటికీ తాత్పర్యం అనదగిన ఓంకార స్వరూపమై యున్నాడు. పరమేశ్వరుడు ప్రభవ బ్రహ్మమేకాక స్వరూప బ్రహ్మము కూడాను- 'సర్వే వేదా యత్ పదమామనన్తి' వేదములన్నీ ఓంకారాన్ని చెప్పినవి. సాయంసమయంలో శివధ్యానమూ ప్రదోష సమయంలో ఈశ్వరదర్శనమూ చేయాలి. దేవతలు శివదర్శనం కోసం శివాలయానికి ప్రదోష సమయంలో వస్తారట.

సాంఖ్య సూత్రాలు ఈశ్వరుణ్ణి త్రినేత్రుడని చెప్పినవి. అతడు మహాపురుషుడని యోగసూత్రాలలో పతంజలి –

'క్లేశ కర్మ విపాకాశయై రపరామృష్టః
పురుషవిశేష ఈశ్వరః'

అని అంటాడు.

'శబ్దాదేవప్రమితః' అని బ్రహ్మసూత్రములు చెప్పినవి.

ఇట్లా శ్రుతులూ, కర్మకాండకు చెందిన రుద్రమూ, జ్ఞానకాండకు సంబంధించిన ఉపనిషత్తులూ, సూత్రాలూ, పురాణాలూ పరమేశ్వరుని నామమాహాత్మ్యం వర్ణించినవి. ఈశాన శబ్దానికి ఏది అర్థమో అదే పరమేశ్వర స్వరూపం. శివశబ్దానికి దీర్ఘంతీస్తే శివా అని ఔతుంది. అది అంబికా నామం.

'యా తే రుద్ర శివా తనూ రఘోరఽపాపకాశినీ,
తయా నస్తను వా శంతమయ గిరిశం తాభిచాకశీహి'

- శ్రీరుద్రమ్.

'తతస్మైతే తనువౌ ఘోరాన్యా శివా న్యా'

- తై. సంహిత

పరమేశ్వరునికి రెండురూపాలు. పరమ మంగళమైన రూపం వొకటి. కంకాళంతోటి జూంజూరు జడలతో ఉన్న రూపం వొకటి.

సర్వమంగళానామం అంబికది.

'యాతే రుద్ర శివ తనూః శివా విశ్వాహ భేషజీ,
శివా రుద్రస్య భేషజీ తయా నో మృడ జీవసేః'

ఆ అంబికయే ప్రాణం. ఈస్వరూపద్వయమే జగత్తుకు తలిదండ్రులు.

'కో బ్రాహ్మణై రుపాస్యః?
గాయత్ర్యర్కాగ్ని గోచరః శంభుః'

అని ఆదిశంకరులు ప్రశ్నోత్తరమాలికలో చెప్పారు. గాయత్రి, సూర్యుడు, అగ్ని - వీనిలో ఉండేవాడు శివుడు. ఈ మూటిలోను పరమేశ్వరుని ఆరాధించవలెను.

'సౌరమండల మధ్యస్థం సాంబం సంసారభేషజం
నీలగ్రీవం విరూపాక్షం నమామి శివ మవ్యయమ్|'

అని మరొక శ్లోకం.

'యోరుద్రోగ్నౌ' అని శ్రీరుద్రం పరమేశ్వరుని అగ్ని స్వరూపాన్ని వర్ణించింది.

'శాస్త్రం శారీర మీమాంసా దేవః శ్రీ చంద్రశేఖరః
గురుః శ్రీ శంకరాచార్యః నంతు మే జన్మజన్మని||'

నేను ఎన్ని జన్మలెత్తినా నాకు చంద్రమౌళీశ్వరుడే స్వామి. శంకరాచార్యులే గురువు. ఏజన్మ యెత్తినా అన్ని అవస్థలలోను శివనామస్మరణ చేస్తే మనకు పరమశాంతి దొరుకుతుంది.

అపార కరుణాసింధుం జ్ఞానదం శాంతరూపిణం
శ్రీ చంద్రశేఖర గురుం ప్రణమామి ముదావహం ॥

--- “జగద్గురు బోధలు” నుండి

#KanchiParamacharyaVaibhavam #కంచిపరమాచార్యవైభవం
5/2/18, 07:11 - Paramacharyulu: స్వామి అంటే?

వైకుంఠంలో స్వామిఉన్నాడు, హృదయంలో స్వామి ఉన్నాడు. గుడులలో స్వామిఉన్నాడు అని మన పెద్దలు బోధించారు. గుడిలో స్వామి ఉన్నాడన్న నమ్మకంచేతనే మనం గుడులకువెళ్ళి దైవానికి సాష్టాంగ నమస్కారం చెయ్యడం, హృదయదేశంలో ఈశ్వరుడు ఉన్నాడన్న ఉద్దేశ్యంచేతనే శివపూజ చేసేవారు. మొదట శివునికి హృదయంలో వుపచారం చేస్తారు. అటుపిమ్మట మూర్తిలో ఆవాహన చేసి పూజాదికాలు ప్రారంభిస్తారు. వైకుంఠంలో విష్ణువు వున్నాడన్న రీతిగనే కైలాసంలో పరమేశ్వరుడు ఉన్నాడని కూడా పెద్దలు అంటున్నారు. వైకుంఠం పరమపదం. 'తద్విష్ణోః పరమం పదం' అని వేదవాక్యం. చనిపోయినా రనేదానికి వైష్ణవపరిభాషలో పరమపదించారు అని అర్థం. వైకుంఠవాసునికి మరొకపేరు పురుషోత్తముడు అంటే ఉత్తముడైన పురుషుడు అని అర్థం. తేట తెలుగులో చెపితే - 'పెద్దమనిషి'. ద్రావిడభాషలోని పెరుమాళ్ళు అనే శబ్దానికి పెరుం ్స పెద్ద, ఆళ్ మనిషి అని అర్థం. మిగిలినవారందరూ దేవుణ్ణి స్వామి అని అంటే వైష్ణవులు స్వామిని పెరుమాళ్ అనియే అనడం గమనించతగ్గది.

స్వామిశబ్దంలో స్వం - అనేదానికి సొత్తు అని అర్థం. స్వామిస్సొత్తుకలవాడు. ఒడయుడు, అయితే స్వామికి ఉన్న సొత్తు ఏమిటి? మనమే నా స్వామి అంటే నేను ఆయన సొత్తు అని అర్థం. తెలుగులోని ఒడయడు అనే పదానికి తమిళములోని ఒడయర్ అనేపదానికి సామ్యం స్పష్టంగా కనపడుతూనే ఉంది. నాలుగు, ఐదుశతాబ్దాలకు పూర్వం ఆలయ శాసనాలలో కూడా స్వామికి ఒడయర్ అనే పదం పర్యాయముగా వాడబడినది. కపాలీశ్వఒడయర్ నాగేశ్వర ఒడయర్ అన్న ప్రయోగములవల్ల స్వామికి ఒడయర్ అనేది పర్యాయమైనట్లు తెలుస్తూంది. బగవత్పాదులను 'శిక్కొడయర్' అని అన్నారు. కర్ణాటక భాషాజన్యమైన చిక్క శబ్దానికి 'చిన్న' 'చిరుత' అని అర్థం. కాంచీపురంలోని ఏకామ్రనాథుడు దొడ్డ ఒడయార్ అనగా దొడ్డప్రభువు.

చెన్నపురంచుట్టూవున్న తిరువళ్ళూరు మొదలగుమూడు తాలూకాలలో చిక్కొడయారు అనే ఆచార్యులకు కలంధాన్యానికి అళాకువంతున పన్ను చెల్లించవలసిందని తమ ప్రజలకు చోళరాజులూ, పల్లవరాజులూ శాసించారట. ఈ పన్ను భూమికి సంబంధించినది కనుక భూస్వాములు ఏమతస్థులైనా పన్ను చెల్లించవలసివచ్చేది. చెన్నపురపరిసర ప్రాంతాలకున్నూ కామకోటి మఠానికిన్నీ సంబంధము ఉండడంచేత మఠం యీ ప్రాంతాలకు చేరినదని వ్యక్తమగుచున్నది. కామకోటిపీఠానికి చెందిన ఒకరిద్దరుస్వాములకు కట్టిన బృందావనాలు తిరువెత్రియూరులో ఉన్నవి. తిరువెత్రీశ్వరుని ఆలయంలోనూ కంచి ఏకామ్రనాథుని దేవళంలోనూ చెన్నపురీశ్వరుని కోవెలలోనూ ఆదిశంకరుల విగ్రహం వున్నది. ఇట్లా రెండు మూడు దేవళాల్లో ఆదిశంకరుల విగ్రహాలు ఉండడం యితరత్రా కనపడదు. అందుచేత చెన్నపురికిచెందిన ప్రదేశాలు ఆచార్యులకు చాలా సొంతమైనవని వూహించడానికి వీలుగా ఉన్నది. స్వామి అనే పదానికి ఒడయర్ అని అర్థం అని విశదంచేసే సందర్భంలో యీ ప్రస్తావన వచ్చింది.

శ్రీరామానుజాచార్యుల వారికి కూడా ఒడయార్ అన్న పేరుండట స్వామి శబ్దానికి ప్రత్యామ్నాయమే.

స్వామి ఎక్కడున్నాడు? వైకుంఠములోను కైలాసంలోను హృదయంలోను ఉన్నాడన్న పెద్దలమాటకు అర్థం ఏమిటి? గుడులలో దేవుడువున్నాడంటే వెలుపల ఇక ఎక్కడా లేడనియా? ఒక్కొక్క గుడిలోనూ ఒక్కొ దేవుడు ఉన్నాడు. ఈ దేవుళ్ళు ఒక్కరా? నేను వేరా? ఆయన విశ్వమంతా నిండివున్నాడన్న విశ్వాసమున్నవారికి గుళ్ళకు గోపురాలకు వెళ్ళవలసిన పనియేమి? 'అటువైపు కాళ్ళుచాపకు' దేవుడున్నాడు అని మందలించి నప్పుడు ఇటువైపూ, ఇంకొకవైపూ దేవుడు లేడనియా?

దేవుడు ఎక్కడబడితే అక్కడ వెలసివున్నా ఆయన అనుగ్రహశక్తి ఆలయాలలో అధికంగా అభివ్యక్త మవుతూ ఉంటుంది. ఆశక్తి ఎట్లా ఆవిర్భవం అవుతుందీ అనే విషయం మనకు తెలియదు. మన దేవాలయాలు ప్రార్థనామందిరాలు కావనీ ఈశ్వరానుగ్రహార్థం శాస్త్రీయంగా కట్టబడ్డవనీ మనం తెలుసుకోవాలి.
సరే? స్వామి అంటే? మనమే. హిరణ్యశిపుడున్నూ ఈ విధముగానే అన్నాడని కొందరికి తోచవచ్చుకానీ అద్వైతం చొప్పున మనకున్నా స్వామికిన్నీ అభేదం. మనం కించిదజ్ఞులం. ఆయనైతే సర్వజ్ఞుడు 'బాగా ఉండిపోయే సామ్యం ఎల్లాకుదురుతుందండీ?' అని అంటారేమో! స్వామి ఎక్కడనో ఏరిపారేసినట్లు విడిగా ఉన్నాడేమో అని అనుకుంటారేమో, అలా అనుకోవద్దు. స్వామి మనమే అని మన ఆచార్యులు తెలియ చెప్పుతున్నారు.

సంధ్యావందనానికి ఉద్ధరిణి, పంచపాత్ర వీట్లతో కూర్చుంటాము. ఉద్ధరణిలోని నీరు పంచపాత్రలో నుండి వచ్చింది. పంచపాత్రలోనికి నీరు బిందెలోంచి వచ్చింది. బిందెలోని నీరు బావిలోంచి వచ్చింది. జలాశయాలలో జలధి పెద్ద. ఇట్లా వస్తుపరిమాణంలో భేదం ఉన్నప్పటికీ వస్తువేమో ఒక్కటంటే ఒక్కటే. మనం ఉద్ధరిణిలోని జలం అయితే. ఆయన సముద్రం. అదేవిధంగా మనం ఏ కొద్దిపాటి భారాన్ని మోయకలిగితే, ఆ చక్రధారి సర్వలోక భారము మోస్తున్నాడు. ఆయన సర్వశక్తిమంతుడూ, సర్వజ్ఞుడూ, మనకు ఒకనియతి ఉన్నది. ఆయన నిరవధికుడు. ఆయన దయాసముద్రుడు. శక్తి సముద్రుడు జ్ఞానసముద్రుడు. మనం ఆయన సొత్తు. ఇట్లా నిండివున్న స్వామిని కృష్ణభగవానుడు విస్తారంగా వర్ణించి ఉన్నాడు. భగవంతుని చరిత్ర ఎంత వ్యాపించిందో కృష్ణ శబ్దమే సూచిస్తుంది.

మహారాష్ట్రదేశంలో కృష్ణశబ్దం కిష్టోకిష్టూ అని పరివర్తనం చెందింది. కిష్టు శబ్దానికి క్రైస్టు శబ్దానికీ సంబంధం శ్రవణం గోచరంగా ఉంది. కృష్ణభగవానుడు పాదాంగుష్ఠంలో శిలీముఖం గుచ్చుకోగా దేహత్యాగం చేశాడని చదువుతున్నాము. క్రైస్తున్నూ శిలువమీద దేహత్యాగం చేసినాడు. ఇది పురాణాలలోని కృష్ణకథే కావచ్చు. ఉపనిషత్తులలో చెప్పబడిన విషయాలను చదివి అర్థాన్ని సరిగా గ్రహించలేనట్లుంది. జాకోబ్ అన్న పదం తీసుకుందాం అది హిబ్రూపదం. యాకోబ్ అని ఆపదం మారింది. జోసఫ్ అను పదం యూసఫ్గా పరిణమించింది. జమున-యమున, జాతర-యాత్ర జాదవ్-యాదవ్ అనే వైకృతులద్వారా 'జా' 'యా'గా మారుతుందని మనం ఊహించగలం. ఆదిలో ఆత్మమాత్రం ఉన్నదనీ, మాయాసంబంధం చేత జీవుడు సంభవించాడనీ ఆ జీవుడు పిప్పలమును (కర్మఫలమును) తింటున్నాడని ఒక ఉపనిషత్తులో ఉన్నది. ఆత్మను ఆడం అనిన్నీ, జీవుడిని ఈవ్ అనిన్నీ, పిప్పలమును ఆపిల్ అనిన్నీ గ్రహించినట్లు కనపడుతుంది. కృష్ణుడు గోపాలుడు. పశురక్షకుడు, యాదవుడు, క్రీస్తుసైతం గొల్లవాడే అని అన్నారు. క్రీస్తుచరిత్ర కృష్ణ చరిత్రలాగానే ఉన్నది. ఒక ప్రాంతంనుంచి మరొక ప్రాంతానికి ఏవిషయం వ్యాపించినా ఎంతో పరిణామానికి పాల్పడుతుంది. ఈరీతిగా ఎన్ని చేతులు మారి కృష్ణచరిత్ర క్రీస్తుచరిత్రగా అయిందో! అలెగ్జాండ్రియా పట్టణంలో జరిగిన ఎన్నో సమావేశాల ఫలితమే మనకిప్పుడు కానవచ్చే బైబిలు.

ఇంకొక్క విశేషం. మనుష్యుని 'మాన్' అని వారు అంటారు. ఇది మనుజశబ్దభవం. మనువునుండి కలిగినవాడు మనుజుడు. అందుచేత పురాణాలు క్రీస్తుతర్వాత రాయబడ్డవని మనం చెప్పలేము. ఇతర భాషాపదాలకు సరిగా అర్థం తెలియనప్పుడు సంస్కృతశబ్దార్థాలువానిని విశదీకరిస్తవి. పారసీకుల గ్రంథం 'జెందవెస్తా' 'సంధోవస్తా' అనేది 'జెంచవెస్తా' గా మారినట్లు తోస్తున్నది. ఋగ్వేదమంత్రాలు ఆ జెందవేస్తాలో ఆభాసగా ఉన్నవి. నవధాన్యాలు కలిసిపోతే ఎట్లా వేరుచేయలేమో అట్లే పాశ్చాత్య కథావాఙ్మయంలో మన పురాణ కథలు కలిసిపోయినయ్. క్రీస్తుచరిత్రకు మనపురాణాలే మూలం అని నా అభిప్రాయం. అయితే మిమ్ములను ఒప్పుకొని తీరవలసిందని చెప్పడం లేదు.

అసలు సుద్దికి వద్దాం. 'అన్నిటా దొడ్డవస్తువు స్వామి' అని శ్రీకృష్ణపరమాత్మ - ' ఓ అర్జునా! భూతా లన్నిటి హృదయంలోనూ చైతన్యం నేనే. పూలలో తావిని నేను. నెలలలో మార్గశిర్షాన్ని నేనే.

అపార కరుణాసింధుం జ్ఞానదం శాంతరూపిణం
శ్రీ చంద్రశేఖర గురుం ప్రణమామి ముదావహం ॥

--- “జగద్గురు బోధలు” నుండి

#KanchiParamacharyaVaibhavam #కంచిపరమాచార్యవైభవం
5/2/18, 16:05 - Paramacharyulu: ఇరవైరెండవ శ్లోక భాష్యం - ఆరవ భాగం

సౌందర్యలహరిలో మూడు నీరాజనములు ప్రస్తావించబడినాయి. మొదటిది : బ్రహ్మ, విష్ణు, ఇంద్రులు అంబిక పదములనంటి ప్రార్థించడం వలన ఆ కిరీట కాంతులచే ఈయబడిన హారతి. రెండవది అంబికలో ఐక్యమయిన భక్తునికి మహా ప్రళయాగ్ని కర్పూరహారతి అవుతుందని చెప్పడంలో మహాప్రళయాగ్ని అంబికకు నీరాజనమని చెప్పబడింది. మూడవది నూరవశ్లోకంలో చెప్పబడింది. ఈ మూడు  నీరాజనములు వరుసలో చెప్పబడకపోయినా సృష్టి, స్థితి, లయములచే ఏర్పరచబడిన నీరాజనములు. మొదట  నీరాజనము స్థితి సంబంధమైనది. స్థితి, సంరక్షణ అంబిక యొక్క ముఖ్య భూమిక. ఇది ఆమె కృపావిశేషం చేత నిర్వహించబడుతోంది. ప్రణవంలో సృష్టి స్థితి లయములు వరుసలు చెప్పబడినాయి. అ,ఉ,మ్-అంబికా ప్రణవమైన ఉమాలో ఉ,మ్,అ స్థితి, సంహారము, సృష్టికార్యములు చెప్పబడినాయి. ముకుందాదుల కిరీటముల చేత ఈయబడిన నీరాజనము స్థితి సంబంధమైన నీరాజనము. ఇక్కడ స్థితి మాత్రమే చెప్పబడినదనడానికి ఋజువు ఏమిటి? మనం సాధారణంగా త్రిమూర్తులను చెప్పేటప్పుడు బ్రహ్మ విష్ణు మహేశ్వరులని బ్రహ్మ తరువాత విష్ణువును చెబుతాము.

ఈ శ్లోకంలో స్థితికారకుడైన విష్ణువు ముందు చెప్పబడతాడు. లయ కారకుడైన రుద్రుని ప్రస్తావనే లేదు. దానికి బదులుగా ఇంద్రుడు ప్రస్తావించబడినాడు. ఇక ప్రళయాగ్ని చేత చేయబడే నీరాజనం లయకు సంబంధించిందన్న విషయం అందరమూ ఎరిగినదే!

ఇక నూరవ శ్లోకంలో నీరాజనం సృష్టికి సంబంధించింది. ఆచార్యులవారు ఈ స్తుతికావ్యము సృష్టించబడడానికి అంబికే కారణమనీ, ఆ స్తోత్రంలోనే ఆమెకు నీరాజనమెత్తుతున్నాననీ చెబుతున్నారు. అంబిక తన ఊహ, కల్పనల చేత ఏ విధంగా జగత్తును సృష్టిస్తోందో కవికూడా పద్యాలను పాటలను ఆ విధంగానే సృష్టిస్తాడు కాబట్టి అంబికయే ఆ కవి యొక్క కవిత్వానికి మూలకారణము. ఆచార్యులవారి కవిత్వానికి మూలమైన అంబిక సూర్యుని వంటిది. వారి కవిత్వం కర్పూర హారతి' వంటిది. అన్ని ఊహాపోహలకు, కల్పనలకు మూలమై సూర్యుని వంటి అంబికకు, తన ఊహచేత నిర్మితమైన చిన్న కర్పూరకాంతితో నీరాజన మెత్తుతున్నారు. మూడు నీరాజనములతో కూడిన ఈ సౌందర్యలహరి అంబికకు శుభ ప్రదమైన నీరాజనము. ఈ శ్లోకంలో మనం చూసింది ముకుందబ్రహ్మేంద్రుల కిరీటముల కాంతిచేత ఈయబడిన నీరాజనము.

సరి! త్రిమూర్తులను గురించి చెప్పేటప్పుడు బ్రహ్మవిష్ణు రుద్రులను చెప్పడం సంప్రదాయం. మరి వారు సృష్టి స్థితి సంహారములనే మూడు ముఖ్యమైన విధులను నిర్వర్తించేవారు కదా! మరి ఈ శ్లోకంలో ఆచార్యులవారు రుద్రుని వదిలివేసి ఇంద్రుని చేర్చడం వెనుక ఉన్న ఉద్దేశ్యమేమిటి? ఈ శ్లోకంలో త్రిమూర్తుల ప్రస్తావన వారికంటే అంబిక యొక్క ఉన్నతమైన స్థితిని గురించి చెప్పడం కాదు. ఆ పని వారు మొదటి రెండు శ్లోకాలలో చేశారు. ఈ శ్లోకంలో అంతటి ప్రధాన దేవతలు కూడా అంబిక పాదములను కొలుస్తారని చెప్పడం ప్రధాన ఉద్దేశ్యంగా కన్పిస్తుంది. ఇక్కడకూడా ఆచార్యులవారు ముగ్గురు ప్రధాన దేవతలా గురించి చెప్పారు. అందులో విష్ణువు మనఃస్థితికి, సంరక్షణకు కారకుడు. త్రిభువనములకు అధిపతి. మహేంద్రుడు స్వర్లోకాధిపతి. ఇక బ్రహ్మగారు దేవతలకు ఎటువంటి ఆపదలు వచ్చినా సలహాలిచ్చి వారితో అవసరాన్ని బట్టి వైకుంఠమో, కైలాసమో వెళ్ళి వారి సమస్యలను పరిష్కరిస్తూ ఉంటారు. ఇంద్రుడు ఒక దేవతలదైన స్వర్లోకానికి అధిపతేకాక తూర్పు దిక్కు పాలకుడు కూడా! కాబట్టి ఈ ముగ్గురు దేవతలకు కొద్దో గొప్పో స్థితి విధితో సంబంధ మున్నది. ఈ శ్లోకంలో అంబిక పదముల కెత్తిన నీరాజనం స్థితి సంబంధమైనది కాబట్టి సంహారమూర్తి అయిన రుద్రుడు చెప్పబడలేదు. ఇది ఒక కారణం కావచ్చు.

(సశేషం)

#KanchiParamacharyaVaibhavam #కంచిపరమాచార్యవైభవం
#ParamacharyaSoundaryaLahariBhashyam
5/3/18, 09:03 - Paramacharyulu: అహమేలేని ఆదిశంకరులు

'ప్రదీపజ్వాలాభి ర్దివసకర నీరాజనవిధి
స్సుధా సూతే శ్చంద్రోపల జల లవై రర్ఘ్యరచనా,
స్వకీయై రంభోభి స్సలిలనిధి సౌహిత్యకరణం
త్వదీయాభి ర్వాగ్భిస్తవ జనని వాచాం స్తుతిరియమ్.

నూరు శ్లోకాలు కల సౌందర్యలహరిలో చివరిది ఈ శ్లోకం. సౌందర్యాన్ని ఒకరు చూపనక్కరలేదు. అది స్వతహాగా కనపడేవస్తువు. కన్నులకు ఆనందమిచ్చేవి కొన్ని, చెవులకు ఆనందం యిచ్చేవి కొన్ని. శబ్దమాధుర్యం శ్రవ్య సౌందర్యం కలది.

భగవత్ పాదులు వ్రాసిన సౌందర్యలహరివంటి సుందరమైన కావ్యం అరుదు.
ప్రపంచంలో అందంగావున్నవని మనం అనుకునేవస్తువులన్నీ అంబికాకటాక్ష లేశమాత్రాన పుట్టినవే. సౌందర్య దేవతయేఅంబిక. ఆమెఅనుగ్రహం చేతనే ఆచార్యులవారి వాక్కు సౌందర్యలహరియై (లహరి అనగా ఏరు) ప్రవహించినది. సుందరములైన పురాతనపు శిల్పములు భగ్నమయితే, పోయిన భాగములను పూరిస్తామని ఏవైనా తెచ్చి అతికిస్తే బాగావుండదు. అల్లాగే బ్రహ్మదత్తమైన వాక్ సౌందర్యం కలవారికృతులలో ఒకమాటకు బదులు మరొకమాట వాడిచూద్దామని చూస్తే అతకదు ఆలోపం లోపంగానేనిలిచిపోతుంది. భగవత్ పాదుల సౌందర్యలహరి అట్టిదే. ఇట్టి కావ్యరత్నమును సృజించిన ఆచార్యులవారికి నేనువ్రాసితిని అన్న అహము లేశమాత్రమూ కనబడదు. సంక్రాంతినాడు సూర్యుని వెలుగులు ప్రసరించే చోటు గోమయంతో శుద్ధిచేసి ముగ్గులుతీర్చి దాని నడుమ సూర్యబింబమును వ్రాసి చెరకు, చెక్కెర, పొంగలి, కొబ్బరికాయ యీ మొదలైన వానిని నివేదనంచేసి సూర్యునకు నమస్కరించి నీరాజనం యిస్తాం. కప్పురపు వెలుతురెక్కడ? సూర్యప్రకాశమెక్కడ? పదినాళ్లు వరుసగా ప్రొద్దు పొడవకపోతే కర్పూరంకూడ వెలుగదు. అంబికా కరుణా కటాక్షాన చెప్పబడిన సౌందర్యలహరి ఆమెకే అర్పించడం సూర్యునకు ఇచ్చే నీరాజనం వంటిది. సూర్యకిరణాలు విశ్వమంతా వ్యాపించి వున్నవి. కాని వానిని ఒక భూత అద్దంలో కేంద్రీకరించి కింద బూరుగదూది నుంచితే దూది మండిపోతుంది. కేంద్రీకరణంవల్ల సూర్యరశ్మికి అంత దాహకశక్తి ఏర్పడుతుంది. అట్లే స్వామి సర్వవ్యాపకుడు. అయినప్పటికీ భక్తులను అనుగ్రహించటంకోసం ఆలయాలలో ప్రతిష్ఠింపబడి ఆర్తత్రాణ పరాయణమూర్తియై ఉండును.

ఆ పరమాత్మ అనుగ్రహం లేనిదే ఏకార్యమున్నూ జరగదు. మనం అనుక్షణంచేసే ఊర్పు నిట్టూర్పులు సైతం ఆయన కృపచేతనే. మంచికాని, చెడ్డగాని, ఏదైనా ఆ మహాశక్తి మనలో వుంటేనేకాని చేయలేము. ఆశక్తి లేనప్పుడు ఏమీలేదు. చరాచరాల అన్నింటికీ అధిష్ఠాత్రియైన, అన్నిటినీ నడిపే ఆమెకే పరాశక్తి అనిపేరు.

అన్నిటికీ కారణం ఆమె ఆమె ఆధారశక్తి, అనంత శక్తి, సర్వవ్యాపిక అయినాఅచింత్యశక్తి అయిన ఆమె మహా తపస్సంపన్నులైన ఋషులచేతనూ మహనీయులచేతనూ ఆలయాలలో ప్రతిష్ఠచేయబడి ఆయా క్షేత్రాలలో తీర్థాలలో విశేషానుగ్రహ సమర్థయై, కేంద్రీకృతమైన రవి రశ్మివలె ప్రకాశిస్తూ వున్నది.

సూర్యోపమానంవదలి చంద్రోపమానం చేసిచూద్దాం. చంద్రుడు ఉదయింపగానే ఆ చలిమరిలో, వెన్నెలలో చంద్రకాంతశిల అమృతం

ప్రవిస్తుందట. ఈ సూర్యకాంత చంద్రకాంత శిలల నిజానిజాలు వైజ్ఞానికులకు వదలవలె. ఈనమ్మిక అనుశ్రుతంగా వస్తున్నది. మిణుగురు పురుగులనూ, రాత్రి మిలమిల మెరిసే జ్యోతిర్లతలు అనే లతావిశేషాలనూ పరికించి చూస్తే మనకీ శిలల విషయం ఆశ్చర్యంకాదు.

చంద్రకాంతశిల చంద్రుని అమృతకిరణముల స్పర్శచే కరిగిపోతుంది అని అనుకుందాం. ఇది వాస్తవమే కావచ్చు. ఒకవేళ చంద్రుడే లేకపోతే?

సౌందర్య దేవతవు నీవు. వాక్కనే అమృతానికి వారిధియైన వాగ్దేవివినీవు. ఆ సారస్వత సముద్రంలోని జలకణమే నా వాక్కులో వున్నది. నీవు లేకపోతే - నీ అనుగ్రహం లేకపోతే వాక్ సంపత్తి నాకేదీ? అమృతం కురిసేవాడు చంద్రుడు. అతడు అమృతకిరణుడు. తాపహారి. నాకృతి దివాకరునికి ఎత్తిన దివ్వెవలె చంద్రునకు ఇచ్చిన చంద్రకాంత శిలాసలిలార్ఘ్యంవలే ఉన్నది. సముద్రుని దగ్గరకు వెళ్ళి దానిలోని (ఉప్పు) నీరే తీసికొని 'అపోహిష్ఠా' అనీ స్నానము అర్ఘ్యము పాద్యము ఆచమనము చేసినట్లవుతుంది అని భగవత్ పాదులు ఈ శ్లోకంలో వ్రాశారు.

మనం అనుదినమూ ఎన్నోపనులు చేస్తున్నాం. ఈపనులన్నీ ఎవరు చేస్తున్నారు? నేను చేస్తున్నాను అనే అహం భావం కలగడానికి ఏమాత్రమూ ఆస్పదంలేదు? నిరభిమానం కలగాలి. కొందరు నిజంగానే నిరభిమానులై వుంటారు. నేను నిరభిమానిని అన్న అభిప్రాయం తనకు ఉంటే అదిన్నీ ఒక అభిమానమే. అందుచేత అతిజాగ్రత్త అత్యవసరం.

కొంచెం ఆలోచించి చూద్దాం. మనం దేనిని చూచి అహంభావం పొందాలి? మనకు ఏ పని కావలసివున్నా శక్తి అవసరం. ఆశక్తియే అంబిక. ఆమె నిండు సముద్రంవలె వున్నది. మన శక్తులన్నీ ఆ సముద్రంలోని కణలేశమే. ఆమె కృపవలననే యిన్ని మాటలు మాటాడుతున్నాం యిన్ని పనులు చేస్తున్నాం. ఈనిజం గ్రహిస్తే అహంకారానికి తావేదీ?

ఆచార్యులవారిది ఒక అపూర్వమైన అవతారం. సత్యదర్శనానికి తహతహ లాడేవారు ఆచార్యులవారిని అనుగమించేది. తత్త్వజ్ఞానం తెలిసికొనగోరేవారు ఆచార్యులవారి గ్రంథాలను చూచేది. వారికి గల గౌరవం అసమానం. వారి గ్రంథాలకు గల ప్రశస్తి అత్యధికం. వారికీర్తి భారతదేశమే కాక విదేశాలకు కూడా ఎప్పుడో పాకిపోయింది.

సయాం, కంబోడియా దేశాలలో పురావస్తుపరిశోధకులకు కొన్ని ప్రాచీన సంస్కృతి శిలాశాసనాలు దొరికినవి. ఆ శాసనాలలో ఒకటి ఆచార్యులవారి ప్రశంసవున్నది.

యే నాధీతాని శాస్త్రాణి భగవచ్ఛంకరాహ్వయాత్|
నిశ్శేష సూరిమూర్ధాళి మాలా లీఢాంఘ్రి పంకజాత్||

అన్ని శాస్త్రాలూ ఆలోచనచేసి నిర్ధారణచేసిన భగవచ్ఛంకరులు నాకు ఆచార్యులు, నేను వారిసన్నిధిలో అధ్యయనం చేశాను అని కంబోడియాలోని ఒక ఆలయప్రతిష్ఠాపకులు వ్రాసికొన్న శిలాశాసనములో ఉన్నది. ఆచార్యుల వారిని గూర్చి ఎచ్చట ప్రస్తావన వచ్చినా భగవచ్ఛంకరులనే వ్రాయుదురు.
అట్టి మహనీయులు భగవచ్ఛంకరాచార్యులువారు 'నేను సౌందర్యలహరి చెప్పాను; అది నీ అనుగ్రహమే కాదా? నీవు దయతో ఇచ్చిన వాక్కుతో నిన్ను స్తుతిచేయడం సూర్యునికి దివ్వె యెత్తినివాళించడం. చందమామకు చలువరానీరితో అర్ఘ్యమెత్తడం, మున్నీటికి మున్నీటినీటనే చలువ చేకూర్చడం' అని వ్రాసుకుంటే మనవంటి తెలివికలవారు 'ఉప్పు లేక ముప్పందుం తిన్నాం' అని దురభిమానం పొందవచ్చా?

మనలో సాహిత్యపరులున్నారు, వాగ్ వైదుష్యం కలవారున్నారు. వీరిని ఇతరులూ, పొరుగువారూ కొనియాడవచ్చు. కాని 'నాకు ఇట్టి యోగ్యత యున్నదా?' అని కొనియాడబడేవాడు ఆత్మపరీక్ష చేసికోవాలి. అంతా అమ్మ పెట్టిన భిక్ష. ఎవ
రెవరిట్లాకొనియాడబడుతూవుంటారో వారి వారికి అందరికీ అమ్మబిచ్చమే ఎవరికడనుండి ఆ శక్తి వస్తుందో ఆ శక్తిని వారికే సమర్పణ చేసికోవాలి. అపుడాయమ్మ కనుగ్రహం కలుగుతుంది. 'అహం' లేకుండా మన మంచి చెడుగులన్నీ ఆమెకు అప్పనంచేసి ఆమె అడుగులకు అప్పసమూ తల పోసికొంటుంటే మనకేకాక లోకానికి కూడా క్షేమం కలుగుతుంది.

అపార కరుణాసింధుం జ్ఞానదం శాంతరూపిణం
శ్రీ చంద్రశేఖర గురుం ప్రణమామి ముదావహం ॥

--- "జగద్గురు బోధలు" నుండి

#KanchiParamacharyaVaibhavam #కంచిపరమాచార్యవైభవం
5/5/18, 07:31 - Paramacharyulu: ఇరవైరెండవ శ్లోక భాష్యం - ఏడవ భాగం

సిద్ధాంత పరమైన ఇంకొక కారణం చెప్పుకోవాలి. సత్వరజస్తమోగుణములకు అతీతమైన తురీయస్థితి ఒకటున్నది. సత్వమునకు స్థితికారకుడైన విష్ణుమూర్తి, రజస్సునకు సృష్టికారకుడైన బ్రహ్మదేవుడు, తమస్సునకు సంహారకారకుడైన రుద్రుడు దేవతలుగా ఉన్నారు. నాల్గవదయిన తురీయము నిర్గుణము. పరబ్రహ్మకు సంబంధించినది. అక్కడ విధులేవీ లేవు. పేరే సూచించనట్లు గుణములు కూడా లేవు. సృష్టి స్థితి సంహారములు మానవజీవితంలో వరుసగా జాగ్రత్(మెలకువ) స్వప్న (కల) సుషుప్తి(నిద్ర)లకు సంబంధం కలిగి ఉన్నాయి. తన ఊహలతో మానవుడు కలలో అనేక మానవులను, వస్తువులను, ప్రదేశాలను చూస్తాడు. ఇది ఒక రకంగా సృష్టేకదా! మెలకువగా ఉన్నప్పుడు ప్రపంచవ్యవహారాలను నిర్వర్తిస్తాడు. ఇది స్థితి. సుషుప్తిలో అన్ని కార్యములు భావములు అణిగిపోయి ఒక విశ్వస్థితి ఏర్పడుతుంది. ఇది సంహారము. లేక లయ. మనిషి నిద్దురలో ఉన్నప్పుడు కూడా అతని లోపల ఒక జీవశక్తి దేనికీ సంబంధం

లేకుండా ఉంటుంది. అది తురీయము (నాలుగవది) - ఇది జాగ్రత్స్వప్న సుషుప్తులకు అతిరిక్తమైనది. అజ్ఞాన దశలో సాధన లేని మనవంటి వారికి అది తెలియదు. మాండూక్యోపనిషత్తులో దీనిని మనకు తెలిసిన భాషలో చతుర్థ (నాలుగవది) అన్నారు. జాగ్రత్స్వప్న సుషుప్తులు మనుష్య జీవనానికి అంటే పిండాండమునకు సంబంధించినవి. సృష్టి స్థితి సంహారములు బ్రహ్మాండమును నడిపించే ఈశ్వరునకు చెందినవి.

తురీయము మాత్రము ఇద్దరికీ సమానమైనది. కార్యములే లేని నిర్గుణ పరబ్రహ్మ సగుణ బ్రహ్మ అయిన ఈశ్వరునకు తురీయమైన సత్యమై ఉంటాడు. అలాగే మానవజీవితంలో జాగ్రత్స్వప్న సుషుప్తులకు మూలమై తురీయమైన ఆత్మ ఉంటుంది.

పరబ్రహ్మ లేక ఆత్మస్థితి అయిన ఈ తురీయాన్ని, అలా కనిపించకపోయినప్పటికీ, సంహారము లేక లయము దగ్గరగా ఉంటుంది. మనస్సు అణిగి తురీయసమాధిలో ఉన్నప్పుడు ఉన్న ప్రశాంతత, నిర్మలత్వము జాగ్రత్స్వప్న దశలలో సంభవం కాదు. కలలు లేని సుషుప్తిలో మాత్రమే అటువంటి ప్రశాంతత సాధ్యం. అయితే ఆ ప్రశాంతతను అనుభవించి ఆనందస్థితిలో ఉండే స్పృహ అక్కడ ఉండదు. తురీయ సమాధిలో మాత్రమే అటువంటి ఆనందస్థితి సాధ్యమవుతుంది.

జాగ్రత్స్వప్న దశలలో మనం మనస్సులోను చేయబడే గందరగోళంతో పోల్చుకుంటే సుషుప్తిలోని స్థితి తురీయానుభూతికి దగ్గరలో ఉంటుంది. దీనినే విస్తరిస్తే లయం ద్వారా రుద్రుడు జీవులకు ప్రసాదించే తాత్కాలికమైన శాంతి, సృష్టి స్థితులలో బ్రహ్మ విష్ణువులు ఇచ్చేదాని కంటే, అత్యంతికమైన శాంతికి లేక పరబ్రహ్మస్థితికి దగ్గరలో ఉంటుంది. ఈ పరబ్రహ్మను శైవ-శాక్త సంప్రదాయాలలో 'శివం' అంటారు. అందువల్లనే వారిరువురి మధ్య ఎంతో తేడా ఉన్నప్పటికీ రుద్రుడు శివునిగా పిలవబడుతున్నాడు. రుద్రుడు సంహారకారకుడు. మహేశ్వరుడు తిరోధానము నను గ్రహించేవాడు. సదాశివుడు ఆత్యంతికమైన ముక్తిని ప్రసాదించేవాడు. ఈ పంచకృత్యములకు పైన జ్ఞానులు నిష్క్రియుడైన పరబ్రహ్మగా చెబుతున్న స్థితిని “శివం” అంటారు. సాధారణ మానవులకు రుద్ర, ఈశ్వర, శివ, శివంల మధ్య అంతరం తెలియదు. అయితే బ్రహ్మవిష్ణులు మాత్రం మరి ఏ ఇతర దేవతల వలెనూ గుర్తించబడరు.

(సశేషం)

#KanchiParamacharyaVaibhavam #కంచిపరమాచార్యవైభవం
#ParamacharyaSoundaryaLahariBhashyam
5/7/18, 12:58 - Paramacharyulu: ఇరవైరెండవ శ్లోక భాష్యం - ఎనిమిదవ భాగం

శివుని గురించి చెప్పినదే అంబికకూ వర్తిస్తుంది. పరబ్రహ్మ శక్తి అయిన పరాశక్తి రుద్రుని భార్య అయిన పార్వతిగా భావించబడుతుంది. కానీ ఎక్కడా పరాశక్తి లక్ష్మిగానో, సరస్వతిగానో భావించబడదు. సౌందర్యలహరిలో కూడా ఆమె పార్వతి నామములయిన హిమగిరిసుత, తుహినగిరికన్యగా సంబోధించబడుతుంది. కానీ ఒక్కచోటకూడా సరస్వతి లేక లక్ష్మి నామములతో పిలవబడలేదు.

రుద్రుడొక్కడే శివుని వంటివాడని మనం గుర్తించాలి. బ్రహ్మవిష్ణువులు కారు. తమ కిరీటముల తళుకులతో అమ్మ పాదములకు నీరాజనమెత్తే దేవతలను పేర్కొవాలనుకున్న ఆచార్యులవారు, ప్రపంచ పద్ధతికి వ్యతిరేకంగా ఉందన్న ఉద్దేశంతో, ఆమె భర్త పేరు ఉటంకించదలుచుకోలేదు. తరువాత భాగంలో గొప్ప కవితారసంతో చేసిన శ్లోకంలో పరమశివుడు పరాశక్తి పాదములపై పడ్డాడని చెప్పారు. అది ప్రణయకలహం తరువాత. అయితే వాదతంత్రశాస్త్రపు సిద్ధాంతముకు ప్రాధాన్యత ఇచ్చిన ఆనందలహరీ భాగంలో అటువంటి సంఘటన పెట్టదలుచుకోలేదు.

మొదటి శ్లోకంలోనే పరమశివుడు కదలడానికి కూడా అంబికతో కలిసి ఉండాల్సిందేనని చెబుతూ అంబిక ఔన్నత్యాన్ని చాటిచెప్పారు. రెండవ శ్లోకంలో అంబిక పాద పాంసువును గ్రహించి లయకార్యమును చేస్తాడని చెప్పబడింది. ఆచార్యుల వారికి మాటిమాటికీ శివుని స్థితి అంబిక ముందు కించ బరచడం ఇష్టం లేకపోయిందో ఏమో ముకుంద బ్రహ్మేంద్రాది దేవతల గురించి చెప్పినపుడు మహాదేవుడైన ఈయనను మాత్రం గ్రహించలేదు. ఈ శ్లోకంలో ప్రధానులైన దేవతల గురించి చెప్పడమే ఉద్దేశ్యంకానీ త్రిమూర్తులను ఉదహ రించాలనికాదు. అటువంటి సందర్భంలో పరమశివునితో సామ్యమున్న, అప్పుడపుడు ఈ సామ్యతచేత పరమశివునిగానే పిలవబడుతున్న రుద్రుని చెప్పడం దేనికనుకున్నారు.

ఇరవై అయిదవ శ్లోకంలో శివుడుకూడా ఆమె పాదముల నాన్చిన శిరస్సు గలవాడని సూచించబడి ఉన్నదికదా అని ప్రశ్నించవచ్చు. అక్కడ స్పష్టంగా త్రిమూర్తులగురించి చెప్పబడిఉంది. “త్రయాణాం దేవానా త్రిగుణజనితానాం తవ శివే” నీ గుణములైన సత్వరజస్తమోగుణములనుండి పుట్టిన ముగ్గురు దేవతలు - రుద్రుడు ఆమె తమోగుణం నుండి పుట్టాడు. ఇలా పుట్టిన త్రిమూర్తులలో ఒకడైన రుద్రుడు ఆమె పుత్రుని వంటివాడేకదా! అంబిక భర్త అయిన పరమశివుడు ఆమెకు నమస్కరిస్తున్నట్లుగా అభివర్ణితమవలేదు అని చెప్పడానికే నని చెబుతున్నారు. 25వ శ్లోకంలో త్రిమూర్తుల గురించి ప్రస్తావన మాత్రమే ఉన్నది. త్రిమూర్తులలో ఒకడు కాబట్టి రుద్రుడు కూడా తీసుకోబడుతున్నాడు. అయితే దేవతలు కూడా ఆమెకు నమస్కరిస్తారని చెప్పవలసినపుడు మహాప్రళయకాలంలో మిగిలిపోయే ఒకే ఒక్కని గురించి ఆచార్యులవారు ప్రస్తావించలేదు.

(సశేషం)

#KanchiParamacharyaVaibhavam #కంచిపరమాచార్యవైభవం
#ParamacharyaSoundaryaLahariBhashyam
5/7/18, 16:48 - Paramacharyulu: శివుని చిహ్నములు

అర్ధ నారీశ్వరత్త్వం సృష్టికీ, పరమేష్టికీ, మాతాపితృ సంబంధానికి చిహ్నంగా ఉన్నది. ఈ సంబంధమేకాక మరికొన్ని సంబంధాలు

ఉన్నాయి. శ్రీ దక్షిణమూర్తిస్తోత్రంలో శ్రీభగవత్పాదులు అన్నారు-

విశ్వం పశ్యతి కార్యకారణతమా స్వస్వామి సంబంధతః
శిష్యాచార్యతయా తథైవ పితృపుత్రాద్యాత్మనా భేదతః,
స్వప్నే జాగ్రతి వాయఏష పురషో మాయా పరిభ్రామితః
తస్మై శ్రీగురుమూర్తయే నమ ఇదం శ్రీదక్షిణామూర్తయే||

జీవుడు మెలకువలోనూ కలలోనూ ఈ విశ్వంలో కొన్నింటిని కార్యాలుగానూ కొన్నింటిని కారణాలుగానూ కొందరను దొరలగానూ, కొందరను బంటులనుగానూ, కొందరను గురువులనుగానూ, కొందరును శిష్యులనుగానూ, కొందరను కొడుకులనుగానూ, మరికొందరను తండ్రులనుగానూ చూస్తూ మాయచే భ్రమసి నానాజ్ఞానాలతో నిండియున్నాడు. నిజానికి ఈ జీవుడు దేవుడే, పరమాత్మే; ఇవి అన్నీ అసత్యాలే అని దీని భావం.

ఈశ్వరుడు 'జగతీనాంపతిః'. అందుచే మనమందరమూ ఆయన సేవకులం. మన అజ్ఞానం తొలగించి సద్గురువై జ్ఞానదానం చేసేదీ ఆయనే. భక్తితో ఆయనకు ఒక్క బిల్వదళం అర్పిస్తే చాలు. ఆ ఆశుతోషుడు సంతోషించి తన కరుణా పూరితాపాంగవీక్షణం మనపై ప్రసరింపజేస్తాడు. మనకు ఐహిక సంపదయేకాక ఆముష్మికసంతోషం కూడా ఇస్తాడు. ఈ విషయమే ఈ క్రింది శ్లోకంలో ఉన్నది.

''త్రిదళం త్రిగుణాకారం త్రినేత్రం చ త్రయాయుషమ్,
త్రిజన్మ పాపసంహార మేకబిల్వం శివార్పణము||''

బిల్వం అతిపవిత్రమైనది. ఇది మూడుదళాల కూడిక. శివునికి మూడు కన్నులున్నట్లు బిల్వానికి మూడు దళాలు ఉంటవి. అది లక్ష్మికి వాసస్థానం. అందుచేతనే లక్ష్మీ అష్టోత్తరంలో 'బిల్వనిలయాయై నమః' అన్న ఒక నామం ఉన్నది. శ్రీ సూక్తమున్నూ-

''ఆదిత్యవర్ణే తపసోధిజాతో
వనస్పతి స్తవవృక్షోథ బిల్వః'
తస్యఫలాని తపసానుదన్తు మాయా
అన్తరాయాశ్చ బాహ్యాఅలక్ష్మీః||''

అనిచెప్పుతున్నది. బిల్వదళోపరిభాగాలలో (వెనుకవైపు) శ్రీలక్ష్మీదేవి ఉన్నట్లు మన నమ్మిక. అందుచేతనే లింగానికి బిల్వపు వెనుకభాగం తగిలేటట్లు మనం అర్చిస్తాము.

మనం కొన్ని శివచిహ్నాలను ధరించాలని శాస్త్రంనిర్దేశిస్తున్నది. అది విభూతి నుదుట పూసుకోవడం' రుద్రాక్షలను ధరించడం. అంతేకాదు, మన జిహ్వ పంచాక్షరీమంత్ర పరాయణమై పోవాలి. హృదయం స్ఫాటికవర్ణంతో వెలిగిపోయే ఆ శివస్వరూపానుసంధానం చేయాలి. ఆ హిరణ్యబాహువును మన హస్తాలతో బిల్వదళాలతో అలంకరించాలి.

రుద్రాక్షవృక్షాలు నేపాళంలోనూ, జావా బలిదీవులలోనూ ఉంటున్నవి. నడుమ తొఱ్ఱగలిగిన పండు సృష్టిలో ఇది ఒక్కటే, ఒకమూలాగ్రువ్వబడటం తక్క రుద్రాక్షలకు వేరే ప్రయోజనమున్నట్లు కనిపించదు. సృష్టికర్త ఉద్దేశమూ అదేనేమో. బత్తాయిబలిస్తే అందు వివిధముఖాలున్న తొనలున్నట్లు రుద్రాక్షలకూ ముఖాలున్నాయి. ఏకాదశముఖాల తోడి రుద్రాక్షలను శివభక్తులు ధరిస్తారు. ఆరు ముఖాలున్న రుద్రాక్షలను సుబ్రహ్మణ్యుని (షణ్ముఖుడు) భక్తులు ధరిస్తారు. ఏకముఖ రుద్రాక్షమున్నూ కలదు. కాని దొరకడం కష్టం. దాని వెల అత్యధికం.

పంచాక్షరీ మంత్రరాజం యజుర్వేదాంతర్గతమైన రుద్రంలో వస్తుంది. 'నమశ్శివాయ' అనే ఆమంత్రంలోశివశబ్దం దాని జున్ను. పాపపరిహారానికి పంచాక్షరిని మించిన విద్య లేదు.

గోవు మనకు చాలా పవిత్రమైనది, ఏ మృగపు పురీషమయినా సరే; కంపుకొడుతూ దుర్గంధభూయిష్ఠంగా ఉంటుంది. ఒక్క గోసంబంధమైనది మాత్రం అలాఉండదు. గోమయానికి వాసన లేకపోవడమేకాదు. అది ఎక్కడైనా దుర్గంధం ఉంటే దానిని పోగొట్టుతుంది. పూర్వులు తమ ఇండ్లను గోమయాలం కృతం చేయడానికి ఇదే కారణం. గోమయంతో చేసిన విభూతి కూడా చాలా పవిత్రమైనది.

ఈ బాహ్యచిహ్నాలూ - ఈ శివచిహ్నాలు అంతశ్శుద్ధినీ కలిగిస్తవి. అందుచే అనుష్ఠానాలను విధ్యుక్తంగా చేయడం, శివనామాన్ని జపించడం, శివస్వరూపానుసంధానం చేయడం మనకు ముఖ్యధర్మం. ఇట్లు చేసినామంటే ఈశ్వరప్రసాదంవల్ల మన శ్రేయస్సేకాక జగత్ సౌఖ్యమూ సిద్ధిస్తుంది. సైనికులున్నారు. వాళ్లకు ప్రత్యేకమైన దుస్తులుంటాయి. కవాతు, శిక్షణలతో పాటు ఈదుస్తులూ వారి కొక వీరోచితమైన భావాన్నీ ఉద్రేకాన్నీ కలిగిస్తవి. అట్లే మనం ఈ బాహ్యశివచిహ్నాలను ధరించడంవల్ల మన శివభక్తిని పెంపొందించుకొంటాము. చిత్తవిక్షేపాన్ని తొలగించడానికి ఎన్నో మార్గాలున్నది. యోగశాస్త్రము 'వీతరాగ విషయం వా చిత్తం. అని చెప్పుతున్నది.

ప్రాణాయామమూ ఈ ధారణకు ఒక మార్గమే. ఏదన్నా సంతోషవార్త వింటే మన ఉచ్ఛ్వాస నిశ్వాసాలు కొన్ని క్షణాలు కట్టుబడతై. దుఃఖవార్తలు విన్నప్పుడూ ఇంతే. ఆ క్షణంలో మన మనస్సు నిర్వికల్పంగా ఉంటుంది. దీనివల్ల ఉచ్ఛ్వాస నిశ్వాసాలకీ, మనస్సుకూ ఒక సంబంధం ఉండదని మనం సులభంగ గుర్తించవచ్చు. అందుచే ''ఈ బాహ్యచిహ్నాలవల్ల సంస్కారాలవల్ల ఏమి ప్రయోజన ముంటుంది?'' అని మనం అనుకోరాదు. అవి అతంశ్శుద్ధికి సాధకాలు అవుతవి. మన మందరమూ ఈ అతంశ్శుద్ధికి పాటుపడి ఈశ్వరప్రణిధానం చేయాలి. ఇది మనకు కర్తవ్యం.

అపార కరుణాసింధుం జ్ఞానదం శాంతరూపిణం
శ్రీ చంద్రశేఖర గురుం ప్రణమామి ముదావహం ॥

--- “జగద్గురు బోధలు” నుండి

#KanchiParamacharyaVaibhavam #కంచిపరమాచార్యవైభవం
5/8/18, 07:02 - Paramacharyulu: శాతాభిషేకం - శివ సాయుజ్యం

ఈ సంఘటన చెన్నై భక్తుడు శ్రీ వెంకటరమణి చెప్పినది. వారు మూడు తరాలుగా కంచి మఠానికి భక్తులు. వారి తండ్రిగారు కామాక్షిపురం శ్రీ వైద్యనాథ అయ్యర్, పరమాచార్య స్వామివారికి పెద్ద భక్తులు. పరమాచార్య స్వామివారి ఆదేశాలను వారు శ్రద్ధాభక్తులతో అమలుపరిచేవారు. స్వామివారు కూడా వారిపై అత్యంత కరుణను చూపించేవారు. ఆయనకోసమని ఏదీ చేసుకోలేదు. కనీసం వారు అరవై, డెబ్బై ఏళ్ల వయస్సులో జరిపే షష్ట్యబ్దిపూర్తి, భీమరథ శాంతులు కూడా చేసుకోలేదు. జీవితంలో ప్రతీది ఈశ్వరార్పణంగా చేశారు. వారి భార్యకు కూడా ఇటువంటి వాటిపై ఆసక్తి ఉండదు.

కాని వారికి ఏనాభైనాలుగేళ్ళ వయస్సప్పుడు శాతాభిషేకం చేయాలని సంకల్పించారు. పిల్లల బలవంతం పైన, పరమాచార్య స్వామివారి ఆశీస్సులు అర్థించమని, వారు ఒప్పుకుంటే జరుపుకుంటానని చెప్పారు. వెంటనే వెంకటరమణి తన తల్లిని చెల్లిని తీసుకుని కాంచీపురం దగ్గరలోని ఒక పల్లెలో మకాం చేస్తున్న మహాస్వామివారి వద్దకు వెళ్ళారు. స్వామివారు నివసిస్తున్న గృహం ముందరే స్వామివారి దర్శనం లభించింది. పరమాచార్య స్వామివారు ఒక దుర్భిణి సహాయంతో ఏదో పుస్తకాన్ని చదువుతున్నారు. పళ్ళు, పూలు, టెంకాయలు, తాంబూలం ఉన్న పళ్లాన్ని పరమాచార్య స్వామివారి ముందు ఉంచి విషయం తెలిపారు.

“శాతాభిషేకం పెద్దాయనకా?” అని అడిగారు కానీ, ఎప్పుడూ ఇచ్చినట్టు వారికి ప్రసాదం ఇవ్వలేదు. మరలా పుస్తక పఠనంలో మునిగిపోయారు. కొద్ది నిముషాల్లో దంపతులొకరు తమ కుమార్తె వివాహమై పరమాచార్య స్వామివారి ఆశీస్సుల కోసం వచ్చారు. స్వామివారు వారి పళ్లాన్ని స్వీకరించి పెళ్ళిపత్రికను తమవద్ద ఉంచుకున్నారు. సంతోషంతో వారు వెళ్ళిపోయారు.

ఇది చూడగానే, తల్లి, చెల్లితోపాటు వెంకటరమణి కూడా కాస్త నొచ్చుకున్నాడు. మమ్మల్ని మాత్రమే పరమాచార్య స్వామివారు ఆశీర్వదించలేదని కలతచెందారు. వారితోపాటు అక్కడున్న ఇంకొందరిని పుదు పెరియవ (జయేంద్ర సరస్వతి స్వామి) తో ప్రసాదం తీసుకోవాల్సిందిగా ఆదేశించి లేచి తమ గదిలోకి వెళ్ళిపోయారు.

జయేంద్ర సరస్వతి స్వామివారి వద్ద ప్రసాదం దొరికినా, పరమాచార్య స్వామివారు ప్రసాదం ఇచ్చేదాకా వెళ్లకూడదని నిశ్చయించుకున్నారు. వారు అక్కడే నిలబడియుండగా, “మీ తండ్రిగారికి వెంటనే శాతాభిషేకం నిర్వహించండి” అని ఆజ్ఞాపించారు కాని ప్రసాదం ఇవ్వలేదు. సగం సంతోషంతోనే చెన్నై వెనుతిరిగారు.

మరుసటిరోజు కంచిలో నివసించే వారి బంధువులొకరు పరమాచార్య స్వామివారి దర్శనానికి వెళ్ళినప్పుడు ప్రసాదం తీసుకుని చెన్నై వెళ్ళమని ఆదేశించారు. “వెళ్లి వారితో చెప్పు మీ తాతగారికి వెంటనే శాతాభిషేకం నిర్వహించమని” అని అతనితో చెప్పారు స్వామివారు. ప్రసాదం పంపినందుకు, శాతాభిషేకం వెంటనే నిర్వహించమని ఆదేశించినందుకు వైద్యనాథ అయ్యర్ కుటుంబం మొత్తం సంతోషపడ్డారు. మరుసటిరోజే ఉత్సవం నిర్వహించారు.

శాభిషేకం జరిగిన మరుసటి రోజు, వైద్యనాథ అయ్యర్ గారు కుటుంబసభ్యులతో మాట్లాడుతూ ఒకానొక ఆనందకర క్షణంలో లిప్తపాటులో శరీరాన్ని త్యజించారు. పరమాచార్య స్వామివారి కారుణ్యము, ఉత్సవం వెంటనే నిర్వహించమని ఆదేశించిన కారణము అర్థ అయ్యాయి కుటుంబసభ్యులకు. వారి ఆయుష్షు సమాప్తమవుతుందనే విషయం మహాస్వామివారి తెలుసు. కేవలం ఈ ఉత్సవం కోసమే వారికి మరొక్క రెండురోజులు ఆయుష్షను ప్రసాదించారు.

భూతభవిష్యత్ వర్తమానాలు తెలిసిన స్వామివారు వారి భక్తుల కోరికలను తీర్చడంలో వాటికీ అతీతంగా అనుగ్రహిస్తారు.

అనాయాసేన మరణం, వినా దైన్యేన జీవనం
దేహిమే కృపయా శంభో, త్వయి భక్తిం అచంచలం

--- “శ్రీ శ్రీ శ్రీ మహాపెరియవ మహిమై” పత్రిక నుండి

#KanchiParamacharyaVaibhavam #కంచిపరమాచార్యవైభవం
5/8/18, 16:26 - Paramacharyulu: ఇరవైమూడవ శ్లోక భాష్యం - మొదటి భాగం

త్వయా హృత్వా వామం వపు-రపరితృప్తేన మనసా
శరీరార్థం శంభో-రపరమపి శంకే హృతమభూత్ !
యదేతత్ త్వద్రూపం సకలమరుణాభం త్రినయనం
కుచాభ్యామానమ్రం కుటిల-శశిచూడాల-మకుటమ్ !!
(అమ్మా! నీవు శివుని ఎడమభాగమును పొందిన మాత్రముతో తృప్తి పొందక కుడి భాగమును కూడా హరించినావని శంకపొడముచున్నది. ఎందుచేత ననగా 'నా హృదయములో నీ రూపమంతయూ (ఎడమ కుడి భాగములు రెండూ) ఎఱ్ఱటి ప్రకాశము

కలది, మూడు నేత్రములు కలది, స్తనభారముచేత కొంచెము వంగినది, చంద్రవంక తోడి చూడా కిరీటము కలదిగా అనబడుచున్నది).

వేదములు శివునకు రెండు దేహములున్నా యని ప్రకటించాయి. "శివాతను" - అందు ఒకటి పూర్తిగా అంబికది. అర్ధనారీశ్వర రూపంతో ఒకే దేహంలో అంబిక, శివుడు సగం సగంగా ఉంటారు. ఆచార్యులవారు ఈ రెండు విషయములను కలిపి అంబిక చౌర్యం చేసిందని ఆరోపిస్తున్నారు. శివశక్తులు భిన్నభిన్నములుగా (విడివిడిగానూ, ఐక్యరూపంలోనూ) కన్పిస్తూ ఉంటారు. ఒకప్పుడు రెండు శరీరములతోను మరొకప్పుడు ఏకదేహంతోనూ దర్శనమిస్తారు. ఈవిధంగా భిన్నరూపములుగా శివుడు లింగరూపంలో ఉన్నప్పుడు అంబిక సర్పమై ఆయనను చుట్టి ఉంటుంది. ఇది భిన్నరూపం. దక్షిణామూర్తిగా శివుడున్నపుడు బయటకు కనిపించకుండా ఆయనతో కలిసి పోయి ఉంటుంది. ఇది ఏకరూపం. ఆయన ఒక్కడే కన్పిస్తాడు. వీటికి వ్యతిరిక్తంగా దుర్గ ఉన్నది. ప్రతి రూపం ఒక సత్యాన్ని, ఒక భావనను తెలియజేస్తుంది.

ఈ భావనలు, సత్యాలను ఆధారం చేసుకొని కవులు చమత్కారం చేస్తారు. "నిరంకుశాః కవయః" ఒకప్పుడు చనువుతో హేళన చేస్తారు. ఆరోపణలు చేస్తారు. ఇదంతా మిక్కుటమైన భక్తితో. అదే విధంగా ఈ శ్లోకంలో ఆచార్యుల వారు అంబిక చేసిన పెద్ద చౌర్యం గురించి చెబుతున్నారు. ఆమె తన పతి పూర్తిదేహాన్ని కాజేసిందట. దొంగిలించిన సొమ్ము దాచి ఉంచుతారుకదా! ఆ రకంగా అంబిక తాను దొంగిలించిన శంకరుని దేహాన్ని తనలో దాచి ఉంచుకొన్నదట. ఆరోపణ ఒక్కదొంగతనమే కాదు. దొంగిలించిన సొమ్ము మింగేసిందనికూడా.

శ్లోకమే ఆరోపణతో మొదలవుతున్నది. "త్వయాహృత్వా వామం" నీచేత శివుని వామభాగం దొంగిలించబడింది. దీనికి "అమ్మా! నీచే శివుని ఎడమభాగము దొంగిలించబడిన తరువాత కూడా" అని అర్థం చెప్పుకోవాలి. ఈ తరువాత కూడా ఏమిటి? అపరితృప్తేన మనసా = తృప్తిపొందని మనస్సు తో; "శంభోః అపరం శరీరార్ధం అపి హృతమ్ అభూత్" = ఇంకొక భాగము కూడా దొంగిలించావు.

(సశేషం)

#KanchiParamacharyaVaibhavam #కంచిపరమాచార్యవైభవం
#ParamacharyaSoundaryaLahariBhashyam
5/9/18, 11:29 - Paramacharyulu: ఒక పునశ్చరణ చెయ్యి

ఒక మహాసిద్ధుణ్ణి కలిశాము. ఆయన గాయత్రి కొన్ని కోట్ల సిద్ధి పొందిన మహాత్ములు. ఆయన నిజానికి ఋగ్వేదీయుడు. తన వేదాన్ని సంగోపాంగంగా నేర్చుకుని, సంస్కృత భాషలో మహాపండితుడై, నిత్యానుష్ఠానపరాయణుడై, శ్రీవిద్యోపాసకులుండేవారు. ఆయనకు ఒక సంస్కృత పాఠశాలలో ఉద్యోగం వచ్చింది సంస్కృత అధ్యాపకుడిగా. కాని అది ఓరియంటల్ కాలేజీ, ఏవో విరాళాలతో నడుస్తాయి.

ఒకసారి తనిఖీకి ఎవరో వచ్చారుట. వచ్చినప్పుడు ఆ కళాశాల నిర్వాహకులన్నారు, "నీకు జీతం ఇస్తున్నాము కాని, నీకు ఇవ్వాల్సినదాంట్లోంచి తగ్గించి ఇస్తున్నాము ఇంతకాలం. కనుక వాళ్ళదగ్గర ఏం చెబుతావంటే, అంతా ఇస్తున్నట్టు చెప్పు" అని. అతను అనుష్టానపరుడు కాబట్టి అబద్ధమాడరాదు. ఇది చాలా గుర్తుపెట్టుకోవాలి. అనుష్టానపరుడు అబద్ధం చెబితే అంతవరకూ చేసిన అనుష్టానం శక్తి పోతుంది. కనుక ఆడనన్నాడు.

ఈ రాజకీయాలు చూడగానే ఆయన నిశ్చయించుకున్నాడు, "ఇకపై నౌకరీ చెయ్యను. చొక్కా వేసుకోను" అని తీసేసాడట ఆ రెండు. ఆ తరువాత తిన్నగా ఏం చేశాడంటే, మనస్సు వేదన పడింది కదా. కాలం ఎలా తయారయ్యిందేంటని. తిన్నగా కంచి పరమాచార్య శ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతి స్వామివారి చరణ సన్నిధికి వెళ్ళారు.

కూర్చునున్నాడంతే. ఎందుకంటే ధర్మం విషయంలో గ్లాని ఏర్పడినప్పుడు, మహాత్ములే ఓదార్పు. వాళ్ళను చూడగానే హమ్మయ్య అనిపిస్తుంది. ధర్మమేమవుతుందా అని భయం కలిగినప్పుడు ఒక్క మహాత్ముడు కనపడగానే ఒక ఊరట. భారతదేశంలో అలా ఊరడించడానికి ఎప్పుడూ మహాత్ములు కనపడుతూనే ఉంటారు కావలనుకున్నవాళ్ళకి.

మహాస్వామివారి వద్దకెళ్ళి కూర్చుంటే, ఆయనకేం చెప్పాలా? వివరిద్దామనుకుంటే ఆయనొక మందహాసం చేసి, "అన్నీ తెలుసు నాయనా! కొంతకాలం గాయత్రీ మంత్రం పునశ్చరణ చెయ్యి" అని చెప్తారట. సంధ్యావందనంలో గాయత్రి చెయ్యడం వేరు. పునశ్చరణ అంటే గాయత్రీ మంత్రాన్ని ఇరవైనాలుగు లక్షల గాయత్రి సాంగోపాంగంగా! చెయ్యాలి. చెయ్యి అని చెప్పారు.

ఆయన నిజానికి పెద్ద సంపన్నులేంకారు. ఎందుకంటే విద్యున్నవాడు సంపత్తు తేవాలని తాపత్రయపడడు. రోజూ పూటా గడిచి, కూడు, గూడు, గుడ్డకు లోటులేకుంటే చాలు. మిగిలిన సమయమంతా విద్య సముపార్జనే. కాని ఇప్పుడు కుటుంబం ఉంది ఆయనకి కనుక పోషించాలి. ఇప్పుడు పునష్చరణకు కూర్చుంటే పోషించేదెవరు? ఆయనకు గోదావరి సీమలో కొద్దిగా నేల ఉందంతే. తన పిల్లల సాయంతో ఒక కుటీరం వేసుకొని సంకల్పం చెప్పి పునశ్చరణకు ఉపక్రమించారు. పునశ్చరణ దీక్షాకాలంలో క్షేత్రం విడిచిపెట్టకూడదు కనుక అలాగే ఉన్నారు.

చాలా పద్ధతిగా చేస్తున్నారు. ఇక రెండు మూడు రోజులలో పూర్తవుతుందనగా పల్లెలో ఉన్న వాళ్ళమ్మగారికి తీవ్రమైన ఉదరవ్యాధి వచ్చింది. పట్టణానికి తీసుకుని వెళ్ళి చికిత్స చేయించాలి. ఈయనేమో ఊరు దాటకూడదు. ఏంచెయ్యాలి? అప్పుడు వారి తల్లి ఒక మాటందిట "గాయత్రి కాపాడుతుంది. నువ్వు ఇక్కడే జపం చేసుకో. పునశ్చరణ పూర్తి చేసుకో" అందిట.

తల్లి మాటతో పునశ్చరణ పూర్తయ్యింది, కడుపునెప్పి తగ్గిపోయింది. గాయత్రి మంత్ర సిద్ధుడయ్యారు ఆ మహాత్ములు. ఆ మహనీయులు వేరెవరో కాదు 'శ్రౌత శిరోమణి' 'దైవ శిరోమణి' వేల యజ్ఞాయాగాదుల యాజకర్త బ్రహ్మశ్రీ యనమండ్ర వేణుగోపాల శాస్త్రి గారు.

--- బ్రహ్మశ్రీ సామవేదం శణ్ముఖశర్మ గారి "సంధ్యావందనం" ప్రవచనం నుండి

#KanchiParamacharyaVaibhavam #కంచిపరమాచార్యవైభవం
5/9/18, 19:10 - Paramacharyulu: ఇరవైమూడవ శ్లోక భాష్యం - రెండవ భాగం

శివుని శరీరంలో వామభాగం అంబిక అన్నది అందరూ ఎఱిగిన సత్యం. ఆచార్యులవారు కూడా అర్ధనారీశ్వరుడైన శివుని అలానే చూద్దామనుకొన్నారు. నేను తల్లిని తండ్రినీ చూడబోతున్నాననుకొన్న ఆచార్యులవారు తీరా చూసినదేమిటి? వామభాగమే కాదు దక్షిణభాగం కూడా అంబికగానే కన్పిస్తోంది. ఎలా? శివుడు స్పటికం వలె తెల్లనివాడు. అంబిక అరుణవర్ణం. అలా అని ఆయన విన్నారు. కాబట్టి సగభాగం స్పటికం వలె, వామభాగం ఎఱ్ఱగా కన్పించాలి. కానీ వారు చూసినదేమిటి? "సకలమరుణాభమ్" మొత్తం రూపం అంతా అరుణవర్ణంతో ప్రకాశిస్తోంది. సరి! దక్షిణపు ప్రక్క పుం స్వరూపం కాబట్టి ఛాతీ కనిపించాలికదా? అదీ లేదు. "కుచాభ్య మానమం" తండ్రి ఉండాల్సిన వైపుకూడా తల్లే. తల్లి ఒకతే కన్పిస్తోంది..

అర్ధనారీశ్వరమనేది పరమేశ్వరీ పరమేశ్వరుల అనేక అవతారాలలో ఒకటి. పరమశివుడు-పార్వతి, నటరాజ-శివకామ సుందరులు, కామేశ్వరీ- కామేశ్వరులు ఈ విధంగా అనేక రూపములున్నాయి. అందులో కామేశ్వరి శ్రీవిద్యాధి దేవత. ఈమె కంచికామాక్షి మాదిరి మిథునంగా కాక విడిగానే దర్శన మిస్తుంది. అయితే ఆచార్యులవారు ఆ విషయాలు తెలియ నట్లుగా, ఆ జగత్పితరుల అవతారం ఒక్క అర్ధనారీశ్వ రమే అన్నట్లుగా నిందాస్తుతి చేస్తూ ఆమెకు చౌర్యాన్ని అంటగడు తున్నారు.

ఒకనికి సగం రాజ్యం మాత్రమే వస్తే తృప్తిపడతాడా - ఏదో విధంగా ఆ మిగతా సగం కూడా తన వశమయితే బాగుండు ననుకొంటాడు. ఏమీలేని వాడికి ఏ ఆశాలేదు. పరమశివుడు ఉదారస్వభావుడు కాబట్టి తన భార్య అయిన అంబికకు తనదైన సగం శరీరం ఇచ్చాడు. ఆయన ఉదారస్వభావానికి ఫలితంగా ఈమె రెండోభాగాన్ని కూడా దొంగిలించింది. సగం దొంగ పూర్తీ దొంగ అయ్యింది. సామాన్యమైన దొంగకాదు. స్వంత భర్త యొక్క శరీరాన్నే దొంగిలించే దొంగ. ఇంతకీ మొదటిభాగం కూడా ఆయనే ఇచ్చినట్లుగా ఆచార్యులవారు చెప్పలేదు. ఆ భాగం ఈవిడ ఏదో మాయ మాటలు చెప్పి దొంగతనం చేసింది.

వేదాలు శివుని "తస్కరాణాంపతి" అని సంబోధిస్తున్నాయి. ఈయనేమి తస్కరించాడు? అయిదేళ్ళ ప్రాయంలోనే పరమేశ్వరుని కటాక్షంతో శివుని స్తుతించిన జ్ఞానసంబంధుడు ఈ ప్రశ్నకు తన మొదటి పాటలోనే సమాధానం చెబుతాడు. "ఉల్లవ్ కవరు కల్వన్" ఈయన భక్తుల హృదయాలను దొంగిలిస్తాడట. హృదయముల దొంగ యొక్క శరీరాన్నే దొంగి లించింది అంబిక అంటారు ఆచార్యులవారు. ఈయన నేరారోపణ చేసేది మరి సామాన్యులపైన కాదు. మహారాజ్ఞిపైన కదా! న్యాయస్థానాలు తీర్పు చెప్పేంతవరకూ సామాన్య నేరస్తుని కూడా నిందితుడు అని మాత్రమే పిలుస్తాము కదా! పత్రికలవాళ్ళు ప్రశ్నించేటప్పుడు ఎందుకు అనవసరంగా లేనిపోని గొడవల్లో ఇరుక్కోడం అని రాజకీయ నాయకులు కూడా ప్రశ్నలను దాటవేయడం చూడటంలేదా!

(సశేషం)

#KanchiParamacharyaVaibhavam #కంచిపరమాచార్యవైభవం
#ParamacharyaSoundaryaLahariBhashyam
5/10/18, 10:17 - Paramacharyulu: భగవాన్ పడి అళప్పన్

పరమాచార్య స్వామివారు చెన్నై బెంగళూరు జాతీయ రహదారి మధ్యలో ఉన్న కావేరీపాక్కం అనే చిన్న ఊరిలో మకాం చేస్తున్నారు. దాదాపు 40 - 50 సంవత్సరాల క్రితం జరిగిన సంఘటన ఇది. అప్పట్లో ఉన్న ఆనవాయితీ ప్రకారం గురుదక్షిణగా వచ్చే నాణాలను లెక్కపెట్టి కంచి మఠానికి పంపేవాళ్ళం. పీఠము, పీఠపరివార అవసరాల ఖర్చుల కోసం మఠం నుండే డబ్బులు వచ్చేవి. చాలా అరుదుగా అవసరాల కోసం మహాస్వామివారి అనుమతితో గురుదక్షిణ నుండి తీసుకునేవారం.

రోజు రోజుకూ భక్తుల సందర్శన తగ్గిపోవడంతో మొదలయ్యాయి మా కష్టాలు. అన్నింటిని చూసుకుంటున్న శ్రీకంఠన్ ఎన్నిసార్లు అడిగినా మఠంవారిని డబ్బులు అడిగే విషయంలో మహాస్వామివారి సమాధానం ఒక్కటే "భగవాన్ పడి అళప్పన్" (భగవంతుడే అన్నీ చూసుకుంటాడు) అని.

రోజువారీ తిండి కూడా సమస్యగా ఉంది. భక్తులు ఇచ్చే కానుకలు కనీసం రోజుకు ఒక్కరూపాయి కూడా అవ్వట్లేదు, మరి భగవంతుడు ఎలా కాపాడతాడు అని శ్రీకంఠన్ ఆశ్చర్యం. ఇంతలో ఆంధ్ర దేశానికి చెందిన ఒక బస్సు కావేరిపాక్కం వద్ద ఆగిపోయింది. దాని మరమ్మత్తుకు కావాల్సిన వస్తువులు 30 మైళ్ళ దూరం నుండి తేవాలి. మరమ్మత్తు పనులు కనీసం మూడునాలుగు గంటలు పట్టవచ్చు. ఏమి తోచక యాత్రీకులు అందరూ కిందకు దిగి అక్కడ ఇక్కడ ఉంటున్నారు. గొర్రెలు కాచే పిల్లవాడు ఒకడు వారిని చూసి, "స్వామివారిని చూడటానికి వెళ్తున్నారా?" అని అడిగాడు.

వెంటనే వారు ఆనందంతో పరమాచార్య స్వామివారు ఉన్న ప్రదేశానికి వచ్చారు. భక్తులందరూ పావు అణా, అర్ధ అణా కానుకగా సమర్పించుకున్నారు. బస్సు దగ్గరకు వెళ్ళగానే మరొక బస్సు కూడా అక్కడ ఆగిఉండడం గమనించారు. ఏదైనా సహాయం కావాలేమో అని ఆ బస్సువారు ఆపి అడుగుతున్నారు. మహాస్వామి వారి గురించి తెలియగానే వారు కూడా దర్శనానికి వచ్చారు.

దాంతో గురుదక్షిణ పెద్ద నాణాల గుట్టలాగా అయ్యింది. మరుసటి రోజు సేవకులు లెక్కపెట్టడానికి కూర్చోగానే, "వీటిని ఒక సంచిలో వేసి మఠానికి పంపుదాము. వారే లెక్కపెట్టుకుని జమ చేసుకుంటారు" అని శ్రీకంఠన్ చెప్పాడు. ఒక సంచి తెచ్చి నాణాలను అందులో వెయ్యడానికి "పడి" (ఒక కొలత పరికరం) తీసుకుని వచ్చారు.

వెనుకనుండి పరమాచార్య స్వామివారు వచ్చి, “శ్రీకంఠన్ నీకు నేను చెప్పాను ‘”భగవాన్ పడి అళప్పన్ అని. చూడు ఇప్పుడు చూసుకున్నాడు కదా” అని శ్రీకంఠన్ చేతిలో ఉన్న పడిని చూపించారు. ‘పడి’ అను పదానికి అర్థం అనుగ్రహం మరియు కొలత పాత్ర కూడా!

#KanchiParamacharyaVaibhavam #కంచిపరమాచార్యవైభవం
5/10/18, 11:34 - Paramacharyulu: Please join this Telegram channel

t.me/paramacharyavaibhavam